శ్రీమదాంధ్ర

# శివానందరామాయణము

## బాలకాండ

రచయిత :

**ఆచార్య వి.యల్.యస్.భీమశంకరం.** M.Sc., D.Sc., FNA.

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2015**

SRIMADANDHRA SIVANANDARAMAYANAM
**(BALAKANDA)**

*By*

**Acharya V.L.S.Bhimasankaram**

T.T.D. Religious Publications Series No.1162

© All Rights Reserved

First Print :

Copies:1000

*Published by*

**Dr. D.Sambasiva Rao, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P. Type Setting*
Office of the Editor-in-chief,
TTD,Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.

## ముందుమాట

**కృతే తు నారసింహోఽభూత్ త్రేతాయాం రఘునందనః ।**
**ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకటనాయకః ॥**

ఇది చతుర్యుగబంధం. కృతయుగానికి నరసింహస్వామి, త్రేతాయుగానికి శ్రీరామచంద్రుడు, ద్వాపరయుగానికి శ్రీకృష్ణుడు, కలియుగానికి శ్రీవేంకటేశ్వరుడు అధినాయకులుగా మన వైదికవాఙ్మయం పేర్కొంటున్నది.

వీటిలో శ్రీమద్ రామాయణం ఆదికావ్యం. ఏతత్ కర్త వాల్మీకి ఆదికవి. శ్రీమహావిష్ణుమూర్తి త్రేతాయుగంలో ధర్మసంస్థాపనానికై శ్రీరామచంద్రునిగా రఘువంశమున జన్మించిన గాథ మనకు రామాయణంగా ప్రసిద్ధి కెక్కింది. బ్రహ్మదేవుని ఆజ్ఞమేరకు వాల్మీకి మహర్షి రామతత్త్వమును విశ్లేషిస్తూ శ్రీరాముని ధర్మనిరతిని తెలుపుతూ సంస్కృతంలో చేసిన రచన శ్రీమద్ రామాయణం.

కొన్ని వేల సంవత్సరాల క్రితం రచింపబడిన వాల్మీకి రామాయణాన్ని పలువురు కవులు అనేకానేక సాహితీప్రక్రియలలో నిక్షిప్తీకరించారు. ఆధునిక కాలంలో కూడా శ్రీమద్ వాల్మీకిరామాయణం ద్వారా పలువురు కవులు, రచయితలు సమాజానికి ఉపదేశాన్ని అందిస్తున్నారు. ఇటువంటివారిలో ఆచార్య వి.యల్.యస్.భీమశంకరం గారు పేరెన్నిక గన్నవారు.

వృత్తిరీత్యా వైజ్ఞానిక శాస్త్రవేత్త, అయిన భీమశంకరం గారు సరస్వతి కటాక్షంతో శ్రీమద్ రామాయణాన్ని చంపూరీతిలో రచించి తమ ఆధ్యాత్మిక గురువులయిన మాన్యశ్రీ కందుకూరి శివనందమూర్తిగారి పేరున శ్రీమదాంధ్ర శివానంద రామాయణంగా మనకు అందిస్తున్నారు. ఇందులో ప్రస్తుతం బాలకాండను తి.తి.దేవస్థానము స్వీయముద్రణగా స్వీకరించి భక్త మహాశయులకు అందిస్తున్నది. ఈ బాలకాండలో శ్రీరామచంద్రుని జననం మొదలు సీతారాముల కళ్యాణం, అన్యోన్య అనురాగ జీవనం వరకు ఉన్న ఘట్టాన్ని భీమశంకరం గారు చక్కటి పద్యగద్యాలలో సామాన్య జనులకు సైతం అర్థమయ్యే సులభశైలిలో రచించారు.

ఈ గ్రంథాన్ని భక్తమహాశయులు ఆదరిస్తారని భావిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి.

# శ్రీ వేంకటేశ్వర ప్రపత్తి

ఉ. శ్రీయుతమూర్తి! మా జనులు చేరెడు వీలుగ నేడుకొండలన్
ప్రాయి వసించి, యీ జగతి భక్తుల పాలిట కల్పవల్లివై
శ్రాయము నిచ్చి, మ్రొక్కు జన సంతతికిన్ తులలేని రీతిలో
కాయువు లర్థిచేయు క్షణకాలములో సమకూర్చు శ్రీహరీ !

చం. కలియుగ దైవమైన నిను కన్నుల పండువయైన రీతి నీ
విలసిత దివ్యతేజమును ప్రీతిని దర్శన మెన్ని మారులో
పులకల దేలి చేసితిని పూర్వపుజన్మల పుణ్యమూలమై
నిలిచి తదీయసన్నిధిని నెమ్మది గొల్చుచు వేంకటాధిపా.

శా. శ్రీపద్మావతి, మంగయున్ వెలసి వాసించంగ వక్షంబునం
దాపాదాగ్ర శిఖాంత సంహనన పర్యంతంబు సర్వాంగముల్
తీపారన్ నవరత్న భూషణరుచుల్ దీప్తుల్ ప్రసారించు నీ
రూపంబున్ గను వాంఛతీరదుగదా ! ప్రోత్ఫుల్ల పద్మాననా !

శా. రేపుల్ రాత్రులు భక్తసంతతులు దర్శించంగ నేతెంచి నీ
ప్రాపుం గోరుచు పాటలన్ పిలుపులన్ ప్రార్థింప ప్రోద్ఘోషణల్
వ్యాపించంగను దివ్యమౌ నిరత కల్యాణంబులన్ దేలు ఓ
పాపధ్వంస ! వసింపు నా మదిని దేవా ! శ్రీనివాస ప్రభూ !

ఉ. పద్మజ, పాకశాసన, భవ ప్రముఖార్చిత పాద ! భక్త హృ
త్పద్మవిహార! నాదు పదపద్మ వినిర్మిత పద్య కావ్యమున్
పద్మసమేత! నీదు పదపద్మయుగమ్మున నుంచి మ్రొక్కితిన్
పద్మదళాక్ష! ఈ కృతికి ప్రఖ్య నొసంగుమ వేంకటేశ్వరా !

– రచయిత





శ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య దక్షిణామ్నాయ శ్రీ శారదా పీఠాధిపతులు
శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామివారు

## శ్రీశ్రీశ్రీభారతీతీర్థుల సంస్తుతి

### శ్రీశ్రీశ్రీజగద్గురు శంకరాచార్య దక్షిణామ్నాయ
### శ్రీశారదా పీఠాధిపతులు
### శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామివారు

శార్దూల విక్రీడితములు:

అర్థక్లిష్టములైన వేదములు వేదాంతంబు వేదాంగ త
త్త్వార్థాపారము నేర్పుతో సులభమౌ వ్యాఖ్యన్ ప్రబోధించుచున్,
వ్యర్థంబైచను జీవితంబుల తరింపంచేయు మా భారతీ
తీర్థస్వామి మహాగురున్ కొలుతు – ఆస్తిక్య ప్రసారున్ మదిన్.

ప్రార్థింతున్ పులకింపుతో త్రికరణ వ్యాపార సంధానినై
అర్థిన్, ప్రాకృతు నన్ను జూచి అభిమానాప్యాయ మేపారగా
తీర్థంబిచ్చుచు సాలు గప్పి కవిగా దీవించు మా భారతీ
తీర్థస్వామి యతీంద్ర తల్లజు – దయార్ద్రీభూత చేతస్కునిన్.

సీ. వేద వేదాంగ వివేకజ్ఞుడను గాను,
నను గాంచ వేత్తకు నలువదేల?
యోగవిద్యాభ్యాస యుక్తియుక్తుడ గాను,
నామీద యోగికి ప్రేమదేల?
తర్కించి చూడంగ తార్కికుండను గాను,
నాయందు తర్కికి ననుపదేల?
దైవ తాదాత్మ్య సంధాన తపసి గాను,
ననుచూడ తపసికి నచ్చికేల?

తే.గీ. భారతీస్వామి కేల నా పైన రాగ
మనిన, దివినుండి దిగివచ్చి యమర గంగ
పావనుల జేయదే భువి పాంశునులను
కోరకున్నను యవ్యాజ కూర్మి తోడ.



## శ్రీశ్రీశ్రీభారతీతీర్థుల ఆశీస్సులు

### శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్యమహా సంస్థానం
### దక్షిణమ్నాయ శ్రీ శారదాపీఠం
### శృంగేరి

శ్రీ మద్వాల్మీకి మహర్షి వదనారవిందవిగళిత శ్రీమద్రామాయణ సుధ సంసార తాపతప్తులగు జీవకోటికి తాపోపశాంతికి అవశ్య సమాస్వాదనీయము. అందులకీ రామకథను ఎందరోకవులు కథావస్తువుగా గ్రహించి కావ్యనాటకాదులను రచించి ధన్యులయినారు. శ్రీయుతులు వి.యల్.యస్. భీమశంకరంగారు శ్రీరామకథను శ్రీమదాంధ్ర శివానంద రామాయణమను పేరుతో వ్రాయ సంకల్పించి ప్రకృతము బాలకాండను వ్రాసి ముగించి దానిని శ్రీచరణుల సన్నిధికి పంపినారు. శ్రీచరణులు దానిని అవలోకించి సంతసించినారు.

శ్రీభీమశంకరంగారు ఆంధ్రభాషలో విశేష పరిశ్రమ చేసినవారు కాదు. కాని ఈ విధముగా కవిత్వము వ్రాయుట భగవదనుగ్రహ హేతుకమనియే చెప్పవలయును.

శ్రీ శారదాచంద్రమౌళీశ్వరుల యనుగ్రహమున శ్రీ భీమశంకరంగారికి సకల శ్రేయఃప్రాప్తి యగుగాక. ముందరి భాగములను కూడా వ్రాసి పూర్తిచేయుభాగ్యము లభించుగాకయని శ్రీచరణులాశీర్వదించినారు.

శృంగేరి, ఇట్లు

15-11-2013 (Sd/) T.Dakshinamurthi.



మహామహోపాధ్యాయ డా॥ సద్గురు శివానందమూర్తిగారు
భారతదేశ శైవ పీఠాధిపతులు



## సద్గురు స్తుతి
## మహామహోపాధ్యాయ
## డా.సద్గురు శ్రీకందుకూరి శివానందమూర్తిగారు

సీ. ఎవ్వాని ముఖచంద్ర మీక్షించి నంతనే
వంతలన్నియు పారి శాంతి యెలయు,
ఎవ్వాని బోధలు మవ్వాన విన్నంత
కలుషముల్ తొలగి సద్గతులు కలుగు,
ఎవ్వాని మనమందు నేపుగా ధ్యానింప
యాధ్యాత్మ చింతన మలముకొనును,
ఎవ్వాని మార్గాన నెఱుకతో పయనింప
భవబంధముల నూడ్చు ప్రజ్ఞ గలుగు,
తే.గీ. నతడు నిరత శివానందు డాత్మ వేత్త,
అరయ భువియందు నడయాడు పరమశివుడు,
భక్తులకు మోక్షసాధన యుక్తి చూపు
మా శివానంద గురుమూర్తి మార్గదర్శి.

సీ. అరుదెంచి నంతనే దరికి రమ్మని పిల్చి,
కూర్చుండ చేతువు కూర్మితోడ,
ఇది సమస్య యనిన, ఏమి కాదనిపల్కి
హృదయాన నానంద మెలయజేతు,
చిటిపొటి కవనంబు చిత్రించి చూపింప,
ముదపడి నన్నెంతొ ప్రోత్సహింతు,
నే చేయు సభలకు నెమ్మితో వేంచేసి
నెరవుగా కూర్తువు నిండుతనము,
తే.గీ. ప్రక్క కూర్చుండి చిననాట పాఠములను
చదివి నంత మాత్రమునను సద్గురువర!
అందజేసితి వెన్నెన్నొ యాదృతులను,
అందుకొనుము శివానంద! వందనములు.

## సద్గురు శ్రీశివానందమూర్తిగారి ఆశీస్సులు

**మహామహోపాధ్యాయ**
**డా.శివానందమూర్తి**
పీఠాధిపతి
శ్రీ శైవమహాపీఠమ్

**శ్రీరస్తు**

**నా యానందము**

నా మిత్రుడు శ్రీ భీమశంకరం తన జీవన సాఫల్యాన్ని ఇవ్వగలిగిన ఉత్తమ సాహిత్య కృషిలో నిమగ్నమై కొన్ని విశిష్ట గ్రంథాలను రచించినారు. నేడు మరొక గ్రంథం వెలువడింది – "రామాయణంలో బాలకాండ". నాయందు ఆదరంతో నాకు చూపించారు. ఈ పవిత్రగాథ పురాతనం. భారతీయుల హృదయాలలో ఎంతో పూజ్యభావంతో పదిలపరచబడింది. అసంఖ్యాక రచనలు అన్ని భాషలలో వెలువడి ప్రజలు తన్మయంతో వాడుకుంటున్నారు. పాడుకుంటున్నారు. విరామం లేకుండా ఇంకా ఎన్ని గ్రంథాలు వచ్చినా వాటిని ప్రజలు స్వీకరిస్తారు.

నేడు ఈ కవి ఈ రామాయణ గ్రంథ ప్రశంస ప్రారంభంలోనే భక్తితో, నమ్రతతో సహస్రశీర్ష ఇత్యాది వేదవాక్యార్థములతో కూడుకొని రచించారు.

గాథ పాతది, గ్రంథం నూతనము, శైలి కవిసొంతము, మధురము, అపూర్వము, అపురూపము, ఒక చదువరిగా ఆస్వాదయోగ్యమై నన్నానందింప జేసినది. ఎన్నో ఉదాహరణలు చూపవచ్చు. కాలమును గురించిన ద్విపద, తరువాతి వచనము మరువలేనివి. సీత బాల్యమును వర్ణించుచోట వాడిన "అశ్వగతి", తరువాతి "శుద్ధవిరాటి", తరువాత వాడిన పదజాలము వాటి అర్థవివరణము విజ్ఞానదాయకము. రామలక్ష్మణుల వనదర్శనము, "కుసుమ విచిత్రము", "మధుమతి" మొదలగు చిత్రగతులతో అపూర్వమై సాగినది. అహల్యగాథ హృదయమును కదిలించగలదు.



ఈ కవి శైలి అచ్చతెనుగు, జానుతెలుగు పదముల ప్రయోగము, మరుగుపడిన ఛందోరీతుల రసమయ ప్రయోగము ఇవన్నియు చేరి ఈ కావ్యము ఎంతేని విశిష్టమైయున్నది. ఈ రచన సహృదయ, రసగ్రహణ సమర్థులకు గొప్ప విందుకాగలదు. విశిష్ట వ్యక్తిత్వ, నూతనత్వమయుడైన ఈ కవిని మనసార అభినందింతును.

సం.
**(శివానందమూర్తి)**

"ఆనందవనం"
భీమునిపట్నము
విశాఖజిల్లా (531163)
తేదీ. 24/09/2013

## శివార్పణం

గ్రంథకర్త



ఆచార్య శ్రీ పి. యల్. యన్. భీమశంకరం

శ్రీమదాంధ్ర శివానంద రామాయణాన్ని నేను వ్రాయడం మొదలు పెట్టినపుడే, ఈ గ్రంథాన్ని పరమశివునికి అంకిత మివ్వదలచాను. అదే విషయం ఈ గ్రంథం ప్రార్థనా ఖండంలో విశద పరిచాను.

ఈ నిర్ణయమునకు ప్రేరణ నా తలిదండ్రులు. చాలా యేండ్లు సంతానంలేక, అనేకదేవుళ్ళకు మ్రొక్కి ఛప్పన్న వ్రతాలాచరించినా ఫలితంలేక చివరకు తన 38వ ఏట మా అమ్మగారు దక్షారామ భీమేశ్వరుని 40 దినములు నిరతోపవాసములతో సేవించగా నేను కలిగినట్లు చెప్పేవారు మా జనకులు. కనుక నేను జన్మనెత్తినకాలంనుండి శివభక్తుడిని కావడంలో ఆశ్చర్యంలేదు.

కౌమార, యౌవన, తరుణావస్థలు పూర్తై వృత్తినుండి విశ్రాంతి తీసుకున్నాక నేను తెలుగు పద్యముల నల్లడం చేపట్టి నా కవిత్వం ద్వారా శివారాధన మొదలుపెట్టి, శివానంద మందహాసం, దక్షారామ భీమేశ్వర శతకం, ద్రాక్షారామ భీమేశ్వరోదాహరణకావ్యం (ఇంకా కొన్ని ఇతర గ్రంథాలు) ఆ భీమేశ్వరుని ఆశీస్సులతో వ్రాయకలిగాను.

నేను ప్రధానంగా హర భక్తుడనైనను, హరి హరాభేదము నా మతం, అందుకే,

సీ. ఫణితల్పశయనుండు, ఫణిగణాభరణుండు.
మురదైత్య దమనుండు, పురహరుండు,
శ్రీవత్సవక్షుండు, శితికంధరాంకుండు,
కనకాంబరుండు, దిగంబరుండు,
అసుర బాణధ్వంసి, అసమ బాణధ్వంసి,
గరుడ కేతనుడు, నుక్షధ్వజుండు,



విశ్వ సంభరణుండు, విశ్వాధికరణుండు,
యోగ నిద్రార్తుండు, యోగివరుడు,

తే.గీ. మాధవుండైన దివ్య రమా ధవుండు
మంగళాకృతి వెలయు నుమా ధవుండు,
హరియు హరుడను పేర్లతో బరగు జగతి
కేలిక యొకడన్న నిజము నెరిగి మదిని.

చం. ఒకపరి విష్ణురూపమున నొక్కొకమారు సదాశివుండునై,
యొకపరి పద్మతోడను మరొక్కొక పట్టున శైలకన్యకన్
వికసనగూడి భక్తజనబృందము కెప్పుడు మేలుగూర్చు నా
ప్రకటిత దివ్యతేజ మొకభాతి వెలుంగుచు నుండు నిద్ధరన్.

అని నమ్మి, నా కావ్యాలలో సుమారు నాలుగువేల సర్వ 'ల' కార ప్రాసాంత్య ప్రాసాలంకృత సీసబంధ ద్విపదలతో ఉద్గ్రంథమైన శివానంద మందహాసాన్ని శ్రీమహావిష్ణువును సమ్మతింపజేసి కృతి ఇచ్చాను. నేడు ఈ శివానంద రామాయణాన్ని పరమశివునికి అంకితంగా సమర్పించాను.

రెండు నెలలక్రితం ఈ గ్రంథరచన – అంటే బాలకాండ – పూర్తైంది. కాని, సామాన్య మానవుడుగా నా మనసులో ఒక విధమైన వేదన మొదలైంది. నిరతయోగీశ్వరుడైన పరమశివుడు కైలాసంలో ఎల్లపుడు కండ్లు మూసుకుని ధ్యానంలో వుంటాడన్నది జగమెరిగిన విషయమే. అందువలన, నే నీ రామాయణాన్ని ఆయనకు అంకితమిస్తానని నేను మనసులో అనుకున్నపుడు కాని, అలా అని గ్రంథంలో వ్రాసినపుడుగాని, షష్ఠ్యంతములు రచించినపుడు గాని, ఆయన ఈ విషయం విన్నాడా. నా గ్రంథం పూర్తిగా రచింపబడిన తరువాత ఆ శివునికి చేరిందా, ఒకవేళ ఇప్పటివరకు చేరకపోతే చేరేదెటుల, ఈ కృతిని ఆయన స్వీకరించాడా, స్వీకరించాడని నాకు నమ్మకం కలగడ మెట్లు? అనే వ్యాకులసంభరిత సందేహాలు నన్ను వదలక వేధించినవి. ఆలోచించగా వీటికొక పరిష్కార మార్గం దొరికింది.

భారతదేశంలో నేడొక మహాత్ముడుద్భవించి యున్నాడు. ఆయన గొప్ప యోగీశ్వరుడు. పండితుడు. భారతీయతావాది. సకల శాస్త్రకోవిదుడు. మనదేశంలోని వివిధ తీర్థస్థలాలను అనేక పర్యాయములు దర్శించి పూజించిన పుణ్యాత్ముడు. శతాధిక యజ్ఞాలను నిర్వహించిన ఆర్ష సంప్రదాయ రిరక్షాబద్ధకంకణుడు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో వందలకొలది అధ్యాత్మిక వ్యాసాలకు, అనేక గ్రంథాలకు కర్త. భారతీయచరిత్రను నాస్తికుల హస్తాలనుండి ఉద్ధరించి తిరిగి వ్రాసిన దిట్ట. సనాతనధర్మ ఛారిటబుల్ ట్రస్టుద్వారా ఆర్ష మత, సాహిత్య సంస్కృతుల పరిరక్షణకు అనేక సభల నేర్పాటుచేస్తూ, దేశంలోని పండితోత్తములను సత్కరిస్తూ అనూనమైన సేవలందిస్తున్న సంఘసంస్కర్త. ప్రత్యేకంగా సంగీత అకాడెమీని స్థాపించి విద్వాంసులను గౌరవిస్తూ, వారి విద్వత్ సుధాఝురులతో దేశప్రజల తృష్ణను తీరుస్తూ, మనపూర్వకళలను కాపాడుచున్న కళాపోషకుడు. మహామహోపాధ్యాయ బిరుదాంకితుడు. భారతదేశ శైవమఠ పీఠాధిపతి. వేలాదిప్రజలను సనాతనధర్మం దిశగా మళ్ళించి వారి నుద్ధరిస్తూ, లక్షలాది సామాన్య జనులకు సద్గురువుగా వారి లౌకిక, అధ్యాత్మిక సమస్యలకు తగిన పరిష్కారాలను అందిస్తున్న కరుణామూర్తి. 'నడిచే శివుడ' ను సార్థక నామంతో శిష్యబృందము వారిని కొలుస్తారు.

దైవకృపవల్ల ఆ యోగీశ్వరుడు, సద్గురు శ్రీకందుకూరి శివానంద మూర్తిగారి సాంగత్యం నాకు 65 సంవత్సరాలక్రితం మేము బి.యస్సీ. తరగతులను కలిసి చదువుకున్న నాటినుండి కలిగింది.

ఇంతటి మహానుభావుడు చిన్ననాట వారితో నాకున్న స్నేహంరీత్యా నేను కలిసినపుడు అపూర్వానురాగంతో నాతో అవశ్యం కొంతకాలం వెచ్చిస్తారు. బాల్యసఖుడైన కుచేలుని శ్రీకృష్ణుడట్లు నన్నాదరించి, ఈ అధ్యాత్మిక తృష్ణా దష్ట కుచేలుని పద్యపృథుకాలు స్వీకరించి, జ్ఞానాక్షతలనిచ్చి నన్ను సుసంపన్నుని చేస్తారు. నా కవితా స్యందనానికి అదృశ్య సారథియై సాహిత్య గహన వీథులలో సునాయాసంగాను, సుమధురంగాను విహరింప జేస్తారు. అట్టి మా శివా



నందులను కలుసుకుని నా సమస్య వివరించాను. వారితో జరిగిన సంభాషణనుండి నా కొక మార్గం దొరికింది.

సాక్షాత్ శివస్వరూపులైన సద్గురువు శివానందమూర్తిగారి పాదారవిందాల వద్ద నా రామాయాణాన్ని 'శివార్పణం' అంటూ వుంచాను. వారు దానిని చదివి ఆశీస్సులను అందజేసారు. ఈ గ్రంథాన్ని మీరు గ్రహించి, పరమశివునికి అప్పగించి దీనిని అంకితంగా స్వీకరించునట్లు చేయుడని మనసులో ప్రార్థించాను. వారు మందహాసంతో తలను పంకించారు. నా ఆశయం సిద్ధించింది.

హైదరాబాదు, ఇట్లు
విజయ వత్సర విజయదశమి, భవదీయుడు,
12వ అక్టోబరు, 2013, వి.యల్.యస్. భీమశంకరం

## శ్రీశివానంద రామాయణ రచనోదంతము
### గ్రంథకర్త

శ్రీమద్ రామాయణమును తెలుగు చంపువుగా రచింపవలెనను ఆసక్తి నాకు నాలుగైదు సంవత్సరములకు పూర్వము జనించినది. తరువాత కొన్ని నెలలకు నేను తిరుపతి వెళ్ళుట, అచట సాహితీవేత్తల సమావేశమున నేను రచించిన గ్రంథముల చర్చయందు పాల్గొనుట తటస్థించినవి. ఆ తరుణములో నొకరు నాతో మీరు రామాయణం వ్రాయండి. మీరు వ్రాయగలరు, వ్రాసి సహృదయ ఆంధ్రజనులను, సాహితీప్రియులను రంజింపచేయగలరు, అని పలికిరి. మన కత్యంత పుణ్యక్షేత్రము, కలియుగ వైకుంఠముగా ప్రసిద్ధినందిన తిరుపతిలో ఈ సూచన చేయబడుట, నాకా వేంకటేశ్వరస్వామి వారి ఆదేశంగా అనిపించినది.

జగత్ సృష్టి స్థితి లయకారకులగు త్రిమూర్తులయందు సత్వస్వరూపుడైన శ్రీమహావిష్ణువు త్రేతాయుగమున గ్లాని చెందుచున్న ధర్మమును పున రుద్ధరించుటకై భూమిపై భరతదేశమున శ్రీరామచంద్రునిగా అవతరించిన గాథ మనకు రామాయణంగా ప్రసిద్ధి కెక్కిన పుణ్యగ్రంథము. ఇది ఒక గంభీర విశాల విశిష్టసాగరం వంటిది. అట్టి రామాయణమును బ్రహ్మదేవుని యానతిని మునిశ్రేష్ఠుడగు వాల్మీకి రామతత్త్వమును రంగరించి, అడుగడుగునా రామమహత్తుతో నింపి సంస్కృత భాషలో గొప్ప ఇతిహాసముగ విరచించెను.

వాల్మీకికృత రామాయణము ఇతిహాసపరముగను, పురాణపరముగనేగాక, సాహిత్యపరముగను అనేక ప్రత్యేకతలు కలిగి యున్నది. ఇది విశ్వసాహిత్యమున ఉద్భవించిన తొలి గ్రంథము. ఈ మహత్తర గ్రంథం కథా కథన దక్షత లోను, మధురసుధానిభ శబ్దసంపదలోనూ గూడా ప్రథమ స్థానమందు నిలుచును. ఉపమాది బహువిధాలంకారములు, సుందరములైన వర్ణనలు మొదలగు రసోత్పత్తి కారకము లెన్నింటినో కలిగి, రచనా నైపుణ్యము నందునను విశిష్టతమమై, విశ్వ సాహిత్యమున శాశ్వత స్థానము నలంకరించినది. అందుకే ఇది.



సీ. ప్రద్యోతన ప్రతిభాతంబు, ప్రతిభా యు
తంబు, విముక్తి ప్రదంబు, నిత్య
మప్రమితంబు, ప్రత్యక్షార్థ ధర్మంబు,
సత్యంబు, విశ్వ సాహిత్యమందు
ప్రత్యుత్క్రమం, బతి ప్రత్నంబు, ప్రథమంబు,
ప్రథితంబు, నతులంబు, ప్రాభవంబు,
రాక్షస ధ్వంసుండు, రఘు వంశ సోముండు
ప్రాగ్వంశు నంశుని రమ్యగాథ

తే.గీ. మధుర శబ్ద భావార్థ సమన్వితంబు,
వర్ణనాత్మక ముపమాన వాఙ్మయంబు,
సంశయమీంద్రుండు ప్రాచేతస కవి రచిత
మహిత కావ్యరత్నంబు రామాయణంబు.

ఉ. 'ఎక్కడ చూచినన్ సొగసు లెక్కడ చూచిన వర్ణనంబు లే
దిక్కున చూచినన్ సరస దృఢ్ధ విశిష్టసుశబ్ద పూరమౌ
వాక్కు లలంకృతుల్, మధుర వాక్య సమాహిత ధర్మ సూక్తు లిం
పెక్కెడు రీతి'

లో దీనిని రచించాడు ఆదికవి వాల్మీకి మునీంద్రుడు. ఈ కారణములవలననే, అనేకవేల సంవత్సరములకు పూర్వము రచింపబడిన ఈ కృతిపై నేటికిని ప్రజలలో భక్తి, శ్రద్ధలు అధికముగ నున్నవి. అంతియేగాక, ఈ రామాయణము నాధారము చేసుకొని అనేక రామాయణములు రచించబడినవి. అట్టి సంస్కృతరామాయణ కర్తలైన కొందరు కవివరేణ్యులు స్వతంత్రించి మూలమునకు కొన్ని మార్పులను చేర్పులను చేసి వ్రాసియున్నారు. మనకు నేడు లభించిన సంస్కృత రామాయణములలో శ్రేష్ఠమైనవి నలుబది పైబడి కావ్యరూపములుగను, పదియారు నాటక రూపములుగను కలవని సాహిత్య పరిశోధకుల అభిప్రాయము[1]

అట్లే, భారతీయ, విదేశీయ భాషలలోను అనేక రామాయణములు వెలువడినవి. తెలుగులో, కొందరు కవివరేణ్యులు సంస్కృత రామాయణమునకు అనువాదములు చేసిరి. కొందరు స్వతంత్రించి వాల్మీకి మూలంబునకు కొన్ని వినూత్న సంఘటలను చేర్చియో, కొన్ని విశ్లేషణలను గావించియో, మార్పులను చేసియో రచించిరి. మరి కొందరు పద్య, గద్య, గేయ, నాటక, హరికథాది వివిధ రూపములలోను, ఇంకను కొందరు, ఒకటియో, అంతకన్న హెచ్చుగనో కాండలను మాత్రమే వ్రాసియున్నారు. కొందరు కథాసారాంశము గ్రహించి స్వతంత్రముగ కవిత్వీకరించిరి. ఖ్యాతినందిన కొన్ని సంస్కృత వాల్మీకేతర రామాయణములకు గూడ కొందరు కవివర్యులు తెలుగు అనువాదములు, వ్యాఖ్యానములు వ్రాసియున్నారు[2]

ఏ విధముగా చూచినను, రామాయణ సాహిత్యమంత విరివిగా ప్రపంచమున నే ఇతర గ్రంథము ప్రాచుర్యము పొందలేదనుట యతిశయోక్తి కాబోదు.

తెలుగులో ఉత్తమ సాహిత్యశ్రేణికి చెందిన అనేక పద్య, చంపూ రామాయణములలో, ప్రసిద్ధమైన వాటిలో కొన్ని (రచనా కాలక్రమముగా) రంగనాథ (ద్విపద కావ్యం), భాస్కర, మొల్ల, గోపీనాథ, వాసుదాసు, విశ్వనాథ రామాయణములు. వీటిలో, వాసుదాసు, గోపీనాథుల రామాయణములు మూలమున కత్యంత సన్నిహితములు కాగా మిగిలినవాటిలో వివిధ పరిమాణములలో కల్పిత సంఘటనలు చోటుచేసుకున్నవి. చివరి మూడు రామాయణములు సుమారు 100 సంవత్సరముల లోపుననే రచింప బడినవి. 21వ శతాబ్దిలోగూడ ననేక తెలుగు రామాయణములు వెలువడినవి. ఇంకను వెలువడుచున్నవి.

తెలుగులో నిన్ని రామాయణములున్నను, మరల నింకొక రామాయణము వ్రాయుటేల యను ప్రశ్న యుదయించుట సహజము. కొందరు కవిశేఖరులు తలబోసినట్లు ఎవరి యనుభూతి వారిది గనుక నెందరేని యెన్ని



రామాయణములైన వ్రాయవచ్చునని సరిపెట్టుకొన వచ్చును. ఈ సనాతన గ్రంథమును తెలుగులో రచించుట ఇహ పర దాయకమని కొందరు రచయితలు భావించినట్లుగూడ మన మూహించవచ్చును.

రామాయణగాథ జగద్విదితము. కనుక రామాయణ రచయితకు, కేవలం కథను చెప్పుటే ధ్యేయము గాక, కొన్ని ప్రత్యేకతలను ప్రవేశపెట్టి గ్రంథమును చదువుటయం దాసక్తి కలిగించి, చదువరుల నానందింప చేయుట గూడ ముఖ్యమైన లక్ష్యముగా నుండవలెను. ఏ ప్రత్యేకతలు లేక, కథను కథగా చెప్పుట చర్విత చర్వణమే యగును. ఇది చదువరులకు రక్తికట్టదు, నిరుపయోగము. మన అధునాతన కంప్యూటరు యాంత్రిక సమాజములో, పుస్తకములు చదువు వారే కరవైరి. ఒకవేళ చదివినను, ఏ ఆంగ్ల గ్రంథములనో కాని తెలుగు భాషలోనివి చదువువా రరుదు, చదువ గలుగువారు గూడ నరుదగుచున్నారు. అందున, పురాణ గ్రంథమైన రామాయణమును తెలుగులో రచించిన వాటిని చదువువారు మన తొమ్మిదికోట్ల జనాభాలో నొకటి, రెండు శాతములను మించరని నేననుకొందును. దీనిలో యువకుల సంఖ్య ఇంకను తక్కువగనే యుండును. అంతియగాక, పెద్దలైనను యువకులైనను, తాము చిన్నపుడే ఏదోరకముగ నేర్చిన రామునికథ తిరిగి యథాతథముగా రచింపబడిన, చదువుటకు ప్రేరణ అతి తక్కువగా నుండును గదా, అందున పద్య గ్రంథములను.

అయినను, మన దేశ సంస్కృతికి చిహ్నము, మన జాతి సాహిత్యము న కాదర్శము, మన నైతిక విలువలకు చేదివ్వెయైన రామాయణమును, అందున పద్య రామాయణములను మనము వ్యాప్తి నొందించు అగత్యమున్న దన్న విషయం నిర్వివాదాంశము. ఈ లక్ష్యసాధనకైనను ఇంకను క్రొత్త రామాయణములు రావలసి యున్నవి.

ఆంధ్ర కవివరేణ్యుల రామాయణములను పరిశీలించిన, వీటిలో కొన్ని అత్యంత ప్రౌఢముగ వ్రాయబడుటంజేసి నేటి సమాజములోని పండితేతరులకు

గ్రాహ్యములుకావు. కొందరు సంగ్రహించి రచించుట వలన కేవలము కథా సారాంశము నెరుగుటకే దక్క, మూలము నందలి సొగసులకు భంగము వాటిల్లెనని నే ననుకొందును. అటులగాక, మాతృకలోని దూరాన్వయములగు నుపాఖ్యానముల కొన్నింటి విసర్జించి, కొన్నింటిని సంగ్రహించి, కుంచింపకయే కొంత కుదించి, ముఖ్యఘట్టముల విడనాడక, అవసరమనిపించిన ఘట్టములను విస్తృతీకరించి, యందలి కమనీయత్వమునకు ఘాతంబు కలుగనీయక, కొన్ని రసవత్తర సన్నివేశములను అవాల్మీక రామాయణముల నుండి గ్రహించి, అట్లని అధికముగా శాఖా చంక్రమణము చేయక, మూలము నందలి సహజత్వంబు సమయింపక సందర్భానుసారంబుగ వాటిని మలచి, మన ప్రస్తుత సాంఘిక పరిస్థితులకు అనువైన కొన్ని చమత్కారములను, అలంకారములను సమకూర్చి, వర్ణనాదులకు సమకాలీనత సిద్ధింప, ఐదంయుగీన పాఠక శ్రేణికి పఠనానుకూలముగ, అతి ప్రౌఢమును, అతిపేలవమును గాక, విద్యావంతులకు గ్రాహ్యమగు భాషాసౌశీల్యముతో తగినంత విపులముగ రచించుట సాంఘిక న్యాయము చేకూర్చుటతోబాటు, నా భావి పుణ్యప్రదమొనరించు ననెడి యూహతోడ, కొన్ని రామాయణానువాదములను సంప్రదించి, నే నీ రామాయణ మహా గ్రంథమును నా నేర్చు చందమ్మున, నా ఇష్టదైవమైన భీమేశ్వరుని యానతి ననుసరించి, గురుకృపావిశేషంబున తెలుగున రచింప బూనితిని.

నేను విద్యార్థిగా తెలుగు భాషను విశేషముగ అధ్యయనం చేసినవాడను కాను. సంస్కృతభాష నేర్చు కొనలేదు. కేవలము ఆంగ్లమున విద్యాభ్యాసము సాగించి, భౌతిక, భూభౌతిక శాస్త్ర అధ్యయన, అధ్యాపన, పరిశోధనలతోనే నా విద్యార్థి, ఉద్యోగ దశలను గడిపిన వాడను. కాని, మా కుటుంబ వాతావరణ ప్రోద్బలము వలన చిన్నతనము నుండి భారత, భాగవతాది గ్రంథములతో పాటు రామాయణము గూడా చదువు అలవాటు కలిగియున్న వాడను. మొల్ల, భాస్కర రామాయణములను చిన్నతనమునుండి చాలాసార్లును, రంగనాథ రామాయణమును తరుణవయసునందునను చదివితిని. గోపీనాథ, వాసుదాసుల



రామాయణముల నక్కడక్కడ, విశ్వనాథవారి రామాయణకల్పవృక్షమున బాలకాండ చాలాసార్లు, యుద్ధ కాండ మూడు, నాల్గుసార్లు మిగిలిన కాండముల నొకపరి చదివితిని.

ఇక్కడ మరొక విషయమును చెప్పవలెను. నాకు సుమారు ఎనిమిది ఏండ్ల వయసునందు (క్రీ.శ. 1939 ప్రాంతమున) మా ఇంటికి ఒక పండితుడు వచ్చి మా నాయనగారికి తాను రచించిన రామాయణ గ్రంథ సంపుటములను బహూకరించెను. అటులే కొంతకాలము పిదప, వేరొక పండితుడు వచ్చి ఆయన రచించిన రామాయణ గ్రంథ సంపుటములను యిచ్చెను. వీటిలో నేమున్నదో నా కా నాడు తెలియదు కాని, ఈ సంఘటనలు మాత్రము చూచాయగా గుర్తున్నవి. పెద్దైన పిదప ఈ గ్రంథములను మా కుటుంబ గ్రంథాలయమున అపుడపుడు చూచుట సంభవించినను, వృత్తి వ్యాపకముల రీత్యా సమయాభావమున వాటిని తెరచి గుణగ్రహణము చేసుకొనలేక పోయితిని. అయితే, రామాయణ రచనా కుతూహల మేర్పడిన పిదప, నే నా గ్రంథములను తీసి చదివితిని. ఈ రెండు గ్రంథములందు తెలుగు లిపిలో సంస్కృత శ్లోకములు ఎడమ పుటలందునను, శ్లోకములకు తెలుగు వచన తాత్పర్యములు కుడిపుటలందు ముద్రింపబడియున్నవి.

వీటిలో నొకటి, [3]బ్రహ్మశ్రీ ములుకుట్ల నరసింహావధానులుగారు కూర్చిన 'శ్రీరామాయణ సారోద్ధారము' అను గ్రంథము. గ్రంథకర్త తెలిపినట్లు, అనేక సంస్కృత రామాయణాదుల నుండి శ్లోకములను ఏరి యథాతథముగాను, వాటిని సమన్వయపరచుచు గ్రంథకర్త రచించిన శ్లోకము లచ్చటచ్చట పొదిగి ఈ రామాయణసారోద్ధారమును తయారుచేసిరి. వీరు వాల్మీకి రామాయణముతో సహా ఆధ్యాత్మ, ఆనంద, శివ, భారద్వాజ, వాసిష్ఠరామాయణములు, మహా రామాయణం, హనుమద్రామాయణం, నానా రామాయణ సారం వంటి ఇతర సంస్కృత రామాయణములు, పద్మ, బ్రహ్మాండ, మత్స్య, విష్ణు, స్కంద మొదలైన పురాణములు, ఇవికాక మహాభారతము, వీటిలోని శ్లోకములను సందర్భో

చితముగా నూత్న ఘట్టముల రచనకు వినియోగ పరచుకొనిరి. పుటలకు ఇచ్చిన అధోదీపికలలో ఏ శ్లోకము ఏ సంస్కృత గ్రంథము లోనిదో సూచించిరి.

రెండవది [4]బ్రహ్మశ్రీ లక్కావఝుల వేంకటకృష్ణశాస్త్రిగారు రచించిన 'ఆశ్చర్య రామాయణ'మను గ్రంథం. వీరు జనులకు సకలరామాయణములను చూచు భాగ్యము లభింపదను కారణమునను, కాలానుసారముగ రామాయణాదులలో మార్పుచేయుట సమంజసమని భావించియు, నలుబది రామకథానకములందలి నూత్న కథావిశేషముల సంగ్రహించియో, విస్తృతీకరించియో ఇందులో పొందుపరచిరి. అయితే ములుకుట్ల వారి వలె ఏ సంఘటన గాని, శ్లోకము గాని ఎచ్చటినుండి తాము గ్రహించిరో చెప్పియుండలేదు. పుస్తకములో సగముపైగా వారు రచించిన శ్లోకములను మధ్య మధ్య కూర్చి కథా సంవిధానము చేసితి నని చెప్పిరి.

నేను నా శివానందరామాయణములో పైన నుటంకించిన రెండు గ్రంథముల నుండియు, భాస్కరాది రామాయణముల నుండియు, వాల్మీకి రామాయణమునకు రెండు తెనుగు అనువాదములనుండియు, కొన్ని కొన్ని విషయములను వినియోగించుకొంటిని. ఇంతియేగాక, నాకు తోచిన కొన్ని క్రొత్త సంఘటనలను, వివరణలను, మలుపులను, చమత్కారములను, వర్ణనలను, వైజ్ఞానికశాస్త్ర విషయములను సందర్భానుసారముగ ప్రవేశపెట్టితిని. రామాయణ సారోద్ధారములో రచయిత చేర్చిన సీతాకన్య అందమును వర్ణించు శివరామాయణశ్లోకమును నా గ్రంథములో సీసపద్యముగా తిరుగ వ్రాసితిని. అదే విధముగా, లక్కావఝుల వారి గ్రంథములోని నాకు నచ్చిన ఉపాఖ్యానము లను, సన్నివేశములను, వర్ణనాదులను ముఖ్యముగా కల్యాణ ఖండమున కొన్ని చోట్ల మార్పులుచేసి నా గ్రంథములో చేర్చితిని. ఇవి ఏ గ్రంథములోనివో వారు తెలిపియుండలేదు కనుక నేను సంప్రదించిన రామాయణ రచయితలతో పాటు వీరిరువురకు అత్యంత కృతజ్ఞతలు తెలుపుచున్నాను. అటులే, ఈ ఇరువురు రచయితలు ఏఏ గ్రంథములను సంప్రదించి వారి గ్రంథములలో కూర్చిరో ఆయా కావ్య రచయితలకు నా అతులిత వందనశతములర్పించుచున్నాను.



**కృతజ్ఞతలు :**

ఈ శివానంద రామాయణమును రెండు, మూడు సంవత్సరములు హైదరాబాదులో నా కంప్యూటరు పైననే తిన్నగా వ్రాసితిని. మధ్యకాలమున ఆరు నెలలు అమెరికాలోని కాలిఫోర్నియా, ఇలినాయస్, టెక్సస్ రాష్ట్రములందు నా కుటుంబ సభ్యుల ఇళ్ళలో నివసించి రచించితిని. ఆ విధముగా అమెరికాలో నేనున్న ఈ ఆరు నెలలు, నా కుటుంబసభ్యులతో గడపక వారందరికి శ్రమకలిగించితిని. నన్ను వారు నోరెత్తక భరించినందుకు వారికి నా ఆశీస్సులు.

ఈ గ్రంథం రచించు సమయమునందే, అనేక దశలలో దీనిని చాలా నిశితముగా చదివి, ముద్రణ, ఛందో, వ్యాకరాణాదులలోని స్థాలిత్యములను ఎత్తిచూపి, కథా గమనము, పద్యముల శైలిని గూర్చి నాతో చర్చించి తగు సలహాల నిచ్చిన నా మిత్రులు ఆచార్య పి.వి.కృష్ణయ్య, విశ్రాంత ఆంధ్ర విశ్వకళాపరిషత్ గణితశాస్త్రాచార్యులవారికి నేనెంతో ఋణపడి యున్నాను. అటులే, గ్రంథాన్ని సాంతంచదివి కొన్ని సవరణలు సూచించి, పుస్తకంపై వారి అభిప్రాయాన్ని వ్రాసి యిచ్చిన ఆచార్య కోలవెన్ను మలయవాసిని, విశ్రాంత ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగుశాఖాధ్యక్షులవారికి నా కృతజ్ఞతలు. డా. బి.యస్.ఆర్. మూర్తి, విశ్రాంత డిప్యూటీ డైరక్టర్ జనరల్, జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గారు, మా వియ్యంకులు, [5]శ్రీగొర్తి శంకరభాను, విశ్రాంత ఆచార్యులు రంగరాయ మెడికల్ కాలేజి, కాకినాడ గారు నా గ్రంథాన్ని చదివి కొన్ని సూచనలు చేశారు. వీరిరువురకు నా కృతజ్ఞతలు.

శ్రీ జగద్గురు శంకరాచార్య దక్షిణామ్నాయ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామివారు నాపై అవ్యాజప్రేమానురాగములతో ఈ గ్రంథమునకు ఆశీస్సులను పంపియున్నారు. వారికి నా భక్తి పూర్వక శతసహస్ర కృతజ్ఞతాభి వందనములు.

గురుదేవులు కందుకూరి శివానందమూర్తిగారు నాపైగల అప్యాయతచే 'నా యానందము' అను శీర్షికతో ఆశీస్సులు అందజేసారు. వారికి నా నమోవాకములు.

నాకిప్పుడు 82 వసంతములు నిండుతున్నాయి. ఈ బాలకాండ వ్రాయుటకే మూడు సంవత్సరములు పట్టినది. ఈ ప్రకారము చూచిన నా జీవితకాలంలో రామాయణంలోని అన్నికాండలు వ్రాయగలననే నమ్మకం లేదు. అందుచే, పూర్తిచేసిన బాలకాండను ప్రచురించి, నా ఈ ప్రయత్నాన్ని ఆంధ్రపాఠక మహాశయులతో పంచుకొనవలెనను ఉత్కంఠతో నుంటిని. ఈ గ్రంథప్రచురణ కొరకు నేను తిరుమల తిరుపతి దేవస్థానముల యాజమాన్యము వారి దరికేగితిని. ఈ సంస్థకు నాటి కార్యనిర్వహణాధికారి, శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం ఐ.ఏ.ఎస్.గారు దయతో నా అభ్యర్థనను పరిగణించి, గ్రంథమును పండితులచే పరీక్ష చేయించి, దీనిని తి.తి.దేవస్థానముల సొంత ప్రచురణగా నామోదించిరి. వీరికి, నేటి కార్యనిర్వహణాధికారి, డా॥ డి.సాంబశివరావు ఐ.ఏ.ఎస్. గారికి, తి.తి.దేవస్థాన ప్రచురణల ఎడిటర్-ఇన్-చీఫ్ ఆచార్య రవ్వా శ్రీహరిగారికి, సబ్ ఎడిటర్ డా॥ యన్.నరసింహాచార్య, వారి డి.టి.పి ముద్రణ బృందములకు నా కృతజ్ఞతలు. ఈ గ్రంథరచన, ప్రచురణల సందర్భమున నా దైనిందిన ప్రార్థనల నందుకొని, నన్ను ఉత్తేజ పరచిన తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి నా భక్తిపూర్వక సాష్టాంగ ప్రణామములు.

---


ఉపయుక్తములు:

1. డా. యం. ప్రభాకరరావు, ఓరియంటల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, వ్యక్తిగత లేఖ.
2. ఆంధ్రవాఙ్మయ రామాయణము, రచన : ఆచార్య కోలవెన్ను మలయవాసిని, అరుణశ్రీ ప్రింటింగ్ అండ్ బైండింగ్ వర్క్స్, అమలాపురం, 1989.
3. శ్రీరామాయణసారోద్ధారము, రచన: బ్రహ్మశ్రీ ములుకుట్ల నరసింహావధాని, ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల, బెజవాడ, 1932.
4. ఆశ్చర్య రామాయణము, రచన: బ్రహ్మశ్రీ లక్కావఝుల వేంకటకృష్ణశాస్త్రి, బెజవాడ ఆంధ్రవాణీ ముద్రాక్షరశాల, 1936.





5. హిందూ వివాహ సంస్కార వైశిష్ట్యము, రచన: శ్రీ గొర్తి శంకరభాను, ముద్రణ : కె. బి.ఆర్.ముదలియార్, హైదరాబాదు, 2009.


హైదరాబాదు, ఇట్లు,
విజయ వత్సర విజయదశమి, భవదీయుడు,
12వ అక్టోబరు, 2013. వి.యల్.యస్.భీమశంకరం

***

## ప్రత్యేక కృతజ్ఞతలు

ఈ పుస్తకం డి.టి.పి పూర్తై ఇక ముద్రణకు పంపబడుతుందన్న సమయాన, ఈ గ్రంథ ప్రతినొక పండితశ్రేష్ఠునకు చూపుట మంచిదను శ్రీహరి సంకల్పమును సమాదరిస్తూ, దీనిని సంస్కృతాంధ్ర భాషా నిష్ణాతులు, ఉభయభాషా సాహిత్య వివిధ విభాగాలలో విశేషప్రజ్ఞాపాటవ పారంగతులు, సంస్కృతమున, తెలుగున విశ్వవిద్యాలయ డాక్టరేటు గ్రహీతలు, బహుగ్రంథరచనా ధురంధరులు, ఆచార్య సార్వభౌమాది వివిధ విశేష బిరుదాంకితులు, నా మిత్రవరేణ్యులు శ్రీవేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పర్యవేక్షణకు పంపితిని. నాపైగల అవ్యాజానురాగ మూలమున, శ్రీశాస్త్రిగారీ గ్రంథమును సంపూర్ణముగ చదివి వ్యాకరణ, ఛందో సంబంధిత సవరణలను సూచించి నాకెంతయో మేలొనరించినారు. ఇంత నిశితముగ పరిశీలించి, ఈ గ్రంథ భాషాస్థాయి నభివృద్ధ మొనరించుటకు దోహదమొసంగిన శ్రీశాస్త్రిగారికి నాహృదయపూర్వక కృతజ్ఞతలు.

శ్రీశాస్త్రిగారి పరిశీలనానంతరము, నేను విశాఖపట్టణమేగి, నామిత్రులు ఆచార్య పి.వి.కృష్ణయ్య గారింట ఏకబిగిని ఐదు దినములు కూర్చుని వారి సహాయముతో, శ్రీశాస్త్రిగారు సూచనలను పాటించితిని. ఈ విషయములో నాకంటె యెక్కువగా శ్రమించి, గ్రంథమున కొక గణనీయ స్థానం తెచ్చుటకు తోడ్పడిన శ్రీకృష్ణయ్యగారికి మరొకసారి నా మైత్రీపూర్వకాభినందనములు.

పరిష్కరించినది ప్రసిద్ధులయ్యును గ్రంథములో కొన్ని స్ఖాలిత్యములు దొర్లి యుండవచ్చును. అటువంటి లోటుపాటులు రచయితనైన నా మూలమున సంభవించినవి కనుక పాఠకమహాశయులు నన్ను మన్నించి, వానిని నాదృష్టికి తెచ్చిన మునుముందు సరిదిద్దుకొనుటకు యత్నము చేయుదును.

హైదరాబాదు, ఇట్లు,
2015 సంవత్సర ప్రథమ దివసము, పండితజన విధేయుడు

# శ్రీమదాంధ్ర శివానంద రామాయణం
## బాలకాండ

### విషయసూచిక — పేజి


శ్రీ వేంకటేశ్వర ప్రపత్తి iv
శ్రీ భారతీతీర్థుల సంస్తుతి vi
శ్రీ జగద్గురు శృంగేరీ పీఠాధిపతుల ఆశీస్సులు vii
సద్గురు స్తుతి ix
సద్గురు శ్రీశివానందమూర్తిగారి ఆశీస్సులు x
శివార్పణం xii
శ్రీశివానంద రామాయణ రచనోదంతం xvi


### 1. ప్రార్థనా ఖండము


1.1. ఇష్ట దేవతా ప్రార్థన 1
1.2. గ్రంథోపక్రమణము 5
1.3. మాతృభాషా ప్రశంస 8
1.4. పూర్వకవుల స్తుతి 9
1.5 కృతిపతి నిర్ణయము 12
1.6 షష్ఠ్యంతములు 15
వివరణలు 16


### 2.రామాయణ రచనోదంత ఖండము


2.1. వాల్మీకి రామాయణ ప్రశంస 17
2.2. వాల్మీకి మునీంద్రుని వద్దకు నారదు డేతెంచుట 21
2.3. నారదుడు రాఘవేంద్రుని వినుతించుట 23
2.4. నారదుడు మారుతిని కీర్తించుట 28
2.5. రామాయణ సంగ్రహము 31
2.6. తొలి శ్లోకావిర్భావ వృత్తాంతము 35





2.7. బ్రహ్మ వాల్మీకిని రామాయణము రచింప నానతిచ్చుట 38
2.8. వాల్మీకి మునీంద్రుడు రామాయణము వ్రాయ మొదలిడుట 40
వివరణలు 42


### 3. పుత్రకామేష్టి ఖండము


3.1. కోసల రాజన్యులు 45
3.2. దశరథ మహారాజు 49
3.3. దశరథుడు అశ్వమేధ మాచరింప తలచుట 51
3.4. దశరథుడు యజన నిర్వహణార్థము ఋష్యశృంగుని రావించుట 54
3.5. ఋష్యశృంగ మహాముని అశ్వమేధ, పుత్రకామేష్టులను జరిపించుట 58
3.6. రావణాది రాక్షస నాశన మొనరింపుమని బ్రహ్మ శ్రీహరిని కోరుట 60
3.7. శ్రీహరి భూమిపై నుద్భవించి ధర్మప్రతిష్ఠాపన మొనర్తుననుట 64
వివరణలు 68


### 4. పుత్రోద్భవ ఖండము


4.1.పుత్రకామేష్టికి తృప్తినందిన బ్రహ్మ దివ్యామృతమును పంపుట 69
4.2. దశరథునకు నలువురు పుత్రు లుదయించుట 71
4.3. దశరథుని పుత్రోత్సాహము 73
4.4. వసిష్ఠ మహర్షి రాజకుమారులకు నామకరణములు గావించుట 75
4.5. రాజకుమారుల విద్యాభ్యాసము 79
4.6. రాజకుమారుల దేశాటనము 80

## 5. యోగ సంవాద ఖండము


5.1. శ్రీరామచంద్రుని వ్యాకులత 82
5.2. శ్రీరాముడు తన వ్యాకులతకు కారణములు చెప్పుట 86
5.3. శ్రీరాముడు మానవ జీవితమునగల దుఃఖహేతువులు వివరించుట 89
5.4. వసిష్ఠుడు రామునకు వేదాంత జ్ఞానమును బోధించుట 100
వివరణలు 103


## 6. సీతావిర్భావ ఖండము


6.1. శ్రీమహాలక్ష్మి మాతులుంగిగా భూలోకమున జనించుట 105
6.2. శ్రీలక్ష్మి వేదవతిగా నుద్భవించుట 107
6.3. లంకేశుడైన రావణుడు వేదవతిని మోహించుట 108
6.4. రావణుడు వేదవతిని బలాత్కరించబోవ, ఆమె అగ్నిలో బడుట 113
6.5. రావణుడు శిశురూపముననున్న వేదవతిని భూమిలో పాతించుట 114
6.6. జనక మహారాజు యజ్ఞభూమిలో నొక శిశువును కనుగొనుట 116
6.7. భూదేవి జనకునకు శిశువును దుహితగా నొసంగుట 118
6.8. జనకుడు భూదేవిని స్తుతించుట 119
6.9. జనకుడు శిశువును తనకోటకు గొనివచ్చి భార్య కిచ్చుట 122
వివరణలు 125


## 7. సీతా యౌవన ఖండము


7.1 మహారాణి నుమేధ భూపుత్రిని కన్నకూతురు వలె పెంచుట 126
7.2. జనకుడు తన కుమార్తెకు సీత యని నామకరణము చేయుట 130
7.3. సీతాదేవి బాల్యక్రీడలు 133
7.4. సీతాదేవి సఖులతో కలసి బంతి యాడుట 135
7.5. సీతాదేవి కన్నె తులసి నోము నోచుట 137
7.6. వసిష్ఠ పత్నియగు అరుంధతి సీతాదేవి నోమున కేతెంచుట 139





7.7. జనకుడు సీతాదేవికి స్వయంవరము ప్రకటించుట 143


## 8.విశ్వామిత్రుని ఆగమన ఖండము


8.1 విశ్వామిత్రుడు అయోధ్యకు వచ్చుట 150
8.2. విశ్వామిత్రుడు యజన రక్షణార్థము రామ లక్ష్మణులను పంపుమని దశరథుని కోరుట 152
8.3. విశ్వామిత్రుని కోరిక విని దశరథుని ఆస్థాన ప్రజలు కలతజెందుట 157
8.4. దశరథుడు తన కుమారులను పంపజాలనని విశ్వామిత్రునితో చెప్పుట 160
8.5. దశరథుని మాటలకు విశ్వామిత్రు డసంతృప్తి చెందుట 164
8.6. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తనతో పంపమని దశరథునకు నచ్చచెప్ప యత్నించుట 166
8.7. దశరథుడు ఈ విషమ సమస్య నుండి రక్షింపుమని వసిష్ఠుని వేడుట 168
8.8. వసిష్ఠుడు రామలక్ష్మణులను కౌశికునితో పంపుట యుక్తమని చెప్పుట 170
వివరణలు 174


## 9. ప్రయాణ ఖండము


9.1. రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట ప్రయాణమగుట 175
9.2. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు బల,అతిబల ద్యలనుప్రసాదించుట 177
9.3. వన సందర్శనము 179
9.4. సాయంసంధ్యాగమనము 180
9.5. చంద్రోదయము 182
9.6. విశ్వామిత్రుడు శ్రీరామ ముఖ దర్శనమున ప్రముదితుడగుట 184
9.7. రామ లక్ష్మణ కౌశికులు అంగదేశము చేరుట 185
9.8. మలద, కరూశ దేశములు 187
9.9. తాటకయను రాక్షసి వృత్తాంతము 191
9.10.శ్రీరాముడు తాటకను వధించుట 195
వివరణలు 199

## 10. వామనావతార ఖండము


10.1. సిద్ధాశ్రమ ప్రవేశము 200
10.2. అదితి, కశ్యపుల తపస్సు 202
10.3. వామన చరిత్రము 205
10.4. వామనుడు బలి చేయు యజ్ఞము చూడ బోవుట 208
10.5. వామనుడు బలికి తన తత్త్వము తెలుపుట 209
10.6. బలి చక్రవర్తి వచ్చిన వటువు విష్ణువేమో యని సంశయించుట 211
10.7. బలి చక్రవర్తి శ్రీహరిని నుతించుట 214
10.8. బలి చక్రవర్తి వామనునుకు మూడడగుల నేలదానమిచ్చుట 218
10.9. వామనుని విశ్వరూపము 219
10.10. విశ్వరూపముననున్న శ్రీహరిని బ్రహ్మ, ఇంద్రుడు ప్రార్థించుట 221
10.11 వామనుడు బలిని పాతాళమునకు త్రొక్కుట 223
10.12 బలిచక్రవర్తికి శ్రీహరి వరముల నిచ్చుట 225
వివరణలు 226


## 11. యజ్ఞ పరిరక్షణ ఖండము


11.1. కౌశికుడు యజ్ఞమును కాపాడుటకురామలక్ష్మణుల నియోగించుట 229
11.2. శ్రీరాముడు హోమకుండములపై శస్త్రముల ఛత్రము కట్టుట 230
11.3. శ్రీరాముడు మారీచ, సుబాహుల ఉక్కడగించుట 233
11.4. కరాళుని నివ్వెఱ 235
11.5. దేవేంద్రుడు శ్రీరామునిపై ముత్యపు జల్లులు కురిపించుట 238
11.6. విశ్వామిత్రుడు యజన సంరక్షణచేసిన రామ లక్ష్మణుల నభినందించుట 239
11.7. జనక మహారాజునుండి ఆహ్వానము వచ్చుట 242





11.8. విశ్వామిత్రుడు రామునకు సీతాదేవిని గురించి తెలుపుట 244
11.9. విశ్వామిత్రుడు తన జన్మ వృత్తాంతమును శ్రీరామునకుతెలుపుట 250
వివరణలు 251


## 12. అహల్యా ఖండము


12.1. విశ్వామిత్రుడు గంగానది మహాత్మ్యమును శ్రీరామునకు తెలుపుట 253
12.2. అహల్య జనన యౌవనములు 253
12.3. అహల్యా గౌతముల వివాహము 258
12.4. దేవేంద్రుడు అహల్యను మోసగించుట 261
12.5. గౌతముడు దేవేంద్రుని శపించుట 264
12.6. గౌతముడు అహల్యను శపించుట 266
12.7. గౌతముడు అహల్యకు శాపవిమోచన మార్గ మెఱింగించుట 269
12.8. శిలాస్తంబితయైన అహల్యకు శ్రీరాముడు విమోచనము కలిగించుట 275
12.9. అహల్యా స్తవము 278
12.10. అహల్య స్త్రీగా తనకు జరిగిన అన్యాయములను శ్రీరామున కెత్తి చూపి విలపించుట 284
వివరణలు 287


## 13. మిథిలా ప్రయాణ ఖండము.


13.1. ప్రభాతాగమనము 289
13.2. గుహుడు రామ లక్ష్మణాదులను గంగానదిని దాటించుట 291
13.3. విశ్వామిత్రునితో గూడి రామలక్ష్మణులు మిథిలానగరము చేరుట 298
13.4. విశ్వామిత్రుడు జనకునకు రామలక్ష్మణులను పరిచయము చేయుట 301
13.5. జనకుడు రామలక్ష్మణులను గజారూఢులనుచేసి యూరేగించుట 308
13.6. మిథిలానగర వైభవము 313
13.7. సీతాదేవి ప్రమదావనంబున దుర్గామాతను పూజించుట 317

13.8. వసంతాగమనం 322
13.9. ప్రమదావనమున రాముడు, సీత పరస్పరము వీక్షించుకొనుట 323
వివరణలు 327

## 14. శివధనుర్భంగ ఖండము

14.1. ధనుర్యాగ సభా సమావేశము 329
14.2. స్వయంవరమునకు వచ్చిన రాజులు రాముని యెడ మత్సరగ్రస్తులగుట 333
14.3. రావణమంత్రియగు ప్రహస్తుడు జనకునితో సీతను తమ ప్రభువున కిమ్మనుట 339
14.4. రావణుడు ధనువు నెక్కుపెట్ట ప్రయత్నించి విఫలుడగుట 343
14.5. రావణుడు విల్లు క్రిందనుండి రక్షింపబడుట 347
14.6. ధనుర్యాగమునకు వచ్చిన వీరు లెవ్వరును ధనువు నెత్తలేక పోవుట 350
14.7. జనకుడు క్షాత్రంబు నిర్వీర్యమైనదన్న సహించక లక్ష్మణుండు కుపితుడగుట 353
14.8. శ్రీరామచంద్రుడు శివధనుస్సు నెత్తుట కుద్యక్తుడగుట 355
14.9. అంతఃపురస్త్రీలు మేడలనుండి విల్లునెత్తబోవుచున్న రాముని వీక్షించుట 357
14.10. లక్ష్మణుడు పృథ్వీ, సూర్యులను హెచ్చరించుట 361
14.11. సీతారాములు పరస్పరము వీక్షించుకొనుట 362
14.12. శ్రీరాముడు శివధనస్సును భగ్నమొనర్చుట 364
14.13. ధనువు విఱిగి నపుడు మహాశబ్దంబులు జనించుట 367
14.14. శివుని చాపమును భగ్నమొనరించిన రామచంద్రుని నిర్జరాదు లుత్సహించుట 368
14.15. సభలో కొందరు చలమరులైన రాజులు కలకలము కలిగించుట 370



14.16. జనకుడు విశ్వామిత్రునకు కృతజ్ఞతలు తెలుపుట 372
వివరణలు 376

## 15. సీతారాముల కల్యాణ ఖండము

15.1 కల్యాణ కార్యక్రమమును నిర్వహించుటకు శతానందుడు నియమింపబడుట 378
15.2. సీతారాములు లొకరి కొకరు పుష్పమాలలతో నలంకరించుకొనుట 381
15.3. జనకుని దూతలు దశరథుని మిథిలకుగొని వచ్చుట 385
15.4. మిథిలకు వేంచేసిన దశరథుని, పరివారమును జనకుడు స్వాగతించుట 390
15.5. దశరథుడు విశ్వామిత్రునకు కృతజ్ఞతలు తెలుపుట 392
15.6. భరత, శత్రుఘ్నులకు మాండవీ శ్రుతకీర్తులతో వివాహములు నిశ్చయమగుట 394
15.7. శ్రీరామచంద్రుడు కౌసల్య వద్దకేగుట 397
15.8. కల్యాణ సన్నాహములు 400
15.9. జనక, కుశధ్వజులు వివాహ కార్యారంభ కర్మలనుచేయుట 401
15.10. సీతారాముల కల్యాణ ఘట్టము 403
15.11. దశరథుడు, కుటుంబముతో కల్యాణమండపమునకు తరలివచ్చుట 403
15.12. మంగళస్నానములు 409
15.13. సీతాకన్య గౌరీపూజచేయుట 413
15.14. శ్రీరామచంద్రుని వసిష్ఠాదులు పెండ్లి మండపముపైన కూర్చుండ జేయుట 414
15.15. సూర్య, నిమి వంశజుల ప్రవరలు ప్రశంసింపబడుట 416
15.16. జనకుడు శ్రీరామునకు నూతన యజ్ఞోపవీతములు, మధుపర్కము లొసంగుట 417

15.17. తెరసెల్లా కట్టుట 418
15.18. కన్యాదాన మహోత్సవము 419
15.19. కల్యాణ సుముహూర్తము 422
15.20. సీతారాముల కల్యాణమును వీక్షించిన వారల స్పందన 423
15.21. కల్యాణోత్సవమును తిలకించి ప్రకృతి పరవశించుట 425
15.22. మంగళసూత్రధారణ 426
15.23. తలంబ్రాలు పోసుకొనుట 428
15.24. నిశాగమనము 431
15.25. అరుంధతీ వీక్షణము 433
వివరణలు 435

## 16. సీతారాముల గృహప్రవేశ ఖండము.

16.1. సీతారాములు మిథిలనుండి అయోధ్యకు బయలుదేరుట 436
16.2. పరశురాముని ఆగమనము 437
16.3. రఘురామ, భృగురాముల సంవాదము 442
16.4. పరశురాముడు తన వైష్ణవతేజమును రఘురామునకు అందజేయుట 447
16.5. సీతారాములు దశరథునితో అయోధ్య చేరుట 453
16.6. భరత, శత్రుఘ్నులు భార్యలతోగూడి కేకయాధీశుని యొద్దకేగుట 456
16.7. సీతారాముల సేవలకు దశరథుడు తనియుట 459
16.8. సీతారాములు అన్యోన్యానురాగములతో సుఖజీవనము సాగించుట 460



మంగళాశాసనము 463
గద్యము 464
వివరణలు 465
గ్రంథకర్త జీవిత సంగ్రహము 468
అనుబంధము : కొన్ని క్లిష్టమైన పదములకు అర్థములు 470

# శ్రీమదాంధ్ర శివానంద రామాయణము

## బాలకాండ

రచన:
ఆచార్య వి.యల్.యస్.భీమశంకరం

# 1.ప్రార్థనా ఖండము

## 1.1.ఇష్టదేవతా ప్రార్థన

శా. శ్రీనిశ్రేయస భూరి సంపదకునై చిత్తంబు నాకట్టుచున్
నే నశ్రాంతము నీ పదాంబుజములన్ నిష్ఠాత్మతన్ గొల్చుచున్,
నీ నామంబు భజించుచున్, బొగడుచున్, నీ దివ్య గాథామృత
ధ్యానోపాసన సేయుచున్ బ్రతుకు భాగ్యం బిమ్ము భీమేశ్వరా! 1

శా. విశ్వేశుండవు, విశ్వరూపుడవు, శ్రీభీమేశ్వరస్వామి! స
ప్తాశ్వారుధునిచే ప్రతిష్ఠగొని, పద్మాక్షాది దేవేశులున్,
నిశ్వాసంబులు మాని మౌనిజనముల్ నిశ్చేష్ట వేష్టింపగా
శశ్వచ్ఛోభ వెలుంగు నిన్ గొలుతు – దక్షారామతీర్థ స్థితా! 2

ఉ. నశ్వరమైన భోగములు, నాశము నొందెడు దేహసంపదల్
శాశ్వతమంచు నమ్మక వృషధ్వజుడేను శరణ్యమంచు నా
విశ్వపతిన్ మనంబున ప్రవిష్టునిజేసి నుతించు నాకు భీ
మేశ్వరు డిచ్చుగాక పరమేశ్వరలోక నివాసభాగ్యముల్. 3

ఉ. అమ్మలకెల్ల యమ్మ, సగుణాత్మకయై చను నిర్గుణాంబ, భా
రమ్మగు జీవయాత్రకు వరమ్మయి బ్రోచెడి యమ్మ, ప్రీతి ను
ల్లమ్ముల నిల్పి కొల్చిన విలక్షణ దివ్యపథంబు లిచ్చు దు
ర్గమ్మ, నిరంతరంబుగ వికాసము గూర్చుత నా మనంబునన్. 4

ఉ. ప్రోది యొనర్చు మోము, పరిపూర్ణత నిచ్చెడు బొజ్జ, సంతతా
మోదము గొల్ప నూపెడు విభూషిత తుండము, సూక్ష్మదృక్కులన్
సాదర భావముల్ నెరపునట్టి గజానను గొల్తు కావ్య సం
పాద మనుగ్రహింప, ప్రతిబంధములన్ దొలగంగ జేయుచున్. 5

ఉ. అంకము డిగ్గి పాఱు తన నంకిలివెట్ట హిమాద్రిగుట్టలం
దుంకువ వెంటపర్వెడు మనోజ్ఞ గురుస్తని గౌరి గాంచి యో
గాంకిత మన్మథాంతకు డనంగ వికార సరాగ రాగుడై
అంకెకుచేర జూచి – ప్రమదాననుడైన గజాస్యు గొల్చెదన్. 6

ఉ. చిత్తమునందు మ్రొక్కెదను చేతులు మోడ్చి ముకుందు రాణినిన్.
చిత్తజు కన్నతల్లిని, వశీకృత సర్వ జనాంతరంగనున్,
పుత్తడి బొమ్మ, కర్మఫల మూలపు సంపదలిచ్చు లచ్చినిన్.
హత్తిన బత్తి తోడను – సమాదరణమ్ముగ మేలు సేయగన్. 7

సీ. నీలాంబుజశ్యామ నిరతశోభన సంప
దన్విత దివ్య దేహంబుతోడ,
నలువుగా నొప్పెడు నాల్గు చేతులతోడ,
పూర్ణేందు నిభకాంతి ముఖముతోడ,
శ్రీదేవి కిరవైన శ్రీవత్స లాంఛన
కమనీయ విపుల వక్షంబుతోడ,
సరసను రుక్మిణీ సత్యభామలు నెమ్మి
వింజామరలతోడ వీచుచుండ,
తే.గీ. పరిమళమ్ములు ప్రసరించు పారిజాత
పాదపచ్ఛాయ లందున భవ్యరీతి
నతుల కాంచన సింహాసనస్థుడైన
కృష్ణభగవాను నర్చింతు తృష్ణ తీర. 8

ఉ. నాలుగు వేదముల్ నిరతి నాల్గుముఖంబుల నుచ్చరించుచున్
మేలుగ నంబుజాసనము మీద నియోజిత దివ్యనేత్రుడై
హేలగ విశ్వసృష్టి నొనరించెడు వేల్పులపెద్ద, నా క్రియా
శీలుని కొల్తు నా మది విశిష్ట కవిత్వ రసప్రభూతికై. 9



ఉ. వాణిని, మంజువాణిని, నవాంబుజ పాణిని, సర్వశాస్త్ర వి
జ్ఞానిని, గానతోషిణిని, షట్పద కూట వినీల వేణినిన్.
పూనినవేడ్క నా రసనబొందికతో నుపవిష్ట యౌచు స
మ్మానిత దివ్య శబ్దరస మాధురులన్ ప్రసరింప వేడెదన్. 10

ఉ. అంచల పల్లకీ పయి విహాయస మార్గ విహార హర్షియై
మించిన వేడ్క నించుక నిమీలిత చక్షుల తోడ వీణ వా
యించి విరించి చిత్తమున కింపెసలారగ జేయు వాణి, ఆ
కాంచనగర్భభామిని సకాల వచఃస్ఫురణమ్ము నిచ్చుతన్. 11

=°. సిత పద్మంబొక కేల, వేరొకట రాచిల్కావతంసంబు, ను
న్నతి వేరొక్క కరాన కచ్ఛపిని, గ్రంథంబొక్క చే పట్టి య
ప్రతిమానంబుగ కొల్వుతీరిన సతిన్ వాగ్దేవి నర్థింతు, సం
తతమున్ నా మనమందు నిల్చి శుభశబ్దంబుల్ స్ఫురింపింపగన్.
12

కం. వాణీ! అలికుల సముదయ
వేణీ! అక్షర తరంగ వేల్లిత వీణా
పాణీ! ద్రుహిణుని రాణీ!
రానీ, నాపైన కరుణ రమ్య శ్రోణీ! 13

ద్వ్యక్షర కందము.

మిన్నున మినమిన మను నిను
నన్నున నేమమున మనన మమ్మా నెమ్మిన్
మన్నన మనమున నెన్నిన
నన్నను, నిను నమ్మినాను నను నమ్మమ్మా! 14

సీ. అలయకుండకనె నా కపురూప విద్యల
కరతలామలకంబు గఱపినావు,
భూరి శాస్త్రములందు భూభౌతికము నందు
వాసికెక్కిన ప్రోడ చేసినావు,
వివిధ దేశములందు విజ్ఞాన సభలలో
శంఖంబు పూరింప సలిపినావు.
ఆచార్యవృత్తిలో నధిక మన్నన లంది
ఎనలేని ఖ్యాతి పొందించినావు,
ప్రౌఢ 'రసస్రువు' గ్రంథ రచనయందు
అలఘు చ్ఛందో నాట్య మాడినావు,
తే.గీ. నిలిచి అమ్మరో నా నోట పలుకు మమ్మ
సరస సౌందర్య మృదు మధు భరితముగను
ప్రథిత రామాయణ గ్రంథ రచన యందు,
చతుర పద గణ సుమ లాస్య శారదాంబ. 15

వ. అని యీ విధంబున ఇష్టదేవతల ప్రార్థన మాచరించి, నూతనగ్రంథ రచనా సమయంబున ప్రసన్నభావంబు వహించి, మదీయ చిత్తంబును నిర్మలంబును, దైవభక్తిపూరంబును గావించి, నా నోట సమకాలీన వ్యాకరణ చ్ఛందో సమాసాలంకార సమున్నత భావోపేత శబ్దార్థ రసనిర్ఝరుల ప్రసరింపం జేయ నర్థించి, మూఢుండు బ్రహ్మ పదార్థంబు గోరు చందంబున, బధిరుండు సశాస్త్రీయ సంగీతంబు నాస్వాదింప నభిలషించు తెరంగున, మూగ మహోపన్యాసంబు చేయ నుత్సహించు రీతిని, పాండిత్యహీనుండనై గూడ, ఈ లోకంబుల కర్త, కర్మ, క్రియయగు విశ్వేశ్వర పాదారవింద యుగ్మ తదేక ధ్యానం బాలంబనంబుగా, గురు వందనంబాచరించి, గ్రంథ రచన కుప క్రమించిన విధానం బెట్టిదనిన, 16



## 1.2.గ్రంథోపక్రమణము

ఉ. పెన్నిధి రాజభాషయిది ప్రీతి పఠింపు మనంగ నాంగ్లమున్
పిన్నతనాన నేర్చి వసి వీగి, జగత్తున నున్న భాషలం
దున్నతమైన సంస్కృతము నోజ నెఱుంగని కారణమ్మునన్
సన్నుత భారతీయ ఘన సంస్కృతి నెంతయు కోలుపోయితిన్. 17

తే.గీ. అందు మూలన నే నాడు నమరభాష
వెలసిన కృతుల యనువాదములను దక్క,
పొలుపు మీరంగ సంస్కృతమూలములను
చదువు భాగ్యంబు నాకిల పొదలదయ్యె. 18

తే.గీ. నా అచిత్తి నశింప విన్నపమొనర్తు
వ్యాస వాల్మీకి కాళిదాసాది కవుల –
చెలసి నా అంతరాళాన నిలిచి రుచిర
మంజులార్ష శబ్దములు నా మదిని నింప. 19

చం. అరితిని తెల్గు బాసయిన నధ్యయనంబొనరింప, పూని వ్యా
కరణము గాని ఛందమును గాని మనోజ్ఞ మనోభిలాషినై
నెరవున నభ్యసింపగను నేరను, సంతత మాంగ్లమున్ వినా
మురిపముతోడ నే తెలుగు పొత్తము లేవి మథించ నెన్నడున్. 20

మ. అయినన్ పూర్వపు పుణ్యసంచయ ఫలంబాదీప్తమై మాతృభా
షయి వెల్గొందిన తెల్గులోన నితిహాసంబుల్ మహా కావ్యముల్
మయి మఱ్వంగను పద్య గద్యములుగా మాతాపితల్ జెప్ప, నే
పుయిలోటేమియులేక వాని నిరతిన్ మోదంబుతో నేర్చితిన్. 21

తే.గీ. మాటలాడంగ నేర్చిన నాటనుండి,
పూర్వకవుల పద్యములను ముదముతోడ
తల్లియొడినున్న సమయాన వల్లె వేసి
నట్టి భాగ్యంబు నందుకొన్నందు వలన. 22

ఉ. చిన్న తనానె పద్యములు చేతము చేరి వసించె మేధలో,
విన్నవి విన్నయట్లుగను వీనుల మ్రోగి సుశబ్ద సంగతుల్
వెన్నడిగొంచు నా ధిషణ వీడక యుండుట చేత వాటి నే
నెన్నడు నాత్మయందు స్మరియించుచు నుందును పుల్కరించుచున్. 23

ఉ. ఆ విధి తెల్గు బాసపయి నబ్బుర మొప్పెడి గౌరవమ్ము నా
భావమునందు కీల్కొనెడు భాగ్యము నిచ్చిన తల్లిదండ్రులన్
వావిరి నిల్పి నా యెదను బంధుర రీతిని పద్యగద్యముల్
వావిగ పల్కుదున్ తెలుగు భాష కలంకరణమ్ము లట్లుగన్. 24

ఉ. చక్కెర తీపివోలె, సుమశాలను చల్లని వీచి రీతిగా,
చక్కని చుక్క వాతెరల సందున దివ్య మరందమోయనన్,
గ్రక్కున నిష్టదైవతము గాదిలి దర్శనభాగ్యమట్టు లిం
పెక్కగ శబ్దసంగతుల నెంచుచు నించెద నిండుగా కృతుల్. 25

మ. శ్రుత పాండిత్యముతో సదాశివుని సంరూఢ ప్రసాదంబులున్
జతయై, అర్వది యేండ్ల ప్రాయమున వాక్చాతుర్య మేపారుచున్
ప్రతిభాసింపగ పద్య కావ్యముల నొప్పారంగ చేకొంటి నే
నతి ప్రౌఢంబుగ వ్రాయ, తెల్గుపయినన్ వ్యామోహరాగంబునన్. 26

వ. రసజ్ఞులైన పాఠక మహాశయులు నా భాషాజ్ఞానమును సహించి, నా కవిత్వములోని మంచిని మాత్రమే గ్రహించి తప్పుల నెన్నరనెడు నమ్మకముతో నీ కృతిని చేపట్టుచుంటి. అయిననూ ఈ ప్రపంచమున జనులు వివిధ రకములు. 27



ఉ. తప్పులు వ్రాసినాడనుచు తచ్చన చేసెడి వారలుందు – రీ
దెప్పుడు మాటలన్ దరచు తెల్గు జగత్తున విందుమే కదా,
చెప్పరె తప్పులంచు మును చెచ్చెర పోతన గారి కైతలన్!
మెప్పులు పొందబోవుదురె మేదినిలో సమకాల భావుకుల్ ! 28

వ. మరియు, 29

తే.గీ. పద్యముల్ చదువు తెలుగు పాఠకు లరు
దైన కాలమందు సుదీర్ఘమౌ సమాస
ముల నతికి వ్రాయు నీతండు మోహరించి
ప్రౌఢ పద్యముల్ దుష్కర ప్రాసలోన. 30

వ. అని విమర్శించు వారు కొందరుందురు. పద్యము లాలోచనామృతములు. చదువరులు తమ మనీషను వినియోగించి క్లిష్టసమాసంబుల ఛేదించి అర్థసమన్వయము చేసికొను నపుడు కల్గు స్వకీయార్థ స్ఫురణానంద మనుభవింప జేయుటే పద్య ప్రధాన లక్ష్యము. 31

చం. కుసుమ సమాన మార్దవము కూర్చిన పద్యములన్ పఠించు ఏ
రసికుడు నైన మానునటె ప్రౌఢకవిత్వము కష్టమంచు, పా
యసమును ప్రీతి జుర్రెడు క్షుధార్తుడు పాకపు జీళ్లు నేర్పుతో
మసగొని సాగగా నమలి మాధురి గ్రోలడె తేపతేపకున్. 32

వ. అయినను, బహు దుష్కర పదంబులతోడను, అతిదీర్ఘ సమాసంబులతోడను గ్రంథమును నింపుట నా అభిమతంబు గాదు. కేవలము చదివిన మాత్రముననే అర్థమైనచో పద్యములు వ్రాయుటేల. వచనమే సరిపడును గదా. పయ్యదచాటున చూపరులకు శృంగార భావనవోద్దీపనం బొనర్చు సమున్నతాంధ్ర వనితా వక్షోజ సన్నిభంబగు రసనిక్షిప్త కుంభికుంభ సదృశంబులును, కర్ణాట సంగీత మాధురీ నిబద్ధ నానాలంకార సంయుతంబులును, తదవసర వివిధ ఛందోనాట్య విన్యాస భంగిమా కలితంబులునగు పద్య గద్య సముచ్చయం బగు తెలుగు చంపూ గ్రంథంబు రచించుటయే నా ధ్యేయము. 33

## 1.3.మాతృభాషా ప్రశంస

తే.గీ. ఆంధ్రుడై పుట్టుటే వరమని వచించి,
తాను తిరిగి పుట్టిన తెల్గువానిగాను
పుట్ట గోరుదు నంచు సమ్మోదమునను
పలికెగాదె జగన్నాథపండితుండు. 34

ఆ.వె. అష్టదిగ్గజకవు లాలాప మలరింప
దేశభాషలందు తెలుగు లెస్స
టంచు కృష్ణరాయ లవనివిభుడు మున్ను
పలికె గాదె జనులు ప్రస్తుతింప. 35

[1]తే.గీ.మొన్న మొన్ననె తెలుపడే స్ఫూర్తినొంది
శాస్త్రపదముల కనువాదసరణి చూపు
సత్త గల భారతీయభాష తెలుగునుచు
ఆంగ్ల దేశస్థుడు 'జె.బి.యస్.హాలుడేను'. 36

తే.గీ. ఇంపుసొంపుల చెలువంబు నింపు తెలుగు
నెంచుచు 'నిటాలియన్ ఆఫ్ ది ఈస్టు' గాను
చెప్పరే యూరపు జనులు గొప్పగాను-
ఇంటి భాషౌట మనవార లెఱుగ రేమొ ! 37

ఆ.వె. తేనె లొలుకు రీతి తియ్యనౌ పలుకులు,
వినినతోడ మనకు విందు చేయు
సుందరంబులైన శ్రోత్రవ్య రవములు
పరగునట్టి మహితభాష తెలుగు. 38



వ. ఆంధ్రభాషామతల్లికి- 39

ఉ. అందము చిందు సుందరము లక్షర రూప విలాసముల్, పద
స్పందన మందు కందువ పసందులు వీనుల విందులున్, గతుల్
స్యందిత మాధురీ మృదు లతాంత మరంద తరంగ మంజిమల్,
నందక దోహదమ్ము గమనమ్ము చిరంతన మాంధ్ర భాషకున్! 40

ఉ. మన్నన గొన్న పండితులు మంజుల మార్దవ శింజినీ రవం
బన్నుకొనున్ తెలుంగు పలుకందున నంచు నుతింప, శబ్ద సం
పన్నత, అర్థయుక్తియు, విభావ చమత్కృతి, శ్లేష, శిల్ప ని
ష్పన్నత యోగ్యమై తెలుగు భాష వెలుంగు ప్రపంచసాహితిన్. 41

## 1.4. పూర్వకవుల స్తుతి

ఉ. ఇట్టిడు తెల్గుబాస జగమెంచెడు రీతి ఖచించినట్టి మా
దిట్టల నెన్నెదన్, తెలుగు తీర్పడ దిద్దిన పద్యగద్య వి
భ్రాట్టుల, సాహితీజగతి వాసిగ నున్నత పీఠమందునన్
పట్టము కట్టుకొన్న కవివర్యుల శాశ్వత కీర్తిసాంద్రులన్. 42

ఉ. పండితు లెందరో తెలుగు పామర భాషని యీసడించి, స
న్మండితమైన సంస్కృత సమంచిత వాఙ్మయమెల్ల తెల్గులో
దండుగయై నశించునన దంటతనమ్మున భారతమ్ము ను
ద్దండత తెల్గుచేసిన యుదాత్తుడు నన్నయగారి నెన్నెదన్. 43

తే.గీ. ఆర్షభారత సాహిత్య మాంధ్రజనులు
తల్లి భాషలో చదివెడు ధన్యతలర,
సంస్కృత పదముల తెలుగు శబ్దములుగ
సంస్కరించిన శబ్దశాసను నుతింతు. 44

చం. హరిహరనాథ దేవర పదాంబుజ యుగ్మ మరందధారలన్
పరవశుడై మహోత్సుకత భారతమందు పదేనుపర్వముల్
సురుచిరరీతి తెల్గున ప్రసూన నిభంబగు శబ్ద సంపదన్
నెరవరియై రచించు పదనీరధి తిక్కనయజ్వ కొల్చెదన్. 45

మ. కవియే గాకను వేత్తయై సచివుడై కార్యార్థియై కాకతీ
య విభున్ సమ్ముదితాత్ముజేసి తన గ్రంథాలాపనన్, వానిచే
భువినాథుండగు మన్మసిద్ధి మహి సంపూర్ణంబు నిప్పించె – నా
సవిశేషజ్ఞుడు మంత్రి తిక్కనకు సాష్టాంగంబు లర్పించెదన్. 46

మ. ప్రతతంబైన అరణ్య పర్వమును సౌరభ్యంబు భాసిల్లగా
మతిలోకోత్తరుడైన నన్నయ సృజింపన్ బూనుచో మధ్య దు
స్థితికిన్ లోనయి ఆగిపోవు తరి నుద్దీపించి ఆ శైలికిన్
ప్రతిమానంబుగ వ్రాసె నా కవిని యెఱ్ఱన్నన్ ప్రశంసించెదన్. 47

సీ. చేతంబు మోదింప స్నిగ్ధ చాటువులలో
నిక్వాణ మధురిమల్ నింపు వాడు.
ప్రోడరాయని సభ గౌడడిండిము నొంచి
కనకాభిషేకంబు గొనిన వాడు,
సర్వజ్ఞభూపాలు సభ తెల్గు భాషకు
విందు చేయుచు విర్రవీగువాడు,
పల్లకీయందున పయనమై పోవుచు
పలనాటి చరితంబు పలుకు వాడు,
తే.గీ. ప్రథిత భీమఖండ గ్రంథ రచన తోడ
తెలుగు కీర్తికి వన్నెలు తెచ్చువాడు,
చపల బోలియు సాహితీ జగతి యందు
నిలిచి వెల్గెడు శ్రీనాథు కొలుతు నిరతి. 48



కం. తమ్ముల నేలందమ్ములు,
మమ్మెరె! శబ్దార్థ భక్తి మకరందమ్ముల్,
గుమ్మను గంధవహమ్ములు
బమ్మెర పోతన్న తెలుగు భాగవతంబుల్. 49

ఉ. అమ్మ తెలుంగు భారతి గళాంకన లా కవి శబ్దసంగతుల్,
కమ్మని తేనె తెట్టియలు, కప్పుర తావుల మేలి తొట్టియల్,
జుమ్మని వీచు ఫుల్ల నవసూన వితాన విధూత వాతముల్,
బమ్మెర పోతరాజ కృత భవ్య కృతుల్ – భగవాను నాకృతుల్. 50

చం. అటజని కృష్ణరాయ వసుధాధిపు భూరి సభాంతరమ్మునన్,
పటు నటనానుకూల పదపాటవ పండితు పెద్దనార్యు, ప్రా
కట కవితా వియజ్ఞరుల కందువ నెంతును, సార్వభౌముడే
కటకము కాలికన్ దొడుగు కాలమహోన్నతి సంస్మరించుచున్. 51

సీ. నలువరాణిని తమ నాల్కలందున నిల్పి
చెలువంపు కవనంబు చెప్పువారు.
శ్రీభారతీదేవి చిత్తంబులో కొల్చి
సరస కవిత్వంబు నెరపు వారు,
వాగీశ్వరిని తమ వాక్కులో నెలకొల్పి
ప్రౌఢకవిత్వంబు పలుకు వారు,
ఆ రీతి రామాయణామృతంబు చిలికి
తెలుగు యెడదల కందించినట్టి
తే.గీ. ప్రోడలను భాస్కరాదుల, మొల్ల సతిని,
గోనరెడ్డిని, శ్రీపాద, గోపినాథ
విశ్వనాథుల కీర్తింతు వినుత యశుల,
రామకథ వ్రాయు సమయాన ప్రమను గూర్ప. 52

## 1.5. కృతిపతి నిర్ణయము

వ. అని, ఈ విధంబున కవి వందన మాచరించి, సర్వ మానవ ధ్యేయంబగు కైవల్యంబు సాధించు నుపాయంబు నన్వేషించుచు, ధ్యానావలంబిత విశుద్ధ నిశ్చల మానసుండనై ఇదమిత్థమనరాని అంతర్మథనంబు నొందుచుండ- కలియుగంబున యోగజ్ఞాన పథంబుల కన్న మిన్నయగు భక్తిమార్గమే అపవర్గ సాధకంబనియు, అట్టి భక్తి విశేషంబులైన శ్రవణ కీర్తన స్మరణ పాదసేవ నార్చనా వందన దాస్య సఖ్యాత్మ నివేదలను నవవిధంబులతో పాటు, ఆ దేవదేవుని రూప, గుణ, విభూతులయందు నిరంతరచింతనా మగ్నమనస్కత నా సర్వేశ్వరుని లీలల గ్రంథీకరించుట యొక ప్రత్యేక సేవయై దశమ మార్గంబగునని ఇతః పూర్వం బేను నిశ్చయించి, యుపక్రమించిన పథంబు నా మనంబులో ప్రస్ఫుటంబుగ నెలకొని యుండుటం జేసి, 53

చం. నవవిధ భక్తి మార్గముల నైష్ఠిక చింతనతోడుగాగ, నీ
భవము విముక్తి నొందుటకు పావనమైన విశిష్ట మార్గ మా
శివుని విమోహ లీలలను చిత్తమునందున చర్చ జేయుచున్
చవులు జనించు రీతి కృతి సల్పుట లెస్సని తోచి యుండుటన్. 54

ఉ. ఇంతకు పూర్వమేను విరచించితి నిశ్చలమైన భక్తితో
నెంతయొ నిష్ఠ మూడు కృతు లీశ్వరు లీలల నెన్నుచున్ – మదిన్
శాంతి ఘటించె, నా బ్రదుకు సత్తమమార్గము పట్టెనో యనన్
వంతలు దీరి నా హృదయభారము తగ్గె ననూహ్యరీతిలో. 55

ఉ. [2]వ్రాసితి వానిలో నొకటి పాటవ మొప్పగ బంధయుక్తమై
వాసిగ సీసముల్ ద్విపద పాదములందున జొన్పి, యెల్లెడల్
ప్రాస 'ల' కార మేర్పరచి బంధురరీతిని నద్భుతంబుగా
గాసిలి ఐదు సాళ్ళు – సమకాలకవీంద్రులు దీని మెచ్చగన్. 56



తే.గీ. అంద మొప్ప 'శివానంద మందహాస
మ'నెడు నాల్గు వేల ద్విపదల ననురక్తి
సీసబంధంబుగా చేసి వ్రాసినాడ,
గ్రంథమెల్ల 'ల' కారంబు ప్రాసగాగ. 57

వ. అదిగాక, మరొక గ్రంథంబుగా, 58

కం. భీమేశ్వర సంస్తుతి ని
ష్కాముడనయి చేసితి కృతిగా నా దక్షా
రామపుర భీమశంకర
నామునిపై శతక మొకటి నల్వురు మెచ్చన్ 59

వ. మరియును, 60

హయప్రచార రగడ:
సదాశివుని చరణ భక్తి,
'ఉదాహరణ' మొకటి రక్తి
వ్రాసినాడ ప్రజలు పాడ
వాసితముగ ప్రతిభ తోడ. 61

వ. ఈ విధంబుగ బహుపురాతనచ్ఛందో నిర్మితంబును, గణ, మాత్రా బద్ధ సంకీర్ణంబును, గేయ, పద్య గర్భితంబు నగు శ్రీభీమేశ్వరోదాహరణ కావ్యంబును సంపూర్ణ స్తుతిగ్రంథంబుగా రచించితి. 62

కం. కావున నొక హరికథ గొని
వావిగ మరొక కృతి వ్రాసి, పాపౌఘంబుల్
పో విడిచెడు రీతిని నా
భావిని నియమించుకొందు ప్రణిధానముతో. 63

వ. నేను ప్రధానంబుగా హర భక్తుండనైనను, హరి హరాభేదంబు నా మతంబగుట, 64

సీ. ఫణితల్పశయనుండు, ఫణిగణాభరణుండు,
మురదైత్య దమనుండు, పురహరుండు,
శ్రీవత్సవక్షుండు, శితికంఠరాంకుండు,
కనకాంబరుండు, దిగంబరుండు,
అసురబాణధ్వంసి, అసమ బాణధ్వంసి,
గరుడకేతనుడు, నుక్షధ్వజుండు.
విశ్వసంభరణుండు, విశ్వాధికరణుండు,
యోగనిద్రార్తుండు, యోగివరుడు,
తే.గీ. మాధవుండైన దివ్య రమాధవుండు
మంగళాకృతి వెలయు నుమాధవుండు,
హరియు హరుడను పేర్లతో బరగు జగతి
కేలిక లొకటన్న నిజము నెరిగి మదిని. 65

చం. ఒకపరి విష్ణురూపమున నొక్కొక మారు సదాశివుండునై,
యొకపరి పద్మతోడను మరొక్కొక పట్టున శైలకన్యకన్
వికసన గూడి భక్తజన బృందము కెప్పుడు మేలుగూర్చు నా
ప్రకటిత దివ్యతేజ మొక భాతి వెలుంగుచు నుండు నిద్ధరన్. 66

వ. కావున, 67

తే.గీ. నా మొదటి శైవకృతి శివానందమంద
హాసమను బృహత్ కావ్యంబు నా మురారి
కి కృతి యిచ్చినాడ – నిపుడు కృత్తివసను
కిచ్చు టొప్పు నీ హరికథ నింపుమీఱ. 68



వ. అని వితర్కించుచు, శ్రీరామచంద్రుండు కథానాయకుడుగా, శ్రీకంఠుండు కృతిభర్తగా నే చేయంబూనిన, ఈ రామాయణేతిహాసంబు 'శ్రీమదాంధ్ర శివానంద రామాయణ' మను పేరంబరగు గాక యని తెలుగు పాఠకులకు విన్నపం బాచరించుచు, 69

## 1.6. షష్ఠ్యంతములు

కం. హరునకు, మరు సంహరునకు,
పరిపాలిత మురహరాది పరమేశునకున్,
పురహరునకు, లోక శుభం
కరునకు, నభయంకరునకు, కరి దమనునకున్, 70

కం. శైలాధిపు జామాతకు,
హాలాహల కంఠునకు, మహాదేవునకున్,
లీలా లింగాకృతికిన్,
మాలూర దళ ప్రియున, కుమా నాథునకున్. 71

కం. భర్గునకు, మనోజ్ఞునకున్,
నిర్గుణునకు, దివ్య యోగ నిర్గూఢునకున్,
స్వర్గాధిప వందితునకు,
దుర్గుణ మార్గాంతకునకు, దుర్గా పతికిన్. 72

కం. దక్షాధ్వర శిక్షకునకు,
నక్షీణ కృపాజలనిధి కక్షయ్యునకున్,
సాక్షాత్ పరమాత్మునకు, మ
హోక్షారోహణునకు, విషమోగ్రాక్షునకున్. 73

కం. మృత్యుంజయునకు, శంభున
కత్యంతదయా జలనిధి, కధ్యూఢునకున్,

సత్యోపయాచనునకు, న
నిత్య జగన్మోహభావ నిర్మాణునకున్. 74

కం. దుష్టాసుర సంహరునకు
శిష్టజనేచ్ఛాకరునకు, శిపివిష్టునకున్,
సృష్టి స్థితి లయ కర్తకు,
నష్టైశ్వర్య ప్రదాయి కాగమపతికిన్. 75

కం. అంబార్ధ శరీరునకున్,
త్ర్యంబకునకు, హలహలాంకిత గ్రీవునకున్
అంబర కచ సుందరునకు,
నంబుజసంభవ మధురిపు లాత్మస్థునకున్. 76

---

**వివరణలు :**

1. ప్రొఫెసర్ జె.బి.యస్. హాల్డేను గొప్ప జీవ, జన్య శాస్త్రజ్ఞుడు. ఈయన శాస్త్రపరిశోధనలు నవీన-డార్విన్ సిద్ధాంత వ్యాప్తికి దోహదం చేశాయి. వీరు 20వ శతాబ్దపు చివరి దశకంలో ఇంగ్లాండులో పుట్టి, తరుణప్రాయమున భారతదేశానికి వలస వచ్చి భారతీయ పౌరసత్వాన్ని తీసుకున్నారు. భారతీయ భాషలను నిశితంగా అధ్యయనంచేసి, తెలుగు భాష ఔన్నత్యాన్ని మనకు గుర్తుచేశారు. ఆయన మాటల్లో, 'తెలుగు విదేశీయ భాషలలోని పదజాలమును చాలా సులువుగా, స్వచ్ఛందంగా గ్రహించి తన లోనికి ఇముడ్చు కొంటుంది...తెలుగు వివిధములైన సందర్భములలోను, సన్నివేశముల లోను వలసిన శాస్త్రపదములగా యుపయోగించుటకు సావకాశముగల భాష...ఈ భాష భారతదేశ జాతీయభాషగా వినియోగ పడుటకు తగినట్టిది.'

2. శివానంద మందహాసము' అను సుమారు నాలుగు వేల ద్విపదలతో కూడిన కృతి ఈ రచయిత చేత సర్వ 'ల' కారప్రాసాలంకార సీసమాలికాబంధ ద్విపదకావ్యంగా 2004వ సంవత్సరంలో రచింపబడింది.

***

# 2. రామాయణ రచనోదంత ఖండము

## 2.1. వాల్మీకి రామాయణ ప్రశంస

వ. త్రిమూర్తులలో సత్వస్వరూపుడైన శ్రీమహావిష్ణువు శ్రీరామచంద్రునిగా పృథ్వీస్థలి నవతరించి త్రిలోకంబుల నధర్మ నిర్మూల నంబాచరించి,సద్ధర్మోద్ధరణం బొనరించిన వృత్తాంతంబు విధాతృ నానతిని శ్రీమద్రామాయణేతిహాసంబుగా సంయమీంద్రుండైన వాల్మీకి రచించె. 77

మ. లలి వాల్మీకి కవీంద్రు డీ కృతి నమూల్యం బైన శబ్దంబులన్
తొలి గ్రంథంబుగ దేవభాష నతి మాధుర్య ప్రసేకంబునౌ
తొలి శ్లోకంబుల సాహితీ జగతి యందున్ స్థాయిభావంబుతో
లలితాహ్లాద మహేతిహాసముగ నాలాపించె ప్రజ్ఞానియై. 78

సీ. ప్రద్యోతన ప్రతిభాతంబు, ప్రతిభా యు
తంబు, విముక్తి ప్రదంబు, నిత్య
మప్రమితంబు, ప్రత్యక్షార్ష ధర్మంబు,
సత్యంబు, విశ్వసాహిత్యమందు
ప్రత్యుత్క్రమం, బతి ప్రత్నంబు, ప్రథమంబు,
ప్రథితంబు, నతులంబు, ప్రాభవంబు,
రాక్షసధ్వంసుండు, రఘువంశసోముండు
ప్రాగ్వంశు నంశుని రమ్యగాథ
తే.గీ. మధుర శబ్ద భావార్థ సమన్వితంబు,
వర్ణనాత్మక ముపమాన వాఙ్మయంబు,
సంయమీంద్రుండు ప్రాచేతసకవి రచిత
మహిత కావ్యరత్నంబు రామాయణంబు. 79

సీ. ఏ శుభ సమయాన నీ గాథ వ్రాసెనో
వాల్మీకి యతులమౌ ప్రతిభ గాంచె,
ఏ యోగదృష్టితో నీక్షించెనో ఈ పు
రాణ మనుపమ నిధానమయ్యె,
ఏ దివ్య దీక్షవహించెనో వాణికై
ఈ కవిత్వ మమృత వృష్టి గురిసె,
ఏ దయా రసము ముయ్యేరుగా పారెనో
మించి జనుల భక్తి ముంచివైచె,
తే.గీ. ఎట్టి యపురూప గంటంబు నెన్ను కొనుచు
అక్షయంబుగ చెక్కెనో అక్షరముల,
విశ్వ సాహిత్యమందున శాశ్వతమయి,
భారతీయత జగతిని పాదుకొలిపె. 80

వ. అట్టి మహాద్భుత సాహిత్య సృష్టి యొనరించిన వాల్మీకి ధన్యుండు. ఆ మహర్షికి చేతుల నెత్తి నమస్కరించెద. 81

కం. రామా! రామా! యని అభి
రామస్వరమున మృదుమధురంబుగ కవితా
రామంబునుండి పాడిన
ఆమని వాల్మీకి పికము కంజలి సేతున్. 82

తే.గీ. తనరి గిరితోడ పాలసంద్రంబు తరచి
మీఱి సుధగొన్న భంగి, వాల్మీకి మౌని
మదిని ధ్యానంబు తోడను మథనజేసి
నలువుగా చిల్కె రామాయణామృతమ్ము. 83



కం. రామాయణమను జాహ్నవి
ఓమున వాల్మీకి పర్వతోద్భవమగుచున్
భూమిన్ ప్రవహించును శ్రీ
రామ సముద్రంబు దెసకు – ప్రజలన్ బ్రోవన్. 84

కం. ఆ ప్రాచేతస విరచిత
సుప్రాశస్త్యేతిహాస శోభల నెన్నం
గా ప్రాచీపతికైన ను
షాప్రాణేశ్వరున కైన సాధ్యమె తలపన్. 85

తే.గీ. వామలూర మహాముని వదన పద్మ
గళితమైన రామాయణ కావ్య మధువు
పాన మొనరించు వాని పాపములు డింది,
తుదకు విష్ణుసాన్నిధ్యంబు దొరకి తీరు. 86

కం. ఇలపై కలుషము కాలిడ
నిలువడి కృశమై అధర్మ మెలసి రహింపన్
వెలసెను మురారి నరుడై
నిలుపగ ధర్మంబు రామ నీరదమగుచున్. 87

కం. చక్కని రాముని చరితము
చొక్కముగా నూరు కోట్ల సుకృత ప్రదమౌ –
నొక్కక్షరమైన పలుక,
నిక్కముగా తొలగు పాపనివహ క్షోభల్. 88

కం. రాముని నెఱుగని నునుజుడు.
రామాయణ రహితమైన గ్రంథాలయమున్,

రాముని మ్రొక్కని చేతులు,
రాముని యాలయము లేని గ్రామము గలవే. 89

కం. ఘనుడౌ రాముని చరితము
మనసారంగ విని చదివి మననము సేయన్
కనిపించపు కష్టంబులు
వినిపించవు కర్మబంధ విష ఘోషణముల్. 90

తే.గీ. మనుజు డెవడేని పన్నెత్తి వినతుడగుచు,
'రా' యనుచు పల్క దురితముల్ మాయమగును,
పిదప 'మ' యనక పోయిన వెదకు కొనుచు
వచ్చి వానిని చేరును వదలకుండ. 91

తే.గీ. అటులగాక 'రా' తోడ 'మ' యనుచు రామ
నామ మొక పరైనను పల్కు నరుల వీడి
పాపసంకటములు వీగి పరుగు తీసి
తిరిగి రావిక భయముతో సురిగిపోయి. 92

తే.గీ. మలిన సంసార సాగర మగ్నులగుచు
నిరత తాపత్రయాభీల భరితులైన
నరుల కెపుడు శ్రీ రామాయణ శ్రవణమె
తగిన యౌషధమని రార్షతత్త్వవిదులు. 93

వ. ఇట్టి రామాయణ మహాకావ్య రచనోయుదంతం బెట్టిదనిన, 94

మ. మును త్రేతాంతమునందు శిష్ట జనసంపూజ్యుండు, యోగ్యుండునౌ
ముని వాల్మీకి తపోవిశేషమున నిర్మోక్ష వ్యపేక్షారతిన్



ఘన వేదాంత సుధా రహస్యము లెరుంగన్ గోరి, దీక్షాత్ముడై
మనమందున్ తగునట్టి మార్గమును సంభావించి చింతింపగన్. 95

కం. కృతయుగము గడచి నంతనె.
వెతతో నొక కాలు విరిగి విహ్వలమగుచున్
క్షతమై త్రేతాయుగమున
గతి చెడి ధర్మంబు మూడు కాళ్ళను కుంటెన్. 96

మ. వనటన్ కుందుచు వామలూరుభవు డా వాల్మీకి భూలోకమం
దున ధర్మంబు నశించుటన్ గనుచు నా దుర్యోగనాశంబుకై
ఘను డెవ్వండు భువిన్ జనించునొకొ విక్రాంతుండు నేడంచు వే
దనతోడన్ తలడిల్లి తీవ్రముగ సంతాపించు చున్నంతలో. 97

## 2.2.వాల్మీకి మునీంద్రుని వద్దకు నారదు డేతెంచుట

మ. వీణను చేతబట్టుకొని వెన్నుని నామము మాటిమాటికిన్
గాన సుధా స్రవంతి వలె కమ్మగ పాడుచు భక్తలోకమున్
దేనెల దేల్చి వీనులకు దివ్య వినోదము గూర్చు దేవతా
మౌని, త్రిలోకవందితుడు, మానుగ వచ్చెను నారదుం డొగిన్. 98

ఉ. ఊకువ వచ్చినట్టి ముని నుత్కము తోడను గాంచి ప్రీతి వా
ల్మీకి మహామునీంద్రుడు సమీప సమున్నత చర్మవేదిపై
వీక సుఖాసనమ్ము గొన వేడి, నమస్కృతిజేసి, పాదముల్
దాకుచు నర్ఘ్యపాద్యముల తర్పణ జేయుచు భక్తి నిట్లనెన్. 99

వ. "ఓ దేవసంయమివరేణ్యా! సర్వలోక సంచారులైన మీరు నా కుటీరంబున కేతెంచుటచే నేనెంతయో పుణ్యవంతుడనైతి. అంతియగాక నాకొక ధర్మ సంకటంబు కలిగిన సమయంబున తమ రాక నన్ను కృతార్థునిం జేయు మీ

కృపా సంకల్పమని భావించెద. కాన నా విన్నపం బాలించి, సందేహ విముక్తి జేయ ప్రార్థింతును. 100

తే.గీ. ఎవని ధర్మ మాదర్శ మీ భువిని సతము
నిత్య సత్య వ్రత మెవని నియమ మరయ,
నార్తజన రక్షకుం డెవ్వ డవనిలోన,
సుగుణ వర్తను డెవ్వడు జగతియందు. 101

తే.గీ. అతుల కరుణామయుం డెవ్వ డధికయశుడు,
సకల జీవుల సమదృష్టి సాకు నెవడు
జగతి కంటకుల కెవడు సంకటుండు.
బాహుబల సమున్నతుడైన ప్రభువెవండు. 102

తే.గీ. ఎవని నామంబు స్మరియింప నింపుకూరు,
నెవని గాథలు విన్నచో నెడద పొంగు,
నెవని ధ్యానింపగా గల్గు నిష్ట సిద్ధి,
ముక్తి మార్గ మెవ్వండు ముముక్షువులకు. 103

ఆ.వె. ధైర్యశాలి, దాత, దాక్షిణ్యపరు డెవ్వ
డార్ష ధర్మ రక్షణానుగామి,
కోపరహిత భావ గుణ వర్తనుం డెవ్వ
డతని నెఱుగ జెప్పు మయ్య నాకు. 104

కం. ఏవంవిధ సద్గుణ ఖని
నే వంకం గాంచవచ్చు – నిలపై గలడా,
ఓ వీణారవ లోలా!
నా వాంఛన్ తీర్పు మయ్య నారద మౌనీ!" 105



## 2.3. నారదుడు రాఘవేంద్రుని వినుతించుట

చం. అన విని నీరజాసనుని యానతి యౌటను లో దలంచి యా
మునివరు డెంతయో ప్రమద పూరిత దివ్య విమోహితాత్ముడై
ఘనభుజుడైన రాఘవుని గాథ నెఱుంగగ బల్కు కోర్కెతో
మనము చెలంగి పొంగ క్షణమాత్ర నిమీలిత హర్ష చక్షుడై. 106

కం. ఆతత కల్యాణ గుణుడు
ధాత కుమారుండు నారద మునివరుడు ప్రా
చేతసు నీక్షించి పలికె
చేతము పులకింప జేయు చిఱునగవులతో. 107

కం. "నీ వడిగిన గుణములుగల
పావను డెవ్వండు గలడు వసుధాస్థలిలో,
ప్రావగ నిలపై ధర్మము
బ్రోవగను పొలిచిన రామ భూవరుడు వినా. 108

కం. హరియే రాముని పేరన్
నరుడై జన్మించి ధర్మనాశన మాపెన్
తరమే యాతని నెన్నగ
పురసూదను కైనగాని పుణ్య ఋషీంద్రా. 109

కం. ఆ రాముని చరితము తీ
పారంగా తెలుపు ముంద రాదటతో నో
రారంగా నా దేవుని
నారాధన సేయు టొప్పు నంకిత భక్తిన్. 110

కం. అనిమిషుల కోర్కి మేరకు
నినవంశాంబుధి విధుడయి నిలపై శ్రీరా

ముని పేరన్ భవమంది భు
వి నేలిన పరమపురుషుని వినుతింతు హరిన్. 111

ఉ. శ్రీయు, వసుంధరా సతియు చేరి నుతింపగ శేషశాయియై,
పాయని దీక్ష సంతత మపార కృపాతిశయంబునన్ మహో
పాయముతోడ నీ జగతి వర్ధిల జేయుచు, మానవాళికిన్
ధీయుత శౌర్య ధైర్య వర దృష్టుల నిచ్చు నుపేంద్రు గొల్చెదన్. 112

ఉ. వాలును, విల్లు, నంబుపొది, బాణము ప్రన్నన బట్టి నేర్పుతో
నాలరి లోకకంటకుల నంతముచేయగ దీక్షబూని, తా
హేలగ భూమిపైన జనియించిన యట్టి మహాత్ము, పద్మజ
శ్రీలలనా మనోహరుని శ్రీహరి గొల్తు నభీష్ట సిద్ధికిన్. 113

శా. శాంతాకారుడు, సత్త్వమూర్తి, సురరాజస్వామియున్, శ్రీరమా
కాంతానాథుడు, నీలమేఘతనుడున్, కంజాతనేత్రుండు, స
ర్వాంతర్యామియు, పద్మనాభుడు, మునీంద్రధ్యాన గమ్యుండునౌ
ధ్వాంతారాతిని, జన్మ మృత్యు భయవిధ్వంసిన్ హరిన్ గొల్చెదన్. 114

తే.గీ. నీల నీరద సమదేహు, నీరజాక్షు,
వరగుణోపేతు, కౌస్తుభోద్భాసితాంగు,
పీత కౌశేయు, శ్రీవత్స పీనవక్షు,
హరిని వినుతింతు, సర్వలోకైకనాథు. 115

తే.గీ. శంఖ చక్రాన్వితుని, ఫుల్ల సరసిజాక్షు,
మకుట కుండల శోభితు, మంజులాంగు,
భూరి పీతాంబరుని, చతుర్భుజుని, హరిని,
హార కౌస్తుభ ధరుని నే చేరి కొలుతు. 116



తే.గీ. అజుని విశ్వేశు నీశు నవ్యయుని విధుని,
పద్మభవుని ప్రభుని, జగత్ప్రభుని, విభుని,
భజనసేయుదు నిశ్చల భక్తితోడ
భవభయంబులు తొలగంగ బ్రదుకునందు. 117

తే.గీ. పద్మపత్రవిశాలాక్షు, పరమపూజ్యు,
నమర సత్తము, భక్త జనానురక్తు,
కలుష భవరోగ నిర్మూలు, కమలనాభు,
ప్రణతి సేయుదు హరిని శ్రీవత్సవక్షు. 118

ఉ. వేయి శిరంబులున్, కనులు, వేయి పదంబులు, వేయిచేతులున్,
వేయి విశేష రూపములు, వేనకు వేలుగ నామసంజ్ఞలున్
ప్రాయి వహించి తేజ మమరంగ ననంత యుగంబు లూర్జిత
స్థాయి వెలుంగు పూరుషుని సాగి నుతింతు ననంతు నవ్యయున్. 119

ఉ. విష్ణుని భక్తపాలకు నభీష్ట వరప్రదు నచ్యుతున్ హరిన్,
జిష్ణుని రాక్షసాంతకుని చిన్మయరూపుని దేవదేవునిన్,
కృష్ణ పయోద సన్నిభ శరీరుని, మౌక్తిక రత్నహార రో
చిష్ణుని, శ్రీరమావిభుని – చేతుల నెత్తి నమస్కరించెదన్. 120

కం. రామా, రఘుకుల సోమా,
కామారి ప్రథితచాప ఖండన భీమా,
శ్రీమచ్ఛోభిత నామా,
వ్యోమాశ్రిత నీలకంధరోజ్జ్వల ధామా! 121

తే.గీ. రామచంద్రుని, జానకీప్రాణనాథు,
రఘుకులాన్వయ రమణీయ రత్న దీప్తి,

దశరథాత్మజు, నసుర విధ్వంసకరుని
పద్మనేత్రుని, నాజానుబాహు గొలుతు. 122

తే.గీ. ఏకపత్నీవ్రతుని, జగదేకవీరు,
జానకీ లక్ష్మణోపేతు, సన్నుతాంగు,
బంధిత జటా ముకుట ధారు, పరమపురుషు,
రక్తిగొల్చెద రాజేంద్రు, రామచంద్రు. 123

కం. లోకాభిరాముని ప్రథిత
కాకుత్స్థ కులజుని, చాపకౌశల్యు, ఘనున్,
లోకైక దయామూర్తిని,
సాకేతనిలయుని రామచంద్రు భజింతున్. 124

కం. ఎయ్యది ముక్తికి కారణ
మెయ్యది సుఖసంపదలకు హేతువు, త్రాసం
బెయ్యది యమరాజ భటుల –
కయ్యది శ్రీరామనామ మౌను మునీంద్రా! 125

కం. ఇడుముల బాపెడి నామం
బెడబాయని నిత్యసౌఖ్య మిచ్చెడి నామం
బొడగూర్చెడి యభిరామం
బడుగడుగున పలుకువాడ హరినామంబున్. 126

ఉపేంద్రవజ్ర మాలిక:
జయోస్తు శ్రీరాఘవ సార్వభౌమా!
జయోస్తు సీతా జలజాయతాక్షీ!
జయోస్తు శ్రీ లక్ష్మణ చారుమూర్తీ!



జయోస్తు వాతాత్మజ సన్నుతాంగా!
జయోస్తు నారాయణ సౌమ్యరూపా!
జయోస్తు ధాతా! జలజప్రభూతా!
జయోస్తు రుద్రేందు, వృషాగ్ని, సూర్యా,
జయోస్తు సప్తానల జంభభేదా!" 127

వ. అని నారద ముని శ్రీరామ, జానకీ, లక్ష్మణ, మారుతులను, శ్రీహరి, బ్రహ్మ, రుద్రులను, ఇంద్ర, సూర్య చంద్రాగ్నులను వినుతించి, మరియు నిట్లనియె. "ఓ వాల్మీకి మునీంద్రా! భూలోకంబున నీ నా డధర్మవర్తనులు, దుష్టస్వభావులు నైన రాక్షసులు విజృంభించి, ధర్మము క్షీణింప చేయుచున్న వైనము నీకు విదితమే గదా! ఈ ధర్మగ్లాని నాపుటకై, శ్రీమహావిష్ణువు తన ఏడవ అవతారముగ భూమిపై శ్రీరాముని పేరను జనించి సకల దానవ విధ్వంసంబు కావించుచు, ఆర్షమతోద్ధరణ మొనర్చుచున్నాడు.

ఓ సంయమీంద్రా, ఈనాడు భూమిపై వసించుచున్న శ్రీరామ నరేంద్రుడే ఇంతకు ముందు నీ వెఱుగ కోరిన సకల సుగుణవర్తనుండు. మహాత్మా! నీవు కృతార్థుండవు. ఏలన, ఈ సమయంబుననె శ్రీరామావతారంబు భూమిపై వెలసియున్నది. శ్రీ విష్ణ్వంశ సంభూతుడైన ఆ రాముని చరితంబు మహాద్భుతంబు. మహాపాతకనాశనంబు. మహాప్రస్థాన సాధకంబు.

ఈ ధర్మప్రతిపాలనా యజనంబున శ్రీరాముని కమిత సహాయకుడై, రామ గాథా సూత్రమందు తరళమై ప్రకాశించు వాడును, ఈశ్వరాంశతో వాయుదేవుని కుదయించిన వాడును, మహాబలశాలి, శ్రీరామభక్తుండు నగు హనుమంతుని మనము మునుముందు స్మరించు కొనుట శోభనదాయకమును, మంగళ ప్రదమును కాగల"దని, నారదుం డీ విధంబుగ ఆంజనేయుని స్తుతింప మొదలిడెను. 128

## 2.4. నారదుడు మారుతిని కీర్తించుట

తే.గీ. "రామదూతను, లక్ష్మణ ప్రాణదాత,
వాయుపుత్రుని, పింగాక్షు, ప్రాప్త రూపు,
అబ్ధి లంఘను, భూతేశు నంశవాని,
అతులబలవంతు హనుమంతు నభినుతింతు. 129

కం. చెంగావి రంగు మోమును
బంగారపు కొండవంటి ప్రాంచత్తనువున్,
చెంగున కల్పద్రుమముల
ముంగట నర్తించు వాయుపుత్రుని గొలుతున్. 130

కం. ఎక్కడ రాముని గొలుతురొ
అక్కడ శిరమున ముకుళిత హస్తుండగుచున్
దృక్కుల కన్నీరు వఱల
మ్రొక్కెడు దైత్యారి, కీశముఖ్యు నుతింతున్. 131

తే.గీ. అంజనానందను, జనకజార్తిహరుని,
దనుజసంహారు, నతిలోకఘనశరీరు,
ప్రణుత గుణధీరు, జగదేకవినుతశూరు,
కపివతంసు, లంకాభయంకరుని గొలుతు. 132

తే.గీ. అతులమైనట్టి బలమున కాటపట్టు,
మేరుపర్వత తుల్యమౌ మేని వాని,
నసుర జనవాస సంతాపనాగ్ని యైన
వాయునందను మనసార ప్రస్తుతింతు. 133



తే.గీ. పతితపావను, శ్రీరామ భక్త వరుని,
స్ఫూర్జిత సమగాత్రు, శుభ్రయశుని,
జ్ఞానులందున నుత్తమ జ్ఞాని యైన
వానరాధిపు వినుతింతు వాతజాతు. 134

తే.గీ. పారమెరుగని యబ్ధి గోష్పాదమట్లు.
భూరి బలమద దైత్యుల పుర్వులట్లు
చెనకి లొంగదీసిన కపిశ్రేష్ఠు గొలుతు,
దివ్య రామాయణ తరళ భవ్య దీప్తి. 135

తే.గీ. శ్వసన, మానసతుల్యమౌ జవమువాని,
నియమితేంద్రియు నతులమనీషియైన,
వానరవ్రజముఖ్యు, దుర్వారబలుని,
రామదూతను గొలుతు నిర్వ్యాజ భక్తి. 136

దండకం:

శ్రీ ఆంజనేయా! సితాంభోజ నేత్రా! మహా దివ్యగాత్రా! జగత్ప్రాణ పుత్రా! మహోదగ్రవేత్రా! సురద్వేష దాత్రా! గిరీశాంశ జాతా! నమో రామ దూతా! సుమిత్రాసుత ప్రాణదాతా! నమో బ్రహ్మ తేజా! వివస్వంతు నంశోద్భవుండైన సుగ్రీవుకున్ మంత్రివై నీవు శ్రీ రామ భూపాలుతో సఖ్య మొప్పంగ జేయించి, ఆ వాలి దున్మించి, సుగ్రీవు కిష్కంధ పట్టంబు కట్టించి, శ్రీరామభూజాని భార్యామణిన్ జానకిన్ దైత్యుడౌ రావణుం డెంతయో మాయ గొంపోయి దాచంగ, నా స్వామి యాజ్ఞానుసారంబు నీ వంత యా దేవికై దక్షిణాంభోధి లంఘించి, శ్రీలంక వేజేరి, ఆ లంకిణిన్ జంపి, ఆ దీవి గాలించి వైదేహినిన్ గాంచి, శ్రీరామ ముద్రన్ సమర్పించి, నీ భర్త వైళంబు గొంపోవు నిన్నంచు ధైర్యంబు తెప్పించి, దైత్యేంద్రు గర్వంబు నిర్మూలముం జేయ సీతమ్మ బందీగ నున్నట్టి ఆరామమున్ గూల్చి ఆ తోట రక్షించు యోధాళినిన్ మొత్తగా

నుగ్రుడై దైత్యు డస్తోక సైన్యంబుతో పుత్రుడౌ అక్షునిన్ బంప, నీవంత క్రోధించి దోర్వీర్య మొప్పంగ నవ్వాని సంహారమున్ జేయ, వాలంబు మర్దింప బుస్సంచు వేలేచు నాగంబు బోలంగ కోపించి ఆ రావణుండంతలో నింద్రజిత్తైన ఆత్మోద్భవున్ మేఘనాదున్[1] జయోత్సాహు నీపైకి బంపంగ, నీవున్ దశగ్రీవు దర్శించు నిచ్ఛా పరీతుండవై లేచి స్వచ్ఛంద మార్గాన బ్రహ్మాస్త్ర బద్ధుండవై రావణాస్థానమున్ జేరి ఆ రాక్షసాధీశుతోడన్ కులస్త్రీని మోహించి బంధించుటల్ పాపమే గాక, నీ ప్రాణముల్ దీయు, నీ వంశ నాశంబు తథ్యంబు శ్రీరాము బాణాగ్నిచే గాన సీతామహాదేవి శ్రీరాము కర్పించి ఆ స్వామి పాదంబులన్ తాకి రక్షించగా వేడుమా యంచు ధర్మంబు బోధింప, వా డల్గి నీ తోకకున్ నిప్పు ముట్టించ, నీ వంతలో శృంఖలల్ ద్రెంచి, గర్జించి జృంభించి నీ వాలమున్ ద్రిప్పి జ్వాలల్ రగిల్పించి లంకాపురిన్ గేహముల్, చైత్యముల్, హట్టముల్, కోష్టముల్, గోపురంబుల్, నిశాంతంబులున్, కుడ్యముల్, కుట్టిమంబుల్, చతుశ్శాలలున్, ఆయుధాగారముల్, పానశాలల్, గజాశ్వాది వాసంబులున్, రాజ హర్మ్యంబులున్, రాణి వాసంబులున్ వీతిహోత్రాహుతిన్ జేసి, సంతోషివై వేగ సంద్రంబునున్ దాటి, నీ మిత్రులున్, భృత్యులున్, సైనికుల్ మెచ్చ శ్రీరామునిన్ జేరి, వైదేహి క్షేమంబు వాక్రుచ్చి, సీతా శిరోరత్నమున్ గుర్తుగానిచ్చి, సాక్షాత్తుగా శ్రీమహావిష్ణువౌ రామసర్వంసహాధీశు సంతోషభూతుండవై, ప్రీతి పాత్రుండవై, స్వామి దాసాను దాసుండవై మించు నిన్నెంచి కీర్తింతు నో ఆంజనేయా! మహాదివ్య తేజా! ప్రపూతాత్మసంవాస! నిన్‌గొల్చు భక్తాళినిన్ క్షాంతి వీక్షించి రక్షించి కాపాడు మయ్యా మహావీర! ఓ దివ్య దేహా! నమస్తే! నమస్తే! నమస్తే! నమః!" 137

వ. అని, ఆ విధంబున మారుతిని ప్రశంసించి, నారదుడు తిరిగి ఇట్లనియె, "ఓ వామలూరు ప్రభవా! రావణాది భయంకర దానవశ్రేణిని వధించి, కుంటు బడిన ధర్మంబును పునరుద్ధరించిన పురుషోత్తముడగు శ్రీరాముని దివ్యచరితంబు నేను నీ కిపుడు సూక్ష్మంబుగా నెరింగించెద, విను"మని, 138



## 2.5. రామాయణ సంగ్రహము

సీస మాలిక.

శ్రీవిష్ణునంశాన శ్రీరామ జననంబు,
లక్ష్మణుండు ననుజుల ప్రభవంబు,
కౌశికాగమనంబు, కాననయానంబు,
కలుషదానవి తాటకహననంబు,
నసురుల నాశంబు, యజ్ఞ నిర్వహణంబు,
పొలతి అహల్యా విమోచనంబు,
మిథిలకు పయనంబు, మృడ ధనుర్భంగంబు,
వైదేహితో రామ పరిణయంబు,
జనక, దశరథుల సరస సంతోషంబు
లంతలో భార్గవు నాగమంబు,
రాఘవేంద్రునితోడ ప్రథన ప్రయత్నంబు,
పరశురాముని భూరి పరిభవంబు,
శ్రీరామ పట్టాభిషేక సన్నాహంబు,
తల్లి కైకేయిచే స్తంభితంబు,
రాముండు సీతయు లక్ష్మణ సహితంబు
దండకారణ్య పథపయనంబు,
పొలువుగా పలువురు మునుల పరిచయంబు,
దుర్మార్గులైన దైత్యుల వధంబు,
పూని శూర్పణఖకు ఘ్రాణ విదళనంబు,
ఖరదూషణాదుల ఖండనంబు,
మాయావి రావణు మహిత దుర్యోగంబు
జనకసుతను చెరగొను విధంబు
రమణి సీతను బాసి రాముని తాపంబు,

వెత జటాయువు తెలిపిన విధంబు,
నాపై కబంధుని శాపోపశమనంబు
వేచిన శబరికి మోచనంబు,
పదపడి పయనంబు, పంపావలోకంబు,
నా చెంత ఋష్యమూకాచలంబు,
నంజనా సుతుడైన హనుమ యాగమనంబు,
మలపైన సుగ్రీవు మంతనంబు,
నతులమౌ మైత్రికి నగ్ని ప్రమాణంబు
చూపి రామ బల నిరూపణంబు,
వానర శ్రేష్ఠుండు వాలి సంహరణంబు,
నిరతిని జనకజాన్వేషణంబు–
ఆంజనేయుడు దక్షిణాశకు పయనంబు,
లాఘవమున నబ్ధి లంఘనంబు,
లఘు వేషధారియై లంకా ప్రవేశంబు,
వీకతో సీతావలోకనంబు,
నామెకు వివరించి రాముని కుశలంబు
నంగుళీయము ప్రీతి నర్పణంబు,
నుద్వేగియై చేసి యుద్యాననాశంబు
కావించి ఘోరరాక్షస వధంబు,
రావణు కడకేగి రాముని శౌర్యంబు
ప్రకటించి తగ డించి వాని డంబు,
కార్చిచ్చుతోడ లంకా గృహ నివహంబు
నగ్ని కాహుతిచేయు నద్భుతంబు,
వచ్చి కిష్కుంధకు వైదేహి క్షేమంబు
వినిపించు విధము, రాముని ముదంబు–



వానరాధిపు నాజ్ఞ వానర యూథంబు
కదనుకై కదలి లంకాగమంబు,
వారిధి నొకదాని వానరసైన్యంబు
ఉదధిపై నిర్మించు నుద్యమంబు –
అంకించి కపిసేన లంకా ప్రవేశంబు,
జాంబవందాదుల సాహసంబు,
కనివిని యెరుగని కదనసంరంభంబు,
నక్తంచర పృతన నాశనంబు,
నంగద, సుగ్రీవ, హనుమంతుల బలంబు
లక్ష్మణస్వామి యలఘు జయంబు,
రావణు యుద్ధంబు, రాక్షసతంత్రంబు,
పంక్తికంఠుని ధనుఃపాటవంబు
రాముని యసమాన రణరంగశౌర్యంబు
రమణీయ కార్ముకప్రాభవంబు
ముందు నిలువలేక పోయిన వైనంబు,
పంక్తికంఠుని తలల్ పడు విధంబు,
రాముని బాణాన రావణు మరణంబు,
పొలుపుగా సీతావిమోచనంబు,
రామాదు లంతట రహిని విమానంబు
పైన కోసలకు నుపాగమంబు,
ననుజుడు భరతుని యంగ ప్రణామంబు,
శ్రీరామపట్టాభిషేచనంబు –
అడగక ధర్మంబు సడలక న్యాయంబు
ప్రతిభతో సామ్రాజ్యపాలనంబు

ఆ.వె. రామరాజ్య మనుచు ప్రజలు తరతరంబు
లొక్క రీతి పొగుడు లెక్క చేసె"
ననుచు సంగ్రహించి మునికి రామ చరిత
తెలిపి నారదుండు తిరిగి పలికె. 139

తే.గీ. "రాము డేలిన రాజ్యాన ప్రజల కెపుడు
తినగ పుష్కలంబుగ మంచి తిండి దొరుకు,
నొడలి నిండుగ కట్టంగ నుడుపు లుండు,
వాసముండంగ సరియైన వసతు లుండు, 140

తే.గీ. మోస మను మాట వినిపించ బోదు వినగ,
లంచగొండితనము కనిపించ దెచట,
సత్యమేగాని పలుకరు నిత్య మెవరు,
క్రౌర్య చౌర్యముల్ సుంతైన ప్రబల వెపుడు. 141

తే.గీ. భూతలంబున పతనమై పోవుచున్న
ఆర్ష ధర్మంబు తిరిగి నిష్కర్ష నిలిపి,
ఇద్ధరను న్యాయ ధర్మంబు లుద్ధరించి
ధరణి పాలించె రామచంద్రప్రభుండు. 142

తే.గీ. ఆ విధంబున జనులెల్ల నలరు చుండి
స్వర్గ మేలయ్య మాకు కోసలయె మేలు
రామచంద్రుని పోలిన భూమివరుని
కానబో మనుచు మురిసి యాన వెట్ట. 143

వ. 'నభూతో నభవిష్యతి'గా నీ జగతి నేలె. అట్టి మహాత్ముండైన రాఘవేంద్రుని చరితంబు శ్రీమద్రామాయణంబను పేర దివ్యేతిహాసంబుగ నీవు రచించవలెనని,



జగత్సృష్టి కారకుండు, సకల జీవకల్యాణేచ్ఛామానసుండునగు విధాత యభిమతంబు. ధాత అభినివేశానుసారంబు రామాయణమును సవిస్తరంబుగ గ్రంథ రూపంబున నాలపించుము. ఆ దివ్యకావ్యం బాచంద్రతారార్కంబు భూమిపై వర్ధిల్ల గలదు. దీనం జేసి నీవు కవీంద్రునిగా శాశ్వత ప్రతిష్ఠ నొందుటయే గాక నిత్య వైకుంఠ సామ్రాజ్య నివాసుండ వౌదువ"ని పలికి, నారదుండు వాల్మీకిని వీడ్కొని, గగనమార్గంబున నిచ్ఛారతి నేగె. 144

## 2.6. తొలి శ్లోకావిర్భావ వృత్తాంతము

కం. నారదముని పలుకులు ప్రియ
మారిచి తన మనమునను సుమాళము గూర్చన్,
సారమతిన్ ప్రాచేతసు
డా రాముని చరిత వ్రాయ నాతురపడుచున్. 145

వ. నారద మహర్షి తనకు తెలిపిన రామగాథ నే విధంబుగ విపులీకరించి వ్రాయుదునా యని మనంబున నుద్విగ్నుండై తర్కించు కొనుచుండ, మార్తాండుండు నభోతల మధ్యస్థుండయ్యె. 146

కం. మధ్యాహ్న మగుట చండ
ప్రద్యోతను కర్ఘమీయ ప్రాచేతసుడున్,
విద్యార్థి భరద్వాజుం
డుద్యమితుం డగుచు వెంట నుండగ ప్రీతిన్. 147

కం. ఆ మునిసింహుం డేగెను
నేమముగా స్నానమాడ నిర్మలజలసం
స్తోమము, ఘనతటయుతమున్
తామసగుణహరణమైన తమసానదికిన్. 148

ఉ. స్నానముచేసి యాశ్రమము చాయకు పోవుచునుండ గాంచె నా
మౌనివరుం డొకానొక ద్రుమంబున చక్కని క్రౌంచ యుగ్మమున్
మానిత రీతి సమ్ముదిత మంజుల మార్దవ రాగ సంయుతం
బైన మనోజ భావ రవ మద్భుతరీతిని చేయు పక్షులన్. 149

తే.గీ. ఆ దరి నిలిచి బోయొక డదను జూచి,
పతగయుగ్మ మందున మగపక్షి వెంట
నాశుగ మొకదాని వదలె – నా క్షణంబ
బాణ ధాటికి నేల నా పక్షి కూల. 150

తే.గీ. క్రింద పడినట్టి జతగాని పొందు జేరి
క్రౌంచి నేలపై దొర్లుచు అంతు చేసె
కీచు కీచురనుచు నార్చి – చూచువారి
కండ్లు చెమరించి గుండియల్ కరగిపోవ. 151

కం. అదిగని వాల్మీకి తపసి
యెద వికలంబై కలగగ నీసున క్రోధం
బుదయించి నిషాదుని మన
మదర నతులముగ శపించె నభిశంసనతో. 152

ద్విపద. [2]ఓయి నిషాద! దుర్యోచనాశీల!
తీయనౌ సౌఖ్యాల దేలేటి వేళ,
క్రౌంచయుగ్మాన మగపులుగు నీవు
వంచి కోలను ద్రుంచి పాపివై నావు!
కాన నీవిక చాల కాలంబు దాక
హీనుడై నిందకు లోనౌదు గాక! 153



కం. ఆభీలంబుగ నీ విధి
క్షోభన్ ముని పలికిన పలుకులు మృదు మధురం
బై భువిని దేవ భాషను
శోభిల్లుచు రూపుగాంచె స్ఫూర్తి ప్రదమై. 154

ఉ. నాలుగు పాదముల్ గలిగి నవ్యముగా సమత్యులమానమై,
మేలుగ పాదపాదమున మించక తగ్గక నెన్మిదక్షరాల్
మాలిక వోలె నల్లుకొని మంగళదాయక మయ్యె, నెంతయో
వీలుగ నృత్య గీతముల వీణను పాడుట కొప్పు చందమై. 155

కం. అందం బొప్ప ననుష్టుప్
ఛందంబున నొక వినూత్న చంచత్ కృతియై
సందర్భ శుద్ధితో భవ
మందిన వాక్యము గని ముని యానందముతో. 156

వ. శిష్యుడు భరద్వాజునిచే నా వాక్యంబు మరల మరల పఠింపజేసి ఇట్లనియె. 157

కం. నే కోపంబున శకునుల
శోకంబున కలిగి పలుకు సూక్తి సరస సు
శ్లోకంబై నొప్పె నిదియు
శ్లోకంబను పేరునొందు లోకములందున్ 158

తే.గీ. భావి తరముల రానున్న పద్యసృష్టి
శ్లోక నామంబున బఱగు గాక! శ్లోక
మెప్పుడు కవిత్వ జగతిని మెప్పు బొందు,
రమ్యమై యొప్పు సాహితీ ప్రక్రియగను! 159

ఉ. ఈ విధి సాహితీ జగతి నేల వినూతన సృష్టి యయ్యెనో,
ఆ విధియే యెఱుంగు నని యద్భుత మోదమునంది శ్లోకమున్
వేవిధులన్ పఠించుచు వివేచన తోడ పరాకు నందుచున్
భావి తలంపులన్ మనము ప్రావృతమైచన సద్మమేగుచున్. 160

## 2.7. బ్రహ్మ వాల్మీకిని రామాయణము రచింప నానతిచ్చుట

వ. ఆశ్రమ పూజాగృహంబు జొచ్చి సుఖాసనంబుండి, బ్రహ్మధ్యానావలంబితుండై తన నోట వెలువడిన శ్లోకావిర్భావ కారణ విచారంబు సేయుచున్నయెడ, 161

ఉ. ఇంచుక కాలమేగగను సృష్టి విధాత, సమస్తమైన ప్రా
పంచక జీవరాసులకు ప్రాకృత కర్మల మోముపైన వ్రా
యించెడు ధాత, వేదముల నిచ్చ పఠించుచు నేగుదెంచె రా
యంచ పయిన్ ముదం బొనర నా మునివాటికి నున్నపాటుగన్. 162

కం. అనుకొనని రీతి నేతెం
చిన చతురాననుని గాంచి చిత్తము మోదం
బును, సంభ్రమంబు నొకపరి
పెనగొన వాల్మీకి మౌని వివశాత్ముండై. 163

వ. వినీతుండు గావున క్షణకాలంబుననె మనంబును వినమితం బొనరించి, దిగ్గన లేచి పరమేష్ఠి నున్నతాసనంబునం దాసీనుంగావించి, అర్ఘ్య పాద్యాదులచే పూజించి, పునఃపునః సాష్టాంగ దండప్రమాణంబు లాచరించి, వేద మంత్రంబులచే వినుతించిన, 164

ఉ. దీవెనలిచ్చి ధాత ముని దీధితిమంతుని లేవదీసి, ప్రే
మావహమొప్ప నిట్లనియె, "నబ్బురమేల మునీంద్ర! నా కృపన్



పావని వాణి నీ వదనవారిజమం దుపవిష్ట యౌచు, నీ
భావననే మనోజ్ఞమగు వాక్యముగా పలికించె నేర్పుతో. 165

కం. శ్రీకరమగు నా వాక్యము
ప్రాకటముగ నొప్పి సుజన రంజక మగుచున్
శ్లోకంబయ్యె, నదియు సు
శ్లోకంబై వెలయు భువిని సుందరతమమై. 166

ఉ. ధన్యుడ వీవు సంయమి వతంస! కవీంద్రుడవౌచు గొప్ప ప్రా
ధాన్యము నొందువాడవు; సదా సుర భారతి నీ రసజ్ఞ న
న్యోన్యముగా రహించి నిను నోమును గాత నిరంతరంబుగన్,
పుణ్యుడు రామమూర్తి కథ పూర్తిగ ద్యోతకమౌను నీకికన్. 167

కం. వీకన్ వ్రాయగ బూనుము
ప్రాకామ్యత నా దశరథ రాముని గాథన్,
శ్లోకంబులలో మధురస
లోకంబులు చూపు వామలూర ప్రభవా! 168

కం. పాడుము రాముని చరితం
బాడుచు తలలూచి జనము లలరెడు భంగిన్,
వేడుక మామిడి మెసవుచు
పాడెడు పుంస్కోకిలట్లు పావనచరితా! 169

ఉ. కల్యాణాత్మకమైన రామకథ నీ గంటాన వెల్గొందు, కౌ
సల్యా నందను గాథ విన్న ప్రజకున్ సమ్మోదమున్ గల్గు, సా
కల్యం బేర్పడి సర్వపాపములు జోకల్ వీడు, పైపెచ్చు కై
వల్యంబున్ సమకూరు నీ రచన నాస్వాదించు భక్తాళికిన్. 170

తే.గీ. నీవు వ్రాయు ప్రతిపదము నికరమగును,
ఊను ప్రతివాక్కునను పుట్ట తేనె లొలుకు,
పట్టు శబ్దంబు లన్నియు వ్యాకృతులగు,
భారతీదేవి నీ నోట వఱలు కతన! 171

కం. సదృశస్పందన చెడకను
చదలందున పుష్పవంత సదృశ గ్రహముల్
చెదరక యున్నంత వరకు
పదిలము నీ గ్రంథ కీర్తి పావన మూర్తీ! 172

కం. పర్వత, నది, జలనిధు లీ
సర్వంసహ నున్న దనుక శాశ్వతమగుచున్
పర్వును నీ ఖ్యాతి సమ
స్తోర్వీ లోకముల వల్మికోద్భవ మౌనీ!" 173

కం. అని మునితో బలుకుచు, నా
క్షణంబ యాసనము నుండి చతురాస్యుడు చ
య్యన మాయమయ్యె, వచ్చిన
పనియైన పిదప నిలుతురె ప్రజ్ఞావంతుల్. 174

## 2.8. వాల్మీకి రామాయణము వ్రాయ మొదలిడుట

కం. తదుపరి మునియును శిష్యులు,
విధి చెప్పిన విషయములు వివేచన తోడన్
పదిమార్లు చర్చ సేయుచు
ముదమందిరి భావి కాల మూర్ధన్యతకున్. 175

వ. అంత, 176



సీ. శిష్యులు చేయెత్తి జేకొట్టి శ్లోకంబు
పలుమార్లు పాడుచు వల్లెవేయ,
సరసను చేకట్టి ఛాత్రులు భక్తితో
పరిచర్య లొనరింప నొరిగి యుండ,
వీవన చేపట్టి వెన్నంటి నతిని భ
రద్వాజ ముని యాదరమున నిలువ,
శుక్త సుఖాసన సుస్థిరాసీనుడై
ఇష్టదైవంబు ప్రార్థించి తుష్టి,
తే.గీ. పంచ భూతాల, నష్ట దిక్పతుల, గురుల,
సరసిజాసను, గీర్వాణి, సిరిని, శౌరి,
నద్రిసుత, రుద్ర, విఘ్ననాయకుల తలచి,
వ్రాయ బూనె వాల్మీకి శ్రీరామకథను. 177

వ. ఆ విధంబుగ శుభలగ్నంబున వాల్మీకి సంయమీంద్రుడు తన పూజా గృహంబున తూర్పు మొగంబులు గలుగునట్లు దర్భలు పరచిన చిత్రాసనంబుపై సుఖోపవిష్టుండై, జలము నాచమించి, విటంక విటంకితనిభంబైన వాలునుం బోలు వాలారు మొనగల గంటం బుత్కంత చేపట్టి భూర్జపత్త్రంబుల పొత్తంబుపై ఓంకార, శ్రీకారంబులు తొలుదొల్త లిఖించి శ్రీరామయణ ప్రబంధరచనా రంభంబు గావించి, 178

చం. ఇరువది నాల్గు వేలు పయి నింపగు శ్లోకము లొప్పు రీతిలో
సరిగను సప్త కాండములు, సర్గము లర్ధ సహస్రముండు న
ట్లరిదిని వామలూరు భవు డద్భుత రీతి సృజించి వ్రాసె సుం
దరతమ వాక్సుధా ఝురులు ధారుణిపై ప్రవహించి పారగన్. 179

కం. ద్రష్టయగు నా మునివరు డ
నుష్టుప్ ఛందమున ప్రీతి నుడివెను శ్లోకా

లిష్టి ననేకంబులు సం
తుష్టిన్ రాముని చరిత్రను ప్రమాణముగా. 180

ఉ. ఎక్కడ చూచినన్ సొగసు లెక్కడ చూచిన వర్ణనంబు లే
దిక్కున చూచినన్ సరస దృబ్ధ విశిష్ట సుశబ్ద పూరమౌ
వాక్కు లలంకృతుల్, మధుర వాక్య సమాహిత ధర్మ సూక్తు లిం
పెక్కెడు రీతి మౌని రచియించె రఘూద్వహు నైతిహాసమున్. 181

తే.గీ. మధుర మంజుల శబ్ద సంపదలతోడ,
సరస సుమనోజ్ఞమౌ సమాసముల తోడ
అతుల సుందరాలంకార తతులతోడ,
చవులు పుట్టెడు బహు వర్గచయముతోడ, 182

తే.గీ. తగిన స్పష్టాక్షర సమన్వితంబులయిన
మంచి వ్యుత్పత్తి, శబ్దార్థ సంచయముల
శాస్త్రసమ్మత మైనట్టి సంధు లొనర,
ప్రజ్ఞ రచియించె నా మౌని రామకథను. 183

తే.గీ. సుజన పాఠక వరులార! శ్రోతలార!
దైవ భక్తి పరాయణోద్దండులార!
రామ చరితామృతాస్వాద రక్తులార!
రండు చవిచూడ శ్రీరామ రస విభూతి! 184

---

**వివరణలు:**

1. రావణుని పెద్దకుమారుడు తపస్సంపన్నుడై, ఇంద్రుని యుద్ధమందు ఓడించిన కారణంగా ఇంద్రజిత్తను పౌరుష నామము సంక్రమించినది. కాని అతను పుట్టినపుడు పెట్టినపేరు మేఘనాదుడు. అంటే మేఘము వలె గర్జించు కంఠధ్వని వాడని, కొన్ని రామాయణములలో ఇది మేఘనాథు డని ('ద' కాక 'థ గా) వ్రాసి యున్నది. వాల్మీకి



రామాయణ వివిధ ప్రచురణలలో రెండు భేదాలను వాడారు. కాని, ఇతడు మేఘాలకు నాథుడు అనడం కంటె మేఘనాదుడనే పేరే సమంజసం. ఇదే ఈ గ్రంథంలో వాడబడింది.

2. వాల్మీకిమహాముని నోటివెంట నిషాదునిపై కోపముతో వెలువడిన సంస్కృత శ్లోకం (ఇదియే ప్రపంచ వాఙ్మయంబున తొలి శ్లోకం):

శ్లో॥ మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీస్సమాః
యత్క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్॥

***

# బాలకాండ

## 3. పుత్రకామేష్టి ఖండము

కం. శ్రీకైలాస నివాసా!
శ్రీకంఠా! భీమలింగ! శివ దేవ విభూ!
శ్రీ కాళేశ్వర నాథా!
శ్రీకరిముఖ సంయుత! భవ! శ్రీశైలేశా! 185

వ. దేవా! త్రిలింగరూపా! శివానందా! నే చెప్పంబూనిన శ్రీమదాంధ్ర శివానంద రామాయణంబున ప్రథమంబగు బాలకాండ కథాక్రమం బవధరింపుము. 186

### 3.1.కోసల రాజన్యులు.

సీ. ఎవ్వాని చిద్విలాసేచ్ఛాతిశయముచే
నీ విశ్వములు సృజియింపబడునొ,
ఎవ్వాని సంకల్ప హేలానుకంపచే
చైతన్యవంతమై జగతి మనునొ,
ఎవ్వాని యానతి నీ భువి భౌతిక
కర్కశ సూత్రాల కట్టుబడునొ,
ఎవ్వాని కరుణార్ద్ర వృష్టిపాతంబున
నీరేడు లోకాలు తృప్తి గనునొ,
తే.గీ. అట్టి విశ్వేశు జటనుండి యవని జేరి
ప్రాభవోద్దీపితయగు గంగాభవాని
భరతదేశాన ప్రవహించి నిరతి తోడ
పావనుల జేయు నీ దేశ ప్రజల నెపుడు. 187

కం. ఆ మందాకిని కుపనది
సామంత మహా స్రవంతి సరయూ నదికిన్

సామీప్యంబున కోసల
నామంబున దేశమొకటి నలువుగ వెలసెన్. 188

తే.గీ. తోటి రాజ్యాల యందున మేటియైన
ప్రథిత కోసలయందు పూర్వంబు నుండి
సూర్యవంశరాజన్యులు శౌర్య ధనులు
ప్రతిభ దీపింప పాలించి రతుల శ్రద్ధ. 189

సీ. ఏ తేని ప్రఖ్యాతి నెరుగ జేయంగను
భూమికి [1]పృథ్వియన్ నామ మమరె,
ఏ నృపాలుని పేరు నిలపైన నిలుపంగ
జలధి సాగరమని పిలువ బడెనొ,
ఏ రాజ సంయమి ఈశ్వరు మెప్పించి
గంగను భువికి దిగంగ జేసె,
నే మహావీరుండు భీమ బలుండు కాం
భోజాది దేశాల పోర గెలిచె,
తే.గీ. నట్టి విక్రమ గుణగణు లమర సములు,
సాహసోపేత ప్రతిహతి సమరయశులు
పృథువు, సగర నృపుడు, భగీరథుడు, రఘువు
మొదలుగా భూపు లేలిరీ భూమి మున్ను. 190

వ. తులలేని పరాక్రమవంతులు, సౌజన్యగుణగరిష్ఠులునైన వారలీ వంశంబునం దుద్భవించి కోసలను పరిపాలించిన కారణంబున నీ సూర్య వంశంబు, ఇక్ష్వాక, కాకుత్స్థ, రఘు వంశంబులను నామాంతరంబుల ప్రసిద్ధి గాంచెను. 191

తే.గీ. ఉత్తమోత్తమ రీతి నీ యుర్విపతులు,
న్యాయమార్గంబు నెన్నడు బాయకుండ,



ధర్మబద్ధంబుగా ప్రీతి ధరణి నేలి
పౌరరంజకులుగ పేరు బడసినారు. 192

కం. ఈ పుడమిన్ రవి కాయును
తాపము సమతుల్యమగుచు తారాడంగా,
నా పుడమిని రవికులజులు
ప్రాపుగ కాయుదురు జనులు రంజిల్లంగన్. 193

కం. ఫలవంత మైన నేలల
జలసంపద కోరినంత సరయువు నింపన్,
తులలేని పాడి పంటల
నిలయంబై కోసలంబు నెగడును భువిలో. 194

కం. ఆ కోసలకు మకుటమై,
సాకేతమను పురమొకటి చక్కగ వఱలెన్,
నాకమునకు మకుటంబై
ప్రాకటముగ వెలసిన అమరావతి వోలెన్. 195

వ. అయోధ్య యను నామాంతరము గలిగి, 196

తే.గీ. వాసిగ గగనోన్నతమయి, భాసురముగ
వివిధ మణిరత్న ఖచిత ప్రవిమల కల్పి
తములయిన బహుచిత్ర సౌధములతోడ
పుడమి నొప్పారు సాకేత పురవరమ్ము. 197

కం. ధీమంతులు భూదేవులు,
ఖామందులు సకల శస్త్రకౌశలవంతుల్,

శ్రీమంతులు బేహారులు
శ్రామికులై ప్రజల సాకు రైతులతోడన్. 198

కం. విద్యలలో ప్రథమము, విలు
విద్యలలో వేత్తలైన వీరులతోడన్,
సేద్యముతో శ్యామలమై
సద్య స్సౌభాగ్య మొప్పు సాకేతపురిన్. 199

తే.గీ. అచటి వేదవిదులు నిగమాగమముల
సూక్ష్మముల పరిశోధించు చుందురెపుడు,
అచటి యాయజూకలు నూత్న యజనములను
దీక్ష జనుల మేల్గోరి శోధింతు రెపుడు. 200

తే.గీ. అచటి వీరులు క్రొంగ్రొత్త యంత్రములను
నిరతితో పరీక్షింతురు నేర్పుమీఱ,
అచటి రైతులు నూత్నసస్యముల వృద్ధి
పరుప సతతంబు యత్నముల్ జరుపు వారు. 201

తే.గీ. అచటి వ్యాపారు లనుపమ వ్యాపకముల
క్రొత్తగా కల్పనము జేసి కోర్కె తీర
జగతి జనుల వస్తు చయముల గొన చేతు
రవసరంబైన లేకున్నవైన గాని. 202

మ. జనసామాన్యము సౌఖ్యవంతులయి, ప్రజ్ఞా దేహ సంపన్నతన్
తనివిన్ జెందుదు రా పురిన్, నిలుపుచున్ ధర్మంబు, న్యాయంబు చే



తనులై వారు పురోగమించెద, రుపాధ్యాయుల్ సమీచీన శో
ధన సంకల్పత దేశ సంస్కృతికి నుత్సాహంబు చేకూర్చగన్. 203

శా. దేశంబందున పండితవ్రజములున్ దీప్తిన్ వినూత్నప్రయో
గాశాశీలత శాస్త్ర శోధనల నుద్ఘత్ ప్రౌఢ జిజ్ఞాసతో
ప్రాశస్త్యంబున నిర్వహింతురు సదా భైషజ్య సంప్రాప్తికై,
దేశాభ్యున్నతికై, ప్రజా హితముకై, దివ్యాస్త్ర సంవిత్తికై. 204

తే.గీ. అచట పుట్టిన అల్పజుండైన గాని,
సత్యసంధుండు, నిరుపమ శాంతమూర్తి,
ధర్మ మార్గావలంబు డద్వైతవర్తి,
వృత్తి యందున మేటి సంవేది యతడు. 205

## 3.2. దశరథ మహారాజు

తే.గీ. అటుల నభివృద్ధి జెందిన యవని నిపుడు
దశరథుండనెడు నృపతి, ధర్మచరుడు,
నిత్య సత్యవ్రతుండు, ననిమిష సమ భు
జ బలు డేలుచుండె నతి సౌజన్యమూర్తి. 206

కం. జనులకు సౌఖ్యము కలుగగ
ఘనుడగు దశరథ జనపతి కరుణామయుడై,
తనువును మనమును నంకిత
మొనర్చి అసదృశు డయోధ్య నుద్ధతి నేలెన్. 207

[2]సీ. ఒంటి చేతను శాత్రవోన్మాదము నడంచె,
భుజయుగ్మ బలమున భువిని గెలిచె,

మూడు ధర్మంబుల ముప్పొద్దు నిలిపెను,
వేద చతుష్టయ ప్రోదిపట్టు,
పంచబాణుని రూపు మించిన మొనగాడు,
నంగషట్కములకు నధిపుడతడు,
సప్తస్వరాన్విత సంగీత రసధుని,
అష్ట సేనాంగ సంయద్వరుండు,
తే.గీ. నవనిధులు తన కోశమున గలవాడు,
దశరథంబుల రథికుండు దశరథుండు,
నిత్య సత్యవ్రత నియమ నిష్ఠుచరుడు,
అవనిపతులకు మకుటమై యడరుచుండె. 208

తే.గీ. అతని ధర్మపత్నులు ముప్పు రతులిత గుణ
గణలు, కౌసల్యయు, సుమిత్ర, కైక లనగ,
ఘనలు రతిరూప సౌందర్య కంజముఖులు,
పరమ సాధ్వీమతల్లులు, నిరతిశయలు. 209

కం. ఇంతటి ప్రతాపవంతున
కింతటి ధర్మజ్ఞుడైన యినకులజునకున్
సంతతి లేకను హృదయ మ
శాంతి గ్రస్తంబు నయ్యె క్షాంతి నశించెన్. 210

కం. సుతులను పొందగ దశరథు
డతుల వ్రతముల ననేక మనుపమ దీక్షా
వ్రతుడై, నిజ పత్నీ సం
యుతుడై జరిపించె గాని యొదవక పోయెన్. 211



## 3.3. దశరథుడు అశ్వమేధ మాచరింప తలచుట

మ. ఒకనాడా నృపుడెంతయో కుమిలి సూర్యున్ కొల్చు చుండంగ, ఘో
టక మేధోయజనంబు సల్పిన నిరాటంకంబుగా పుత్రులన్
మకరాంక ప్రతిమాన రూపసులు, సమ్యగ్ జ్ఞానసందీప్తులౌ,
నకలంక స్థిర కీర్తులన్ కనగ వచ్చంచున్ మదిన్ తోచినన్. 212

కం. అమితోత్సాహము తోడను
ప్రమనత కబురంపె నాంతరంగిక సచివున్
విమలగుణున్, తన సారథి
సుమంత్రు డనువాని సకల సుజ్ఞాననిధిన్. 213

కం. పిలిపించి దశరథ నృపుం
డెలరుపుతో తన మనమున నెగసిన తలపున్
దెలిపి, పురోహితులను, మం
త్రుల గొని రమ్మనుచు నాజ్ఞ తోడ్తో నిచ్చెన్. 214

వ. మహారాజు మానసమ్మున వెలసిన యోచన సర్వ శుభ లక్షణ లక్షితంబుగా నుంట, సుమంత్రుండు సంతోష భరితాంతరంగుండై, తత్క్షణంబు చని, బహువత్సర తపఃసంపన్న లబ్ధ మహామహిమాన్వితులును, ఘటనాఘటన సమర్థులు నైన వసిష్ఠ, సుయజ్ఞ, వామదేవ, జాబాలి, కాశ్యపాది మహర్షులకును, అయోధ్యారాజ్య పరిపాలనా దక్షులును, సర్వ మంత్రాంగ పారంగతులును, ధర్మవర్తనులును, బహుముఖ ప్రజ్ఞాశాలురును, ఇక్ష్వాకువంశ వర్ధనోల్లాసులునైన దృష్టి, జయంత, విజయ, సిద్ధార్థ, అర్థసాధక, అశోక, మంత్రపాలురను తన తోటి మంత్రి వర్యులకును, రాజాజ్ఞను వివరించిన, వారెల్లరు సమ్ము దితమానసులై మహారాజు సన్నిధికేతెంచిన, 215

ఉ. వచ్చిన మంత్రివర్యులను, వంశ వివర్ధన యుక్తివంతులున్
సచ్చరితాత్ములౌ ప్రథిత సంయమి సంఘము గాంచి నమ్రుడై
చెచ్చెర లేచి రాజు తన సింహతలంబును చెంత చేర్చుచున్
మచ్చికతో నమస్కృతులు మానుగ జేయుచు ప్రీతి నిట్లనెన్. 216

ఉ. నేడు ప్రభాతవేళ ద్యుమణిన్ కులవూరుషు మ్రొక్కుచుండ, నా
పోడిమి కాగలేక కనుమూతబడెన్ క్షణమాత్ర మంత – నీ
వోడక నశ్వమేధ మఖ మొప్పుగ చేయుము, నీకు పుత్రులున్
వేడుకగా జనింతురని బిట్టు మనమ్మున తోచెనత్తరిన్. 217

తే.గీ. ఆ విషయము చర్చించి మీ అభిమతంబు
గొనగ మిముల రప్పించితి, కూర్మితోడ
హితులును పురోహితులును, మీరెల్లరెంచి
పల్కు డయ్య నిర్ణయ మరవాయి గొనక. 218

కం. అది విని వసిష్ఠ సంయమి
ముదమందుచు నీ తలం పమోఘము నృపతీ!
ఇది మా మును లెల్లరకు ప్ర
మదము కలుగ చేసె ననుచు మరి యిట్లనియెన్. 219

వ. మహారాజా! నీకు పుత్రులుదయించుట తథ్యము. నీకు జ్ఞప్తి యున్నదో లేదోగాని. 220

మ. ఒకనాడీవు మృగావఘాతమునకై నుత్కంఠివై కాననం
బొకదానిన్ ధృతి మీఱ దోర్బలముతో నొక్కుమ్మడిన్ జొచ్చి, సిం
హ కరీంద్ర వ్రజమున్ వధించుచు మహాహంకారివై యుండగా,
నొక సంరావము నీ చెవిన్ బడిన కార్యోత్సాహివై వేగమే. 221



తే.గీ. ఆ స్వనము హస్తి సలిల గ్రహణ రవమని
తలచి శబ్దభేది శరము త్వరితగతిని
శబ్దమేతెంచిన దిశకు సరిగ నెక్కు
పెట్టి వదలినాడవు బిట్టు బింక మెసగ. 222

ఉ. చెచ్చెర పోయి యా ములికి చేరువలోగల నిర్ఝరంబులో
నచ్చపు నీరముల్ కరకయందున నింపు మునీంద్ర పుత్రునిన్
క్రచ్చఱ సొచ్చె, వాడు జనకా! ఇదె చచ్చితినంచు నార్చె, నీ
వచ్చెరువంది యేరు కడ కాత్రుత నేగితి వంత బాలుడున్. 223

తే.గీ. నిను దశరథునిగ నెరిగి నేను బ్రతుక
బోనిక, దరిని యాశ్రమమున ముదుసలి
తల్లి దండ్రులు వేచిరి దప్పితోడ,
నను నట గొని పొమ్మని పల్కి కనులు మూసె. 224

తే.గీ. మునిసుతుని తనువును నీవు కనికరమున
తండ్రి కడకు చేర్చ నతడు తాపమంది
నిన్ను శపియించె – నీవు నీ కన్నకొడుకు
లెవరు దరిలేని సమయాన నీల్గుదువని. 225

వ. నీవు చనిపోవు తరిని నీ సుతు లెవ్వరును నీ చెంతనుండరని మౌని పల్కుటం జేసి, నీకు తప్పక పుత్రులు కలుగ గలరని యాతండు నిన్ను దీవించుటయే గదా. యోజించుము. 226

కం. సత్యముగా నీ శాపం
బత్యుత్తమ కాన్క గాదె అక్షయముగ నీ
కత్యంత శుభ మొనరు – నన
పత్యభయంబు తొలగు దినపతికుల తిలకా! 227

వ. ఆ సమయం బేతెంచెనని వచింప, 228

తే.గీ. ఆ వసిష్ఠుని పల్కు విన్నంత రాజు
సంతసమున కృతార్థుడ సంయమివర!
అనియె, తక్కుంగల మునులు, నాప్త మంత్రు
లశ్వమేధంబు చేయంగ నభిమతింప. 229

తే.గీ. తృప్తిపడి సచివులకును, ఋషుల కపుడు
కానుక లొసంగి ముదమున గౌరవించి,
ఇష్ట సఖులతో నశ్వమేధేష్టి కార్య
నిర్వహణగూర్చి చర్చించె నుర్వి పతియు. 230

ఉ. అంతరమందు నుత్సుకత నంతిపురంబున కేగి ప్రీతితో
కాంతల కశ్వమేధ మఖ కార్యములన్ వివరించి సమ్మద
స్వాంతము తోడ వారిని ప్రశాంత మనస్కుల జేయ, నప్పు డే
కాంతముగా సుమంతుడు జనాధిపు జేరి వచించె నీ విధిన్. 231

## 3.4. దశరథుడు యజన నిర్వహణార్థము ఋష్యశృంగుని రావించుట

తే.గీ. పుత్రలుద్భవించు కొరకు భూమిపాల!
అశ్వమేధంబుతో గూడ నవసరంబు
పుత్రకామేష్టి యన వింటి మున్ను – ముని వ
రుండు మహిత సనత్కుమారుండు తెలుప. 232

వ. అశ్వమేధ, పుత్రకామేష్టి మొదలగు విశిష్ట క్రతువుల సక్రమంబుగను, సశాస్త్రీయంబుగను నిర్వహించుటలో ఋష్యశృంగ సంయమి దిట్టయని తెలియవచ్చు చున్నది. కావున, 233



తే.గీ. ఋష్యశృంగుని రప్పింపు మీత డతుల
శుభ గుణుడు, వేదశాస్త్రజ్ఞుడు, భగవంతు
డీత డున్నట్టియెడ ననావృష్టిలేక
నిత్య కల్యాణముగ నుండు సత్య మిదియు. 234

తే.గీ. అనగ సంతసించి నృపాలు డాదరమున
సరిగ జ్ఞప్తి చేసితివని సఖుని వొగడి,
మున్ను కౌసల్యకు తనకు పుట్టినట్టి
పుత్రికను శాంత నెద దల్చి పులకరించి. 235

మ. అనపత్యుండగు రోమపాద వసుధాధ్యక్షుండు కోరంగ నా
తనయన్ శాంతను దత్తతిచ్చితిని మిత్ర ప్రేమతో తొల్లి, యా
వనజాతేక్షణ నిచ్చె గాదె హితు డుద్వాహంబునన్ ఋష్యశృం
గుని కాతండు మహాత్ముడంచు మును లోకుల్ పల్క వింటిన్ గదా! 236

తే.గీ. ఆ విభాండకుని కుమారు డాత్మవేత్త,
యజన నిర్వహణాది విద్యాప్రవీణు
డాతడు వసించు ప్రాంతంబు లనవరతము
నిత్యవైభవోపేతమై నెగడు నంట. 237

తే.గీ. మదిని నీరీతి తర్కించి మమతతోడ,
ఎన్ని యేండ్లయ్యె చూచి నా కన్న తల్లి,
కూతు, నల్లుని పిలుపింతు కోర్కి మీఱ –
కాదు నే వెళ్ళి తెచ్చుటే కర్జ్యమనుచు. 238

వ. ఇదియే కర్తవ్యంబును, కార్య సాధకంబు నగునని నిశ్చయించి, కోసల కనతి దూరంబుననున్న అంగదేశ రాజ్యాధినేత యగు రోమపాదుని కడకు

సపరివారంబుగా నేగి ఆతని నభ్యర్థించి కుమార్తెను, అల్లుని సమ్మాన పూర్వకముగ నయోధ్యకు గొనివచ్చి తమ కులగురువైన వసిష్ఠుని ముదలగొని, యజ్ఞ నిర్వహణ బాధ్యత ఋష్యశృంగుని కప్పజెప్పి, సుమంత్రుని పిలిచి,239

తే.గీ. ఊరి కవతల సరయువు కుత్తరాన,
మంచి ప్రాంతంబు నొకదాని నెంచి యచట
వలయు కట్టడంబులు కట్టి చెలువు మెరయ,
యజ్ఞ సన్నాహములు చేయుమని వచించి, 240

వ. మరియును యజ్ఞసందర్శనార్థంబు, 241

సీ. కోసల రాజ్యాన కులభేదములులేక
ప్రజల నందరి పిల్వ పంపు మనుచు,
పై దేశములనుండి పండితవర్యుల,
వేదవేత్తల నెల్ల పిల్వుమనుచు,
సత్యసంధుండైన జనకమహారాజు,
మామయౌ కేకయ మనుజనాథు,
నంగ, కాశీదేశ వంగనృపతుల, సౌ
రాష్ట్ర, సౌవీర సామ్రాజ్యపతుల,
తే.గీ. దక్షిణాధీశ్వరుల, తక్కు ధరణిపతుల
నాదరంబున తగిన యాహ్వానమంపి,
వేత్తలను పంచి వారి రావించు డనుచు
నానతిచ్చెను సచివున కతుల ప్రీతి. 242

ఉ. అంత సుమంత్ర మంత్రి చని యా సరయూనది కుత్తర ప్రతీ
రాంతర భూమి నెన్ని, వసుధాధిపు శిల్పుల బృందమంపి, అ
త్యంత మనోహరంబులగు అధ్వర వేదికలందు శుల్బ శా
స్త్రాంతర సూత్ర పద్ధతులు తప్పక వే సృజియింప జేయుచున్. 243



తే.గ. యాగమును చూడ నరుదెంచు నట్టివారి,
వసతి కొఱకొక రమ్యమౌ పట్టణంబు,
వివిధ రాజ్యాధిపతులకు వేరువేర
చతురగతుల నొప్పారెడు సౌధ చయము, 244

తే.గ. సవన నిర్వహణార్థమై శాల యొకటి,
అధ్వర స్థండిలమ్మును, హవ్యగృహము
పూర్వభాగాన ప్రాగ్వంశ ధామపంక్తి,
తక్కు గృహములు కట్టించె తగినరీతి. 245

తే.గీ. సకల యజ్ఞోపకరణ సంచయము గూర్చి,
శిల్పకుడ్యాది కుట్టిమ శ్రీల నిల్పి,
వివిధ పుష్ప ఫలద తరు వితతి నాట
జేసె మఖవేదికకు చుట్టు చెలువు మీఱ. 246

వ. అంత కొన్ని దినంబులకు, 247

కం. మంచువలె ధవళ కాంతిని
మించిన తనులీల మెఱయు మేలగు హయమున్
మంచి ముహూర్తమునందున
పంచిరి యజనాశ్వముగను పర్యాటనకై. 248

మ. తనవెంటన్ తగు సైనికవ్రజము, సద్బ్రాహ్మణ్య మేతేర, నా
ఘన గంధర్వము పెక్కురాజ్యములు వీకంజొచ్చినన్ జూచి ఆ
జనపాలాగ్రణు లిద్ది పంక్తిరథు యజ్ఞాశ్వంబు బంధింప రా
దని శాసించి సమాదరమ్మునను వే దాటించి రాత్మీయతన్. 249

కం. ఆ విధి నా జవనాశ్వము
వేవిధి భారతము నందు విహరించి తగన్

పావనియై యొక సాలుకు
వ్యావర్తించుచును వచ్చె యజ్ఞస్థలికిన్. 250

వ. ఈ విషయంబు యజ్వకులు యజ్ఞదీక్షితుండైన దశరథ మహారాజున కెరింగించి, యజ్ఞ ప్రారంభ ముహూర్త మాసన్నమైనందున, యజన వాటికకు వేంచేయుడని వినతి చేసిన. 251

మ. సంతసమంది రాజు తన జాయలు కూడగ – మిత్రరాజ, సా
మంత, మునీంద్ర, మంత్రిజన మండలి తోడుగ, యజ్ఞవాటికా
భ్యంతరసీమజేరి మహితాసనమం దుపవిష్టుడయ్యె, సీ
మంతినులున్, విపశ్చితులు మానుగ సేసలు జల్లుచుండగన్. 252

## 3.5. ఋష్యశృంగ మహాముని అశ్వమేధ, పుత్రకామేష్టులను జరిపించుట

వ. అంత వసిష్ఠాది మహామునీంద్రుల ఆధిపత్యంబున, 253

సీ. ఋష్యశృంగుడు ముఖ్య ఋత్విజుడై యుండి
క్రతువిధి పర్యవేక్షణము సేయ,
వేద, వేదార్థ ప్రావీణ్యసంపద గల్గి,
కల్పసూత్రాల సూక్ష్మంబు లెరిగి,
యజ్ఞసంబంధితంబైన విధ్యుక్త ధ
ర్మములలో నిక్షిప్త మర్మ వేత్త
లుద్గాత, యధ్వర్యు, హోతలతో చేరి
పదియార్వురార్యు లుపక్రమింప,
తే.గీ. రక్షితోచ్చారణ క్రియా దక్షుడైన
ఋష్యశృంగుండు మంత్రముల్ జృంభితముగ



పొల్లు పోకుండ పలికించి స్ఫుటముగాను
చెలసి మఖదర్శనంబును సేయుచుండ, 254

తే.గీ. త్రిదిశ గంధర్వ గణములు దివమునుండి
పుష్ప వర్షంబు కురిపింప ముదముతోడ,
అతిథి వరులకు సంతోష మతిశయిల్ల,
నశ్వమేధంబు సంపూర్ణమయ్యె నపుడు. 255

కం. ఘనుడగు దశరథు డాయెడ
తనరారి ద్విజులకు భూరి దక్షిణలిచ్చెన్
మును కని విన్నని తెఱంగున –
తనియుచు దీవింప వారు తద్దయు రాజున్. 256

ఉ. ఆ విధి నశ్వమేధ మఖ మందరు మెచ్చ, ననన్యసాధ్యమున్
పావన వేదశాస్త్రపరివర్ధిత భవ్య సనాతనార్ష ధ
ర్మావక సంప్రదాయము, మహామహితాత్మకమౌ సవంబు దీ
క్షావిధి పూర్తియైన కడు సంతసమంది నృపాలుడిట్లనెన్. 257

తే. అశ్వమేధంబు సంపూర్ణ మయ్యె నింక
నాకు పుత్రులు కలుగంగ నయముతోడ
పుత్రకామేష్టి చేపట్టి బ్రోవుమయ్య!
ఋష్యశృంగ! నా యనపత్య శృంగభంగ! 258

వ. అని ప్రార్థింప వల్లెయని, ఆ మహాముని ఒక్క క్షణమాత్ర నిమీలిత నేత్రుండై. 259

తే.గీ. దేశ కాలాది లౌకిక స్థితులనెంచి
ఇష్టికర్తయౌ దశరథు నిచ్ఛతీర,

శ్రద్ధ వేదమందున నధ్వర శిరసాది
కొన్ని ప్రత్యేక మంత్రంబు లెన్నుకొనుచు. 260

శా. హేరంబున్ మదిదల్చి, కుండమున ప్రత్యేకించి త్రేతాగ్నులన్
సంరంభంబున ప్రజ్వలించి, ప్రమతిన్ స్వాధిష్ట మంత్రంబులన్
ప్రారంభించుచు పుత్రకామ సవమాపైనన్ శతానందునిన్,
స్వారాడాదుల హవ్యముల్ గొనగ నాహ్వానించె పూతాత్మతన్. 261

వ. ఆ విధంబున నాహ్వానింపబడి, మహామనీషులైన మునిశ్రేష్ఠులకు తక్క, తక్కిన జనులకు కన్పట్టకుండ, 262

ఉ. వచ్చిరి ప్రీతిమీఱ నరపాలుడు పుత్రులగోరి దీక్షతో
నచ్చిక లేక సేయు సవనంబునుచూచి, ప్రణీతపక్వ శ
శ్వచ్చరు వగ్ని వక్త్రమున సంతసమానసులై భుజింప న
భ్రచ్చర దేవసంతతులు, వాసవ, ధాతల వెంటనంటుచున్. 263

## 3.6. రావణాది రాక్షస నాశనమొనరింపుమని బ్రహ్మ శ్రీహరిని కోరుట

కం. అరుదెంచిన సురలంతట
సరసిజజన్ముని వలగొని సదమదమతులై
కరములు ముగిడ్చి ప్రార్థిం
చిరి రావణు దుష్కృతములు శీఘ్రమె మాన్పన్. 264

వ. అంతలో. 265

సీ. నీరదాగమ మేఘ నిభ సుందరాకార
వరదేహసంపద వఱలువాడు,



క్షీరసాగరకన్య స్థిరముగా నెలకొని
యురమున మెఱయంగ నొప్పు వాడు,
నలువుగా నాడెడు నలువ పుట్టిల్లైన
సరసిజప్రభ తోడ బరగు వాడు
శంఖ చక్ర గదాంబుజాతంబు లంకించి
నాల్గు దిక్కులయందు గల్గువాడు,
తే. విశ్వ సృష్టి స్థితి విలయ వేద్యుడగుచు,
నాదిమధ్యాంత రహితుడై యదరువాడు,
నీలమేఘాల మధ్యను నింగియందు
చదల గప్పె త్రివిక్రమ చ్ఛత్రమనగ. 266

ఆ.వె. నీలవర్ణు డగుట నీలాభ్ర మందుంట
దివ్యదృష్టిగల్గు దేవతతికి,
మునివరులకు తక్క పూర్తి లౌకిక దృష్టి
గల్గునట్టి వారి కనుల పడదు. 267

వ. ఆ సమయంబున, 268

మ. మురహంతన్ కనుగాంచి దేవతలు సమ్మోదించియున్ భీతులై
దరిజేరంగ నశక్తులై, విధి పిరుందన్ నమ్రులై నిల్వ, నా
సరసీజాక్షుని సన్నివిష్టుడయి నిస్స్వార్థ ప్రకార్షాత్మతన్
కరముల్ మోడ్చి విధాత పల్కె హరితో కారుణ్య వారాశితో. 269

సీ దేవ! ఓ భావనాతీత భవ్యపురుష!
విశ్వకారక! విభూ! విశ్వరూప!
వినుము నా మాట – నీ వెరుగని సత్యంబు
ధర్మంబు విషయంబు ధరణి గలవె!

రక్షోధినాథుండు రావణుండను వాడు
లావణి సేయుచు లంకనుండి
ముల్లోకవాసుల ముప్పుతిప్పలు పెట్టు
సురల, సంయముల, కిన్నరుల, నరుల
తే. యక్ష, గంధర్వ, విద్యాధ రాప్సరసల
నంటి పీడించు బాధించు నడలజేయు,
నూడిగము సేయ నియమించు నోటలేక
సూర్య చంద్రాది వర్గంబు సొరిగిపోవ. 270

ఆ.వె. తపసు చేయువారి దండించి, హింసించు,
ధర్మవర్తనులకు తలలు నఱకు,
సవన మాచరించు జనులను బాధించు
సత్ప్రవర్తనలగు సతుల చెఱచు. 271

తే.గీ. ఎదురులేకను, సుంతైన బెదురులేక
లోకకంటకు డాసురలోక భర్త
ఘోరకృత్యములకు మూల కారణంబు
వాని కే నొసగిన దివ్య వరబలంబె! 272

వ. దేవా! ఆ రావణుడు నన్ను గూర్చి కొన్నివేలేండ్లు నిష్ఠతో తీవ్రమగు తపంబాచరించె. ఆ తపో తాపంబున కుష్ణధూమపుంజంబులు, వహ్ని జ్వాలాతోరణంబులు ముల్లోకములందు వ్యాపించెను. ఆ వేడిని భరించలేక నిలింపాదులు, మౌనిపుంగవులు, భూవాసులు హాహాకారములు చేసి రక్షింపుడని నన్ను శరణువేడిరి. అంత నే నా దానవునకు ప్రత్యక్షమై తపము విరమించుమని నచ్చచెప్ప ప్రయత్నించితిని. వాడు తనకు వలసిన వరముల నిచ్చినచో నట్లు చేయుదు ననుచు, విపరీతమైన కోర్కెలెన్నియో కోరెను. 273



తే.గీ. సకల శస్త్రాస్త్ర మహనీయ సంచయంబు,
సాటిలేనట్టి భుజబల సౌష్టవంబు
యక్ష నిర్జర గంధర్వ రాక్షసాదు
ల వలన మడియకుండంగ లబ్ధి కోరె. 274

కం. అడిగిన వరముల నిచ్చితి
తడకట్టక, కాదనకను తత్క్షణమందే-
అడిగిన వన్నియు తపసికి
తడవాడక నొసగ నా మతమగుట నృహరీ! 275

ఉ. ఐనది యయ్యె దేవ! ఇపు డా దివిజారిని మట్టుబెట్టి అ
ద్దాన సనాతనార్షమత ధర్మ సముద్ధరణంబుచేసి సం
ధాన మొనర్చి సద్గుణుల, ధావన సేయుము పాపపంకిలం
బైన ధరిత్రిపై పొలిచి యాసురతత్త్వము రూపుమాపుమా! 276

సీ. తొలి నీవు మత్స్యమై తొలివేల్పు సోమకు
నిర్జించి నిగమముల్ నిలుపలేదొ?
చెన్నుగా కూర్మమై వెన్నుపై గిరినెత్తి
ఇంపుగా సుధను పుట్టించలేదొ?
మోహినివై సుధ ముద్దుగా నసురుల
నేమార్చి సురల కిప్పించలేదొ?
ఆదివరాహమై అసురు హిరణ్యాక్షు
హింసించి భువి నుద్ధరించ లేదొ?
తే.గీ. రౌద్ర నారసింహుడవై హిరణ్యకశిపు
స్తంభమందుండి వెలువడి చంపలేదొ?
దానవుల దున్మి ధర్మ సంస్థాపనంబు
చేయ నీ వెత్తు రూపముల్ చెప్ప గలమె! 277

చం. తొలియుగమందు వజ్రి పరితుష్టికి వామనునన్నట్లు మేదినీ
తలమున నీవు పొల్చి మఖదానము పట్టి త్రివిక్రముండవై
పెలుచన నేర్పుతో పెరిగి పృథ్వియు నాకమునెల్లనిండి యా
బలినృపు బల్మి త్రొక్కితివి పాదము మోపి రసాతలంబుకున్. 278

మ. బలదర్పుండగు కార్తవీర్య వసుధాపాలుండు రోషంబునన్
పలుగాకై జమదగ్ని చంపి సురభిన్ పాపాత్మతన్ పట్ట, నీ
వలఘు క్రోధ పరీత మానసముతో నావేశివై యార్చుచున్
ఛలివై దున్మితి గాదె గొడ్డలికొనన్ జాజ్జ్వల్య రామాకృతిన్. 279

కం. ఈ రీతి వసుధపై వే
మారులు వేవిధి జనించి మార్కొంటివయా!
క్రూరుల దుష్టుల దానవ
వీరుల, సాధుజనతతుల పెలుచన్ బ్రోవన్. 280

కం. నీవే రూపంబున నే
వావిన్ పొడముదువొ కాని వారక నింకన్
దేవా! దీటుగ దుష్టున్
రావణు బంధుసహితముగ మ్రందించు ప్రభూ! 281

## 3.7. శ్రీహరి భూమిపై నుద్భవించి ధర్మప్రతిష్ఠాపన మొనర్తుననుట

వ. అని ప్రార్థించిన, కరుణాంతరంగుండు, జగత్సంరక్షణ బాధ్యతా యుతుండునగు శ్రీమహావిష్ణు విట్లనియె. బ్రహ్మదేవా! నీవు విచారింపవలదు. సకల దేవ, ముని, జనశ్రేష్ఠులారా! మీరనుభవించుచున్న కష్టంబులు నాకు గ్రాహ్యంబులే. వానినెల్ల త్వరిత కాలముననే నివారించెదను. త్రిలోకవాసు లెల్లరు వేదవిధ్యుక్త ధర్మంబులాచరించుచు, న్యాయ సమ్మతంబైన వ్యాపకంబుల



చేపట్టి, సంసారసుఖంబుల దేలుచు, మీ మీ జీవనయాత్రలు సాగింప వీలగు విధంబున, బ్రహ్మ వరభంగంబు కాకుండు తెఱంగున, మీ బాధలకు కారణుండును, సనాతనార్ష మార్గ విరోధియై అధర్మంబును లోకంబుల విస్తరిల్ల చేయుచున్న దుష్టశక్తియునగు లంకాధిపతి రావణుని మిత్ర బాంధవ యుతముగా నిర్మూలించి, సనాతన ధర్మ ప్రతిష్ఠాపన చేయుదును. దీని కీ క్షణమే అంకురార్పణ జరుగును.

భూతలవాసు లెల్లరు వినుడు. భూలోకంబున ఏ జీవియు మరణము నధిగమించి శాశ్వతముగ మన జాలదు. ఇది నా సంకల్పమునకు విరుద్ధము. అందుచే మానవ, దానవాది జీవులెవరైనను మృత్యుంజయత్వంబును కోరి, తప, జపాది సన్మార్గముల ప్రార్థనలు సల్పినను, హింసామార్గ మవలంబించి లోకములను భయభ్రాంతుల గావించినను, లేక నిరాహారాది దీక్షలు చేసి లోకపాలురపై నిర్బంధపూర్వకమగు నొత్తిడుల కల్గించినను, నేను వానినెల్ల నేదోవిధమున భగ్నము కావింతును. ఎంతటి వాడైనను వాని కర్మంబు పరిపక్వంబగునంత దనుక నీ భూమిపై వసించి తుదకు మృత్యువాతబడి, మున్ను వారి జీవితకాలంబుల కూడగట్టుకున్న కర్మఫలంబులను బట్టి స్వర్గ, నరకాధివాసులగుచు క్రమంబున నాయా పుణ్యపాపంబులు తరిగి, నశించిన పిమ్మట తిరిగి భూలోకమాతృగర్భ సంజనితులై సంసార సాగరంబున కొట్టు మిట్టాడి, అజ్ఞాన మూలంబైన జీవన్మరణ వలయంబున పరిభ్రమింతురు. 282

కం. పుట్టిన జీవులు నెట్టన
కట్టబడుచు పుణ్య పాప కర్మలచేతన్
గిట్టుచు పుట్టుచు భువిలో
వట్టిగ తిరుగుదు రవిద్య వలయమునందున్. 283

వ. కొందరీ విషవలయంబున జొరబోక, మానవులుగా జీవించుచున్నపుడే భక్తి, యోగ, జ్ఞానాది మార్గానుగాములై, భవబంధంబులను విదిల్చుకొన

యత్నించి, తమ పూర్వజన్మానుగత పాపంబుల క్రమముగా నిర్మూలించుకొనుచు, కొన్ని జన్మల యనంతరము నా శాశ్వత సాన్నిధ్యంబు నొందుదురు. ఇదియే ముక్తినొందుట. అట్టి జనులు తిరిగి యే జీవ యోనులం దుద్భవించరు.

ఆ.వె. భక్తి, జ్ఞాన, యోగ పథము లనుసరించి,
కొన్ని జన్మలందు కోర్కె లణచి
సాధనమ్ము చేయ సద్గురుని యండ,
ముక్తి బొందనగు ముముక్షువులకు. 284

వ. రావణుడు దేవ, దానవుల వలనను, గంధర్వ, కిన్నర, కింపురుష, సిద్ధ, సాధ్య, యక్షాది దేవయోని సంభవుల వలనను మాత్రమే తనకు భూవిమోచనము కలుగ కుండ విధాతనుండి వరంబుల నొందెను. సమర్థుడైన మర్త్యుండు వానిని సంహరించవచ్చును. అందుచే భూలోకమున నేను మానవరూపంబున నుద్భవించి మర్కటుల సహాయముతో రావణాది దుష్టుల నంతమొందించెదను.

ఇపుడు పుత్రకామేష్టి నాచరించుచున్న దశరథు డుత్తముడు, ప్రభాకర వంశ సంజాతుడు, సనాతన ధర్మపథానుగామి, నిత్యసత్యవ్రతుడు, న్యాయమూర్తి, దేవేంద్రసమ బలసంపన్నుడు. ఇతని పుత్రోద్భవ వాంఛానుగుణంబుగా వాని ముప్వురు దేవేరులకు నేను నాలుగంశలతో జనించి కార్య సాధన చేయుదును. నా పురంధ్రీ లలామయైన శ్రీమహాలక్ష్మి గూడ భూలోకమున తగురీతి ప్రత్యక్షమై నా కర్ధాంగి కాగలదు. మీ దేవాది సురలెల్ల మీ మీ అంశంబుల భూ లోకంబు నందు వానర, భల్లూకాది మృగ రూపంబుల నుద్భవించి ఈ భగవత్కార్యమునకు తగువిధంబున తోడుకండని యానతిచ్చి తిరోహితుండయ్యె. 285

తే.గీ. అటుల సెలవిచ్చి కమలాక్షు డరిగినంత,
బ్రహ్మయును దానవారులు వంత వీడి
రపుడు పరమేష్ఠి యనియె నో అమరులార!
ఇలను మీ అంశల నవతరింపు డికను. 286



చం. అనవిని దైవకార్యమునకై దివిజేంద్రుడు తక్కు దేవతల్
పనిగొని నాగకన్యలను, వానర, కిన్నర, ఋక్ష కాంతలన్
మునుమిడి దేవయోనులను పొల్పుగ పుత్రుల శౌర్యవంతులన్
తనరుచు వారి సమ్మతిని తాకి జనింపగచేసి రాయెడన్. 287

సీ. బలియుడౌ వాలిని బలభేది పుట్టించె,
సవితృండు సుగ్రీవు జనకుడయ్యె,
ప్రథితుడైన హనుమ వాయువుకు జనించె,
తారుడు గురుని కుమారుడయ్యె,
పెలుచ నీలుడు గల్గె వీతిహోత్రునకును,
విశ్వకర్మకు పుట్టె ప్రీతి నలుడు,
గంధమాదన కపి కలిగె ధనదునకు,
వర సుషేణుండయ్యె వరుణ సుతుడు,
తే.గీ. అశ్వనీదేవతలు విక్రమాఢ్యులైన
మైంద, ద్వివిదులను కనిరి మహితయశుల,
మరియు భల్లూక, గోపుచ్ఛ వరులు వివిధ
త్రిదశులకు నుద్భవించిరి ధీరులగుచు. 288

వ. ఇంకను తక్కుంగల దేవతల యంశములందు కోటాను కోట్లుగ వివిధ రూపంబులతో వానరాదు లుద్భవించిరి. ఈ కపి, భల్లుక వర్గంబులు దైవాంశ సంభూతులు గాన పుట్టిన వెంటనే యవ్వనులై మహా బలసంపన్నులు, కామరూపులు, ప్రజ్ఞావంతులునై యుండిరి. కొలది కాలమునకే మహా బల పరాక్రమశాలియగు వాలి దక్షిణభారతంబునగల కిష్కింధా రాజ్యమునకు ప్రభువయ్యె. వాని సోదరునిగా జనించిన సుగ్రీవుం డన్నకు సహాయకుడై, రాజ్యభారంబును మోయుచుండె. వాయుపుత్రుండును, సర్వశుభలక్షణ సంపన్నుండును, ప్రజ్ఞాశాలియును, యుక్తిమంతుండును, ప్రభుభక్తి

పరాయణుండునగు హనుమంతు డంజనాదేవికి జనించి, అభేద్యమైన వజ్రకాయము గలిగి,గరుత్మంతునివలె వేగవంతుండై సుగ్రీవునకు సచివుండయ్యె. తక్కుంగల వానరులు, దేవతాపుత్రులు కిష్కంధాసామ్రాజ్యంబున వివిధ కార్యకలాపంబుల స్థిరపడిరి. 289

తే.గీ. అంతకునుమున్నె యెన్నియో హాయనముల
పూర్వ మావులించగ స్వయంభువుడు వాని
నోటి యందుండి జాంబవంతుం డనియెడు
ఋక్షుడొకడు వెలువడుచు పృథ్వి నిలిచె. 290

తే.గీ. అధిక భుజశౌర్య సంయుతు డతులబలుడు,
దక్షుడగు జాంబవంతుండు ఋక్ష నృపతి
యగుచు, కిష్కంధ కధిపతి యైన వాలి
గూడెను తనదు బలగంబు తోడ సెలసి. 291

తే.గీ. రామ జనన కాలమునకు ప్రబలుడయ్యు
వృద్ధుడౌ జాంబవంతుని బుద్ధి బలము
నతని ఆలోచనా సహాయంబు మాత్ర
మే కపులు గొనుచుండిరి మెండుగాను. 292

---

**వివరణలు :**

1. పృథువు అను నరపాలుడు భూమిని గోవుగాను, మనువును దూడగాను చేసి ఓషధులను పిదికెను. ఈ పృథువు సూర్యవంశమువాడు గాదని, పురాణములలోగల ఐదుగురు పృథువులలో స్వాయంభువు మనువు వంశస్థుడైన మనువని కొందరందురు.

2. దశరథునికి చెందిన ఒక అంగమో, వైభవమో మొదటి పాదములో నుటంకించి, రాను రాను ప్రతిపాదమునకు పది వరకు పెంచుతూ చెప్పిన ఈ పద్యములో, భాస్కర రామాయణంలోని ఒక పద్యము ఛాయలు గమనింపగలరు.

# 4. పుత్రోద్భవ ఖండము

## 4.1. పుత్రకామేష్టికి తృప్తినందిన బ్రహ్మ దివ్యామృతమును పంపుట

వ. ఇది అట్లుండ దశరథుని పుత్రకామేష్టి సంపూర్ణంబై, సఫలంబుగావచ్చిన సమయమాసన్నమైన ఋష్యశృంగుడు హోమకుండము సరస నిలిచి వైశ్వానరునకు పూర్ణాహుతి గావించె. 293

ఉ. అంతట నెల్లవారలు మహాద్భుతమందగ లేచె నొక్క డ
త్యంత సునీలవర్ణు డరుణాంబరధారుడు, దివ్యపూరుషుం
డంతట కాంతిపుంజముల వ్యాపనజేయుచు యజ్ఞవాటికా
భ్యంతర హోమకుండమున బంగరు పాత్రను చేత బట్టుచున్. 294

తే.గీ. ఆతడు దశరథునివంక ప్రీతి జూచి
పలికె నరపాల! అత్యంత భక్తితోడ
నీవొనర్చిన పుత్రకామేష్టి కలరి
బ్రహ్మ పుత్తెంచెనయ్య ఈ పాయసమ్ము. 295

చం. ఇది యొక దివ్యపాయస మహీన శుభప్రద మాయుసంపదల్
సదమల శౌర్య ధైర్య బల సంతతిగల్గును దీని తిన్నచో –
పదిలముగాను దీనిగొని భార్యలచేత భుజింపజేయు మే
విధముగ పంచి యిచ్చినను ప్రీతిని నీవు మనోభిలాషతో. 296

కం. అని యా బంగరు పాత్రను
జను లుల్లసమంది చూడ జననాథునకున్
తనరుచు నిచ్చెను దివ్యుడు,
ననవుల ననిమిషులు మింట నలువుగ కురియున్. 297

కం. డెందము పొంగగ భూపతి
పొందుగ పాయసమును గొని ముందుగ కౌస
ల్యేందీవర నేత్ర కొసగె
నందున సగపాలు హృదయమం దతి ప్రేమన్. 298

చం. మిగిలిన దానిలో సగము మీన సునేత్ర సుమిత్రకిచ్చె, నా
మిగిలిన దానిలో సగ మమేయ శరీరవిలాస లీల నొ
ప్పగు ప్రియ పత్ని కేకయ నృపాల తనూజకు నిచ్చె, నాపయిన్
మిగిలిన దిచ్చె పూర్తిగ సుమిత్రకు రెండవమారు ప్రీతితో. 299

సీ. తదుపరి భూపుండు తద్దయు పూజించె
ఋష్యశృంగ వసిష్ఠ ఋషివరులను
యజ్ఞంబు చేయించి నట్టి ఋత్విజులను
సంతృప్తి చెందంగ సత్కరించె,
హవనంబు చూడంగ నరుదెంచిన నృపుల
కాన్కలతోడను గౌరవించె,
మంత్రి, పరిజన, సామంత, సైన్యాధిప
తుల కిచ్చె నతుల వస్తుబహుమతుల,
తే.గీ. వీరు వారని యనకుండ వివిధ రత్న
హారచయముల నిప్పించె నతిథులకును,
ఇట్టి సవనంబు జగతిలో నెచట నైన
కనగ బోమంచు ప్రణతులై జనులు వొగడ. 300

వ. తదనంతరంబు భార్యా బంధు మంత్రి పరివారంబుతో తనకోటకు తిరిగి వచ్చి, రోమపాదున కమూల్యంబగు కానుకలొసంగి, ఋష్యశృంగునకు ప్రశంసాయుత ప్రణుతులంజేసి, సహస్ర కపిల సౌరభేయంబులను, తగు వస్త్రచయంబు ప్రదానంబు గావించి, శాంతాదేవికి వివిధ నవరత్నఖచిత



కాంచనభూషణంబులను, చీనిచీనాంబరంబులను, హరిద్ర కుంకుమంబులను, కర్పూర వీడ్యంబులనిచ్చి సాదరంబుగా వీడ్కొని వారి దేశంబునకు సాగ నంపి, అంగనల నంతఃపురంబున కంపి, సుమంత్రునితో నాంతరంగికంబుగ నిట్ల నియె. 301

తే.గీ. యజన భారంబుతోడ నే నలసియుంటి,
కొన్ని దినములు రాణుల గూడి యుందు,
రాచకార్యములను నీవె శ్రద్ధతోడ
తీర్చ కోరెద నాకేమి తెలుపకుండ. 302

తే.గీ. అనుచు నంతఃపురములోని కరిగి యతడు,
అంగనలతో ననంగ సౌఖ్యముల దేల,
దార లెల్లరు గర్భముల్ దాల్చి రపుడు,
ఇష్టి ఇచ్చిన పాయస పుష్టి వలన. 303

## 4.2.దశరథునకు నలువురు పుత్రు లుదయించుట

వ. అప్పటినుండి పండ్రెండవ నెల జరుగుచుండ. 304

తే.గీ. చైత్ర మాసాన శుక్లపక్ష నవమి బుధ
వారమున పునర్వసు నాల్గవ శుభ పాద
కర్కటక దివ్య లగ్నంపు ఘడియలందు
శుక్లపక్ష క్షపాకరశోభ గొనుచు, 305

మ. కనువిందై ప్రభవించె నా గరితకున్ కౌసల్యకున్ కేశవాం
శను నీలాభ్రసమప్రభారుచిర తేజఃపుంజ శారీరుడున్,
ఘన సూర్యాంశ వరిష్ఠ దీప్తి యుత చోక్షాంభోధరశ్యామ లా
ననుడున్, రావణ వంశనాశకరుడున్, నాకాధిపాహ్లాదుడున్. 306

చం. మరుదినమందు కల్గెను సమంచిత నీలసుదానకాంతితో
మెరసెడు దేహ సంపద నమేయ గుణాఢ్యుడు, కైకయీ సతీ
పరిణత ముక్తగర్భమున – పట్టపురాణికి మాధవాంశతో
పొరయుచు పుట్టినట్టి సుతు పూర్తిగ పోలుచు మూడు మూర్తులన్. 307

ఉ. ఆ మరునాడు పుట్టిరి మహా బల విక్రమశౌర్యసంయుతుల్,
సామన సామరస్య, వర సామజగామినియౌ సుమిత్రకున్,
హేమ కళా విలాస తనుహేల చెలంగు సుత ద్వయంబు, శ్రీ
ధాముని యంశ జేకొనుచు ధామనిధిప్రభతో చెలంగుచున్. 308

వ. ఆ విధంబున చైత్రశుద్ధ నవమీ బుధవారమున పునర్వసు నక్షత్రము నాల్గవ పాదంబున కర్కట లగ్నంబున సగపాలు విష్ణ్వంశతో పట్టమహిషి కౌసల్యా దేవికి నీలమేఘశ్యామల సుందరుండగు నొక సుతుండును, ఆ మరునాడు దశమీ గురువారంబున పుష్యమీ నక్షత్రయుక్త మీన లగ్నంబున నెనిమిదవపాలు వెన్నుని యంశతో కైకయీమాతకు కౌసల్యానందనుని బోలు తనుచ్ఛాయతో నొప్పు పుత్రుండును, ఆ మరచటి దినంబున దశమీ శుక్రవారంబున నాశ్లేషా నక్షత్ర కర్కట లగ్నంబున సుమిత్రా సతికి సువర్ణ వర్ణ శోభితులై, వర్ణములను తక్క, అంగసౌష్టవ రూపరేఖలందు అన్నలను పోలిన కవలలు జన్మించిరి. వీరిలో పెద్ద కుమారుండు నాలవ పాలు, రెండవ వాడు ఎనిమిదవ పాలు విష్ణ్వంశలు కలిగి యుండిరి. ఆ సమయంబున, 309

కం. ఆడిరి గంధర్వాంగన
లాడంబర మాపలేక, నతివేడుకతో
పాడిరి కిన్నరసానులు,
కూడిరి నభమందు త్రిదశ కోటులు ప్రీతిన్. 310

కం. కురిసెను ముత్తెపు వానలు
మెఱపులు నుఱుములు నభమున మెరమెర వెలసెన్



విరిసెను పూదోటలు, మా
సరిలేరను విధి మయూర సంఘము లాడెన్. 311

కం. కారణ మేమియు లేకనె
దారుణముగ కడుపులోన తల్లడపాటై
తారుణ దానవ కాంతల
గారవ గర్భములు వ్రీలి క్షారితమయ్యెన్. 312

వ. అంత, మహారాణులకు పుత్రులుదయించిరని అంతఃపుర వార్తావహులచే నెరింగి, దశరథ మహారాజు పులకితాంగుండై, తన గళంబున గల మౌక్తిక హారంబుల సమీప పరివారంబులకు ప్రదానంబు గావించెను.

అటు పిమ్మట బాలారిష్టంబు లతిక్రమించు దనుక సూతికా గృహంబులు చొరనొల్లక మహారాజు పది దినంబులు తగు శాంతులను పురోహితులచే చేయించి, స్వయముగ దైవప్రార్థనాసేవనార్చనలతో రాజప్రాసాదాంతర్గత దేవళంబున గడిపెను. ఇంతకాలమును, మహారాజెప్పుడెప్పుడు పుత్రులను చూచుట సంభవించునో యని తహతహపడుచు, దైవజ్ఞులచే నిర్ణయింపబడిన యొక శుభసమయంబునం దంతఃపురాభ్యంతరంబు సొచ్చి, 313

## 4.3. దశరథుని పుత్రోత్సాహము

ఉ. మోదముతోడ రాజు తన పుత్రుల చూడగ లోని కేగ – కౌ
మోదకి శంఖ చక్రములు పూనుచు కన్పడె జ్యేష్ఠపుత్రుడున్,
వేదములన్ పఠించుచును వేధ, నిలింప వితానముల్ స్తుతుల్
పాదుగ సేయుచుండ గని పార్థివు డచ్చెరువొందె నెంతయో. 314

తే.గీ. అంతలో నొక క్షణకాలమైన పిదప,
మాయ యనియెడు తెర కను మూయ నృపతి

మదిని చూచిన చిత్రంబు మరచిపోయి,
పెలుచ కృత్రిమ లౌకిక వృత్తి నొందె. 315

కం. నలుగురు సుతుల గుణయుతుల
నలువుగ వీక్షించి నృపతి నందముతోడన్
పలువురు ద్విజులకు తగువిధి
వలదుగ దానములు చేసె పరితుష్టిపడన్. 316

కం. ముద్దుగ నల్వురు పుత్రుల
నొద్దిక కన్నట్టి సతుల నుద్దీపితుడై
ఇద్ధప్రజ్ఞుడు దశరథు
డద్దిరయని కౌగలించె నతుల ప్రేమన్. 317

వ. అంత నలువురు సుతుల నానందముతో వీక్షించుచు, దశరథుండు వారితోడిదే లోకమను రీతి, వారి ముసి ముసినవ్వులకు పులకించుచు, వారి ముద్దుముద్దు కేరింతలకు కులుకుచు, వారి తనుస్పర్శల కలరుచు, వారి భవిష్యత్తును గూర్చి కలలు గనుచు దినమందధికభాగము వారి వద్దనే గడుపు చుండెను. 318

తే.గీ. దివ్యతేజస్సుతో వెల్గు త్రిదిశ సముల,
చూడ ముచ్చట గొల్పెడు సుతుల తండ్రి
తనరి చెన్నుగా ముఖమంత కనులు జేసి,
తన్మయత్వాన కాంచి వితాకుపడును. 319

కం. పిల్లలు పుట్టిన దాదిగ
పెల్లుగ నుబికిన వలపున ప్రియసుతులను వా
రల్లరుల మెచ్చి చూచుచు
నుల్లము ఝల్లనగ నవ్వు నుల్లాసముతో. 320



కం. ఆడా బుడుతల తోడను
గూడును నాడును నుడువును కుడుచును పాడున్,
వీడం డుడుకువ నిడ డే
నాడును - వ్రీడన్ తడబడు నాతులు చూడన్. 321

కం. సుతులన్న ప్రీతి జనకుల
కతి సహజంబు భువిని మరి హరియంశందున్
రతిపతి సములై పుట్టిన
ప్రతిభాత కొమరుల తండ్రి వలచుట వింతే! 322

## 4.4. వసిష్ఠమహర్షి రాజకుమారులకు నామకరణములు గావించుట.

వ. అంతలో కుమారులకు నామకరణములు చేయు సమయమాసన్నమైన, దశరథుండు తన ప్రధాన పురోహితుండు, బ్రహ్మర్షి, మహామహిమాన్వితుండు నైన వసిష్ఠమునీంద్రుని పిలిపించి కుమారుల జాతకర్మ, నామకరణోత్సవములు యథావిధిని జరిపింపుడని వేడిన, నా మహర్షి ఆ బాలుర జన్మ తిథి, వార, నక్షత్రాదుల నెన్ని, గ్రహచార, జాతక చక్రంబుల గుణించి, జ్యోతిశ్శాస్త్ర పారంగతులతో చర్చించి ఈ రీతి పలికెను. రాజా! నీ నలువురు పుత్రులును దైవాంశ సంభూతులు. అన్ని శుభలక్షణములు గలిగిన వారు. అంతియగాక, నీ పెద్దకుమారుని జననకాలంబున రవి, కుజ, గురు, శుక్ర, శనిగ్రహంబు లైదును ఉచ్చస్థితి నున్నవి. 'పంచోచ్చే లోకనాయకః' అను జ్యోతిషశాస్త్ర ప్రమాణ ఫలంబున నీతండు నిశ్చయముగా లోకనాయకుండగును. నీ పుత్రు లెల్లరు సత్యవర్తనులు, ధర్మమార్గానుగాములునై, ఆయురారోగ్యాది మహైశ్వర్యములతో వర్ధిల్లుదురు. నీ వంశం బాకల్పాంతంబు నిరాటంకంబుగా సాగును.

పట్టపుదేవి కౌసల్యాకుమారుని హస్తములు వజ్రరేఖాంకితములు, పాదములు శంఖ చక్రాంకనమండితములు; గావున నీతండు చక్రవర్తియై భవిష్యద్రాజవంశంబులకు నాదర్శప్రాయముగ రాజ్యమునేలి ప్రజల నుద్ధరించునని వక్కాణించి, తిరిగి ఇట్లనియె. 323

తే.గీ. సద్గుణ స్తోముడైన కౌసల్య కొడుకు
జనుల రంజిల్ల జేసెడు చతురు డగుట
రాముడనుపేర బరగుచు ప్రజల నేలు,
చక్రవర్తుల కెల్లను చక్రవర్తి. 324

తే.గీ. పురుషు లందున నుత్తమ పురుషు డధిప!
నిత్య సత్యవ్రత నియమ నిరతిశయుడు,
ధర్మమే రూపు గొనెనేమొ ధరణిపైన
ననగ రాజ్యపాలన జేయు ఘను డితండు. 325

తే.గీ. జనుల సౌఖ్యంబె కర్తవ్య మనుచు తలచి,
వసుధ పాలించు నాదర్శవంతముగను
రామరాజ్యమనుచు నెల్ల ప్రజలు పొగడ
సార్వభౌముడై వర్ధిల్లు నుర్విపైన. 326

వ. ఇంక నీతని తమ్ములు. 327

తే.గీ. అన్న యానతిపైన రాజ్యంబు నేలు
భ్రాతృవాక్యపాలకుడుగ పరిఢవిల్లి
లోకమందున పేరొందు కైక కొడుకు
భరతనామాఖ్యతో నిల బరగు వాడు. 328



తే.గీ. సతి సుమిత్ర పెద్ద కొడుకు సమరయశుడు
రామ సేవయె నిరతంబు రమ్యమనుచు,
తను మనంబుల కొలిచెడు ధన్యుడితడు
లక్ష్మణుండను పేర నిలను చరించు. 329

ఆ.వె. మేరు సమబలుడు సుమిత్ర చిన్న కొడుకు
సకల సౌమ్యసుగుణ సంయుతుండు
శత్రువులను ద్రుంచి శత్రుఘ్నుడనుపేర
రక్షసేయు రామరాజ్య మెపుడు. 330

వ. ఆ మాటలకు సంతసిల్లి, దేశప్రజాహితుండగు మహారాజు, ప్రజా ప్రతి నిధులను రావించి వారితో తన సంతోషమును పంచుకొనెను. ఇంకను,331

కం. ఆనందంబున పొంగుచు
నానమితుండై యయోధ్యయందలి ప్రజకున్
బోనంబులు పెట్టించెను
కానుక లిప్పించె మున్ను కనివిన నట్లున్. 332

వ. ఆ కోసలరాజ్య పౌరులును తమకు మహాతేజస్వులు, దైవాంశ సంభూతులు, దిగ్రాజులం బోలు యువరాజు లుదయించిరని సంతసించి ఆనందోత్సవములు చేసికొనిరి. 333

ఉ. ఎంత తపంబొనర్చిరొ మహీపతి పంక్తిరథాంగనా త్రయం
బెంతటి దానధర్మముల నింపుగ చేసిరొ పూర్వజన్మలం
దెంతటి పుణ్యకార్యముల నేకత చేయగ మూలమైరొ, శ్రీ
కాంతుని యంశలన్ గనిరి కంతు హసించు కుమారవర్గమున్! 334

తే.గీ. ఒకడు జనుల రంజించు వే రొక్కరుండు
రాజ్యపాలనా పాటవ ప్రతిభ చూపు,
భాతృ సేవాపరాయణ భవ్యగుణు డొ
కండు, సకల శత్రు వినాశకారు డొకడు. 335

కం. మురియుచు మనమున నావిధి
పురజను లెల్లరును జేరి పొరసిన భక్తిన్
పురిగొని నటనల మురహరు
హరువుగ పాడిరి మరి మరి హరి హరి యనుచున్. 336

వ. అంత, కాలానుగతముగ రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు తమ అంగాంగ సౌష్ఠవ సౌందర్యములును, మేధా సంపన్నతలును తమ తండ్రి యానందమువలె క్షణ క్షణ ప్రవర్ధమానమగుచుండ, నెదుగుచుండిరి. 337

తే.గీ. అన్నదమ్ములలోన రామన్నయన్న
లావు భక్తానురాగముల్ లక్ష్మణునకు,
అన్ని వేళల రామునే యంటి యుండు
నొక్క క్షణమైన వీడక నక్కజముగ. 338

తే.గీ. భరత శత్రుఘ్ను లెప్పుడు ప్రబలమైత్రి
కూడియుందురు నిరతమ్ము కోర్కె మీఱి –
రామునకు మాత్ర మసమాన ప్రేమ తమ్ము
లందరి యెడను తారతమ్యంబు లేక. 339

తే.గీ. ఆట పాటలనైన, హాస్యాని కైన
దుర్మతులుగారు, వదలరు ధర్మ పథము,



సత్యమేగాని పలుక, రకృత్యములను
చేయ రేనాడు వారెట్టి స్థితుల నైన. 340

## 4.5. రాజకుమారుల విద్యాభ్యాసము

వ. పిమ్మట శైశవంబు దాటి తగిన వయస్సులు వచ్చినంత, వసిష్ఠ మహా ముని దర్శనంబున, 341

తే.గీ. తన కొమరులకు చేయించె దశరథుండు,
చౌలమాదియౌ కర్మల శాస్త్రవిధిని,
ఉపనయనములు జరిపించె నుచిత రీతి
అధిక భక్తితో విధ్యుక్త విధులపైన. 342

తే.గీ. అక్షరాభ్యాసము జరిపి దీక్షనిచ్చి
వేద వేదాంగ విద్యల మోదమలర
అస్త్ర శస్త్రాది ధానుష్క శాస్త్రములను,
నేర్ప జేయించె సుతులచే నిరతి నృపతి. 343

తే.గీ. ఖడ్గ, చక్ర, గదాయుధ కదన గతులు,
వాజి, కుంజర, స్యందన వాహనములు,
ఉత్పల, రథముఖ సమర వ్యూహములును
నేర్ప జేసెను పుత్రుల నేర్పు మీఱ. 344

వ. ఆ విధంబుగ క్షత్రియ విధ్యుక్తధర్మ వర్తన కుపయుక్తంబులగు సకల విద్యలందును కొలది కాలమునకే కుమారులు నిష్ణాతులైరి. అందున విలువిద్యయందు నలువురు పుత్రులును అసమాన ప్రావీణ్యమును సంపాదించు కొనిరి. వీరిలో రామచంద్రుడు సహజ లబ్ధ చాతుర్యంబున ననన్యాదృశ ధనుశ్శాస్త్ర పారంగతుం డయ్యె. 345

చం. ఘనభుజుడైన రామ కరకల్పిత మార్గణ మెట్టి లక్ష్మణున్
తనుకక వీడబోదు దివి దాగిన, వారిధి లోతులందులన్
మునిగిన, వేరులోకముల మూలల దూరిన, మంత్రశక్తిచే
కనబడకుండ పోయిన ప్రకాశము గాక మరే స్థలంబునన్. 346

వ. తదనంతరంబు వారు మహారాజు సంస్థానంబునగల వివిధ పాలనా విభాగంబుల కొన్ని నాళ్ళు పరిశీలించి, 347

పంచచామరం.
సుమంతు దర్శనంబులోన సోదరుల్ నయంబునన్
సమీక్షణంబుగా నృపాలు సర్వ పాలనా విధుల్
క్రమంబుగాను నిర్వహించి ప్రజ్ఞతోడ నేర్చి రా
ప్రమాణభేదముల్, సరైన పద్ధతుల్ ప్రవీణతన్. 348

## 4.6. రాజకుమారుల దేశాటనము

తే.గీ. రాచ కొమరుల శిక్షణా క్రమమునందు
పట్టణంబులు, చిరుపల్లె పట్టులందు
వాసముండు దేశజనుల పరిచయంబు
ముఖ్యభాగంబుగా నొప్పు మూలమునను. 349

ఉ. పోటు మగండు రాఘవుడు ముప్వురు తమ్ములతోడ గూడి దే
శాటనచేయగా నరిగి జానపదంబుల పట్టణంబులన్
దీటుగ పర్యటించి యట దీనజనంబులతో మమైకమై
పాటవమొప్ప నేర్చె తన పౌరుల సాధక బాధకంబులన్. 350

తే.గీ. దేశమందుగల వివిధ తీర్థములను
ప్రీతి దర్శించి రా నరశ్రేష్ఠులపుడు



ప్రత్న సంస్కారములపట్ల ప్రజలలోన
భక్తి గౌరవంబులు పెంచు యుక్తితోడ. 351

తే.గీ. ఆ విధముగ దేశాటన మాచరించి
తిరిగి వారలయోధ్యకేతెంచి తల్లి
తండ్రులకు ప్రీతియొనరించి తగినరీతి
భరత లక్ష్మణ శత్రుఘ్ను లరితినుండ. 352

****

# 5. యోగసంవాద ఖండము

## 5.1 శ్రీరామచంద్రుని వ్యాకులత

సీ. దేశాటనము నుండి తిరిగి వచ్చిన రాము
దేదియో చింతించు నెపుడుగూడ,
ఏకాంతమునె కోరు నెవ్వరిన్ రానీడు,
వచ్చినవారితో పలుకబోడు,
దిగులుగా కూర్చుండు దృక్కులు నిక్కించి
దిక్కులు చూచును దీనునట్లు,
స్నానపానాదుల సంగతే మరచును
బోనంబుకై రాడు ప్రొద్దు రాత్రి,
తే.గీ. సుప్రభాత సేవల శ్రద్ధచూపడెపుడు
విప్రులాశీస్సు లైనను వినగబోడు,
ముదితలందించు సుమమాల ముడువకుండు,
వంది మాగధుల పొగడ్త లందుకొనడు. 353

తే.గీ. రాము డీ ప్రావ కృశియించి భ్రాంతుడయ్యె
చెప్ప లేని వ్యాధి ననుచు చెప్ప బోరు
ప్రభువు కైనను గాని యే ప్రగడ కైన
దాస దాసీజనంబులు దడియబడుచు. 354

తే.గీ. కొన్ని దినములలో చూడ కోర్కి గల్గి
రాజు పిలుపంప వచ్చెను రాము డటకు
సుతుని తీరు చూచిన నృపు డతుల దుఃఖ
మంది వైద్యుల రప్పించె నత్తరమున. 355



ఉ. వచ్చిన వైద్యశేఖరులు పాటవమొప్పగ రామచంద్రునిన్
హెచ్చరికన్ పరీక్షల ననేక మొనర్చి శరీర రుగ్మతల్
మచ్చునకైన లేవని, ప్రమాదము లెట్టివి యైన వీనికిన్
=Kõ_ ª =H%*ò ° ã‡ „ ¬È=OK@#° x%&~òOK@KC£ 356

వ. కుమారుని దీనస్థితికి తపించుచు, శరత్కాల నీరస మేఘంబు కైవడి యున్న మహారాజుతో నా భిషగ్వరులు యువరాజు కేవల మనోవ్యాకుల సంయుతుండని, యౌవనప్రాయులకు తరచు సంభవించు ఈ క్లేశంబు శమింప జేయ, పుత్రులకు వివాహములు చేయు సమయ మాసన్న మైనదని విన్నవించిరి. ఆ రాజవైద్యుల మాటలు తన తప్తాంతరంగంబును సంతోష భరితంబు గావింప, దశరథుండు జలపూరిత జలదంబు భంగి సంభరితుండై మంత్రి పురోహిత బంధు మిత్ర శ్రేయోభిలాష వర్గంబులను రప్పించి రాజకుమారులకు సత్వరమే తగిన వధువుల నన్వేషింప నాజ్ఞాపించెను. ఐనను, 357

ఉ. మానసమందు కించిదనుమానము తోడ నరేంద్రు డాతరిన్
మౌని వసిష్ఠ పుంగవుని మానుగ పిల్వగబంచి, వానికిన్
దీనత తెల్పి రాఘవుని తీవ్ర మనోవ్యథ, తీరు మార్గమున్
పూనిక బోధచేయుడని మ్రొక్కుచు వేడెను నమ్రశీర్షుడై. 358

ఉ. అంత వసిష్ఠుడున్ రవి కులాంబుధి సోముడు రామచంద్రు డే
కాంతముగా వసించెడు నికాయ్యము సొచ్చి యటన్ దిగాలుతో
చింతిలు రాఘవేంద్రు దరిజేరి నమస్కృతులంది, దీవనల్
వంతలు తీరనిచ్చి సుఖవంతముగా మనుమంచు, నిట్లనెన్. 359

ఆ.వె. "ఎట్టి కారణాన నీరీతి క్రుంగితి
వెలుక త్రవ్వినట్టి యిల్లువలెను,

మానసంబు, వపువు గ్లానమై క్షీణించి
యటమటించుచుంటి వయ్య నీవు!" 360

వ. అనుచు నతనితో సూక్ష్మముగా సంభాషించి, శ్రీరాముడు సంసారాంబుధిని తరించు తత్త్వ మార్గాన్వేషణలో నిమగ్నుడయ్యెననియు, నందు మూలముననే క్షోభాయుత చిత్తుండై యున్నాడని నిర్ణయించి, ఈ రీతిని తన మనమందు వితర్కించుకొనెను. 361

తే.గీ. తరచు వయసు ముదిరిన వేదాంత మొదవి
తత్త్వ చర్చలు మనమున తవులు గాని
బళిర ద్వాదశ వత్సర ప్రాయుడైన
చిఱుత కిట్టి విరక్తి విచిత్రమయ్యె. 362

తే.గీ. ఐన నీతండు సామాన్య మానవుండు
గాక విష్ణ్వంశ భూతుండు గాన నిట్లు
చిన్న తనమందె సత్యార్థ చిత్తు డయ్యె
ననుచు ననుకొంద మన్నచో నదియు గాదు. 363

తే.గీ. కాదు కాదిది శౌరి, సకల జగతి క
ధిపతి యేరీతి నజ్ఞాన తిమిర బద్ధ
సంశయుండౌనని మదిని శంక పుట్టి
క్షణము యోజించి మౌని కారణ మెరింగి, 364

వ. ఈ రీతిగ సింహావలోకనంబు చేసె, 365

చం. తొలి యొక నాడు శౌరి సిరి తొయ్యలి గూడి విరించి లోకమున్
తలిరిపు తోడనేగి యట ధాత నిలింప మునీంద్రవర్గముల్



వలగొని యర్ఘ్య పాద్యముల ప్రస్తుతి సేయగ సంతసించి, యా
కెలన సనత్కుమార ముని కేలినొసంగక యున్న క్రుద్ధుడై. 366

తే.గీ. "మునివయ్యును నిష్కాముడ
నను గర్వ మదాంధ వృత్తి నను గాంచవు గా
నినుమడిన కామమున భువి
నెనయుచు పెండ్లాడు వాడ విద్దర స్త్రీలన్." 367

కం. అనుచు శపించిన, తాపసి
కినుకను, "సర్వజ్ఞుడనని కెరలుచు శౌరీ!
కనుమూసి సమాధి స్థితి
చనిన నను శపించి తీవు చలమున కుమతీ! 368

వ. కనుక నిన్ను కొంతకాల మజ్ఞాన మావరించగల"దని సనత్కుమారుడు శ్రీహరిని శపించెను. ఆ శాప ఫలితముననే ఇపుడు విష్ణ్వంశ సంభూతునిగా జన్మించిన రాముని సర్వజ్ఞత్వము తాత్కాలికముగా నశించి అజ్ఞాన మనుభవించుచున్నాడని వసిష్ఠునకు విదితమైనది. కనుక ఈ తత్త్వ సంబంధితమైన అవివేక మాత్మపరిశీలన, బోధనలతో తీరునని నిశ్చయించి, ముందుగా శ్రీరాముని మనోరుగ్మతకు కారణము లాతని నోటనే వినదలచి, అతనితో నిట్లనెను. "ఓ రాఘవేంద్రా! 369

కం. ఏ కారణమున నీకీ
శోకము కలిగెనొ తెలిపిన సూచించెద నా
శోకం బుడిగెడు ప్రక్రియ,
నీకు న్నీ యభిమతంబు నెరవేరంగన్." 370

## 5.2. శ్రీరాముడు తన వ్యాకులతకు కారణములు చెప్పుట

వ. అనిన, శ్రీరామచంద్రుండు భక్తి ప్రపత్తు లుట్టిపడ వసిష్ఠ మునీంద్రునితో నిట్లనెను. "ఓ మునిశ్రేష్ఠా! నీవు మహాత్ముండవు. సప్తర్షి లోకారాధ్యుండవు. 371

కం. ఘనుడవు, విద్యాగురుడవు
ననుపమ తాపసవరుడవు నంబుజభవ నం
దనుడవు, తనువును మనమును
ననునయ మొనరించినట్టి యాత్మస్థుడవున్. 372

కం. అనుభవ వేదాంత నిధివి,
ఇనకుల నృపతుల గురుండ విహపరములలో –
ననయము నీవు వినా నా
కనువుగ నెవ్వారలు గల రార్తిన్ దీర్పన్. 373

కం. వినియే యుందువు నే మును
మునుకొని సోదరుల తోడ పోయితి దేశా
టనమునకై – అట చూచితి
ననల్ప విపరీత మానవాలోడితముల్. 374

వ. పట్టణంబులను, పల్లెపట్టులను, తీర్థ స్థలములను ననేక వ్యాపకంబుల నున్న మానవానీకంబును చూచితిని. వివిధ వ్యాసంగములతో కాలము గడుపుచున్న ధనవంతులను, నిరుపేదలను, శిశువులను, బాలురను, యువకులను, తరుణ వయస్కులను, వృద్ధులను, పురుషులను, స్త్రీలను, బ్రహ్మచారులను, సంసారులను చూచితిని. జీవితము దెస వీరి దృక్పథము వింతగ తోచి, నాకు తత్త్వ విచారము కల్గెను. దీని మూలముననే, 375



తే.గీ. బాటసారికి నిర్జల ప్రాంతమందు,
ఎటుల నభిరుచి లేకుండు నటుల నాకు
విషయ భోగములందున ప్రీతి సమసి,
రక్తి లోపించి పూర్తి విరక్తి దోచె. 376

తే.గీ. దురిత నిస్సార సంసార దుఃఖ మెట్లు
నే నధిగమించ గలనంచు నిర్ణయించ
లేక వివిధ మార్గముల నాలోకనంబు
చేసి కుములు చున్నాడ నే చింతతోడ. 377

వ. మానవ జీవితమున సుఖమున్నదా! ఎంత మాత్రమును లేదు. మానవుడు చచ్చుటకై పుట్టు చున్నాడు. తిరిగి పుట్టుటకై చచ్చుచున్నాడు. రెండును దుఃఖకారకములే కదా! 378

ఉ. జౌకున పుట్టుటల్ పెరిగి చచ్చెడి పుట్టెడి చక్రమందునన్
వ్యాకులమైన జీవనము లర్థమెరుంగక వ్యర్థ యత్నులై
శోకముతో పరిభ్రమణ స్రుక్కుచు లోకు లొనర్తురేల, వా
రేకిన దూదినే తిరిగి యేకెడు నేకులవాని రీతిలో! 379

ఉ. ఎప్పుడు మాతృగర్భమున నెందుకు జేరునొ ఆత్మ జీవియై
ఎప్పుడు రూపమేర్పడునొ, ఎప్పుడు వానికి శ్వాస గల్గునో
ఎప్పుడు వాడు భూమిపయి నేల జనించునొ, ఎట్లు మ్రందునో
చెప్పగ నేరరెవ్వరును, జీవి ప్రమేయము లేదు దీనిలో. 380

వ. ఈ జనన, మరణ వ్యవస్థలలో జీవుల ప్రయత్నము కాని ఇచ్ఛగాని యుండనే యుండదు. ఇట్లు మన ప్రమేయములేని జీవితముల పైనను, నమ్మకము లేని బ్రతుకుల పైనను మనకెట్లు ప్రీతికలుగుచున్నది. 381

తే.గీ. ఇలను జీవి జననము యాదృచ్ఛికమ్ము,
తలప నిదియొక గొప్పవింత యగుగాదె!
పుట్టు ప్రతిజీవి తప్పక గిట్టి తీరు
ఇదియు వేరొక్క వింత మహిని తలంప! 382

వ. భూమిపై పుట్టిన ప్రతివ్యక్తియు నేడ్చుచూనే పుట్టును. వాడు గతించి నపుడు వాని భార్యా పుత్ర బంధు మిత్ర వర్గంబులు విచారముతో దుఃఖించు చున్నారు. కాని, వా రచిరకాలముననే, తిరిగి సంతసము గొల్పెడు కార్యములలో నిమగ్ను లౌదురు. తలిదండ్రులు మొదలగు నత్యంతాత్మ బంధువులను కోల్పోయి దుఃఖపూరిత మనస్కులైన యువతీయువకులే తమకు శిశువు జనింప నధిక సంతోషమున నోలలాడు చుందురు. పుట్టిన ప్రతిప్రాణియు గిట్టక తప్పదని యెరింగియు, తమ నిత్య జీవనముల వార లానందముగ నిరతితో సాగించుచున్నారు. మేధావంతులు గూడ ప్రతిదినము వారు చేసెడు దైనందిన కార్యములను రుచించినను రుచించకున్నను మరల మరల చేయు చున్నారు. ఇదెట్లు సాధ్యమో నా కంతు పట్టకున్నది. 383

మ. జవనాధిక్య లులాయమెక్కి జము డజ్ఞాతంబుగా డగ్గఱై
అవచాటంబుగ నెత్తుకెళ్ళునని మున్నాలించియున్ గూడ, నీ
భువిలో ప్రాణులు నాడునేడనక వాపోకుండ సాగింతు రే
చవిలేకన్ తమ కాపురంబులు మహేచ్ఛన్ చూడ చోద్యంబుగా. 384

[1]సీ. మరల నిదేల నీ మనువంచు తలపక
నీ భువి జనులెల్ల నెల్ల వేళ
చేసిన సంసారమే సేయుచుందురు
రుచియున్న లేకున్న రోయకుండ,
తనవార లనుకొన్న దారాదు లీల్గినన్
కొలలేని భోగాల వలల చిక్కి



దుఃఖంబు దిగమ్రింగి దొరలు చుందురు గాదె
తమదైన యనుభూతి తమ దటంచు,
తే.గీ. భ్రమసి యలవాట్లు విడనాడ వలనుగాక,
సెలసి తిరుగు చుందురుగాదె యలసిగూడ
మురిసి దీపంబు చుట్టును పురువు లట్లు,
చకిత నిస్సార సంసార చక్రమందు. 385

## 5.3. శ్రీరాముడు మానవ జీవితమునగల దుఃఖహేతువులు వివరించుట

వ. ఈ ప్రపంచములోని సమస్తమైన చేష్టలు, విషయములు, పదార్థములు అస్థిరములే, దుఃఖహేతువులే. సంపదలు, ఆయువు, అహంకారము, తృష్ణ, చేతస్సు, శరీరము, కాలము, బాల్యము, యౌవనము, కామము, ముదిమి మున్నగున వన్నియు మానవ జీవితమును దుఃఖపూరితము కావించుచున్నవి.

**సంపదలు :**

సంపదలే సుఖముల నిచ్చునవి. అవి విలువైనవని, కనుక పొంద వలెనని మూఢులు తలంతురు. కాని నిజమునకు అవి మోహకారకములు, అనర్థ దాయకములు. 386

తే.గీ. ధనముతోడను సుఖములు కొనగవచ్చు,
భాగ్యవంతుల కెట్టి యిబ్బంది లేదు,
రాజపుత్రుల కెపుడు విరక్తి రాదు,
కనుక నీకెందు కీ చింత యనగ వలదు. 387

వ. నాకు సంపద కలదు. దాని మూలమున నేను భోగముల ననుభవించ గలను. కాని మరల మరల నవే భోగముల పొంది సంతోషించు టెట్లు

పొసగును. భోగ సమయమున మాత్రముండు విషయ సౌఖ్యములు క్షణికములు. ఆపదలకు మూలములు. పాపజనకములు. తుదకు దుఃఖహేతువులే. ఏలన, 388

తే.గీ. సంపదలు చూడగా భోగలంపటములు
మోహ మొనరించు మనమును మోహరించి
కూడి సుగుణములను పొనుగు పడజేయు
దుష్ట హేతువై జనులకు దుఃఖ మొసగు. 389

వ. కనుక నిట్టి వంచన స్వభావము కల సంపదలను మానవుడు నమ్మరాదు. దుఃఖహేతువులైన తుచ్ఛ ధన, భూషణ, స్త్రీ సుఖాదులపై నా కిచ్ఛ లేదు.

**ఆయుష్యము :**

సంపదల వలె నాయువును గూడ నమ్మజాలము. 390

తే.గీ. చిగురుటాకు కొసను వ్రేలు చిన్న మంచు
బిందువట్లు, మత్తుని కరమందు ఱాయి
వోలె, స్థిరముగా కే క్షణంబునను నైన
విడిచి పోవచ్చు నాయువు విధిని బట్టి. 391

ఉ. పొందుగ కానలో వెదురు బొంగులు వేడికి చిట్లిపోవ, నా
సందుల లోన వాయువు ప్రసారణ జెందుచు వేణునాదమై
విందులు సేయురీతి బహువింతగ మానవ దేహమందునన్
బంధులరీతి గాలి చొరి ప్రాణము లాడగ చేయు గాదొకో! 392

వ. ఇట్టి సందర్భమందు ఏ కారణము చేతనైనను, వెదురు గొట్టము లోనికి గాలి చొరుటాగిపోయినచో నాద మాగిపోవును. ఆ రీతినే ప్రాణ స్పందన లేక మానవ జీవితమంతమొందును. అటు లనిశ్చితమును, మన స్వాధీనములో లేని ఆయువు విశ్వాసపాత్రమెట్లగును. 393



తే.గీ. తివిరి గాలిని చేత బంధింప వచ్చు,
కోరి భంగములను త్రాట గ్రుచ్చ వచ్చు.
పెనగి తారాచయము లెక్క పెట్ట వచ్చు,
ఆయువును నియమింప సాధ్యంబు గాదు. 394

**అహంకారము :**

అహంకారము మానవుని కవిద్య వలన కలుగుచున్నది. అహంకారమే అహంభావము; నేనను అభిమానము. గర్వము. కొందరు దీనిని ఆత్మ గౌరవమని తలంతురు కాని అది సరిగాదు. 395

తే.గీ. స్వాభిమానంబు జీవుల సకల దుఃఖ
మూలమగును, క్లేశములకు పుట్టునిల్లు;
దీనకలుగు రాగ ద్వేష తృష్ణలరయ,
ఇదియె మన మానసిక జాడ్య హేతువయ్యె. 396

**మనస్సు :**

తే.గీ. జనుల హంకార వృత్తివోలెను మనస్సు
కూడ దోష జనకమౌను చూడ, నందు
కై నిదియును క్లేశములకు కారణమ్ము,
చిత్త చాంచల్యము వ్యథకు విత్తనమ్ము. 397

తే.గీ. కారణము లేక నటునిటు గ్రామ సింహ
మెపుడు పర్వెత్తు తెరగున నెడద గూడ
విషయ చింతనతోడ నవిరళితముగ
నిరతి తిరుగాడు చుండును నియతిలేక. 398

వ. చిత్తమట్లు పరుగెత్తికూడ నేమియు సాధించ గలుగుట లేదు. 399

తే.గీ. ఈ జగత్తు, దీని యునికి, సృష్టి, లయము
లరయ మన మనఃకల్పితాలౌట నీ జ
గమున కస్తిత్వమునులేదు, కాన జనులు
మోహబద్ధులౌటేలకో ముగ్ధులగుచు. 400

తే.గీ. జ్ఞానహీనత మృగములు జలము కొరకు
తివిరి మగతృష్ణకై పర్వుతీయునట్లు
విషయ భోగముల దవిలి వెర్రి జనులు
దుఃఖ భాజనులగుదురు తుట్ట తుదకు. 401

తే.గీ. సంపదలచేత భోగముల్ నింపుకొనుచు
జీవితము సుఖవంతంబు చేయ బూన,
చిల్లు గంపను నీరంబు చేదినట్లు,
చేతమునకు సంపూర్ణత చేరబోదు. 402

తే.గీ. స్వాభిమానంబు పూర్తిగా చంపు కొరకు
మన మనసు నిగ్రహించుట మాత్రమే సు
నిశిత మార్గంబు – దుష్ట మానసిక పీడ
లన్ని దీని మూలంబున నడగిపోవు. 403

వ. ఈ విధంబుగ మానవుడు శాంత చిత్తుడును, ఉద్వేగ రహితుడు నగుచున్నాడు. కాని, మనసును నిగ్రహించుట అతికష్టముతో కూడుకొన్నది. 404

తే.గీ. అనల భక్షణకన్న, మహా సముద్ర
సలిల పానము కన్న దుస్సాధ మరయ
నిగ్రహించంగ చిత్తంబు – ప్రగ్రహించి
నియమ విధులను దీనిని నిలుప వలయు. 405



**తృష్ణ (ఆశ) :**

తే.గీ. జనుల మనుగడ క్లేశభాజనము చేయ
ఆశ మరియొక దాటరానట్టి భిత్తి,
అవని నందరి భ్రమగొల్పు – నదియ పరమ
నింద్యమై విషయములలో నిరతి గూర్చు. 406

మ. ధనమో, లౌకిక విద్యలో, సుదతులో, తారుణ్య భోగంబులో,
ఒనరన్ హర్మ్యములో, ప్రసాధనములో, ఉద్యోగమో, కీర్తియో,
తనివింజెందగబోక తృష్ణ ఘృత సంతప్తాగ్ని కీలట్టు లిం
కను తెమ్మంచును రేచి కోరికల దుఃఖవ్యాప్తి నొందించెడున్. 407

తే.గీ. ఆశ యన్నది జనుల నాయాసపెట్టు
వృద్ధవేశ్యవోలె తనకు వీలుపడని
తరుణ విషయ సాధనకు యత్నములు సలిపి
గునిసియాడు చూపరులు జుగుప్స పడగ. 408

తే.గీ. జలముచులు మంచుతోగూడి చలి జనింప
జేసి తుదకు సూర్యుని కప్పి వేసినటుల,
మోహ మిళిత తృష్ణ మనల మోహరించి,
అజ్ఞతను రేచి జ్ఞానంబు వ్యవధ పరచు. 409

తే.గీ. ఆశ దుర్భరంబగు విష వ్యాధి తలప,
ఔషధము తోడ తగ్గక నధికమగును,
మహితమౌ వివేక జ్ఞాన మంత్ర జప పు
నశ్చరణమె దీని హరించు నిశ్చయముగ. 410

**దేహము :**

తే.గీ. దేహమందున జనులకు మోహ మధిక
మగుట, తగు పుష్టినొసగె డాహార మిచ్చి,
రోగ మావహించగ నీక యోగ సాధ
నాది మార్గాల రక్షింతు రైన గాని, 411

తే.గీ. విషయ భోగాభిమాన వివేక హీన
చిత్త చాంచల్య తృష్ణాది చిత్ర దుఃఖ
హేతువులు శరీరంబుపై హెచ్చు పట్టు
గలిగి డించి బాధించి వికల మొనర్చు. 412

తే.గీ. రక్తమాంసయుతము శరీరంబు చూడ
దీని రమ్య తేమియొ నాకు తెలియదయ్యె,
క్షయము నొందుటె దేహలక్షణము గాన
గడ్డిపోచవలెను దీని కాంచవలయు. 413

**కాలము:**

కాల మనిర్వచనీయమైన మహత్వ తత్త్వము. కొందరు దీనిని పెద్ద దొంగగా నభివర్ణింతురు. 414

ద్విపద :
పొలివడి లోనికి పోవుటే గాని,
వెలువడి తిరిగి మలయుటయె లేని
కాలము చిమ్మ చీకటి గుండ మరయ,
వేలా విహీనమౌ ఆలాయ మిద్ది. 415



తే.గీ. విశ్వమందున్న సకలంబు విడవకుండ
నొక్కటొకటిగ కొనిపోయి యొడుపున తన
పెద్ద బాన బొజ్జను గల భయద వక్త్ర
మందు పడవేయుటే కాల మహిమ తలప. 416

[2]వ. కాలము సర్వత్ర జరగు పెద్ద, చిన్న పరిణామములకు మూల కారణము. విశ్వమందున పదార్థ నాశన, భవంబుల కల్పించి, అంతరిక్షమున నున్న నక్షత్ర మండలంబులను, గ్రహములను లయించి, క్రొత్తవి సృష్టించి నిరంతర చలన, భ్రమణములను కల్గించునది కాలమే గదా. అందనుక నేల? మన భూమినే ఉదాహరణగా పరిగణించి చూచిన, కొన్ని కోట్ల సంవత్సరములకు పూర్వము, ఎక్కడనో దక్షిణ ధ్రువప్రాంతమున నున్న మన భరతఖండమును ఉత్తరముగా ప్రయాణింప చేసి, ఈ ఖండమున కుత్తరమందుండెడు మహా సముద్రమును మ్రింగించి, ఎదురైన భూభాగముతో డీకొల్పి, అత్యున్నతమైన హిమాలయ పర్వతములను పైకిలేపినదియు, నా పర్వతముల క్రిందకు మన భరత ఖండమును నేడును త్రోయుచున్నదియు నీ కాలమే.

అటులనే, లఘు కాల పరిమాణమున, మానవ జీవితములో బాల్య, యౌవన, వృద్ధాది దశలకు పరిణామకారకము కాలమే కదా! 417

**బాల్యము :**

తే.గీ. చిన్న పాప లమాయక చిత్త నిర్మ
లాత్మ లగుట, దైవ సమానులనియు, వారి
పొడగన మనల కానంద మడరు చుండు
ననియు పల్కుదు రిదియు సత్యంబె కాని, 418

వ. శిశువులు మనకెట్లు గోచరింతురని కాక, ఆ వయస్సున వారిలోని జీవుల కెట్టి యనుభూతి యుండునని యాలోచన చేసినచో, పసితన మజ్ఞా

నమునకు, అశక్తతకు, పరాధీనతకు నిలయము. బాల్యదశ వాంఛ, మూర్ఖత్వము వంటి దోషములకు పరాకాష్ఠయై దుఃఖపూరితమగు చున్నది. 419

తే.గీ. పసితనము మక్షికాదుల బాధ లాప
లేని, క్షుత్పిపాసల గూర్చి యైన చెప్ప
లేని, మూగబ్రదుకుగాన హీనమగును –
బాల్య మవివేక దోషాన పరిఢవిల్లు. 420

**యౌవనము :**

ఇక యౌవనము మానవుని దశలన్నింటను ప్రశస్తమైన దందురు. ఇది కొంతవరకు సత్యమే, కాని 421

తే.గీ. యౌవనావస్థ దేహదార్ఢ్య యుతమగును
గాన, ద్వేష, మత్సర, మద, గర్వములకు
వేది, వినయ సౌశీల్య దయాది సుగుణ
వర్జిత మధికకామ సంవర్ధకంబు. 422

**స్త్రీ :**

ఇక, 'ఆపాతరమణీయత్వం కల్పతే కేవలం స్త్రియామ్' అన్నట్లు. 423

తే.గీ. వయసులో నున్న యువతి యువకు లొకరి కొ
కరు పరస్పరాకర్షణల రమణీయ
చిత్త చాంచల్యవృత్తిలో మత్తులగుచు,
చుట్టు నున్నట్టి జగతిని చూడ బోరు. 424

తే.గీ భయము, లజ్జయును మరచి ప్రక్క నున్న
పెద్దలను లెక్కసేయక బెట్టు తోడ



తమ భవిష్యత్తుకైన చింత పడకుండ
కెలసి కల్పిత రమ్యతన్ కెరలు వారు. 425

తే.గీ పతిత సంసార కాసార భంగి యందు,
చిత్తమను జౌకున తిరుగు చేపలనెడు
పురుషులకు గాలపు కొనల నెఱల వోలె
వేచి స్త్రీలు కవ్వింతురు ప్రేమ జూపి. 426

వ. ఈ విధముగా స్త్రీ పురుషున కనర్థ హేతువై తుదకు దుఃఖమునకు దారితీయుచున్నది. అటులే, స్త్రీ జీవితమున పురుషుడు ప్రవేశించి ఆమె విచారమునకు కారణభూతుడగు చున్నాడు. 427

**వార్ధకం :**

ఇంక, 428

తే.గీ. ఆటపాటలపై నాస లడగకుండ
బాల్యము గతించి యౌవనప్రాప్తి యగును,
తరుణభోగాలపై ప్రీతి తరుగ కుండ
ముదిమి పైబడి జనులను మోస పరచు. 429

తే.గీ. ముసలితనమున దార్ఢ్యంబు పొలియబడును,
ముఱిగిపోయి శరీరంబు ముడుతలు పడి
వణుకు పుట్టును, నడువంగ వశము కాదు,
తిన్న దరుగక స్వస్థత ఛిన్నమగును. 430

తే.గీ. వృద్ధ వికృత రూపము చూచి దద్దరిల్లి
బంధు మిత్రులు, సేవక వ్రాతములును,

తుదకు భార్యయు, పుత్రులు, దుహిత లెల్ల
రీసడించెదరు, బ్రదుకు హీనమగును. 431

తే.గీ. విషయభోగంబుల ననుభవించు శక్తి
యుండకున్నను కోరికల్ మెండు గాన
ఖేద మోహ మాత్సర్య విషాదములకు
తగిన వాస స్థలంబు వృద్ధాప్య మరయ. 432

వ. కనుక నో గురుదేవా! ఏ రీతిగా చూచినను, 433

తే.గీ. బాల్య, యౌవన, వృద్ధాద్యవస్థలు గల
తనువు – నాయుష్షు, ధనము, పదార్థ సంచ
యములు గూడ ననిత్యము లస్థిరములు –
చిత్తమును దాని వృత్తులు చింత నిచ్చు. 434

వ. ఈ విధముగా ప్రతి జీవి అనుభవించు సహజ పరిణామములు, వాని చుట్టుకొను విషయములు పుట్టిన దాదిగా చచ్చు వరకును నిరంతర విషాదహేతువులే. వీటిలో నేదియు విజ్ఞుడైన మానవునకు సుఖముగాని, ఆనందముగాని ఇచ్చునవికావు. ఎందులకీ జన్మములు. ఎందులకీ చర్విత చర్వణ జనన, మరణ వృత్తగమనములు", అని వాపోయి రామచంద్రుడు తిరిగి ఇట్లని చెప్పు చున్నాడు. 435

తే.గీ. "రాజ్యమన్నను నాకెట్టి రక్తి లేదు,
సంపదలపైన నైన నాసక్తి లేదు,
ఇంతులు సుఖ మిత్తురనెడు భ్రాంతి లేదు,
విషయ భోగములెల్లను విషసమములు. 436



తే.గీ. మనువు పైనను నాకు నమ్మకము లేదు,
ఆయువందు సుంతైన మోహంబు లేదు,
నే నహంకృతి విడిచితి నిగ్రహించి,
చేతమందు తృష్ణ నశింప చేసినాడ. 437

ఉ. ఐనను గాని వ్యాకులత యాఱదు పోదు క్షయించి, జన్మ సం
ధానిత దుఃఖ సంతతి వినాశ మొనర్చి మదిన్ ప్రశాంతి స
మ్మానితమై నిరంతరము మానుగ నిల్పెదు నిశ్చయంబునన్
పూనిక దీక్ష గొంటి ననుమోదముతో పిన నాట నుండియున్. 438

కం. కావున మునివర్యా! మే
ధావి చయము లే విశిష్ట తత్త్వజ్ఞాన
ప్రావీణ్యమున సుఖింతురొ
పావనులై క్లేశ రహిత భావముతోడన్. 439

కం. ఆ కౌశల్యము నా ధృతి
రాకా శుభ్రాంశు సదృశ! ప్రస్ఫుట రీతిన్
వీకను నీ శిష్యుడనౌ
నాకున్ బోధించుమయ్య నలువ కుమారా! 440

తే.గీ. తామసీ రాత్రి పూర్ణచంద్ర సుషమంబు
సోకగా నంధకారంబు సొరగు రీతి,
సద్గురుని కటాక్షమనెడు జ్ఞాన వృష్టి
తవిలి దుష్ట మానసిక వ్యథలు నశించు" 441

వ. అని రాముడు తన మనోవేదనను గురువునకు తెలిపి, దానికి విమోచన మార్గము నెరుగ జెప్పుమని ప్రార్థించెను. 442

## 5.4. వసిష్ఠుడు రామునకు వేదాంతజ్ఞానమును బోధించుట

వ. ఆ మాటలు విన్న వసిష్ఠ మునీంద్రుండు రాముని విపరీత మానసిక ధోరణికి గల కారణము ప్రస్తుత మాతడు నివృత్తి పథంబున నుండు మూలంబున నని, ప్రవృత్తి మార్గంబు నవలంబించిన నాతని వ్యాకులత నశించి, చిత్త మానంద మండితంబగునని తలచి, అతనితో ముఖా ముఖి అద్వైత వేదాంత రహస్యంబులను చర్చించెను.

"జ్ఞానవంతులలో శ్రేష్ఠుడవగు నో రామా! ఇంత పిన్న వయస్సునందే, మహాజ్ఞానికి గలుగు నజ్ఞానసంబంధితంబులైన సంశయములు నీ మనసును కలవర పెట్టుచున్నవి. కావున నీకు వేరుగా తెలియవలసిన దేదియును లేదు. నీ నిశిత మేధాశక్తిచే సర్వమును తెలిసికొంటివి. అయినను నీ వడిగితివి కనుక కొన్ని సూక్ష్మముల విశదీకరించెదను, విను" మని ఇట్లు పలికెను.

" ప్రపంచము మిథ్య, అసత్యము, క్షణికము. ఒక్క విశ్వేశ్వరుడే సత్యము, శాశ్వతము, ఈ జగతి, దాని సృష్టి స్థితి లయ లా జగన్నాథుని లీలా నాటకములే. మానవుడు దైవమాయాబద్ధుడై తాను చూచు చున్న ప్రపంచము నిజమని నమ్మి సుఖ దుఃఖంబు లనుభవించుచున్నాడు. మానవ ధ్యేయ మీ మాయ నధిగమించి భగవంతుని చేరుటయే. అంత దనుక తన విధ్యుక్త ధర్మంబులు విడనాడక, తన ప్రవృత్తి ననుసరించి సత్కర్మలను చేయవలెను. కర్మల నాచరించుచునే జ్ఞాన మార్గంబున జనన మరణ చక్రమునుండి విముక్తి పొందవలె"నని సవిస్తరముగా కథల రూపమున, ఉదాహరణలతోను, తర్కశాస్త్ర ‹ ¶â Œ¥-Ρ| ° ` ⅜° 3ఉత్పత్తి, స్థితి, నిర్వాణ విషయములను విశదీకరించి, మరియు వసిష్ఠుడు శ్రీరామునితో నిట్లనెను, 443

ఉ. "నీవు వివేకవంతుడవు, నీవు సమస్తమెరింగినట్టి సం
భావిత దివ్యతేజమవు, ప్రాపిత దైవ కళాంశువున్, నిరా
శావృత దీనునట్టు లిటు లారడ కోల్పడి భూరి నిస్పృహన్
వావిరి క్రుంగి దుఃఖమున బద్ధుడవై జడు డౌట చెల్లునే! 444



కం. ప్రజ్ఞాసామర్థ్యము గల
విజ్ఞానియు గూడ మాయ వెన్నంటినచో
అజ్ఞుండై భ్రమణించుచు
విజ్ఞత కోల్పోయి దుఃఖవేదన నందున్. 445

ఉ. ఎందులకయ్య హాయి మెయి నెన్నగలేని సుఖంబులున్ సదా
విందులుచేయ జీవితము ప్రీతిగ పుచ్చెదు నేర్పు గల్గి, ఈ
చందము కందిపోయితివి జ్ఞానవిహీనత వ్యాకులుండవై
క్రిందకు మీదకున్ భ్రమసి గెంతుచు కందువు వేగు గింజనాన్. 446

తే.గీ. మోహమనెడు మహోన్నత వాహ నోర్మి
పంక్తులందున తిరుగుచు బద్ధుడవయి
మునిగి పోవుచునుంటివి ముక్తి లేక
కలుష సంసార జలధి పంకిలమునందు. 447

తే.గీ. జ్ఞాన రూపమౌ యుక్తిచే సంచరించు
ప్రాజ్ఞునకు భవాంభోధి గోష్పాద సన్ని
భంబగుట జ్ఞాన యోగాన పాప సంయు
తమగు జీవితంబును వీక దాటనగును. 448

తే.గీ. ఇట్టి యోగంబు చేపట్ట నట్టి వాని
బ్రదుకు క్షోభిల్లి, భంగముల్, భ్రమలు గలిగి,
కలిలమౌ నిమ్న తలములు, గహ్వరముల
తోడ భయద జలధి వోలె తోచుచుండు. 449

వ. ఇట్టి సంసార పారావారంబున గల వివిధ భయంకర, మాంసభక్షణాశతో నున్న సొరచేపలు, తిమింగలములు, మొసళ్ళు మొదలగు జలచరములు మానవునకు క్షణక్షణ భయాందోళనల కల్పించి వాని జీవితము నిరంతర దుఃఖభాజనము సేయును. 450

తే.గీ. మోహనిర్వృత్తి గల మహాత్ముల నిషంగ
బలమున నొడుదుడుకులేక భయదమౌ భ
వోదధిని చెక్కు చెదరని యోడపైన
తగు సరంగు నడుపునట్లు దాట గలము. 451

తే.గీ. నాటకంబాడు నప్పుడు నటుడు రంగు
ముఖమునకు బంకతోడను పూసికొనుచు
వచ్చి తన పాత్ర పోషించి పరవశతను,
పిదప నారంగును తుడిచి వేయు రీతి, 452

ఆ.వె. నీటిపైన దేలి నెమ్మి నీరును తాకి
తాక కుండు తామరాకు విధము.
జ్ఞానులైన బ్రహ్మ, జనకాదుల వలె
సక్తి లేని మనువు సలుప వలయు. 453

వ. సంసారమున నుండు సుఖ దుఃఖంబులు పట్టించుకొనక తమ విధ్యుక్త కర్మలను చేయుచు జీవితమును ప్రియప్రదంబుగా సాగించు మహాజ్ఞానులైన మహాత్ముల భంగి, నీవును ఫలాపేక్షా రహితుడవై, అసంసక్తుడవై, లోక సంగ్రహార్థమై వ్యావహారిక కర్మలను చేయుచుండు"మని, మహాతేజస్వియగు వసిష్ఠుండు విజ్ఞాన సహితమగు అద్వైతసిద్ధాంతంబుల ననేక గాథల నుదాహరించుచు శ్రీరామునికి బోధించెను.



తన గురుదేవుడైన వసిష్ఠుని బోధల నతిశ్రద్ధతో విని, కేవల పరమాత్మాంశ సంభూతుండును, పురాణ పురుషుండును కావున శ్రీరామచంద్రమూర్తి సంపూర్ణముగ నాకళింపు చేసుకొని, నిష్కాములగు జనకాదుల వలె దానును వర్తింప మొదలిడి, మనస్తాప విముక్తుడై, క్షోభరహితుడై స్వస్థత నొంది, పూర్వమట్లు తన యువరాజోచిత దైనందిన వ్యవహారముల నిర్వహించు చుండెను. 454

---

**వివరణలు :**

1. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' లోని ఒకపద్యచరణములను పోలిన చరణము లిందులో నున్నవి.

2 ఈ వచనములో నేటి అధునాతన వైజ్ఞానిక విషయములు పొందుపరుప బడినవి. ఇవన్నియు నాటి త్రేతాయుగమున నున్న వారెరుగుదురా యను ప్రశ్న ఉదయింప వచ్చును. కాని, ఈనాడు రచింపబడుచున్న గ్రంథమున మన మెరిగిన ఆధునిక శాస్త్ర విషయములు చొప్పించకయున్న, ఈ గ్రంథ మధునాతన మెట్లగును. అంతియగాక మనము దైవముగ నమ్మిన శ్రీరామునకును, మహాత్ముడు, త్రికాలవేది యైన వసిష్ఠునకును ఈ విజ్ఞానము అందుబాటులోలేదని చెప్పగలమా?

3 వసిష్ఠుడు శ్రీరామచంద్రునకు సంభాషణా పద్ధతిని బోధించిన వేదాంత తత్త్వములు 'యోగ వాసిష్ఠ' మను పేర వాల్మీక కవీంద్ర విరచితముగా అర్ష సాహిత్యమందు ప్రసిద్ధి గాంచినవి. కాని, ఈ వేదాంత చర్చ వాల్మీకి రామాయణమున లేదు. కొన్ని వాల్మీకేతర రామాయణములలో నున్నదని తెలియవచ్చు చున్నది. మన ప్రస్తుత రామాయణ పాఠకులకు యోగవాసిష్ఠమును పరిచయము చేయు యత్నముతో దానిలోని భావములును సూక్ష్మముగా, క్లిష్టవేదాంత చర్చల జోలికి పోకుండ, ప్రత్యేక 'ఖండము'గా నిచ్చట ప్రవేశపెట్టితిని.

యోగవాసిష్ఠ గ్రంథమునను, దీని నుటంకించిన రామాయణము లందునను, శ్రీ రామచంద్ర వసిష్ఠుల సంవాదము, విశ్వామిత్రుడు తన యజ్ఞ సంరక్షణార్థము రామ లక్ష్మణులను పంపుమని దశరథుని కోరుట కయోధ్య కేతెంచి నపుడు దశరథుని నిండు పేరోలగమున జరిగినట్లు చెప్పబడినది. కాని నాకు ఇంతటి విస్తృత వేదాంత చర్చ

రాజసభలో పండిత, పామర, రాజోద్యోగ, సైనిక, సేవకుల సమక్షమున కొన్ని వారములపాటు జరిగిన దనుటకన్న గురు శిష్యుల మధ్య నేకాంతంబుగ యువరాజా గారమున జరిగినదనుట సమంజసముగా కన్పట్టినది. అందుచే దీనిని నిచటనే జరిపించితిని.

యోగవాసిష్ఠము ముప్పదివేల శ్లోకములు గలిగిన యొక బృహత్ గ్రంథము. దీనిని కొందరు కవి పండితులు, తత్త్వజ్ఞులును సంగ్రహించి శ్లోక, వ్యాఖ్యానముల తోడను, మరి కొందరు వచనములో ఉపన్యాస రూపమునను తిరుగ వ్రాసి యున్నారు. అందు ఈ క్రిందివి రెండును నా దృష్టికి వచ్చిన ప్రఖ్యాతి నొందిన ప్రశస్త తెలుగు గ్రంథములు:

1. శ్రీ యోగవాసిష్ఠ రత్నాకరము, రచన: శ్రీస్వామి విద్యాప్రకాశానందస్వామివారు, శుక బ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తి; (మూలమునుండి కొన్ని శ్లోకములను ప్రత్యేకముగా గ్రహించి వాటికి తెలుగు వచన రూపమున ననువదించిన గ్రంథము).

2. యోగవాసిష్ఠ హృదయము, రచన : బ్రహ్మశ్రీ కుప్పా కృష్ణమూర్తిగారు; (మూలమును సంగ్రహించి తెలుగున నుపన్యాస రూపమున మొదట దూరదర్శనమందు ప్రసారము చేసి, తదుపరి రెండు భాగములుగా ప్రచురించబడిన వచన గ్రంథము). ప్రచురణ: రాగరాగిణీట్రస్ట్, శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమం, అవధూతదత్తపీఠం, ఊటీ రోడ్డు, మైసూరు.

***

# 6. సీతావిర్భావ ఖండము

## 6.1. శ్రీమహాలక్ష్మి మాతులుంగిగా భూలోకమున జనించుట

వ. శ్రీరామ జననమునకు కొంత కాలము పూర్వమే, 455

శా. శ్రీ లక్ష్మీసతి విష్ణుమూర్తి ముదలన్ చెన్నొంది ధాత్రీస్థలిన్
లీలామానుషరూపయై వెలసె హాళిన్ దైవ కార్యార్థమై,
వ్యాలోలంబున దైత్యకాంతల గళవ్రాతంపు సూత్రంబులున్
నేలంగూలగ, సంతసించి త్రిదశానీకంబు నర్తించగన్. 456

వ. అదెట్లన్న, 457

మ. మును పద్మాక్ష నరేంద్రు డొక్కరుడు సంపూర్ణప్రకామాత్ముడై
ధన భూషాదులపై విమోహ నిరతిన్ తారాడి లక్ష్మీసతిన్
తన యింటన్ ప్రభవింప కోరుచును ప్రత్యాశన్ ప్రపన్నాత్ముడై
అనుతాపించగ చాల యేండ్లు సిరి ప్రత్యాసన్నయై యిట్లనెన్. 458

తే.గీ. కామితంబులపై వాంఛ కలిగి నీవు,
పూర్వ జన్మల పుణ్యంబు పొసగ కుండ,
నను కుమార్తెగ కోరుట చనునె రాజ!
దీన పొందెద వాపదల్ తీవ్రముగను. 459

వ. ఐనను అడిగితివి గనుక, నీ కోర్కె తీర్చెద నని, 460

తే.గీ. కలికి యపుడొక్క మాతులుంగఫల మందు
నతుల సౌందర్యరాశియౌ యాడశిశువు
రూపమున పొలిచె; నృపవరుండు సంత
సించి కూతుగా మురిపాన పెంచె నామె. 461

వ. మాతులుంగ ఫలంబున వెలయుటంజేసి ఆ చిన్నారి మాతులుంగి యను పేర బరంగెను. ఆమె తన ఇంట నుద్భవించిన నాటనుండి పద్మాక్షు డతుల సంపదలతోడ మహైశ్వర్యంబుల ననుభవించ దొడంగెను. అంత కొంత కాలంబున కా కన్నె యుక్తవయస్కురాలు కాగా, 462

ఆ.వె. నీల గగన తుల్య నిరుపమ వర్ణుడౌ
హరిని బోలు దైత్యహరునికిత్తు
కన్య ననుచు నతడొక స్వయంవరంబును
ప్రకటన మొనరించె ప్రజల కపుడు. 463

కం. అందాల భరణియౌ క
న్నెం దారె వివాహమాడ నెగయుచు దైత్యుల్
కొందరు పద్మాక్షుని యని
యందున మ్రందించి కన్నె నదటున చేరన్. 464

అ.వె. బాల మాతులుంగి వారి బారి బడక
అచటి హోమకుండమందు మండు
చున్న వహ్నిలోన నున్నపాటుగ బడి,
వీతిహోత్రు నండ ప్రీతినుండె. 465

వ. ఆ విధంబున అత్యాశకు పోయి పద్మాక్షుడు తన ప్రాణంబులను కోల్పోయె. కావున. 466

అ.వె. ధనము కోరవచ్చు ధరలోన బ్రదుకంగ,
అంతులేని సంపదాత్మ హాని,
భీతి, మరణమాది ఘాతుకములు కల్గు
కోరరాదు దీని మేఱ లేక. 467



## 6.2. శ్రీలక్ష్మి వేదవతిగా నుద్భవించుట

వ. తదుపరి కొంత కాలంబు దనుక మాతులుంగి నామంబుతో నుండిన శ్రీమహాలక్ష్మి వహ్ని యందుననే వసించి, బృహస్పతి పుత్రుండగు కుశధ్వజ మహర్షి నిత్యహోమంబు చేయుచు వేదంబు వల్లించు సమయంబున నగ్ని ముఖంబున నుండి వెలికి వచ్చి శిశురూపంబున సాక్షాత్కరించెను. 468

ఉ. సంతతిలేని యా మహిత సంయమి యబ్బురమంది చూచి య
త్యంత మనోహరంబయిన ఆ చిరు పాపను చేరదీసి తా
నెంత యదృష్టవంతుడనొ ఇట్టిదు పుత్రిక తారసిల్లె దై
త్యాంతకు నేవిధిన్ కొలుతు నంచు మనంబున మ్రొక్కి శ్రీహరిన్. 469

ఆ.వె. వేద పఠన వేళ విదితమయ్యెను గాన
అన్ను మిన్న యైన చిన్నదాని
వలపు తోడ వేదవతియను పేరుంచి
కోర్కిదీర పెంచె కూతువోలె. 470

వ. ఆ వేదవతి, 471

సీ. చిటిపొటి మాటల చిన్నారి శిశువుగా
'అరి, అరి' యనుచును హరిని పలుకు,
అక్షరంబులు దిద్దు శిక్షణా సమయాన
సైకతంబున వ్రాయు చక్రహస్తు,
పరికిణీ వోణీలు ధరియించు కాలాన
మురహరు నుతియించు మురిపమెసగ,
కోడె వయసు నందు వ్రీడతో క్రీడించు
గజరాజవరదు శృంగారకేళి,

తే.గీ. తరుణయైనంత నిరతంబు తపము సేయు,
వెలది హరిపాద యుగళారవిందజాత
దివ్య పీయూష పాన సందీప్త మత్త
చిత్త యగుచు తా నితరంబు సేయ మరచు. 472

కం. ఈ విధి పరవశ సంయుత
భావాంబర పథమునందు భ్రమణించుచు నా
పావన వేదవతీ సతి
గోవిందుని తన మగనిగ కోరి తపించెన్. 473

## 6.3 లంకేశుడైన రావణుడు వేదవతిని మోహించుట

మ. ఇది యిట్లుండగ నొక్కనా డసురరాజేంద్రుండు లంకేశుడౌ
పదిశీర్షంబుల రావణుం డతుల సంపాకుండు, వ్యోమంబునన్
ముదమారంగను పోవుచుండి నిబిడాంభోదంబు లందుండి యు
న్మదుడై వేదవతిన్ కనుంగొని దిగెన్ మాయావి పృథ్వీస్థలిన్. 474

వ. ఆమె రూపలావణ్యములకు ముగ్ధుడై, మాయావేష మనోజ్ఞ రూపధారియై తన పుష్పక విమానంబు డిగ్గి తపమాచరించుచున్న వేదవతి కడ కేగుదెంచి ఆమెతో నిట్లనియె. 475

సుందరి :

"సుందరి! ఎవ్వతె వీవు! శోభనమూర్తిరో!
కుందన బొమ్మ! శిరీష కోమల పేశలా!
ఎందుల కీయెడ నొంటి నీవిధి నుంటివో
పొందుగ తెల్పుమునాకు పూర్తిగ నీ కథన్ 476



ఉ. ఎచ్చటనుండు దానవు? మహీతలమందున నెన్నడేని నే
నెచ్చట చూడలేదు మును నీదృశ సుందర దేహ సంపదన్!
మెచ్చితి నిన్ను; నే నసుర మేదిని కెల్లను సార్వభౌముడన్
ముచ్చట తోడనుంటి, నను ముద్దుగ చేకొని యేలుమా ప్రియా! 477

కం. రావణు డందురు నను నా
రావము విన్నంత జనులు ప్రందుదు రిలలో,
భావింపగ నా సరి యీ
క్ష్మావలయములోన లేడు మగసిరిలోనన్." 478

చం. విని సురవైరి పల్కులను వేదవతీ సతి కోపభావయై
"ఘనభుజ విక్రముండనని గర్వ మదంబులు కండ్లు గప్పి నీ
వనదగు మాటలే యివి! యనాస్థను నీయెడ; శ్రీపతిన్ మదిన్
పొనుపున గొల్చి భర్తగను పొందగ బోయెడు దాన దానవా! 479

కం. నీ మాటలు హరి విన్నను
నీ మానము ప్రాణముగొని నిన్ శిక్షింపన్
దా మానునె? త్వరితముగా
నో మానిసిదిండి! వీడు మోటమి గొనకన్." 480

వ. ఆ మాటలకు రోషంబున రౌద్రహావభావ సంయుత వికటాట్టహాస ఘట్టితపాదుండైనను రావణాసురుండు కోపించుటకిది సమయంబుగాదని, ఆ అసుర ధ్వంసికన్న సుర హింసకుండగు తాను మిన్నయని ఆ యన్నులమిన్నకు నచ్చచెప్ప దలంచి ఇట్లనియె. 481

కం. "నా సాటి వాడె నీ హరి?
రోసంబున, శౌర్యమందు, రూపమునందున్,

భాసంబున, కోశంబున,
వేసంబున, వాసమందు వీసంబైనన్. 482

సీ. జలముల నడిబొడ్డు సర్పంబు నీడలో
నిద్రించు నాతండు నిశలు ఱేలు,
హరియెక్కడుండు నంచరయంగ దొరకక
దాగిల్లు మముబోంట్ల దడియ బడుచు,
శూరులౌ యసురల పోరులో మోసాన
వివిధ రూపంబుల పిలుకుమాల్చు,
కపటాన కమనీయ కామినీ వేషియై
సుధను సురలకిచ్చె చూచులోన,
ఆ.వె. క్రతువు నందు దాన మితవుతో చేపట్టి,
పరమ సాధువైన బలి నృపాలు
పాదమునను త్రొక్కి పదవీ చ్యుతుని జేసె,
నమ్మ వలదు హరిని నాతి నీవు, 483

కం. కావున నో నారీమణి
భావంబున హరిని మరచి, పాలింపు మికన్
రావణు సతివై జలధి
ప్రావృత భువనంబు చక్రవర్తిని వగుచున్. 484

తే.గీ. పురుషు నందున జగతిలో పొలతి కోరు
అంద చందంబు లైశ్వర్య మతిశయమ్ము,
శౌర్యధైర్యంబు లనుపమ సాహసంబు
కలవు నావద్ద, హరివద్ద కల్ల లవియు." 485



వ. అనుచు, తనను చేపట్టుమని బలవంతము చేయుచున్న రావణుని గని,
ఆ సాధ్వీమణి జగుప్సాపూరితమానసయై కోపంబున నిట్లనియె, 486

తే.గీ. "హరిహరీ! ఇట్టి దుర్భాషలాడుచున్న
నీ శిరము ముక్కలైయేల నేల బడదు,
ఏల హరినింద వినుచున్న బేల నాకు
ప్రాణములు పై కెగసిపోవు, త్రాణ సమసి? 487

ఆ.వె. విశ్వకారణుండు విశ్వంభరుండును
శాశ్వతుండు, పరమ సాత్వికుండు,
సాధుజనులపాలి శరణంబు శ్రీహరి,
అసుర కృత్యకరుల యముడతండు. 488

కం. నీ వాపాదన చేసిన
భావము లా హరికి సుగుణవర్తనము లవే
ప్రావను జూచిన దోసము
లేవియు గావు సరసజన హితములు గానీ! 489

సీ. ప్రకృతి ప్రకాశియౌ ప్రద్యోతన ద్యుతి
కాంచగా గల్గునే గబ్బిలమ్ము,
జనరంజకంబైన చంద్రుని వెన్నెల
తగులంగ నొప్పునే తస్కరుండు,
షడ్రసోపేతమౌ శాల్యన్న యోగ్యుడే
బాధతో మూల్గెడు వ్యాధితుండు,
విశ్వకారణతత్త్వ విజ్ఞాన మబ్బునే
ఏ నిరక్షరకుక్షి కైన గాని,

తే.గీ. సంతత హరిపదాంబుజ చింతనాప్తి
దవులు మనమెట్లు వేరొక్క ధవుని జేరు,
వ్యసన పూరిత వ్యాపారపరుడ వౌట
తక్కు మాటలు నీ తల కెక్కబోవు. 490

వ. ఇంక నా సంగతి యందువా, 491

సీ. కమలనేత్రుని కాంచు కన్నులు హితవుతో
సురవైరి నేరీతి చూడ నేర్చు,
వేదవేద్యు నుతించు పెదవు లే విధముగా
తులువ దైత్యుని పేరు పలుక గలవు,
ఫుల్లపద్మచరణు మ్రొక్కు శీర్ష మెటులు
మ్రుక్కడి రక్కసి మ్రొక్క నొప్పు,
శ్రీహరి పాణిని చేపట్టు కరము దు
శ్శీలు నేరీతి స్పర్శింప దలచు,
తే.గీ. ఐన నీతోడ నాకేల కానితర్క
మేను శౌరినేగాని వేరెవరి గోర,
ఏల నీ వృథాయాసంబు చాలు చాలు,
పొమ్ము పొమ్మింక నిటనుండి పోతరీద!" 492

వ. అనిన విని ఒక అబలచే నీసడింపబడిన నీచత్వంబు భరింపలేక, దానవుండు రోషంబున రక్తారుణ నేత్రాననుండై, 493

[1]మ. వికటభ్రూకుటితోడ మస్తకము కంపించంగ, వ్యాక్షిప్తమై
సిక లల్లాడగ, భీమమై రదననిష్పేష స్వనంబంతటన్
ప్రకటిల్లన్ వనినున్న జంతుతతులున్ పర్వెత్త భీతిల్లుచున్,
నికృతాహంకృతి రెచ్చి మానసము దుర్నీతిన్ ప్రవర్తిల్లగన్. 494



## 6.4. రావణుడు వేదవతిని బలాత్కరించబోవ, ఆమె అగ్నిలో బడుట

ఆ.వె. కామ మోహ రోష కాఠిన్య హృదయతన్
వేదవతిని వాడు వెంటనంటి
పట్టబోయి జడను గట్టిగా చేపట్టి
లాగె; ఆమె విహ్వలయయి క్రుంగ. 495

ఉ. వేదవతీ లలామ కడుభీతిని దేహము కంపమొంద, నా
వేదనతో కలంగి తన వేణిని సాహసియై పెనంగి వి
చ్ఛేదమొనర్చి పర్వి తన శీలము కాచుకొనంగ యోగసం
పాదిత వహ్నికీలలను ఫాలమునుండి సృజింప జేయుచున్. 496

వ. రావణుని దెస తిరిగి, "ఓరీ! దుర్మదాంధుడా! మదనపీడా సంభ్రమువండ వయి నను బోటి స్వచ్ఛకన్యనిట్లు బలవంతపెట్ట జూచు నిన్ను నేను మరల జనించి నీచే చెరపెట్టించబడి మిత్రబాంధవ పరివారగృహాదులతోడ నిన్ను నాశన మొనరింతు"నని శపించి, 497

కం. స్వాహావల్లభుని తలచి,
బాహుయుగళి ముణిచి మ్రొక్కి ప్రార్థించుచు, మాం
పాహి యటంచున్, దిక్కుల
హాహాకారములు లేవ నాహుతి యయ్యెన్. 498

వ. అంత నా పంక్తికంఠుండు, 499

మ. తొలి నాకాశ విహారమందు హిమ బిందు జ్యోత్స్నలన్ దేలియున్,
కలికిన్ జూడగ డిగ్గి, యా మగువ లోకాతీత సౌందర్యపున్
కలశాంభోధిని మగ్నుడైన తరి, త్రుటిలో కాంక్షల్ బుగ్గియై స్వప్నముల్
వెలితై క్రుంగి యెడారియైన తరుణీ ప్రేమార్ణవంబంతలో. 500

వ. తట్టుకొనజాలక, క్షణకాల విచారమగ్నుడై, చేయ గలదేమియును లేక, క్రోధంబు దిగు మార్గంబు గానక, మరింత క్రుద్ధుడై, తెగిన వేదవతి వేణి తన చేతిలో నుండ కని, 501

ఉ. బిత్తర చెంది రావణుడు పెద్దగ నార్చుచు నోర్పు దక్కి, యా
మత్తకరీంద్రయాన పడి మ్రందిన చోటున కేగుదెంచి ఆ
సత్తిని గాంచి నాలు గతిసాంద్ర విరాజిత రత్నరాజముల్
తత్తర వాటి నెత్తుకొని తత్క్షణ మాతడు పోయె లంకకున్. 502

కం. తెచ్చిన మణులను, వేణిని
ముచ్చట నొక పెట్టె నుంచి ముదమున గృహమున్
జొచ్చి పలికె నెచ్చెలితో
హెచ్చిన గర్వమున పేటి నిట తెమ్మనుచున్. 503

కం. వాని పడతి మండోదరి
పూనిక మందసకు నున్న మూతను తీయన్
మానుగ నందున కాంచెన్
జానుగ చిరు నవ్వొలికెడు చక్కని పాపన్. 504

## 6.5. రావణుడు శిశురూపముననున్న వేదవతిని భూమిలో పాతించుట

కం. ఎంతయొ చక్కని శిశువుకు
వింతగ బారెడుకు మించు వేణిక చూడన్,
భ్రాంతిని మండోదరి తను
వంత వణక కెవ్వటంచు నార్చెన్ భీతిన్. 505



వ. ఆ కేకను విని రావణుండును పరిచారికలును పరుగు పరుగున వచ్చిన, మండోదరి భర్తతో నిట్లనియె, 506

తే.గీ. దేవ! ఈ పాప దయ్యంబు తీరు గలిగి,
భీతి కల్గించు చున్నది ప్రేతమట్లు
నా మనఃపేటి యందు కాన దయతోడ
నీ నికృష్ట శిశువు వీడు మీక్షణంబ. 507

తే.గీ. నాలి ముచ్చిది – దానవ నాశనంబు
సేయ నిటజేరినట్టి దీ చికుర పాశ;
నా పలుకులు నమ్ముము స్వామి! నా మనంబు
కీడు శంకించె, హృదయాన క్లేశ మొదవె. 508

చం. అన విని రావణుండు మృదుహాసముతో ననె భార్యతోడ, నా
కనుపమ శక్తులుండ చెలియా! భయమేల! ధరిత్రి యందునన్
నను గెలువంగ గల్గు ప్రతినాయక శక్తి జనింప బోదు, కా
వున దనుజాళి కే తరిని యోటమి మాట తలెత్త దెన్నడున్. 509

కం. ఐనను నీ తృప్తి కొరకు
నే నీబాలికను నేడె నిర్మోహముగా
కాననమందున వీడెద –
మానుము దుఃఖంబు, భీతి మనమున నెలతా! 510

వ. అని తన కులసతి నోదార్చి, మంత్రులను పిలిపించి, 511

కం. ఈక్షణమే మీరీ శిశు
యక్షము గొనిపోయి భీకరాటవిలోనన్

నిక్షిప్తము సేయించుడు
శిక్షితులైనట్టి శీఘ్రసేనాతతిచే. 512

తే.గీ. ప్రభువు నానతి విన్నంత భటులు పేటి
మోసుకొనిపోయి బహుదూర వాసములకు
భరతదేశ పూర్వోత్తర ప్రాంతమందు
చిట్టడవి లోపలను పాతిపెట్టి రపుడు. 513

## 6.6. జనక మహారాజు యజ్ఞభూమిలో నొక శిశువును కనుగొనుట

సీ. శ్రీలకు క్షేత్రమై శ్రితజన శ్రేయమై
నిగమాది విద్యల నిలయమగుచు,
పరమ పూజ్యంబైన భరతదేశంబునం
దార్యులు నివసించు యవనియందు,
అవతరిల్లెను విదేహయనెడు రాజ్యంబు
సకల సౌభాగ్యముల్ సంతరించి,
మిథిల యనెడి పేర ప్రథితమౌ నగరంబు
రాజధానిగచేసి ప్రజ్ఞమీఱ

తే.గీ. సౌమ్య సుగుణగుణ గణులు సరస పథులు
ప్రజలు తమ సుతులను రీతి పరిగణించు
నిత్య సత్యవ్రతచరులు నిరతిశయులు
దాని పాలించు చుందురు ధర్మబుద్ధి. 514

వ. మన కథా కాలంబునకు, 515

సీ. శ్రీమహాలక్ష్మి లలామ వేదవతిగ
ధరణి నిక్షిప్తయై దాగియుండి,



కొంతకాలములోన కోసలదేశంబు
నందు శ్రీహరి రాము డనెడుపేర
నవతరించు టెరిగి యవనిపై తానింక
పొడసూప వలెనని యెడద దలచి,
కోసలకు దరిని కొలది దూరంబున
నమరు విదేహరాజ్యంబు నేలు

తే.గీ. పరమ ధర్మపరుడు, నిరుపమ గుణుండు,
సత్యసంధుండు, సద్వంశ జాతుడైన
జనక నరపాలు కూతుగా మనదలంచి
వేచి యుండెను వెలువడ ప్రీతితోడ. 516

వ. అది అటులుండ, 517

తే.గీ. జనకునకు చాల కాలంబు సంతులేక,
పుత్రకామేష్టి జరిపించి పుత్రవరుల
దశరథుండు పొందు టెరిగి తానుగూడ
నట్టి సవమును చేయంగ నధిక రక్తి, 518

తే.గీ. ఇష్టికై యొక ప్రాంతంబు నెన్ను కొనుచు.
ఎత్తు పల్లాలు సరిచేయ నేరుతోడ
దున్నుచుండగ నొకచోట మన్నులోన
పాతియున్నట్టి యొక పెట్టె బైట పడియె. 519

తే.గీ. దాని వెలిదీసి తెరువంగ కానుపించె
నొక కనకవర్ణ సాలభంజిక కెనయగు
శిశువు, యామె గనుచు రాజు చేష్ట దక్కి
యద్భుతాశ్చర్య సంభ్రముం డగుచు చూచె. 520

తే.గీ. ఖచిత నవరత్న మౌక్తిక కనక రచిత
వివిధ భూషణాలంకార వితతితోడ
నుదయకాల భానుప్రభ నొప్పుదాని
కండ్లు మిఱుమిట్లు గొల్పంగ కాంచి నృపుడు, 521

వ. అంధకార బంధురంబగు మహాజలధి నార్తితో నీదుచు, కాలుమోపుటకైన సావకాశంబు లేక తల్లడిల్లి వేసరుచున్న వానికి దైవయోగంబున పొడమిన భాస్కరద్యుతులతో నొప్పారు ఫల పుష్ప భరిత వృక్షసముదాయ యుతంబైన దీవి కనంబడిన విధంబున, జనక మహారాజు దేదీప్యమానంబుగా ప్రకాశించు చున్న శిశువును కని సంతోష భరితాంత రంగుండై, 522

తే.గీ. హరికి మనమందు మ్రొక్కుచు, యజన కార్య
మింకను మొదలు గాకుండ నిచ్చె నాకు
సిరిని బోలెడు నిరుపమ శ్రీలనొప్పు
కూతు నొకదాని మనమున కోర్కె దీర. 523

వ. అని తలంచు నంతలో, 524

## 6.7. భూదేవి జనకునకు శిశువును దుహితగా నొసంగుట

కం. వీనుల విందులు సేయుచు
వీణా వాదన కెనయగు ప్రియమగు వాక్కుల్
మానిత మధుర రవంబున
సూనమయి వినంబడియె వసుంధర యందున్. 525

మ. "జనకాధీశ్వర ! నేను భూసతిని – నీ శాంత స్వభావంబు, నీ
ఘన వేదాంత వివేకమున్, జన రిరక్షన్ మెచ్చి నా కుక్షి నిం



దనుకన్ దాగిన యీ మనోజ్ఞ శిశువున్ దైవాంశ సంభూత స
ద్గుణవారాశిని నీకు పుత్రికగ నిత్తున్ కొన్ము సంప్రీతితో". 526

కం. అదివిని జనకుం డిట్లనె,
"సుదతీ! నీ మాటలు విన సుభంగబై నా
మదిలో సంతస మొదవెన్,
ముదమున నా కనుల ముందు పొదలుము తల్లీ!" 527

కం. వల్లె యని ధరణిదేవత,
అల్లన కన్పట్టె; నంత నాశ్చర్యముతో
నుల్లము ఝల్లన జనకుడు
కాళ్ళపయిన్బడుచు చేసె కమనీయ నుతుల్. 528

## 6.8. జనకుడు భూదేవిని స్తుతించుట

మేదిని :
"కని విన నట్టి రీతి నిను కాంచగా ధరిత్రీ!
తనువు గగుర్పడెన్ హృది ముదంబు వ్యాపకంబై
తనరుచు పొంగిపొర్లెను, సదాత్మతన్ భజింతున్
మినున భ్రమించు యో ప్రథిత మేదినీ సమాఖ్యా! 529

ఉ. దెందము పొంగిపోయె నను డింగరిగా కరుణించి నీ కృపన్
పొందగ నర్హుడంచు నొక పూతచరిత్ర, రమాసదృక్ష, నీ
కుందనబొమ్మ, నీ జలజ కోమల గాత్రిని నాకు పుత్రిగా
స్యందిత మాధురీ రుచిర సాత్త్విక వాక్కుల నిచ్చినావహో! 530

భూనుతం :

మాతరో ధరణి! మిమ్ముల మానుగ నెన్నన్
నా తరంబగునె, కా దయినన్ మనమందున్
స్థాతవౌ నిను నుతించుచు శాంతిని పొందన్
పూతమౌ తిగుట పుట్టెను భూనుత! నాలో. 531

[2]మంజరీ ద్విపద :

పంచభూతములందు ప్రథమమై యొప్పి
నాల్గు భూతములతో నలువుగా కలసి
గణనీయ మైనట్టి కార్యక్రమాన,
గ్రహరాజమై మాకు గృహమైతి వమ్మ,
సౌర కుటుంబాన సౌరుగా వెలసి
పెంచి ప్రాణుల సాకు పృథ్వివే తల్లి–

[3]ద్యుమణికి తగినంత దూరాన నుండి
సమతుల్య శీతోష్ణ సరసత గలిగి,
గురుగోళము వలెను బరువుగా లేక,
అలతియై యుండక నా సౌమ్యు నట్లు,
తగినంతగా గురుత్వాకర్షమొప్పి
అనువైన సరస వాతావరణంబు
వెలయ సృజించుచు నలఘు విధంబు
వలయు రసాయన ప్రక్రియ లెంచి
ప్రాణికోట్లు బ్రదుక రాణతో ప్రాణ
వాయువు నుదకంబు పరగ కల్పించి,
[4]సంక్లిష్ట సంయోగచరణ జరిపి,
అలఘు మార్గాన జీవుల సృష్టి చేసి –



తులలేని పరిణామము[5] లు కలిగించి,
జల, మహీ, గగన చరుల వెలయించి,
లలిని మేధాజ్ఞానములు గల మాన
వుల నిల నిలిపితి వలఘు విధాన.

నీ చుట్టుగా నీవు నిరతంబు తిరిగి,
అన్ని ప్రాంతములకు నాదిత్యు కాంతి
ప్రసరింప చేయుదు ప్రాణులు మనగ;
రవిచుట్టు నిరతమ్ము రమణతో నీవు
ఒక్కింత ఒయ్యార మొప్పంగ తిరిగి,
వేర్వేరు ఋతువుల వెలయించు చుందు,
వివిధమౌ వనరులు పెరుగు కోసంబు,
పొలుపుగా జీవముల్ భుజియించు కొరకు –

నిన్ను మ్రొక్కిన మాకు నిరత సౌఖ్యములు
చెన్నుగా సమకూరు శ్రీభూతధాత్రి!
శ్రీమహావిష్ణుని చినభార్య వమ్మ.
రత్నగర్భవు నీవు రమణి మాయమ్మ!
నీకృప మాపైన నిలుపుచు సతము
కాపాడు మోయమ్మ కారుణ్య ధాత్రి! 532

తే.గీ. అట్టి నీయెడ మానవు లధిక భక్తి
పిల్లలు తమ తల్లిని గౌరవించు రీతి,
సుంత కష్టంబు కాని యొక్కింత బాధ
గాని కలుగనీయక నిన్ను కావవలయు". 533

వ. ఆ విధంబుగ జనక మహీపాలుడు సన్నుత భావములతో పల్కిన, 534

ఉ. సంతసమంది భూమి సతి జానుగ హస్తములందు బాలికన్
పొంతన చేరదీసికొని ముచ్చట ముద్దులు పెట్టి కన్ను లా
వంత చెమర్చికార జనకాధిపు చేతుల కన్నె నుంచి యు
ద్దాంత విషాద గద్గద విదారిత కంఠ రవంబుతో ననెన్. 535

ఉ. "పుట్టువ లేనిదీ లలన, ముందొక దివ్య నిగూఢ కార్యమున్
కట్టగ పొల్చినట్టి సతి, కారణజన్మ తరించి యగ్ని క
న్పట్టి, దురూహ్య సంఘటన పాలయి నా పొరలందు జేరె నా
పట్టిగ, దీని నీవు గొని పాదుగ పొందుము భోగభాగ్యముల్. 536

ఉ. ఇచ్చితి నేను నీకు వసుధేశ్వర మచ్చిక ముజ్జగంబులున్
మెచ్చగ పుట్టినింటికిని మెట్టెడు పట్టుకు పుణ్యసంపదల్
తెచ్చెడు కోమలాంగి, పితృ, దేవ ఋణమ్ములు దీన తీరెడున్,
నిచ్చలు సర్వ సంపదలు నీ ప్రజ పొందుదురయ్య భూవరా! 537

ఆ.వె. పూర్వజన్మలందు పుణ్యమూలంబుచే
దొరికె నోయి నీకు దురితహారి
యైన శిశువు – ఇది రహస్యంబు కాన కా
పాడు" మనుచు పలుక పార్థివుండు. 538

వ. కృతజ్ఞతా పూర్వక వందనంబు లాచరించి శిశువు నొడియందు గ్రహించి నంత, భూదేవి అంతర్ధానమయ్యె. 539

## 6.9. జనకుడు శిశువును తనకోటకు గొనవచ్చి భార్య కిచ్చుట

ఉ. అంతట రాజు భూమిసతి కాత్మ నమస్కృతు లంద జేసి, ది
గ్దంతి సదృక్షమైన మదగంధగజమ్మున భూమి పుత్రికన్



కంతముగా పరుండ నిడి గ్రక్కున నేగెను రాజధానికిన్
దంతి శతాంగ ఘోటక పదాతుల తోడుత నుత్సవంబుగన్. 540

సీ. భూరిమంత్రంబులు భూసురుల్ ప్రవచింప
విబుధులు విన వినువీధి గప్ప,
వాద్యఘోషలు చేయు వాద్యకారుల జూచి
కిన్నరల్ నర్తింప మిన్నుపైన,
సిరికాంత పృథ్విని చెన్నుగా పొలియంగ
తెలిసి వియచ్చరుల్ తేరిజూడ,
భూమిలో నొక కూన భూపుండు కనెనని
యెరిగి పౌరులు రాజు కెదురు సనగ,
తే.గీ. జయ జయ ధ్వానముల్ సేయు జనులతోడ,
మిన్ను మన్నును సందడై మిళితమయ్యె
జనక జనపతి భూపుత్రి జలజనేత్రి
ద్విపముపై తీర్చి మిథిలకు తెచ్చు నపుడు. 541

చం. తదుపరి కోటకేగి లలితాంగి ధరాసుత నా నృపాలు డిం
పొదవగ రాణివాసమున పొందిక భార్య [6]సుమేధ కిచ్చుచున్
పదపడి పృథ్వి ప్రీతిమెయి పల్కిన యర్థములెల్ల తెల్పి, యా
మదవతి సంతసిల్లగ సుమాళము తోడుత వెండి యిట్లనెన్. 542

ఉ. "ఓ తరుణీ మణీ! విను మయోనిజయౌ నొక దివ్యకన్య ను
ర్వీతలమందు దాగిన శిరీష లతాంత సమాన కోమలిన్
భూతలమాతయే మనకు పుత్రికగా దయచేసి తెల్పె, నీ
నాతి తరించు మిమ్ములను నాశమొనర్చుచు పూర్వకర్మముల్. 543

తే.గీ. కాన నీనాటి నుండియు కమలనయన!
సాటి లేనట్టి ఈ మేటి చక్కనమ్మ
మనకు పుత్రి కయ్యెను, నీవు మాత వైతి,
సంతు లేనట్టి మనలకు వంతదీరె. 544

శా. ఆమాటల్ విని రాణి మానసమునన్ హర్షించి హస్తద్వయిన్
సామోదంబుగ సాచి పాప గొని వక్షస్థాన మందుంచినన్
సామగ్ర్యంబుగ దేహమందు పులకల్ సాక్షాత్కరింపంగ, నా
సామీప్యంబున నున్న ప్రాణవిభునిన్ సంప్రీతి వీక్షించుచున్. 545

తే.గీ. ఇంత చక్కని పుత్రిక నిచ్చినట్టి
విభుని గమకించి గమనించి, యభినుతించి,
వంగి తలవంచి తిలకించి చెంగలించి
చేత తనివొంది నిదురించు శిశువు నెంచి. 546

కం. సంబరమున ముద్దిడ, హృద
యాంభోధిని లేచి వలపు టలలువ్వెత్తై
అంబర చుంబితమైనన్
అంబుజముఖి మాతృహృదయ మాకీర్ణం బై. 547

[7]ఉపజాతివృత్తం :
ఆనంద మాశ్చర్య మభిప్లవంబై
అనూహ్యమౌరీతి ననూన శాంతం
బానీతమై యాత్మ నతీవ తృప్తిన్
సునీథయౌ రాణి సుమేధ యొప్పెన్. 548



**వివరణలు :**

1. పద్య తాత్పర్యము : వికృతమైన బొమముడితోబాటు శిరస్సు కంపించగా, చెదిరిన శిఖ లల్లాడగా, దంతములు నూరిన శబ్దమన్నిచోట్లకును ప్రసారించి, అడవినున్న జంతుజాలములు భయముతో పర్వెత్తగా, అవమానింపబడిన (రావణుని) అహంకారం రెచ్చిపోయి దుష్టమార్గమున ప్రవర్తిల్లగా,

2. ఈ గ్రంథంలోని ద్విపదలకు, మంజరీ ద్విపదలకు ప్రాసయతులు గూడా చెల్లించబడినవి. మంజరీద్విపదల కంత్యప్రాస నియమము పాటించలేదు. కాని, చాలా ద్విపదలకు అంత్యప్రాసలను నెలకొల్పితిని.

3. ఈ వచనములో భూమికి, దానిపై జీవతతులకు సంబంధించిన నేటి అధునాతన వైజ్ఞానిక విషయములు కొన్ని పొందుపరుప బడినవి. ఇవన్నియు నాటి త్రేతాయుగమున నున్నవారెరుగుదురా యను ప్రశ్నకు, క్రిందటి, యోగసంవాద ఖండం' లోని వివరణ–1లో నిచ్చిన సమాధానంలోని తర్కమే వర్తించును.

4. complex (chemical) reactions 5. mutations

6. జనకుని భార్య పేరు 'సునయన' అని కొన్ని రామాయణములలో నున్నది. జనకునకు చాలమంది భార్యలు కలరనిగూడ నొకచో నున్నది. ఊర్మిళ సుమేధ (సునయన) కు తనూభవ కావచ్చును. నాగటి చాలున సీతను కనుగొన్న కొంతకాలమున కూర్మిళ పుట్టిన దనుకొన వచ్చును.

7. ఉపజాతివృత్తం : త్రిష్టుపు ఛందస్సు : ఇందులో బేసిపాదము లింద్రవజ్రం ఛందస్సులోను, సరిపాదము లుపేంద్రవజ్రం ఛందస్సులోను నుండును. దీనిని స్వస్థానార్థ సమవృత్తం మందురు.

***

# 7.సీతాదేవి యౌవనఖండము

## 7.1. మహారాణి సుమేధ భూపుత్రిని కన్నకూతురు వలె పెంచుట

వ. ఆ విధంబుగ జనకుని జాయ తన పుణ్యవిశేషంబున నపురూప దివ్య కన్య సంక్రమించి, తదర్థంబున నవచాటంబుగ మాతృత్వ మొదవిన పారవశ్యంబుతో నా రాత్రి గడిపి మరునాడుదయంబున మేల్కొని కుమార్తెనుగని, క్రిందటి నాటి సంఘటనలు స్వప్న మాయా సంజనితంబులు కావని నిశ్చయింప కుమార్తె వదనంబు మరి మరి వీక్షించి, యెడారిలో బడి పోవు బహుదూరపు బాటసారి సూర్యాతపమున భరింపరాని జలతృష్ణచే నటమించు సమయంబున నొక నీటిబుగ్గ యెదురైన, ననుమాన పూరిత హృదయమున యయ్యది యెండమావి యగునేమో యని భయమంది, తిరిగి తిరిగి వీక్షించి అది యథార్థముగా జలాశయం బని నిశ్చయంబైన సమయంబున కల్గెడి యమందానందంబు నొందెను. 549

ఉ. అంతట నామె బాలికను హాటక మజ్జన శాల వేదికన్
పొంతనతో పరుండ నిడి, మోదముతోడ సుగంధ మూలికా
తంతి హరిద్రచూర్ణయుత తప్త జలంబుల తానమార్చి, శు
ద్ధాంతమునందు బంగరుటుయాలను పొందిక జేర్చి మీదటన్. 550

సీ. పసిడితో తులదూగు మిసిమిసి తనువుకు
సొగసైన పట్టు కంచుకము తొడిగి,
పూర్ణచంద్రుని బోలు మోముపై సమ వర్తు
లాకార తిలకంబు నలర దిద్ది,
కమల దళము లట్టి కన్నుల యంచులన్
దీటుగా నల్లని కాటు కద్ది,



కంబువు కెనయగు కమ్రంపు గళమందు
నపురూప మౌక్తిక హారముంచి,
తే.గీ. లలిత సుకుమార మృదు మృణాల సదృశంపు
కరము లందున మరకతాంగదలు దొడిగి,
పద్మ రేఖాంకితములైన పాదములకు
రత్న ఖచిత కనక నూపురము లమర్చి. 551

వ. ఇంకను బహువిధ ప్రసాధన రోచిష్ణువుం జేసి, సంతృప్త సమ్మోదిత మానసమ్మున, 552

తే.గీ. వివిధ భూషణాలంకార వితతి తోడ
రమణ నొప్పెడు తనకూతు రాణి మనసు
తీర ముద్దిడి పలుమార్లు తేరిచూచి,
ఆర్తి మదిగొన చెలులతో ననియె నిట్లు. 553

తే.గీ. చక్కగ కవోష్ణ జలముల స్నానమాడి,
తేలగిల్లెడు కనుల నిద్రించకుండ,
చూడు డిటునటు గునిసెను చుమ్మతోడ
కలగి పిడికిళ్ళ కనుగ్రుడ్లు నులుపుకొనుచు. 554

తే.గీ. కలత తోచెను మనమున కలుష జనుల
దృష్టి దోషంబు తగిలెనో యేమొ నేడు!
దృష్టి తీయుడు పాపకు దీటుగాను
కనుల వేదురు, కనుకలి కరగిపోవ, 555

తే.గీ. పరుల మాటేమొ గాని నా పైన నాకె
నమ్మకముతగ్గె, మమతతో నలిజరించి

కనులు విప్పార్చి చూచితీ కమల నయన,
కాన నా దృష్టి యే దీని కలచె నేమొ! 556

తే.గీ. చిత్తమని రాణి యాజ్ఞకు చెలియ లపుడు,
కుంకుమ జలము నింపిన కుంభ మొకటి
పట్టి నుంచిన యూయల చుట్టు త్రిప్పి
మూడు మార్లు, నీటిని బైట పోసిరపుడు. 557

వ. మరియును, కొందరు పరిచారికలు పసుపు నద్ద నెఱ్ఱబడిన నిమ్మకాయల డిప్పలను రాచ శిశువు చుట్టును త్రిప్పి నాల్గు రథ్యల కూటంబున పడవేయ పరువిడిరి. ఇంకను మరి కొందరు చెలికత్తెలు క్రొత్తగా నూరిన అగలుతో పాపకు దృష్టి దోషము నశించ బుగ్గలందునను, నుదుటి యందునను బొట్లు పెట్టిరి. 558

కం. ఈ రాద్ధాంతము నించుక
దూరమునందుండి కనుచు దురవగ్రహయై
చేరుచు నొక పరిణత పరి
చారిక యీ విధముగ విచారించె మదిన్. 559

వ. ఆహా! మన మహారాణిగారి కిందనుక సంతానము లేనందున చంటి పాపల ప్రవర్తన మెరుంగక, పిల్ల కిదికినను అరిష్ట మని భయపడుచున్నది. కావున నేనామె కడకు బోయి తగు విధముగ నామె యార్తిని మాన్చెదనని తలచి, సుమేధాదేవి చెంతకేగి ఇట్లనియె, "అమ్మా! వినుడు, రాజకుమారి కే దృష్టి దోషము తగుల లేదు. ఆమె ఆరోగ్యవంతముగనె యున్నది. ఎందులకు మీకీ యనవవసరాందోళన, 560



తే.గీ. నిదుర రాకను యువరాణి నీల్గు చుండె,
కడుపులో నాకలై పాప కదులు చుండె, –
కడుపు నిండంగ పాలను కుడిపి మనము
లాలిపాడిన నిదురించు బాల యిపుడు." 561

వ. అన, నా క్షణంబె, 562

ఆ.వె. మేలు జాతి గోవు పాలను తెప్పించి,
వెండి గిన్నెలోన వేడి చేసి,
కలువకంటిచేత కడుపు నిండంగను
త్రాగచేసినారు తరుణ సఖులు. 563

చం. అనువుగ నంతలోన చెలు లందున గాయని యైన యొక్క కా
మిని రుచిర స్వరంబున సుమేధ యనుజ్ఞను పాడె చక్కగా
వినుటకు నింపుకూర్చు పదగుంఫముతో మధురార్థసంయుత
మ్మనఘమునైన లాలిని సమాహితులై చెలులెల్ల మెచ్చగన్. 564

లాలిపాట:

జో ఇందువదనకు, జో కుందరదనకు లాలి,
జో సింధుకన్యకు, జో బిందు సదనకు లాలి,
జో కమల నయనకు, జో కనక లక్ష్మికి లాలి,
జో కలిమి కాంతకు, జో కంబుకంఠికి లాలి,

శ్రీలసత్ కళలతో చెన్నైన సొగసుతో
పాల మీగడ బోలు మిసిమైన వపువుతో
మము కన్నతల్లికి, మా కంటి వెలుగుకూ లాలి,
మా కన్న కలలెల్ల పండించు పాపకు లాలి, జో ఇందు॥

ఆడువారికి భువిని అండగా నిలిచి,
ఆశ్రితుల రక్షించు అమృతవల్లికి లాలి,
మా పుణ్యఫలమున మా యింటిలో వెలసి
మము కావ వచ్చిన మంగళాంగికి లాలి, జో ఇందు॥

బొజ్జనిండా పాలు ముదముతో త్రాగి
బుజ్జి కన్నా ఇంక బజ్జోవె నీవు, లాలి
ముజ్జగము లేలెడు ముత్తైదువే సాకి
పజ్జనుండి నిన్ను పాలించునే తల్లి, లాలి జో ఇందు॥

ముద్దుగా నీవింక ప్రొద్దుబోకుండ,
సద్దు సేయగ బోక నిద్దురోవమ్మ, లాలి
జగములేలెడి మాత జగదంబికా దేవి
జాగరూకత తోడ సాకునే నిన్ను, లాలి జో ఇందు।
565

## 7.2. జనకుడు తన కుమార్తెకు సీత యని నామకరణము చేయుట

వ. ఆ విధంబున సుందరాంగులు చేరి సుమధురస్వనంబు లాలి పాడుచు, నూయల నొక్కింత యూపు చుండ, నా సుఖోపభోగంబులం దేలుచు సిరికాంత యించుక నిదురించె. అంతలో మహారాజు, మంత్రి పురోహిత పరిజనముతో రాణివాసంబున కేతెంచి తూగుటుయ్యలలో నిదురించుచున్న తమ కూతుగని సంతసమానసుండై అందరు వినుచుండ నిజపత్నితోడ నిట్లనియె. 566

సీ. "ఈ మధ్య కాలాన నిటువంటి మేలైన
మూర్తంబు లేదంచు పుణ్యచరితు



డైన శతానందమౌని తెలిపె గాన,
మన పుత్రి కతి ముఖ్యమైన విధిని
నిర్వహింప తమిని నే నిట వచ్చితి,
అది నీకు, మనవారికందఱకును
పాపకు నెలవైన వసుధా సతికి సంత
సమ్మగునని నమ్మి – జనులు మెచ్చ
తే.గీ. మన కుమారి కీ లగ్నమందుననె ప్రీతి
నామకరణమ్ము చేయుదు నలువు తోడ–
పంచభూతము లష్టదిక్పాల వరులు
చేరి దీవించ కోరు దీ చిన్న దాని. 567

కం. నాగేటి చాలు నందున,
యోగవశంబున దొరికిన యోషయగుట నెం
తో గోముగ 'సీత'ను సహ
జాగత నామంబు నిత్తు హర్షాత్మతతో! 568

కం. నే నిపు డిచ్చిన లౌకిక
మౌ నామంబీ సుదతికి మంగళకరమై
జానుగ రెండన్వయముల
వైనంబులు సాగుగాక పరిపూతంబై. 569

కం. భూపుత్రియైన జనకజ
ప్రాపున నార్షమతమూని పాటవమొప్పన్
వ్యాపితమై నలుదెసలను
మోపుగొనుచు రక్షితమగు భూతలమంతన్." 570

కం. అన విని రాణియు, చెలులున్,
జనులు, మునులు, మంత్రివరులు, సైన్యాధ్యక్షుల్
మనముప్పొంగగ భేషని
జనకాధీశ్వరు పొగిడిరి సంతోషముతో. 571

తే.గీ. ఆ నిముసమందె ఈ వార్త యన్ని ప్రాంత
ములకు వ్యాపింప పౌరులు మోదమంది
యుత్సవంబులు చేసిరి యోజతోడ,
పిండివంటల మెసవిరి పండువట్లు. 572

తే.గీ. దేవదుందుభుల్ మొరసెను త్రిదివమందు,
సురలు, విద్యాధరులు, వియచ్చరులు మేన
కాది యచ్చరల సరస నాడి రపుడు
మురిసి పాడుచు నాకాశ పరిధు లందు, 573

కం. ఆ తీరున సిరి పైదలి
సీతానామము ధరించి శ్రీలకు నెలవౌ
భూతలమందున జనకుని
వ్రాతములో చేరె దివ్య పథకముతోడన్. 574

తే.గీ. సీర స్పర్శను వెలువడ సీత యనియు,
జనకుని దుహిత యగుటను జానకి యని,
పొలతుక విదేహ రాజ్యాన వెలయు కతన,
పిలువ బడుచుండె వైదేహి పేరుతోడ. 575



## 7.3. సీతాదేవి బాల్యక్రీడలు

తే.గీ. నాతి భువినుండి వెలువడ్డ నాటినుండి,
కని వినరీతి వైదేహ జనుల యిండ్ల
బోగభాగ్యంబులు కలిగి, పొలుపు మీఱ
పొసగె నాయురారోగ్యము లసదృశముగ. 576

తే.గీ. అందు మూలాన ప్రజలలో హర్ష మొదవి,
వలతి తమపాలి భాగ్య దేవతయటంచు
హెచ్చు గౌరవానను సీత నెంచుకొనుచు,
నించుబోడిని ప్రీతి సేవించువారు. 577

కం. దిన దిన మెదిగెడు సీతను
జనకుడు రాణియు కనుచును సంతోషముతో
ననయము మ్రొక్కిరి భక్తిని
వినయముతో హరి పదారవిందయుగంబున్. 578

ద్విపద :
చిన్నారి యాటల చిలిపి యల్లరుల,
పొన్నారి చేష్టల పొంగారు పసల,
చిటిపొటి మాటల చిరునవ్వు సరుల,
తటకున కోపాల, తడబాటు నడల,
జనకజ యలరించె జనుల చూపరుల,
జనకుల దేలించె మమతల మరుల. 579

వ. సారవంతమైన నేలను నాటిన నిక్షిప్త బలసంయుతయగు నొక మేలిమి జాతి వంశాంకుర మేరీతి నెదిగి పుష్టికరమైన మొక్కగునో, ఆవిధముగ

సీతాశిశువు, సనాతనధర్మవర్తనుడును, ఆధ్యాత్మికవేత్తయునగు జనకుని వంశంబు సొచ్చి దిన దిన ప్రవర్ధమాన యగుచు కొలది వత్సరములలో సకల సద్గుణ లక్షణోపేతయు, నందాల రాశియునైన బాలయయ్యెను. 580

సీ. పసితనము తరించి బాలగా నెదిగిన
తనయకు జనకుండు తగిన రీతి
విద్యలు చెప్పించె విలువిద్యతోపాటు,
లలిని చతుఃషష్ఠి కళలు నేర్పె,
సంగీత శాస్త్రంబు సాధన చేయించె,
నాట్యంబు నేర్పించె నటన గఱపె,
కావ్యముల్ చదివించె కవనంబు వ్రాయించె,
కదనవిద్యల నెఱుక కలిగించె,
తే.గీ. వేద వేదాంత విద్యల వృష్టి తడిపె,
నీతిశాస్త్రమునందున నిపుణజేసె,
సకల విజ్ఞాన శాస్త్ర నిష్ణాత కుండ
వలయు చదువులు బాలకు తెలియ జెప్పె. 581

ఉ. ఈ మహి జానకీ సతికి యే సతియైనను తెల్వి నీడుగా
దేమఱ దామె పాఠము నొకింతయునే నొక తూరి చెప్పినన్,
వేమఱు చెప్ప నేమిటికి వేత్తకు చర్విత చర్వణంబుగా –
నేమన వచ్చు నా ధిషణ యెట్టి మనీషుల యందు సాధ్యమే! 582

వ. ఆ విధంబున సీతాబాల లౌకిక మనోవికాస కదనరంగాధ్యాత్మిక విద్యలం దచిరకాలములోననే నిష్ణాతయై, 'విద్యా వినయం దదాతి' యనెడు నార్యోక్తి నిరూపింపనోయన, సమవయస్కులగు పరిజనులను, చెలికత్తెలను, పూజ్యులగు తలిదండ్రులను, బంధుజనులను తగురీతి సకల శాస్త్ర పరిజ్ఞాన లబ్ధ సుగుణ



సరస సంపత్తితోడను, చతుర సంభాషణలతోడను, వ్యవహారదక్షత తోడను, సకలజీవరాశిపై కారుణ్యము తోడను, పెద్దలయెడ గౌరవముతోడను, సనాతన విధులపై నాప్యాయతతోడను మెప్పించుచుండెను. 583

చం. జనకుడు, భార్యయున్ మురిసి జానకి మాటల భవ్య వర్తనన్
తనియుచు వారి జన్మములు ధన్యము లయ్యెనటంచు తల్చుచున్
మనువును తృప్తితోడను సమంచితరీతిని సాగజేయుచున్,
చనువున దేశపౌరులను సాకుచు కాలము పుచ్చుచుండినన్. 584

## 7.4. సీతాదేవి సఖులతో కలసి బంతి యాడుట

మ. ఇది యిట్లుండగ నొక్కనాడు సఖులున్ పృథ్వీతనూజాతయున్
పదటన్ కందుకమాడ సీత వెస నా బంతిన్ ధృతిన్ తన్నగా
నది యుత్పాతకమై చెలంగుచు ననంగారాతి కోదండము
న్న దిశన్ పోయి పడెన్ ససంభ్రమముగా నారీమణుల్ చూడగన్. 585

వ. జనకుని ఇంట వంశపారంపర్యముగ సంక్రమించిన ఒక విలక్షణమైన శివధనుస్సుండెను. అది మహావిస్తారమై, అతిమానుష లోహముతో నిర్మింపబడి, అమితమైన బరువు గలిగి యుండెను. దానిని జనకుడు తన పూజాగృహ సమీపమున నొక యయోమయ మంజూష యందుంచి తగు భక్తితో నిత్యపూజలు నెరపు చుండెను. విల్లును కదుపుటకు వీలుగా, నా మందసకు లోహమిశ్రమముతో తయారుచేయబడిన ఇనుపచక్రము లమర్చబడినవి. ఆ విధముగ విల్లుతో సహా పేటికను కొన్ని వందల సేవకు లప్పుడప్పుడు ప్రక్కకు తోసి శుభ్రపరచు చుండెడువారు. 586

అశ్వగతి :
జానకి తన్నిన బంతి యసాధ్యముగా నెగసెన్
కానగ నశ్వగతిన్ కనికట్టుగ దోచ మదిన్

మానుగ మిన్నును ముట్టెడు మార్గములో కదిలెన్
శ్యేనముతో నభమందున చేయుచు జక్కణినిన్. 587

తే.గీ. గగన వీధిని విహరించి కందుకమ్ము,
ధాటి నెగురుచు నంతలో దవ్వున గల
శివుని కోదండ పేటికి, చెంతనున్న
గోడకును మధ్య సందులో కూలె సరిగ. 588

శుద్ధ విరాటి:
అంతన్ తొయ్యలు లార్తితోడ న
త్యంత వ్యాకులలై మనమ్మునన్
చింతం చెందిరి చేర నేరకన్
బంతిన్! చాలని పాటవంబునన్. 589

వ. వారు కట కటా! మనము తక్షణ మీ బంతిని తీసికొని పోక పోయిన రాజకుమారి యేమనునో గదా! అని భయంబున విచారించు సమయంబున అందొక నెరజాణ ఇట్లనియె. 590

కం. ధనువుకు గోడకు మధ్యను
కనగా నొక సన్నసందు; కరముల్ దూరం
గను సాధ్యము కాదు కనుక
ధనువు కదపకుండ గొనగ తరమే బంతిన్. 591

కం. ఇది కాని పని యగుటచే
నదరక సీతకు తెలుపుటయ సరియటంచున్
మదులను చిక్కగ బట్టుచు
పదిలముగా సీతతోడ పలికిరి వారల్. 592



ఉ. అంతట సీత శంభుని శరాసనముంచిన చోటుకేగి, యొ
క్కింతయు సంశయించక కరీంద్రము బంధుర గండశైలమున్
వింతగ ఘాసబంధమన వేవురు చూడగ నొంటి చేత ని
శ్చింతను త్రోసి మందసను శేముషి బంతిని పైకితీయుచున్ 593

వ. సఖులతో, రండు తిరిగి యాడుకొందమన, వార లాశ్చర్య, సంభ్రమ, భయాచ్ఛాదితులై పరుగు పరుగున సుమేధ కడకేగి, విషయ మంతయు పూస గ్రుచ్చిన రీతి తెలిపిరి. ఆమె వారి ననునయించి పంపి, భర్తకీ వృత్తాంతము నెరింగించిన, నాతడు యోజించి యిట్లు పలికెను. 594

మ. పదిరెండేండ్లను పూర్తికాని శిశువీ వైదేహి, యేరీతి నీ
చిదుమన్ పాలనుగార్చు బాల ఘన విశ్వేశ ప్రవేష్టద్వయిన్
విదితంబైన శరాసనంబు పులుగా బిట్టెత్తు? నీమాటలన్
మది నమ్మంగను శక్యమే పరిజనోన్మాదంబుగా తోచెడున్. 595

తే.గీ. ఘనము దివ్యంబునౌ శివ కార్ముకమ్ము
చేరి యొంటి చేతను నెట్టె సీత యనుచు
సఖులు చెప్పిన మాత్రాన సత్యమగునె
చెలుల నయన విభ్రమమని తలతు నేను. 596

## 7.5 సీతాదేవి కన్నె తులసి నోము నోచుట

వ. ఆవిధంబుగా మహారాజు జనకుడు చెలికత్తెల మాటలను త్రోసి పుచ్చెను. తదుపరి కొంతకాలము పిదప, మహారాణి సుమేధాదేవి,సీతకు, కన్యా సంబంధిత విధ్యుక్తకర్మలలో పాల్గొను వయసు వచ్చెనని నిర్ణయించి, ఆమెచే ననేక పుణ్యవ్రతములు చేయించెను, నోములు నోమించెను. ఆ పరంపరలోనే, 597

ఉ. మోదముతోడ కూతున కపూర్వము, కన్నెల భావిజీవికన్
చేదివి యైన కన్నె తులసీ వ్రతరాజము ప్రీతి సేయగా
ప్రోది యొసంగి యుక్తవిధి పూజలు చేయ ప్రవీణలైన ము
త్తైదువలన్ పురోహితుల నాయెడ గూడుచు సంప్రదించుచున్. 598

తే.గీ. ఒక శుభ దినమందున రాణి యుత్సహించి
ఉత్తమంబైన సుముహూర్త మోజనెన్ని
కన్నియల పాలి వరమైన కన్నె తులసి
నోము జానకీ దేవిచే నోమజేసె. 599

తే.గీ. ముచ్చటపడి మహారాణి పురమునందు
గల పురంధ్రుల, ముత్తైదువలను పేర
పేర నాహ్వానముల నంపి ప్రేమ మీఱ
రండనుచు సేవకుల పంచె రమణ తోడ. 600

వ. ఇంకను నామె, దేశదేశంబులగల పతివ్రతలను, సప్తర్షి కళత్రంబులను మనమందు తలంచి నుతించి వ్రతము చేయుచున్న తమ కుమార్తెయు, భూమిజాతయు, నయోనిజయునగు సీతాకన్య నాశీర్వదించు దని విన్నవించెను. అంత, ముహూర్త దినంబున, 601

తే.గీ. ఉదయమున లేపి, సీతకు ముదముతోడ
మంగళ స్నానమాచరింపంగ జేసి
కన్ను కొసలందు చక్కంగ కాటుకుంచి
పట్టుపుట్టంబులను ప్రీతి కట్టనిచ్చి, 602

తే.గీ. అంగరంగ వైభవముగ నాభ కొల్పు
రంగురంగుల రతనాలు హంగు మీఱ



సంగడించిన బంగరు కంగుమనగ
చెన్నుగా సీత చేత భూషింపజేసె. 603

వ. సఖులంత సీతాదేవి నున్నతాసనముపై కూర్చుండబెట్టి, పాటలు పాడుచు మంగళహారతుల నిచ్చిరి. అనంతరము, 604

తే.గీ. చెలులు నడిపింప నంతలో సీత యపుడు
పొలుపుమీఱంగ బంగరు బొమ్మ భంగి
తేనెటీగల గుంపులో రాణివోలె,
కదలి చనుదెంచెను తులసి పొదల దరికి, 605

ఉ. ఆవల సీత మానసము నందున హర్షమునన్ పవిత్ర బృం
దావనలక్ష్మికిన్ విధియుతంబుగ సేవలు చేసి భక్తితో,
వేవిధి ధూప దీపిక నివేదన యుక్త నివాళులిచ్చినన్,
దీవనలిచ్చె జానకికి దేవి యనూన దయాంతరంగయై. 606

## 7.6. వసిష్ఠ పత్నియగు నరుంధతి సీతాదేవి నోమున కేతెంచుట

వ. ఆ సమయంబున ద్వారపాలకాది రక్షకబృందములు కానకుండ, నొక పండు ముదుసలి ముత్తైదువ రాజప్రాసాదమున ప్రత్యక్షమయ్యెను. రాజపురోహితుడగు శతానంద ఋషీంద్రుం డామెను చూచి, తపః సంపన్నయు, శాపానుగ్రహదక్షయు, వసిష్ఠ మునీంద్రపత్నియు, మహాపతివ్రతయు నగు అరుంధతీ సాధ్విగా నెరింగి, జనక సుమేధలను హెచ్చరించిన, 607

తే.గీ. వార లెదురేగి యా ముని పత్నికపుడు,
అడగి సాష్టాంగ దండంబు లాచరించి,
చందనాగరు పరిమళ చర్చ చేసి,
స్వాగత వచనముల్ పల్కి సన్నుతింప. 608

తే.గీ. అధిక సంతోష భరితాంగి యగుచు నామె,
చెలగి వారల దరిజేర్చి క్షేమ మరసి,
జనక సామ్రాజ్య జనులకు జయము పలికి,
మంచి మాటల నాశీర్వదించి యనియె. 609

మ. "జనకోర్వీపతి! నీకు భూసతి మనోజ్ఞం బైన దివ్యాంశ సం
జనితన్ కూతుగ నిచ్చెనంచు విని నే సంతోషినై, బాలికన్
కనులారన్ కను భాగ్యమున్ నిరతి నాకాంక్షించితిన్ కాని యిం
దనుకన్ నా మునినాథు సేవ వ్యవధానంబింత లేకుండుటన్. 610

వ. వారి దైనందిక కార్యంబుల కేమాత్ర మంతరాయము కలుగకుండ, వలసిన సంబారంబులు వేళమించక సమకూర్చు సేవలో నే సర్వదా నిమగ్నమై యుంట, ఇట వచ్చుటకు సావకాశంబు దొరకదయ్యె, పూజ్య వసిష్ఠ ఋషీంద్రులును, కొంత కాలము తదుపరి పోదువులే యనియో, నీవు పోనేల? ఆమె ఇచ్చటికే వచ్చును కదా! అనియో విచిత్ర విడంబనా వచనంబుల నన్ను మిథిలకు పంపరైరి. 611

ఆ.వె. ఐన నేడు రాణి యంపిన మానసా
హ్వానమునకు హృదయ మార్ద్రమైన,
మౌని ముదల గొనుచు మానస సంకల్ప
బలము వలన నిటకు వచ్చి యుంటి. 612

తే.గీ. కొన్ని గడియలే యిట నుండ కుదురు గనుక
అవనిజను చూచి యాశీస్సులందజేసి,
చెప్పవలసిన మాటల చెప్పి నీకు
పోవుదును గాన గొనిపొమ్ము పుత్రి కడకు." 613



తే.గీ. అంత జనకుండు పత్నియు సంతసించి,
యా వసిష్ఠుని ప్రోయాలు నా క్షణంబ
యోజ కొనిపోయి రా సీత యున్న తావు,
కపు దరుంధతి జానకి నలరి చూచి, 614

కం. కాంచన భూషాలంకృత
చంచత్ ప్రావృట్ తటిత్ ప్రచరిత యనంగన్
పంచాయుధ సతి కెనయగు
నంచ నడలనొప్పు సీత యందము గనుచున్. 615

వ. ఆ రూప రేఖా విలాసంబుల కచ్చెరువంది, హృదయమానందంబుతో నిండ శ్రీయంశ సంభూత యగుట యాత్మయందే యామెకు నుతులొనరించెను. ఆ సమయంబున వైదేహి తులసి పూజ పూర్తి కావించి, ఆహూతులైన పేరటాండ్రకు కానుకలిచ్చు కార్యక్రమంబును మొదలిడ వచ్చుచుండ, తల్లి సుమేధ వసిష్ఠపత్నిని చూపి, తొలుదొల్త ఆమెను పూజించు మనెను. 616

తే.గీ. అపు దరుంధతి వంక నా యవనిజాత
యబ్బురంబంది తిలకించి హావ భావ
హార్దిక స్వాగతముగ ముఖారవింద
మండితంబైన చిరునవ్వు పండజేసి. 617

ఉ. ఫుల్ల సరోజనేత్ర, సుమ మోచిత సౌరభ సీత ముందుగన్
మల్లిక మాలతీ ప్రసవ మాలికలన్ గళమందు కూర్చి, సం
ఫుల్ల సితారవింద వర పూజిత మంగళ దేహ కాంతి శో
భిల్లు నరుంధతీ సతికి ప్రీతిని వాయనమిచ్చి మ్రొక్కినన్. 618

తే.గీ. స్వీకరించి సీతాకన్య సేవలంది,
అల్ల దరిజేర్చి చిబుకంబు నలతి పుణికి,
యొడిని కూర్చుండ గాజేసి యున్మనమున
ముని కళత్ర మాదరమున ననియె నిట్లు. 619

తే.గీ. "తల్లి! నిను గాంచ నా జన్మ ధన్యమయ్యె,
పుత్రి! నీరాక మూలాన భూమిపైన
దుష్టజన శిక్షణమ్మును శిష్ట రక్ష
ణమ్ము సద్ధర్మ పరిపాలనమ్ము జరుగు. 620

తే.గీ. ఐన నీ కార్యసాధన మందు కష్ట
నష్టములు పెల్లు; నీ భావి కష్ట సౌఖ్య
ములకు మేళనమ్ము; కనుక కులుకకుము సు
ఖములకు, కలగబోకుము కష్టములకు. 621

తే.గీ. ఎన్ని కష్టముల్ కలిగిన, నించుకైన
ఆత్మవిశ్వాసమును వీడ కమ్మ నీవు,
తలగ బోకు సనాతన ధర్మ పథము,
మరల బోకుము నీభర్తమార్గ మెపుడు. 622

వ. బాలా! ఇవియే నీ జన్మకు సార్థకత చేకూర్చును. నీ ఆశయ సిద్ధికి ఆదర్శ లబ్ధికి సహాయార్థమై, నీకొక వరము నిచ్చుచున్నాను, గొనుము. జీవితములో నీవు, నీ భర్త కష్టములను నిరాయాసులై యెదుర్కొని, సుఖముల నుదాసీనులై యనుభవించి, లక్ష్యసాధన నకుంఠిత దీక్షతో నొనరింతురు గాక," యని జనకుని ప్రక్కకు గొనిపోయి, ఏకాంతమ్మున నిట్లనెను. 623



## 7.7. జనకుడు సీతాదేవికి స్వయంవరము ప్రకటించుట

ఉ. ఎంత యదృష్ట వంతుడవొ! ఎంతటి పుణ్యము పూర్వ జన్మలం
దింతియు నీవు చేసితిరొ! ఇట్టి రమాస్పదమైన కన్య నీ
యంతిపురంబునన్ దుహిత యట్లు వసించుచు నుండె – దివ్య సీ
మంతిని ఈమె – నమ్ముము ప్రమత్తత వీడుము నీకు మేలగున్. 624

కం. ఈ సతి యెచ్చట నుండునొ
భాసురముగ నట వివేక పరిణత పూతం
బై సిరిసతి నిరతంబును
వాసించును సకల భోగభాగ్యాస్పదమై. 625

తే.గీ. ఇంతి కారణజన్మయై ఇల భవించె
దివ్యశక్తులతోడ సందీప్త మగుచు
నాతి మూలాన రాక్షస నాశ మగును
వంతలును దీరి భూమాత సంతసిల్లు" 626

కం. అది విని జనకుడు "మాతా!
ముదమొదవ పలికితి కాని పొదవవు నాకున్
మది నీదు పలుకులు – మదీ
య దుహిత సామాన్య బాలి కన్నిటి లోనన్. 627

తే.గీ. దివ్య శక్తులు కనరావు దీని యందు,
గురువుల కడను పాఠముల్ గరచు నపుడు,
తలరి మాతోడ మెలగెడు తరుణమందు
పరులతోడను మాటాడు పట్టులందు." 628

తే.గీ. అపు డరుంధతి నవ్వుచు నవనిజాత
నటకు పిలిచి, "కుమారి! నీ వప్పుడపుడు
కెలసి కందుకం బాడెడి గృహమునందు
గల ధనువు నాకు చూపించ గలవె", యన్న. 629

శా. ఆ మాటల్ విని సీత – మెప్పు కొఱకై యాజ్ఞైన యా తత్క్షణం
బే మారాడక పెద్దవారి పనుపుల్ వీకన్ సమగ్రంబుగా
వ్యామోహంబున నిర్వహించి తగు గొప్పల్ జూపు పాపల్ వలెన్ –
సామర్థ్యంబుగ పూజ యిల్ దరికి నోజం బోయి కార్యార్థియై. 630

సీ. అధిక గరిష్ఠంబు, నతులిత దీర్ఘంబు,
అసమాన స్థూలోచ్ఛయ సదృశంబు,
అతిలోక లోహ నిర్మితము, సాంద్రతమము,
దివ్యశక్తి యుతము, దృఢతరంబు,
ప్రథితంబు, ప్రబలంబు, ప్రత్నంబు, ప్రచురంబు,
భ్రాజిత దివ్యశరాసనంబు,
మౌర్వీ సమాహిత మహిమాన్విత స్ఫురత్
వికచ స్ఫటానాగ విస్మయంబు,
తే.గీ. త్రిపుర సంహార హేతువౌ దివ్య ధనువు
ప్రథిత నారాయణాస్త్ర సంపద్యుతంబు
కాలగళ కర స్పర్శిత కార్ముకమ్ము
నుంచినట్టి పెట్టెను జేరె, నుద్యమించి, 631

కం. మందసను తెరచి యందున
నిందుధరుని చాపము వెస నెత్తుచు చూపెన్
పొందుగ నా ముని కాంతకు
సుందర దరహాస సీత చోద్యముగాగన్. 632



వ. కొన్ని వందల సైనికు లతికష్టంబున కదల్చగల లోహ మందసలోని మహోన్నత శివధనస్సు నెత్తిన తన కుమారి దివ్య బల సంపన్నతకు రాజాశ్చర్య చకితుడగు చుండ, అరుంధతి సీతతో నిట్లనియె, 633

తే.గీ. "సంతసించితి నమ్మ నీ శక్తి చూచి,
మర్త్య లోకము నందు నీ మనువు గనుక,
భవ్యమౌ అతిమానుష దివ్యశక్తు
లిలను మరచి పోదువుగాక యింక మీద! 634

ఆ.వె. ఇందువదన! ధనువు మందస యందుంచి,
కన్నెతులసి నోము కాంచ వచ్చి
నట్టి పేరటాండ్ర నతులమౌ భక్తితో
వాయనముల నిచ్చి పంపు మమ్మ". 635

వ. అనుచు సీతను బుజ్జగించి పంపివేసి, జనకునితో నిట్లనియె, 636

మ. "జనకా! ఇప్పటి కైన నమ్ముదువుగా సాక్షాత్తు దైవాంశతో
చను చిన్నారియె నీ కుమారియని, నీ జన్మంబు ధన్యంబునై
తనరెన్, నీపయి బాధ్యతల్ పెరిగె, సీతాబాల వీరుండు పా
వనుడున్ యోగ్యుడునైన రాజసుతు చేపట్టంగ సంధించుమా! 637

వ. ఈ మహత్కన్యను జాగరూకతతో పెంచి తగిన వరునిచేత నుంచుట యొక బాధ్యతాయుతమైన విధి. దీనిని నీవు సక్రమంబుగ నిర్వర్తించుము. 638

కం. అరయంగా సుతకు తగిన
వరుని వెదకెడు కృషి తండ్రి పైననె యుండున్,
వరపుత్రి సీత యెడ నిది
గురుతరమై యొప్పు, దీన కొంకక నీవున్, 639

వ. ఈ దైవ స్వరూపిణికి తగిన భర్తను కూర్చుటకై ప్రత్యేక శ్రద్ధ వహించవలసి యుండును. అర్హుడుకాని వరునితో కల్యాణము జరిపించు తండ్రి, తన విధిని సక్రమముగ తీర్చనివాడు గాన కుమార్తెకు ద్రోహము చేసిన వాడై ఆమెకు శత్రువుగా పరిగణించబడును. అట్టి అనాలోచిత కార్యము మూలమున కూతురు బ్రతుకు దుర్భరమగుటయే గాక దౌహిత్రుల జీవితము లస్తవ్యస్తములై మానసిక వ్యథలకు కారణభూతములు కాగలవు." 640

చం. అన విని రాజు వేడుకొనె నా ముని పత్నిని, "తల్లి! నాపయిన్
కనికరమూని నా సుతకు కాగల భర్త యెవండొ తెల్పి నా
మనమున శాంతి కూర్చుము, సమస్త ధరావలయంబులోన నే
పనిగొని యాతనిన్ వెదకి పట్టికి కూర్చెద నాతడొప్పినన్. 641

కం. ఈ విధముగ తగిన వరుని
నే వెదకెడు శ్రమను మాన్పి నిశ్చింతగ నా
జీవిక సాగగ చేయుము
నే వందనశత మొనర్తు నిరతిన్ నీకున్." 642

మ. అనగన్ నవ్వుచు పల్కె మౌని సతి, "హాహా యెంత విడ్డూరమో;
జనకా! నేనిటు వ్రేలుచూప కరమున్ సాంతంబు మ్రింగంగ బో
దను జోదుం బలె పల్కినాడవు గదా, దైవాంశ సంభూత పా
ణిని చేపట్టెడి పూరుషున్ తెలియ నే నిర్ణేతనే ధాత్రికిన్! 643

తే.గీ. నీ కుమార్తెకు భర్తను నిశ్చయించు
టరయ నా బ్రహ్మకే సాధ్య మగును గాని
యొరుల కెట్లౌను, ఒకవేళ నెరిగియున్న
దేవతా రహస్య మగుట తెలుప రెవరు. 644



తే.గీ. ఐన నీ వరాన్వేషణమందు కొంత
సాయ పడెడు రీతి నొక సూచననొనర్తు,
పూని దీని నీ కుపయుక్తమైన యెడల
నాచరించుము నీ మది తోచినట్లు. 645

ఉ. ఈవును చూచినాడవు మహేశ్వరు చాపము, భారవంతమున్
పావనమైన కార్ముకము పావని జానకి వేణు వట్లుగా
ప్రావగ నెత్తె గాన, సుత పాణి గ్రహించు వరుండు చాపమున్
వావిరి పూన్చి యెక్కిడు ప్రభావము కల్గిన వాడు కావలెన్. 646

కం. కావున నొనరింపుము పణ
మే వీరుడు శివుని విల్లు నెక్కిడగలడో
ప్రావీణ్యముతో నతనికి
వావిగ నా దుహిత నిత్తు వారక యనుచున్. 647

ఉ. శ్రీయుత మూర్తియౌ పురుష సింహుడు, విక్రమ బాహు వీర్యుడున్,
కాయజ రూప సుందరుడు, కార్ముక శాస్త్ర విశారదుండునౌ
<Œ Œ=°ø, ‹ #°ß ŒŒ ì_Ê¼È n~¡ Ç, ‡t Ol x<£
^¥† Œ# Œ®÷† ³Hø_ ^#‹ ²#° * ì#H÷¡, O_Á† Œ_³_È<ÑÑ 648

` Íw. J @° ‹ ¶z O„ ¬=òx„ ¤ßH=xqƒ°_È
#` Ç° Kk #° ‹ Øã Ô #` Ç =òŒ®° Ð
H¡} ` Ëx+»„ ‡‹ k oe¡ °Œ®Œê¡
† Œx † Ç¡O^ Îu nqOz † Ç¡Œ®°OK³ 649

L. „ ²°à@ ~Œ =°Oã Ç #° " Í Ç, =°#° ‹ Øã k Oz " Œ
i =òàŒ®<ù, æŒ®£ã H@x Kã =°n † ÇŒ® ì=òà#O^ Î „ ‡

ర్వమ్మునను నుండి యున్న త్రిపురాంతకు చాపము నెవ్వడేని తే
జమ్మున పూన్చి యెక్కిడిన జానకి నిత్తునటంచు ప్రీతితో. 650

కం. ఆ ప్రతినను విని వచ్చిరి
సప్రతిభాస స్థవీయ శరసంధానుల్
సుప్రభ శస్త్రాస్త్ర విదుల్,
సప్రతి భోత్సాహ జన్య జవ ధానుష్కుల్. 651

కం. చక్కని చుక్కను, సిరిసతి
కెక్కుడునగు జనకుని సుత నెక్కటి సీతన్
గ్రక్కున చేపట్టుటకై
యెక్కిడ వచ్చిరి భుజబలు లీశుని విల్లున్. 652

కర్ణాట చౌపదులు:

మానవులు, దానవులు, మానుగా సురలు,
పూనికను కిన్నరులు పూటుగా కదలి
జానకిని చేకొనగ జానుగా వెడలి
వేన వేలుగ మిథిల వేంచేసి రపుడు.

జనకుడును మంత్రులును సంతుష్టులగుచు,
తనివితో నతిథులకు తత్కాల విధుల
నెనలేని అతిథ్యమిచ్చి సేవించి,
^ #°=@#ß=°O^ ï #° ^ ¥~ÿ్ లౌ వారి
పనివాండ్ర దండిగా పంపి తెప్పించి
అనువుగా సభలోన నరుగుపై నుంచి,
ననలతో పూజించి నలువురుం చూడ
ఇనప మూతను తీసి రెసలార విల్లు. 653



వ. కాని, ఆ ప్రకారము తండోపతండంబులుగా సీతాకాంతను పొందుట యందు, తమ యదృష్టమును పరీక్షించుకొన దలచి వచ్చిన వీరులు, సభా స్థలినుంచిన శివధనువు నెక్కుపెట్ట బూని విఫలురైరి. అనేక మాసములు గడచినను గూడ నొక్కరుండును ధనువు నెక్కుపెట్టజాలక పోవుట వలన జనక రాజేంద్రుడు కలతజెంది, మంత్రులతో సంప్రదించి, సీతాస్వయంవరముతో బాటు, ధనుర్యాగము నేర్పాటు చేసి దేశమునగల రాజులకు, వీరవరులకు, పండితులకు, మునివరేణ్యులకు నాహ్వానములు పంప నిర్ణయించి, పురో హితులను పిలిపించి ఈ కార్యక్రమమునకు తగిన ముహూర్తము నిశ్చయించుడని యాదేశించెను. 654

* * *

# 8. విశ్వామిత్రుని ఆగమన ఖండము

## 8.1. విశ్వామిత్రుడు అయోధ్యకు వచ్చుట

వ. ఆ ప్రకారము మిథిలానగరమున జనకమహారాజు సీతాదేవి వివాహార్థమై ప్రయత్నములు చేయుచుండ, నిట అయోధ్యా పట్టణమున, 655

ఉ. అంతట నొక్కనాడు మహితాత్ముడు, పూజ్యుడు, సంయమీంద్రు డ
త్యంత తపోవిరాజితు డహంకృత వర్జితు డాత్మతేజభా
స్వంతుడు, శస్త్ర కోవిదుడు, సన్నుత కౌశిక నామధేయు డా
గంతకుడై యయోధ్య కనుకాంక్ష నృపాలుని గాంచవచ్చినన్. 656

వ. ఆ సమయంబున, మంత్రి పురోహిత మునీంద్ర సేనాధ్యక్ష రాజోద్యోగ పురజన నాయక పరివృతుండై నిండు పేరోలగంబున నున్న దశరథమహారాజు దౌవారికులచే విశ్వామిత్రు నాగమనంబు నెఱింగి కడు సంభ్రమంబున,657

కం. అశనివలె నకస్మాత్తుగ
కుశికుని పుత్రు డరుదెంచ కొందలపడుచున్
దశరథు డెదురేగి నతిన్
కుశల మరసి అర్ఘ్యమిచ్చి కొండాడి ఋషిన్. 658

కం. ప్రావృత మౌని పురోహిత
పావనుడై స్వాగతించి పాద్యాదులతో
నా విశ్వామిత్రుని తగు
తావున కూర్చుండ జేసి తద్దయు ననియెన్. 659

ఉ. వందనమోయి గాధిసుత! పావన కౌశిక వంశ భాస్కరా!
బంధుర వాసవాది సురవందితపాద! తపస్సుధా ఝరీ



స్యందిత శీర్ష ! నీ విటకు సప్త హయుంబలె వచ్చి నేడు మా
విందువ వైతి నిన్ను గన విచ్చెను మా హృదయారవిందముల్. 660

వ. మహాత్మా నీకు స్వాగతము. నేడు నీ యాగమనంబు మా వంశకర్తైన వివస్వంతుని రాకతో సమానమై యొప్పి, నన్ను కృతార్థుని జేయుచున్నది. ఓ మునిశ్రేష్ఠా! నిరత వ్యాధిగ్రస్తునకు దివ్యౌషధము లభించినరీతి, క్షామముతో నటమటించు దేశంబునకు పుష్కల వృష్టి యేతెంచిన భంగి నీ సమాగమంబు నన్నును, నా ప్రజలను సంతోషపరచుచున్నది. నీవంటి మహాత్ము లే గృహంబున కేతెంతురో ఆ గృహస్థుండు పావనమగును. ఆ దేశంబును సకల సంపద్భాగ్యంబులు వరించును. నీవొక ఆసామాన్య ఋషిపుంగవుండవు. 661

సీ. మును నీవు రాజవై భువినేలుచుండంగ
ముని వసిష్ఠుని పైన కినుక తోడ,
చాల వత్సరములు జపమాచరించుచు
రాజర్షివైతివి ప్రతిభ మీఱ,
దానితో తృప్తి జెందక నీవు పదపడి
పదివేల వత్సరాల్ భంగపడక
దివ్యమౌ తపమును దీక్షతోడను జేసి
బ్రహ్మర్షి వైతివి పట్టుబట్టి,
తే.గీ. ఇట్టి యద్భుత పరిణామ మెన్నడైన
మానవులయందు నే యెడ నైన గాని
చూచియుండగలే దిది చోద్యమరయ,
ఎట్లు వర్ణింతు నీ శక్తి ఋషివరేణ్య! 662

తే.గీ. ద్విజుల ప్రాణమౌ గాయత్రి దివ్య మంత్ర
దర్శనము నందిన మహిత ద్రష్ట వీవు!

సృష్టికి ప్రతి సృష్టించిన స్రష్ట వీవు!
నతులు గొనుము విశ్వామిత్ర! అతిపవిత్ర! 663

వ. స్వామీ! మీరు మా రాజ్యంబు పావనము చేయుటకు గల కారణమేదేని యున్నచో సెలవిండు. ఈ భృత్యుడు మీ సేవకై ఎల్లప్పుడును సిద్ధముగా నుండును. రవివంశంబునం దుద్భవించిన నాకు నా పూర్వికుల వలెనే ఋషిపుంగవుల యాజ్ఞలు శిరోధార్యములు. 664

కం. ఏ పనికై విచ్చేసితి
రా పని నే చేయువాడ ననుమానము లే
కా పని నాకున్ తెలుపుం,
డా పరమేశ్వరుని యాన! అది నే తీర్తున్. 665

## 8.2. విశ్వామిత్రుడు యజన రక్షణార్థము రామ లక్ష్మణులను పంపుమని కోరుట

చం. అన విని కౌశికుండు మృదుహాసము మోమున దోప పల్కె "నో
ఇనకుల వార్ధి చంద్ర ! ప్రతిహీన సనాతన ధర్మ వర్తనా !
అనుపమ పూజ్యభావమున నంకితచిత్తము తోడ నీవు నా
మనముననున్న సందియము మానుగ తీర్చితి వయ్య భూవరా. 666

ఆ.వె. సూర్యకులుడవౌట శౌర్యంబుతోపాటు
ధర్మ రక్షణమున తడయకుండ
మునుల సంకటముల తనివోవ తీర్చంగ
చెలయుదునని ప్రతిన చేసినావు. 667

వ. =°, ఈ-Œì! [1]* నీవును వినియేయుందువు, రావణుడను రాక్షసేంద్రుడధర్మవర్తనుడు మూడు లోకములను తన వశములోన నుంచుకొనుచు



జనులను, సురలను క్షోభపెట్టు* చున్నాడు. ఈతడు బ్రహ్మ మానసపుత్రుడైన పులస్త్యుని కుమారుడగు విశ్రవసుడను మునికి, సుమాలి కుమార్తెయగు కైకసి యను రాక్షస వనితకు జనించి, 668

తే.గీ. పదితలలు గల్గి దశకంఠ, పంక్తికంఠు
లనెడు ముఖ్య నామములతో మనుచు నుండు;
వాని భీకర రూపము మానవు లెవ
రైన కనినంత పడి చత్తు రదరి పడుచు. 669

తే.గీ. వాడు జన్మించినపు డార్వ, వాని కంఠ
రవమునకు ముక్కలయ్యెను రాళ్ళు గాన
జగతియందున వానికి సార్థకముగ
రావణుండను నామంబు ప్రాప్త మయ్యె. 670

సీ. తీవ్రమౌ తపమును దీక్షతోడను చేసి,
పరమేష్ఠి మెప్పించి పరమ భక్తి,
బల శౌర్య విక్రాంతి ప్రతిభయ రూపంబు,
శస్త్రాస్త్ర మహనీయ సంచయంబు,
అణిమాది సిద్ధు లష్టైశ్వర్య విభవంబు,
సామ్రాజ్య సంప్రాప్తి సమర జయము,
ధన ధాన్య మాణిక్య కనక వస్తు చయము,
భోగాది సౌభాగ్య యోగములును,
తే.గీ. యక్ష కిన్నర గంధర్వ రాక్షస సుర
సంయమీంద్రుల చేతను చావు పొంద
కుండ సరిలేని వరముల గొని యతండు
తనకు మరణంబు లేదని ధైర్యమూని. 671

వ. ముల్లోకములయం దెదురులేక, తన సవతి యన్నయగు కుబేరుని లంకా రాజ్యమును, పుష్పక విమానమును చేజిక్కించుకొని, అధిక బలసంపన్నులు, బ్రహ్మదత్త వరప్రసాదులునైన సోదరులు కుంభకర్ణ, విభీషణ ద్వయము తోడను, ఇంద్రుని జయించి ఇంద్రజిత్తను పౌరుష నామముగొన్న మేఘనాదుడు మొదలుగా గల బహుపుత్రచయము తోడను, విర్రవీగి, సాధుజన కంటకుడై, కులస్త్రీలను పాడుచేయుచు, దేవతలచేతనే యూడిగములు చేయించు కొనుచు, అధర్మ వర్తనుడై చరించుచున్నాడు. శివభక్తి పరాయణుండైనను, 672

తే.గీ. ఆ సుర విరోధి యైనట్టి యసుర భర్త
వేద విధ్యుక్త యజన యాగాది విధుల
జరుప రాదని శాసించి, సవన మాచ
రించెడు మునుల, జనుల హింసించు నెపుడు. 673

తే.గీ. క్రతువుల వినాశ మొక చిన్న కార్యమనుచు
నాత డభిజాత గర్వుడై యనుచరులను
పంపు విధ్వంస కాండకై – వారు చూచి
రండనగ కాల్చి వచ్చెడి రాత్రిచరులు. 674

కం. యజనములు చేయ నివ్వరు,
సుజనులు చేసిన నెడలిచి క్షోధిష్ఠులు సా
మజ శత సమ బల సంయుత
భుజబలమున నణగద్రొక్కి పొలియింతు రొగిన్. 675

కం. రావణ దానవు పనుపున
కావరమున రెచ్చి ఘోర కల్మష యుతులౌ
సేవక బృందము లార్ష
స్థావరముల గూల్తు రధిక సంతోషముతో. 676



వ. ఇట్టి పరిస్థితులలో నేను, 677

తే.గీ. నిరతి క్రతువులు చేయుట నిశ్చయముగ
ధరను వేద విధ్యుక్తమౌ ధర్మమనుచు,
నవని జను లెల్లరును దీని కర్హులనుచు
సవములను చేయబూనితి చాలమార్లు. 678

ఉ. కాని దురాత్ములౌ యసుర కాపథవర్తులు రాక్షసాధముల్
పూనిక హోమధూమము నభోగతి పర్వగ చూచి సత్వరం
బానుచు రక్తమాంసముల నధ్వర కుండములందు జిమ్మి, సం
దానము చేసి యాజకుల, ధ్వస్తము చేసిరి యజ్ఞవాటికల్. 679

ఉ. ఐనను మున్నెఱుంగని మహాధ్వర మొక్కటి నేడు లోక క
ల్యాణ నిమిత్తమై జఱుప యత్నము సేయుచు నుంటి – దాని నా
దానవ భర్త చారులు వితర్కము చేసి వచింప, నాతడున్
శోణిత పాన తత్పరుల, సుందుని సూనుల పిల్వపంచుచున్. 680

కం. కౌశిక సవమెట్లైనను
నాశనమొనరించి రండనగ నవ్వా రా
క్రోశముతో వల్లె యనుచు
రోసమున ప్రతిన గొనిరట రూక్షణపరులై. 681

వ. రాజా! సుందుడను రాక్షసునకు మహా బలోపేతయగు తాటకయను యక్షిణియందు జన్మించిన కుమారులు మారీచ సుబాహు లతిభయంకరులు, అతుల బలసంయుతులు. వీరి బారినుండి నా యజ్ఞమును రక్షించుకొనుట దుస్సాధము. వారిని సామాన్యు లెవరును జయింపజాలరు. 682

శా. రక్షోవీరుల తాటకా సుతుల మంత్ర స్పృష్టి తోడన్ త్రుటిన్
శిక్షింపంగ సమర్థతన్ గలిగియున్ శిక్షింపగా నొప్పబో
నక్షీణంబుగ న్యాయ ధర్మములు కాపాడంగ నీ బోటులౌ
దీక్షాబద్ధులు లోకబంధు కుల పృథ్వీనాథు లున్నందునన్. 683

వ. నీ వంటి ధర్మ రక్షకులు, సంయమీ కుల వాంఛా ఫల ప్రసాదులగు రాజశ్రేష్ఠులుండ, ఈ చిన్న విషయమునకు నా తపశ్శక్తిని వ్యర్థము చేయు టవివేకముగదా! 684

తే.గీ. రాక్షసుల కీటడంచి నా క్రతువు నిర్వి
రామముగ సాగ జేయు విక్రముని కొఱకు
వచ్చినాడను పనిబూని పార్థివేంద్ర!
ఆత డెవ్వ డనగ విను మాత్రపడక. 685

ఉ. చల్లకు వచ్చి ముంత నొడి చాటున దాచిన లాభమేమి, నే
వెల్లడి సేయుదున్ హృదయ వేష్టితుడైన శుభాంగు గూర్చి – చే
విల్లుధరించి శాత్రవుల పీచమడంచెడు రాము డొక్కడే
కల్లరులైన దానవ నికాయము గూల్చ సమర్థుడీ భువిన్. 686

కం. రాముని పంపుము నాతో
సౌమిత్రియు వెంటనంటి సాయము చేయన్
భీమాకార బలాఢ్యుల
యామవతీ చరుల నొంచి యజనము బ్రోవన్. 687

ఉ. రాముని హస్త కల్పిత కరాళ ఖురాలక వహ్ని కీలక
స్తోమము నందు రూపు చెడి శుక్రుని శిష్యులు గిట్టి బూడిదై
స్థామము వీడి యా జముని ధామము చేరుట నిక్కమౌటచే
నీ మనమందు సంశయము నెక్కొన కుండగ పంపు పుత్రులన్". 688



వ. ఆ మాటలకు మహారాజు తల్లడిల్లి, పసివారగు పుత్రులను రాక్షసులతో పోరుటకు పంప నిచ్చగించక విచారగ్రస్తుడై, ఆ విషయము మునికెట్లు చెప్పవలెనో నిశ్చయించలేక మౌనము వహింప, ఈతడు తనపుత్రులకు రాక్షసులచే హాని కలుగునని చింతించు చున్నాడని యెరిగి, విశ్వామిత్రుడు రాజుతో తిరిగిట్లు చెప్పదొడంగెను. 689

ఉ. "నమ్ముము నన్ను సూర్యకులనాయక! పుత్రుల కెట్టి యాపదల్
క్రమ్మగనీను; వారలను కన్నుల నిమ్ముకొనంగజేసి నే
నిమ్మడి కాయుచుండెద మరెట్టి భయంబును జేరనీయకన్,
నెమ్మిగ గూర్తు భ్రాతల కనిర్వచనీయ శుభంబులెన్నియో. 690

జలధర:
ఊనిచినాడ యజ్ఞ సుముహూర్తము సత్వరమే
నేనిక పోయి వచ్చెదను; నేమము తోడుగ నా
స్థానము నందునన్ యజన సన్నహ కార్యములన్
పూనిక ఛాత్రులున్ సలుప మోహర మౌదురికన్. 691

తే.గీ. జాగుకాకుండ పంపుము వేగిరమ్ము
ముదముతోడను నావెంట పురుషసింహు
రామచంద్రుని లక్ష్మణ భ్రాత గూర్చి
వృథగ కాలయాపన మాని నృపవరేణ్య." 692

## 8.3. విశ్వామిత్రుని కోరిక విని దశరథుని ఆస్థాన ప్రజలు కలత జెందుట

వ. ఇట్లు విశ్వామిత్ర మునీంద్రుడు పలుక, నా సమయంబున రాజా స్థానంబున, 693

తే.గీ. పౌర నాయక వర్గంబు, ప్రతినిధులును
కౌశికుని కోరికను విని కలతతోడ,
ముఖము లెల్ల కోపానల సఖము లైన
గుస గుసలుగ పలికిరిట్లు గునిసి పడుచు. 694

కం. పనిగొని [2]పదిరెండేండ్లై
నను నిండని కుర్రవాండ్ర నక్తంచరులన్
దునుముటకై కొనిపోవుదు
నని ముని పలుకుట తలంప న్యాయం బగునే! 695

కం. ముక్కులకు పచ్చ లారక
చిక్కబడని బాలురెట్లు చిచ్చుపిడుగులౌ
రక్కసుల నెదురుకొందురు
వెక్కసముగ తోచు మౌని వేడిన కోర్కుల్. 696

తే.గీ. మాలిక:
నల్లనయ్యను, మురిపాల నలువుకాని,
కలువకన్నుల స్వామిని కన్న తండ్రి,
కోసల జనుల ప్రాణమౌ కుర్రవాని,
ప్రజల కభిమాన పాత్రుడౌ రాజపుత్రు,
రామచంద్రుని, నవ్వుల మోమువాని,
ఏదియో సాకు చెప్పుచు నేలికకును,
మనలనుండి తా గొనిపోవ ముని తలంపు
గాన మన మొప్పగారాదు మౌని కోర్కి. 697

తే.గీ. తపసిపై భక్తి మన రాజు తలముదప్పి
వాని కోర్కెను దీర్చంగ ప్రతిన బూనె,



తెలియడో యేమొ ఇటు లెగ్గు కలుగునంచు,
ఇప్పు డేరీతి వర్తించు నినకులుండు! 698

వ. అన విని వారిలో ననుభవజ్ఞుండైన వృద్ధుం డిట్లనియె, 699

కం. మన మాటలు ముని విన్నను
కనలుచు నాతడు శపించు కనుకన్ మన మిం
కను వేరుగ మాటాడక
వినుటే కర్తవ్యమని వివేకము తెలుపున్. 700

వ. ఇది విని తక్కుంగల పౌరులూరకుండిన, సభలో మరియొక చోట సచివులు, మేధావు లిట్లనుకొనుచుండిరి. 701

కం. బాణప్రయోగ మెరుగని
కూనల రక్కసుల పోరు కొరకై కోరన్
మౌనియు నెరుగనివాడే –
కాన వెనుక దీనికొక్క కారణముండున్. 702

వ. వేచిచూచుటే మన కర్తవ్యమని యూరకుండిరి. అంత, 703

చం. మునివరు మాటలన్ వినగ భూరి విషాదము గ్రమ్మి భూవరుం
డనియత దుఃఖ పీడిత హృదంతరుడై క్షణకాల విస్మృతిన్
తనువు తపించి క్షోభిల, విదాహిత పాదప మట్లు గూలి వే
దనపడి లేచి పల్కె నిటు తాపసి తోడ ననూన ధైర్యతన్. 704

## 8.4. దశరథుడు తన కుమారులను పంపజాలనని విశ్వామిత్రునితో చెప్పుట

వ. ఓ ఋషివర్యా! నేనొక నిర్ణయంబునకు వచ్చితిని. నన్ను క్షమింపుడు. మీ కోరిక నే తీర్చజాలను. ఏల యన, రామ లక్ష్మణు లతి పిన్న వయస్కులు. 705

సీ. చిదిమిన పాల్గారు చిఱుత ప్రాయము వారు
కెరలి రక్కసులను గెలుచు టెట్లు,
విలువిద్యలోన ప్రవేశమున్నను గాని
ప్రావీణ్య మేమియు ప్రబల లేదు,
శస్త్ర ప్రయోగాన సరిలేని రఘురాము
డస్త్ర శాస్త్రమున నభ్యాసి గాడు,
ఆటగా పోరుల పోటి పడుటె గాని,
విగ్రహం బెఱుగ రీ బిడ్డ లెపుడు,
తే.గీ. అట్టి పసిబాలు రెట్లు సాయంబు సేయ
గలరు కర్కశ దానవాగ్రసర హస్త
కల్పితాస్త్ర విన్యాసమౌ కదన భూమి –
చోద్యమగు స్వామి! మీ కోర్కె చూడ మాకు. 706

కం. అకృతాస్త్రులు బాలురు, కా
ర్ముక ఘన విద్యా ప్రవీణ రోచిష్ణువులే!
అకటా! ముష్కర దుష్ట భ
యకరులగు సుబాహు తతుల నడ్డు కొనంగన్. 707

మ. ఒక యక్షౌహిణి సేన తోడ్కొనుచు నే నుత్సాహినై పోరుచున్
ప్రకట స్ఫూర్జిత మృత్యు భృత్య సములౌ రక్షఃప్రవాహంబులన్



వికలంబైచన జేసి నీ క్రతువు నిర్విఘ్నంబు గావించు పూ
నిక నీ వెంటను రా దలంచితిని – కానీ సంయమీ చంద్రమా! 708

కం. అసుర ప్రముఖులు మారీ
చ సుబాహులు క్రోధమూని సవ కార్యములన్
కసిమసగి ధ్వస్తి సేయన్
వెస వచ్చుట నీవు చెప్ప విస్మితు డైతిన్. 709

కం. కుజనుల, ప్రభిన్న శత సా
మజ బలదర్పుల సుబాహు మారీచుల, ప
ద్మజ వర యుతుడగు రావణు
సజనుల పోరంగ నాకు సాధ్యం బగునే! 710

కం. భీకర రావణ భృత్యుల
రాకాసులలో కుటిలుల ప్రాయిన్ గెలువన్
నాకే కాదీ జగతిన్
నాకాధిపునకయిన గగన సుమ సమంబే. 711

వ. ఈ కారణంబున, మీ వెంట వచ్చుటకు నాకు మనసొప్పుట లేదు. ఇక నా చిన్ని కుర్రలనెట్లు పంప గలను. మారీచాదులతో యుద్ధము రావణునితో వైరము కొనితెచ్చుకొనుటయే. కావున ఋషి దేవా! నా మాట మన్నించి మీ యజ్ఞ ప్రయత్నమును విరమింపుడు. 712

కం. ఈరేడు లోకములలో
నా రావణుతో తలపడు నాయతి గల వా
రేరీ చింతింపగ – నా
శౌరియె దిగివచ్చి వాని చంపిన గానీ! 713

వ. స్వామీ! మాకు కొన్ని వేలేండ్లు సంతానము కలుగక నేనును నా భార్యలును దుర్భర మనఃక్షోభ ననుభవించితిమి. 714

[3]మధ్యాక్కర:

ఎంతగాను విలపించితిమొ, ఎవ్వారి కెఱుకయ్య స్వామి!
సంతులేకను క్రుంగి మేము, ఛప్పన్న సంవత్సరాలు!
అంతులేని వ్యథను కుమిలి, అన్నంబు నంటబోకుండ,
వంతతోబిట్టు స్రుక్కితిము, వంశాంత భయముతో నలిగి. 715

మత్తకోకిల :

లేక లేకను పుట్టినారలు లెక్కలేని వ్రతంబులున్
వీక తోడను దేవళంబుల పేరు పేరున పూజలన్
మోకరిల్లుచు సంయమీంద్రుల మోదమొప్పగ సన్నుతుల్
నాకవాసుల ప్రీతికై ఘన నైష్ఠి కేష్టులు సేయగన్. 716

వ. దిక్కరీంద్రములవంటి రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను పేర్ల వెలయు నా నలువురు పుత్రులు సకల గుణాభిరాములు, రూపలావణ్య సంపన్నులు, ప్రేమ స్వరూపులు, గురు భక్తి పరాయణులు, రాజ లక్షణోపేతులు, ఈ చిఱుతలతోడిదే ప్రపంచమను రీతి వారి చెంత నేను నిరంత రానందముతో జీవితమును గడుపుచున్నాడను. 717

ఉ. అందున రామచంద్రుడన నారవ ప్రాణము నాకు, వాడు పూ
ర్ణేందు నిభాననుండు, ఘన నీరద భాసుర చారు దేహుడౌ
సుందర విగ్రహుండు, గుణ శోభితుడున్, కరుణా సముద్రు డా
నందము వాని పొందు, మది నాట్యము సేయును వాని చూచినన్. 718



ఉ. పొందగు బాలరాముని విభూతిని చూడ, మరంద మాధురీ
స్యందిత రత్న గోళములు చంచల నేత్రము, లానన ద్యుతుల్
చందురు శీతలాంశువులు, సామజ తుల్యము వాని యానమున్,
విందులు వాని నవ్వులు, వివేక వచస్సులు వాని వాక్కులున్. 719

ఉ. వానిని వీడి నేనెపుడు పావు నిమేషము నైన స్వస్థతన్
కానగబోను, వాని దరి గానని నాడు విషాద మేదియో
మానసమందు వ్యాప్తిగొని మామక దేహము క్రుంగు, జీవితం
బానికలేక మ్రగ్గి చరమాంకము చేరిన రీతి తోచెడున్. 720

కం. ఓ మునివర! నాకున్ మా
రాముడు కనబడని పవలు రాత్రై పోవున్
రాముడు లేనట్టి గృహము
శామీనకృత ఖిల సీమసమముగ తోచున్. 721

వ. కావున మహాత్మా, నన్ను నేను హింసించుకొని, మరణించుట నా యభి మతంబు కాదు. నను మన్నింపుడు. రామ లక్ష్మణులను దక్క, గో ధనధాన్యా దులు, వజ్ర వైడూర్య ఖచిత స్వర్ణాభరణములు, దాస దాసీ జనములు, చివరకు నా రాజ్యమునైనను కోరుకొనుడు. తత్క్షణమిచ్చెదను. కాక రామ లక్ష్మణులను మీతో గొనిపోవుటయే మీ నిశ్చితాభిమతంబైన, మరియొక సమస్య గలదు. వారలకు నేను తండ్రిని మాత్రమే. కౌసల్యా సుమిత్రలు వారి తల్లులు, నాతోబా టుపవాసాది దీక్షలు, వ్రతములు, జపములు, యాగములు చేయుటయే కాక, పదిరెండు మాసములు గర్భమున వారిని ధరించి, కని పెంచిన వారలు. 722

ఉ. పిల్లల పైన తండ్రులకు ప్రేమెటు లుండునొ, అంతకన్న కో
కొల్లలుగా నపత్యమన కోటి మడుంగులు హెచ్చు రాగముల్
తల్లుల కుండు గాన శతధా మన బిడ్డల భావిజీవికన్
తల్లుల సంప్రదించుట ప్రధానము న్యాయము ధర్మ మే తరిన్. 723

వ. కనుక నీ విషయమున వారి నిజేచ్ఛ నెఱుంగుట మన కర్తవ్యము. మీ రనుమతించిన మా సుమంత మంత్రి నంతఃపురంబునకు పంపి రాణు లభిప్రాయముల నెఱింగి రా నాజ్ఞాపింతునని వచించెను. 724

## 8.5. దశరథుని మాటలకు విశ్వామిత్రు డసంతృప్తి చెందుట

తే.గీ. ఈ విధి కఱకుగ నృపతి ఋషివరేణ్యు
కోరిక నిరాకరించగ గుబులు పడుచు
పరిషదులు సంభ్రమ విషాద భరితులైరి.
ముని తమ యొడయని శపించు ననెడు భీతి. 725

వ. కాని, విశ్వామిత్రుడు, 726

కం. శాపం బీయడు రాజుకు,
కోపం బిసుమంతయైన కుశిక పయిం తా
చూపం డా మునివర్యుడు –
కోపము పొందుట కుతిలమగుట విజ్ఞులకున్. 727

వ. ఆత్మజ్ఞాన సంపన్నులైన ఋషిసత్తములకు కోపంబు కలుగనేరదుగదా. అందున, నతండెట్లు విష్ణ్వంశ సంభూతుల జనకుండైన దశరథునిపై నలుగ గలడు. అయినను, మునీంద్రుడు తన పథకంబునకు ప్రతిబంధక మేర్పడుట మూలమున తీవ్రమైన అసంతృప్తి చెంది, మౌనము వహించి, తనలో నిట్లని వితర్కించు కొనెను. 728

కం. కొమరుల పై నతి వలపున
భ్రమయుచు నా యాజ్ఞ నృపుడు పాలింపంగా
సమకొన కజ్ఞానముతో
తమకపడి నిరాకరించె తత్తరపడుచున్. 729



వ. నేటి సాంఘిక పరిస్థితులు దుర్భరముగ నున్నవి. 730

కం. లోకంబుల ధర్మము ని
ర్మోకంబయ్యెను, మదయుత ముష్కర తతులౌ
రాకాసులు సాధువులను
పోకార్చుచు నున్న వారు పొలయుచు దిశలన్. 731

కం. వరమున హెచ్చిన బలమున,
అరవాయి గొనక జగంబు లదరి పడంగా,
సుర, ముని, సుజన విరోధులు
మరలబడి దునుముదు రార్షమత సూత్రములన్. 732

సర్వ ప్రాణప్రాస కందం :
ఈ ఆరట బాపగ హరి
యే ఇలపై నుద్భవించె నిన వంశమునం
దీ ఒడయుని పుత్రునిగా
నీ అసురులను పొలియింప నిట రాముండై. 733

వ. ఈ విషయము నాకును, వసిష్ఠాది మహామునులకును విదితమే కాని, దేవరహస్యమగుట నీ దశరథాది సామాన్య మానవు లెఱుగరు.

నే నీ రామ విజయమను ధర్మప్రతిష్ఠాపనా యజన హోమంబునందొక సమిధ నందించు పథక మొకదాని నేర్పరచుకొంటిని కదా. రామునకు నా వద్దనున్న అతిరహస్యంబులును, అనితర సాధ్యంబులును, అసంఖ్యాతంబు లునగు అస్త్రసంపదను బహూకరించుట ద్వారా ఆతని ధనుఃపాటవం

బతుల్యంబు గావించి కోదండరాము డనెడు పౌరుష నామము శాశ్వతము చేయ దలచితిని. చిఱుతతనంబుననె బాలరామునిచే ప్రస్తుతము సాగుచున్న అధర్మ వ్యవస్థకు ముఖ్యకారణులగు రావణానుచరులు, లోకకంటకులునైన మారీచ, సుబాహులపై వ్రేటు వేయించి శ్రీరామవిజయంబునకు నాంది పలుక దలచితిని. రామ రావణ కలహంబునకు మూలకారణ శక్తి, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి అంశతో నుద్భవించిన సీతాసాధ్విని శ్రీరామునితో జత కలిపించు బాధ్యతను గూడ తలకెక్కించు కున్నాడను.

కాని, నా అభ్యర్థనకు దశరథుని స్పందన నా కార్యక్రమమును నీరుగార్చు తెరంగున నున్నది. దీని నెట్లధిగమించుటయో యని, విశ్వమునకు మిత్రుడగు విశ్వామిత్ర సార్థక నామధేయుండు కౌశికుండు కొన్ని క్షణములు యోజించి దశరథునితో నిట్లనెను. 734

## 8.6. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తనతో పంపుమని దశరథునకు నచ్చచెప్ప యత్నించుట

"రాజా! యజన పరిరక్షణకు నాతో రామలక్ష్మణుల పంపుమను నా విజ్ఞాపనము ననాలోచితముగా త్రోసిపుచ్చితివి. 735

కం. అజ్ఞత్వంబున నెఱుగవు,
జిజ్ఞాసయు లేదు నీకు చిత్తములోనన్,
ప్రాజ్ఞుడు రాముడు తక్కను
యజ్ఞము రక్షించు కార్య మన్యుల తరమే. 736

ఉ. రాముడు బాలుడంచు ననురాగయుత భ్రమ తోడ నెంచుచున్,
భీమ బలాఢ్యులౌ దితిజ భీకర సంహతితోడ పోరగా
దీమస లేనివాడని మదిన్ నెఱ నమ్ముచు నీవు మూఢతన్
నా మది నొవ్వ జేసితివి నా యభిలాష తృణీకరించుచున్. 737



చం. వినుము నృపాల! నీ సుతుని విస్ఫురితోజ్జ్వలశౌర్య పృక్తమౌ
అనుపమ దివ్యబాహుబల మందు సుబాహుయుగంబె కాదు రా
వణ సురహంత యైన దిగి వచ్చుట చచ్చుట తప్పబోవ దే
యని మొన నైన రేచి యెదురైనను, ద్రోహ మొనర్చి దాగినన్. 738

ఉ. రాముడు లక్ష్మణుండు రణరంగము నందు విశేష నైపుణీ
ధాములు కారటంచు మది దల్చి వృథా వ్యథ చెందబోకు మీ
భూమిని సర్వ రాక్షస విముక్త మొనర్చుచు ప్రత్న వైదికం
బోమగ నుద్భవించిన నరోత్తములే యని నీ వెరుంగుమా. 739

కం. పుత్రప్రేమను నీవిటు
లాత్రముతో మెలగితివని యనుకొనినన్, నే
నేత్రముపై ఱెప్ప వలెను
పుత్రుల కాచెదనటంచు పూచీ పడనే! 740

శా. నే రక్షింతు సుతద్వయం బనుచు మున్నే పల్కినన్ గూడ నా
ధౌరంధుర్యము లెక్కసేయకను నా దాక్ష్యంబు, నా శక్తిపై
ఘోరంబౌ నపనమ్మకంబునను నాకోర్కి న్నిరోధించి నీ
యారాటంబున నాకుగూర్చితి గదా వ్యాక్షోభమున్ భూవరా! 741

వ. అంతియ కాక, 742

కం. ఇచ్చిన మాటను తప్పుచు
నుచ్చము నీచంబులేక నుద్వేగముతో
నచ్చపు టబద్ధ పాపము
కచ్చితముగ నీవు మూట కట్టితి వధిపా! 743

వ. పైపెచ్చు, తండ్రికే కాక తల్లికి గూడ కుమారుల భవిషత్తు నిర్ణయించుటలో నధికారముండునని క్రొత్తగా ధర్మపన్నములు వల్లించి సమస్యను జటిలము చేయబూనితివి. నీవు తండ్రివేగాక జనపతివి గూడను గనుక నీ నిర్ణయము నీ దేశవాసులైన నీ భార్యల కాచరణీయంబగుట వారల యనుమతి వేరుగా నవసరము లేదు. ధర్మాధర్మ విచక్షణా నిపుణుడు, మహా తపఃసంపన్నుడు, జ్ఞాని, నీకు, నీ కుటుంబమునకు, నీ పూర్వికులకు హితుడు, గురువు నైన వసిష్ఠమునీంద్రుని సమ్మతి యడుగుము, సరిపోవును. ఆయన రామ లక్ష్మణులను నాతో పంప వలదన్నచో నేను మరియొక మాట లేక నిష్క్రమించెద"నని విశ్వామిత్రుడు దుద్వేగమున దశరథునితో ననెను. 744

## 8.7.దశరథుడు ఈ విషమ సమస్యనుండి రక్షింపుమని వసిష్ఠుని వేడుట

మ. అనినన్ పంక్తిరథుండు వ్యాకుల మనోవ్యాపార చిత్తంబునన్
వినయంబుట్టిపడన్ వసిష్ఠ దరికిన్ వే జేరి ప్రార్థించుచున్
మనవిన్ జేసె రహస్య వాచకముగా,"మౌనీశ్వరా! వింటివే
ఘనుడౌ కౌశికు కోర్కి, నా మది భయగ్రస్త స్థితిన్ క్రుంగెడున్. 745

మధ్యాక్కర :
ఏమి చేయను తెల్పు దేవ! యేమి చెప్పిన కౌశికుండు
నా మాట వినబోడు చూడ, నలిగిపోవుచు నుంటి నయ్య,
ఏమి చేసిన గాని, తప్ప కెదురౌను కష్టమే నాకు,
రామ లక్ష్మణుల గొంపోవ బ్రహ్మర్షి కోరికై యుంట. 746

ఉ. బాలుర చిన్ని కుర్రలను పంపగ నేరను యజ్ఞరక్షకై
కాలుని బోలు రక్కసుల కర్కశ లోహ నిభంబులౌ భుజా



స్ఫాలన కోర్వలేరనుచు పల్కగ, నిచ్చిన మాట తప్పి నా
వాలరివై యసత్యగుణ పాపము తప్పక కల్గు నీ కనెన్. 747

వ. పోనీ, 748

ఉ. కన్నులు మూసుకొంచు పసికందుల సంయమి వెంట పంపగా
నన్నె మటం చెరింగియు, మహర్షికి మోదమొనర్ప నొప్పినన్,
చెన్నటి రాక్షస వ్రజముచేత నపాయము గల్గునంచు నా
కెన్నియొ రీతులన్ హృదయ మేలకొ సంశయ పృక్తమయ్యెడున్. 749

ఉ. పిల్లలు పిన్నవారలు, వివేక విహీనులు యుద్ధ విద్యలన్,
బల్లిదులైన రక్కసుల పాటవ ధాటికి నిల్వ నేర్తురే–
చెల్లునె తాను వారలను శేముషి బ్రోచెదనంచు మౌని నా
కల్లన నచ్చచెప్పెడి ప్రయత్నము చేయగ నూరు శాతమున్. 750

కం. ఘటనాఘటనా వేద్యుడు,
పటుతర తపమాచరించి బ్రహ్మర్షి యయెన్,
చిటిబాలుర కాపాడ న
కటా యెరుగనట్టి వాడె కౌశిక మునియున్. 751

వ. అని అనుకొన్నను, సంపూర్ణ ధైర్యంబుతో నా మనమ్మాకీర్ణంబు గాకున్నది. ఏ యొక్క శతాంశమో అనుమానము, భయము నన్ను వీడకున్నవి, ఓ వసిష్ఠమునీంద్రా! అందు మూలమున రామలక్ష్మణులను కౌశికునితో పంప నాకు మనస్కరించుటేదు. మీరే ఈ జటిల సమస్యకు తగిన పరిష్కారము సూచించి, నాకు కర్తవ్య మానతిం"దని వేడిన, వసిష్ఠుండు దశరథుని సముదాయించి ధైర్యము కలిగించు మాటల చెప్పుచు, తద్దయు నిట్లనియె. 752

## 8.8. వసిష్ఠుడు రామలక్ష్మణులను కౌశికునితో పంపుట యుక్తమని చెప్పుట

మ. "అవనీ నాయక! రామలక్ష్మణులపై నత్యంత మోహంబుచే
వివశత్వంబున దూగి వక్ర పథివై భీతిల్లి తర్కించుచున్
సవమున్ కావగ నీ కుమారులను విశ్వామిత్రుడే కోర నీ
వవివేకంబున పంపబోననుట కార్యంబౌనె యోచింపుమా. 753

వ. ఈ మునీంద్రు డినవంశ పక్షపాతి. మున్ను నీ వంశజుండైన త్రిశంకుడను మహారాజు, 754

తే.గీ. బొందితో స్వర్గ వాసంబు పొందు కొరకు
గొప్ప క్రతువు సేయగ నెవ్వ రొప్పుకున్న,
ఈ మునియె స్వర్గ మొకదాని కృత్రిమముగ
చదల సృష్టించి పంపె త్రిశంకు నటకు. 755

వ. తదుపరి కాలమందు, మీ వంశ పూరుషుండైన హరిశ్చంద్ర చక్రవర్తి ఒకానొక లక్ష్య సాధనకు శునశ్శేఫుడను ఋషికుమారు నొకని యజ్ఞపశువుగాచేసి సవన మాచరించునెడ. 756

తే.గీ. చింతతో సురిగిన శునశ్శేఫు చేత
యుక్తి ప్రత్యేక మంత్రంబు లుచ్చరింప
జేసి వహ్నిని మెప్పించి చిన్నవాని,
వాసి మీఱంగ రక్షించె కౌశికుండు. 757

వ. ద్విజపుత్రుని చషాలమునుండి విడిపించి, హరిశ్చంద్రునకు బ్రహ్మహత్యా దోష మంటకుండ చేయుటే గాక, తన తపః శక్తితో యజ్ఞము సమాప్తము



కాకపోయినను ఫలంబు కలుగచేసి యాతని మనోరథం బీడేర్చెను. అంతటి మహిమాన్వితుడైన విశ్వామిత్రుడు. 758

తే.గీ. లోక కల్యాణ మొనర త్రైలోక్య వంది
తుండు కౌశిక సంయమి దోహలమున
చేయు ప్రథిత సవము రక్షసేయు కొరకు
నిన్ను వేడ వచ్చె నిటకు నిరతి తోడ. 759

కం. చేయునది మహాసవమట,
చేయించు ముని కృతక దివి సృజనుండట, దై
తేయతతి నుండి క్రతువును
కాయగ నీ సుతుల కోర కాదని యనుటే! 760

ఉ. ప్రాగ్రసరుండు మౌని నరపాలుర నెవ్వరి కోర కెంతయున్
వ్యగ్రత తోడ, నీ సుతులు బాలురటంచు నెరింగియున్ మహో
దగ్ర కరాళ జిహ్వులగు దైత్యుల పోరుట కెంచి వచ్చె ని
చ్చో! గ్రహియింపు మిందుగల సూక్ష్మము నించుక చింత సేయుచున్. 761

వ. రాజా! జగతిని రాక్షస వినాశన మొనరించి, ధర్మపునరుద్ధరణ చేయుటకు భూమిపై నుద్భవించిన దైవాంశ సంభూతులు నీ కుమారులు. అందు మూలము ననే విశ్వామిత్రుడు వీరిని తనతో పంపుమని పట్టు పట్టుచున్నాడు. 762

తే.గీ. క్రతువు సేయువాడు ప్రథిత కౌశికుండు,
రక్కసుల నుక్కడచి దాని రక్షసేయు
భీమబలుడు దివ్యాంశుడౌ రాము డరయ,
ఇక సుతులు బాలురను ప్రశ్న యెట్లు కల్గు! 763

శా. నీ వే మాత్రము సందియంబు మది రానీకుండ ధైర్యంబుతో
భావిం దల్చుచు పంపు పుత్రులను విశ్వామిత్ర మౌనీంద్రుతో –
ప్రావీణ్యంబున వీరు రక్కసుల సంభగ్నించుచున్ యజ్ఞమున్
బ్రోవం గల్గుదురయ్య, దీనను శుభంబుల్ చేకుఱున్ వీరికిన్". 764

వ. అని పలికిన వసిష్ఠుని వాగ్ధారకు, ధూళిచే కప్పబడి కళావిహీనమైన అద్దము కుంభవృష్టిచే క్షాళనమై ప్రకాశవంతంబైన తెరంగున, దశరథుని సంశయంబులు పటాపంచలై పాఱి మనంబు నిర్మలంబై, రామ లక్ష్మణులను విశ్వామిత్రునితో పంపుట కొడంబడుచు, 765

ఉ. అంత సుమంత మంత్రిగని యానతి నిచ్చె జనాధిపుండు, నీ
వంతిపురంబు కేగి యట శ్యామల సుందరు రామచంద్రునిన్,
చెంత చరించు లక్ష్మణుని చెచ్చర తోడ్కొని రమ్మిటన్, సభా
భ్యంతర వార్తలెల్ల తెలియంగ వచించి, ప్రయాణ సిద్ధికిన్. 766

తే.గీ. ఆజ్ఞయని మంత్రి రాముని హర్ష్యమేగి,
వారి నచట గానక తడవాగి వెడలి
పట్టమహిషి కౌసల్య నివాసమందు
సోదరుల, సుమిత్రను గాంచె మోదమొదవ. 767

ఉ. చేతను విండ్లు నంబులును శేముషి పూని, మునీంద్రు తోడుతన్
ప్రీతిని యజ్ఞరక్షణకు ప్రేరణనొంది ప్రయాణసిద్ధులై
మాతల చేరి దీవెనల మానుగ నంద పదంబులంటు నా
భ్రాతల రామ లక్ష్మణుల ప్రన్నన గాంచె సుమంత మంత్రియున్. 768

వ. దేహంబు పులకరింప చూచి, కుమారుల రణోత్సాహమున కచ్చెరు వందుచు, రాజసభలో జరిగిన విషయంబుల నావెంటనే యెరింగిన వారి



రాజతంత్ర దక్షతను మనమ్మున శ్లాఘించుచు, కౌసల్యా సుమిత్రలు కుమారుల నాశీర్వదించు దనుక వేచి, రాజాజ్ఞ తెలియజేసి, రామలక్ష్మణుల నాస్థానంబునకు తోడ్కొని వచ్చిన, 769

ఉ. ముందుగ రామ లక్ష్మణులు మోదము మోమున దోపగా దశ
స్యందన సార్వభౌమునకు నన్నున వందన మాచరించి, ఆ
నందముతో వసిష్ఠ గురునాథు ప్రణామము చేసి మీదటన్
చందన చర్చతో నతిథి సంయమి పూజల జేసిరయ్యెడన్. 770

తే.గీ. అంత పరిషదుల దెస సమంచిత విధి
హస్తముల నూపి తగు విజయాంకములను
వెలయ చూపి వారల హర్ష పులకితులను
చేసి జయజయ ధ్వానముల్ వాసి గొనిరి. 771

వ. సదస్సునందు పురజన కోలాహల మడగిన పిదప, 772

మ. ధరణీనాథుడు రామ లక్ష్మణుల మోదంబొప్ప రావించుచున్
పరిరంభించి తదీయ స్పర్శ సుఖ మాస్వాదించి, ఆ కుర్రలన్
పరిరక్షింపగ వేడి సంయమికి నప్పంజెప్పి, యవ్వారలన్
పరమాప్తుండగు నా మునీంద్రు కనుసన్నన్ మెల్గ శాసించినన్. 773

ఉ. మసగొని మౌని భ్రాతలను మానుగ కౌగిట జేర్చి సేసలన్
ప్రసరిల జల్లి దీవనల వావిరి నిచ్చి కపోల చుంబనం
బసమున జేసి హర్ష పులకాంకిత చంచల దేహదీప్తుడై
పసిడి పుటంపు తాల్పును చివాలున గాంచిన రీతి పొంగుచున్, 774

వ. ఇది ప్రథమ సమాగమంబు గావున, రాముని దర్శనంబున విశ్వామిత్రుడు విష్ణు సాక్షాత్కార మొందిన భక్తుని రీతి పులకితాంగుండై, కండ్లు చెమరింప

మాటాడ నేరక, రామ లక్ష్మణులు వెంటరా తన నిజ స్థానంబునకు ప్రయాణ మయ్యెను. 775

---

**వివరణలు :**

1. ఈ వచనములో రెండు చుక్కల (*) మధ్య ఒక తేటగీతి బంధితమై యున్నది.

2. రాముని వయసును గురించి రామాయణసాహిత్యమున విపులమైన చర్చలు జరిగినవి. వాల్మీకి రామాయణమున గూడ, వేర్వేరు కాండలలో రాముని వయసు 12, 13, 16, 17 వత్సరములని వివిధముగా చెప్పబడెను. వివాహ సమయమున రామునికి 13, సీతకు 6 అని వున్నది. చాలమంది విమర్శకులు వివాహకాలమున రామునకు 16 సంవత్సరములు దాటియుండవని యూహించుచున్నారు.

సీతారామ, లక్ష్మణులు మనకథాకాలం నాటికి బాల్య వయస్కులైనను, ఈ గ్రంథమున వీరిని మానసికముగ యౌవనులట్లు చిత్రీకరించితిని. ఇది సాహిత్య కావ్యము గనుక కొలదిపాటి అమలిన శృంగారము సీతారాములమధ్య సమయమాసన్న మైనపుడు నడిపించితిని.

3. నేనీ గ్రంథమున రచించిన 'మధ్యాక్కర'లలో, ఈ ఒక్క మధ్యాక్కరకే, కవి సామ్రాట్ విశ్వనాథ వారి ననుసరించి యతి, 4,5 గణాద్యక్షరములు రెంటికి నిలిపితిని. మిగిలిన మధ్యాక్కరలకు, లక్షణగ్రంథములలో ఇచ్చినట్లు, ఒక్క 4వ గణం మొదటి అక్షరమునకే యుంచితిని. ఆదికవి నన్నయభట్టారకుడు 5వ గణం తొలి అక్షరమున యతి నిలిపెను.

***

# 9. ప్రయాణ ఖండము

## 9.1.రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట ప్రయాణ మగుట

ప్రయాణి (లేక ప్రమాని) :

కమండ లూర్ధ్వ దండమున్
సమంత్ర కాంతి దేహమున్
ప్రమోద మందహాసమున్
అమంద యాన వేగుడై,
కుమార రాఘవేంద్రులున్
క్రమంబుగాను వెంటరా
శమంబుతోడ మౌనియున్
గమించె ప్రీతుడై, జనుల్
సమాంతరంబుగా నతిన్
నమించుచున్ శిరంబులన్
నమో నమో మునీశ్వరా!
నమోస్తు రాఘవ ప్రభూ!
నమోస్తు లక్ష్మణా! నమో
నమో యటంచు కొల్చుచున్
సుమమ్ములన్ విరాళులై
సుమాళ మొప్ప జల్లగన్. 776

ఉత్సాహం:

ధనువు మూపుపైన, సరస తమ్ముడుండ నెమ్మితో
మనము దుష్ట శిక్షణమున మగ్నమై చెలంగగన్
వినతు లగుచు వీధులందు జనులు మ్రొక్క రాముడున్
మునిని తవిలి యుత్సహించి చనియె నంత ధీరతన్. 777

కం. కొందరు యువ సాహసికులు
ముందుకు త్రోసికొని వచ్చి పులకిత తనులై
చిందులతో రాఘవుల పి
రుందను క్రీడించిరి వెస రోమాంచితులై. 778

తే.గీ. పురము నందున దుందుభుల్ మొరయు చుండ,
విప్రులు జయోస్తటంచు దీవెనలు సేయ,
ప్రీతి హర్మ్యాలపై పురంధ్రీ మతల్లు
లతులముగ కురిపించినా రక్షతలను. 779

తే.గీ. ఇంటి గుమ్మముల నిలిచి వృద్ధ కాంత
లింపుమీఱంగ మనుమళ్ల నెత్తుకొనుచు
నూరిలోనను సాగెడి ఉత్సవంబు
చేతులను చాచి చూపించి చెప్పి రిట్లు. 780

మ. అతడే కౌశిక మౌనియున్, వెనుక నీలాకాశ సంకాశుడున్,
ప్రతిభాసాద్భుత దివ్యచాప ధృత శస్త్రాస్త్ర ప్రభావంతు డా
తత సౌజన్యగుణుండు రామవిభు డా దండన్ వినమ్రాంగుడై
సితపద్మ ద్యుతి వాడు లక్ష్మణుడు – వాసిం జూడుడీ ధన్యతన్. 781

కం. రాత్రించరులను ద్రుంచగ
ఛాత్రుల కే హాని లేక చతురత విశ్వా
మిత్రుని సత్రము కావగ
నాత్రముతో పోవుచున్న అధిపుల గనుడీ! 782

వ. అంతలో, 783

చం. గగనమునుండి దేవతలు కౌశికు, నాతని వెంటనంటి ఆ
శుగములు దాల్చి పోవు నృపసూనుల, వారికి కొంత దూరమం



దెగబడు పౌరులన్ గనుచు, నిద్ది రణమ్మున పన్ను బాణమ
ట్లగుపడు వ్యూహమో యనుచు నచ్చెరు వందిరి సమ్మదమ్మునన్. 784

వ. ఈ దృశ్యము శ్రీమహావిష్ణువు రామావతారమున చేయబోవు రాక్షస వినాశమునకు, ఆర్ష ధర్మోద్ధరణకు నాందివలె గన్పట్టు చున్నదని సంతృప్తితో రామ లక్ష్మణులపై పూలవానల కురిపించిరి. ఇక, 785

## 9.2. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు బల, అతిబల విద్యలను ప్రసాదించుట

తే.గీ. ప్రాగ్రసరుడు కౌశికముని ప్రాపునందు,
ఊరి పొలిమేర రాఘవుల్ చేరి, వెంట
వచ్చు పౌరుల వెనుకకు పంపి వేసి
వీక చనిరంత మునివెంట ప్రీతిమీఱ. 786

తే.గీ. అటుల పయనించి వారు మధ్యాహ్నమునకు
సరయు దక్షిణ తటమున కరుగుదెంచి
రంత నృపకుమారుల తోడ ననియె మౌని
సరస కారుణ్య భరిత హాసంబు తోడ. 787

తే.గీ. అంబ, శంభు దేవుల విహారంబు కొఱకు
నలువ మానస సంకల్ప బలము చేత
నతి మనోజ్ఞంబు, విస్తారమైన సరసి
చెలసి సృష్టించె కైలాస శిఖరి దరిని. 788

తే.గీ అమలమై మానస సరోవరమను పేర
నిత్య పూజ్య మయ్యె నిదియు నిర్జరులకు –

మర్త్యు లెవరైన పొడగన్న మాత్రమునను
శివుని సాయుజ్య ధామంబు చిక్కితీరు. 789

తే.గీ. ఆ సరోవర మందుండి భాసమాన
మైన స్రోతస్విని జననమంది వీక
పాఱి సాకేత పురి చుట్టి వచ్చె నిటకు,
సరయు వనుపేర దివ్యమై బరగు నిదియె. 790

ఉ. ఊనికతోడ మీరు సరయూనది నీరములందునన్ శిరః
స్నానము చేసి రండు రఘునందనులార! విరించి కాత్మసం
తానములైన మంత్రముల దానవ ధూర్తుల నుండి రక్ష కై
మానుగనిచ్చువాడను సమంచిత దీప్తి మిమున్ వరింపగన్. 791

వ. బల, అతిబలలను ఈ రెండు సిద్ధ విద్యలు పొందిన దాహ, బుభుక్షలు బాధించవు. రూప బల సంపద లధికమగును. ఇవి నిద్రాసమయమున గూడ శత్రువుల బారినుండి కాపాడునని తెలిపి, 792

కం. ఆదట శుచియై వచ్చిన
గాదిలి రఘునందనునకు గాధి తనయు డ
త్యాదృతి బలాతిబలలకు
ప్రోదగు మంత్రముల నేర్పె మోదము తోడన్. 793

వ. అంత, ముని యానతి మేర కా రాత్రి అచటనే విడిది చేయదలచి, ఆ ప్రాంతమున తమ విశ్రాంతికి తగిన ప్రదేశము కొరకై వెదుకు చుండ, నాకాశమున పక్షుల గుంపులు కొన్ని ఒకే దిశ కేగుచున్నట్లు గమనించి, ఆ దిశలో కొలది దూరము చన, వారు 794



## 9.3. వన సందర్శనము

సీ. సరయూనదీ తీర సన్మంగళంబైన
విలసిత సైకత స్థలుల సరస,
కొమరొప్ప తలలూచు గోధుమల యవల,
మొక్కజొన్నల పొలములకు చెంత,
అపరంజి తలపించు ఆపురూప వర్ణంపు
మృత్తికాచ్ఛాదిత వృత్తులందు,
ఫలపుష్ప మండిత పాదప తరులతా
బహువిధ గుల్మ జొంపముల నడుమ,
తే.గీ. కాక, కోకిల, కీర సంఘముల నీడ,
కపి, శశ, కురంగ, మాహేయి గణము తోడ,
నుత్కటంబగు సరసుతో నొక్క వనము
కనుల పండువ గాగను కాంచి రపుడు. 795

వ. ఆ వనమును చూచినంతనే నవయౌవనులగు దాశరథులకు, 796

[1]కుసుమవిచిత్రము :
వనమున పూవుల్ వలపుల తోడన్
ఘనముగ చెట్లన్ కలయగ పూయన్,
మనమున ప్రీతై మమతలు నింపెన్
కనగను హాయై కవితలు తోచన్. 797

ద్విపద.
మాలతి, మంజిష్ఠ, మందార మల్లె,
మేలిమి వరహాలు మిసమిస మొల్ల,
కలువ, మరువక, వకుళ, సనజాజి,
మలయ, కురవక, వంజుళ, విరజాజి,

నీలిగోరంట, గన్నేరు, పున్నాగ,
బాల, మధుసుగంధ, పాలంక్య, నాగ,
ఫలసంపగి, కనకాంబరము, చామంతి,
తులసి, మాధవి, విచికిల, పెదబంతి,
జలజ, కుటజ, పారిజాత విశాల
ము లలఘు దళ, సుమ, ఫలయుత సాల
కులకోచ్ఛ్రయములు, నికుంజోపవనము
లులప లతా జొంపముల పరివనము
లలవోక నెదురయ్యె నా రఘువరుల
కలరుచు తలపులు బిలబిల వఱల. 798

## 9.4. సాయంసంధ్యాగమనము

తే.గీ. అపుడు సాయంసమారంభ మగుట వలన,
జలకమాడంగ పశ్చిమ జలధి ననగ
తీక్ష్ణకిరణుండు ద్యుమణి ప్రతీచి జేరె,
మెల్లమెల్లగ వనమెల్ల చల్లబడగ. 799

ద్విపద.
జలజ సఖుడు గ్రుంక జలజముల్ కలగి,
వలపున వీడ్కోలు తెలుపగ మలగి,
చెలికాని ముద్దాడ చెక్కిళ్ళు పొంగ
దళముగ నొలసిన కలమ మనంగ,
అలరారె నాకాశ మరుణిమా రాగ
మిళిత హాటక జల మలికిన జోక. 800

కుసుమవిచిత్రము :
అవనిని రాగం బాకృతి దాల్చెన్
నవనవలాడెన్ నవకముతోడై
నవ సుమ కన్నెల్ నాట్యము చేసెన్
యువకుల డెందా లోటమి పొందన్. 801



భ్రమర విలసితము :
సంజన్ కాంచంగ స్మరుని శరముల్
జంజాటంబుల్ విసరెను హృదులన్
మంజిష్ఠంబౌ సుమసముదయముల్
రంజిల్లన్ చేసె రసిక యువతన్. 802

మదన విలసితము :
వనమును కనగన్,
ఇనకులజులకున్,
మనములు విరిసెన్,
తనువులు మురిసెన్. 803

నవమయూరము :
విప్పినవి పింఛములు విందులను సేయన్,
కప్పినవి భూతలము కన్నులకు హాయై,
త్రిప్పుచును కంఠములు తీరుపుల ప్రోవై,
ఉప్పరముగా వనమయూరములు ప్రీతిన్. 804

ద్విపద.
అలకన మలుసంజ అవధుల నొలసె,
అలనల మసకలు కెలకుల నెలసె,
బిలబిల పక్షులు బిత్తర నీగి,
కలసి గూళ్లకరుగ పిలపిల మూగి
తులిత విమానాకృతుల నభమందు
మెలగె, కొలుపుచు జనుల కనువిందు –

వలిపిరి గాలులు పడమట వీచి
గలగల లాడంగ దళముల నూచె,
వలికి పన్నగములు ఫణముల నూపె,
తలరి ఘూకతతులు తలలను జాపె –

వలచిన సతిని వదలి పెఱనాలి
కలయుచు మదనుని కలనున సోలి,
ఇలుజేర నలసట, చలపడి జాయ
అలుగులమున నిలు తలుపులు మూయ,
నులిసి బొబ్బలిడుచు నిలుచుట్టు తిరుగు
లలితులు మగసిరి తెలిపెడు తెఱగు,
అళితతి ఝుంకారముల తోడ నొప్పి
కొలనుల ముకుళిత నళినుల గప్పె – 805

కనకలత :

అలరు విలుతుని కుసుమ శర హరువుల సరసమునన్,
కెలవున చిలుకలు జతలయి కిలకిలమని కులికెన్,
కలువలు తలకెను నటునిటు కలవడి విరహమునన్
నలిగొని యువకుల మనములు నలువుగ కలుచవడెన్. 806

## 9.5. చంద్రోదయము

వ. అంతలో, 807

ద్విపద :

లలితమౌ అనుమతి కళలో యనంగ,
లలిని చంద్రుడు నభస్థలి వెలుగంగ,



వెలది వెన్నెల వెల్లువల సోన లిలను
పొలుపుగ వ్యాపించె నలు కెలనులను;
అలవోకగా విద్యు తాగిపోవంగ
మలుగుచు దీపించు కళుకులు క్రుంగ,
నలుపమౌ చిఱుదివ్వె ఆలోన చెలగి,
మలచని చీకట్లు తొలగగ వెలిగి,
నిలయమందున కాంతి నింపెడు తీరు,
కలువతేడు పఱచె వెలుగుల సొరు;

ప్రళయ రుద్రుడు మహారాజొక పూట,
వెలల పడమటను గల తన కోట,
శాలీన యువరాజు సౌజన్య ధనుడు,
ప్రాలేయ సుమసమ బాలేయ తనుడు,
ఎలమికాడై ప్రీతి నేల నా యూరు,
కెలసి పొరులు వెస నలరెడు తీరు –
బలితుడౌ దినరాజు పడమటి కరుగ,
బెళగుల రేరాజు వెలుగులు పఱగ
నిలపైన నానంద మెలసి చెలంగె,
పొలుపుగ జనతతి పలువిధి పొంగె;

జలతృష్ణతో లేచె చాంద్రవీహార
ములకు చాతకములు పులకలు దేఱ;
చెలుని కాహ్వానము తెలిపెడు రీతి,
కొలకుల విరిసె నుత్పలములు ప్రీతి,
మలయజ, రేరాణి, మరువక, మల్లి

కల పొదలు మధువు లిలపయి జల్లె,
వలరాజు వాలారు బాణాల బరపి
నెలతల కెడదల వలపులు నెరపె. 808

వ. ఆ పరిసర ప్రాంత సౌందర్యమునకు ముగ్ధులై, ఆ రమణీయ ప్రకృతి శోభను తిలకించి సంతోష భరితాంతరంగులై రామ లక్ష్మణు లా రాత్రి మునీంద్రు నితో గూడి యచటనే ఱెల్లుగడ్డి పాన్పులపై పరుండి సుఖ నిద్రంజెందిరి. 809

## 9.6. విశ్వామిత్రుడు శ్రీరామ ముఖ దర్శనమున ప్రముదితుడగుట

వ. మరునా డుదయమున బ్రహ్మముహూర్తమునందే విశ్వామిత్రుడు మేల్కొని నిద్రించుచున్న శ్రీరాముని ముఖారవిందమును వీక్షించి మహానంద సంజనిత దివ్యానుభూతిచే మనంబుత్తేజితంబై, శరీరంబు గగుర్పొడువ, పరవశించి యిట్లు తలబోసెను, 810

పంచచామరం:

ఇదెంత చిత్రమో తలంప నీ మహాత్మ నానసం
బుదంచితమ్మునై మనమ్ము నూర్జితం బొనర్చెడిన్,
మదీయ పూర్వపుణ్య మూలమై లభించె కాదొకో
ముదమ్ము గల్గ రామచంద్రమూర్తి పొత్తు నాకహో! 811

ఉ. చక్కని రాఘవేంద్రుని ప్రసాద గుణాన్వితమైన మోము నే
నొక్క క్షణంబు చూడ మది నుత్సవ మయ్యె, సుధాంబురాశిలో
సొక్కిన రీతి దేహము విశుద్ధమునై, భవబంధ శృంఖలల్,
గ్రక్కున వీడి, మోచన విఘాతము లెల్ల తొలంగి నట్లయెన్. 812

కం. ఒకపరి చూచిన నీతని
వికసిత ముఖనీరజమ్ము విడివడె కర్మల్;



అకటా ప్రతిదిన మీక్షిం
చు కోసల కుమారి యెట్టి శోభిత చరితో! 813

వ. జన్మ జన్మల పుణ్య సంపదలు మూటగట్టుకొని, రామచంద్రుని కని పెంచిన తల్లి కౌసల్య జన్మాంతరము లేక నిశ్చయముగా కైవల్యమొందునని చింతించుచు, మరియు నిట్లు తలబోసెను.

సామాన్యముగా, శిష్యులు గురువు కన్నను ముందుగనే తూర్పున సూర్యకాంతి పొడసూపక పూర్వమే, నిద్రలేచి ఆహ్నికమున కవసరమైన యుపకరణములను గురువులకు గూర్చు టాచారము గదా. కాని నేడు శ్రీరాముడు తనను నిద్రలేపెడు సంతోషము నాకు ప్రసాదింప దలచి ఇంకను నిద్రించు చున్నాడు. ఉషఃకాంతులు పూర్వాశ నరుణ ప్రియంగువుల నొప్పారి నిత్యకృత్యముల నాచరించు సమయ మాసన్నమగు చున్నదని స్ఫురింప జేయుచున్నవి. ఈ నరశార్దూలంబును నేనింక నిద్రలేప వలసి యున్నదని, పులకితగాత్రుడై విశ్వామిత్రుడు రామునితో నిట్లు పలికెను.

'కౌసల్యా సుప్రజా రామా, పూర్వా సంధ్యా ప్రవర్తతే,
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికం'

అంత దశరథ నందనులు మేల్కొని, ఉదయభానుని కవోష్ణకిరణముల గిలగింతలకు చలించిన ప్రకృతి కాంత పులకింతల కానంద సంభరితులై, అట వీచుచున్న చల్లని సహజ సుగంధ పరిమళ మిళిత మందానిలము నాస్వాదించుచు, నిత్యానుష్ఠానముల నాచరించి, కౌశికునితోగూడి, తిరిగి సరయూనదీ తీరము వెంట ప్రయాణము సాగించిరి. 814

## 9.7. రామ లక్ష్మణ కౌశికులు అంగదేశము చేరుట.

కం. ముందుగ మునియును, వాని పి
రుందను వెడలు రవివంశ రోచిష్ణువులున్,
పొందిక శివు వెంటనడచు
స్కంధ విశాఖుల విధాన కనబడి రపుడున్. 815

మ. ముని వెంటన్ చని రామ లక్ష్మణులు సంపూర్ణ ప్రమోదాత్ములై
కనిరా చెంగట నుద్ధతిన్ ప్రథిత రంగత్తుంగ కల్లోలమున్,
ఘన విస్తార జలప్రపూరము, నిహాకాగ్రాహ సంవాసమున్,
కనువిందౌ సరయూనదీ మహిత గంగా సంగమ స్థానమున్. 816

వ. కని, పుణ్యవంతంబైన ఆ సంగమంబునకు రాజకుమారులు మానస సుమాంజలుల నర్పించిరి. 817

ఉ. ఇంచుక దూరమందు గల వింపును గూర్చెడు సస్యసంపదన్
మించిన నల్లరేగడుల మేలిమి భూములు, వాటి చెంత నూ
హించని శోభ నొప్పెడు ఋషీంద్రుల ఆశ్రమ రాజి – యందు వి
న్పించును వేదపాఠములు నిచ్చలు ఛాత్రులు వల్లెవేయగా. 818

తే.గీ. ఆ పరిసరములు కనగ నట వసంతు
డు నలకూబరుడు జయంతుడు సతతంబు
ప్రీతి వసియింతు రనిపించు, హేతు వదియె
వాటి నిత్య సౌందర్య సౌభాగ్యములకు. 819

ఆ.వె. ఆ గరిమము గాంచి యాశ్చర్య పడుచున్న
రామ లక్ష్మణులకు ప్రేమ మీఱ
సంయమి వరుడంత స్థల మహత్త్వము వివ
రించె నిట్లు – వారి కింపు గొలుప. 820

మ. మును ముక్కంటి నిబద్ధతన్ తపము నిర్మోహంబుతో చేయుచుం
డను – గౌరిన్ వలపింపజేయ సురలండన్ మూర్ఖుడై మీన కే
తను డా శంభుని దీక్ష భగ్నపడ నుద్యత్ పుష్ప బాణంబు లీ
శుని పైనన్ ప్రసరింపగా విషమ చక్షుర్జన్య కీలాగ్నితో, 821



కం. భస్మము చేసెను శంభుం
డా స్మరుని రుచిర తనులత – నది పడె నిచ్చో
విస్మయమందగ లోకము
లస్మిత్వ మడంగి మరు డనంగుండయ్యెన్. 822

వ. ఆ నాటి నుండి ఈ ప్రాంతం బంగదేశంబుగా పేరొందెను. మదనుని చెలికాండ్రైన వసంతాదులు హితుని సంస్మరణార్థ మిచట తమ అంశలను నిలుపుట వలన ఈ అంగదేశము బహు సుందర ప్రకృతి సంయుతంబై, సతత సస్యశ్యామలమై యొప్పి తపోనిష్ఠా గరిష్ఠులగు మునిజనులకాశ్రయమై యొప్పారు చుండునని కౌశికుండు తెలిపి దశరథసూనుల కౌతుకమును తీర్చి యానందపరిచెను.

అంత నా ఆశ్రమ వాసులగు మునులు విశ్వామిత్రుని రాక నెరింగి వారి కాతిథ్య మొసంగ నా రాత్రి వార లచట గడపి, 823

## 9.8. మలద, కరూశ దేశములు

కం. మరుచటి నాడుదయంబున
తరణి కులాంభోధివిధులు దశరథతనయుల్
గురు నండ నొక పడవగొని
తరియించిరి జహ్నుతనయ దక్షిణ తటికిన్. 824

తే.గీ. ఆ ప్రదేశంబు నిర్జనమై క్షయించి
కంటక ద్రుమ పంకిల కశ్మలంబు
పూతి సంయుత హేయమై రోతగొల్పె,
నడుగు వేయుటకైన శక్యంబు గాక. 825

వ. శ్రీరామచంద్రు డట్లు జుగుప్సాకరంబగు నా మహారణ్యంబును చూచి, 826

కం. ఆమయ శుష్క పలాశ
స్తోమంబై, పల్లవ ఫల సుమ హీనం బీ
సీమ వినాశన కారణ
మేమని ప్రశ్నింప సంయమీంద్రుం డనియెన్. 827

ఆ.వె. తొల్లి వాసవుండు బల్లిదుండగు వృత్రు
డనెడు రాక్షసేంద్రు దునిమి నపుడు
బ్రహ్మహత్య వాని వదలక పీడింప,
పాప మలిన క్షుధల పాలిబడియె. 828

తే.గీ. అనిన విని రాఘవుడు మౌని నడిగెనిట్లు,
రక్కసుని ద్రుంచు మూలాన బ్రహ్మ హత్య
వాసవునినైన వదలక పట్టె ననగ,
మనుజు లింకెట్లు దనుజుల దునుమ గలరు? 829

తే.గీ. అసురులను చంప పాతకం బంటు ననుచు
తెలియ వచ్చిన గుండియల్ దిగ్గురనగ,
చంపవత్తురె యెవరైన సాహసమున,
హెచ్చుదే దీన దౌష్ట్యంబు పృథ్విలోన ! 830

వ. అని శ్రీరాముడు సంశయంబు వెలిబుచ్చ, విశ్వామిత్రుం డిట్లు సమాధాన మిచ్చెను. 831

తే.గీ. తనకు శత్రువు కానిచో దునుమ వలవ
దెవ్వరికినైన జగతిలో నెవరినైన



దుష్టులైనను, దుర్మార్గ దురితులైన,
తెలిసి దీనిని పాటింప వలెను జనులు. 832

తే.గీ. జనుల హింసించు క్రూర దుర్జనుల కాని,
రక్కసుల కాని, దుష్టవర్తనుల కాని
చంపు టొప్పగు పృథ్విలో జనపతులకు,
జనుల రక్షింప పనిగొన్న క్షత్రియులకు. 833

తే.గీ. [2]తనను, తనవారిగాని, కారణము లేక
చంప బోయెడు వారల చంపవచ్చు,
ఆడువారైన, ముదుసలులైన; మరియు
కదనమున చంపగాదగు నెదుటివారి. 834

తే.గీ. మిత్రులను వార లొకనాటి శత్రులైన,
సంధి కుదిరిన వారిని, శరణు కోరి
నట్టివారి చంపంగ రాదెట్టి వారి
కైన, నృపులకిది నిషిద్ధ మగుచు బరగు. 835

వ. ఇక ఇంద్రునిచే వృత్రాసురుడు తెగిన తెఱంగు విచారింతము. 836

తే.గీ. వృత్రు డమరాలయంబు దండెత్తి నపుడు
త్రిదివపతి భయపడి పంపె దేవఋషుల
సంధి జేయంగ నా పరిపంథితోడ –
అప్పు డతులమౌ వరముల నసురు డడిగె. 837

తే.గీ. ఆర్ద్ర, నిర్ద్రవంబుల గాని, అస్త్రశస్త్ర
ములను గాని, కాష్ట పాషాణములను గాని

పవలు ఱేల గాని తనకు వర్జనంబు
వీలులేకుండ వరమియ్యె వేడె నతడు. 838

వ. అంత నా మునులు దేవేంద్రుని సమ్మతితో నసురుని కోర్కెల కొడంబడి సంధి నిశ్చయము చేసిరి. కాని, వాసవుండు కొన్ని దినములలోనే రహస్యముగ 839

తే.గీ. జలధి తరగల నురుగులో జలధిశయను
శక్తి నావహించగజేసి యుక్తితోడ
దాని మార్గణంబున జొన్పి దైత్యు నేసి
సమయ జేసెను వాని మోసంబుతోడ. 840

తే.గీ. ఇట్టి మోస సంయుత హత్య నింద్రుడూని
సంధిచేసిన దితిజుపై జరిపెగాన
బ్రహ్మహత్య వలన కల్గు పాప మతని
పట్టి పీడించె వదలక గట్టిగాను. 841

వ. ఈ దోషంబు వలన పురందరుడు దుర్భర దుర్గంధ మలిన పూరిత శరీరుండై యనేక వత్సరములు నిత్య క్షుత్పిపాసలతో భరింప శక్యముగాని బాధ ననుభవించె, నంత 842

ఆ.వె. దేవలోకమునులు దేవేంద్రు నిటతెచ్చి
గంగ నీటను మునుగంగచేసి
దివ్యమంత్రములను దీక్షతో వల్లింప
బ్రహ్మహత్య వాని వదలిపోయె. 843

తే.గీ. మలినము, కరూశము లటుల తొలగిపోవ,
సంతసంబున మఘవు డీ ప్రాంతమునకు,



సరిగ మలద, కరూశ దేశములటంచు
నామకరణమ్ము చేసెను ప్రేమ తోడ. 844

తే.గీ. మరియు నిత్య సౌభాగ్య సంపదలు కలుగ
వరములు ముదముతో గుప్పె, వాటి వలన
నమితమగు శోభ నొప్పె నీ యవని యెల్ల,
నలువు మెఱయంగ జనపద నిలయ మగుచు. 845

## 9.9. తాటకయను రాక్షసి వృత్తాంతము

ఉ. ఆవిధి సర్వసంపదల కాస్పదమైన వనమ్ములెల్ల దో
షావహమై కృశించె, నిరతాదృత శోభ క్షయించె, సంయమీ
స్థావర వాటికాచయము తాటక ధాటికి గూలె, యజ్ఞ సం
భావనమాగి పోయె, జనవాదము విన్పడబోవ దేయెడన్. 846

సీ. అన విని రాఘవు డా తాటక యెవతె?
ఈమె కింతటి శక్తి యెటులగల్గె?
వివరించి యా గాథ వినిపింపుమా యన్న
ముని యిట్లు తెలిపెను ముదముతోడ,
వెనుక నిట సుకేతుడను పరాక్రమవంతు
డౌ యక్షుడుండె, వా డజుని గూర్చి
తపమొనర్చి సహస్ర దంతి సదృశ బల
యగు తాటకను దుహితగను గాంచె,

తే.గీ. నధిక సౌందర్య లావణ్య యైనదాని
జంభు డనువాని పుత్రుండు సమర యశుడు

ఘనభుజ బలదర్పుడగు సుందునకు నిచ్చి
యుక్త వయసున చేయించె నుద్వహమ్ము. 847

కం. వారికి మారీచుండను
క్రూరుం డైరావత సమ ఘోరాకారుం
డైరావతాధిప సమబ
లారూఢుండు ముని, మర్త్య హరణుడు పుట్టెన్. 848

శా. సుందుం డొక్క దినమ్మునన్ ముని యగస్త్యున్ మ్రింగ పైబడ్డ నా
మందున్ సంయమి మ్రందజేసె; నపుడా మారీచుడున్ తల్లి తో
పొందై యేగె మహీతలంబు వణకన్ మూర్ఖత్వ సంరోషుడై
చిందుల్ ద్రొక్కుచు సంయమీంద్రు పయి నక్షీణప్రతాపంబునన్. 849

వ. వచ్చుచున్న దుష్టులం గని, అగస్త్య మహాముని మారీచుని రక్కసుండవు కమ్మని శపింప, వాడా క్షణమునందే దానవ రూపమును బొంది, అచట నిలిచినచో ముని ఇంకను శపించునను భయంబున పలాయనుండయ్యె, నంత యుక్తాయుక్తంబు లెరుంగక తన పైబడ వచ్చిన 850

కం. తాటకను గాంచి మౌని ని
శాటినివై తిరుగు మీవు చాల సమలు ఘో
రాటవిలో మెసవుచు నతి
ఖేటంబౌ పిశితము క్రిమి కీటకయుతమున్. 851

వ. అని, మరియును నీవు నీ సహజ సుందర దేహంబు కోలుపోవుదువని శపింప, నా క్షణమందే ఆ యక్షిణి చొట్ట మొగంబు, మిడి గ్రుడ్లు, చప్పిడి ముక్కు, తామరాకులకు సరియగు చెవులు, బండరాళ్ళను బోలు చన్నులు, చెట్ల పెనుకొమ్మలవంటి చేతులు, గాడిదగొంతు, డోలు బోలు నడుము,



బానవంటి బొజ్జ, నల్లమద్ది కుద్దియగు మేను, నడయాడు కొండవంటి ఎత్తు కలిగి పరమ వికృత రూపంబునొంది, ముని, మర్త్య సంఘంబులపై నేహ్య భావంబు మనంబున నుప్పతిల్ల, 852

ఉ. అంతట నా నిశాటిని మహాక్రుధ మానసమున్ దహింపగా
సంతత సస్య సుందర నిశాంతములైన జనాంతికంబులన్,
చింతలులేక కోర్కెల త్యజించి నిరంతర యజ్ఞకార్యముల్
పొంతన నిర్వహించు ముని పుంగవ శాలల కూల ద్రోయుచున్. 853

కం. జనులను మునులను చంపుచు,
వనముల నాశనము చేసి, పసరముల కసిన్
దునుముచు, పాంథుల పట్టుక
ననయము హింసించి తినుచు నతి దుష్కృతయై. 854

వ. అట్లీ రక్కసి వనంబుల చెఱచి, జనుల భక్షించి, మహారణ్యంబుల నిర్జన మొనర్చి లోకారిష్టయై జుగుప్సాకర పరిసరంబులకు, దుర్భర వాతావరణమునకు కారణభూత యైనది. రామా! నీ వీమెను హతమార్చి ఈ మహాటవిలోని సంకట ముపశమింప జేసి, ప్రజాహితంబు కలుగ చేయుమన, ఆ రఘుకుల తిలకుండు కౌశికునితో నిట్లనియె. 855

చం. గురువర! మున్ను నన్ను తమ కోరిక మేరకు వెంటబోయి యే
యఱమరలేక మీ ముదల నాదటతో శిరసావహింప మ
ద్గురుడు విధించెగాన పరితోషముతో భవదాజ్ఞ చేయు దే
మఱికయు లేక – కాని ఒక మానిని చంపుట రాచపాడియే! 856

వ. స్వామీ! స్త్రీలను వధించుట ధర్మము కానేరదు కదా. క్షత్రియులు ధర్మబద్ధులు గాన దుర్మార్గవర్తిని యైనను ఈ రాక్షసిని చంప నొల్లననిన, శ్రీరామచంద్రుని సనాతనార్ష ధర్మనిబద్ధతకు మనంబుల్లసిల్ల, 857

ఉ. సంతసమంది మౌని రవి సన్నిభ తేజుడు రామచంద్రుపై
నెంతయు ప్రేమతో ననె నహీన దయారత ముప్పతిల్లగన్
చెంతకుచేరి. "నీ విపుడు చెప్పిన దెల్ల నిజమ్మె గాని ఈ
ఇంతికి చెల్ల బోదిదియు నేలన వేరగుటన్ పరిస్థితుల్. 858

కం. స్త్రీ యని చూడగ బోకుము.
న్యాయము జనహంతలైన నాతుల చంపన్
శ్రేయ మెరిగిన హరి భృగుని
జాయ నుశన యనెడు దాని సమయింపండే. 859

వ. రాక్షసుల కాశ్రయమిచ్చి దేవతలను నాశనముచేయ తలపెట్టిన భృగుపత్ని శుక్రుని తల్లి యుశనను ధర్మరక్షణార్థము తొల్లి విష్ణుమూర్తి సంహరించెను. భూదేవిని చంపబూనిన విరోచనుని పుత్రి, మంథరను వాసవుండు వధించె. ఈ తాటక వీరందరికన్నను ఘోరమైన దురితములకు పాల్పడిన హంత. ఇట్టి దురాత్ములను, ప్రజాకంటకులను నాశన మొనరించుట రాజైన నీకు ధర్మమే కాక కర్తవ్యమగును. నిష్కారణముగ తనను చంపుటకు పూనుకొన్న దుష్టులను – స్త్రీ, బాల, వృద్ధుల నెవరినైనను గాని వారిని చంపి తనను తాను రక్షించుకొనుట నృపులకే కాదు, సామాన్య మానవులకు కూడను ధర్మసమ్మతమే. 860

ఉ. అంతియ గాక తాటక మహాబలశాలిని, దీని జంప నీ
యంతటివారులేరు జగమందున నేయెడ నైన, భా
స్వంత కులాబ్ధి సోమ! ప్రభవమ్మున దానవి సంహరించి దై
త్యాంతకు లీ ధరిత్రి వసుధాధిపు లుండిరటంచు చాటుమా". 861

వ. అని మునీంద్రుడు తాటకా హననౌచిత్యంబును శ్రీరామునకు వివరించుచున్న సమయంబున, 862



## 9.10. శ్రీరాముడు తాటకను వధించుట

శా. దిక్కుల్ పిక్కటిలంగ స్ఫూర్జితము లుద్వేగంబునన్ మ్రోగునా,
త్రిక్కన్ దూగిన క్రూర వ్యాఘ్రతతు లోండ్రింపుల్ వలెన్, పోరులన్
ధక్కల్ మ్రోసిన రీతిలో వినబడెన్ ఠంకార నిర్ఘోషముల్
వృక్కాచ్ఛేదముచేసి జంతుతతికిన్, వృక్షంబులన్ కూల్చుచున్. 863

వ. ఆ విధంబుగ విపత్తులను కల్పించు నార్పులతో శబ్దాధికవేగంబున అవచాటంబుగ నాపాతయై, 864

కం. నరవాసన నరవాసన
సరవిని నా ముకు జెఱమల సరభస సోకెన్
శరభ శ్శరభని తాటక
సరసర పర్వెత్తి వచ్చె చండోద్వృత్తిన్. 865

వ. మ్రింగ నేతెంచి, జగత్ప్రసిద్ధుండైన విశ్వామిత్ర మునీంద్రుని గుర్తించి, వాని సరసను విశాల వక్షులు, ఆజానుబాహులు, స్ఫురద్రూపులు, ధనుర్ధరులు, తేజోవంతులునగు రాజకుమారుల గాంచి, వీరు సామాన్య మానవులు కారని గ్రహించి, ఇంచుక భయంబావహింప గగనతలంబున కెగిరి, 866

కం. పెడబొబ్బలిడుచు నార్చుచు,
తడయక కురిపించె కుడిపి తచ్చన తోడన్
దడదడ ప్రస్తర వర్షము
జడివలె రాఘవులపైన సడలని బిగితో. 867

తే.గీ. రాము డా శిలా వృష్టి నారాచ వృష్టి
చెదరగొట్టంగ కని రక్కసి వడి మాయ

గప్పె, దాని నినకులుండు క్షణములోన
నిశిత శరముల ఖండించె నేర్పు తోడ, 868

వ. అయినను, ఆ క్షుద్ర దానవి రెట్టించిన క్రోధంబున తాడి కీడైన రెట్టల నూపుచు తన ప్రయత్నమును విరమింపక, రాజకుమారులపై పడబోవు చుండ, శ్రీరాముడు లక్ష్మణుని వంకచూచి ఇట్లనియె, 869

కం. "మనమేమియు దాని దరికి
చనకున్నను వదలక నిది సమరోత్కంఠన్
మనపైకి వచ్చె, నిక దీ
నిని చంపుట యొప్పనుచు మునియు మున్ననడే! 870

తే.గీ. మునివరుం డెంత నచ్చ చెప్పినను గాని
అబల కూల్చంగ మనసొప్ప దయ్య నాకు
కాన తాటక మనపైన క్రమ్మకుండ
వెలది కరముల దునిమి నే విడిచి వైతు". 871

కం. అని చెప్పుచుండ కనలుచు
ఘనముగ గాండ్రించి తాటక చెలసి వారిన్
కనుమొఱగి మ్రింగ బోయిన
కనుచున్ రాముండు దాని కరములు ద్రుంచెన్. 872

తే.గీ. అంత సౌమిత్రి స్పందించి, అసదృశముగ
దాని కర్ణ నాసికముల తఱుగ నదియు
ప్రధన కుశలత కామరూపంబు దాల్చి
రామ లక్ష్మణుల పయికి ప్రబ్బి వచ్చె. 873



కం. మునిపుంగవు డంతట రా
మునితో దయ చాలు నింక పొలదిండి పయిన్.
దీనిన్ చంపుము, లేదా
పైనన్ బడి ఇది మనలను ప్రబలత మ్రింగున్. 874

వ. రామచంద్రా! సంధ్యాకాల మాసన్న మగుచున్నది. సాయంసమయంబుల యాతుధానుల బలము ద్విగుణీకృతమగునని హెచ్చరించె; 875

ఉ. అంతట రామచంద్రుడు మహాశుగ మొక్కటి యెక్కుపెట్టి, క
ర్ణాంతము దాకలాగి తగ నాసురి గుండెలు వ్రయ్యనేసె, నా
దంతి సహస్ర విక్రమ కుదంతి వితాకున నార్చి కూల, వ
న్యాంతరమందు జంతువుల హాకృత మెంతొ ప్రతిధ్వనింపగన్. 876

కం. ధాటిగ రాముని బాణము
నీటుగ నెద బిట్టు నాటి నేటుగ నెట్టన్
ఖేటపు జీవన జోటిక
తాటక వనవాటియందు తటుకున కూలెన్. 877

కం. రక్కసి మృత్తికపై బడ,
న్యక్కుచు నటనున్న చెట్లు నలిగి పడంగా,
అక్కడి రేగడి మట్టియు
వ్రక్కలగుచు ఇనుప మూసవలె కన్పట్టెన్. 878

కం. ఉల్లోలంబుల ధాటికి
కల్లోలంబై జలధులు కంపించంగా
నల్లల్లాడెను ముదిరలు,
చిల్లుపడె నభమన వృష్టి జిల్లున కురిసెన్ 879

కం. కంపించెన్ సర్వంసహ,
కంపన భంగములు రేచి ఘనముల యందున్
శంపాలతలై యురుముచు
చంపబడెన్ తాటక యని జగతికి చాటెన్. 880

కం. నింగిని గూడిరి త్రిదశులు,
హంగుగ నాడిరి తిలోత్తమాదుల్, సాధ్యుల్
పొంగుచు విని తాటక వధ,
రంగుగ జల్లిరి సుమములు రాముని పైనన్. 881

వ. అంతలో, 882

చం. క్షణమున తాటకాసురి యగస్త్య మహాముని శాపముక్తయై,
మునుపటి సుందరాకృతిని పొంది విశిష్ట సువర్ణ భూషయై
చనియెను రాఘవేంద్రునికి చాగిలి మ్రొక్కి సురాలయంబు, రా
ముని కృప నీల్గ పాపులును పుణ్యఫలంబులు పొంద చిత్రమే. 883

ఉ. సంతసమంది కౌశికుడు సన్నుతి చేయుచు రామచంద్రు న
త్యంత పరాక్రమంబునకు, తాటక దానవి నొక్క కోలతో
నంతముచేసినట్టి పరమాద్భుత శక్తికి మెచ్చి ప్రీతిమై
చెంతకు చేర్చి మూర్ధమును చేకొని మూర్కొని కౌగలించియున్. 884

ఉ. ఎంతయొ ఘోరకృత్యముల నించుక జంకునులేక చేసె నా
హంతను క్షాంతిబూని యొక యమ్మున శాప కృతంబు సత్వరం
బంత మొనర్చి, తోరమగు నాకృతి తోడుత నాకవాస మ
శ్రాంతము నిచ్చినట్టి రఘురాముని యక్కటికన్ స్మరించుచున్. 885

వ. ఆ రాత్రి రాజకుమారులతో ఆ వనమందే విశ్రమించి, మరునాడు శ్రీరాముడు చేసిన లోకహితంబునకు కృతార్థుడై, భువియందు దుష్ట శక్తులై,



మహాబలవంతులైన దానవాదుల నెదుర్కొని హతమార్చగల పాటవము కలుగజేయ, విశ్వామిత్రుడు తాను సహస్రాధిక దివ్యవర్షంబులు తపంబాచరించి సంపాదించిన అపురూపములు, అనన్యసాధ్యములు, సత్య పరాక్రమంబులగు బ్రహ్మ, బ్రహ్మ శిరోనామ, పాశుపత, నారాయణ, పర్జన్య, ఐంద్ర, వాయవ్య, ఆగ్నేయ, వారుణాస్త్రములను, కాలచక్రము, విష్ణుచక్రము, ధర్మచక్రము మున్నగు భీకరాయుధముల ననేకములను, మున్ను విశ్వశ్రేయంబునకై యస్త్రరూపంబులు ధరించిన భృశాశ్వ ప్రజాపతి పుత్రులను శ్రీరామునకు మంత్ర సహితముగ ప్రదానము చేసెను. రాముడా అస్త్ర సంబంధితావాహన ప్రయోగోపసంహార మంత్రముల నొక్కసారి యుచ్చరించి నంత, ఆ యస్త్రంబులన్నియు వానికి స్వాధీనము లయ్యెను.

అపుడు, శ్రీరాముడు తన తమ్మునిపైగల ప్రేమచే, విశ్వామిత్రుని సమ్మతిని, ఆ మంత్రరాజములను వాని కుపదేశము చేసి, తమ ఆజ్ఞలను నిర్వర్తింప వేచిన ఆ దివ్యశక్తులతో మీరు మీమీ స్థానములకు పొండు, మేము మిమ్ము తలచినపుడు రండని నిర్దేశించి, పంపివేసెను. ఇదంతయు గమనించు చున్న కౌశికుడు శ్రీరాముని వ్యవహారదక్షత కబ్బురమున హర్షచిత్తుడయ్యెను. 886

---

**వివరణలు :**

1. ఈ గ్రంథమునందలి ప్రకృతి వర్ణనములలోని కొన్ని పద్యములు నాచే మును రచింపబడిన గ్రంథములు, ఖండికల నుండి గ్రహించి, అవసరమైన మార్పులుచేసి అచటచట నుంచబడినవి. వీటిలోని కొన్ని ద్విపదలు, సర్వ 'ల'కార ప్రాస, అంత్యప్రాసలతో సీస పాదబంధములై విరాజిల్లునవి. ఇట్టి ద్విపదలలోని రెండవపాదమందలి మొదటి అక్షరమును తీసి మొదటిపాదము చివర తగిలించిన సీసపద్య పాదమేర్పడును.

2. ఈ నీతులు కొన్ని ఈ కాలమునకు వర్తింపవు.

***

# 10. వామనావతార ఖండము

## 10.1. సిద్ధాశ్రమ ప్రవేశము

చం. తదుపరి రామచంద్రుడును తమ్ముడు లక్ష్మణుడున్ మునీంద్రుతో
పదిలముగా ప్రయాణమయి వావిరి బోవుచు సంజవేళకున్
ముదమున చేరిరొక్క పరిపుల్ల లతాంత నితాంత సంపదన్
సదమల దివ్యమై బరగు చక్కని కానన వన్య దేశమున్. 887

వ. కొలది దూరముననున్న కొండచరియలలోని రజిత వల్లరీ సమంబై సుందరాకృతి నొప్పారు నిర్మల పుష్కలోన్నత జలపాతంబులలోని నిరతాంబు సందోహ స్యందిత హేతు నిష్పాదితంబైన నితాంత ఝర్ఝర నిభ నిర్ఘోషల మందిత రవళులు హృదయోల్లాసంబు కలిగింప, రామలక్ష్మణులు కౌశికుని వెన్నంటి ముందునకు సాగి బహువిధ తరు లతాగుల్మ పుష్పాకరమై ప్రకాశించుచున్న మనోజ్ఞాశ్రమ వనవాటిక నొకదానిని ప్రవేశించిరి. 888

కం. ఆ వాటికలో వెలసెను
పావన మునిజన కుటీర వర వాసంబుల్
శ్రావిక నిగమాగమ సం
రావ ముదాత్తానుదాత్త రమణీయంబై. 889

తే.గీ. వివిధ ద్రుమ లతా గుల్మ ప్రవేష్టితంబు,
రుచిర బహువర్ణ విహగ నేత్రోత్సవంబు,
సరస సుమనస సౌగంధ సౌరభంబు,
ఘన నిగమ రవాశ్రయ మాశ్రమ నివహంబు. 890

తే.గీ. నిబిడ గుల్మ పుష్పావృత నివసనములు
ముచ్చటగ సుమ చయము కొప్పుల ధరించి,



ప్రియుల కొఱకు భూషితులయి వేచినట్టి
సకియలట్లుగ కన్పట్టె సంజ నీడ. 891

వ. అట్లు సహజాతిశయంబున వర్ధిల్లెడు ఆశ్రమ సమూహంబున ఛాత్రులు, తక్కుంగల మునులు యజ్ఞసన్నాహములు గావించి విశ్వామిత్రుని ఆగమనమునకు కండ్లలో నొత్తులను వేసుకొనిన రీతి నిందనుక వేచి, ఇపుడా ఋషి పుంగవుండు దాశరథులతో విచ్చేయు టెరింగి, తమకిక రక్కసులవలన యజన నాశనము కలుగబోదను ధైర్యంబు మనంబుల నుత్తేజ పరుప, ఆగంతుకుల కెదురేగి వారిని స్వాగతించి, తమ గురువునకు సాష్టాంగంబు లాచరించి, రామలక్ష్మణుల కతిథి పూజలు నిర్వహించిరి. 892

తే.గీ. అపుడు సంయమీంద్రుని రాము డడిగెనిట్లు,
స్వామి చెపుడయ్య వీరలెవ్వారొ నాకు;
చూడ నిదియొక ఆశ్రమ స్తోమమనుచు
చెప్పకనె చెప్పు దీన వసింతు రెవరు. 893

చం. అన విని రాఘవుండు హరియంశజు డైనను మర్త్యరూపమున్
గొనుటను పూర్వమందు తను కోరి వసించి తపించినట్టి భూ
మిని మఱపొంది ఈ విధి భ్రమించి విచారణ చేసె నంచు నా
మునివరు డెంచి చిర్నగవు మోమున దోపగ ప్రీతి నిట్లనెన్. 894

చం. జగతికి మేలుగూర్చ మును చక్రధరుండు తపంబు జేయగా
తగు పరికర్మవేదిక తదర్థము శోధన చేసి భూమిపై
సెగ యధికంబుగాక తగు శీతలమై యొనరారు ప్రాంతమున్
నగ జలపాత సంయుత వనంబొక దాని నిటన్ కనుంగొనెన్. 895

చం. సొగపున నీయెడన్ హరి విశుద్ధ మనంబున సుప్రవిష్టుడై
ప్రగమ మనోభిలాష నతి బంధురరీతి తపంబు నేర్పుతో
నగణిత దివ్య వత్సరము లంకిత భావముతోడ జేసె నీ
నిగర వినిర్మలంబగు పునీత నితాంత నిశాంత వాటికన్. 896

వ కొన్ని శత సహస్రాధిక వసంతంబు లీరీతి దీక్షించి, తన తపంబుతో ఈ వనంబున కాధ్యాత్మిక సిద్ధి కల్గించి, కమలాక్షుడు తన నిజధామంబున కరిగె. అంత, 897

## 10.2. అదితి కశ్యపుల తపస్సు

తే.గీ. కొన్ని వేల వత్సరములు చన్న పిదప,
సప్త ఋషులం దొకండు కశ్యప మునీంద్రు
డదితి మగ డింద్రునకు తండ్రి, హరినిగూర్చి
సిద్ధి నర్థించి ఇచ్చోట చేసె తపము. 898

ఉ. ఎంతయొ భక్తి తోడ తన ఇంతిని కూడి నిరంతరంబుగన్
స్వాంతమునందు శ్రీహరిని భాసుర వృత్తిని నిల్పుచున్ మరే
చింతయులేక, శౌరికి వశీకృతమై సకలేంద్రియక్రియల్
దాంతి వహింప, శాంతి తన ధారణి కూర్చ పరీత తోషియై, 899

కం. ఈ రీతిని కశ్యపు డా
హార విహారములు మాని ఆత్మస్థుండై
ఘోర తపం బతి నిష్ఠన్
ధీరత కొన్నేండ్లు కోర్కె తీరగ చేసెన్. 900

వ. ఇది యిట్లుండ, నొకనాడు, సకల సృష్టి రచనా దురంధరుండు, జగద్వ్యవస్థ సుస్థిరత్వ బాధ్యతానురక్తుండు నైన జలజాతాసనుండు, అగ్నిదేవుని



మున్నిడుకొని, పురందరాది దేవతానీకంబు వెంటనంట వైకుంఠం బేతెంచి శ్రీహరికి ప్రణామంబు లాచరించి, బహువిధ మధురార్థగర్భిత భక్తికీర్తనల వినుతించి తద్దయు నిట్లు విన్నవించెను. దేవా! 901

సీ. ప్రహ్లాద పౌత్రుండు బలి యను దానవుం
డమరేంద్రుచే నోడి యవని వీడి,
పాతాళమున కేగి భార్గవు నండలో
విశ్వజిద్యాగంబు వీక సలిపి,
శస్త్రాస్త్ర నివహంబు చతురంగ బలగంబు
ననువుగా పొంది, నాకాలయంబు
వాయుగణయుతంబు వశపఱచు కొనుచు
శక్రాది త్రిదిశుల జడుపు గొలిపి
తే.గీ. వెడల గొట్టించి వారెల్ల వీగి పర్వ,
మూడు లోకంబులును తన ముడుపు వోలె
చక్రవర్తిగ జేకొట్టి జనులు కొలువ
నేలుచుండెను తనకీర్తి యినుమడింప. 902

సీ. ప్రాజ్ఞుడై పౌరుల పాలించు మూలాన
ప్రజలలో నాతని ప్రఖ్య పెరిగె,
ప్రజలకు గౌరవ పాత్రుడయ్యెను తాత
హరిభక్తుడైన ప్రహ్లాదుడగుట,
యజన యాగాదుల నతిశ్రద్ధతోడను
నిర్వహించుట చేత నియమ నిరతి,
వితరణ శీలుడై అతులమౌ దానముల్
హితవుతో నర్థుల కిచ్చు కతన,

తే.గీ. యాతుధాన కుల జనితుడైన గాని
వీనిపై ననురక్తి యవిరళితముగ
హెచ్చు చుండెను జనులలో నెదురులేక
మూడు లోకంబు లందు నభ్యుపగమించి. 903

శా. ఈతం డిప్పు డపూర్వ దానయుతమౌ నిష్టిన్ యశఃకాముడై
ప్రీతిన్ శుక్రుని మార్గదర్శనమునన్ పృథ్వీస్థలిన్ జేయుచున్
యాతాయాత జనాళికిన్ వితరణవ్యాదాన కార్యంబులన్
ఖ్యాతిన్ బొందుచు నున్నవాడు త్రిజగద్వ్యామోహ లక్ష్యంబుతో. 904

వ. ఈ విధంబుగ బలి చక్రవర్తి దైత్యుడయ్యును తామసత్వము చూపక, పౌరాదరణ చూరగొని, తన విఖ్యాతిని పెంచుకొనుచు ప్రతిష్ఠానిశ్రేణి నారు రుక్షా ధ్యేయమానసుండై దైత్యకుల వర్ధనునిగ నెదుగుచు, ఈ మహా యజన సమయంబున యాజ్వకులకు, పురోహితులకు, చివరకు యజనంబు చూడ వచ్చిన ఆగంతకులకు కూడ అడిగిన దిత్తునని ప్రతిన చేసి, విశిష్ట దాతగా పేరొందుచున్నాడు. 905

కం. నిరుపమ వితరణతో భూ
సురవర సంఘముల మెప్పు చూరగొనుచు నీ
సురవైరి యుఱది నుఱవడి
యెఱగుచు విఖ్యాతి హర్మ్య మెక్కుచునుండెన్. 906

వ. ఈతడీ క్రతువు నిర్విఘ్నముగ సంపూర్ణము గావించి, యజన సందర్శనార్థ మేతెంచెడు వివిధ అతిథి జన సమూహములను తన వితరణతో 'నభూతో న భవిష్యతి' గ సంతృప్తి పరచిన ఆతని మును ముందు నిరోధించుట కష్టతర మగును. ఈ ప్రత్యేక, యజన వితరణల మూలంబున నీతండు పుణ్యవంతుండై దేవేంద్రాది పదవుల కర్హుండగును. ఇట్టి పదవులతనికి దక్కిన సనాతనార్హ



మతము రాక్షస సంపర్కముచే కలుషితమగునని నేను భావించు చున్నాడను. విశ్వంభరుండవగు నీ జగత్ పరిపాలనా పథకము వక్రమార్గము పట్టు సావకాశమును గలదు. కావున నీవు తగిన రీతి నీ ప్రమాదమును ముందుగనే అరికట్టుమని ప్రార్థించెను. ఆ వేడ్కోళ్ళ నవధరించి, జనార్దనుడు బలిచక్రవర్తి సజ్జనుడైనను దైత్యుడగుట ఆతని బలిమి దానవులను బలోపేతుల చేసి, ఆర్ష సంప్రదాయ పతనంబునకు దారితీసి, జగతి కనర్థము వాటిల్ల జేయును గనుక, వాని వృద్ధి నడంచ దలచెను. 907

## 10.3. వామన చరిత్రము

వ. ఇంక నిచట ఈ సిద్ధాశ్రమంబున, కశ్యపుండు చేయుచున్న ప్రార్థనల మన్నించి, 908

తే.గీ. ముదము తోడను హరి వాని ముందు పొలిచి,
మెచ్చితిని కోరిన వరము లిచ్చెదనన,
గ్రక్కున నతండు విభ్రాంతి కలయజూచి
కంజనయనుని వొగడె నిట్లంజలించి. 909

సీ. విశ్వరూపా! హరీ! విశ్వంభరా! దేవ!
విశ్వపాలక! ప్రభూ! వేదవేద్య!
జలనిధి భోగిపై జలధిజాతను గూడి
శయనించి జగమేలు సౌమ్యమూర్తి!
దర్పించి త్రిదశుల, ధరణీ నివాసుల
దండించు దైత్యుల దమనుడవయి
మత్స్య, కూర్మ, వరాహ, మనుజ సింగంబులై
మహిత విక్రమమున మహిని పొలిచి

తే.గీ. ఆర్ష మత సంప్రదాయంబు లవని నిలిపి
ధర్మ పతనంబు నరికట్టి ధరణిబ్రోచు
ప్రగతి రక్షణా దక్ష! సత్పథ రిరక్ష!
కలుష జన మస్తక విలుంఠ! కంబుకంఠ! 910

సీ. ఏ నిన్ను తిలకింప నితర దృశ్యంబుల
చూడ కోర్కొనదొ చక్షుర్ద్వయంబు,
ఏ నిన్ను వినునట్టి వీనులు విందుగా
వేరేమి శబ్దముల్ వినగ బోవొ,
ఏనీ లసన్నామ మింపుగా స్మరియింప
వేరేమి హృదయమ్ము కోరుకొనదొ,
ఏ నిన్ను భజియింప నినుమడించెడు రక్తి
వేరొక్క భజనల చేరువవదొ,
తే.గీ. అట్టి నీవిట్లు మామ్రోల నవతరింప,
జన్మ ధన్యమ్ము పూర్ణమ్ము నున్మిషమ్ము
భవ్య మద్వితీయమ్ము, శోభాన్వితమ్ము,
అవిరళానంద నిలయమ్ము ననుపమమ్ము. 911

తే.గీ. సత్య సుందర శివము మా స్వాంతమందు
నిరతసంతోషదాయక నిరుపమమ్ము
పరమ వైరాగ్య శాంతి సంవర్ధకమ్ము
దైత్యభంజన ! మాకు నీ దర్శనమ్ము. 912

కం. నాకును నదితికి పుట్టిన
నాకాధీశ్వరుని వాని నాతిన్, సుతులన్,
నాక నివాసుల నెల్లన్
ప్రాకటముగ సాకి నిరతి పాలింతు వొగిన్. 913



ఉ. సోదరు నట్లు వాసవుని శోభిలు నీ భుజ విక్రమంబుతో
ప్రోది యొనర్చి దైత్యజన రూక్ష నియామ తపోగ్ర దీక్ష సం
పాదిత గూఢ దివ్య వర భాసుర శక్తు లశక్తిచేసి స
మ్మోదికు నిర్జరాలయ విమోచన చేసితి పెక్కు మాఱులున్. 914

శా. నీకున్ మ్రొక్కెద నా తపంబునకు సంతృప్తుండవై శ్రీహరీ!
నాకున్ మేలొనరింప దల్చిన తగన్ నా పుత్రుగా నా సతీ
రాకాచంద్ర నిభాస్య గర్భమున పూర్ణాంశన్ ప్రభూతించుమా!
నాకాధీశ్వరు సోదరుండ వగుచున్ నా జన్మ సిద్ధింపగాన్. 915

వ. ఆ సమయంబున కశ్యపుని పుణ్య సాధ్వియు, ఇంద్రాది దేవతామూర్తుల మాతయు నగు అదితి హృషీకేశునితో తమ నందనుండైన మఘవుండు బలిదైత్యుని మూలంబున పడుచున్న కష్టంబుల నేకరువు పెట్టి, వాటి నంతమొందించి, తిరిగి వాని నింద్రరాజ్య పట్టాభిషిక్తుని చేసి రక్షింపుము,916

మ. అని వేడన్ కరుణాంతరంగుడగు దైత్యారాతి బ్రహ్మాదు లా
ర్తిని బాపంగను సంయమీంద్రునికి ప్రీతిన్ జేయ యోజించి వా
మన రూపంబున పొల్చె నా యదితికిన్, మౌనీంద్రు నర్ధాంగికిన్,
వనితా శోభనమూర్తికిన్, సుదతికిన్, వాత్సల్య వారాశికిన్. 917

తే.గీ. అచ్యుతుని యంశ పొలిచిన అదితి కొమరు
డింద్రునకు తమ్ము డౌట నుపేంద్రుడనియు,
గోముగా కుఱుచ యగుట వామనుండ
నియు ప్రసిద్ధ నామముల మనియె జగాన. 918

వ. అట్లు శ్రీమహావిష్ణు విచట వామనుడై జనించుటచే నీ ప్రదేశము వామనాశ్రమ మనియు, కశ్యపుని తపము సిద్ధిపొందుటచే సిద్ధాశ్రమమనియు ప్రసిద్ధిగాంచె నని విశ్వామిత్రు డా స్థలపురాణమును వివరించిన, శ్రీహరి

యదితిసుతుండై యుద్భవించి, బలినెట్లు శిక్షించెనో విశదముగ నెరుక పరుపుమని శ్రీరాముడు వేడిన, కౌశిక మునీంద్రు డిట్లు చెప్పదొడంగెను.

రమణీయ సుగుణ గుణ సాంద్రా! రాఘవేంద్రా! వినుము, ఆ విధముగ919

## 10.4.వామనుడు బలి చేయు యజ్ఞము చూడ బోవుట

కం. పుట్టిన తోడనె బాలుడు
కట్టడతో నిగమము లురు కంఠ ధ్వనితో
ఎట్టెట్టా యని జనములు
బిట్టాశ్చర్యపడ కమ్ర విధి వల్లించెన్. 920

కం. అంతట నా బాల వడుగు
చెంతనుగల మునిగణముల చేరన్ గొనుచున్
పంతుగ నా బలి యజనా
భ్యంతర్గత హోమ వాటి పదపడి జేరెన్. 921

కం. పిలువక పోయిన గానీ
బలయుచు నరిగెను మురహరి బలినృపు కడకున్
పిలుపులకై వేచెదరే!
ఖలులను దండించు కొఱకు కలిగిన వారల్. 922

వ. ఆ విధంబుగ వామనుండు యజన హోమమాచరించుచున్న బలి సమీపంబునకు చేరుచుండ, 923

తే.గీ. వచ్చుచున్నట్టి వామన వటువు నిగమ
సరళి, వేదపాఠోచ్చయోచ్చరణ రవళి,
మొగము నందున విరిసిన పూర్ణ దీప్తి
ఎడద నానంద పరుప నా యేలి కపుడు. 924



తే.గీ. స్రష్ట కీడైన భవ్య విజ్ఞాన ఖనిని,
భారతీతుల్య దివ్య విద్వత్తు వాని,
వామనుండైన నతిలోక ధామ నిధిని,
మురిసి యుప్పొంగి తనుసీమ పులకరింప, 925

ఉ. చూచి, యనూనరక్తి పరిశోభిత పూర్ణ ముఖారవిందుడై
లేచి, సుగంధ కస్తురి విలేపిత కర్కశ బాహుయుగ్మమున్
సాచి, యధీతి చెక్కిలిని స్వాగత సంయుత సూచకంబుగా
రాచి, సరాగరాగ మధుర స్వన రమ్యత వాని కిట్లనెన్. 926

ఆ.వె. ఎవ్వరీవు కుఱ్ఱ! యెందుండి వచ్చితి!
తల్లితండ్రు లెవరు త్రాత యెవడు,
గోత్రమెద్ది నీకు గురువర్యు డెవ్వండు,
ఏమి వలసి వచ్చి తిటకు నీవు! 927

## 10.5. వామనుడు బలికి తన తత్త్వము తెలుపుట

వ. అని యడిగిన ఆ బలి రాజన్యునితో వామనుం డిట్లనియె. ఓ దానవరాజ్య సార్వభౌమా! నే నెవరో చెప్పినను నీకు తెలియదు. నేనే గాదు, 928

తే.గీ. ఎవరు చెప్పినను తెలియ దెవరొ నేను,
తెలియ నట్టిది విన్నంత ఫలము గలదె,
ఎవరికిని వారె నాతత్త్వ మెరుగ వలయు,
ఎరిగినంతనె సర్వంబు నెరిగినట్లె. 929

ఆ.వె. తండ్రి లేడు నాకు, తల్లి సైతము లేదు,
గురువులేడు, లేదు గోత్రమేమి,

అహితు లెవరు కారు, ఆప్తు లందరు నాకు
జగతి నిండి యుందు ప్రగతి కొరకు. 930

కం. వచ్చితి నిచటకు కోరిక
లిచ్చెడివాడవని యెరిగి, ఇంకను భువిలో
అచ్చపు నీ యీవి జనులు
నిచ్చలు మఱువరను నిజము నీకున్ తెలుపన్. 931

కం. అడిగిన విచ్చెదవని విని
వడివడి వచ్చితిని నిన్ను వరమడుగంగా,
బుడుతను నా కోర్కెను విని
చిడిముడి పడకుండ నిమ్ము శీఘ్రమె రాజా! 932

కం. అన్నియు నున్నవి, నే నా
పన్నుండను కానయినను బలి రాజన్యా!
నన్నున్ ప్రార్థించెడు జను
లెన్నిన వీయగ నడిగెద నితవున నిమ్మా! 933

కం. పుట్టిన వారికి, నేలను
మెట్టిన వారికిని తృప్తి మిన్నున పువ్వే,
పట్టుక వదలక కోర్కెలు
నిట్టవొడిచి తొలుచు గాదె నెట్టన మదులన్! 934

కం. వేడుకతో నడిగెద నీ
వోడక దేవార్పణమని యుత్సాహముతో
మూడడుగుల చోటిమ్మా
ఆడుచు పాడుచును గొనెద ననిమిషవైరీ! 935



కం. నా చరణము పెద్దది, నా
తోచిన చోటందు మోపుదు పదము, మది నా
లోచనము చేసి తదుపరి
నా చిఱు కోరికను తీర్చి నున్ననుప గదే! 936

కం. నశ్వర మీ లోక మగుట
నీశ్వర సంకల్ప మనుచు నిచ్చిన నీవుల్,
విశ్వము లోన కని వినని
శశ్వ త్సౌభాగ్య మబ్బు జనవర నీకున్. 937

తే.గీ. చిన్న వాడ నాకు పిడికె డన్న మైన
యెక్కువగు దాని కన్న నే మెక్క లేను,
మూడడుగులి మ్మవియె నేను మూడు జగము
లట్లు సరిపెట్టుకుందు దైత్యావతంస! 938

వ. నా వారి అవసరంబునకై [1]త్రివిక్రమముల నిమ్మని కోరుచున్నాను. అవియే త్రైలోక్యంబులని సంతసింతునని యుపేంద్రుడన్న, చిరునగవుతో బలినృపేంద్రు డిట్లనియె. 939

## 10.6. బలి చక్రవర్తి వచ్చిన వటువు విష్ణువేమో యని సంశయించుట

కం. పుట్టక మున్నే నేర్చితొ,
పుట్టిన పిదప నెఱిగితివొ! పొలవరి పిడుగా!
గుట్టగు నద్వైత [2]స్మృతు
లొట్టీవాకట్టినాడ వొప్పుగ నన్నున్. 940

తే.గీ. ఒకట వేదాంత భావంబు లొప్పు నటుల,
పాలసుని వోలె నవివేక వాంఛ లొకట,
వ్యంగ్య శబ్ద సమన్వయ వాక్య రచన
వింత గొల్పెను మాకు నీ విషయ మరయ. 941

కం. ఎవరో పలికిన సూక్తులు
చెవిలోనను దూరి బిట్టు చెలరేగంగా
నవిచారత పలికితివా
అవగాహము లేక – తెలుపు మర్భక నాకున్. 942

తే.గీ. నీ ప్రవర్తన చూడంగ విప్ర శిశువ!
నీవు సామాన్య వటుకుండు కావటంచు,
వలసి వేరు కార్యమునకై వచ్చితివని
తోచుచుండెను మాకు ప్రత్యూష వదన! 943

వ. ఓ చిఱుతా! భూత భవిష్యద్దర్శన పాటవుండైన అస్మద్ గురువరేణ్యుండు భార్గవ శుక్రాచార్యుండు నన్ను కొన్ని దినముల క్రితమే ఇట్లు హెచ్చరించిరి. 944

మ. నిను యుద్ధంబున గెల్వ నేరక వెతన్ నీ శత్రువౌ శక్రు డా
తని భృత్యుల్ పరమేష్ఠియుండ చని దైత్యారాతి నర్థింప, పొం
దున నా కశ్యపమేని భామినికి సద్యోగర్భుడై పుట్టి, వా
మన రూపంబున వచ్చు నీ క్రతువుకున్ మాయావి యాచింపగా. 945

కం. అడిగిన దిత్తువు కావున
నడిగెదనని వాడు సర్వమడుగును నిన్నున్,
ఒడబడ వలవదు నాతం
డడిగిన దేదైన నీయ కసుర నృపాలా! 946



తే.గీ. సూదిమొన మోపినంతైన చోటు వాని
కిచ్చినట్లైన క్షణములో పుచ్చుకొనును
సకల సంపన్న సౌభాగ్య సంయుతముగ
రాజ్యమెల్లను మోసాన రాక్షసేంద్ర! 947

కం. వేడితి వటులే వటువా!
మూడడుగుల నేల వినగ ముచ్చట యయ్యెన్
మూఢుడవో బేలరివో
చూడగ నీ కోర్కి చాల చోద్యంబయ్యెన్. 948

కం. కానగ రూపము, నీవీ
దాన మడుగు తీరు, ద్వంద్వ తాత్పర్యార్థా
నూన చతుర భాషణములు
మానసమున సంశయమ్ము మాటుగ రేపెన్. 949

మ. అయినన్ మా గురు డన్న యట్లుగను నీ వా విష్ణుదేవుండవే
యయినన్ నీ చిరుకోర్కి యీ త్రిభువన వ్యాపారకర్తైన నే
పయికొంచున్ వెస తీర్చకున్న నగరే వాచాలురై మా ప్రజల్,
పయిపై నా శపథంబు నేడు పతనంబై వ్రాలదే వ్యర్థమై. 950

కం. అడిగిన వారికి తప్పక
నడిగిన విచ్చెద ననుచు మహార్భటమున నే
తడవాగక జనులకు మును
నుడివిన పలుబాసలు చెడి న్యూనము కావే! 951

కం. మన ముందున హరి యున్నను,
మన కన్నులు కనగ బోవు, మది యెరుగగ బో

దని మును వినియుంటి – నతని
కనికరమే లేని యెడల కప్పవె మాయల్! 952

ఉ. తెల్లని సూర్యరశ్మి ఘనతేజము వక్రపు దర్పణంబునన్
భళ్కున సప్తవర్ణ పరివర్తన చెందిన యట్లవిద్యయన్
కల్లగు విష్ణుమాయతెర కన్నుల కడ్డుపడంగ వ్యర్థులై
కల్లరులైన మానవులు కానరు దైవ నిజస్వరూపమున్. 953

## 10.7. బలి చక్రవర్తి శ్రీహరిని ప్రార్థించుట

వ. నీతో భాషించిన కొలది నీవా శ్రీహరివేయని నా కనిపించుచున్నది. అనునంత శుక్రాచార్యుడా నరపాలుని దరికేతెంచి రహస్యంబుగ, మహారాజా! ఈతడు నిశ్చయముగ విష్ణువే. ఈ మాయావితో నత్యంత జాగరూకత వ్యవహరించుమన, బలి రాజన్యుడు పటవున చిఱునగవు నగి వటువు నుద్దేశించి ఇట్లనియె. 954

కం. కావున మనోజ్ఞరూపా!
ఏవిధి సారమగు నేల నెదుగునొ బీజం
బావిధి యుత్తమ దాతకు
ప్రావగ దానంబు చేయ రాణించుగదా! 955

కం. ఇష్టముతో నిచ్చెద నో
సృష్టి, స్థితి, నాశకుండ శ్రీహరి! నా కే
నష్టమొ కష్టమొ కా కే
వ్యుష్టము కలిగినను గాని యూహాతీతా! 956

కం. కనుకను నీకున్ దేవా!
వెనుకకు చూడంగ బోక వేగమె యిత్తున్



తనివిని కోరిన కోరిక
పనిగొని కడుప్రీతి మూడు పదముల నేలన్. 957

వ. మహాత్మా! పరంధామా! మరొక్కమాట. నీ కొకనాటి భృత్యులు జయ, విజయులు శాప మూలంబున మా పూర్వులైన హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా ధర నుద్భవించి, ఆర్షమత విరుద్ధంబుగ ప్రవర్తించి నీతో బద్ధ శత్రుత్వ మేర్పరుచు కొన నీవు ప్రత్యేకముగా భువిపై వరాహ,నరసింహంబులుగ నవతరించి వారిని పరిమార్చి మేలొనరించితివి. మా ముత్తాతలు నీకు వ్యతిరిక్తులయ్యును నా తాత ప్రహ్లాదుడు నీకు పరమ భక్తుడు. వానికి సకల రాజ, భోగ భాగ్యములతో దీర్ఘాయువును ప్రసాదించి, ప్రసాదించిన కరుణామూర్తివీవు. కరుణామూర్తివీవు. 958

కం. నాకును నీపై గానీ,
నీకును నాపైన గాని నేరుగ క్రోధం
బేకోశమందు లేదే?
ఈ కారణహీనకోప మేల మహాత్మా! 959

కం. నీ విశ్వ సృష్టి లయలం
దీ వెంచుకొనిన సఖుడగు ఇంద్రుని రాజ్యం
బీ విధి నే స్వాధీనము
గావించుకొనంగ నీవు కనలితి వేమో! 960

సీ. తండ్రి తోడను గూడి తద్దయు పాతాళ
వాసుండనైనట్టి వాని నన్ను
అసుర గురువరులు యంత్రాంగ పాటవు
లార్ష మతము దరి కరుగకుండ
దానవ భర్తయే త్రైలోక్య దైవంబ

టంచు వేవిధుల బోధించు కతన,
స్వర్గ మర్త్యాది భువనముల యాచార
ముల నెరుగను మొన్న మొన్న వరకు,
తే.గీ. కాని నా సన్నిహితుల సాంగత్యమునను
విష్ణువనుపేర నొక్కండు విశ్వమునకు
భర్త గలడంచు తెలియంగవచ్చె నాకు,
నేడు నినుచూచి కొల్చెడు నెరవుగల్గె. 961

కం. దైత్యకుల భవుడ నైనను
దైత్య గుణయుతుడనుగాను తార్క్ష కుమారా!
సత్య ప్రతిపాలకుడను,
నిత్య జపతపాది హోమ నిర్వహణుండన్. 962

వ. నీ వడిగిన దానమిచ్చిన నా మర్త్యామర సామ్రాజ్యంబుల నపహరించి ఇంద్రునికిత్తువని మా శుక్రులు చెప్పి యున్నారు. అదియే జరిగిన ఈ దానము వలన నిన్నును, నీ జగదాధి పత్యమును గూర్చి ఈషణ్మాత్ర మెరుంగ వీలగును కదా! భగవన్! అశాశ్వతమైన ఈ లోక వాసుల జీవితములలో రాజ్య భోగములు శాశ్వతమెట్లు కాగలవు. 963

మ. భువిలో పెక్కురు మూర్ఖులాశను నినున్ పూజించి రాజ్యంబులున్
భవనంబుల్ ధన ధాన్య భోగచయముల్ ప్రార్థింతు రజ్ఞానులై
ఎవరైనన్ ఘన నీరధిన్ చిటికె డుప్పిమ్మంచు నర్థింతురే
అవివేకంబున చంచలాత్మయుతులై, అధ్యాత్మ రత్నాకరా! 964

ఉ. విశ్వమునందు సంపదలు వేలకు వేలుగ పొందవీలగున్ –
నశ్వరమొందు దేహమును, నాశనమై చెడు భోగ భాగ్యముల్
శాశ్వతమౌనె? నిన్ను మది సన్నుతి నిల్పుచు కొల్చువారికిన్
విశ్వపతీ! హృదంతర వివేకముతోడుగ శాంతికూడదే. 965



చం. తరుణ వయస్సునందు తమ దార్శ విశేషము నాపయిన్ బడెన్
నిరతము నిన్ను తల్చుచును నీపద పద్మ మరంద ధారలన్
మురిపెముతోడ గ్రోలుచు ప్రపూత మనస్కత జీవనమ్ము నే
తఱియగ కోరుకొందును – నితాంత దయాత్మత సాకవే ప్రభూ! 966

తే.గీ. ఆత్మ పరమాత్మ యందున నైక్య మైన
మోక్షమన్నది యొకటుండు దీక్షితులకు
శౌరి కరుణింప నిద్ది చేకూరు ననుచు
స్నేహితులు రహస్యముగను చెప్పవింటి. 967

వ. దేవా! జీవుడను చీమ, భగవంతుని చింతనాద్యవస్థల నుద్భవించు మకరందమును నిరంతరము గ్రోలుచు మహానందము నందును. కాని, ఆ మరంద మనంత విభూతిమయమైన భగవత్ జలధిలో కలిసిన, అస్తిత్వమును కోలుపోవును గదా. ఆ మధుద్రావకములో నంతర్గతముగనున్న తీపి నాస్వాదించుట కా పిపీలకము పానకములో నీదవలసియుండును. అట్లీది, ఈది ముక్తిపొంది దాని వ్యక్తిత్వమును కోలుపోవును. 968

ఆ.వె. జీవి యనెడు చీమ శ్రీవత్సుడను తేనె
తినుచు నుండ గలదు తనివి తోడ,
విష్ణు నైక్యమైన విబుధున కాపైన
తీపి పులుపు చేదు తెలియ గలవె. 969

వ. కావున స్వామీ, నాకు నీచరణారవింద స్యందిత మధువును తృప్తి చేకూరు వరకు నిరతంబు గ్రోలుచు నుండ వలయునని వాంఛగా నున్నది. ఓ దేవదేవా! 970

శా. జ్ఞానంబించుక లేనివాడ, జడుడన్, జాత్యంధుడన్, నీకృపన్
నే నశ్రాంతము నీ పదాంబుజములన్ నిష్కాత్మతన్ గొల్చుచున్,
నీ నామంబు భజించుచున్, బొగడుచున్, నీ దివ్య గాథామృత
ధ్యానోపాసన సేయుచున్ బ్రతుకు భాగ్యం బిమ్ము విశ్వంభరా! 971

మ. పొనరారంగను క్షీరసాగర సుతా మూర్ధంబుపై, వేణిపై,
ఘనవక్ష స్థలిపై, కపోలతటిపై, స్కంధంబుపై, శ్రోణిపై
అనురాగ ప్రణయాభిరామముగ సయ్యాటాడు నీపాణి న
న్ననయంబున్ కృపజూడ వేడెదను – విశ్వాతీత! విశ్వంభారా! 972

వ. అని నంత, వామనుండు మందస్మితాననుండై, బలీ, వినుము. నన్ను సంపూర్ణముగా నమ్మి, ఆరాధించు భక్తులకు నేనెప్పుడును మేలు చేయుదును. కనుక నీవు నిశ్చింతగ నుండు మనెను. 973

## 10.8. బలి చక్రవర్తి వామనునకు మూడడుగుల నేల దానమిచ్చుట

కం. బలి నృపు డంతట చేకొనె
కలుష దితిసుత హరమున్, జగతి జన భరమున్,
దళితుల ప్రాపగు వరమున్,
తలకక నా బ్రహ్మచారి దక్షిణ కరమున్. 974

మ. సతి వింధ్యావళి నీటిధార తన హస్తంబందు గోకర్ణతో
నతి శ్రద్ధన్ హరి చేతిలోన పడు మర్యాదన్ ధృతిన్ పోయగా
నతిసర్గంబుగ శంకలేక బలియున్ హర్షించి లోకత్రయీ
ప్రతిభామూర్తికి ధారబోసె హరికిన్ పాదత్రయం బాయెడన్. 975



వ. ఆ విధముగ ధారపోసి ఆ బలిచక్రవర్తి యా మాయా వటువుతో నిట్లనెను. ఓ సృష్టి స్థితి లయ కారకా, ఆద్యంతరహితా, అనాదినిధనా, ఆదిదేవా! నే నే విధమైన సంకోచము లేక, ఈ దానముచే నాకు సంభవించు శుభాశుభముల పరిగణన చేయక, త్రికరణ శుద్ధిగా నీ వడిగిన మూడడుగుల నేల నిచ్చు చున్నాడను.

ఆ మాటలకు విహాయసవాసులు తథాస్తులను చిరు గంటలు మ్రోగెనో యన నుఱుము లుఱిమెను. సంతసంబున చిరుదివ్వెలు ప్రదర్శనము చేసిరోయన పలుచని నీలిమేఘములు గగనంబును గప్ప, పగలైనను తారక లాకసంబున మిలమిల మెఱసెను. మన లోకమున గూడను లేని ఇంతటి దాతలు భువిని గలరాయని పులకితాంగులై దేవత లానందబాష్పంబులు కార్చిరో యన చిరుజల్లులు కురిసెను. 976

కం. వచ్చినవాడు జనార్దను
డచ్చెరువగు కోర్కె కోరె – నది ఇచ్చినచో
ముచ్చటతో నా సర్వం
బిచ్చు బిడౌజుకని యెరిగి యిచ్చెన్ బలియున్. 977

కం. పుచ్చుకొనువాడు హరియని
ఇచ్చిన సర్వంబు నా త డిమ్ముగ గొను నం
చచ్చుదలతో బలి నృపుం
డిచ్చెను – శౌరియెడ నెంత హెచ్చగు భక్తో! 978

## 10.9. వామనుని [3]విశ్వరూపము

వ. అంత మహావిష్ణువు, రాజా, నిను బోలు దాత నీ మూడులోకములను కానంజాలము. జగతి నుత్తమ దాతలలో ముఖ్యునిగా నీవు శాశ్వతముగ

కొనియాడబడుదువు గాక, అని, క్షణములో, భూమ్యాకాశంబుల గప్పి, విశ్వాంత రాళమంతయు నిండి, విశ్వమందునగల ప్రతిచేతనాచేతన జంగమ స్థావరముల, జీవముల, నిర్జీవంబులన్నియు తనదేహంబున ప్రతిబింబించు రీతిని విశ్వరూపంబుదాల్చెను. అపుడు విష్ణుని దేహమందు వివిధ గ్రహ, ఉపగ్రహ సంయుతమైన సూర్య మండలము, అట్టి గ్రహములు గలవి లేనివి యైన శతాధిక నక్షత్ర సంకలితంబులగు విస్తృత తేజోవిరాజితమగు పాలవెల్లి[4] వంటి విభిన్న ధామనిధిపుంజంబులు నిరంతర భ్రమణముతో వర్తిల్లు చుండెను. వీటితోబాటు, ఈ అనంత విశ్వంబునందు గల లెక్కకు మించిన బ్రహ్మాండ క్షేత్రంబులు, వీటిలో అగణిత శతసహస్ర నక్షత్రమండలములు, నక్షత్రములను పరిభ్రమించు గ్రహంబులు, ఉపగ్రహంబులు, అతివేలంబగు దీప్తి స్థానములు, సంపూర్ణాంధకార బంధురంబులైన లోతెరుగని గుండంబులు[5], ఈ వివిధ వస్తు వలయంబుల మధ్యగల అంతరాళములతో గూడి పారమేలేని యనంత వ్యాప్తిగల విశ్వగోళము విష్ణుని శరీరముగా నొప్పారు చుండెను.

కొన్ని గ్రహోపగ్రహంబులు స్వశక్తిపైనను, తమ తమ నక్షత్రశక్తులపైనను ఆధారపడి పరిణామము చెందుచున్నవి. తరచుగా ద్రవ్యశూన్య ప్రదేశంబుల యందు గల శక్తిస్థానంబులు, శక్తి స్థితి పరిణామ ప్రక్రియ వలన ద్రవ్య రూపంబున నుద్భవించి నక్షత్రములుగ రూపుదిద్దు కొనుచున్నవి. కొన్ని తమకున్న శక్తిని కోల్పోయి, దీప్తిలో కృశించుచున్నవి. కొన్ని తారామండలముల శక్తి పూర్తిగా నశింప, ద్రవ్యవినాశంబు నొందుచున్నవి. అట్లు నశించిన ద్రవ్యమే శక్తిరూపమున ఆవిర్భవించుచున్నది. ఇట్లు నిరంతరముగా శక్తి ద్రవ్యముగను, ద్రవ్యము శక్తిగను మార్పుచెందుచున్నవి. శక్తి ద్రవ్యముగ మారుటయే సృష్టి, ద్రవ్యము శక్తిగా మారుటయే లయము. ఇంతియ గాక అనంత వ్యాసముగల గోళాకార విశ్వము కాలానుగతంబుగా తన వ్యాసమును పెంచుకొనుచు, వ్యాపన చెందుచున్నది. ఇవి కాల బద్ధముగాక నిరంతరము సాగు విశ్వ ప్రక్రియలు.



నక్షత్రమండలంబుల గల గ్రహోపగ్రహంబుల కొన్నింటిపైన, శక్త్యాధార రసాయన సంయోగముల మూలమున నుద్భవించిన వివిధ రకముల జీవరాశులు శ్రీహరి విశ్వరూపమందు కన్పట్టుచున్నవి. ఇవి ఇప్పటికే శతసహస్రా నీక రీతులుగా పరిణామము చెందినవి. నిరంతర సృష్టి ప్రక్రియగా, ఇవి ఇంకను మునుముందు పరిణామము చెందగలవు. నూతన జీవరాశులు ద్భవించగలవు. అటులే భూమండల నివాసులకు శ్రీపతి విశ్వ రూపమున, భూమిపైగల పర్వతములు, నదులు, లోయలు, ఎడారులు మొదలగు భూమ్యో పరితలాకృతులు గూడ కన్పట్టినవి. 979

ఉ. ఆ విధి శౌరియున్ తన యనంత గుణమ్మగు విశ్వరూపమున్
ప్రావగ చూప, మానవులు భ్రాంతిని సోలిరి, దేవతాతతుల్
తీవరపాటుచెందుచు నుదీరిత వ్యోమమునుండి కాంచగా
నా విధియున్ పురందరుడు నాత్మ నుతించిరి శౌరి నీగతిన్. 980

## 10.10. విశ్వరూపమున నున్న శ్రీహరిని బ్రహ్మ, ఇంద్రుడు ప్రార్థించుట

[6]శా. "ఈ విశ్వ స్థితి సృష్టి సంయుత కళా వృక్షాంఘ్రి కాండంబునై
నీ వేకైకుడవై నిరంతరముగన్ నేపథ్య సంచారివై
భావాతీత మనోజ్ఞరూపగుణ సంపత్తిన్ పరబ్రహ్మవై,
ఆవాసింతువు సర్వభూతములలో వ్యాపించి విశ్వేశ్వరా! 981

ఉ. ఐనను గాని లోకముల యందు వసించెడు జీవసంతతిన్
మానుగ రక్షసేయగను మానిత రూపములన్ ధరించి నీ
వానిక నాదుకొందు నెఱవాదితనమ్మున, వేలువేలుగా
పూని విశేష నామముల బ్రోతువు, తీర్తువు వారి కోరికల్. 982

మధ్యాక్కర :

వేయి శిరంబులు, కనులు, వేయి కరచరణములును,
వేయి విశేష రూపములు, వేయికి మించు నామములు,
నాయిత విశ్వ వ్యాపనము, నద్భుత తేజము తోడ
స్థాయి వెలుంగ హరి నిను సాగి నుతింతుము దేవ! 983

మధురగతి :

నశ్వర మొందక న్యాయము విడకను
శాశ్వత రీతిని శక్తితొ జగతిని
ఈశ్వరుడై ధృతి నేలెడు విభునకు
విశ్వము నిండిన వేత్తకు వినతులు. 984

తే.గీ. తెలిసియొ తెలియకయొగాని దేవ దేవు,
వేదవేద్యుని, విశ్వేశు వినుతి సేయ,
లవణ మేరీతి జలమున లయము నొందు
నటులె పాపరాశియు డింది యంతరించు. 985

తే.గీ. దూది పింజల మండించి బూదిసేయు
నగ్ని కీల సామ్యముగ పాపౌఘములను
శౌరి నామసంకీర్తన శక్తి ధాటి
సర్వ నాశనమొనరించి సమయజేయు. 986

తే.గీ. నీటితో వహ్ని, వెలుగుతో నిశ శమించు
రీతి, హరినామ భజనమ్ము ప్రీతి జరుప
పాప సంఘంబు నశియించి తాప ముడుగు,
మనసు శాంతి వహించును తనువు తనియు. 987



ధ్రువకోకిల:

పరమ పావన, భక్తవత్సల, పాపనాశన, శ్రీహరీ!
పొరయు పున్నెము, నిన్ను తల్చిన భూపతీ, భవ నాశనా!
దరికి జేరిచి సర్వజీవుల ధర్మమార్గము చూపవే
కరుణ తోడను మానవాళికి కర్మనాశము చేయవే. 988

మత్తకోకిల:

మిమ్ము కొల్చెడు జీవరాశికి మేలొసంగుదు కేశవా!
నెమ్మనంబున పూజచేసిన నిశ్చయంబుగ దేవరా!
ఇమ్ముగా దరిచేర జేయుచు నింపు గూర్తువు శ్రీహరీ!
ప్రమ్ము చీకటి బాయసేయుచు ప్రాణభీతిని మాన్పుచున్. 989

మత్తకోకిల :

కక్షతోడను స్వర్గరాజ్యము కాంక్ష కూల్చిన దుష్టునిన్
శిక్ష సేయుచు భీకరంబుగ చెండుచున్ బలి దానవున్-
రక్షసేయుమ దేవలోకము రక్తితోడను మాధవా!
అక్షయంబుగ నార్షధర్మమహత్త్వమున్ నిలబెట్టుమా. 990

## 10.11. వామనుడు బలిని పాతాళమునకు త్రొక్కుట

వ. అపుడా బ్రహ్మ, వాసవుల సుతుల నాలించుచు, విజ్ఞప్తులను మన్నించుచు, శ్రీహరి తన దక్షిణ పాదంబును విస్తారించి భూమినెల్ల గప్పి, 991

ఉ. అంత నతండు వామపద మద్భుతరీతిని యెల్లవారలున్
వింతగచూడ నెత్తి, వినువీధిని దాటగ పైకి సాచె వి
శ్వాంతము దాక, సత్య, త్రిదిశంబుల తోడుగ నూర్ధ్వ లోకముల్
సాంతము నిండ కప్పె జగదంతరమెల్ల త్రివిక్రమాకృతిన్. 992

వ. అట్లు నిలిచి యా ఉపేంద్రుడు దివిజేంద్రునితో నిట్లనె. 993

చం. హరిహయ! వామ పాదమున ఆకసమంతయు కప్పినాడ నీ
వరుసముతోడ స్వర్గము నవారిత రీతిని యేలుకొమ్మికన్,
సురరిపు నాయకుండు బలి సుబ్బన చూఱలుగొన్న నీ స్థలం
బెఱుకనె నాకు దానముగ నిచ్చెను – నేనిది నీకు నిచ్చితిన్. 994

వ. ఇంకను వినుము, 995

ఉ. నా కుడి పాద మీ భువిని నల్వుగ మోపితి నందుమూలమై
నాకిది ప్రాప్తమయ్యె – బలి నాచిన భూవరు లాస్తులివ్వి, నీ
వీ కడకంపి వేగుల నివెవ్వరి భూములొ వారి సంతుకున్
తేకువలేక యేలుకొన దీవెనతోడుగనిమ్ము తీరుగన్." 996

వ. అని దేవేంద్రు నాజ్ఞాపించి, తన విశ్వరూపదర్శనతో బలిని, వాని బంధు మిత్ర పరివారమును, యజన నిర్వాహకులను, సదస్యులను పునీతుల గావించి, తిరిగి తన నిజ స్వరూపంబును చేకొని, బలి చక్రవర్తితో నిట్లనెను. 997

కం. "నీ విచ్చిన మూడిట జగ
తీవర! నే రెండడుగులు స్థిరముగ గొంటిన్.
నీవే తెలుపుము నే నే
తావున పెట్టంగ వలెనొ తక్కిన పదమున్." 998

కం. అనవిని బలిరాజన్యుం
డనె "నా శీర్షమున నుంచుమయ్య మహాత్మా!
అనుపమమౌ నీ పదమును
వినయముతో మోచుకొందు వేడుక తోడన్." 999



## 10.12. బలి చక్రవర్తికి శ్రీహరి వరముల నిచ్చుట

వ. అన, వనమాలి తనముందు మోకరిల్లి వ్రాలిన బలితో నిట్లనెను. 1000

కం. "బలి! నిను బోలెడు వితరణ
గలవా రరుదీ ధరణిని, కలకాలము నీ
యలఘు వదాన్యత మెచ్చుదు
రిలలో, నీ పేరు నిలుచు నెప్పటికైనన్. 1001

వ. నీవు త్రైలోక్య సార్వభౌమునిగ నున్నపుడు కొన్ని సుగుణవర్తనముల చూపితివి. యజ్ఞయాగాదులు నిర్వహించితివి. నిరంతరముగ దాన ధర్మములు చేసితివి. కాని, నీకు జన్మతః సంక్రమించిన రాక్షస వంశ గుణబీజముల మూలమున కొన్ని ధర్మవిరుద్ధములగు పను లాచరించితివి. ముఖ్యముగా, ఆర్షమత విరుద్ధముగ యజన హవ్యంబులను త్రిదిశులకివ్వ నిరాకరించితివి. ఈ సంప్రదాయమును భూలోకవాసు లనుసరింప, ఇచట సనాతన ధర్మగ్లాని జరిగెను. కావున నిన్ను శిక్షించుట తప్పుట లేదు. నీ వనినటులే 1002

కం. నా పాదము నీ తలపై
మోపుచు పాతాళ లోకమును చేరగ ని
న్నేపుగ త్రొక్కుచు నుంటిని–
నీ పూర్వ నివాసమునకు నెట్టన జేరన్. 1003

తే.గీ. నీ సుదతియు, సంతానము, నీ హితులును,
బందుగులు, సచివులును నీ పరిజనములు,
మునులు నినుగూడి వత్తురు, పూర్వ మట్ల
రాజ్య మేలుకొమ్మచట నిర్భయముగాను, 1004

తే.గీ. నీవు కోరిన రీతిలో నేటినుండి
తనరి నాభక్తి యందున తవిలి యుందు,
పవలు రేయనకుండ నప్రతిహతముగ
నిరతి నానామ సుధ గ్రోలి నెగడు చుందు. 1005

తే.గీ. నియుత యుగములు నన్నిట్లు నియతి కొలిచి
పరిణతము నొందు తరుణాన ప్రతిభ తనర
బ్రహ్మగా నీవు నియమింప బడుదువయ్య,
సృష్టిలో నాకు సాయంబు సేయు కొరకు. 1006

వ. బ్రహ్మగా సాగుచునే, నా పాదారవింద జాత మరందపానముతో తృప్తి చెందిన పిదప, నీవు వైకుంఠలోక శాశ్వత నివాసము నొందుదువు గాక", అని బలి భవిష్యత్తును నిర్ణయించి ఆ మాయా వామన వటురూపధారియైన హరి యజ్ఞవాటిక నుండి మును తనతో వచ్చిన ముని బృందమును గూడి తప మాచరించుటకు, సనాతనార్షమత సూత్రంబుల తన శిష్యుల ద్వారా వ్యాపకము చేయు నిమిత్తమును మహేంద్రగిరికి తరలి వెళ్ళెనని విశ్వామిత్రుడు వామనావతార వివరములను రామ లక్ష్మణులకు తెలిపి వారి నానంద పరిచెను. 1007

---

**వివరణలు :**

[1]విక్రమ శబ్దమునకు 'శౌర్యము' తోబాటు, 'చరణము' అను అర్థము కలదు (శబ్దరత్నాకరము).

[2]స్మృతులొట్టీవాకట్టు=స్మృతులు+ఒట్టి+ఈవు+ఆకట్టు= శాస్త్రములు చెప్పి నన్ను మెప్పించితివి (అని భావము)

[3]శ్రీమహావిష్ణువు విశ్వరూపమును వర్ణించునపుడు కొన్ని అధునాతన విజ్ఞానశాస్త్ర పరిశోధనా ఫలితములను పొందుపరచితిని. వీటితో నా ఊహాజనిత విషయములు కొన్ని చేర్చితిని.



[4]పాలవెల్లి అనగా మనము రాత్రులందు ఆకాశమున చూచు విస్తారిత తేజోక్షేత్రము. దీనిని ఆంగ్లమున milkyway అందురు.

[5]సంపూర్ణాంధకార బంధురంబులైన లోతెరుగని గుండంబులు. ఇవియే black-holes అనబడు ప్రముఖ అంతరిక్ష క్షేత్రములు.

[6] పద్యతాత్పర్యము : ఓ జగత్తున కధిపతియైనవాడా! ఈ విశ్వ స్థితి సృష్టి రచనా నైపుణ్య కళ యను వృక్షమునకు, మూలమై, మ్రానువై, కేవలుడవై కాలాతీతముగా నూహాతీతమైన మనోహర రూప భాగ్యములతో పరబ్రహ్మవై నెలకొని సంచరించుచుంటివి.

**వామనావతార ప్రత్యేకతలు :** శ్రీహరి యవతారములలో నీ వామనావతార ప్రత్యేకతలను పాఠకులు గుర్తించవలసి యున్నది. అన్ని అవతారంబులలోను భువిపై దుర్మార్గుల ప్రాబల్యము పెరిగి, అధర్మము వృద్ధి చెందినపుడు భగవంతుడైన హరి యవతరించి, ఆ దుష్టులను బంధు మిత్ర పరివార సహితముగ మట్టుబెట్టి, ధర్మ ప్రతిపాలనము చేయును. విష్ణుదేవుని ముఖ్యావతారములుగ పరిగణించబడెడు మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, పరశురామ, రామావతారములు దనుజులను, దైత్య స్వభావులను నాశనము చేసెను. కృష్ణావతారములో కూడా కంసుడు మొదలైన దైత్య సంపర్కముగల దుష్ట వర్తనులను వధించెను; యుద్ధములవంటి కార్యక్రమములద్వారా, తాను సాక్షీభూతముగా మాత్రమే యుండినను కౌరవ, పాండవ పక్షముల వారిలోని దుర్మార్గుల నాశనమునకు, తద్వారా భూభారము తగ్గించుటకు కారణభూతు డయ్యెను. బుద్ధుని అవతారము కేవలము సాత్వికావతార మగుట, భూమి వాసులను వధించు ప్రసక్తి లేదు. ముందు రాబోవు కల్కి అవతారము గూడా దుష్టులను కోటానుకోట్లగా అంతమొందించుట ద్వారా ధర్మోద్ధరణ జరుపునని మన మూహించ వచ్చును.

ఒక్క వామనావతారములోనే భగవంతుడు ఎవరినీ వధింపకయే తన అవతారాశయమును సాధించెను. తన ప్రాపులోని దేవేంద్రునికి బద్ధశత్రువు, ఆ నాటి దానవకులములకు ప్రతినిధి యైన బలిని గూడా – వానిని వంశాంతముగా నాశనము చేయుమని బ్రహ్మ, మఘవుల అభ్యర్థనలను త్రోసిపుచ్చి, కేవలం అతడు జయించిన రాజ్యములు మాత్రమే వెనుకకు తీసుకొని, వాని సొంత లోకము నేలుకొనుమని పంపించి

వేసెను. బలి చేసిన పుణ్య కార్యములకు ఫలితముగా వానిని భవిష్యత్ బ్రహ్మను చేయుచున్నాడు. దీనిని బట్టి, భగవంతుడు లోక వ్యవహారములలో ఎంత నిష్పక్షపాతము గానూ, హేతుబద్ధము గానూ ప్రవర్తించునో మనకు తెలియుచున్నది.

***

# 11. యజ్ఞ పరిరక్షణ ఖండము

## 11.1. కౌశికుడు యజ్ఞమును కాపాడ రామలక్ష్మణుల నియోగించుట

వ. ఆ విధంబుగ, సిద్ధాశ్రమ స్థలపురాణమును, వామనావతార చరిత్రను రామ లక్ష్మణులకు వివరించి, విశ్వామిత్రుడు తిరిగి ఇట్లనియె. "ఓ రామచంద్రా! తదుపరి కాలమున నే నీ ఆశ్రమమున సిద్ధిపొందనెంచి యజ్ఞ, యాగాదుల నాచరించుచు, నిగమాగమ వేదాంగాదులను శిష్యపరంపరలచే పఠింపచేయుచు, ఆర్షమతాభివృద్ధికై నిరంతరకృషి చేయుచుంటిని. ఇది సహింపనోపక రావణానుచరులు నేను చేయ బూనిని యనేక యజనములను నాశనము చేసిరి. అయినను లోకహితార్థమై ఇపుడీ చైత్రమాసమున శుభ ముహూర్తమెంచి, ఒక మహిమాన్వితమైన క్రతువు నారంభము చేయుచుంటిని. 1008

తే.గీ. ఆరు దినము లీ యజనంబు నాచరింప
పూనుచున్నాడ సంపూర్ణ మౌన నిష్ఠ,
ప్రాక్తనార్ష సంశ్రేయ సంప్రాప్తి కలిగి
జగతి జీవులు సంతత ప్రగతి నొంద. 1009

ఉ. కాని దురాత్ములౌ దనుజ కాపథవర్తులు రక్తమాంసముల్
పూనికతోడ కుంభముల బోర్కొన తెచ్చి వియత్ స్థలంబు నం
దానిక గొంచు కుండముల నాయత వృష్టిగ గ్రుమ్మరించి, సం
దానము చేసి యాజకుల, ధ్వంసమొనర్తురు యజ్ఞకార్యమున్. 1010

కం. కావున నోరామా! విను
మీవును లక్ష్మణ! వదలక నీ క్రతువాటిన్
ప్రావగ కాపాడ వలయు
భావంబున నోర్మితోడ పాటవ మొప్పన్. 1011

ఉ. ప్రోచుడు యజ్ఞ వాటిక నిరుత్తర శౌర్య ధురీణులార! మా
రీచ సుబాహులున్ దనుజ బృందము తోడుత దాడి సల్పగా
వేచుచునుండురెల్లపుడు, వీరలనడ్డుకొనంగ మీరు నా
రాచము వింట గూర్చి యపరాతిరినైనను నిల్వగావలెన్. 1012

తే.గీ. అంకురార్పణనుండి పూర్ణాహుతి యగు
దనుక మీరు రేలు పవళ్ళు ధనువు పూని
కామరూప దక్షులగు రక్కసుల నొంచి,
అప్రమత్తత సవము కాపాడ వలయు. 1013

తే.గీ. అధ్వర ముహూర్త మాసన్నమౌట నింక,
దీక్ష వహియించి నే మౌన దీక్ష నుందు"
ననుచు మౌని వెడలె నినకులునకు
యజ్ఞ రక్షణ బాధ్యత నప్పగించి. 1014

## 11.2. శ్రీరాముడు హోమకుండములపై శస్త్రముల ఛత్రము కట్టుట

ఉ. అంతట రాఘవేంద్రులు శతాధిక కుండ పరిష్కృతమ్ము, నా
గంతుక సభ్య, సంయమి వికాసిత విస్తృత యజ్ఞవాటికా
ప్రాంతము సంచరించి పరిరక్షణ మార్గము లెంచి, దైత్య వం
శాంత మొనర్చు శక్తిగల శస్త్రములన్ సమకూర్చి యాదటన్. 1015

కం. అమ్ముల పొది నిండుగ విశి
ఖమ్ముల వేర్పరచి కూర్చి కవచ శిరస్త్రా
ణమ్ముల నిష్వాసమ్ముల
తమ్ముడు, రాముండు వీక ధరియించి రొగిన్. 1016



కం. సవన స్థండిలముల దరి,
పవిత ప్రాగ్వంశ ధామ పరిధుల యందున్,
ప్రవిమలమౌ క్రతు శాలల,
నవియివి యననేల యజన మంతట వారై. 1017

కం. బీరమున నైదు దినములు
నారాచంబులు ధనువుల నలు వొప్పంగా
కూరిచి కాచిరి హవనము
పౌరుషమున దాశరథులు పవలున్ రేలున్. 1018

వ. అట్లు రామ లక్ష్మణులు లక్ష్యంబు సాధింప నిద్రాహారంబుల త్యజించి యవధానులై యజనావధులను, వాటికాంతరములను పరిక్రమించుచుండ, 1019

సీ. ఆరవ నాడు సహస్ర మాతంగ బ
లాఢ్యులు పంక్తికంఠానుచరులు
ధృష్టతన్ రేచి మారీచ సుబాహులు
తమిని జనస్థాన దండకా గ
హన వాసముల నుండి యధ్వర స్థాన స
మీప స్థలమున సమీకరించి,
మేటియౌ పథకంబు దీటుగా నోజించి
కౌశికుని సవము నాశ మొనర,

తే.గీ. పోతురౌతుల బోలిన ముష్కరులగు
ప్రముఖ దైత్య బృందములను పంపి రపుడు
భాండములతో రుధిర మాంస ఖండములను
కుండముల యందు నిండుగ గ్రుమ్మరింప. 1020

తే.గీ. ఇచట కౌశికుని యజన మేమఱిలక
రక్షసేయుచు నుండి యారవ దినమ్ము
కెలసి పరిసరంబుల పరీక్షించు నపుడు,
తలను పైకెత్తి చూడంగ తరణికులుడు. 1021

శా. ఆకాశంబున దక్షిణాశపయి నత్యంతంబు సూక్ష్మాతి సూ
క్ష్మాకారంబులు నల్లమచ్చలవలెన్ కన్పట్టె తొల్దొల్త, నా
పై కాకంబుల వోలె, నా పిదప ఘోరాకారులౌ దానవుల్
వీకన్ తోచిరి నీలి మేఘముల ప్రావృట్టున్ విడంబించుచున్. 1022

వ. అదిగని శ్రీరాముడు విజృంభించి, యుద్యుక్తుడై, 1023

తే.గీ. వారి చేతుల నున్నట్టి పాత్రములను
గాంచి మౌనిచే మున్నెచ్చరించ బడుట,
పిశిత రుధిర సంయుతము లవి యని యెఱిగి,
అనుజ సంయుతుడై మూగి యాక్షణంబ. 1024

సీ. రిమ్మతో దైత్యులు క్రుమ్మరించెడు మాంస
ఖండములు యజన కుండములను
గాని యజన భూమి గాని పడగనీక,
ముని కూరుచున్న యాసనము పైన
కొంతెత్తు మబ్బు దిగువ నొక్క బిందువు
కేంద్రంబుగా గిరగిర తిరిగెడు
శస్త్ర వినిర్మిత స్థగితమౌ ఛత్రంబు
ననిలుడైనను దూరనట్టిదాని,
తే.గీ. యుత్కట వ్యాస వలయంపు నోజ దాని
ప్రతిభ రచియించె రఘుకులస్వామి యపుడు,



దాని గాంచుచు భీతిల్లి ధ్వాంతచరులు
దారి తెన్నులు తోచక స్తబ్ధుపడగ. 1025

ఉ. బంతిగ రక్త మాంసములు బాణపు పందిరి పడ్డవెల్ల ఛ
త్రాంతము దాక జిమ్మబడి ధారుణి పైనను తూలుగాని, ఆ
వంతయు యజ్ఞ వాటికలపై పడకుండుట చూచి దానవుల్
భ్రాంతిని పర్వు లెత్త, కని రాముడు,తమ్ముడు వారి కూల్చినన్. 1026

వ. ఆ విధంబున రాఘవ స్వాముల నిశిత శరంబులకు మట్టుబెట్ట బడిన ముష్కరులలో 1027

కం. హతశేషులైన దానవు
లతివేగముతోడ నేగి యజమానులకున్
కతలుగ భీతిలి తెలిపిరి
వెతతోడను వింత జంత్ర విషయము లెల్లన్. 1028

వ. మున్ను గూఢచారుల వలన మారీచ, సుబాహులు వినినట్లు, విశ్వామిత్రుని యాగ రక్షణం బయోధ్యా నరపాలుని కుమారులగు రామ లక్ష్మణులు చేయుచున్నారను విషయంబు సత్యమై నట్లెరింగి, 1029

## 11.3. శ్రీరాముడు మారీచ, సుబాహుల ఉక్కడగించుట

చం. అదటున దైత్యవీరులు నరాంతక మూర్తులు తాటకాసుతుల్
సదమద పుచ్ఛ భోగులటు సఱ్ఱున లేచి విహాయసస్థలిన్
పదరున నాక్రమించి క్రతు వాటిక లోగల ఛత్ర యంత్రమున్
విదళన చేసి యాజికుల పీచమడంచగ నుద్యమించుచో. 1030

చం. అదవద గాంచి యా క్రతు సభాంతర మందు ప్రభాకర ద్యుతి
ప్రద రుచిరాంగ తేజుల విభావసు వంశ్యుల రాఘవేంద్రులన్,
వదిగొని యున్న క్షాత్రవ విభావిత విక్రమ శౌర్య ధుర్యులన్,
మదులు కలంగి వారపుడు మ్రాన్పడి మాయ నదృశ్యమై భువిన్. 1031

కం. ఎఱగుచు నంబర వీధికి
నెఱవరులై ప్రస్తరముల నిర్యంత్రణగా
పఱపిరి రవికులజులపై
బిఱుసున చూపరుల మదుల వెఱపు జనించన్ 1032

వ. ఆ రాళ్ళవానకు కుపితుండై, 1033

ఉ. రేచిన సింగమో యనగ శ్రీరఘురాము డుదగ్ర ఘోర నా
రాచ యుగంబు నొక్క విలు ప్రాప్తిల జేసి గుణమ్ము పట్టి బా
హా చతురత్వ సంయుత మహాబలసంపద లాగి యేసె మా
రీచ సుబాహు రక్కసుల వృత్తులు రిత్తకు రిత్తయై చనన్. 1034

వ. అట్లు రాముం డేకకాలంబున తన వింట సంధించి విడిచిన రెండస్త్రంబు లతి వేగంబున రెండు మార్గంబుల గమించుచు, 1035

కం. అందున నాగ్నేయాస్త్రం
బిందుకళాశేఖరు విషమేక్షణ మనగన్
కందించి బూది చేసెను
మందుండు సుబాహు దైత్యు మంకిల మగుచున్. 1036

కం. మాఱుటిదౌ వాయవ్యము[1]
మారణ చేయక కృపగొని మారీచు వెసన్



దూరంబునగల పశ్చిమ
పారావారంబు నందు పడగా విసరెన్. 1037

వ. ఆ విధంబున నిరుపమ శస్త్రాస్త్రపాటవ నిష్ణాతుండైన రామచంద్రుడు, 1038

కం. నేటుగ రెండస్త్రంబులు
నాటుచు వేటాడె కపట నాటకచరులన్
ధాటిని తాటక సుతుల ని
శాటుల పోరాటమందు సాటియు లేకన్. 1039

కం. క్షతగాత్రులైన రక్కసు
లతల కుతల మానసచరులై లంకా భూ
పతి కడకు పాఱి వెతతో
జతలై తెలిపిరి జరిగిన సంగతులెల్లన్. 1040

## 11.4. కరాళుని నివ్వెఱ

వ. ఆ సంగ్రామంబున మారీచుని సేవకుడైన కరాళుడనువాడు, 1041

ఆ.వె. చావు తప్పి తనువు జడ్డతో క్రుంగంగ,
బ్రదుక లేక బ్రదికి బట్టగట్టి,
పరుగు పెట్టి వాడు స్వామికై శ్రద్ధతో
చాల నాళ్ళు వెదకి చదల నుండి. 1042

వ. తుదకు సహస్ర యోజన దూరంబున నున్న పశ్చిమ సముద్రతీరంబున మారీచుని మకుట, ఖడ్గంబులను గాంచి గుర్తు పట్టి, యచట కొన్ని దినంబులు వేచి మిన్నేటినుండి చెలియలి కట్టకు కొట్టుకొని వచ్చిన తన యజమానిని కనుంగొని, 1043

ఆ.వె. మాట మంతి లేక మ్రానట్లు పడియున్న
ప్రభుని సేవజేసి పసరు మందు
మాకు లిచ్చి సాకి మమతానురాగాన,
బ్రదుక చేసి వెతను పలికె నిట్లు. 1044

ఆ.వె. దేవ! నిన్ను చూడ ఠావు తప్పెను గుండె,
తనువు తోడ పరువు మునిగిపోయె
నెట్టు లోర్చు కొనుచు నిట్టులుంటివొ గాని!
తలుచుకొన్న కడుపు తఱుచ బడియె. 1045

ఉ. కావున నీ పరాజయము కాతర మందుచు మందటించకే,
నీవు ప్రతిక్రియా మతిని నీ హితుడున్ పరిరక్షకుండునౌ
రావణు సాయమున్ గొని దురమ్మున కూల్చి పరాభవింపు మా
కావరికాని నిన్నిటుల ఘాతమొనర్చిన రాజపుత్రునిన్. 1046

వ. అన విని, ఆ యోచనకు మారీచుం డియ్య కొనక, తన కింకను మాటాడు శక్తి లేకపోయినను, కడుకష్టమున కింకరునితో నిట్లనియె. 1047

ఉ. ఓయి కరాళ! లోకముల నున్న విశిష్ట బలావతంసులన్
ప్రాయిగలట్టి వీరులను ప్రాయికమున్ బొడగంటిగాని ఈ
స్థాయిని విల్లు నంబులను దాసుల భంగిని నాట్యమాడగా
చేయగలట్టి కౌశల విశేషుని నే కననైతి నెన్నడున్. 1048

చం. ఘనమగు నా నరేంద్రు కరకల్పిత బాణము లెంచి చూడగన్
గణితములై భువిన్ వెలుగు కన్నను మెండగు వేగవంతముల్,
కనలిన వేళలందు శితికంఠుని మూడవకంటి జ్వాలలున్.
ధనువొనరించు టంకృతు లుదగ్ర ధణంధణ వజ్రఘట్టనల్. 1049



కం. అవి తలచినంత నా మది
వివశత్వము చెంది కందు, భీతిని చేతం
బు వణకు కనుకా నర పుం
గవుతో తగవన్న దింక కలలో మాటే. 1050

కం. రావణున కిందనుక నే
సేవలు చేసితిని కాని సిద్ధియు గలదే,
కావున రక్కసి వృత్తులు
వే వీడుట మేలనుచు వివేకము తెలుపున్. 1051

కం. ఈ వననిధి తీరమునన్
వావిరి నొక యాశ్రమంబు వాసము గాగన్
భావిని సాత్విక బుద్ధిని
జీవించెద నే తపంబు చేయుచు నిష్ఠన్. 1052

తే.గీ. స్వేచ్ఛ నిచ్చితి నీకు నీవిచ్చగొనిన
పట్టు నచ్చిన వృత్తి చేపట్టు కొనుము
గాని తెలుపకు మెవ్వారి కైన నేను
కలత నీతోడ నీరీతి పలికినట్లు. 1053

కం. నే నున్న యునికి చెప్పకు
ప్రాణము పోయినను గాని పంక్తిముఖునకున్,
నేనిట నుండు టెరిగిన బి
రానను బలి యిచ్చు నన్ను రఘునాథునకున్. 1054

వ. ఆ విధంబున హెచ్చరించి కరాళుని పంపి వేసి, మిగిలిన ప్రపంచముతో సంబంధములను వదలి, మారీచుడు తన కుటీరమున కాలము పుచ్చుచుండెను. 1055

## 11.5. దేవేంద్రుడు శ్రీరామునిపై ముత్యపు జల్లులు కురిపించుట

వ. అంత సిద్ధాశ్రమంబున, హతశేషులైన యజ్ఞ నిరోధక దానవులు పలాయనులగుటచే, హోమ కార్యక్రమంబు విజయవంతంబుగ సంపూర్ణమయ్యె, నాలోన దేవలోకంబున, బాలరాముని విజయమును వీక్షించుచు, 1056

కం. మారీచ సుబాహుల నొక
మారుగ ధనువందు రెండు మార్గణములతో
బోరున కూల్చిన బాలుని
శ్రీరాముని బొగడి పూజ చేసిరి సురలున్. 1057

కం. సురభిళ మరంద సంయుత
విరిజాజుల హారతతుల విసిరిరి వీకన్
సరిగను రాముని శిరసున
దొరయగ నిర్జర వనితలు తోరపు భక్తిన్. 1058

కం. ముదమున దివిజ గురుని సతి
హృదయం బుప్పొంగ నిచ్చె నినకులజునకున్
పెదపెద బంగరు ప్రమిదల
నదనుగ సురలావు నేతి యారతు లపుడున్. 1059

తే.గీ. యజన విధ్వంస కారుల నణచి నట్టి
బాలరాముని ప్రతిభకు చాల మెచ్చి
పాకశాసని పౌలోమి ప్రక్కజేర
వినుతి చేసెను రాముని ప్రణతులిడుచు. 1060

వ. ఇంకను సంతోషంబును పట్టజాలక, 1061



చం. సురవిభు డంబుభృత్ స్వనిత శోభిత సుందర బంధురంబులౌ
నుఱుముల నంబరంబునను హోరన జేసి, నిగార మౌక్తిక
స్ఫురిత నిభంబులౌ సలిల శుభ్ర పృషత్తుల లేతజల్లులన్
మెఱుములతోడ నేర్పడ సమీకృతిచేసి యలంకరించినన్. 1062

కం. కురిసెడు జల్లుల బిందువు
లొఱవుగ నొకదాని కొకటి యొందుపడన్ చూ
పరులకు నింగిని వ్రేలు నొ
క రజత తంతుల యవనికగా కనుపట్టెన్. 1063

ఉ. మందిత సూర్య ధీధితులు మానుగ వెండితెరన్ ప్రభిన్నమై
నందున నింద్రచాపతతు లాకసవీధిని ప్రస్ఫురిల్లుచున్
పొందిక విచ్చె, ప్రాచ్య నభమున్ కడు రంజిలి సప్తవర్ణముల్
సుందరమై కనంబడియె చూచెడివారలు మోదమందగన్. 1064

వ. సిద్ధాశ్రమమునగల మునికుటుంబంబు లా వింతలను చూచి ఆనందించిరి. ఆ సమయమున, 1065

ఉ. ఛాత్రులు గుంపులై కలసి చల్లని వర్షమునందు మగ్నులై
చిత్రముగా నటించుచును చిందులువేయ, పురంధ్రు లంతలో
నాత్రముతోడ కప్పురపు హారతు లిచ్చిరి రామమూర్తికిన్,
స్తోత్రములన్ పఠించిరి ప్రతోష మనస్కత మౌనిపుంగవుల్. 1066

## 11.6. విశ్వామిత్రుడు యజన సంరక్షణచేసిన రామ లక్ష్మణుల నభినందించుట

వ. అంతలో, యజనాదిషట్కర్మనిరతుడు, బ్రహ్మర్షి యగు విశ్వామిత్రుడు, 1067

చం. హవనము పూర్తిచేసి పరమాద్భుత సిద్ధిని పొంది కౌశికుం
డవభృథ మగ్నదేహుడయి యాదృతి రాముని పిల్చి చెంతకున్,
రవి గని కుట్మలాంబుజము రంజిలి విచ్చిన యట్లు బాహువుల్
నవదళముల్ వలెన్ వికసనంబగు నట్లుగ సాచి ప్రీతితో. 1068

ఉ. పొంకముతోడ నా మహిత మోహన రూపుని రామచంద్రు స్వీ
యాంకతలంబు జేర్చి ప్రియమారగ వేమరు కౌగలించి, రో
మాంకురముల్ గగుర్ పొడవ, హర్షముతోడను మౌని రామనా
మాంకితుడైన దైత్యజన హర్త హరిన్ మనమందు కాంచుచున్1069

వ. రామునితో నిట్లనియె. 1070

కం. "నీ మూలంబున నా సవ
మామూలంబుగ సమాప్తమయ్యెన్ రామా!
భూమినిగల జనులకు నెం
తో మేలొనగూడు నీ క్రతువు మూలమునన్. 1071

ఉ. ఎంతటి భాగ్యవంతుడనొ యెంత కృతార్థుడనో మహాత్మ! నీ
చెంతను నిన్నినాళ్ళుగను చేరి వసించితి నింతకన్న వే
రింతటి సంపదేమి గల దీభువి నెవ్వరికైన, కాని యొ
క్కింతగ కార్యముండె నది యేర్పడ నేర్పుగజేసి యేగుదున్." 1072

వ. అని పలికి, విశ్వామిత్రు డాశ్రమవాసులను గూడి లక్ష్మణసహితుడగు రామభద్రుని పరాక్రమంబును, మునిజనాదరణీయ సనాతనధర్మ ప్రతిష్ఠాపనా కుతూలహతను పలుమార్లు వినుతించి, రామ లక్ష్మణులను పక్వఫలాదుల భుజింప చేసి, పురాణంబులు చెప్పుచు, మూడహోరాత్రములు పండుగ వాతావరణముతో వారెల్లర నానంద వార్ధి నోలలాడించెను.



అంత నాలవ నా డుదయంబున రామచంద్రుండు, విశ్వామిత్రునికి సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి ఇట్లు విన్నవించెను. 1073

కం. "క్రతు విధ్వంసము నాపగ
ప్రతినగొనుచు మీ రయోధ్య పట్నంబున మా
పితను మము పంప వేడిరి,
పతియును పంపెను మము తమపైగల భక్తిన్. 1074

ఉ. మీరు దయా స్వభావమున మేలగు నస్త్రము లెన్నియో మమున్
చేరగ నిచ్చినార లవి చేతనుపట్టి పరిక్రమించగా
ధీరతగల్గి బాణముల తీరుగ వేసెడు ప్రజ్ఞయబ్బుటన్,
మీఱుచు దానవాధముల మేదిని క్రుంగగ చేసినారమున్, 1075

కం. మా యవధానము మేరకు
మీ యజనము కాచితిమి సమిద్ధశ్రద్ధన్,
మీ యాశయంబు మేరకు
మీ యజనము విజయమాయె, మేలయె ధరకున్. 1076

ఉ. పావన కౌశికాన్వయ విభావస! మీ సహచర్యమూలమై
ఈ వనభూములందున, మునీంద్రుల వాటికలన్ వసించు భా
గ్యావహమయ్యె మాకు, తమ ఆదరణీయ గురుత్వ సేవలో
నావటిలంగ జన్మ చరితార్థము నయ్యె, కృతజ్ఞతల్ గురూ! 1077

కం. మా రాక కెదురు చూచుచు
తీరని యుత్కంఠతోడ ధీరుండయ్యున్
మా రాజు వేచుచుండును
తారుచు మాతలనుగూడి దైన్యము తోడన్. 1078

వ. మాపై నమితానురాగమున, 1079

మణిగణనికరం:

మునుపనిన దినమున తన కొమరులన్
కనని యెడల నిక జనపతి మమతన్
క్షణమొక యుగముగ గడుపును వెతతో
కునుకు గొనకను కుదులు నటునిటులన్. 1080

ఉ. కావున పోయి వచ్చెదమికన్ త్వరితంబుగ యాజ్ఞయైన, మా
తావున కంపుమయ్య వసుధాపతి చూచి నమస్కరించి, మీ
యావియు, నస్త్రశస్త్రముల నేవిధి మీరలనుగ్రహించిరో
వావిగ తెల్పగా వలయు – వారు ప్రమోదము చెంది పొంగగన్."1081

## 11.7. జనక మహారాజునుండి ఆహ్వానము వచ్చుట

తే.గీ. వీక నిట్లు రాముడు విన్నవించుచుండ,
ఋషి కుమారుడొకరు డటకేగుదెంచె,
మిథిలనేలెడు జనక భూమిపతి పంపి
నట్టి వార్తావహుల వెంట పెట్టుకొనుచు. 1082

వ. వచ్చిన రాజోద్యోగులు కౌశికునకు సాష్టాంగ దండప్రణామంబులు చేసి, తక్కుంగల మునులకు మ్రొక్కి, ఇట్లు పలికిరి. ఓ బ్రహ్మర్షీ! మీరు ప్రతిన బూని రాక్షసులచే విఘ్నపడకుండ ఒక గొప్ప క్రతువును విజయవంతముగ పూర్తిచేసిరని మా మహారాజెరింగి, మిమ్ముల నభినందించు చున్నాడు. ఇంకను వినుడు. 1083

ఉ. యాగరిరక్ష దక్ష ! మిథిలాధిపు డీశ్వర దత్తమౌ ధను
ర్యాగము చేయగా దలచి, ఆ సమయమ్మున పుత్రియౌ మహా



భాగకు సీతకున్ భవుని బాణము పూన్చగలట్టి విక్రముం
డౌ గణనీయ ధన్విికి స్వయంవరమున్ ప్రకటించె గావునన్. 1084

ఉ. మిమ్ముల మీ మునీంద్రుల నమించి వచింపగ రాజు పూనికన్
మమ్ముల పంపె మీదరికి – మా యజనంబు, స్వయంవరంబులన్
నెమ్మదితోడ పావనము నెట్టనచేయ కృపాంతరంగులై
ఇమ్ముగ రండటంచు, తమ రెప్పుడు వత్తురొ తెల్పవేడుచున్. 1085

వ. మీరు వేంచేయు సమయము తెలిపిన మిమ్ముల స్వాగతించుటకు, తమకు తమ పరిజనులకు తగిన వసతి మొదలగు సౌకర్యముల నేర్పాట్ల నొనర్చు కుందుమని ప్రణామ పురస్సరంబుగా విన్నవించి జనక మహారా జంపిన ఆహ్వానపత్రికను సమర్పించిరి. 1086

కం. జనకుడు పంపిన పత్రిక
మునివర్యుడు చదువుకొనుచు ముదపడి తనలో
తను తర్కించు కొనె నిటుల
తన పని సులువయ్యె ననుచు తలిరుపు పడుచున్. 1087

మ. మును నాయోచన వెంట రాఘవులకున్ ముఖ్యాస్త్ర సందోహముల్,
ఘనమౌ పావన దివ్య యోగ ఫల సాక్షాత్కార లబ్ధంబులన్
ప్రణిధానం బొనరించి వారికి ధనుఃప్రావీణ్యమున్ పెంచుచున్
దనుజశ్రేణుల నుక్కడంచి యజనోద్ధారంబు చేయించితిన్. 1088

కం. ఈ తీరుగ భువిపైన స
నాతన మత నాశకరుడు నక్తంచర భూ
నేతగు రావణు వధకున్
నే తోడైతి రఘుపతికి నేర్చిన రీతిన్. 1089

## 11.8. విశ్వామిత్రుడు రామునకు సీతాదేవిని గురించి తెలుపుట

వ. ఇంక నే తీర్చవలసిన బాధ్యతలలో మిగిలిన, శ్రీమహాలక్ష్మి యంశయైన సీతను, విష్ణ్వంశ సంభూతుండైన శ్రీరాముని కలుపు కార్యక్రమ మిపు డీడేరగలదని సంతసించి, మిథిలేశుని వార్తావహులతో తన శిష్యులనుగూడి మరి నాల్గు దినములలో మిథిల చేరుదునని జనక మహారాజుతో చెప్పుడని పలికి వారిని పంపివేసి, తదుపరి రామునితో నిట్లనెను. 1090

సీ. "కొలది దూరములోన కలదు మిథిలయను
పట్టణంబొక్కటి ప్రతిభ మెఱయ,
అదియు విదేహ రాజ్యమునకు ముఖ్యమై
న నగరి; దానికి జనక భూపు
డేలికయైయుండె – నితడు సద్వంశజా
తుం డుదాత్త గుణగణుండు, విక్ర
మాన్వితు డుత్తము డాత్మవేత్త, యితని
కోటలో కలదొక్క మేటివిల్లు,
తే.గీ. త్రిపుర సంహారము పిదప త్రినయనుండు
దేవతల కిచ్చె నీ విల్లు – దేవరాతు
డనెడు భూపాలునకు నిచ్చి రాదితేయు
లీ ధనువు మెచ్చి కొన్ని వేలేండ్ల పిదప. 1091

వ. ఈ దేవరాతుండు జనకుని పూర్వుండు గాన యీ శివధనుస్సు జనకునకు పారంపర్యముగా సంక్రమించెను. దీని మహత్త్వం బెవ్వరును వర్ణింప జాలరు. ఈ విల్లత్యున్నతమై, అధిక పరిమాణము కలిగియుండును. ఈ సృష్టిలో నిందనుక నెవ్వరెరుగని సాంద్రతమ లోహంబుతో నిర్మింపబడుటం జేసి, పరిమాణంబును బట్టి యూహించని అధిక భారము కలిగియున్నది. మహేశ్వరుని హస్తభూషణంబై యుంట నిది అత్యంత ప్రాభవోపేతమైనది. 1092



మ. జనకాధీశున కొక్క పుత్రి కలదా సౌందర్య వారాశి నే
లను యజ్ఞార్థము దున్నుచుండ దొరకెన్ – లక్ష్మీ కళోపేత నా
వనజాక్షిన్ జనకుండు పెంచుకొనె నవ్యాజ ప్రియత్వంబునన్
తనకూతున్ వలె – నా యయోనిజయు సీతానామ్నియై వర్ధిలున్. 1093

ఉ. అందము చిందగా పెరిగె నంగజభామిని మించు రీతి నీ
సుందరి కొన్ని యేండ్ల కది చూచి నృపాలురు వేవు రర్థులై
యిందునిభాస్య నిమ్మనుచు యేలికపైనను యొత్తిడీయగా,
నందు సుధన్వుడన్ నృపతి యల్గి విదేహను ముట్టడించుచున్. 1094

వ. ఈశ్వరదత్తమైన బృహద్ధనువును, వసుంధరా దత్తమైన సీతను తనకిచ్చి సంధి చేసుకొనుమని జనకునకు కబురుపంపెను. మిథిలేశు డామాటల సరకుగొనక దేవతల సహాయమున సుధన్వుని వధించి, ఆతని సాంకాశ్య పురంబునకు తన తమ్ముడు కుశధ్వజుని రాజు చేసెను. అంతియ గాక, 1095

కం. వసుధా సుతయగు సీతకు
వసుధేశుడు పెండ్లి కొఱకు పణమును చేసెన్,
పశుపతి విలు సంధించిన
కుశలునకున్ కూతు నిత్తు కొంకక ననుచున్. 1096

కం. జనకుడు చేసిన ప్రకటన
విని కొందరు రాజపుత్ర వీరులు కాంక్షన్
ధనువెత్తగ యత్నించియు
వెనుదిరిగిరి యోటుపడుచు విరహిత బలులై. 1097

సీ. విల్లు నెత్తంగను వీకతో యత్నించి
చాలమి నేలపై సోలువారు,

కార్ముకంబును పట్టి కదపంగ నేరక
రిమ్మతిరుగగ మూర్ఛిల్లువారు,
నిష్వాసమును తాకి ఎత్తగా నేరక
త్రపతోడ తలవంచి దడియువారు,
చాపంబు పూన్చంగ సాహసంబున నేగి
దరిచేరి భీతిల్లి తలగువారు,
తే.గీ. ధనువు నెత్తవచ్చియు తమ స్థలములందె
కదలకుండను కాలంబు గడపువారు,
విల్లు కదపలేకను భీతి వెన్ను చూపు
వారలను చూచి అపహాస పరచువారు. 1098

తే.గీ. ఊని కోదండ మెత్తంగ లేని యెడల
సుదతులూరక గేళిచేయుదురటంచు
వెఱచి తమతమ నెలవులు వీడకుండ
చెలగి మీసముల్ మెలివేసి కులుకు వారు. 1099

కం. ఆ విధి నొక్కండైనను
సావిగ ధనువెత్తనైన చాలికలేకన్
వేవిధులుగ వారలు వా
పోవుచు సభనుండి తలగి పోయిరి లజ్జన్. 1100

కం. కినుకను కొందరు యోధులు
జనకుడు వింతౌ పణమును జగలుండై చే
సె ననుచు నిరాశ తోడను
వెనుకకు మరలిరి తమతమ వీండ్లకు చింతన్. 1101



విద్యున్మాల:
సీతాకన్యన్ చేపట్టంగన్
చేతన్ విల్లున్ చేదన్ లేకన్
నేతృవ్రాతం నిర్వీర్యం బై
భీతిన్ పారెన్ వేవేరీతుల్. 1102

సుగంధి వృత్తం :
త్ర్యంబకోగ్రహస్తమండితంబు, కేతకీ సుగం
ధం బమోఘ పుష్టి వర్ధనంబు, దార్ఢ్య మున్నతం
బంబరాంబర ప్రఫుల్ల హాసికా స్వయంప్రకా
శంబు విల్లు – జేర నౌనె సాటి మానవాళికిన్. 1103

వ. విఫల మనోరథుండైన జనకుడు ప్రస్తుతము దత్త శుల్కయగు సీతకు స్వయంవరమును ప్రకటించి దేశములోని నలుమూలలగల వీరులకు వర్తమానమంపు చున్నాడు. మనము రేపుదయమే మిథిలకు ప్రయాణమౌదము. నీ వా విల్లును చూచితీరవలెను. అటులనే, సీతాకన్యను గూడ నీ వచట విలోకించ గలవు. అయోనిజ, భూపుత్రి, విక్రమాన్వితయు నగు నీ రాచకన్య సౌందర్యమును సచ్ఛీలతను వర్ణించుట కవిశ్రేష్ఠులకైన అశక్యము. నీ కాసక్తి గొలుప, నాశక్తి కొలది ప్రయత్నింతు"నని, కౌశిక మహాముని ఇట్లు పలికెను. 1104

సీ. "కుందన వరకాంత, కులసతి గుణవంత,
కుందకుట్మలదంత, కుసుమ గంధ,
ఇందు వదన బాల, బిందు కుంకుమ ఫాల,
కుంభయుగళ హేల కుచ విశాల,
కలకంఠ ప్రతిమాన, కాకలీనిస్వాన,
మృదువాణి, సురతాణి మించు బోణి,

అలివేణి, సుమపాణి, పులిననిభ శ్రోణి,
మధురరస ద్రోణి, మరుని రాణి.
తే.గీ. బాల న్యగ్రోధపరిమండలా లతాంగి,
సింహసంహనన సదృశ స్ఫీత సీత,
అందమంతయు కలబోసి హరికి నీయ
నలువ సృజయించి యుంచిన నాతి సుమ్ము. 1105

[2]సీ. వెలదుక లేగౌను విష్ణుపద సమంబు,
చెలువ కుచంబులు శివపదములు,
వక్త్రంబు తలపంగ బ్రహ్మకాస్పదమౌను,
నాతి కైశ్యము సుమనః పదంబు,
విలసితమగు కాంచి లలన నితంబంబు,
రమణి వాక్కులు మధురా పురంబు
శ్రీ రంగభూమియై చెన్నొందు దేహంబు,
నవల యధర మరుణాధరమ్ము,
తే.గీ. అలరుబోడి వర్చస్సు హిమాలయమ్ము,
కన్య దేహ మింపారు బంగారు జీర,
పున్నెముల ప్రోవు విమల ప్రభూత చరిత,
సంతతారాధ్య సురల కా సాధ్వి సుమ్ము. 1106

తే.గీ. వలతి పరిపూర్ణ శరదిందు ఫాల ఫలక,
అతివ విమల చాంపేయ పుష్పాభ నాస,
మత్తహంస వధూటినీ మందగమన,
నిత్య మాంగల్య మండిత నిరుపమాంగి. 1107

తే.గీ. బాల దివ్య ముక్తాఫలోద్భాసమాన,
తరుణి నుంపారు దాడిమీ ధవళ రదన,



నెలత నెరజాణ, తులలేని నిధి సమాన
తన్వి, హరిసతీ ప్రతిమాన తనువిధాన. 1108

తే.గీ. రాజసోపేత రమణీయ రాజపుత్రి,
సకియ సుమబాణు శృంగార శస్త్రభస్తి,
క్షమను సావిత్రి, పరిఫుల్ల కమలనేత్రి,
తరుణి అతిలోక శుభగాత్రి, ధాత్రిపుత్రి. 1109

హంసరుతం :
అందంబొప్ప సతి మాటల్
అందెల్ ఘల్లుమను రీతిన్
నందంబై నవి వినంగా
విందౌ హంసరుతమట్లున్. 1110

[3]విద్యున్మాల :
సద్యోజాతోర్జంబై జ్యోత్స్నా
ప్రద్యోతం బీ కన్యారత్నం
బాద్యోతంబై ద్యావా పృథ్వుల్
విద్యున్మాలల్ విస్తారించున్. 1111

వ. ఉజ్జ్వల లతాంగియు, సద్గుణోపేతయు, ఒప్పగు రాజస సహితయునగు ఆ దివ్యక్షత్రియ కన్య నా అమోఘమౌ వాక్కువలన నీకు దక్కునుగాక. ఆమెను వివాహమాడి ఓ కోదండరామా! నీవు కల్యాణ రాముడవై యయోధ్యకు తిరిగి వెళ్ళుదువుగాక", యని అశీర్వదించెను.

ఆ మరునా దుదయమున నిత్యానుష్ఠానముల పిదప, రామ లక్ష్మణులు ముందు నడువ, విశ్వామిత్ర మహామునియును శిష్య, సతీర్థముని బృందం

బులును, సిద్ధాశ్రమమునుండి బయలుదేరి సాయంసమయమునకు వసురాజు రాజ్యము లోని గిరివ్రజ నగర ప్రాంతమున గల శోణనద తీరము చేరి, రాత్రి సమయ మాసన్నమగుచుండ నొక స్థానమున విశ్రమించిరి. దట్టమైన వృక్షములతో విరాజిల్లుచున్న ఆ ప్రదేశ సౌందర్యమున కచ్చెరువందిన రాము డపుడు కౌశికుని ప్రశ్నింప, ఆ మునీంద్రు డీ విధముగ పలికెను. "రామచంద్రా! ఈ దేశచరిత్రను గూర్చి చెప్పవలసినది చాల గలదు. కాని మనమింక విశ్ర మించు సమయమయ్యె కనుక, దీనిని సంక్షిప్తముగా తెలిపెదను. వినుము. 1112

## 11.9. విశ్వామిత్రుడు తన జన్మ వృత్తాంతమును శ్రీరామునకు తెలుపుట

పూర్వము మిక్కిలి తపస్సంపన్నుండును, ధాత మానసపుత్రుండునగు కుశుడను మహారాజీ దేశమును పాలించెను. వానికి నలువురు పుత్రులు. వారిలో కుశనాభుడు నూరుగురు కన్నెలను కనియును, పురుషసంతానము కొరకు అశ్వమేధయజ్ఞమాచరించి గాధియను మహిమాన్వితుని కుమారునిగ పొందెను. ఆ గాధికి సత్యవతి యను కన్యయు, నేనును ఉదయించితిమి. మా అక్క సత్యవతి ఋచికుడను మహా తపస్సంపన్నుని వివాహమాడెను. వారికి జమదగ్నియను కుమారుడు కల్గెను. ఆ పేరెన్నికగన్న మహామునికి, వాని ధర్మపత్ని రేణుకకు నలుగురు పుత్రులు. వారిలో విష్ణ్వంశ సంయుతుడైన పరశురాముడే మహాపరాక్రమశాలియగు హైహయ కార్తవీర్యుని అంత మొనరించి, భూభారమును తగ్గింప, ఇరువది యొక్కమారులు జంబూద్వీప మందుగల దుర్మార్గ రాజవంశముల హతమార్చెను.

మా మూలపురుషుడైన కుశుని నాల్గవ కుమారుడు వసువు ప్రస్తుతము మనమున్న గిరివ్రజమను మహానగరమును నిర్మింపజేసెను. ఈ పట్టణ మిప్పుడు వాని వంశస్థుడైన వసురాజు పాలనలో నున్నది.



నేను యజనమాచరించు నిమిత్త మీ సిద్ధాశ్రమమునకు వచ్చితిని. నీ సాయమున యజ్ఞము జయవంతముగ పూర్తిచేసి సిద్ధిపొందితిని. కాన మన మిథిలా కార్యక్రమానంతరము మా సోదరి యగు[4] కౌశికీనదీ తీరమునకు తిరిగి వెళ్ళి యచట నివసించెద"నని, తన వృత్తాంతమును రామ లక్ష్మణులు ముదమంద వివరించెను. 1113

---

**వివరణలు :**

1) మారీచునిపై రాముడు ప్రయోగించినది మానవాస్త్రమని వాల్మీక రామాయణములో నున్నది. అది వాయవ్యమని కొన్ని అవాల్మీకములలో గలదు.

2) శ్లేషార్థములుగల ఈ పద్యమును సంస్కృత శివపురాణమను గ్రంథమున నున్న ఒక పద్యముననుసరించి కొన్ని మార్పులు చేసి వ్రాసితిని. ఈ పద్యములోని సమాసములకు తాత్పర్యములు శ్లేషార్థములు ఇచట ఇవ్వబడినవి) : ఆమె నడుము విష్ణు పదం (అనగా విష్ణువున కాస్పదమైనది, లేక; ఆకాశం వలె నస్తి నాస్తి విచికిత్సను లేవదీయునది); కుచములు శివపదములు (పర్వతములు); ఆమె ముఖము బ్రహ్మకు స్థానం (పద్మ సమము); ఆమె కైశ్యము (అనగా కొప్పు) సుమనః – పదము దేవతలకు స్థానం (లేక పూవులకు స్థానం); ఆమె నితంబస్థలం (అనగా కటి ప్రదేశం) (సకల కళలచే) ప్రకాశించు కాంచీపురం, (లేక, మొలనూలుచే ప్రకాశించునది); ఆమె వాక్కు మధురా పురి (అనగా విద్యలకు నిలయమగు మధురా నగరం, (లేక ఆమె వాక్కు మధురం); ఆమె వపువు (శరీరం) శ్రీరంగ భూమి, అనగా, రంగనాథుని ఆవాసం (లేక, శోభకు రంగస్థలం); ఆమె అధరం అరుణాధరం. అనగా అరుణాచలేశ్వరుని నిలయం, (లేక ఆమె పెదవి ఎరుపుకు ఆధారం); ఆమె దేహం నున్నటి బంగారు రేక; ఆమె విపుల ప్రభూత చరిత, అనగా గొప్ప సంపదతో కూడిన జన్మవృత్తాంతము గలది, (లేక భూమి యందు భవమొందిన చరిత్ర గలది.)

3) పద్యమున కర్థములు : సద్యోజాతం =అప్పుడే పుట్టినదై; ఊర్జము = బలము, ఉత్సాహము; జ్యోత్స్నా ప్రద్యోతము= వెన్నెల కిరణం; కన్యారత్నంబు= కన్యలలో ఉత్కృష్టమైనది; ఆద్యోతము= కాంతి; ద్వావా పృథ్వుల్= మిన్ను, మన్నులు; విద్యున్మాలల్= మెరుపుల సరులు; విస్తారించున్= వ్యాపింపజేయును.

తాత్పర్యము : అపుడే ఉదయించి, ఉత్సహించిన చంద్ర (వెన్నెల) కిరణ మీ కన్య. ఈమె ప్రకాశము ఆకాశమునకు, భూమికి మెరుపుల సరులను వ్యాపింపచేయును.

4) విశ్వామిత్రుని సోదరి, రుచికుని భార్యయైన సత్యవతీసాధ్వి శరీరముతో స్వర్గమునకు వెళ్లిన ఇల్లాలు. అయినను ఆమె లోకహితార్థము హిమాలయ భూములయందు నదిగా ప్రవహించుచున్నది. ఆమె కౌశికవంశ సంజాతగాన ఈ నది కౌశికియను పేరబరగు చున్నది.

***

# 12. అహల్యా ఖండము

## 12.1. విశ్వామిత్రుడు గంగానది మాహాత్మ్యమును శ్రీరామునకు తెలుపుట

ఆ రాత్రి శోణ నదీ తీరమున పరుండి, మరునాడు ప్రభాత సమయంబున విశ్వామిత్రుని బృందము తిరిగి ప్రయాణము సాగించి, మధ్యాహ్నమునకు గంగానదీ కూలమును చేరిరి. ఆ పవిత్రనదీ సోయగముల నీక్షించుచు స్నానములు చేసి, మునులా తీరమున పితృతర్పణములు తీర్చి, భోజనముల నాచరించిరి. అపుడు రామచంద్రుని కోరికపై కౌశిక మహాముని గంగాదేవి జనన, స్వర్గారోహణ, భూలోకావతరణ, పాతాళ గమనాది వృత్తాంతంబుల వివరించెను. అత్యాశ్చర్యకరమును, సకలపాపహరమునగు గంగాదేవి మధురవృత్తాంతమును రామ లక్ష్మణులును, విశ్వామిత్రుని శిష్యులును విని మహానంద మొందిరి.

ఆలోన సాయంసమయ మగుట, వారా రాత్రి యచటనే విశ్రమించి, మరునా డుదయమున తిరిగి ప్రయాణమై మిథిలను గూర్చి పోవుచు, దారిలో నొక వన ప్రదేశము ప్రవేశించిరి. అపుడు రామచంద్రుడు మునీంద్రు నిట్లు ప్రశ్నించెను. "స్వామీ! 1114

## 12.2. అహల్య జనన, యౌవనములు.

ఉ. ఇంతటి ముగ్ధ మోహన సమృద్ధము, వృక్ష లతా సుమావృతం
బింత ప్రశాంత సంయుత సమేధిత మౌని జనాశ్రమమ్ము వ
న్యాంతర భూములందున కనంబడదెందున, కాని చిత్ర మీ
చెంతను కన్నులన్ బడవు జీవులు – మర్త్య మృగాదులేవియున్. 1115

[1]కం. ఈ మునివాటిక చూడగ
హోమానల దీప్తి లేమి నొవ్వె – మరీ యా

రామం బేకారణమున
నేమఱిలెనొ తెలుపుమయ్య ఋషివర మాకున్." 1116

వ. అనిన వాక్చతురుండును, కథాకథన దక్షుండునగు విశ్వామిత్ర ముని నాథుండా యాశ్రమ పూర్వ, ప్రస్తుత వృత్తాంతంబుల నీ రీతి విశద పరుప మొదలిడెను.

మునిజన శ్రేయోభిలాష మానసా! రాఘవాధీశా! 1117

సీ. మునిముఖ్యుడు, మహితాత్ము డవిరళ జపహో
మ తప తత్పరుడు విమలగుణుండు
గౌతముం డనువాడు గౌరవప్రదుడు ప్ర
గమన మునిజన సంఘంబులందు,
అనుమాన దుర్ఘట నావమాన హృదయ
ఖిన్నుడై కోపంబు కిల్బిషంబు
తనబోటి సాధువుల్ దరిజేర నీరాదు
దీని నని తెలిసి ధృతి చెడంగ
తే.గీ. అతివ సౌశీల్య తన భార్యయైన సతి య
హల్య కతుల దుర్భరమైన శాపమిచ్చె
నొడ లెరుంగక శిలవోలె నుండు మనుచు,
ఆశ్రమంబు వీడె నిరాశ్రయంబుగాను. 1118

కం. విధిపుత్రి యయ్యు నేవిధి
వృథామతి వృషుని కుసృతిని విధురము నొందెన్,
విధిహత పతితను పేరున
విధిజ్ఞుడగు మగని చేత విడువం బడుచున్. 1119



సీ. తెలిపెదను వినుము – తొలి బ్రహ్మదేవుండు
సంకల్ప బలమున సకల జగతి
యందు కని వినని యందాల రాశియౌ
కన్యను సృష్టించి కనులు చెదర,
నే యంగ వికృతియు నెచ్చటన్ లేకుంట
దాని నహల్యాభిధాన చేసె–
దీన నాశ్చర్య మెద్దేని యుండ గలదె –
సరి క్రొత్త మూర్తుల నిరతి తోడ,
తే.గీ. వారి గతజన్మ కృతముల వాసి వెంట,
వివిధ రూప, ప్రమాణ, గుణ విధులెల్ల
మలచి వ్యతికీర్ణ జీవుల మమత తోడ,
సృష్టి జేయంగ నాసక్తి స్రష్ట కెపుడు. 1120

తే.గీ. మాలిక :
అందు మూలాననె సరసిజాసనుండు
సాల, గుల్మ, లతల వంటి స్థావరముల,
జల, పవన, భూమిచరులగు జంగమముల
హస్తి మశకము లట్లధికాల్పములగు
జంతుతతుల, మనుజులందు జ్ఞానఖనుల,
సుగుణగణుల, మూఢులను, దుష్టుల, కితవుల –
వివిధ తత్త్వములుగల వైవిధ్య భరిత
జీవుల సృజియించును కాదె చేవ మీఱ. 1121

వ. అది యటులుండ నిమ్ము, కొంత కాలంబునకు, 1122

శుద్ధవిరాటి :

అంతన్ కాంత యహల్య కాంతులన్
కంతున్ గెల్చు ప్రకాశవంతయై
భ్రాంతిన్ గొల్పె – నభశ్చరాదు ల
త్యంతంబా సతికై తపించగన్. 1123

వ. యుక్త వయస్కురాలై నభూతో నభవిష్యతిగా సౌందర్యరాశియైన అహల్యను వివాహమాడుటకు దిక్పాలురు, విద్యాధర, కిన్నర, కింపురుషాది సురముఖ్యు లనేకు లాశ పడుచుండిరి. అందు, 1124

ఉ. వాసపు డొక్కనాడు చని బ్రహ్మ సభన్ పొడగాంచె నా అహ
ల్యాసుదతీ లలామను మహాతిశయ స్మిత వక్త్ర, నిందు సం
కాశ శరీర, కుంద రుచికాంజనగంధిని – చూచి నంతనే
గాసిలి మన్మథ వ్యథను కామనుడై విరహాగ్ని దూలుచున్. 1125

తే.గీ. ఆ యహల్య యందాకాంక్ష నటమటించి,
మదన సుమబాణ దష్టుడై మథన పడుచు,
అతివ బొడగనని క్షణము వ్యర్థమనుచు.
కండ్లు మూయబోక సతిని గాంచుచుండె. 1126

తే.గీ. కన్నురెప్ప లహర్నిశ మెన్నడైన
మూయ కున్నట్టి యమరుల సోయగమగు
ననిమిషత్వంబు వరమయ్యె నతని కపుడు
పడతి నిలుకడ తిలకించు భాగ్యమబ్బ. 1127

వ. అత డంతతో నాగక, తనలో తానెంతయో కుమిలి ఇట్లు తర్కించు కొనియె. 1128



తే.గీ. యోగ్యమౌ నింట పుట్టుటే భాగ్య మరయ,
అంతకన్నను, సౌందర్యవంత మగుట,
దాని కన్నను సుగుణముల్ తలప మిన్న –
ఇన్ని భాగ్యంబులబ్బె నీ యింతి కరయ. 1129

తే.గీ. కలదు త్రిదిశ సామ్రాజ్యంబు, కలవు నాకు
సకల భోగ భాగ్యంబులు చాలినన్ని
ఎన్నియున్నను కాని యీ చిన్న దాని,
పొందు లేకున్న వ్యర్థమై పోవుగాదె. 1130

తే.గీ. ఉన్న అధికార బల విక్రమోన్నతులును
అప్సరాది పరిజన భోగానుభవము
ఇంద్ర సామ్రాజ్య భాగ్యంబు తృణ సుమంబు
కలికి కల్యాణి దీని సంగమము ముందు. 1131

కం. ఆ రీతి చింత చేయుచు
వారిరుహాసనుని జేరి వాసవు డంతన్
వారిజ నేత్ర యహల్యా
నారీరత్నమును తనకు నాతిగ గోరెన్. 1132

శా. శైలూషీ వ్యసనుండు శక్రుని దురాశాయుక్త వాంఛారతిన్
వాలాయంబుగ త్రోసిపుచ్చుటన దుర్వాదంబగున్, వజ్రికిన్
బాలన్ భార్యను సేయ నొప్ప ననియున్ వాగీశు డేమాత్రమున్
కాలున్ ద్రువ్వని శాంతిమార్గమును సంకల్పించి తా నిట్లనెన్. 1133

ఉ. ఏనొక యాంక్ష చేసెద ననిచ్ఛుడుగాక జగత్తునం దెవం
డైనను గాని యీ విపులనంత నొకండె ప్రదక్షిణంబుగన్

పూనిక చుట్టి యిచ్చుటకు ముందుగ వచ్చునొ వానికీ యహ
ల్యా నవయౌవనాంచిత మదాత్మజ నిత్తు పరిగ్రహింపగన్. 1134

కం. పరమేష్ఠి యాన వినగను
సురతతి క్రుంగుచు నిరాశ చూచుచునుండన్,
సురపతి యైరావతమున
త్వరితగతిని పరువులిడియె ధరణిన్ చుట్టన్. 1135

చం. అది గమనించి పద్మభవు డాత్మజు నారదు పిల్వపంచి స
మ్మదమున పృథ్వికేగి యట మాన్యుడు గౌతమ సంయమీంద్రునిన్
హ్రదసమ దేహయౌ సతి నహల్య కరంబు గొనంగ చేయగా
ముదలిడె, నంత నా మునియు భూమికి తత్క్షణమేగి దక్షతన్. 1136

## 12.3. అహల్యా గౌతముల వివాహము

సీ. అట గౌతముని తోడ నంబుజాసను నాన
తెలుపంగ నాతండు వలదు నాకు
సంసార బంధంబు సకల నాశన కర
మిది వలదన, కన్య నెంతగానొ
నుగ్గళించి పెండ్లికి వాని నొప్పించె; నంతలో
గౌతమాశ్రమమున కపిల వర్ణ
ధేను వీనంగ నా ద్విముఖి నపుడు సంయ
మీంద్రు చేత పరిక్రమింప జేసి
తే.గీ. గౌతమునిగూడి పరమేష్ఠి కడకు వచ్చి,
తాపసికి భూప్రదక్షిణ ధన్యతమరె
ప్రతిన మేరకు వీనికి పడతి నిచ్చి
పెండ్లి చేయుట యొప్పు సంప్రీతి తోడ, 1137



తే.గీ. జనక! నీయాన నీతండు సలిపె నుభయ
తో ముఖీ గోప్రదక్షిణ నేమముగను,
గాన వీనికింక తనంతదాన భూప్ర
దక్షణ ఫలమబ్బె ననిన ధాత యపుడు. 1138

వ. వల్లెయని, అహల్యను రప్పించి ఆమె నొప్పించి గౌతమమునికి నా క్షణమందె కన్యాదానమిచ్చి వారిని దంపతులను చేసెను. 1139

చం. వరునకు పండ్లు నూడె, జర పైబడి దేహము స్రుక్కె, వెంట్రుకల్
నెర తెలుపెక్కె, కాళ్ళు నడ నేరవు తిన్నన – పెండ్లికూతురో
సరసిజనేత్ర, మొల్ల సుమ సౌరభ గాత్రియు, యౌవనాంగియౌ
తరుణియ – యైన యామె విధి దత్తము నడ్డదు నించుకేనియున్. 1140

[1] తే.గీ. జలము లింకిన నెచటుండు సరసు తలప,
ధనము కోల్పోవ నుందురే జనులు వెంట,
ముక్తి పొందిన సంసార భోగ మెచట?
వయసు ముదిరిన శృంగార వాంఛ లున్నె! 1141

కం. ఇది యెరిగి గౌతముడు మది
ముదమందుచు యోగశక్తి పూనికతోడన్
పొదలుచు నిరువది యేడుల
మదయుతుడై దేల్చె సతిని మన్మథ కేళిన్. 1142

కం. ఆవిధి ఋషి దంపతులున్
యౌవన లీలా విలాస హాళిన్ దేలం
భావజ కేళిని వారికి
నోవుగ ఘనుడగు నొక సుతు డుద్భవమొందెన్. 1143

వ. వానికి శతానందుండని నామకరణము చేసి, గౌతముడు తన పుత్రుని ప్రత్యేక శ్రద్ధతో విద్య నభ్యసింప జేయుటలోను, తక్కుంగల సమయంబుల నిరంతర తపోదీక్ష యందును నిమగ్నుడై యుండెను. తగు కాలమునకు కుమారుడు యౌవన వయస్కుండై నిగమాగమ పండిత శ్రేష్ఠునిగను, మహాజ్ఞానిగను రూపొంది తలిదండ్రుల కానంద మొనగూర్చు చుండెను.

ఇంతలో తమ యాశ్రమము నహల్యాసతి సుందరమగు చిత్తరువు శాలలతోడను, వినూత్నాలంకారములతోడను, బహువిధవర్ణ పుష్పవేదికల తోడను, వనస్పతి, వానస్పత్య ఫలినీ మహీరుహ, గుల్మ గుల్మనీ, లతాజొం పంబుల వాటికలతోడను, తనతండ్రి వారసత్వముగా లభించిన హస్తలా ఘవమున చూపరు లాశ్చర్యమందు రీతిని తీర్చిదిద్దెను.

ఆ రీతి నా మునికుటుంబం బీ యాశ్రమమున సుఖ జీవనము కావించు చుండె. ఇది యిటులుండ అహల్యా కరగ్రహణవాంఛా పరితప్త దష్టచిత్తుండైన సంక్రందనుం డేనుగు నెక్కి కొంత కాలమునకు, 1144

ఉ. భూమిని చుట్టివచ్చి అతిమోహముతోడ నహల్యపై మనం
బాముకొనంగ నామె తనదౌనను నాశ విరించి వద్దకున్
దీమసనేగి మ్రొక్కి తన దిట్టతనమ్ము నెఱుంగ జేయుచున్
తామరసాక్షి నిమ్మన విధాతృడు నవ్వుచు వాని కిట్లనెన్. 1145

కం. "వినుమో శచీపతి! అహ
ల్యను నీవింకెన్నడును తలవబోవకు మా
యనుపమ కన్యన్ గౌతము
డను ముని ముఖ్యుడు వివాహమాడెను గానన్. 1146

కం. ఆతడొక మహాత్ముడు – నీ
చేతము మళ్ళించి యా ఋషి సతి దరికి నీ
వేతరిని వెళ్ళబోకుము,
పాతము నొందెదవు గాన పరిపరి విధముల్." 1147



వ. అనిన, కొన్ని సంవత్సరంబులు బ్రహ్మ యాజ్ఞకు లోబడి యుండినను, తదుపరి, యా బిడౌజుండు నిరాశాజనిత సంక్లేశావృత సంక్లిష్ట దోదూయ మానసుండై, తనను విధి మోస పుచ్చెనను భావంబు స్థిరముగా హృదయంబున నాటుకొన, తనకు జరిగిన పరిభవమునకు తగిన పరిహారము నొంద దలంచుచు, భూలోకమున కేగి గౌతమ ముని పర్ణశాలను రహస్యముగ పరిశీలించుచు, తగిన సమయము కొఱకు వేచియుండెను. ఆ విధముగ తన పరిశోధనలో, 1148

## 12.4. దేవేంద్రుడు అహల్యను మోసగించుట

తే.గీ. ప్రతిదిన ముదయమున తెలవారకుండ
కుక్కుటము శాలపైకెక్కి కూసినపుడు
నదికి పోయి ప్రొద్దెక్కినందాక రాడు
గౌతముం డింటికని యవగాహమైన. 1149

తే.గీ. ఇందు రహిత సినీవాలి ముందు దినము
నందు మధ్యరాత్రిని కోడియట్లు కూసె
యాశ్రమ ప్రాంతమున వజ్రి, యది విని ముని
తెల్లవారెననుచు లేచి తిమురు పడుచు. 1150

ఆ.వె. తలుపు మూయు మనుచు దార తోడ పలికి,
పయనమయ్యె నదికి పదిలముగను,
నిత్యదైవ విధుల నిర్వహించగ బూని
క్రమము తప్పకుండ గౌతముండు. 1151

ఆ.వె. ఒక్క గడియ పిదప తక్కుచు తారుచు,
దివ్యశక్తి వలన త్రిదశవిభుడు
గౌతమ ముని రూపు కపటియై ధరియించి
తపసి యింటికేగి తలుపు తట్టె. 1152

ఆ.వె. తలుపు తెరచి చూచి తలిరుబోణి యహల్య
భర్త వచ్చె ననుచు భ్రాంతి చెంది
ఇంత త్వరగ యింటికేలవచ్చిరనుచు
నడుగ వాడు నవ్వి వెడగువోలె, 1153

చం. కుమతిని వజ్రి గౌతముని గొంతును గొంచు నహల్యతో ననెన్
"సుమ సమ దేహ! నా తనువు చోద్యముగా పులకించె నేడు, నీ
సుమధుర వాక్కులన్ వినగ, సుందర రూపము చూడ నాక మం
దమరులకైన చిక్కని ప్రహర్షము నన్ను వరించె చూడుమా. 1154

ఉ. చూపుము నాపయిన్ కరుణ, చూపుము నీ సుమబాణ లాస్యముల్,
చూపు త్వదీయమౌ రుచిర చుంబన దివ్య సుధారసాంబువుల్,
నీ పరిరంభ సౌఖ్యమును, నీ పరిభోగ మహానుభూతి, ఈ
మాపు నహల్యతో ప్రథమ మన్మథ సంగమమట్లు తోచగన్. 1155

క. కమ్మ విలుకాని కొమ్మా!
వెమ్మయ్యె మనమ్ము నన్ను విడువకు సుమ్మా!
రమ్మా! బంగరు బొమ్మా!
ఇమ్ముగ నీకున్న వెల్ల నిన్మడి నిమ్మా!" 1156

కం. అనుచును మఘవు డహల్యను
తనదరికిని చేరదీసి తత్తరమున చే



కొని శయనమందిరమునకు
తనువు మరచి బలిమి లాగ – దడియుచు నంతన్. 1157

ఉ. ఇంతి యహల్య యిట్లనె, "నిదేమి విచేష్టిత విభ్రమమ్ము, మీ
రింతకు మున్నెపుండు మది నెంచరు వేదురుగొల్పు యూహ, లొ
క్కింతయునేని బల్మి నను నెన్నడు కోర రనంగకేళి బల్
వింతగ తోచె నేడు మది వేదనచెందె ఋషీశ్వరోత్తమా! 1158

కం. మౌనీశ్వర! శ్రద్ధ వినుడు!
నేను ఋతుస్నాత గాను; నీకిది తగునే –
ఈ నీచపు తొలుసంజను
కానిపనులు చేయ! దీన కలుషము రాదే." 1159

మ. అనుచున్ వేడిన సాధ్వి పట్టి మఘవుం డత్యంతకామార్తుడై
చనువున్ జూపుచు కౌగలించు కొనుచున్ శయ్యందునన్ త్రోయ, నా
వనితావల్లరి లేచి యొక్క క్షణ మోపన్ వేడి పూజా గృహం
బును వేజొచ్చుచు తల్పు మూసు కొనగన్ మోహంబునన్ వజ్రియున్.
1160

వ. "సంతానవాంఛ గలవారికి నీవు ఋతుస్నాతవో కావో యను ప్రశ్న యుదయించును గాని, మన్మథ సామ్రాజ్య సారభౌమత్వ విభవంబున నన్నేలుట కర్హురాలవే కదా! అంతియ గాక, భర్తమాట కెదురు చెప్పుట పతివ్రతా లక్షణముకా"దని గద్దించి అహల్యను పొదివి పట్టుకొని తెచ్చి శయ్యనుజేర్చ, నామె మూర్ఛపోయె. ఆ సమయంబున, గౌతముని గృహ ముఖద్వారంబున అహల్యా, అహల్యా అను కేకలు వినంబడియె.

ఈ కేక లెందుమూలమై వచ్చెననగ, నంతకు ముందు రాత్రివేళ, 1161

## 12.5. గౌతముడు దేవేంద్రుని శపించుట

ఉ. ఉద్దియ తోడ వేల్పుదొర యూనిక నేరక గౌతముండు తా
నద్దమరేయి కుక్కుట మవారిత రీతిని కూయ నుద్ధతిన్
ప్రొద్దయెనంచు నిర్ఝరికి పోవ వినంబడ వే విధంబులొ
సద్దులు, లే వటన్ మొదవు సాలల క్రేపుల యార్పు లాతరిన్. 1162

వ. దారిలో గల ఆశ్రమముల విద్యార్థుల ఉదాత్తానుదాత్త స్వరయుక్త వేదపాఠంబులు వినబడవయ్యె. ఘోషా యోషాగణముల దధిమంథన సమయ సల్లాప ఘోషలు చెవుల బడవు. నదికి స్నానానుష్ఠానంబులకు తరలి వెళ్ళెడు తోటి ముని సంఘంబులు కనబడవు. అంత గౌతము డాకాశమున తారాపథంబు వీక్షింప, వేగుచుక్క యింకను పొడవదయ్యె, జ్యోతిశ్చక్రశాస్త్ర సహాయమున శీలింప, తెల్లవారుట కింకను జాముపైగా వ్యవధి గలదని తెలిసి, కోడి తప్పుగ కూసెనని నిర్ణయించి గౌతముని వెను దిరిగి, 1163

తే.గీ. అచిర కాలములోన గృహంబు చేరి,
ఓరగా తలుపు తెరచి యుంటగాంచి,
లులితమానస కలితుడై లోనికేగి,
రెట్టి పిల్చె నహల్యను రెండుమార్లు. 1164

శా. ఆవాక్కున్ విని పాకశాసను డవాక్కై భీతిమై ప్రాణముల్
రావుల్ దప్ప నిజ స్వరూప సహితుండై, దుర్భర క్షోభ త
న్నావేశింపగ నన్యమార్గరహితుండై పర్వె నా సుందరీ
సావాసంబును వీడి వీధి దెసకున్ జారత్వ పంకాంగుడై. 1165

కం. వాని గని వాసవునిగా
మౌని యెరుంగుచు నొక క్షణమాత్ర భ్రాంతిన్



తానరసి సందియ మొదవి,
ఈ నాకేశు డిటనుండె నెందుల కనుచున్. 1166

తే.గీ. నిజ మెరిగి గౌతము డపుడు నిప్పు వలెను
భగ్గుమని మండు బ్రహ్మాస్త్ర భాసమాన,
భాను మండల దివ్య ప్రభా సమాన
నిభ నయన దీప్తి నీక్షించి నిర్జరేంద్రు. 1167

ఉ. "ఓరి దురాత్మ! పర్విడకు మో నయవంచక పోకు" మన్న జం
భారి భయంబునన్ వణకి యచ్చట నిల్చె, మునీంద్రు డంతటన్
మారికి మాఱుపై తన కమండలు వందున నీరమున్ కరం
బారగ పోసి తీక్ష్ణ నయనాంచితుడై శపియించె నీగతిన్. 1168

ఉ. "ఏ పురుషాంగ మూలమున నీవు మదార్తి ననంగ కార్య వాం
ఛా పరిపీడితవ్యథ నజస్ర నిమగ్నత ప్రొద్దుపుచ్చుదో
ఆ పురుషత్వ కారణములౌ వృషణంబులు ఖండితంబులై
యోపు నశింప నేలబడు, నుత్తలపాటున నీవు కుందగన్. 1169

ఉ. నీచము, నుచ్చమున్ మదిని నేరక యోనులె కోరి మత్త మా
రీచమువోలె నిత్యమును రెచ్చి తలంచితొ న్యాయ ధర్మముల్
త్రోచి, భయంబు లజ్జయును రోసితొ, ఆ జననేంద్రియంబులున్
తోచునుగాక నీ మెయిని త్రొక్కటలాడుచు వేలువేలుగా! 1170

వ. వృషణ రహితుండవై, యోని సహస్రాంకిత శరీరుండవై కాలము పుచ్చు"మని శతఘ్ని విగళిత విస్ఫోటనాగ్ని పిండభాండతండ పరంపరలం బోలు గంభీర శబ్ద జాలంబుల గౌతమ మహాముని శతమన్యుని శపించె. 1171

ఆ.వె. అంతలోన నా యహల్యయు నిసుమంత
మూర్ఛనుండి తేరి ముందుగదికి
వచ్చె భర్త కోప భరిత వాగార్భటి
ని విని మనము భీతి కవియు చుండ. 1172

## 12.6. గౌతముడు అహల్యను శపించుట

వ. చెదరిన కేశంబులను, స్థితి తప్పిన పయ్యెదను సవరించుకొనుచు తడబడు నడల నట ప్రవేశించి, దేవేంద్రుని గాంచి యీతడేల వచ్చెనో యనియు, భర్త ఆతనిపై నేల నిప్పులు చెరుగు దుర్భాషలాడు చుండెనోననియు నచ్చరువంది శిలవోలె నిశ్చేష్టయై నిలంబడిన, గౌతము డాజ్య నిషిక్త హోమాగ్ని చందంబున రక్తారుణోగ్రాక్షుండై ఆమెను గాంచి, రెట్టించిన కోపంబున నిట్లనెను. 1173

తే.గీ. "ఓసి కులట! మగని కన్నుమూసి యెంత
కాలమందుండి ఈ నాటకమ్ము సాగ
చేయుచుంటివో తెలుపవే చెడిపదాన,
అమర సామ్రాట్టు పొందుపై నాశ తోడ. 1174

కం. నీ కొఱకు నా తపఃఫల
మూకన విడనాడి యౌవనోపేతుడనై,
నీకున్ తరచుగ నిధువన
సాకల్య ప్రమద సుఖము సలుపన్ లేదో! 1175

శా. ఐనంగాని బలారి నీ దెసను సౌహార్దాను రాగంబుతో
నానావ్యాజ కుయుక్తులన్ మసలుచున్ నా యింటిలో జేరి నీ
మానంబున్ గొను యత్నమున్ సలుప సొమ్మన్ కూలితేగాని, న
వ్వానిన్ దుర్భరశాప సంజనిత సప్తార్చిన్ పడం జేయవే. 1176



వ. దీన నీవు పాపపంకిల వైతివి. నీ కృత్యంబులు వానిపై నీమనంబున నే మారు మూలనో గల సూచకాగ్ర సదృశమౌ మోహంబా క్షణంబున నిన్నావహించియుండెనని స్పష్టము చేయుచున్నవి. అంతియగాక, ఇంతటి ఘోరకృత్య ముదాసీనవై భరించి, ఏమియు యెఱుంగని నివ్వెఱ నెఱజాణవై శిలవోలె నిస్తబ్ధత నిలిచియుండి, ఏ యనర్థము వాటిల్లని యట్లు నన్ను భ్రమింప చేయ జూచుచున్నావు. కావున, 1177

కం. నీ వేవిధి నిశ్చేష్టత
గ్రావము రీతి నిట నిలిచి కదలక యుంటో,
ఆ విధమున నొక శిలలో
నీవరివై యుండు మింక నిరవధికముగన్. 1178

మ. అలవోకన్ చెడి మందభాగ్యయుతవై, వ్యాజంబుచే క్రుంగుచున్,
వెలిబుచ్చంగనులేని వ్యాకులతతో, వేధించు చిత్తంబుతో,
చలనం బేమియులేక, గాలితిని నిశ్వాసంబులన్ వీడుచున్,
నెలవై యీ వనవాటికాలయమునన్ నిస్తబ్ధవై మ్రగ్గుమా. 1179

ఆ.వె. వచ్చి పోవు జనులు ప్రస్తరం బందున
చలన రహిత నిన్ను జాలి గనగ,
స్థైర శీల సతులు పడు క్షోభ గమనించి
అప్రమత్తులవగ నాడువాండ్రు." 1180

క. ఆలో ముని శాపంబున
నాలూవమయె నమర విభు నండద్వయమున్
కోలుపడి పర్వె నాతం
డాలస్యము కాక మున్న యటమట పడుచున్. 1181

వ. అటుల పర్వి, ఇంద్రాక్షియనుదేవత నాశ్రయించి తన శరీరము పైగల సహస్రయోనులితరులకు నయనములుగ కన్పడునట్లు వరమంది సహస్రనేత్ర నామాంకితుడయ్యె. అట్లే, కొంతకాలమునకు దేవతల సహాయమున మేషవృషణము లండముల స్థానమున తాపించు కొని తిరిగి పురుషత్వము నొందెను.

ఇట నాతరి యాశ్రమంబున జరుగుచున్న సంచలనంబునకు మేల్కొని, 1182

తే.గీ. తండ్రి కోపంబుతో తన తల్లి నిట్లు
తిట్టి శపియింప వినినంత తీవ్ర తాప
సంహతుడు శతానందుండు క్షణములోన
తల్లి వద్దకు వచ్చెను తత్తరమున. 1183

తే.గీ. అంతలోన నహల్యా లతాంగి – మేక
తనను తినివేయ వలెనని తమక పడుచు
తన దెసకు క్రుద్ధయై చూచు తరిని కొలుపు
భీతి లోలోన పడు లత రీతి – వణకి. 1184

తే.గీ. తడబడెడు నడకలతో వెతబడి లేచి
పడుచు సంయమీంద్రుని పాదపద్మములకు
మ్రొక్కి దీన నిస్వనమున వెక్కి యేడ్చి
పలికె హంసరుతము బోలు వాక్కుతోడ. 1185

హంసరుతం :

"నా మాటల్ వినుడు స్వామీ,
నా మీదన్ నిరస నేలా!
మీ మోమున్ కనగ భీతిన్.
ఏమీ చెప్పగను జాలన్. 1186



మధ్యాక్కరలు :

మోసపోతిని గాని నాథ! మోసకత్తెను గాను నేను,
వేసంబు మిముబోలె మార్చి, వీకతో మీగొంతు కూర్చి,
ఈసుతోడను వచ్చి నాత డింద్రుడని యెరుగ నైతి,
నే సత్యముగ మీరటంచు నెఱ నమ్మితిని గాని స్వామి! 1187

ఆసతో వాడంత రేచి, అంగజ కేళికై వేడ.
ఆసురీ వేళయ్యె ననుచు, నడ్డుపెట్టితి గాని, వాడు
పోసరంబున పైన బడగ, పూర్తిగా నే సొమ్మగొంటి –
నే సేద దేరంగ నంత, నీ సన్నిధికి వచ్చియుంటి." 1188

## 12.7. గౌతముడు అహల్యకు శాపవిమోచన మార్గ మెఱింగించుట

వ. అని, ఈ విధంబున జరిగిన సంగతిని వివరించి, నా వలన నే విధమైన పొరబాటును లేదు, నేను వంచనకు గురియై, ఈ విధి నధోగతిచెందితిని. నాపై కనికరముగొని శాపము నుపసంహరించి నన్ను పునీతను జేయుడని ప్రార్థించుచు, వెక్కి వెక్కి అహల్య ఏడ్చుచుండ, శతానందు డావేశపడి తండ్రితో నిట్లనియె. 1189

చం. "అనుపమ తాపసేంద్రులు, మహాత్ములు, పెద్దలు, కుర్ర నేను, మి
మ్మనగను రాదుగాని యనుమాన విదారిత మానసంబుతో
మును వినినట్టి శాపమును పూతచరిత్ర మదీయ మాతకున్
జనక! యొసంగు టొప్పగునె! సత్యమొ కాదొ యటంచెఱుంగకే. 1190

ఉ. మానిని మాత పైన నణుమాత్రపు సంశయ మున్నచో నిసీ
యూనుచు ప్రశ్నసేసి నిజమో, యనృతంబొ యెరుంగ నొప్పదే!

కానిచొ యోగదృష్టిగని కల్మష మున్నదొ లేదొ తేల్చగా
పూనుట యొప్పు గాని, మును ముందుగ శాప మొసంగ న్యాయమే!
1191

వ. ఈ రీతిని తొందరపడిన, మనలను చూచి ముందు తరముల వారు, [2]"సహసా న విధీత విక్రియామవివేకః పరమాపదాం పదమ్" అను సూక్తిని వెలువరించరే. అది అటులుండ, 1192

మ. మును కామార్తిని తార, దేవగురునిన్ మోసంబుతో వీడి చం
ద్రుని తోడన్ వసియించి పుత్రు కనినన్, దుర్వార తాపంబుతో
ననిశమ్మున్ కృశియించి గూడను, సుపర్వాచార్యు డా తార నే
గొని యర్థాంగిగ నేలెగాని, మది ముక్కోపంబునన్ తిట్టెనే? 1193

తే.గీ. తార నారీతి గీష్పతి చేరదీయ,
పావన సనాతనార్య పుంభావ వాక్ప
తులగు మీరు భార్యకు కోరి దుర్భరమగు
శాప మిచ్చితి రేలయ్య, సర్వ మెఱిగి. 1194

ఉ. అంతియగాక అమ్మ యిసుమంతయు నేరము చేయ నైతి, వి
భ్రాంతిని మోసపోయితిని వాసవు చేతను, నమ్ముడంచు తా
నెంతయొ నెత్తిబాదుకొని యేడ్వగ నమ్మ రదేల తండ్రి! మీ
పంతముగాని యామె యనుభావము చూడ నిజంబెఱుంగరే! 1195

కం. అమ్మ పలుకులను పూర్తిగ
నమ్మినచో తడవుగొనక నయమున మీ శా
పమ్ము వెనుకగొని యొక వా
క్యమ్మున నామెను పునీత కావింప దగున్." 1196



సీ. అన విని గౌతమ ముని యిట్లనె, "కుమార!
మనకును సురలకు మమతలందు,
నిత్య విధుల, విధి నిర్వహణములందు,
ధర్మవిచక్షణా మర్మమందు,
న్యాయ విశ్లేషణ వ్యవహారములయందు
వివిధమౌ భేదముల్ వెలయుచుండు –
వ్యభిచార మిలలోన నతి ఘోరమౌ పాప
కృత్యంబు, దీని శిక్షించ కుండ
తే.గీ. నూరకున్నను పూర్వంబు నుండి నేటి
వరకు నొడుదుడుకులులేక బరగు చున్న
మన వివాహ వ్యవస్థ ప్రమాదమొంది,
మలినపడుచు నస్తవ్యస్తమై నశించు. 1197

వ. నాయనా! మరియొకమాట. నేను అమ్మని నమ్ముచుంటినా లేదా యనునది కాదిప్పటి సమస్య. 1198

తే.గీ. ఆమె మనసులో నిసుమంత యైన తప్పు
లేదనుచు నమ్మదును నేను, ఆ దివౌక
స పతి తనను వంచించి దోసంబు చేసె,
నా వలెనె వేసమును గూర్చి నమ్మకముగ. 1199

తే.గీ. ఈమె నిర్దోషియను సత్య మెఱుక మనకు,
కాని కొంత కాలములోన కథలుగాను
జనులు చెప్పుకుందు రహల్య జారయనుచు,
ఇంద్రు నీనాడు నేను శిక్షించు టెరిగి. 1200

తే.గీ. అంత ప్రజలెల్ల లోలోన చింత చేసి
తప్పు చేసిన వార లిద్దరను గాక,
ఏల నీ ముని కేవల మింద్రు నొక్క
ని శపియించె నందురు గాదె నింద వేసి. 1201

తే.గీ. గౌతముడు తప్పు చేసిన కాంత పైన
శిక్ష వేయక నేలెను క్షేత్రమగుట,
ధర్మ సూక్తులు వల్లించు తాపసుండు
తనకు న్యాయము వేరని తలచె నేమొ. 1202

వ. పుత్రా! ఇట్టి అపవాదములను నేను ఖండించ లేను, భరించలేను.
ఇవి మన స్వచ్ఛ సనాతనార్షమతమునకు మచ్చలు కావా! 1203

ఉ. ఐనను నీదు విన్నపము హర్షముతోడను తీర్చ కోరుదున్,
కాని మదీయ శాపమును కట్టడిచేయగ రాదు గాన, న
ద్దానికి నే విమోచన పథంబు నిరూపణచేతు, దానితో
మానవతీలలామకు సమాగత మయ్యెడు పూర్వ యోగముల్. 1204

ఉ. భావి యుగమ్ములో నతుల భాసురలీల నధోక్షజుం డిలన్
పావన సూర్యవంశమున ప్రన్నన రాముని పేర పుట్టుచున్
రావణ దైత్యవర్గముల ప్రాణములన్ హరియించి భూమిపై
వావిరి ప్రాక్తనార్షమత పాలన చేయును ధర్మమూర్తియై. 1205

మ. సవరక్షార్థము తండ్రి పంపగను విశ్వామిత్ర మౌనీంద్రుతో
రవివంశాగ్రణి బాలరాముడు మహారణ్యంబునందున్న దా
నవ బృందంబుల నొంచి, యీ వనములోనం జొచ్చి, యుత్కృష్ట హృ
ద్భవ వాంఛన్ సతియున్న ఈ యుపలమున్ స్పర్శించు – వెన్ వెంటనే.
1206



కం. పాపము తీరి యహల్యకు,
రూపము జీవమును మరలి ప్రోపడి వచ్చున్
లోపల ప్రశాంతి తోచును,
ఆపదలును తీరి మనము హర్షము నొందున్. 1207

తే.గీ. రామచంద్రుని గాంచిన రామ కప్పు
డిందువున నీటిలో మురి కింకు నటులు,
సకల కర్మంబులును డింది సమసి పోవు,
నాత్మతత్త్వంబు విశదమై యతివ వెలయు. 1208

వ. ఇంక, 1209

సీ. శీలవతి యహల్య శిలవలె పడియున్న
మన యాశ్రమ చయము జనులకైన,
ద్విజ, మృగాదులకైన ప్రీతిగొల్పదు గాన
నిట నెవ్వరును వసియింప రాదు;
అనుమాన సంకల్పి తావేశ మగ్నత
యొడలెరుంగక రేచి యెడద కలగి,
అధిక కోపంబున యతివకీ ఘోర శా
పము నిచ్చితిని గాన, ప్రతిన గొనుచు
తే.గీ. తత్క్షణమె పోయి హిమ పర్వతంబులందు
శమము తోడను సాధ్వికి శాప మోచ
నంబు రాముడు జరుపు క్షణంబు దనుక
తపము సేయుదు తాదాత్మ్య తత్త్వమతిని. 1210

ఆ.వె. ఎంత వారికైన నిలలోన కోపంబు
హానికరము దీని నణచ వలయు,

ఎంత కీడొ క్రోధ మీ యుపాఖ్యానంబు
విశదపరచు వినుడు విజ్ఞులార! 1211

తే.గీ. ఇద్దరము చేరి పెంచితి మెన్ని యేండ్లొ
వివిధ పుష్ప, ఫల నికుంజ వృక్షతతుల,
నిచట చిత్తరువులను చిత్రించె నీమె,
చెలియతోడ నా దాంపత్య చిహ్నములివి. 1212

ఉ. కోరి యహల్య చాతురిని కుట్టిమ, కుడ్యములందు నేర్పుతో
తీరిచి నట్టి చిత్రములు, తిన్నన పెంచిన గుల్మినీ లతా
తోరణ మాలికల్ కుసుమ ధోరణు లెల్లను నిత్య శోభతో
సొరుగ సౌరభంబు వెదజల్లును గాత సమంచిత ప్రభన్." 1213

వ. అని విచార సంభరిత హృదయంబున, జల నిష్క్రాంత జలజంబువోలె కనుల నుండి బాష్ప బిందువులు రాల, గౌతముండు తన యాశ్రమంబు వీడి ఇచ్ఛావృత్తి చనియెను. 1214

ఉ. అంతట మౌని శాపఫల మా సతిపై ప్రసరింప బూన న
త్యంత మహల్య విగ్రహము స్తంభితమై, పొరలట్లు ఆతినీ
రంత పరీతమై మెయిని వ్యాపన చెంది ఘనీభవించినన్,
వింతగ నామె గ్రావమున విన్నన పాతుకుపోయి కన్బడెన్. 1215

మ. ముని పుత్రుండు విచారతప్తమతియై బోరంచు రోదించి, చే
యున దేమాత్రములేక వేచి, తుదకున్ వ్యుత్థానుడై యేగి, చ
య్యన వేంచేసి విదేహపట్టణములో నాచార్య సద్వృత్తి జో
కను చేపట్టెను సమ్మతించి జనక క్ష్మాధీశు నాహ్వానమున్. 1216



వ. ఇచ్చట అహల్య శిలయందు రామనామము జపించుచు తపించెను. కాలము గడచిన కొలది ఆమె శరీరము సువర్ణనిభ వర్ణమై మృదుత్వము వహించి, సహజ సౌభాగ్య సౌశీల్య శోభితయగు ఆమె శారీరక మానసిక సౌందర్యము లెన్నియో రెట్లు వికాసము చెందెను. 1217

## 12.8. శిలాస్తంభితయైన అహల్యకు శ్రీరాముడు విమోచనము కలిగించుట

వ. విశ్వామిత్ర మునీంద్రుడారీతి శ్రీరామ లక్ష్మణులకు గౌతమాశ్రమ వృత్తాంత మెఱుక పరచి, వెండియు నిట్లనియె, "ఓ రఘునాయకా! ఇక నా మహాసాధ్వి యహల్య నిక్షిప్తమైన శిల వద్దకు పోవుదము రమ్ము, తండ్రీ! సహజ కరుణాసింధువైన నీ కామెను సత్వరమే శాపవిముక్తను చేయుమని నేను ప్రత్యేకముగ కోరు నగత్యము లేదు. అది నీ సహజమైన వాంఛ గదా" యనిన కౌశికుని మాటలు విని, ధర్మవర్తనుల కష్ట నష్టంబులకు స్పందించు దయాంతరంగుడగు శ్రీరాముని కళ్ళు చెమరించెను. మౌనముగా ముని వెంటనడచి, అహల్య నిక్షిప్తమైన కఠిన పాషాణఖండము దరికేగి, ఆ శిలను తన కరముచే స్పృశింప బోయి, పరనారీ విముఖుండు గావున, తన పాదాంబుజ రజంబు నామెపై ప్రసరింప చేసెను. అంత వెంటనే, 1218

మంజరీ ద్విపద :

రాముని స్పర్శకు ప్రస్తరమంత,
మార్దవ మయ్యెను మైనము వోలె,
ఆమెను కప్పిన అశ్మ వలయము
వ్రీలుచు పొరలుగ విరిగి పడగను
క్షణముల లోనను చలనము నొంది,
మెఱుగులు మెలయగ మెలతుక మేను

రూపము నొందుచు రోచన మయ్యె –
ఇంద్రియ జ్ఞానము లింతికి కలిగి
కాంతులు జిమ్మగ కన్నులు తెరిచి,
వింతగ రాముని వెలదుక చూచె. 1219

తే.గీ. అంత శ్రీరామచంద్రు డా అతివ గాంచి
తల్లి పొడగన్న చిన్నారి తనయునట్లు
అధిక సంతోష భరితాంగుడగుచు వంగి
పాద పద్మములకు మ్రొక్కి పలికె నిట్లు. 1220

వ. "మాతా! 1221

మ. ఇనవంశోద్భవుడున్, మహావిభవుడున్, కృత్తాహిత స్తోముడున్,
ఘన కారుణ్య గుణాత్మకుండు, రవి సంకాశుండు, ధీమంతుడున్,
కనకక్ష్మాధర ధీరుడున్, దశరథాఖ్యక్ష్మాతలేంద్రుండు మా
జనకుం డీ మునివెంట పంప నిట నోజం వచ్చినా మమ్మరో! 1222

ఆ.వె. నన్ను చూడు మమ్మ నాపేరు రాముండు,
ప్రక్కనున్నవాడు భ్రాత నాకు
లక్ష్మణుండు వాడలఘు శుభలక్షణుం
డాత్మ దృష్టితోడ నరయు మమ్మ." 1223

ఉ. అంత నహల్య దేహము నితాంత వివేకము తోడ నిండె, నా
వంతయు వంతలేక సుఖవంతముగా ననిపించె నాత్మలో
నెంతయొ, దివ్యచక్షువుల కిమ్ముగ నా రఘు రామచంద్రుడే
యంతట గానుపించె జగమంతయు నిండి త్రివిక్రముండుగా. 1224



మ. స్మిత వక్త్రుండును, పద్మనేత్రయుతుడున్, శ్రీవత్స వక్షుండునౌ
ప్రతిబింబార్కసహస్ర దీప్తుడు, చతుర్బాహుండు, పీతాంబర
స్థితదేహుండు, ధనుర్ధరుండు, భువనాధీశుండు, చక్రాది యు
ద్ధృత దుర్వార చతుర్విధాయుధుడునౌ శ్రీవిష్ణు నుద్వేగియై, 1225

ఉ. అన్నున కండ్లు మెండు విరియంగను చూచుచు హర్షయుక్తయై
మున్ను మునీంద్ర గౌతముడు పొందిక పల్కిన వాక్యముల్ మదిన్
సన్నుతమై స్ఫురింపగను శ్యామలరాముని విష్ణుమూర్తిగా
ప్రన్న నెఱింగి కన్నులను బాష్ప జలంబులు నిండిపారగన్. 1226

ఉ. చూచి మరొక్కమారు కనుచున్ మరి క్రిందకు మీదకున్ శిరం
బూచి మనమ్మునందు పురుషోత్తము రాముని రూపసంపదన్
మోచి, కృపావిశాలు నగుమోమును దోచి, ప్రశాంతి లేమిచే
లేచి కరాంబుజంబులను లీలగ సాచి యహల్య యాదటన్. 1227

కం. సాష్టాంగ దండములతో
నిష్ఠన్ పూజించి హరిని నిరుపమరీతిన్
స్పష్టాక్షర ఛందోగతి
సృష్టి స్థితి లయుని శౌరి జేరి నుతించెన్. 1228

తే.గీ. కాంచి పులకించి తలవంచి కనులు డించి,
ఇందిరాపతిపై యోగదృష్టి నించి
ఇంచుబోడికి దేహంబు సంచలించి,
ఇంచు వీణియ రవళుల మించి యెంచె. 1229

## 12.9. అహల్యా స్తవము

నారాచక వృత్తం :

"ఓహో త్రిలోక నాయకా!
ఓహో దయానిధీ! విభూ!
ఓహో రవీంద్ర తేజసా!
ఓహో రఘూద్వహా! ప్రభూ! 1230

ఇంద్రవంశం :

నీలాంబుదాకాశ వినీల సుందరా!
ఖేలా జగన్నాటక కృత్య సంతసా!
కాలాంత దైతేయ విఘాతకారణా!
ఏలాగు కీర్తింతును హే రఘూద్వహా! 1231

ఉపేంద్ర వజ్రం :

ప్రమోద చిత్తాన ప్రభాస తేజా,
నమస్కరింతున్ హరి నామధారీ!
శమించి యోదేవ! ప్రశాంతితోడన్
విమోహమున్ బాపి వివేకమిమ్మా! 1232

మత్తకోకిల :

రామచంద్ర ! విషాదయోష రిరక్ష దక్ష! నమో నమో!
ప్రేమమూర్తి కృపాంతరంగ హరీ, మురారి నమో! నమ
శ్యామలాంగ ! విముక్తి నిచ్చితి సంతసమ్ము రమాధవా!
స్వామి! నాకు నితాంత రక్తిని శాంతి కూర్చితి దేవరా! 1233

కం. నీపాద ధూళిచే నను
పాపోపేతనని యనక పావనమూర్తీ!



శాపవిమోచన చేసితి
వాపద్బాంధవ! కృతార్థనైతిని దేవా! 1234

మ. ఇది సామాన్యమె ! నిర్జరుల్, మునులు, నాకేశుండు, వాగీశుడున్
మది వాంఛన్ భవదీయ పాద రజమున్ మండాడి యుత్కంఠతో
పదివేలేండ్లు తపంబొనర్చియును నిర్వాదంబుగా పొందలే
నిది నీవే యరుదెంచి చిల్కితివిగా నెయ్యంబునన్ నాపయిన్. 1235

శా. పాపధ్వంస ! త్వదీయ పాద రజ సంపర్కంబుతో నుద్భవై
నీ పాదోద్భవ గంగ ధూర్జటి జటల్ నింపారి మర్త్యాళికిన్
తాపానీక నివృత్తి చేయు, విధి హస్తాంభోజ నిష్క్రాంతయై
మాపున్ పాపములన్ సుపర్వతతికిన్ మందాకినీ నామ్నిగా. 1236

ఉ. అంతటి లోకనాయకుడవయ్యు కృపారతి తోడ నీవె య
త్యంతము మానవాకృతిని దాల్చి నికృష్టను నాదు పాప వృ
త్తాంత మెఱింగి వచ్చి భవదాదృతి చూపితి వయ్య రాఘవా!
ఇంతటి రాగ మీ యబల కించుకయైన భరింప శక్యమే. 1237

కం. అజ్జరె! రఘునాయక! నీ
యజ్జనుగల ధూళితోడ ననుపమమౌ న,
ట్లుజ్జన సేసితి శాపం
బుజ్జగొనన్ వశమె నీదు నుజ్జృంభితముల్. 1238

[3]ఉపేంద్రవంశం:

ఓలోకనాయకా, యుదాత్త విగ్రహా!
వాలారు మార్గణ ప్రయోగ వేత్తవై
కాలాంత దుష్ట రాక్షస ప్రవృత్తులన్
కాలాగ్నిలో బడంగ కూల్చవే ప్రభూ! 1239

శా. నీ వొక్కండవునయ్యు నీ భువనముల్ నిర్మింపుచో సృష్టికై
యావిర్భావమునొంది బ్రహ్మవలె, స్థిత్యర్థంబు శ్రీవిష్ణువై,
ఈ విశ్వంబు లయింప శంకరుడవై – ఈ మూడు రూపంబులున్
నీవే యైతివి కాదె విశ్వవిభవా! నీ పోకడల్ చిత్రముల్. 1240

వ. నీవు జగత్ప్రభుండవు. లోకాధ్యక్షుండవు. దేవదేవుండవు. పురుషోత్తముండవు, నీవు 1241

సీస బంధిత ద్విపద :
శ్రీ లసత్ చైతన్య సృష్టి తేజంబు,
లీలా జగ న్నాటకాలంబనంబు,
కలగొన్న సత్యంబు ఘన మజరంబు,
నెలవగు జ్ఞానంబు, నిరవధికంబు,
తొలి మధ్య తుదలేని ధ్రువ వలయంబు,
తలకని శివము నిశ్చల మమరంబు,
పొలుపగు నిర్గుణంబు, చిదాత్మకంబు,
ఒలసిన ఆనంద నిలయ సదంబు,
అలరారు సుందర మప్రమేయంబు,
కలిలము నవ్యక్త లలిత పథంబు,
కెలసము, నిఖిల మాకృతి రహితంబు,
వెలయు సుస్థిరము, కేవలము, నజంబు,
విలసిత బ్రహ్మంబు వేద నాదంబు,
అలఘు విరాట్రూప బల చరితంబు, 1242

కం. ఆనందమయుడ వయ్యును,
కానబడుచు నీ వమాయక ప్రతిమ వలెన్



మానవభావమున మసలి
మానుగ నమ్మించ జూతు మాయోపేతా! 1243

[4]అనుష్టుపులు (సంస్కృత ఛందస్సు) :
రామచంద్ర రమానాథా! నీ మంత్రమే అనుక్షణం,
నా మనమ్మున నిర్వాదం, నీ మూర్తికై నిరీక్షణం! 1244

నీ యనుగ్రహమందంగా ఈ యహల్య యహర్నిశం
కాయల్ కాయగ నేత్రంబుల్ రాయై వేచె నిరంతరం! 1245

ఇంద్రవజ్రము :
శ్రీరామ నీపూజను చేయలేకన్
నోరార పిల్వంగను నోరురాకన్
చేరంగ లేవంగను చేతకాకన్,
శ్రీరామ నీసేవ చరించలేకన్. 1246

ఇంద్రవజ్రము :
నీనామ మంత్రంబునె నెమ్మితోడన్
మౌనంబె ధ్యానంబుగ, మానసంబే
యానంద వాసంబుగ నాదిదేవా!
వేనోళ్ళ నిన్నెంచుచు వేచియుంటిన్. 1247

సింహరేఖ :
రామచంద్ర దేవ దేవా!
భామ నన్ను కావ రావా!
నామ మాత్రముంటి నయ్యా
స్వామి నిన్ను చూచు కోర్కెన్! 1248

ఉ. వందల వేల యేండ్లిచట బందిగ నుంటిని గ్రావమందు, నా
డెందము వీగి పోయె మది డిందెను శేముషి మూగవోయె నే
మందును రామచంద్ర మనమందున మాత్రము రామనామమే
పొందికతో స్మరించితిని ప్రొద్దులు రాత్రులు నన్నివేళలన్. 1249

తే.గీ. కరి వరద! నీ విచటనుండి గాక వేరు
దారిని మిథిలానగరము జేరిన యెడ
రాయినై మరెన్ని సహస్ర హాయనంబు
లుండియుందునో తలచిన గుండె లదరు. 1250

కం. ఎంతటి దయాగుణుండవొ,
ఎంతటి యాదరము తోడ నీ విధి నన్నున్
వింతగ కాపాడితివో
ఇంతగ పొగడంగ దేవ! ఈ సతి తరమే. 1251

తోటక వృత్తములు :
రమణీయ గుణోజ్జ్వల రామవిభూ!
ప్రముదమ్మున వేడెద భవ్యపతీ!
నమితంబుగ మ్రొక్కెద నన్నెపుడున్
కమలోద్భవ వందిత కావు మయా! 1252

కమలంబుల పోలిన కన్నులతో
విమలంబగు నీ యభివీక్షణతో
కుమతిన్ నను క్షాంతిని గోముగ నో
కమలా ప్రమదాపతి కాంచుమయా! 1253



తమకంబున మ్రగ్గెడి దానను నన్
సముఖమ్మున చేర్చుచు సాకు ప్రభూ!
శమథమ్మున చేకొని శౌరి హరీ!
ప్రమ నిచ్చుచు బ్రోవుము రామ విభూ! 1254

సుగంధి :
రామ! రాఘవాధినాథ! రార! నన్ను బ్రోవరా!
శ్యామలాంగ! ఆత్మయందు శాంతి నింపు దేవరా!
నామమంత్ర ముచ్చరించు నన్ను చేరదీయరా!
ప్రేమమీఱ నిన్నుకొల్చు బేల నన్ను సాకరా! 1255

ధ్రువకోకిల (లేక) తరళం :
పరమ పావన భక్త వర్ధన పాప నాశన రాఘవా!
నిరతి తోడను నిన్ను గొల్చెదు నేర్పు నిమ్ము కృపాకరా!
మఱపులేకను నీదు రూపము మానసమ్మున నిల్పరా!
చరమకాలము లోన నాత్మను జ్ఞానసంపద నింపరా! 1256

వ. స్వామీ! నీ కొరకై ఇన్నాళ్ళుగా వేచియుంటిని. ఈ నాటికి నీ కరుణ నాపై ప్రసరింప చేసితివా ప్రభూ! 1257

రథోద్ధతం :
కోమలాంగ! నిను కోరి వేడెదన్
నామ మంత్రమున నన్ను కావగన్,
బాము బాపి భవబంధ మోచనల్
ప్రేమతో నొసగి ప్రీతి నేలగన్. 1258

పాదప వృత్తం :

రావడి తీరగ రాఘవనాథున్
కావుమటంచును కౌస్తుభ హారున్
పావననాముని భావమునందున్,
వావిరి నిల్పుచు ప్రార్థన చేతున్. 1259

భుజగశిశు రుత :

జయము జయము మహాత్మా,
జయము కలుగ సతమ్మున్,
నయ మనమునను దేవా!
ప్రియ మరయుదును రామా! 1260

వ. జయము జయము రామచంద్రా! ఓ విశ్వేశా! ఓ అనాది నిధానమా, నీకు జయము కలుగును గాక! ఓ రాఘవా! ఓంకార స్వరూపా! సకల పాప సంహారకా! నీకు జయమగుగాక, ఓ భవబంధ విచ్ఛేదకా! నీకు జయమంగళ మగుగాక, ఓ సర్వ వ్యాపకా, ఓ రఘునందనా, ప్రసన్నుడవుకమ్ము. నా పాలిటి అదృష్టమా, మహా విష్ణూ! నిన్ను నిత్యము తలచు వారికి ఎట్టి కష్టములు, దుఃఖములు కలుగవు కదా.

దేవా! శాపగ్రస్త నైన క్షణమునుండి నేటివరకు సమాధానము దొరకని కొన్ని ప్రశ్నలు నన్ను వేధించుచున్నవి. కష్టము లాప్తులతో చెప్పుకున్నంత నుపశమించునని పెద్ద లందురు కదా. నీకన్న నాకాప్తులెందునను లేరు. నీవే వీని పరిష్కారముల నాదేశించ వేడుచున్నాను. 1261

## 12.10. అహల్య స్త్రీగా తనకు జరిగిన అన్యాయములను శ్రీరామున కెత్తి చూపి విలపించుట

చం. నలువకు పుట్టితిన్ జగతి నన్నువ నొందెడు నందచందముల్
కలిగి యహల్య పేరుగొని గౌతముడన్ మునినాథు భార్యనై



యలఘు విధిజ్ఞులైన నిగమాగమ వేద్యుల కంటి పుత్రులన్,[5]
పలికిడిదేమి యన్నిటను ప్రజ్ఞ గలట్టి సతీమణిన్ ప్రభూ! 1262

వ. కాని మహానుభావ! మా తండ్రి విధి లిఖించిన నుదుటి రేకలు వక్రించి నవి కాబోలు, ఏ పాప మెఱుంగక నా సంసారమును సాగించుకొను చుండ, 1263

ఉ. వాసవు డెప్పుడో నను వివాహము నాడ తలంచెనంట, న
న్నా సమయమ్మునన్ జనకు డాదట గౌతమమౌని కిచ్చె, దా
నం సురనాథు డీర్ష్యపడి, నా పయినల్గి, మదీయ మానమున్
నాశముచేయ బూనె – మరి నాయెడ వాని కిదేమి కక్షయో. 1264

వ. దేవేంద్రుడు నా పడకగదినుండి వెలికి పాఱి వచ్చుట చూచిన నా భర్త, 1265

ఉ. దోసమెదేని చేసినద, దుష్టయ నాచెలి యంచు తల్చకన్
రోసముతో నిజంబును నిరూపణ చేయక ఏక పక్షతన్,
వాసవు మోసమెంచక అభాగ్యను నన్ను శపించ న్యాయమే!
నా సఖి యీమె యంచు మది నన్ను శమించక, జాలి లేకిటుల్. 1266

ఉ. వాసర కాలమా, నెలయ, వత్సరమా, యుగమైన కాదు – నే
చేసిన తప్పు కాదయిన – చింత యొకింతయు లేక మౌని యా
వేశముతో నిరంతర నివేశము ఱాతిని చేయ శాప మా
శాసనగా నొసంగె – నొక సంయమి కొప్పునె యిట్టి చర్యయున్. 1267

మ. శిలలో నేనిట మాటగూడ కఱవై చేతంబులో స్రుక్కి గా
సిలి యుండన్ ముని కాంతలున్, సఖులు నా శీలంబు చర్చింప, లో

కులు నన్నున్, కథలందు కావ్యముల సంకోచంబు లేకుండ పుం
శ్చలిగా ముద్రను వేయ నా యెడదలో స్యందించవే నెత్తురుల్. 1268

తే.గీ. ఈ యపప్రథలు సమయు టెట్లు స్వామి!
నీ కరుణచేత బ్రతికితి నేడు తిరిగి,
ఐన లేచి నే చాటగా లేను దుశ్చ
రితను గానని – కాని భరించలేను. 1269

తే.గీ. ధాతయు మునియు నింద్రుండు ధరను జనులు
ద్రోహమును చేసి నారలీ తొయ్యలికిని,
నాయెడ నపవాదము లాపి నన్ను పూర్వ
వృత్తి నిష్కలంకను చేయుమీ మహాత్మ! 1270

వ. తప్పుచేసి, నాభర్తచే శిక్షలుగొన్న సంక్రందనుండు దేవేంద్రుడగుట కడు సమర్థుడై కొలది దినములలోనే శాపోపశమనమును పొంది సుమధ్యా పీఠంబునుండి లోకముల నేలుచు, అనేకాప్సరః కాంతా పరిష్వంగంబులన్ దేలుచు, సకల సంపదల ననుభవించుచు, సుఖంబుగ వెలయు చున్నాడు. వీని దుష్కృత్యముల నెవ్వరును ఖండించరు గదా! నేను నిస్సహాయను, దైవోపహతను, అబలను గాన, 1271

కం. చేయున దేమియు లేకను,
నాయను వారెవరు లేక నలగుడు వడుచున్,
ఆయివలెన్ పడి యుంటిని,
పాయని మానస శరీర బాధలతోడన్. 1272

ఉ. గాలి భుజించుచున్, మగని కాళ్లు భజించుచు, నొంటి మంటలన్
తౌలుచు నన్ సృజించిన విధాతృ జపించుచు, చిత్త గుండమం



దాలములేక రామ నిను నాత్మ యజించుచు నిత్యమున్ ప్రభూ
వేలిమి కట్టెనై వెలిగి వేచితి నీవిట వచ్చు వేళకై." 1273

వ. ఈ విధముగా దీనయై గౌతమపత్ని వినుతింప, రామచంద్రు డామెతో నిట్లనెను. "మాతా! నీ తపముచేతను, స్తోత్రముచేతను నేను ప్రసన్నుడనైతిని. తపము లేని వారలకు నేను సాధ్యుడను కానని యెరుగుము. నీ దీనస్థితిని తలచుకొని కలత చెందకుము. ఈ నాటి నుండి నీవు సకలపాప విముక్తి పొందితివి. మరియు, సహస్రాననుడు మీ పర్ణశాలను కళంకము చేసిన నాటనుండి, నీవు శిలా ఖండంబున నున్నంత వరకు జరిగిన విషయములు నీ స్మృతి పథంబున నుండకుండు గాక. నీవీ నాటినుండి నీభర్తనుచేరి అశేష సౌఖ్యముల ననుభవించుచు నిరంతరముగ నిశ్చల వైష్ణవభక్తి పరాయణురాలవై, కాలాంతమున ముక్తి పొందుదువు గాక," యని యహల్య నాశీర్వదించిన కరుణాసముద్రుడు, శ్రీరామునిపై దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. విశ్వామిత్రు డహల్యా రామచంద్రులను కనుల పండువుగ వీక్షించి, వారి సంవాదమును వీనుల విందుగా విని, ఆనందబాష్ప సంభరితుండయ్యెను. అప్పు డచటకు గౌతమ మునీంద్రు డేతెంచి, శ్రీరాముని పూజించి, కౌశికున కభివందనంబుచేసి, అహల్య నాదరించి వారందరను తన యాశ్రమంబునకు గొనిపోయెను. 1274

**వివరణలు:**

1. ఒక సంస్కృత శ్లోకానికి ఇది తెలుగు రూపం.
2. ఇది సంస్కృతమహాకవి భారవి రచించిన 'కిరాతార్జునీయం' అను గ్రంథములోని ఒక శ్లోకభాగం.
3. త్రిష్టుప్ ఛందస్సుకు చెందిన ఇంద్రవజ్రం వృత్త పాదానికి త,త,జ,గగ గణాలు. అదే ఛందానికి చెందిన ఉపేంద్రవజ్రానికి జ,త,జ,గగ గణాలు. ఈ రెండు వృత్తాలకు గూడా పాదాద్యక్షరానికి ఎనమిదవ అక్షరం యతి. ఈ రెండువృత్తాలు ఒకదానికొకటి చాలా దగ్గరగావుంటాయి.

జగతీ ఛందస్సుకు చెందిన ఇంద్రవంశ వృత్తంలో, పాదానికి త,త,జ,రలు గణాలు. పైవాటిలాగే యతి ఎనిమిదవ అక్షరమే.

ఈ గ్రంథంలో 'ఉపేంద్రవంశ' మనే క్రొత్త వృత్తం వ్రాశాను. దీనిలో పాదానికి త, ర, జ,ర అను నాలుగు గణములు. యతి ఒకటి యేడవ అక్షరములకు కూర్చితిని. ఈ గణ క్రమం, యతిస్థానం ఈ వృత్తానికి ఒక చక్కని శైలి సమకూర్చిందని నా అభిప్రాయం. అందువల్లనే ప్రయోగాత్మకంగా ఒకపద్యం ఈ గ్రంథంలో పొందుపరచాను. విద్యాధికులు, విద్వాంసులు దీనిని హర్షించెదరని నా నమ్మకం. మన కవివరేణ్యులు జగతీ ఛందస్సులో ఎక్కువగా వ్రాసే 22 వృత్తాలకు ఇప్పటి ఉపేంద్రవంశం కలిస్తే 23 వృత్తములగును.

4. ఇక్కడ నేను వ్రాసిన తెలుగు అనుష్టుపులలో రెండు మూడు వ్యవహారికపదాలున్నవని, వానిని ఎత్తిచూపించి అవి మార్చి గ్రాంథిక సమ్మతమైన శబ్దాలు వ్రాయుమని ఆదేశించారు. కాని ఇప్పటి మాటల తోడనే పద్యాలు వినసొంపుగా నున్నవని, ఆ మాటలను మార్చకుండా నాలాగుననే వదిలివేసితిని.

5. అహల్యా గౌతములకు శతానంద మహర్షిగాక, ఇంకను పుత్రులున్నట్లు తెలియుచున్నది.

***



# 13. మిథిలా ప్రయాణ ఖండము

## 13.1. ప్రభాతాగమనము

వ. రామ లక్ష్మణులు, కౌశికుండును నా రాత్రి గౌతముని యాతిథ్యమును స్వీకరించి, యా యాశ్రమంబున విశ్రమించిరి. 1275

సీసబంధ ద్విపద :

పొలివడి లోనికి పోవుటే గాని,
వెలువడి తిరిగి మరలుటయె లేని,
కాలమనియెడు 'చీకటి గుండ' మందు,
వేలారహితమగు ఆలాయ మందు,
కలసి పోవుచు మరొక్క దినము కరగి,
నిలిచె తియ్యని స్మృతివలె మది మరగి–

కలిలమౌ విధిబద్ధ కక్ష్యలో సరిగ
వలగొని భూగోళ మలవడి తిరుగ,
లలి తెల్లవారెను, తొలిసంజ పొడిచె,
వెలుకబాఱుచు మసకలు భువి విడిచె. 1276

వ. అంత రామ లక్ష్మణులు మేల్కొని నిత్యానుష్ఠానంబులు పూర్తి గావించి, విశ్వామిత్ర మునీంద్రుని పూజించి, ముని, శిష్యగణంబులతోగూడి, గౌతమాశ్రమములోని అసమాన సుమభరిత నందనవన సమంబైన అహల్యోద్యానవన శోభను తిలకించుచు, ఆ ప్రాంతజనపదంబుల మీదుగా గంగనుదాటి మిథిలా నగరమును చేర ప్రయాణమై ముందునకు సాగిరి. 1277

తే.గీ. అపుడె యుదయమందిన సూర్యు నరుణకాంతి
కొలది కొలదిగ నన్ని దిక్కులకు కవిసి

నేలతల్లికి పారాణి నిమిరెననగ,
ప్రకృతి కాంత కన్నదె నవ వధువు వోలె. 1278

తే.గీ. మొల్ల, సంపంగి, తంగేడు, పొగడ, మల్లె
మొల్లముల నుండి బహువర్ణ పుష్ప వృష్టి
నింగి హరివిల్లు నేలకు వంగు చుండె
ననగ నానంద మొనరించె నవని పతుల. 1279

ద్విపద:
తొలిజామునందె జనులను మేల్కొలుప,
లలితమై ప్రకృతి వఱలెనని తెలుప,
కొలకొల కొక్కొరోకో యని యార్చె,
చెలసి కుక్కుటములు గళముల తీర్చి –
అలికిడి విని లేచి అతివలు కుదిలి,
చెలువుల కౌగిళ్లు సలివడి వదలి,
వలిగొని కిదుకు డింభకుల నేమార్చి,
కెలవున పాలిచ్చి, తలివము చేర్చి,
వలదుగ ముంగిళ్లపై రంగవల్లి
కలను తీర్చిరి కలాపుల జడి జల్లి; 1280

వ. అంత జనులు తమ దైనందిన కార్యముల నిమగ్నులైరి. ఆ ప్రభాత సమయమ్మున, 1281

ద్విపద:
వెలుగుకు తలడిల్లి కలువలు ముడిగె,
తొలి తొలి సెగలకు వలిపిరు లుడిగె,



కెలవున జతలయి పులుగులు కూడె,
చెలసి మోదమున కోకిలములు పాడె,
హలము చేపట్టి రైతులు చల్ది యన్న
ముల గొని వెడలిరి పొలములు దున్న;

తులకింప సూర్యుండు తూరుపు కొండ,
నలుదెసల నెలసి వెలుగులు నిండ,
కలగొన్న పొగమంచు గరికపై నెరసి
తళతళమనుచు రవ్వలవలె మెఱసి,
ఇల నసంఖ్యాత సూర్యులను పోలంగ,
చలపడి కిరణముల్ మలిపె ననంగ –
ఎలసిన ఊష్మాన ఇగిరె నటంచు
తలప రస విదులు – తొలగెను మంచు;

జల పరీవర్తిత సప్తాశ్వ నరుణ
విలసిత బింబంబు కొలనుల తరుణ
నళిన కాంతలు కని ననువు రాణింప,
వలపుతోడను తనువులు పులకింప,
తలల నూపుచు స్వాగతము తెలుపంగ,
కలయ గుప్పిన అనంగ లయ లనంగ,
నొలసి మధుర గంధమిళితమై యొప్పి
మలయ మారుత మిలాతలమును గప్పె. 1282

## 13.2. గుహుడు రామ లక్ష్మణాదులను గంగానదిని దాటించుట

వ. ఆ ప్రకారముగ రామ లక్ష్మణు లుదయభానుని కవోష్ణ కిరణముల గిల గింతలకు చలించిన ప్రకృతి కాంత పులకింతల తిలకించి యానంద

సంభరితులై, విశ్వామిత్రుని గూడి, కొంత తడవునకు గంగానదీతీరమును జేరి యా నది దాటుట కచటగల యొక నావను సమీపించిరి. అప్పటికే ఆ తీరంబున శ్రీరాముండను ఇక్ష్వాకుకుల రాజకుమారుడు తన పాదరజముతో నద్భుతంబుగ గౌతమపత్నికి శాపవిమోచన మాచరించె ననియు, నాతండు కౌశికునితో కలసి గంగానదిని దాటుట కటకు వేంచేయుచున్నాడన్న వార్త వ్యాపించెను. 1283

చం. [1]గుహుడను నావికుం డొకడు గొప్ప ఋషీంద్రుడు పూర్వ జన్మలో
ప్రహత మునీంద్ర శాపమున పల్లె కులంబున జన్మమంది తా
నహరహమున్ రఘూద్వహుని నార్తి జపించగ నారదాజ్ఞచే
రహిత దురాకృతుండగుచు రాముని రాకకు వేచె నచ్చటన్. 1284

కం. రాముని చరణములు కడుగ,
బూమెలు నశియించి శాప మోచన తథ్యం
బౌ మఱవకు మను సంయమి
దీమస మదిలోన నిపుడు దిగ్గన మెఱయన్. 1285

కం. పరుగున శ్రీరాముని గొని
మురువుగ కూర్చుండ బెట్టి బుజముల పైనన్
తిరముగ గంగా జలముల
చరణములు కడుగ మొదలిడ – సౌమిత్రి వెతన్, 1286

ఆ.వె. తరణి దరికి పర్వి త్వరితంబుగా నంత,
గుహుని నాపి యధిక కోపమునను
"ఏమి చేయుచుంటి వీవు రాముని" కన్న
పలికె నిట్లు గుహుడు నలువు మిగుల. 1287



తే.గీ. "నాకు గలదొకే యొక్కటీ నావ స్వామి!
ఝరికి నద్దరి నిద్దరి జానపదుల
రేవు దాటించి వారిచ్చు కేవుతోడ,
పొట్ట పోషించు కుందుము పొలతి నేను. 1288

ఉ. అద్దరి కేగ నా పడవపైనను రాముడు కాలు నానుచో
తద్దయు వాని పాదరజ ధారణచేతను నావ యందమౌ
ముద్దియయైన నా బ్రదుకు బుగ్గయి నాశనమౌను గాదె! నా
కిద్దర నాడువాండ్ర భరియించెడు స్తోమతలేదు దేవరా! 1289

[2]తే.గీ. గర్భిత వచనం :
'పడవ కొయ్యకాన నిదెట్లు పడతియౌ నటంచనకు డిది కఱ్ఱయే యైన,
ముందు తాపసి యొకడు భార్యకు శాప మిచ్చెనేమొ, పడవయై పడియురడ
నిచట – కనుక', స్వామీ! నే నప్రమత్తతతో నుండ దలంచితిని. 1290

ఉ. కర్కశమైన ఱాయి యొక కామిని యయ్యెను చూచుచుండగా
నర్కకులాగ్రగణ్యుడు, మహాత్ముడు రాముని పాదపద్మ సం
పర్కము సోకి, యీ పడవ భామిని యౌట విచిత్రమెట్లగున్!
తర్క మదేలనో మన కుదర్క మెరుంగగ శక్యమా ప్రభూ! 1291

తే.గీ. అందు మూలాన శ్రీరాము నంఘ్రి యుగళి
చక్కగాను కడుగుచుంటి నొక్క ధూళి
లేశమైనను లేకుండ వీసమంత
రంగదుత్తుంగ భంగయౌ గంగ నీట." 1292

వ. అన విని యచటనున్న వారందరును గుహుని హాస్య మిళిత వాక్చాతుర్యమునకు నవ్వుకొనిరి. శ్రీరాముడు మందస్మిత వదనుండై తన పాదములను కడుగుటకు వాని కనుజ్ఞ నిచ్చెను. అంత, 1293

చం. కడిగె గుహుండు – పూర్వ కృత కర్మము లెల్లను తత్క్షణంబులో
నడగి యెడందలో కలుష మంతయు నంతము జెంది శాంతి యె
ల్లెడల ప్రసారమైనటుల నింపుగ దోచ, విరించికైన నే
తడవకొ గాని యందని గదాగ్రజు కోమల పాదయుగ్మమున్. 1294

కం. సింగారించిన కడవను
గంగా జలము గొనితెచ్చి కాకుత్స్థునకున్
చెంగున పాదములు కడిగి
రంగుగ నలదె గుహు డంగరాగము ప్రీతిన్. 1295

అ.వె. రామ మంత్రజపము రక్తితో జేయుచు
రామ పాదములను రాచి కడిగి,
క్షాళిత సలిలంబు కండ్ల కద్దుకొనుచు
తలను జల్లుకొనియె తనిసి గుహుడు. 1296

వ. పిమ్మట, వారెల్లరను నావపై గంగ కావలి యొడ్డు జేర్చుచు, రామ పాదక్షాళనా మహాత్మ్యంబున తన కుదయించిన వివేకముచే శ్రీరాము నిట్లు కీర్తించెను. 1297

ఉ. "వేసవిచే తపించబడి వేసరి వేచిన చాతకంబు కా
కాశమునన్ కనంబడిన కజ్జల నీలపు టంబుదమ్ముచే
గాసి నశించు భంగి, నిను గన్న క్షణంబున పూర్వ సంసృతిన్
చేసిన పాపముల్ తొలగి చిత్తము స్వాస్థ్యము చెందె దేవరా! 1298

వ. మేఘశ్యామ సుందరాంగా! రామచంద్రప్రభూ! నీవు వర్షాకాల మేఘమును పోలుదువు. 1299



కం. ఆ మేఘములో లీనం
బై మంచువలెను సలిలము వ్యాపించును, నీ
శ్యామల దేహంబున ని
ష్కామంబగు కరుణ వెలయు సంపూర్ణం బై. 1300

ఉ. ఏమని చెప్పుదున్ మహి నహీన తపంబొనరించినన్ పరం
ధామ! త్వదీయ పాద యుగ దర్శన యోగము దక్కబోదు నీ
యామతిలేక, కాని మరి యజ్ఞుడ, మూర్ఖుడ నాకుదక్కె – నీ
ప్రేముడి మూలమై హృది వివేక మహోదయమయ్యె రాఘవా! 1301

ఉ. ధారుణిలోన నీ చరణ దాస్యము నూటికొ కోటికో నొకం
డారయ పొందునేమొ తమ యాదృతి కల్గిన – నీ పదాబ్జ వి
స్ఫారిత దివ్య రేఖలను జానుగ వీక్షణ చేయు భాగ్య మిం
పారగ నాకొసంగితివి, సార్థతకల్గె మదీయ జన్మకున్. 1302

వ. నీ పదయుగ్మాధోతలంబుల గల శంఖ చక్ర పద్మాది రేఖలు వీక్షించిన నాకు పునర్జన్మ ముండునే. 1303

కం. [3]నీపాదాంగుష్ఠము లలి
పాపౌఘ హరమయి కుముదబాంధవు సమమౌ;
ఆ పావన నఖ భవ రుచి
చూపర వైచిత్ర్యమగును చోద్యం బిదియున్. 1304

ఉ. [3]ఏలనినన్ భువిన్ కనగ నిందుని దీప్తి మహోత్పలంబులన్
వ్రాలి ముణుంచు, కాని యిది భక్త జనాళి హృదంబుజంబులన్
లీలగ విచ్చచేయు నటులే యది సంద్రము పొంగజేయగన్
చాలిక నిద్ది ఘోర భవసాగర మింకగ జేయు చిత్రమై. 1305

వ. ఈ విధంబుగ భవన్నుఖ కాంతి విలక్షణమై యొప్పుచున్నది. అటులే, నీ దయ అనంతమైనది. శాశ్వతమైనది. సర్వ జీవరాశియు నీ దయకు పాత్రులే. రామా, త్రిలోక వాసులను రక్షించు నీవు నిష్పక్షపాతివి, నిష్కల్మషుడవు, దీనజన బంధుడవు. 1306

ఉ. నేరను స్వామి నేను భవనీరధి నీదగ – గుండముల్, కర
ళ్ళారటగొల్పు, లోతులన నార్తి, మొసళ్ళన భీతి, దీనుడన్ –
వారక నీవు దీనజన బంధువు, కావున నెంచి చూడగా
కూరిమికాడ నౌదును రఘూద్వహ! – నన్ను తరింపజేయవే! 1307

కం. ఎడదెగని దాహమయ్యెను.
పడియుంటిని భవజలధిని పాన పిపాసన్,
తడయక తరింప జేయుచు
కడచేర్చగ వేడుకొందు కారుణ్య నిధీ. 1308

శా. చింతా క్లేశ మహార్తి బంధయుత మక్షీణంబు దాహంబు నా
స్వాంతంబున్ తపియించి సంతతము నన్ బాధించు నీ తృష్ణ తా
నంతం బొందును గాక! నీకృపను బ్రహ్మానంద పీయూష మ
గ్నాంతఃప్రజ్ఞ వరించు గాక ప్రభు! రాకాధీశ తుల్యాననా!" 1309

కం. గుహుడా విధి వినుతించగ,
మహాదయా సంయుతుండు మానుష సింహుం
డు హసిత ముఖారవిందుడు
సహృదయత ననె రఘువరుడు సమచిత్తమునన్. 1310

కం. "మెచ్చితి గుహ నీ భక్తికి
నిచ్చెద నడిగిన వరముల నిమ్ముగ నీకున్



హెచ్చుగ వలసిన వడుగుము,
మచ్చికతో తీర్చుకొనుము మదిలో కోర్కెల్." 1311

చం. అన విని ముగ్ధుడై గుహుడు హార్దికవందనముల్ మనంబులో
కొనలిడ నిచ్చి రామునకు కూర్మి ననెన్, "తమ పాద పంకజాం
కనముల శంఖ చక్రముల కాంచిన నాకిక కోర్కెలుండునే!
మనసగునే యపాంపతి నిమగ్నుని కెన్నడు పిల్లకాలువల్! 1312

వ. ఓ రఘునందనా! సదా నీ సుందర విగ్రహంబును నా మనమ్మున నిల్పి నిరంతర ధ్యానమగ్నుడనై నీ నామ మంత్రాస్వాదన భాగ్యమును దయసేయ వేడుదు"నని, రాముని నుతులు చేయుచు, వారందరను గంగానది కద్దరికి పడవపై చేర్చెను. అంత భక్తజన పక్షపాతియగు శ్రీరామచంద్రుడు వానిని కౌగలించుకొని, "గుహుడా! మమ్ము నదిని దాటించినందుకు నావ కేవు తీసుకొ"మ్మని కొంత రొక్క మివ్వబోవ, చతురవాక్య విశారదుడగు గుహు డీ విధంబున పలికెను. "ఓ ఇనకులతిలకా! 1313

ఉ. నీవొక నావికుండవును, నేనును చూడగ నావికుండనే,
ఈవిధి నావపై జనుల నిద్దరి యద్దరి చేర్తు గ్రాహ న
క్రావృతమైన గంగపయి నట్టులె భక్తతతిన్ భవార్ణవం
బావృత పాపపంకిలము నాదృతి దాటగ చేయు చుందువున్. 1314

కం. కావున నో రామా! యొక
నావికుడు మరొక్క యనుజ నావికుని కడన్
కేవును గొనకుండు నటుల,
నీవును నాకీయ వలదు నీరజనేత్రా! 1315

కం. సమయము వచ్చిన యప్పుడు
తమ కృపతో భవజలధిని తమితో దాటిం
చుము కేవడుగక – అదియే
ప్రమోదమును గూర్చు నాకు ప్రణవాకారా!" 1316

వ. అంత భక్తజన కల్పద్రుమం బగు శ్రీరామచంద్రుడు గుహుని యాశీర్వదించి, మిత్రమా! నిన్ను నేనెన్నడును మరువనని ధైర్యము చెప్పి, వానిని వీడ్కొనెను. 1317

## 13.3. విశ్వామిత్రునితో గూడి రామలక్ష్మణులు మిథిలా నగరము చేరుట

వ. ఆ విధముగ గుహుని నావపై గంగ కుత్తర తీరమును చేరి రామలక్ష్మణులు దాపునగల విశాలపురమును వీక్షించి, ఆ నగర మాహాత్మ్యమును విశ్వామిత్రుడు వివరింప కౌతుకమున విని యానందించి ఆ రాత్రి యచటనే విశ్రమించిరి. మరునాటి ప్రభాత సమయమున వారు విశ్వామిత్ర మునీంద్రుని వెంటనంటి ఈశాన్య దిశగా ప్రయాణించి అనతి దూరముననున్న మిథిలా నగరమును ప్రవేశించిరి.

నగర ముఖమున మునీంద్రుని రాకకై వేచియున్న సైనికులు రాజోద్యోగులను హెచ్చరింప, వార లేతెంచి కౌశికాదులను స్వాగతించి జనసమ్మర్దము లేనిచోట విశాలమును, మనోహరమును, స్వచ్ఛజల సమృద్ధము నైన ఒక మామిడితోపున గల భవనములో వారిని వసింప జేసిరి. 1318

తే.గీ. అంత కౌశికాగమనంబు హర్ష మొదవ
వినుచు జనక భూపాలుండు తన పురోహి
తుడు శతానందముని గూడి తులుచ వచ్చి,
అర్ఘ్య పాద్యముల నొసగి యనియె నిట్లు. 1319



ఉ. "స్వాగతమయ్య యజ్ఞ పరివర్ధన! మా మిథిలా పురంబు మీ
యాగమనంబుచే సుకృత మయ్యె, కృతార్థులు నైరి పౌరులున్,
మీ గణనీయమౌ కృపకు మెండుగ సంతస మయ్యె మాకు, మా
యాగము మీదు దర్శన మహాతిశయమ్మయి శోభ గాంచెడున్. 1320

కం. నే మును జన్మములందున
నేమముతో చేసిన క్రతు నిర్వహణము నా
కీ మనువున ఫలమిచ్చెన్
స్వామీ! మీరాక దీని సత్యము చేసెన్. 1321

ఉ. మీరు దయామతిన్ మముల మిన్నగ బ్రోవగ మా పురానకున్
భోరున వచ్చినారలు ప్రమోదము చెందితి – నా కుమారి కే
నారయుచుంటి భర్తను స్వయంవరమందున విక్రమోన్నతున్,
మారుని బోలు రూపసిని, మార్గణ శాస్త్ర ధురీణు, సద్గుణున్. 1322

కం. కావున నాపై దయతో
వావిరి సూచనల నీయ వేడుదు స్వామీ!
నైవేశికముగ పుత్రికి
దీవన లొసగంగ కోరి తెలతును మౌనీ! 1323

వ. బ్రహ్మర్షీ! మీరు సామాన్య మునులుగారు. ఋషిశ్రేష్ఠులు. మీ వంటి పృథ్వీ మిత్రులు, జన ప్రియులు సదా పూజనీయులు. మీరెక్కడయున్న నక్కడ సనాతనసంప్రదాయ వర్ధన మగును. ప్రజలు సుఖింతురు. దేశము సుభిక్ష మగును. 1324

తే.గీ. బ్రహ్మ మానస పుత్రుడౌ ప్రథిత తపసి
ముని వసిష్ఠుని తోడనే మోహరించి

పట్టు విడువక బ్రహ్మర్షి పదము గొనుట
చిన్న విషయమె మునివరా! చింతజేయ. 1325

తే.గీ. ఆశ్రితుల రక్షసేయంగ నధిక శ్రమను
పాటుబడుటన్న వెన్నతో పాటు తిన్న
విద్దె మీకు, త్రిశంకుడు, విధి హతుండ
యిన శునఃశ్శేపుడును సాక్షు లిందులకును. 1326

ఆ.వె. సృష్టికర్త ధాత కీడైన బ్రహ్మర్షి
పుంగవుండ వీవు పూత చరిత!
నీ ముఖమ్ము నుండి నియతమై గాయత్రి
మాత ద్విజుల సాకు త్రాతయగుచు. 1327

వ. ఓ మహామునీ! మీరు బహుముఖ ప్రజ్ఞావంతులు. దుష్ట శక్తులచే నగచాట్లు పడుచున్న సనాత నార్షమత సంప్రదాయోద్ధరణ మందున మీ ప్రతిభ ప్రకాశితమౌ చున్నది. 1328

ఉ. దానవ శక్తిచే నణగి తద్ద కృశించి సనాతనార్ష వి
జ్ఞానము దీనమై తలరి నక్కుచు నుండగ మీరు పూని ప్రా
మాణిక సంప్రదాయమును మానక యజ్ఞములెన్నొ చేయుచో
వానిని కూల్చ రక్కసులు – వారిని సుంతయు లెక్కసేయకే. 1329

శా. మీరీ మధ్య వినూత్నమౌ హవనముల్ మేటిల్ల చేయించుచో
మారీచాది నిశాచరుల్ కుపితులై మాంసంబు హోమాగ్నులన్
హేరాళంబుగ జిమ్మ నా దనుజులన్ శిక్షించి యజ్ఞంబు శ్రీ
మీఱంగన్ జరిపించిరంచు విని సంప్రీతిన్ జన స్తోమముల్, 1330

కం. సంతసిలి యార్ష లోకం
బంతయు నభివందనంబు లర్పించిరి మీ



కెంతయొ ఋణపడితి మనుచు,
వంతలు తీరెడు దినములు వచ్చె నటంచున్. 1331

మ. సవరక్షార్థము రాచ బాలురను రాజత్వ ప్రభావంతులన్
రవిసంకాశుల నిర్వురన్ నిలుపుచున్ రక్షస్సమూహంబులన్
బవరంబందున కూలజేసిరనుచున్ వ్యాపించె మీకీర్తి – క్షా
త్రవ తేజంబు పునఃప్రతిష్ఠ గొనియెన్ రాగిల్లి మీ మూలమై. 1332

వ. కొంత కాలము మున్ను కొంద రవివేకుల దుష్కృత్యముల మూలమున, మహా తపస్సంపన్నుండు, నప్రతిహత విక్రముండు, యుగపురుడుండునౌ భార్గవ రాముం డిరువదొక్కమారులు దండెత్తి ఈ దేశక్షాత్రమును క్షతగాత్రము గావించిన విషయము మన కవగతమే గదా. ఇట్లు నిర్వీర్యమైన క్షాత్రవ తేజమును మేలుకొల్పుచు, సనాతన మతము నుద్దీప్త మొనరించుచున్న మీకు మా హార్దిక స్వాగతమని జనకుండు తలయొగ్గి నమస్కరించిన, 1333

తే.గీ. కౌశికుండు సంతోష సక్త హృదయుడయి
జనుల కుశల భాగ్యంబుల చక్క నరసి,
జనకు దీవించి యజన విజయము కలుగ,
తన సవము గూర్చి వివరించి తద్ద ననియె. 1334

## 13.4. విశ్వామిత్రుడు జనకునకు రామలక్ష్మణులను పరిచయము చేయుట.

మ. జనకా! నీ వనినట్లు నా క్రతువు నస్తవ్యస్తముంజేయ వ
చ్చిన రాత్రించర బృందమున్ ధనువుతో చిత్రంబుగా నేల గూ
ల్చిన యా యిర్వుర బాల విక్రముల వీక్షింపంగ నాశ్చర్య మ
య్యెను మా యాశ్రమవాసు లెల్లరకు – నీ వే చూడ నేమందువో. 1335

ఉ. అందున నగ్రజుండు మహితాత్ము డమానుష కృత్య సాధకుం
డందఱి ప్రీతిపాత్రుడు మహాశుగ శాస్త్ర విశారదుండు, వా
డందము నందనంగసము [4]డానక దుంధుభి తుల్య గాత్రుడున్
చందురు బోలు మోము గల సౌమ్యుడు, నీల పయోద వర్ణుడున్. 1336

కం. వారిని నీవు కనగను, న
వారిత తాండవుని ధనువు వారలు కనగన్,
వారిని గొనివచ్చి తిటకు
వారిజ నేత్రుల నపూర్వభవ వైభవులన్. 1337

వ. అని విశ్వామిత్రు డా క్షత్రియ యుగళంబును గొని రమ్మని శిష్యుల కాదేశించిన, వారు చని దరినున్న యపురూప సుమ ఫల సంయుత వనంబున గ్రుమ్మరు రామ లక్ష్మణులకు ముని యాజ్ఞ నెఱింగించిన, వారంత సంయమి యున్న కడ కేతెంచు చుండ, 1338

కం. వచ్చెడి యనుజుల జనకుడు
విచ్చిన కనులార్ప బోక వికసిత ముఖుడై
అచ్చరువొందుచు చూచెను,
మచ్చిక నచ్చరుల చూచు మర్త్యుల వోలెన్. 1339

తే.గీ. కొన్ని క్షణములు వీక్షించి చెన్ను మీఱ
జనకు డీరీతి పలికెను సంభ్రమమున –
"మంగళము నీకు మునినాథ మహిత చరిత!
ఇట్టి శుభలక్షణుల చూడ హృదయ మలరె. 1340

సీ. ఇభ సింహ శార్దూల వృషముల దీపించు
నలసత్వ ముత్సాహ మతిశయ మ్మ



హంకార వృత్తు లుద్యమితమ్ములౌ చతు
ర్విధ గమనములతో వెలయు చుండి,
కార్ముక, తూణీర, ఖడ్గాసి ధారులై,
రణరంగ ధీరత్వ గుణము చెలగి,
అందచందంబుల నశ్వినీ దేవతా
సదృశులై వెలుగొందు సౌరు గలిగి,

తే.గీ. అంగ, విగ్రహ, జానువాద్యవయవముల
యందు ప్రతిభతో సింహసంహననునట్లు,
పద్మనాభుని కెనయైన వారలనుచు
తోచు నీ బాల యోధుల చూచినంత. 1341

తే.గీ. లలిని తనురుచుల్ ధవళ నీలములె గాని,
దేహ నిర్మాణ పరిమాణ తేజములను
ఇంగితాకారముల యందు నించు మించు
యొకరి కొక్కరు సరిదూగు యువకు లరయ. 1342

తే.గీ. కన్నులందున కదలాడు కమ్ర కాంతి
మోము నందున నూనూగు రోమ రాజి,
పిడికిటకు చిక్కి చిక్కని పిల్లజుట్టు,
యౌవనాసక్తి ప్రకటించు నంకనములు. 1343

సీ. చిరునవ్వుతో గూడి చిత్తజు రూపులై
యెలయు నీ బాలకు లెవరు స్వామి,
క్షత్రియ తేజంబు కన్నులన్ గన్పట్టు
పురుష సింగంబు లీ ప్రోడ లెవరు,
భాను చంద్రుల వోలె భాసిల్లు దీప్తులు
వెదజల్లు నీ యువ వీరు లెవరు,

ఉరవుగా నీపైన గురుభక్తి వినతులై
చేరు నీ యపురూప శిష్యు లెవరు,
తే.గీ. జీవకోటుల యెదలందు చెలువునింపి
చెలయు మదన వసంతులా తెలుపుమయ్య,
ఎవరు వీరలు సంయమీ ఎవరి వారు!
ఓజ వేంచేయుచున్నారు రాజసమున. 1344

తే.గీ. పురుష జన్మకు ఫలముగా ముక్తి కాంత
దర్శనంబైన రీతిని తాపసేంద్ర!
ఘన జలదనీల రుచిరాంగు కనగ తనువు
పులకరించెను, మక్కువ పొడమె నాకు. 1345

వ. అని యను నంతలో, రామ లక్ష్మణులు కౌశికుని కడ కేతెంచి, దండప్రణామంబు లాచరించి నిలబడిన, ఆ మునీంద్రుడు జనక భుపాలుని పరిచయము చేయ, వినయ విధేయత లుట్టిపడ వారంత నా మహారాజునకు నమస్కరించిరి. అపుడు విశ్వామిత్రుడు జనకునితో నిట్లనియె, 1346

చం. "అసదృశ రూప శౌర్య సుగుణాఢ్యులు వీరలు రామ లక్ష్మణుల్,
వసుమతిలోన శ్రేష్ఠమగు భాస్కర వంశ పయోధి చంద్రులున్,
ప్రసవిత యీ కుమారులకు వాసవ సఖ్యుడు నీకు ముఖ్యుడున్
దశరథ రాజశేఖరుడు తాదృశ హీనుడు నేటి ధారుణిన్. 1347

కం. వితరణతో దశరథ భూ
పతి నాపై కరుణతోడ పంపెను వీరిన్
పతితుల కర్కశ రాక్షస
తతుల నదుపుచేసి సవము తగ నాదుకొనన్. 1348



ఉ. దారిని దండకా వనము దాటుచు నుండగ మాకు ముందు దు
ర్వార నితాంత దుష్ట యగు రాక్షసి తాటక శాపఘాత వి
స్తారిత క్రోధ తారసిలి తార్కొని చంపగ బూన, మౌర్వి టం
కారముతోడ నొక్క విశిఖమ్మున దానవి కూల్చె రాముడున్. 1349

వ. సకల జీవ విరోధియు, శత మాతంగ బలయుత యగు నా రక్కసి నొక్క బాణమున కూల్చిన యద్భుత పరాక్రమ రాముడీ బాలుడు. తదనంతరము, తాటకా వనము నుండి బయలుదేరి, మేము నా సిద్ధాశ్రమము చేరితిమి. అట నా యజ్ఞ పరిరక్షణ బాధ్యతను రామలక్ష్మణుల కప్ప చెప్పితిని. వారు ధనుర్బాణ తూణీర తనుత్రాణంబులతో సిద్ధపడి, 1350

ఉ. ఇమ్ముగ యజ్ఞవాటికల నెంతయొ శ్రద్ధను కాచుచుండ, రే
ద్రిమ్మరు లగ్ని కుండముల తేకువలేక కరోటులందు ర
క్తమ్మును, మాంసఖండము లుదగ్రత చేకొని జిమ్మ బూనగా,
నమ్ములతోడ నొక్క తెర కల్పన చేయుచు నడ్డె రాముడున్. 1351

వ. ఆ విధంబుగ మింటిపై విచిత్రంబుగ నమ్ముల వల నిర్మించి ఒక్క మాంస శకలంబు గాని, రక్తపు బొట్టుగాని హోమగుండంబుల పడనీయక యజ్ఞంబును రక్షించిన నేర్పరి యీ వ్యుత్పన్న రాముడు. అంతట నా దానవుల నాయకులు మారీచ సుబాహు లూరకొనక రామునిపై ప్రస్తర వర్షంబు కురిపింప క్రుద్ధుడై, 1352

ఉ. చూచుచు రాఘవాన్వయుడు స్తుత్య విభూతిని నేసె రెండునా
రాచము లొక్కమారుగను రాజస మొప్పగ కూర్చి వింట, మా
రీచు డొకస్త్రఘాతమున వృక్కము డస్సి పడంగ వార్ధిలో,
పీచమడంగి కూల మరి వేరొక కోల సుబాహు దైత్యుడున్. 1353

కం. ఆ పాటిని నా యజనము
కాపాడెను రాము డతుల కార్ముక విద్యా
ప్రాపిత పాటవ నిపుణత
కాపురుషుల నుండి భవ్య కారుణ్యముతో. 1354

వ. ఈ విధమ్మున నీతండు యజ్ఞపరిరక్షణ రాముండనందగు"నని, జనక పురోహితుండౌ శతానందుని ముఖం బీక్షించుచు కౌశిక మునీంద్రుడు తిరిగి యిట్లనియె. "తదనంతరము మేము గౌతమాశ్రమమున కేగితిమి. అచట, 1355

కం. కరుణా సింధువు రాముడు
పొరపొచ్చెము తీర శాప మోచన చేసెన్
తరుణి యహల్యకు తన పా
ద రజ స్స్పర్శాప్తి చేత తద్దయు ప్రీతిన్. 1356

వ. ఈ విధంబున నీ శ్రీరామచంద్రుడు కారుణ్యరాముడను పౌరుష నామంబున కర్హుడయ్యె. 1357

ఉ. ఇచ్చ జనించి వచ్చె నిట కీశ్వరు చాపము నెక్కుపెట్ట నా
హెచ్చరికన్ మదిన్ గొనుచు – నింక విలంబము సేయబోక, నీ
కచ్చుదలైన నీ గృహమునందలి శంభు శరాసనమ్ము నీ
సచ్చరితుండు రామునకు చక్కటి చూపుము నీకు మేలగున్." 1358

వ. అనునంత, 1359

కం. తనతల్లికి శాపవిమో
చన రాముని కరుణ వలన జరిగె నని వినన్
మునివరుడు శతానందుం
డనుపమ హర్షంబు నంది యత్తరపడుచున్. 1360



కం. కన్నుల బాష్ప జలంబులు
మిన్నక వరదలుగ కార మేనును పులకన్
విన్నబడంగా రాముని
నన్నున కౌగిలిని జేర్చి యధిక ప్రీతిన్. 1361

కం. మౌనిని విశ్వామిత్రుని
మానితముగ మ్రొక్కుచు పలుమాఱులు భక్తిన్
మానస మందలి బాధను
ప్రాణము పిడికిటను బట్టి ప్రశ్నించె తగన్. 1362

తే.గీ. రామ నృపవరు డాశ్రమారామ భూమి
నెచట తన మాత యున్నదో యెటుల నెఱిగె,
నమ్మ యున్నట్టి శిలనెట్టు లతడు పోల్చె,
నెట్టు లమ్మకు నిజరూప మేర్పరించె. 1363

తే.గీ. తండ్రి వచ్చెనా తనతల్లి దరికటంచు,
నామెను పరిగ్రహించెనా యనియు, వార
లిద్దరును గూడి శ్రీరాము నెంచి మ్రొక్కి
రాయటంచు ప్రశ్నించె సంభ్రమముతోడ. 1364

తే.గీ. కౌశికుం డన్ని వివరించి కాంక్షతీర,
రేణుకా జమదగ్నుల రీతి ప్రీతి
కలిసికొని రహల్యయు గౌతములని తెలిపి
నెమ్మనమున శతానందుని మురిపించె. 1365

వ. "శతానందా! నీవేమియు దిగులు పడవలదు. అంతయును తిరిగి శుభాంతమయ్యె"నని పలికి యా మునికి మనశ్శాంతి కలిగించెను. ఆ మాటల

కుప్పొంగి శతానందుడు శ్రీరామునకు విశ్వామిత్రుని జీవిత వృత్తాంతమును విశదముగ వివరించి, ఆ బ్రహ్మర్షి సర్వతోముఖ ప్రతిభలను సుందరతమ వచనంబుల వినుతించెను.

అంత సాయంసమయ మగుట, జనకుడు మరునా డుదయమున తిరిగి దర్శనము చేసుకొందునని విశ్వామిత్రునికి విన్నవించి విధ్యనుష్ఠానంబులు తీర్చుకొనుటకు తన కోటకు తరలి పోయి, మరునాడు ప్రభాత సంధ్యావంద నాదులను ముగించి, విశ్వామిత్రుని కడ కేతెంచి, ప్రణామంబు లాచరించి, ఇట్లు పలికెను. 1366

## 13.5. జనకుడు రామలక్ష్మణులను గజారూఢులనుచేసి యూరేగించుట

చ. "మునివర! రాత్రి యంత కను మూయక యోచన చేసినాడ – నా
కనులను బాలరాముని ముఖంబె కనంబడి గుండె నించె – నీ
గుణగణితుండె యీ యెడను కూర్మిని రాజ్యము సేయనొప్ప, నా
తనయను పెండ్లి జేయుదును ధన్యతనొంద మదీయ జన్మమున్. 1367

కం. కాని ధనువెక్కు పెట్టిన
వానికి సుత నిత్తుననుచు ప్రకటించితి గా
దే నే మును తొందఱపడి,
నే నా పణమొడ్డ తప్పని తలతు నిపుడున్." 1368

కం. ఆ విధిని చింత చేయుచు
నావేదనజెందు జనకు నా మునినాథుం
డావటిలం జేసి పలికె
నావలకును గొని రహస్యమౌ వచనములన్. 1369



మ. "జనకాధీశ్వర! నీ వెఱుంగని రహస్యం బొక్కటుండెన్ జుమీ
వినుమా శ్రద్ధవహించి, రాముడు ధనుర్వేదాంగ నిష్ణాతుడై
జనియించెన్ భువిపైన నిష్ఠుర నిశాసంచార నాశంబుకై –
మనమందుంచుము తెల్పగా వలదు సుమ్మా దీని నెవ్వారికిన్. 1370

తే.గీ. అందు మూలాన నే శంక చెంద బోకు
మీశ్వరుని చాపమును రాము డెక్కుపెట్టు;
తథ్యమిదిగాన నీవింక తగిన రీతి
పెండ్లి యేర్పాట్లు చేయించు ప్రీతి తోడ. 1371

కం. వీరుడు లక్ష్మణునకు నీ
వారూఢిగ పెండ్లి సేయు మా గుణవతి నీ
యౌరస పుత్రిక నూర్మిళ
నారడమున దూగి జనము లానందింపన్. 1372

వ. నే చెప్పిన విషయములు రహస్యముగ నుంచి, రామ లక్ష్మణులను నీ జామాతలుగా ప్రకటింపకయే, వీరిని ముఖ్య అతిథులట్లు తగిన గౌరవ మర్యాదలు జరిపింపు మన, జనకుండు మహానందభరితుండై, యపుడు శుభ సమయం బగుట, 1373

కం. సరియని దశరథ సూనుల
మురిపెముగ నలంకరించి భూషలతో సం
బరముగ నూరేగించెను
పురజను లెల్లరును ప్రీతి బొరయుచు చూడన్. 1374

కం. పెల్లుగ రాముడు తమ్ముడు
విల్లంబులు చేతపట్టి వీథులయందున్

పెల్లిదమున నూరేగిరి
నొల్లన నుల్లంబులందు నుల్లాసముతో. 1375

కం. ముత్యాల తోరణంబుల
నత్యుత్తమ వాద్య ఘోష లార్భటి తోడన్
ప్రత్యేకేభంబులపై
నత్యాసక్తిని తిరిగిరి యతిశయ మొప్పన్. 1376

వ. అప్పుడు రథ్యల కిరుప్రక్కల గల సౌధంబులనుండి, యువతులు, తరుణులు నొకరి నొకరు పిలుచుకొనుచు హడావిడిగ బైటకు వచ్చి, ఆ యూరేగింపును తిలకించిరి. మరియు స్వాగత సూచకంబుగ, 1377

కం. ఉల్లలిత మధ్యమంబులు
జిల్లన రఘునాథులపయి చిల్లాటగ కో
కొల్లలుగ కుసుమ చయముల
జల్లులు కురిపించి రూరి జవ్వను లపుడున్. 1378

కం. తలదువ్వుచు జడలల్లెడు
నెలతుక కొప్పును తుఱుముచునె గృహాంగణకున్
బిలబిల పర్వెను రాముని
వలరాజ సదృశుని చూచు బలమగు కోర్కెన్. 1379

కం. చీరను కట్టుచు తడబడి
ఓర పయిటవేయ మరచి యొక సుందరి తా
నూరేగెడు రాఘవులను
కేరున చూడంగ పర్వె కిటికీ కడకున్. 1380



తే.గీ. ఉన్నత సదనముల నుండి యువిదలపుడు
రాఘవేంద్రుల పొడగాంచి ప్రమదమునను
వ్రేళ్ళు చూపించి పలికిరి ప్రియ సఖులకు
నొకరితో నొక్క రీరీతి నొడలు మఱచి. 1381

తే.గీ. చెలియ! కంటివటే కోటి చిత్తభవుల
కెనయయిన యీ కుమారుల – మనుజులందు
గాని, స్వర్లోక చరులందు గాని యిట్టి
సుందరాకారు లుందురే యెందునైన! 1382

తే.గీ. అమరులందు త్రిమూర్తులె యందగాళ్ళు,
వారియందున మిన్న యా వనజ నేత్రు
డైన విష్ణువే సుందరుం డందురు కద,
కాని నాల్గు చేతుల వాడు కంతుడగునె! 1383

తే.గీ. అటులె ధాతకు నాలు గాస్యంబులంట,
అష్టమూర్తైన శంభున కైదు తలలు
వీర లందగాళ్ళని చెప్ప వీలు గలదె
నల్ల పిల్ల డీ రాముడే నలువుకాడు. 1384

మ. ఘనుడౌ కౌశిక మౌని యాగమును రక్షాదక్షతన్ బ్రోచి, యో
జ నహల్యాసతి మోచనంబు చరణ స్పర్శానురాగంబు చే
తను సాధించిన నీల మేఘనిభ సప్తాశ్వాన్వయున్ జూడ, నే
వనితల్ చిత్తజు మోహనాస్త్రములచే బందీలు కాకుందురో! 1385

ఉ. సీత తలంప తక్కువయె! సీరము చాలున భూమి పుత్రియై
భూతలమందు పొందుపడె, ప్రోదిని శంకరుచాప మొక్కచో

చేతను త్రోసె క్రిందగల చెండు గొనంగ, ననంగ భామినీ
భాతి వెలుంగు దివ్య తను భాసురదేహ యనంగ నొప్పదే. 1386

కం. మన సీతకు రాముడు జత,
కనగను రామునకు సీత కవయై యొప్పున్,
జనకుని పణమే క్లిష్టము
మును ముందీగాధ యెట్లు ముగియునొ సకియా! 1387

కం. రాముడు బాలుడు, విల్లో
భీమము, రాముడు శిరీష పేశల దేహుం
డామూలాగ్రంబు ధను వ
యోమయ కాఠిన్య సాంద్ర ముగ్రము గాదే! 1388

కం. ఈ విల్లెట్లెత్త గలం
డీ వీరుడు రామచంద్రు డిది సాధ్యంబా!
ఆ విధి యెందులకు మనల
నీ విషమ సమస్యలోన నిపు డిటికించెన్. 1389

తే.గీ. కాని వయసున చిన్నవాడైనగూడ
బాహుబలమున నుగ్రుడీ బాలు డరయ,
కాక యెట్లొంటిచేత రాక్షసుల దునుము!
కనుక తప్పక యెక్కిడు కార్ముకమ్ము. 1390

వ. అంత నటనున్న వృద్ధ పురంధ్రు లిట్లనిరి, 1391

తే.గీ. ధాత తగిన దాంపత్య సంధానమందు
విఫలు డనియెడు నపకీర్తి వినబడు గద,



ఈ యపలభ నధిగమించ నిదియె తరుణ
మా విధికి – వీరలకు వివాహంబు కూర్చి. 1392

తే.గీ. పార్వతీ దేవి కారుణ్య ఫలము వలన,
జానకీ రాములకు పెండ్లి జరిగితీరు,
మ్రొక్కి యాదేవి కిప్పుడే ముడుపు కట్టి
వత్త మని వారరిగిరి దేవళము దెసకు. 1393

వ. ఈ ప్రకారంబుగ తమను చూడ వచ్చిన పురజనులకు మానసిక, నేత్రానందములు కలిగించుచు రామ లక్ష్మణులు ధనుర్బాణంబులచే నొప్పు కరములు, మంచిగంధముచే నొప్పు వక్షములు, పీతాంబరములచే నొప్పు దేహములు కలవారై గజారూఢులై మహోత్సాహముతో పురవీథుల వెంట నూరేగింపుగా నరిగి మహారాజేర్పాటుచేసిన ప్రత్యేక వసతి గృహమును మహర్షులతోబాటు ప్రవేశించిరి. జనకుడు వారిని స్వాగతించి భోజనాది సత్కారములు జరిపించి పగటి శేషభాగమున సత్కథాకాలక్షేపముల నేర్పరిచి సంతుష్టాంతరంగులను గావించెను. 1394

## 13.6. మిథిలానగర వైభవము

వ. మరుచటి నాడుదయమున రామలక్ష్మణులు వినుచుండగ కొందరు ముని కుమారులు కౌశికుని ఛాత్రులతో మిథిలాపుర వైభవము నిటుల ముచ్చటించుకొను చుండిరి. ఆహా! ఈ నగరమెంత సుందరముగా నిర్మింప బడినది. అట్లే అలంకారములందునుగూడ ఇది అత్యున్నత స్థానమును గొని, అమరావతితో పోటీపడుచున్నది కదా! 1395

తే.గీ. ఊరి నడిబొడ్డు నందున నున్నతమగు
రాజ సౌధంబు లొప్పారు రమణతోడ

చూడ ముచ్చట గొల్పెడు సుందరమగు
శిల్ప కుట్టిమ కుడ్యాది శ్రీల నొప్పి. 1396

తే.గీ. ఇంద్రపురి బోలు నీ కోట కేంద్రముగను
రాజ మార్గంబు లెన్మిది ప్రస్తరించు
సూర్య కిరణము లనునట్లు చోద్యమగుచు
చాల దూరంబు దాకను సరళగతిని. 1397

తే.గీ. అన్ని రథ్య లతివిశాల మైన వరయ
వాజి గజ రథారూఢ కాల్బల పుర జన
బృందములు ప్రక్క ప్రక్కల నేక కాల
మందు వీటిపై పోవ వీలౌ విధంబు. 1398

తే.గీ. బాట ప్రక్కల దీప కంబంబు లమరు,
వాటి మధ్య వేత్తల శిలా ప్రతిమలుండు,
రంగు రంగుల రాళ్ళు తోరణములట్లు
వ్రేలు చుండును నలువుగా వీటి నుండి. 1399

తే.గీ. వీటి వెనుక పంక్తులలోన వివిధ వర్ణ
రూప పుష్పచయము పూచు ద్రుమ నివహము
లుండు, చెట్ల నీడలను కూర్చుండ రంగ
వల్లు లలికిన తిన్నెల వరుస లుండు. 1400

తే.గీ. రాజ మార్గములకు నిరుప్రక్క నుండు
సంజవనము లున్నత హర్మ్య, సౌధ
ములును వీటిలో ప్రతియహము సభలందు
జటిలమైనట్టి చర్చలు జరుగు చుండు. 1401



వ. ఈ సభా ప్రాంగణములందు, 1402

సీ. వేద పాఠంబులు వినిపించు నొకచోట,
నుపనిషత్తుల గోష్ఠి లుండు నొకట,
సాహిత్య, నాటక చర్చలొక్కొకచోట,
సంగీత సాధనల్ జరుగు నొకట,
గ్రహముల గమనాది గణనంబు లొకచోట,
తర్క, వ్యాకరణ శాస్త్రంబు లొకట,
జంతు, మానవ వైద్య చర్చలొక్కొకచోట,
శస్త్రాస్త్ర విజ్ఞాన సాధనొకట,

తే.గీ. నాట్య మభినయ విన్యాస నటన లొకట,
విశ్వకర్మల నిష్ణాతృ విద్యలొకట,
విద్య నర్థించు యువకుల వితతు లొకట,
ఒకట పరవిద్య, లౌకిక మొక్కచోట. 1403

తే.గీ. రథ్యలకు నడ్డముగ సంసరణము లొప్పి
కలుపు దారుల పడుగు పేకలను వోలె,
ఇచట పురజన వాసంబు లెలయు, మండ
పంబు, లట్టములు, నిశాంత పంక్తు లలరు. 1404

తే.గీ. ఊరిలో కొంత దూరాన నుండు విపణు
లందు వేర్వేరు గిడ్డంగుల వివిధ తర
గతుల వస్తుచయము లమ్మకంబు కొరకు
నిలువ చేయుదు రవియేవి కలియ కుండ 1405

తే.గీ. నగర మందచట నచట నలువుగాను
స్వచ్ఛ పుష్కల సురుచిర వారి పూర

షండ మండిత కమల కాసార చయము
లందముగ మణిఖచితమై విందుగూర్చు. 1406

తే.గీ. ఇచట నెలకొన్న ప్రత్యేక వృక్షతతుల
యందు వివిధ వర్ణములైన సుందరతమ
కుసుమ చయములు శోభిల్లు కొమరు మిగిలి,
చూచువారల మనముల దోచు కొనుచు. 1407

తే.గీ. పట్టణ ద్వారముల కిరు ప్రక్కలందు
బలిసిన కరులు కాపుగా నిలిచియుండు,
వలసి నట్లుగ చతురంగ బలము కోట
వెనుకను నిలిపి యుంచిరి వెలయకుండ. 1408

తే.గీ. యాగమును చూడ వచ్చిన యతిథి రాజ
పుత్రులు నివసించు కొరకు పురము బైట
నున్న పండ్లు, పూతోటలం దుఱువుగాను
కట్టినారలు వేర్వేరు కట్టడములు. 1409

వ. ఈ విధముగ సాగుచున్న సంభాషణ విన్న రామ లక్ష్మణులు మిథిలానగర శోభను తిలకించు కుతూహలంబు మనంబుల నుత్తేజ పరుప, విశ్వామిత్రుని దరికేగి ప్రణమిల్లి, 1410

కం. జనకుని నగరము సుందర
మని జనులందురు కనుకను యభిమతమైనన్
మునివరునకు మే మొకపరి
చని చూచెదమనిన. మౌని సరియని పలుకన్. 1411



ఉ. అంతట రామ లక్ష్మణులు హర్షముతో చని పట్టణంబులో
వింతలు వేడుకల్ గనుచు, విస్తృత రథ్యల, గోపురంబులన్,
కాంతులనీను రత్న మణి కాంచన నిర్మిత హర్మ్య సౌధముల్,
భ్రాంతిని కొల్పు యంగడుల వస్తు చయమ్ములు చూచి ప్రీతితో. 1412

కం. అటునిటు గ్రుమ్మరి వారలు
యటగల యొక యుపవనంబు యాదృచ్ఛిక సం
ఘటనగ లోనికి జొచ్చిరి
దిటవున- ప్రమదావనమని తెలియక వారల్. 1413

## 13.7. సీతాదేవి ప్రమదావనంబున దుర్గామాతను పూజించుట

వ. అది యట్లుండ, కడచిన దినమున 1414

చం. జనకుని పుత్రియున్, జలధిజాత జనార్దను జాయ యంశమున్
గొని భవమొందినట్టి నవ కోరక కోమల సీత రాత్రియం
దున కలగాంచె - నా కలను తూణ కలంబ ధరుండు సింహసం
హననుడు నీల నీరద సమంచిత దేహు డొకండు కన్బడెన్. 1415

కం. మకరధ్వజ సమరూపుని
ప్రకటిత దోర్మధ్య బాహుబల సంపన్నున్
వికసిత ముఖియై మేల్కొని
ప్రకర్షమున నామె వాని ప్రతి చిత్రించెన్. 1416

కం. చిత్రమగు కలను తలచుచు
రాత్రిని నిదురించకుండ రమణీమణి భూ
పుత్రిక వేచెను పంకజ
మిత్రుని రాకకు విరహము మించగ నార్తిన్. 1417

కం. చిత్తజుని తాప భరమున
చిత్తరువును చేగొని తన చెలికత్తియతో
నత్తరమున దుర్గ గుడికి
నత్తినబత్తిని పరువిడె నామెను వేడన్. 1418

వ. ఆ విధంబున మరునా దుదయంబున రాజకుమారి సీతాలలామ రాజ ప్రాసాదంబు వీడి తన ప్రత్యేక ప్రమదావనంబున గల యాలయంబు ప్రవేశించి లోకమాతయగు దుర్గకు ప్రణమిల్లి షోడశోపచారంబులతో పూజించి ఈ విధి నుతించెను. 1419

ధ్రువకోకిల:

"జనని పార్వతి, గౌరి మాతరొ, శాంభవీ, జగదంబికా!
పొనరు పున్నెము నిన్నుగొల్చిన భూధరేశుని పుత్రికా!
జనుల బ్రోతువు శాంతిదాయిని! సర్వమంగళ కారిణీ!
కనకదుర్గవు కాంక్ష చేసిన కామితార్థము లిత్తువే! 1420

మత్తకోకిల :

నిన్ను వేడిన వారికెప్పుడు నీలకంఠుని భామినీ!
సన్నుతించిన సజ్జనాళికి శ్యామసుందర సోదరీ!
పన్నుగా మనమందు కొల్చిన ఫాలనేత్రుని కామినీ!
చెన్నుగా దరిజేర్చి కోర్కెల శీఘ్రరీతిని తీర్తువే. 1421

వనమయూరం:

చెప్పెదను తల్లి విను చేతమున కోర్కెల్
చిప్పిలెను స్వప్నమున చెన్నుగను దేవీ!
కుప్పలుగ పూవిలుతు కోలలవి ధాటిన్
కప్పుచును నాయెదను గాఢముగ నాటెన్. 1422



[5]శంకరప్రియ:

నిన్న రాతిరి నిద్రలో
చెన్నుగా కలగంటినే,
మిన్నయౌ యువకుండు నన్
నన్నుతో దరిజేర్చెనే. 1423

ఉ. నమ్మితి నేని నిన్నెపుడు నా మనమందు నుమామహేశ్వరీ!
అమ్మహనీయరూపుడు, మహాశుగ ధారుడు నిన్న రాత్రి చి
త్రమ్ముగ స్వప్నమందు తన దర్శనమిచ్చిన నీరదాంగుడే
నెమ్మిక నాకు భర్తయగు, నీ యనురాగ విశేష మూలమై. 1424

ఉ. ఇంతకు భిన్నమైన భరియింపగ జాలను తల్లి, యాతడే
యింతకు ముందు జన్మముల నీశ్వరునానగ భర్తయై నటుల్
స్వాంతము పల్కుచుండె, మనసంతయు నాతని తోడు నీడనై
యింతకు ముందు నేను సుఖియించిన జ్ఞప్తులె నిండె మాతరో." 1425

కం. అన విని శాంభవి శ్రీసతి
కెనయగు జనకజ పిలుపున కెలరారుచు సీ
తను దీవించెను, "సఖి! నీ
మనమున గల కోర్కె తీరు మంచిగ" ననుచున్. 1426

వ. సీతాకాంత యా రీతిని దేవళమ్మున దుర్గామాతను ప్రార్థించుచుండ ఆలయము వెలుపల, 1427

తే.గీ. ఆ సమయమందు చెలికత్తె యచట చూచె
నుపవనమ్మున విహరించు యువక యుగము

నందు సీత గీచిన చిత్రమందున గల
పురుషు బోలిన రూపాన వఱలు నొకని. 1428

ఉ. అంతియగాక యా సుదతి యా నృపసింహులు కోసలాధిరాట్
సంతతి వారలంచు బహు శౌర్య గుణాఢ్యులటంచు, వారినే
యింతకు ముందు నాడు వసుధేశుడు గౌరవమొప్ప పట్టణం
బంతయు త్రిప్పె హస్తిపయి నంచు నెరుంగుచు సంతసంబునన్, 1429

కం. పరుగున సీత దరికి చని
మురిపెముతో పల్కె నిట్లు, "ముదితా! నీ పం
జరమున శుకమున్న కనక
పొరతెరువున వెదకి నీవు పొరబడితిగదే! 1430

కం. రమ్మొక పరి వెలుపల కో
కొమ్మా! ఇటు చూడుమమ్మ కోరిక తీరన్
పమ్ముగ నిన్నటికల నీ
నెమ్మనమును దోచినట్టి నెమ్మికకానిన్." 1431

తే.గీ. అపుడు జానకి తమితోడ నాలయమ్ము
వీడి దరిని మృదులతాంత వృంతములను
కోయు చున్నట్లభినయించి కోర్కెతోడ
దిక్కులను వెదకెను ప్రియ దృష్ట మొదవ. 1432

తే.గీ. చెలి కిదేమి తెలియకుండ చేయి చూపి,
సీత వ్యర్థ ప్రసంగంబు చేసె నిట్లు,
"తరుణి! తమితోడ యీ చిన్నితముల తీగ
చెట్టు కెగబ్రాకు నేలకో చెప్ప గలవె." 1433



తే.గీ. అనగ చతురయౌ చెలికత్తె యనియె, "తగిన
యొడయు డొడగూడ సతులును తడవుగాక
అల్లుకొనిపోవు టిట్లు సహజము కాదె-
చూడ నీవె సామ్యంబౌదు చోద్యముగను." 1434

వ. అంత సిగ్గుతోడ తల వంచి, సీత చిరుకోపము నటించుచు, "నా కన్న నీకే తొందర యున్నట్లున్నదే సఖీ!" యన్న ఆ చెలికత్తె ఇట్లనియె, 1435

నారాచక వృత్తం:
"ఔనమ్మ యేలకాదు! నీ
ప్రాణమ్ము దోచుకొన్న వా
డే నమ్మ సూర్య వంశజుం
డైనట్టి రాముడే సుమా!" 1436

తే.గీ. అంత మాటను మార్చంగ నవని జాత,
దరినిగల తియ్య దానిమ్మ తరువు చూపి,
"దీని ప్రాణప్రదమ్ముగ నేను ప్రీతి
పెంచి ఫలియింప చేసితి పెలుచ నిట్లు." 1437

తే.గీ. అనిన, చెలికత్తె ఔనౌనటంచు పలికె,
"ఎంత ఫలవంతమైనదో ఇంతి పూన్కి,
పుత్రికై తండ్రి సాకేత పురమునుండి
అడిగి తెప్పించె నీ మొక్క ననుచు విందు. 1438

తే.గీ. ఒక్క దానిమ్మయే గా దయోధ్యనుండి
ఇటకు వచ్చునట్టి విషయ మేదియైన

జనక రాజకుమారికి స్వాగతమ్మె
యనుచు నెరుగుదు నమ్మ సీతమ్మ తల్లి!" 1439

## 13.8. వసంతాగమనం

వ. ఈ విధంబున కామినీ మనోవేదనామలిన శృంగార సూచిత సదృశం బులగు సంభాషణంబుల చెలికత్తె చేయు సమయంబున, నించుక దూరంబున, 1440

కం. ప్రమదావన సౌరభములు
ప్రమత్తత కొలుపగ వీక రాముండా ప్రాం
తము గ్రుమ్మరుచున్ చేరె నొ
క మధులతా పుష్ప వాటికా కుంజంబున్. 1441

వ. యౌవనారంభ వయస్కులైన రామలక్ష్మణుల కా ప్రదేశమందలి 1442

తే.గీ. రంగురంగుల పువ్వుల రంగశాల,
రంగశాలను నర్తించు భృంగచయము
లింపుగా తోచె కమనీయ దృశ్యముగను
హోలి యాడెడు రంగారు యువత వోలె. 1443

తే.గీ. పిల్లగాలికి పూబాళ ప్రేంకణములు,
ప్రేంకణంబుల చెలరేగి ప్రీతిగొల్పు
సరస పరిమళ సుమగంధ సౌరభంబు
లపుడు తలపించె నవవసంతాగమమ్ము. 1444

వ. అది మధుమాస మేతించిన సమయ మగుట, 1445



తురగవల్గన రగడ:
ఆమని సొగసుల వరలిన ఆ వని నయ సోయగములు
కామకళా కుసుమ మధుర గంధ పవన సాయకములు,
కూజిత గానములు భ్రాంతి కొలువు హృదయ మోదకములు
వీజిత మృదు శీకరములు, ప్రేమిక జన రంజకములు. 1446

## 13.9. ప్రమదావనమున రాముడు, సీత పరస్పరము వీక్షించుకొనుట

వ. అటుల ప్రకృతికాంత ప్రదర్శించు వసంత శోభకు ముగ్ధుండై, రాముడు వనమును గ్రుమ్మరుచు సీతయున్న పూల మొక్కల గుంపున కించుక దూరంబున కేతెంచెను. అంత, 1447

ఆ.వె. చెట్ల చాటునుండి సీత రాముని చూచి,
అతని పురుషకార మంద చంద
ములకు నలరి, రాత్రి కలలోన తను కన్న
కోమలాంగు డనుచు కులికి తనిసె. 1448

తే.గీ. హతవిధీ! యేలకో నా స్వయంవరమును
చాల కష్టంబు గావించె జనకు డకట,
ఇప్పు డీతడు శివధను వెక్కుపెట్ట
కున్న వీని చేపట్టగా కుదురు నెట్లు. 1449

కం. ఈ విల్లమోఘమైనది,
కావున నీ వీరు డెత్త గలడో లేడో,
ఆ విధియే యెరుగును, నా
భావియు నేవిధి లిఖింప బడెనో యేమో! 1450

ప్రమాని:

భవాని దీవనుండగన్,
వివేక హీననై యిటుల్,
కువాద మేలనాకు, రా
ఘవేంద్రుడే లభించెడున్" 1451

వ. చెట్టునుండి పొడవైన రెమ్మ చివర వ్రేలాడుచున్న మామిడిపండును పొందు ప్రయత్నంబున క్రింద నిలిచి చేయిచాచ, ఆ పండు గాలికి నిటు నటు యూగి, ఒకపరి చేతి కందినట్లును, ఒకపరి యందక దూరమైన విధంబున సీత సర్వమెరింగియు, మానసంబున మానవ సహజమైన యనుమాన సంయుత వితర్కము ముప్పిరిగొన, తను వలచిన శ్రీరామచంద్రుని భర్తగా పొందు నాకాంక్ష సఫలమగునో గాదో యను ఆశా నిరాశల మధ్య నూగులాడుచు, దుర్గాదేవి దీవెనలు తనకున్నను, కీడు శంకించుచు దోదూయమానమానసయై యుండ, అట పొదలలో నున్న రామచంద్రుడు, 1452

ఉ. ఆకుల చాటు నుండి యపు డప్పుడు వీచెడు గాలి రాకకున్
పోకకు నూగు మంజరుల ప్రోకల మధ్యను కానుపించు స్వ
ర్లోక వధూటినా, వసుధ రూఢి రమా లలనావతంసనా,
సూకదళాయతాక్షియగు సుందరి సీతను జూచి ముగ్ధుడై. 1453

కం. పులకలు పొడవగ తనువున
లలి నిదమిత్థమనరాని లాలిత్య విభా
వ లహరి యెయ్యెదియొ నెడద
వలగొన, స్వాప్నిక విహార భావోద్దీప్తిన్ 1454

వ. తేలిపోవుచు నిట్లు తలబోసెను. 1455



ఉ. "ఇందనుకన్ మదీయ మన మీగతి నెన్న డనంగయోచనల్
పొందగలేదు కాని యిట పూపొదలన్ వనలక్ష్మివోలె నీ
కుందన కాంతులీను నవ కోమల వారిజ గంధి గాంచినన్
సుందరమైన భావనలు చోద్యముగా మది నిండి రేసెడున్. 1456

తే.గీ. ఎన్నొ జన్మల బంధమ్ము లిమిడి నట్లు,
ఎన్నొ యుగముల సావాస మెలమి నట్లు,
ఎన్నొ కల్పాల సాఫల్య మెలసి నట్లు,
తోచె నాకీమె భావంబు గోచరింప. 1457

మ. కనగన్ వీలగునే త్రిలోకముల నీ కాంతా లలామ స్వరూ
పను, కందర్పుని పుష్ప బాణములకున్ వాసంబునౌ వీక్షణల్
మనమందున్ వెలయించుచున్నవి గదా మాధుర్య సంకేతముల్,
పనిగొంచున్ విధి నైపుణిన్ జగతి చూపన్ దీని కల్పించెనో. 1458

వ. బ్రహ్మ తన సృష్టిలోని విశిష్ట వస్తువుల నుండి అవయవముల కుప యుక్తమగు విశేష గుణముల నేరి ఈ భామను సృష్టించె ననిపించును. ఎట్లన, 1459

సీ. పద్మముల నడిగి పాదయుగ్మమునకు
పరమేష్ఠి గొనివచ్చె పసిడి వెలుగు,
చిగురుటాకుల కోరి చెన్నుగా నిప్పించె
పాణితలములకు పట్టు నునుపు,
పగడాల దీవుల వలకట్టి తెప్పించె
నొప్పగు నధర బింబోష్ఠ దీప్తి,
సాంద్ర ధవళ పూర్ణచంద్రికా కాంతిని
తిగిచి యిప్పించె లేనగవు కరయ,

తే.గీ. తుమ్మెదల వేడి కల్పించె చిమ్మ చీక
టులను బోలు రంగు చెలి కుంతలలు మెరయ,
[6]తెలుగు లిపి నుండి 'ళ' నడిమి తెచ్చి చేసె
మహిళకు కటి, పయోధర మధ్య మిట్లు." 1460

వ. అటుల తలంచుచు, 1461

ఉ. అందనుకన్ మరందకము నారగ గ్రోలియు తృప్తిలేక నిం
దిందర మెట్లు పద్మమును తృష్యత వీడగలేదొ యాగతిన్
సుందరి జానకీ వదన సూన విలోకన మాపలేక నా
యందము మూటగట్టి మనమందున నిల్పుచు రామచంద్రుడున్. 1462

వ. తమ్ముని వంక తిరిగి యిట్లనియె, 1463

తే.గీ. "తరణి వంశజు లేనా డధర్మమాచ
రింప బూనరు, కాని నా కింపు మీర
చెట్లమాటున యువతిని చేరి దృష్టి
మరల కున్నది యేలకో యెరుగ నైతి." 1464

తే.గీ. అంత లక్ష్మణుం డనియె, "మహాత్మ! ధర్మ
మూర్తివి పరనారీ పరాఙ్ముఖుడ వీవు,
కలను గూడ నీ మనసన్యకాంత పైన
లగ్నమై యుండుటెట్లు వీలౌను స్వామి! 1465

చం. కనుక నవశ్య మీమె జనకాత్మజ కావలెనంచు నా మన
మ్మున ననిపించుచుండె, పరిపూత చరిత్రుడు కౌశికుండు తె
ల్పినయటు లీవు త్ర్యంబకుని విల్లును తప్పక నెక్కుపెట్టి నీ
మనసును చూఱగొన్న సతి మానుగ గెల్చుట తథ్యమౌ నికన్. 1466



వ. ఇంతియేగాక రామచంద్రా! వినుము, 1467

తే.గీ. మగువ చూడంగ నామది మాతృమూర్తి
యన్న భావంబు కలిగె, మా యమ్మయౌ సు
మిత్ర కనులందుగల ప్రేమ మెండుగాను
ఈమెలో కానబడియె నా కినకులేశ! 1468

ఉ. ఈ వరకాంత నొక్క క్షణ మీక్షణ చేసితి నీ నిమిత్తమై
పావనమైన యీ యువతి పాదములందున దృష్టి నిల్పి, నే
సేవలు చేసి సంతతము శ్రేయము, పుణ్యము మూటకట్టగా
భావికి యోగ్యమివ్వెయను భావన కల్గెను చేతమందునన్. 1469

వ. రామా! మనమింక తిరిగి పోవుట మంచిది. ఇప్పటికే ఆలస్యమైనది. గురువులు మనకై వేచి యుందు"రని లక్ష్మణుం డనిన, వారిద్దరును వనమును వీడి విడిది కేగిరి. అచ్చట గూడను రాముడు వనమున తను చూచిన కన్యనే మనమందు నిల్పి విరహసంయుతుడై యుండెను.

వనమున సీతాదేవియు, శ్రీరామునే ధ్యానించుచు అంతఃపురమునకు తరలిపోయెను. 1470

---

**వివరణలు:**

1. గుహుని ఉపాఖ్యానము వాల్మీకిరామాయణములో అరణ్యకాండమున చెప్పబడినది. కొన్ని రామాయణములలో నున్నట్లు ఈ గ్రంథమున ఇది బాలకాండలోనే జరిపించితిని.

2. ఈ తే.గీ. గర్భిత వచనములో కామాలకు మధ్య నున్నది తేటగీతి ఛందస్సులో నున్నది.

3. ఈ రెండు పద్యముల తాత్పర్యము : నీకాలి బొటకన వ్రేలిగోరు చంద్రునివలె ప్రకాశించును. కాని, దాని కాంతి మాత్రము (చంద్రకాంతికి) విలక్షణముగనున్నది. ఏలననిన, భూమిలో చంద్రకాంతి పద్మములను ముకుళింపచేయును, కాని నీ

నఖచంద్రదీప్తి భక్తులహృదయపద్మములను వికసింప చేయుచున్నది. అటులే, చంద్ర కాంతి సముద్రమును ఉప్పొంగ చేయును. కాని నీ గోటిచంద్రుని వెలుగు సంసార సముద్రమును ఇంకిపో చేయుచున్నది. రెండవ పద్యములోని 'ఇది' యనగా, 'నీ కాలి బొటనవ్రేలి చంద్రకాంతి' యని అర్థం. అది యనగా భువిలోని చంద్రకాంతి.

4. ఆనకము= తమ్మెట; దుందుభి= భేరి, ఇవి వాద్య విశేషాలు (అమరకోశం) (ఆనకదుందుభి అని కృష్ణుని తండ్రి వసుదేవునికి పేరు కలదు.)

5. భద్రక వృత్తం (ర,న,ర, యతి లేదు, ప్రాస మాత్రమే ఉంటుంది) వ్రాద్దామనుకుంటే, ఈ పద్యం వచ్చింది. దీని గణాలు ర,స,లగ, లేక, ర,ల,ల,ర, అంటే భద్రకానికి ఒక మాత్ర తగ్గింది. ఛందో గ్రంథాలు చూస్తే దీనికి పేరు దొరకలేదు. పై పద్యంలో, ఎదోలాగ ఒక లఘువును మధ్య గణంలో ఇరికించి దీనిని భద్రకం చేయవచ్చు. కాని క్రొత్త పద్యం నడక బాగుందని, గణములకు అనురూప్యం (Similarity) ఉందని అలాగే ఉంచేశాను. ఈ క్రొత్తవృత్తానికి నా ఇష్టదైవమైన శంకరునికి ప్రీతిపాత్రంగా 'శంకరప్రియ' అని పేరు పెట్టాను. ఒక చిన్న విషయం పద్యంలో చెప్పాలంటే ఇటువంటి వృత్తాలు ఉపయోగపడును.

6. ఈ సీసపద్యంలోని ఎత్తుగీతలో, శ్రీరాముడు సీతాదేవి నడుము తెలుగు భాష లిపిలోని 'ళ' అనే అక్షరం మధ్య వలె (కటి, కుచములకు మధ్య అతి నాజూకుగా) నున్నదని వర్ణించినట్లు వ్రాసితిని. అయితే, రాముని కాలానికి తెలుగు భాష లేదు. కనుక ఈ వర్ణన కొంతమందికి విడ్డూరంగా వుండవచ్చును. కలియుగంలో కీ.శ.21 వ శతాబ్దంలో వ్రాస్తున్న నేను, ఈ గ్రంథ పాఠకులూ, ఇరువురము తెలుగువారమే గనుక, ఈ లిపి మనకు తెలుసును కనుక, ఈ ప్రయోగం చేశాను. ఇదిగాక, ఈ గ్రంథంలో రాముడు తెలుగురాముడు ఈ విషయం, సీతారామకల్యాణ ఘట్టాలలో ఇంకా నిరూపితమౌతుంది.

***



# 14. శివధనుర్భంగ ఖండము

## 14.1. ధనుర్యాగ సభా సమావేశము

కం. మఱుదిన మధ్యాహ్నంబున
నురుతేజోవంతుడు జనకోర్వీ నాథుం
డొఱుపుగను ధనుర్యాగం
బెఱిగించి తన సభలోన నేర్పడజేసెన్. 1471

కం. ఆహ్వానమున్న వారలు
వహ్వాయని మీసమెత్తి వచ్చిరి సభకున్,
ప్రహ్వాయము లేని జనులు
ప్రహ్వంబౌ మస్తకముల వచ్చిరి కాంక్షన్. 1472

వ. ఆహ్వానమును పొందిన మానవాధీశ్వరులేగాక, ధనుర్యాగమున తమ అదృష్టమును పరీక్షించుకొనదలచిన అనాహూతులైన దేవ, దానవ, గంధర్వ, యక్ష, వానర, మానవాదుల తోడను, విదేహ రాజోద్యోగుల తోడను, శివధనుస్సు నెక్కుబెట్టు వేడుకను చూడవచ్చిన పురప్రముఖుల తోడను సభ నిండుగ నుండెను. అంతఃపుర స్త్రీలు, మునికాంతలు, ప్రముఖ పౌరాంగనలు సభామందిరము చుట్టునున్న మేడల నుండి యుత్కంఠతో సభాకార్యక్రమమును వీక్షించు చుండిరి. సదస్సు నలంకరించిన వివిధ వర్గంబుల స్వాంతంబుల జొరగల్గినచో, వారి ఆలోచనలు, ఆకాంక్ష లీరీతి నున్నట్లవగాహమగును. 1473

కర్ణాట చౌపదులు:
వీరులై విల్లెత్త వేంచేసి నట్టి
ధారుణీ పతులంత తలపోసి రిట్లు:

"తీరుగా శివ ధనువు ధృతి నెక్కుపెట్టి,
ఈ రాజు పణమైన ఇంతి చేపట్టి,
ఈ రతి సదృక్షయౌ ఇలాసుత గూడి
తారుణ్య భోగాల తనరి తూగాడి,
ఈ రాజ లోకాన ఎలలేని ఖ్యాతి,
తోరంబుగా గొందు తులలేని రీతి".

మునులు నుద్యోగులును పురజనులు ప్రీతి
మనసులో ననుకొనిరి మమత నీ రీతి :
"కనగ మన వైదేహి కమనీయ గాత్రి,
వనజాక్షి వరజాత వసుమతీ పుత్రి,
అనుపమ సుగుణగణుం డసమాన శూరు
డనంగ నిభ సుందరు డతులుడౌ వీరు
డనుకూల సహచరుం డైనట్టి వాడు
ధనువెత్తి దొరకొనుత ధవునిగా నేడు!" 1474

షట్పదులు :

వాసికెక్కిన రాణివాసాన పూబోడు లీశాని నీరీతి కోరిరంత:
"హౌసుగా మనముందు భాసిల్లి పెరిగిన ఈ సీత పెండ్లన్న యెంతొ వింత,
కౌశికుం డీ కన్నెకోసమై గాలించి కోసలయందుండి యెంతొమెచ్చి,
ఆ సప్త తురగ వంశాశాకిరణమైన ఈ సామజ గమను గొనుచువచ్చి
ఈ సుందరాకారు నీ సారస నయను నీ సాధు గుణ గణు ధీవిశాలు
నీ సవ రక్షకు నీ సురద్విషవైరి నీ శాంతమూర్తి పూర్ణేందు ఫాలు
మా సీత పెండ్లాడ – నో శాంభవీ దేవి! ఆశీస్సు లిమ్మమ్మ" యనుచు మీరి,
ఆ సరసిజలోచనా సముదయ మపు డాశించి నారలు తమిని చేరి. 1475



మధురాక్కర:

జనక నరపాలు డించుక జాగృతిని మనమందు
గొనుచు సభను కలయచూచి కూడిన వీరవరుల,
జనపతుల, యోధులను గాంచి శమహీన చిత్తవృత్తి
కనలి తలపోసె నీరీతి కనుకొన లెర్రబడగ. 1476

మహాక్కర:

"ఎందరో వీరు లీనాడు వచ్చినా రిట కిది తలచినంతను మాత్రమ్ము
కొందరైనను విల్లు నెక్కిడ గలుగుదురేమొ యనుచు నాదు హృదయమ్ము
కుందె – జగదభిరాము సమరభీము గుణధాము రఘువంశరాము
నేడు
పొందికగ నా దుహిత పొందునా యని పొంచె మనమున కీడు. 1477

త్రిపదులు:

ఎందులకై వింటి నే నరుంధతి మాట
నెందులకీ విల్లు నెత్తు
పందెము చేసితి న"నుచు,
కొందలపడి జనకుం డెదను విచార
మొందె పరిపరి విధముల,
ముందేమి జరుగునో యనుచు. 1478

తే.గీ. "ఎందరెందరో వచ్చినా రీ సదస్సు
నిండె నైనను గాని రాముండు రాడు,
సభయు మొదలయ్యె విల్లెత్తు సమయమయ్యె",
ననుచు వైదేహి తమకాన నార్తి జెందె. 1479

వ. ఇట్లు సభలోని వారు పలు విధములుగ తమలో తా మాలోచించు చుండిరి. 1480

ఉ. అంతట రామ లక్ష్మణు లనర్ఘ లలామ లలన్తికావళుల్
కాంతులు జిమ్మి దిక్కుల ప్రకాశ మొనర్పగ, చాప బాణముల్
పొంతను నిల్పి, హస్తిపయి పొల్పుగ వచ్చిరి కంతులోన దు
ర్గాంతరమందునున్న సభ కందరు చూడ మునీంద్రు వెంబడిన్. 1481

రథోద్ధం :
రామలక్ష్మణులు రాజసంబునన్,
సామజంబు పయి స్వారిజేయుచున్,
రామలాయెడను రక్తి చూడగన్,
దీమసన్ సభకు దీప్తి వచ్చియున్. 1482

తే.గీ. అటుల వేంచేసి పురుష సింహంబు లచటి
మునివరుల మ్రొక్కి వారి దీవనల గొనుచు,
సభను ప్రత్యేకముగ నున్న స్థానములను
చేరి యుపవిష్టులైరి కౌశికుని చెంత. 1483

వ. ఆ సమయంబున, 'యద్భావం తద్భవతి' అను ఆర్యోక్తి ననుసరించి, సభలో వివిధ జన వర్గముల కపుడు ప్రవేశించిన శ్రీరామచంద్రుడు డిట్లు వివిధ భావరూపములతో దర్శనమిచ్చెను. 1484

సీ. విల్లెత్త వచ్చిన వివిధ భూపతులకు
వీరత్వమాకృతి తీరినట్లు,
రాక్షస శ్రేణికి రౌద్రమూర్తి వలెను,
విద్వాంసులకు విశ్వ వేద్యు రీతి,
మునివరులకు యజ్ఞ పూరుషుని విధము,
పురజనులకు కృపామూర్తి వోలె,



నవనీశ మిత్రుల కానంద రూపిగా,
నంతిపుర సతులకాత్మభువుగ,
తే.గీ. ననుపమానందమున దేలు జనక భూమి
పతికి యుక్త కన్యాదాన ఫలమువోలె,
జానకికి లెక్కలేనన్ని జన్మజన్మ
ల యనుబంధ దివ్యానంద లహరి భాతి. 1485

## 14.2. స్వయంవరమునకు వచ్చిన రాజులు రాముని యెడ మత్సరగ్రస్తులగుట

వ. అదియట్లుండ, ధనుర్యాగంబునకు విచ్చేసిన వివిధ దేశాధిపులైన రాజులలో కొందరు రాముని యెడ మత్సరగ్రస్తులై, యాగ్రహించి తమలో తామిట్లనుకొనిరి. 1486

తే.గీ. ఈ జనకుడు కోరి తన తనూజ నీ య
యోధ్యవాసుల కియ్యంగ నుద్ది సేయు
చుండె ననుమాట తథ్యంబు చూడ, నతడు
దానికై చేయు వివిధ యత్నములు కనగ. 1487

తే.గీ. రెండు దినములకును ముందు తేడు, మనము
లేని సమయమందున వీరి, లీలతో న
లంకృతుల జేసి సత్కృతులు జరిపించి
చెలసి దంతిపై నూరేగ చేసె నంట. 1488

వ. ఈ వివరము లన్నియు మా గూఢచారులు మాకు తెల్పిరన విని, మరి కొందరు 1489

తే.గీ. జనకు డెంతగా వాంఛించినను చిఱుతలు
త్రిపుర సంహార సమయాన త్రినయనుండు,
పరమశివుడు చేపట్టిన ప్రథిత ధనువు
నెక్కు పెట్టంగ గలరె – మీకేల భయము? 1490

తే.గీ. అన విని మరికొంద రనిరి, జనక నృపతి
మన కనుల ముందె వీరిచే ధనువు నెక్కు
పెట్టినట్లుగ చూపించి వీరియందు
పెద్దవానితో కూతురు పెండ్లి జరుపు. 1491

తే.గీ. అనగ, నింకొంద రనిరిట్టు, లచ్చమైన
విల్లు గాక వేరొక మాయ విల్లు వారి
చేత నెక్కుపెట్టించిన చివరకు మన
కు నవమాన మోసములె మిగులు తలంప. 1492

వ. మనము గాజులు తొడిగించు కొనిన వారివలె నుందు మని వాపోయిరి. అది విని మరి కొందరిట్లహంకరించిరి. 1493

ఆ.వె. ఊరుకొనగరాదు – మీఱి జనకుని పై
పోరి సీతను గొనిపోద మిపుడె;
ఆ తదుపరి మనల నామె యొకని పెండ్లి
యాడ గలదు నచ్చినతని నెంచి. 1494

వ. ఈ పన్నాగ మచ్చటి రాజులలో కొందరికి సమ్మతమైనను, మిగిలిన వారు తాము యుద్ధమునకు సిద్ధమై రాలేదు గనుక, ఇప్పటికి నిష్క్రమించి సైన్యములతో తిరిగి వచ్చి జనకునిపై దండెత్తుదమనిరి. ఈ లోపుగ రాజకుమారి



కీ యయోధ్యా రాకుమారునితో వివాహము జరిగిపోవు నేమో యను శంక నీ పథకము చాలమందికి నచ్చలేదు. అంత, వారిలో నొక డిట్లనియె. 1495

తే.గీ. తేలికగు విల్లు జనకుండు తెచ్చి మనల
మోసగించకుండ, మనమె ముందుగాను
ధనువు నెక్కుపెట్ట వలయు ననుచు రాజు
నొప్ప జేయవలసి యుండు నెప్పరమున. 1496

తే.గీ. దీని కెల్లరు సమ్మతి తెలిపి నంత
సభ నలజడులు చెలరేగె, సచివు లటకు
వచ్చి విషయ మెరిగి రాజు వలను కేగి
పూస గ్రుచ్చినటుల సర్వము నెరిగింప. 1497

చం. జనకుడు దండడిన్ పడుచు, చయ్యన కౌశికు నొద్దకేగి యా
తనికి నమించి సభ్యుల ప్రతర్కము దెల్పుచు పల్కె, నీ సమ
స్యను తగు రీతిలో తమరె సామముతో సరిచేసి వారి కిం
పొనరగగూర్చి శాంతి నెలవొందగ చేయుడు తాపసోత్తమా! 1498

వ. అని ప్రార్థించిన, కౌశిక మునీంద్రుండు చిరునగవుతో జనకరాజేంద్రున కిట్లనెను. రాజా! ఏల నీ కీ భ్రమ! 1499

ఉ. రాముడు గాక వేరొకడు ప్రాజ్ఞుడు బాహుబలాఢ్యు డెవ్వడీ
సామజవైరి కార్ముకము చక్కగ పూనిచి యెక్కు పెట్టగా
దీమస గల్గినట్టి మగధీరుడు రాక్షస యక్ష కీశ మ
ర్త్యామరులందు – నీ మనము నందు నొకింతయు శంకమానుమా! 1500

తే.గీ. అటులె వీర లడిగినట్టు, లవధిబోయి
వీరు లెల్లరు విల్లెక్కు పెట్ట నేర
రనుచు రూఢియైన తదుపరినె రఘు కుల
జ్యేష్ఠ డీవిల్లు సంధించు చిత్రముగను. 1501

వ. కావున సీతా స్వయంవరమున పాల్గొన దలచిన వారికి నీ వట్లు ప్రకటించు మనిన, జనకుని యాదేశంబున మంత్రులు సభకట్లెఱుకపరుప, నచటి రాచవర్గంబులు తనిసి, ధనుర్యాగ కార్యక్రమము ప్రారంభించుటకు సమ్మతించి రంత, 1502

చం. జనక నృపాలు నాజ్ఞగొని సాయుధ సేవకు లైదు నూర్లు వీ
కను చని త్ర్యంబకేశ్వరుని కార్ముక పేటిక జాగరూకులై
తనుకుచు త్రోసి తెచ్చిరి సదస్యులు హర్ష వికాసి తానన
ప్రణతుల తోడ సింగిణికి స్వాగత మొప్పుగ చెప్ప భక్తితో. 1503

తే.గీ. అటుల తెచ్చి యాస్థాన మధ్యస్థ వేది
నుంచ, జనకుడప్పుడు షోడశోపచార
సంయుతంబైన పూజ లాసక్తి జరిపి
నతిని సాష్టాంగదండ ప్రణతులొసంగి. 1504

వ. సభాసదుల నుద్దేశించి యిట్లు పలికెను. 1505

ఉ. "స్వాగతమో మహావిభవ సంయుతులార! వినుండు మా ధను
ర్యాగముతోడ నా సుత స్వయంవరమున్ ప్రకటించినాడ, మీ
యాగమనంబు సంతస మహాతిశయమ్మును గూర్చె మాకు, మీ
చేగను చూపి ధన్వమున శింజిని గూర్చి పణమ్ము గెల్పుడీ. 1506



తే.గీ. కొన్ని వేలేండ్ల ముందు మా కులముపెద్ద
కిచ్చి రమరులు మెచ్చి విశ్వేశు ధనువు,
దీని తోడనె త్రుటిలోన త్రిపుర విలయ
నంబు గావించెను తొలిని త్ర్యంబకుండు. 1507

శా. ఈ విల్లెంతయొ శంభుశక్తి యుతమై ఈశాను హస్తాబ్జ యు
గ్మావిష్కారము నొంది, భారమును లంబంబై కడున్ భీమమై
యేవంకన్ గమనించినన్ కనగనౌ నెత్తైన కొండో యనం
గా విక్రాంతునకైనచో నిది సమాక్రాంతంబునై తోచెడున్. 1508

శంకరప్రియ:
విల్లునెత్తగ వీరులన్
పెల్లుగా బలముండగా
చెల్లు, గానది లేనిచో
కల్లయౌ నిది రూఢిగా. 1509

వ. అంతియగాక, 1510

ఉ. శంకరదేవు కార్ముకము శౌర్యము ధైర్యము విక్రమోన్నతుల్
కొంకని కార్యదక్షత యకుంఠిత దీక్షయు ధర్మరక్షయం
దంకితమౌ ప్రమాణము మహాశివు నాదృతి యున్న వాని కే
సంకటపాటు లేక వెస సాధ్యము సజ్జము జేసి చూపగన్. 1511

ఉ. దీవస నెవ్వడేని నర దేవ నిశాచర వానరాదులం
దీ విలు నెక్కుపెట్టగల యేడ్తెర, శక్తి గలట్టి వాని నీ
భావజ భామినీ సదృశ భాస, యయోనిజ, దివ్య కన్యయౌ
పావని సీత నా సుత వివాహము నాడుత నిశ్చయంబుగన్. 1512

కం. అని యీవిధి ప్రకటించితి
మును, దానికి మరొకమారు పుయిలోడక నే
పునరంకిత మగు చుంటిని
వినుడెల్లరు నా ప్రతిజ్ఞ విశ్వాసముతో. 1513

కం. ఆహూతులైనవారు, న
నాహూతులు గూడ లక్ష్య మందుట కొరకై
సాహసమున యత్నింపుడు,
బాహుబలము చూపి జయము వారక గొనుడీ!" 1514

కం. ఆవిధి జనకుడు పలుకగ,
ప్రావగ సభలోని యోధవరులు మరొక మా
రా విల్లు చూచి క్లేశ
ప్రావృత చేతములు వణక భయ సంభ్రములై. 1515

వ. అంత దనుక విల్లు నెక్కిడ అహమహమికతో గొప్పలు చెప్పుకున్న వీరులు దీప్రంబును, వీర్యంబును, తేజోదుష్ప్రావంబునై, పర్వతాకారముననున్న విల్లును చూచి దీని నెక్కిడు సంగతికేమిగాని, కదల్చుటకైనను మనలో సమర్థత కలదా యని చింతాక్రాంతులై తలపోయుచు నధోముఖులై యుండిరి.

అంత, రాజోద్యోగి యొక రిట్లు ప్రకటించెను. "మహా పరాక్రములైన అతిథి వరులారా! ఈ విల్లు నెక్కుపెట్ట దలచిన ఆహూతుల నొకరి తదుపరి నొకరి నాహ్వానించెదను. వారందరును ముగిసిన పిదప, అనాహూతులు తమ యదృష్టమును పరీక్షించుకొన వచ్చును. పిలువబడిన వారు సభామధ్యంబునకు వచ్చి, విల్లునెత్తి యెక్కు పెట్ట ప్రయత్నింపుడని మనవి. ఇందులకై అతిథులు తమ హస్తాద్యవయవములు తక్క, వేరుగా నాయుధములు వాడరాదు. దీనికై ఒక్కొక్కరికి ఒక ముహూర్త కాలము నిర్దేశించబడెను. ఇట్లు తొడతొక్కుడులేని విధమున, వచ్చిన వారందరకు సమానావకాశము కల్గు రీతి నీ కార్యక్రమము



జరిపింప నిశ్చయించితిమి." అనునంతలో నాకాశంబున సంచలనంబు కల్పించుచు, నొక మహోన్నతుడైన రాక్షసుడు సభాభ్యంతరంబు లోనికి దిగి, 1516

## 14.3. రావణమంత్రియగు ప్రహస్తుడు జనకునితో సీతను తమ ప్రభువున కిమ్మనుట

తే.గీ. అనియె సభ దద్దరిల డిండిమారవమున
జనక భూజాని దరికేగి జనులు క్రంద,
"వినుము లంకేశుడౌ దానవేంద్రు మంత్రి
వర్యుడ ప్రహస్తుడనుపేర బరగువాడ. 1517

మ. దశకంఠుండగు రాక్షసాధిపుడు, సుత్రామాది గీర్వాణ గ
ర్వ శమీగర్భుడు, విశ్వసృట్ విభవ లబ్ధానేక దివ్యాస్త్రుడున్,
శశిరేఖాధరు భక్తశేఖరుడు, వింశద్బాహు సంకాశుడౌ
అశని ప్రాయుడు రావణుండు తమ కన్యన్ కోరి నన్నంపుచున్. 1518

వ. నీతో నిట్లు చెప్పుమని యానతిచ్చె, 1519

కం. వీనుల విందుగ విను మో
మానవనాథా! ముదమున మది యుప్పొంగన్
దానవ పతియౌ రావణ
భూనాథుడు నీ దుహితను మోహించె నొగిన్. 1520

ఉ. రావణు డంత శూరు డనురాగము తోడుత వేడె నీ సుతన్
వావిగ నిమ్మటంచు మరి వంకల నెన్నక, సాకు పన్నకే
భావి తలంచి నీ సుతకు వచ్చెడి భాగ్యములెన్నుచున్, మహా
దేవుని విల్లు పూన్చుమను తిక్క పణమ్మును ప్రక్కనుంచుమీ! 1521

ఉ. శంకరు డుండు పర్వత మచంచల వింశతి బాహు శక్తి నే
శంకయులేక మా ప్రభువు శంభు కుటుంబముతోడ నెత్తె, నీ
శంకరు పాతవిల్లు నిట సత్తున చూపగ నెత్తనేలకో,
కొంకులు లేక నిమ్మిపుడు కూతు దశాస్యున కుద్వహంబునన్. 1522

ఉ. ఆమెను నీవు గూర్చిన మహాతిశయమ్మున పంక్తికంఠుడున్
మామగు నీకు శుల్కముగ మానుగ క్షోణితలంబు నంతయున్
దీమస గెల్చి యిచ్చు, మరి తేకువ నీ సుత నీయకున్నచో
నామెను మేము బంది గొనుటన్నది సత్యము నేడొ యెల్లియో! 1523

వ. అని మా రావణసార్వభౌముడు నీకెరుంగ పల్కుమనియె'' నని ప్రహస్తుండన్న మాటలకు, జనకుడు కుపితుండైనను, కోపంబు ప్రదర్శించుట సభామర్యాద కాదని, నవ్వుచునే రావణదూతతో నిట్లనియె. 1524

తే.గీ. "మృదుని గిరి నెత్త మీ రాజు కడగి నపుడు,
శివుడు బొటన వ్రేలున నొక్క, చేతులందు
కీళ్ళు నలిగులియయి కీచు కీచురనుచు
అరచెనను సంగతిని చెప్ప మరచినావొ! 1525

తే.గీ. బైటపడలేక భీతిల్లి పాటు పడుచు
పురహరుని నుతించి విముక్తి పొందలేదొ,
భవుని కారుణ్య ఫలమున బ్రదుక లేదొ,
ఏల చెప్ప వీ విషయంబు లెల్ల మాకు! 1526

ఉ. అంతట బోక, స్తోత్రముల నానతుడై ముదమార్చి, పుష్పబా
ణాంతకు నాత్మలింగము మహాధృతి నందుచు పోవుచుండ, సా



యంతనమైన భాస్కరున కర్ఘ్య మొసంగగ వార్థి చేరి యా
ప్రాంతమునందు గ్రుమ్మరెడు బాలుని రావణు డర్థి సేయుచున్. 1527

ఉ. ఇంచుక సేపు లింగము వహింపుము పాణితలంబు నందునన్
మంచిగ, క్రిందనుంచకు ప్రమాద మటంచును హెచ్చరించి, యా
యంచ ప్రతీచ్య వారినిధి నంబుజమిత్రుని కర్ఘ్య మీయగా
నెంచుచు నేగ, కుర్రడు మహేశ్వరు లింగము నేల నుంచినన్. 1528

కం. బాలుడు గణపతి గావున,
నా లింగము లంక జేరు టడ్డుట కొరకై
నేలం బెట్టన్, కుపితుం
డై లంకేశుడు పరుగున నచటకు చేరెన్. 1529

తే.గీ. చేరి నేలపై నున్నట్టి చిన్న యాత్మ
లింగమును రావణుం డెత్త లేక కలగి,
మరల దీక్షతో నెన్నియో మార్లు కడగి
విఫలుడై యబ్బురంబున వివశుడయ్యె. 1530

ఉ. ఇంకను మీ నృపాలుడు మహేశ్వరు లింగము ముట్టినంతనే
బింకముతోడ నయ్యది ప్రపీతమునై ధృతి నిన్మడింప నా
పొంకము జూచి మీ విభుడు పూనిక కోల్పడి చేవ వీగి యా
వంకనె దాని వీడి తన పట్టణ మేగె తపించి వ్రీడతో. 1531

వ. ఆ లింగంబును వినాయకు డచ్చోటనే ప్రతిష్ఠించెను. ఆ పశ్చిమ సముద్రతీర దేవళంబే నేడు గోకర్ణంబను పేర ప్రసిద్ధ శైవ క్షేత్రం బయ్యె. అది యటులుండనిమ్ము, 1532

తే.గీ. ఆర్తి నర్థించి గొనినట్టి యాత్మ భవము,
భవుని చిఱుత లింగంబె మీ ప్రభువరుండు
కదిసి పైకెత్తునట్టి విక్రమము లేక
మరలి పర్వెత్తె ననుమాట మరచి నావె. 1533

వ. ఓయీ రావణ మంత్రీ! ప్రహస్తా! ఏల మన కీ వ్యర్థ సల్లాపములు. వినుము, 1534

కం. నేనొక ప్రతిజ్ఞ జేసితి –
మీ నాయకుడిటకు వచ్చి మృదుని ధనువు నా
స్థానమునన్ సంధించిన,
వానికి నాకూతు నిత్తు వారిజనేత్రన్. 1535

వ. అట్టివాడు దానవుండని గాని, మా లోకస్థుండు గాడని గాని, మరి యే యభ్యంతరము చెప్పక, తప్పక ఈ శివ ధనస్సు నెక్కు పెట్టిన వానినే సీతాకన్య వివాహమాడును గాక. పోయి, నీ ప్రభువుకు విన్నవించు" మన, ప్రహస్తుం డసంతృప్త హృదయుండై, "రాజా! నామాటలు జాగరూకతతో వినుము. కోరి రావణునితో తగవు తెచ్చు కొనకుము. మా నాయకుడు తలచిన నీ కన్య నెట్లైన చేపట్టగలడ"నుచు గగనతలంబున కెగిరి నిష్క్రమించెను. దానికి జనకుండు కుపితుడై, "మీ రావణుడు మా సీత నపహరించినచో, నామెయే మీ ప్రభువును బంధు మిత్ర యుతంబుగ నెట్లు నాశనమొనర్చ వలయునో యెరుంగు"ననెను.

రావణ సచివుని మదపూరిత కర్కశ వచనంబులు విని, 1536

తే.గీ. సభనుగల మిథిలా జనసంఘ మెల్ల
రావణుడు తమ ప్రియతమ రాకుమారి



నపహరించునో యేమొ యటంచు భీతి
కలత తోడను దూగుచు తలచిరిట్లు. 1537

చం. "జనకుడ దేలకో యిపుడు స్వాంతము కవ్వుకొనంగ నా ప్రహ
స్తు నతిశయంబునన్ కినిసి దూషణ సూచక వాక్యముల్ వచిం
చెను మును, వాడు పోయి యెకసెక్కముగా దనుజేంద్రుతోడ తె
ల్పిన త్రిదిశాంతకుం డలిగి విల్లును పూన్చగ వచ్చునేమొకో." 1538

వ. అని సభాసదులు కలతతో దూగి విచారగ్రస్తులై, 1539

తే.గీ. రక్కసుని వరలబ్ధమౌ యుక్కడంచు
ప్రజ్ఞ ఈ చతురాంబుధి ప్రావృతమగు
భూ నివాసుల లేకుంట, ముప్పు తప్ప
శివుని ప్రార్థించి రాపురశ్రేష్ఠు లపుడు. 1540

వ. అంతలో 1541

## 14.4. రావణుడు ధనువు నెక్కుపెట్ట ప్రయత్నించి విఫలుడగుట

మ. [1]నభమందాశనముల్ పయోధరములన్ తార్కొంచు సంఘట్టనన్
ప్రభతో చంచలలన్ సృజించెను, మహావాతంబు దుర్వారమై
ప్రభవిల్లెన్, భువి సంచలించె ననగన్ ప్రత్యక్షమయ్యెన్ త్రుటిన్,
సభ భీతిల్లగ రావణుండు ఘన భూషాలంకృతాంగుండునై. 1542

కం. అనువగు నిర్ణయమున కం
దనుకన్ దాగి దనుజుండు దానవ మాయన్,
జనములు భయపడిన విధిన్
ఘనమౌ పుష్పకమున దిగి కదిసె సమజ్యన్. 1543

మ. జనబాహుళ్యము లూహ చేయు నటులా జంభారి శత్రుండు ఠీ
విని తా నెల్లపుడున్ దశాస్యములతో వింశత్ కరశ్రీలతో
కనిపించంగను బోక, యుండు మనుజాకారుండునై సర్వదా
ఘన శీర్షంబును, రెండు హస్తములతో కందర్ప సంకాశుడై. 1544

ఆ.వె. కామరూప విద్య ఘటికుండు గావున
కోరి నపుడుగాని, కొన్ని క్లిష్ట
మైన స్థితిగతులను గాని యతడు పొందు
పది తలలు, నిరువది బాహువులును. 1545

ఉ. అందున నేడు జానకి స్వయంవరమౌట నిశాచరేంద్రుడున్
సుందరమౌ ముఖాంబుజము, సోయగ మొప్పెడు రాజసమ్మునన్,
చందన కస్తురీ తిలక చర్చితుడై సభలోన దర్శనం
బిందునిభాస్య జానకికి నింపుగ నీయగ వచ్చె ప్రీతుడై. 1546

వ. అటులే తన సహజార్భాటమును ప్రదర్శింపక, పరివారంబును వెంటగొనక, తానొక్కండె వచ్చి, సభామధ్యంబున కేగి జనక మహారాజుతో నిట్లనియె, "రాజా! 1547

చం. చివికిన విల్లు పూన్చుమని చెప్పగ వచ్చునె నాకు, దేవతా
నివహము నొంటిచేతను ప్రణేయ మొనర్చిన స్వర్గజిత్తుతో,
నవితథ ప్రేమ నీ దుహితపై గల వాడను గాన, నీ పణం
బవుదలదాల్చి యెక్కిడుదు త్ర్యంబకు విల్లు తృణప్రదంబుగా." 1548

వ. అని అనాలోచితంబుగ శివుని చాపమును కించపరచి, ఆ ధనువుంచిన పేటి దరికేగెను. ఆ సమయంబున, 1549



కం. రావణు నాగమనము గని,
యేవను తను శివుని విల్లు నెత్తుదు ననుచున్
కావరమున పల్కుట విని
భూవరుడు తలంచె నిట్లు ప్రోషము తోడన్. 1550

ఉ. "రావణ రక్కసుం డతి పరాక్రము డాజి మహేంద్రుడాదిగా
దేవకులంబు బందిగొని, దిక్పతులన్, రవి చంద్రులన్ సదా
సేవలు సేయగా నిలిపి, ఛిన్నము భిన్నము చేసె ధర్మమున్,
పావనమైన యార్షమత పాతన హేతువు నయ్యె దుష్టుడై. 1551

ఉ. పాపియునయ్యు పద్మజ తపఃఫల భాగ్య విశేష మూలమై
ప్రాపిత దివ్య బాహు బల బంధుర విక్రమ దేహుడయ్యె, ను
ద్దీపిత శక్తితో నిపుడు దీక్షవహించి కుమారి గెల్వగా
చాపము పూన్చునో యనెడు సంశయ మయ్యెను నా మనంబునన్. 1552

కం. రావణుడీ విలునెత్తిన,
గ్రావంబును పూసరికిని కట్టిన ప్రావన్
వావిగ జానకి కీతడు
తావరముగ కంఠమందు తాళిన్ కట్టున్. 1553

కం. అటులైన సీత జన్మము
విటతాటంబౌను గాదె – విధి యే విధిగా
జటిలము చేయుచు నున్నదొ
కటకట మాజన్మములను ఘాతుకరీతిన్. 1554

మధ్యాక్కర:

ఎంతగా సంతసించితినొ, ఇనకులుం డల్లుడౌ నంచు,
పొంతనములు కూడె గాన, పొందుగా నాభాగ్య మనుచు –
వింతగా నాలోన మమ్ము, వేధించి యా విధి రేచి,
చింతలేకను సాగు బ్రతుకు చిమ్మచీకటిగను చేసె. 1555

వ. అమ్మరో! సీతమ్మ తల్లీ! నా ఆనంద కల్పవల్లీ! వసిష్ఠ పురంధ్రి యరుంధతి నీ వివాహ విషయమున జాగరూకతలో వర్తించి తగిన వరుని చేతులందు నిన్నుంచుమని హెచ్చరించెను. నే నుదాసీనుండనై కొంత అజాగ్రత్తతో వర్తించితిని కాబోలు. విధి వక్రించి మనకు దుర్భరమైన శిక్ష విధింప బోవుచున్నదేమోయను యనుమానము కలుగుచున్నది.

తొలిని, నిన్ను నీ తల్లి భూమాత నా చేతనుంచుచు, నీ వొక దివ్య కన్యవని, నీ మూలమై మన వంశంబు తరించునని పలికెను. కాని కుమారీ! నీవీ దుర్మార్గుడు. రాక్షసుడు, స్త్రీలోలుడు, బహుభార్యా యుతుడునైన రావణుని చేతిలో పడనున్నావా, తల్లీ! ఓ భూమాతా! నీ కొమరితకు తగిన సంబంధము నైనను నేను సమకూర్చ సమర్థుడ గానైతిని. మా గతి యేమి. నువ్వే మమ్ము కాపాడవలె" నని ప్రార్థించెను. 1556

తే.గీ. అంతలోన లంకాపతి యభవు కార్ము
కమ్ము దరికేగి సభ్యుల కలయజూచి
ఆరభటి నార్చి – విల్లున కధిపు డైన
అభవుని కొలువగా బోక నతిశయమున. 1557

తే.గీ. ధనువు నీక్షించి దీక్షతో దైత్యరాజు
లస్తకంబును తన వామ హస్తమందు
పట్టి పైకెత్త యత్నించి బలిమితోడ
కదపనైనను లేకుండె కార్ముకమ్ము. 1558



ఉ. అంత కలంగి యించుక నిరాశకు లోనయి రెండుచేతులన్
పంతముతోడ చాపమును ప్రాయిగ్రహించుచు నెత్తబూన, నా
వంతయునైన లేవదు శరాసన మప్పుడు రాక్షసేంద్రుడున్
వింతగ, కామరూపమును వీడి వహించె నిజస్వరూపమున్. 1559

వ. ఇరువది బాహువులతోడను, పది తలలతోడను భయానకంబుగ నున్న రావణుని రూపము చూచి జనులు హాహా కారములు చేసిరి. సతీ జనంబులు వివశులైరి. అంత, 1560

## 14.5. రావణుడు విల్లు క్రింద నుండి రక్షింపబడుట

మ. నిజరూపంబున విక్రమించుచు జనుల్ నిశ్చేష్టులై చూడ భూ
మిజ మూర్ఛిల్లగ, దైత్యలోకవిభు డున్మేషించి వింశన్ మహా
భుజ సంయుక్త బలంబుతోడ ధనువున్ మోమోటి లేకుండ నె
త్తె జగంబుల్ కలగన్, సతుల్ వణక, భీతిల్లంగ వైదేహుడున్. 1561

వ. ఆ సమయంబున, 1562

ఉజ్జ్వల :

ప్రతత మతుల భారము నౌటచే
యతని కరము లందున కార్ముక
మ్మతిగ కదలియాడగ మౌర్వి సం
ప్రతి విడివడి రాలెను నేలపై. 1563

కం. అదిగని లంకాపతి తన
పదితొమ్మిది హస్తములను పదిలముగా ప

ట్టి ధనువు, కొదవడు కరమును
పదపడి సాచుచు గుణమును పట్టెడు నాశన్, 1564

ఉ. క్రిందకు వంగ రావణు డొకింత, కపోణులతోడ జానువుల్
తందరచెంది క్రుంగువడె ధన్వము భారము మోయలేక, ఆ
క్రందన తోడ క్రిందపడె క్రాలుచు గాసిలి, అంత వక్షమున్
కందగ కూలె వానిపయి కార్ముక మాసురు డార్వ వేదనన్. 1565

వ. ఆ ఆర్పుకు సభయేగాక మిథిలానగరము దద్దరిల్లెను. జనకుని చతురంగబలములోని జాతి తురంగంబులు భీతితో హేషించెను. మత్త కరీంద్రంబులు ఘీంకరించెను. రావణుడు తనను రక్షింపుమని సభాసదులను వేడుకొనెను. ఆ హూతిని వినిగూడ పౌరులు రావణుని దరిజేర భీతులై తమ స్థానములు వీడరైరి. రాజకుమారులు వానిని రక్షింపగా వెళ్ళి, ఓడినచో కలిగెడు లజ్జ తలచుకొని లేవరైరి. ఇంక చేయునది యేమియు లేక రావణుడు కైలాసనాథుని తన నీ దీనావస్థనుండి రక్షింపుమనుచు నిట్లు ప్రార్థించెను. "ఓం నమో నమో నమఃశ్శివా! కైలాస వాసా! గంగాధరా! హాలాహలాశనా! వ్యాళ భూషా! 1566

ద్విపద :
వాలిన భక్తితో ప్రార్థింతు భద్ర!
కాలకాలా హరా! కాలాగ్ని రుద్ర!
బాలార్ధసంయుక్త! భాస్వంతగాత్ర!
శూలపాణీ! చంద్ర సూర్యాగ్ని నేత్ర!
ప్రాలేయ సుమగాత్ర! పరమ పవిత్ర!
బాలేందు కోటీర! కాళీ కళత్ర!
ఫాలనేత్ర విభూష! భస్మాంగ వేష!



నీలగగన కేశ! లీలా విలాస!
శ్రీలింగనాథ నీ చిద్విలాసంబు
హేలావిహీనంబు లీలా మయంబు;
బేలనై ప్రార్థింతు బాలతో నిన్ను,
పాలింపు కృపజూచి మాలిమిన్ నన్ను,
నీ విల్లు క్రిందను నే పడియుంటి,
కావుమో దేవరా! కాపాడుమంటి –
కాపాడు మోదేవ! కరుణాంతరంగ!
ఆపదల్ రానీక నవఘాత భంగ!

మాలూర కిసలయ మండిత పాహి!
పాలిత వృషభేంద్ర! వలిత విషాహి!
మలహర! శివకర! మాంపాహి పాహి!
హలహల వరగళ! హరహర పాహి!" 1567

వ. అపుడు, 1568

పణవం, లేక పునాద వృత్తం :
పౌరానీకము భయమొందంగా,
వీరుల్ రాజులు వెగడొందంగా,
నా రక్షోధిపు వ్యథ జూడంగా,
భూరాజన్యుడు పొగులన్ సాగెన్. 1569

కం. జనక నరపాలు డా రా
వణాసురుని బాధ జూచి వానిని కాపా
డను బల శౌర్యుల ధీవరు
లను వేవురు భటుల పంపె లాలాటికులన్. 1570

కం. జనకుడు పంపిన సేనలు
పనిగొని యెటులో యొకింత పైపై కెత్తన్
ధనువును, దీనుడు రావణు
డనువుగ ప్రక్కకును ప్రాకె హతశేషుండై. 1571

వ. ఇట్లు శివధనుస్సు క్రిందనుండి యెట్లోప్రాకి బయలుపడి, రావణుండు వెనుకకైననుచూడక, తన పుష్పకంబునెక్కి హుటాహుటి లంకకేగెను. అంతట, సైనికు లతికష్టంబున విల్లును తిరిగి మందసలో యథాస్థానమందుంచిరి.

ఈ యనూహ్య సంఘటనలకు స్పందించిన సభ్యుల ప్రలాపానులాప, మిథ్యాభియోగ, విప్రలాపంబులతో గంభీరధ్వను లుద్భవించి, కొన్ని క్షణములకు మంద్రనినదంబులై, సూక్ష్మనిస్వనంబులై తుదకు సభలో కొంత నిశ్శబ్దత చేకూరెను. 1572

## 14.6. ధనుర్యాగమునకు వచ్చిన వీరు లెవ్వరును ధనువు నెత్తలేకపోవుట

తే.గీ. విల్లు పూన్చంగ దనుజుడు విఫలు డయిన
సంతసించిన జనక భూజాని యపుడు,
రావణుడె యెత్తలేని శరమును బాల
రాము డెటులెక్కిడు ననుచు దీమ సుడిగి, 1573

తే.గీ. అనుగుణంబుగ నింకెట్లు తన దుహితను
గెలువ గలవాడు జగతిని గలుగు ననెడు
బెంగ తోడను హృదయంబు క్రుంగిపోయి,
తమకపడక వేచుటయె కర్తవ్యమనుచు. 1574



వ. తన మంత్రులకు తదుపరి కార్యక్రమమును జరిపింప నుత్తరువు నిచ్చె. 1575

తే.గీ. అపుడు రాజాజ్ఞ పాలింప నధికరణులు,
విల్లునెత్తంగవచ్చిన వీరవరుల
పేరు పేరున పిలువంగ – వార లొక్క
రైన ముందుకు కదలి రారైరి పూని. 1576

తే.గీ. అంగ మగధాంధ్ర నేపాల వంగ మాళ్వ
ద్రవిడ కేరళ ఛప్పన్న రాజవరులు
పిలుపు నాదరించగబోక వినని యట్టు
లూరకుండిరి దిక్కులు పారజూచి. 1577

కం. హెచ్చిన కలతను జనకుం
డచ్చుపరచె నపుడు ముని శతానంద గురున్
పుచ్చటిక పుచ్చి వీరుల
ముచ్చటతో విల్లు నెత్త ప్రోత్సాహింపన్. 1578

వ. రాజాజ్ఞవెంట శతానందుడు స్వయంవరమున కేతెంచిన వీరవరుల, రాజకుమారుల 1579

సీ. దరిజేరి విలు పూన్చ దయచేయు డని కోర
స్వస్థత లేదంచు సణుగువారు,
మీరైన రండని కోరి యాహ్వానింప
తమను కాదన్నట్లు తలగువారు,
ధనువును పరికించి ధాటి నెత్తుండన
ధనువు కాదిది కొండ యనెడు వారు,

విలు పూన్చ నిటువచ్చి తలక న్యాయమె యన్న
తలవంచి కనుమూసి కలగు వారు
తే.గీ. పేరు పిలువంగ నోరెల్ల పిడచగట్టి,
నాల్కతోడను పెదవుల నాన్చువారు,
శివుని ధనువెత్త తమలోన చేవ లేక
వీర వరులెల్ల లజ్జతో వీగు చుండ, 1580

వ. శతానందుడు సభ నుద్దేశించి ఇట్లనియె, "అధిక శ్రమతో బహు దూరంబుల నుండి ప్రయాణించి విల్లునెక్కుపెట్ట వచ్చియు, నే డీ సభలోని వారలెవ్వరును విల్లునెత్త ప్రయత్నించుటకైనను ముందుకు వచ్చుట లేదు. యత్నించి కృతార్థులైనచో, విజయలక్ష్మితోబాటు మా సీతామహాలక్ష్మినిగూడ పొంద గలుగుదురు. అటుల, జానకిని వివాహమాడి 'జనక జామాతృత్వమును' పొందుదురు కదా. ఇది యెంత కీర్తిప్రదమో, భోగ భాగ్యదాయకమో నేను వివరింప నవసరము లేదు. అటుల కాక, మీరు విల్లునెత్తలేకపోయిన, వేరొక యోధు డైనను తప్పక దాని నెక్కుపెట్టి జానకిని గెలుచును గాన, గెలువని వారలు 'జనకజా-మాతృత్వము' ను పొంది జనక జామాతతో పరిచయ మేర్పరచుకొన వచ్చును కదా. కనుక, మీలో నధికబలసంపన్నులైన వీరులు విల్లువద్దకువచ్చి పరీక్షించి, ఎత్త ప్రయత్నింపు"డని రాజుల వద్దకేగి ఒక్కొక్కరికి పేరు పేరున తిరిగి నచ్చచెప్ప యత్నించెను. 1581

ఉ. ఐనను గాని వార లెవరైనను ముందుకు రారు, కార్ముక
మ్మానుచు నెత్తి పూన్చగను యత్నము జేయరు, నీరసమ్ముతో
నూనగ నేరరో! ప్రబలు దుగ్రుడు రావణుడెత్త లేని చో
మానవులెత్తగా నగునె మంకుతనం బగు నంచు మానిరో! 1582

వ. ఆ సమయంబున, చాలకాలము శ్రమించి, తన యిష్టదైవము నుద్దేశించి ఘోరతప మాచరించు చున్న తాపసి, చివరి క్షణమున తనతపము



వ్యర్థమయ్యెనని, తన ఆశయము సిద్ధింపబోదని తెలియ, నిరాశతో మానసిక వ్యథను క్రుంగురీతిని, జనక రాజన్యుడు తన ప్రియతమ కుమార్తెకు తగిన వరు నెన్నుటలో తను విఫలుండనైతినని చింతాక్రాంతుడై, అధిక వేదన మనంబును ముప్పిరిగొన, సభాసదులతో నిట్లనెను. 1583

కం. "ఈ సభ శివధనువున కరి
పోసెడు ధీరు డొకడైన పొందుపడండో!
నా సమయము వృథపోవునొ
వాసుర నిర్వీర్యమయెనొ భ్రంశంబగుచున్. 1584

వ. ఇతఃపూర్వంబు గూడ ననేక వీరు లీ శివధనస్సు నెక్కుపెట్ట వచ్చి, చాలికలేక తిరోహతులైరి. 1585

మ. చతురంభోది పరీవృతంబగు ధరాచక్రంబులో సన్నుత
ప్రతత ప్రత్న సనాతనార్షమత సంపన్న వ్యవస్థానమం
దతులంబైన యనర్ఘ రత్న నిభుడౌ యాదర్శవీరుండు, మా
నిత ధానుష్క విశారదుం డొకడు నేనిన్ చూడ కన్పట్టడే! 1586

మ. ఘన గౌరీశుని చాప మెక్కిడగ నుత్కంఠన్ ప్రదర్శించుచున్
ధనువున్ లస్తకమందు పట్టి జనులున్ దర్శించు చుండంగ శిం
జిని వింటన్ బిగవేసి లాగ గల రాసింగంబు లే డెచ్చటన్;
కనగా నబ్బురమయ్యె - నీ ధరణిపై క్షాత్రంబు గొడ్డేఱెనో!" 1587

## 14.7. జనకుడు క్షాత్రంబు నిర్వీర్యమైనదన్న సహించక లక్ష్మణుడు కుపితుడగుట

వ. అపుడు జనకుని మాటలకు కుపితుండై లక్ష్మణుండు రోషావేశములతో నిట్లనెను. 1588

తే.గీ. "రామచంద్రుండు వెలయు ధరాతలంబు
వీరులే లేని శుద్ధ నిర్వీర్య మనుచు
పలుకు టవివేక మైనట్టి ప్రల్లదంబు,
జనక రాజన్య! నీ కిట్టు లనగ దగదు. 1589

మ. రమణన్ కౌశికు నిష్టి కాచు నెడ ఘోరాకారులై రక్త మాం
సములన్ క్రుద్ధత హోమగుండములలో జల్లంగ రేద్రిమ్మరుల్
గమకింపంగ, సుబాహు కూల్చి విసరెన్ క్రమ్మించి బాణంబు రా
మ మృగేంద్రుండు సహస్ర యోజనములున్ మారీచ మారీచమున్.
1590

సీ. కాకుత్స్థ ఘనవంశ కలశాబ్ధి సోముండు,
పణితవ్యుడౌ ధన్వి, ఘన భుజుండు,
కౌశిక మునినాథ వైశేష్య శస్త్రాస్త్ర
లబ్ధ చాతుర్య బలవిభవుండు
దంతి సహస్ర విక్రాంత ఖేటక తాట
కాసురీ ప్రమథన కార్ముకుండు,
భవ్య సిద్ధాశ్రమ పవిత యజన పరి
రక్షణా పాటవ దక్షమూర్తి,
తే.గీ. సకల భూషణాలంకార సహితు డగుచు,
మొన్న మొన్ననె నీచేత పూజలంది
రాజ వీధులలో నిభరాజమందు
తేజ మొనరంగ విహరించు రాజమౌళి. 1591

వ. రామచంద్రుడు బాహుబలాఢ్యుండును, సర్వోత్కృష్ట ధనుర్విద్యా పారంగతుడే గాక, పురుషోత్తముండు, పరమ ధార్మికమూర్తి. సనాతన వ్యవస్థా విరుద్ధులైన నిశాచరవంశంబుల పీచమడంచి సాధుజన పుంగవులైన దేవ,



ముని, తాపస, మర్త్యసంఘంబులకు తగు రక్షణ చేకూర్చు నార్షమత వివర్ధన బద్ధ కంకణుండు. అంతియగాక నాతండు కరుణాంతరంగుండు. జీవ కారుణ్యుండు. సౌమ్యుండు, సౌజన్యుండు. 1592

తే.గీ. ఉపలలో బందియై యెన్నియో యుగములు
కృతక మృత్యువాత బడిన సతి యహల్య
కతుల గతిని శాప నివృత్తి నలర నిచ్చె
రామచంద్రమూర్తి దయాంతరంగు డతడు. 1593

వ. ఓ జనక మహారాజా! వసుంధరను క్షాత్రంబు నిర్వీర్యమైనదని నిర్ణయించు ముందు, రాముని చూచి మాట్లాడుము. ఈ మహాత్ము డవసరమైనచో, మేరుపర్వతము నైన నెత్తగల సమర్థుడు. ఈయనను తక్కువగా నెంచిన నేను సహించు వాడను గాన"నెను. 1594

## 14.8. శ్రీరామచంద్రుడు శివధనుస్సు నెత్తుట కుద్యుక్తు డగుట

అపుడు విశ్వామిత్రుడు లక్ష్మణుని శాంతపరచి, రామచంద్రునితో, తండ్రీ! రాఘవేంద్రా! ఇక నాలస్యమేల. శివధనువును విలోకింపుమనెను. శ్రీరాము డా కౌశికుని వచనంబులకు మహోత్సాహంబున స్పందించి, తన ఆసనమునుండి లేచుచుండ, సభలో మత్సరగ్రస్తులగు రాజులు కొందరిట్లను చుండిరి. 1595

అల్పాక్కర:
వీడొక తమ్ముడు, వాడన్నట
వేడుక వీరలు విల్లెత్తుట
నోడక మనమిక నోపికతో
చూడగ వలెనట చోద్యముగా. 1596

అల్పాక్కర:

ఒకటి సత్యమనెడు నూహ తోచె-
నిక నొక దుర్ఘట నిట జరుగున్
నికృతమౌ దాని గని మన మెకా
యెకి యిండ్ల కేగుద మెలరిపుతో. 1597

వ. అంత వారిలో కొందరు సౌమ్యులిట్లనిరి, 1598

కం. అన్నో తమ్ముడొ యెత్తున్
ప్రన్నని నీవిల్లు, లేని పక్షములో నే
లన్నా యింత హళాహళి -
కన్నారగ చూతమింక కాగల వన్నీ. 1599

వ. ఇట్టి ఈర్ష్యాజనిత ప్రలాపంబులు లెక్క చేయక, రామచంద్రుండు తన పీఠంబు వీడి సభాస్థలి మధ్యంబున విల్లునుంచిన మంజూష కడకు బయలు దేరెను. 1600

తరలి వృత్తం :

ధామనిధియు తూరుపు నగధామము నటు వీడగన్
తామసహర దీధితులకు తామరసలు విచ్చె నాన్-
రాముడు తన పీఠము తగు లాఘవమున వీడినన్,
సామన జన మానసములు సాంతము వికసించినన్. 1601

తరలి వృత్తం :

తామసహర దీధితులట ధారుణిపయి గప్పగన్
ధామనిధుల తాపమునకు తమ్మి పువులు కందె నాన్ -



రాముడు తన పీఠము తగు రాజసమున వీడినన్,
కామకలిత మానసములు కాతరమున గాసిలెన్. 1602

## 14.9. అంతఃపురస్త్రీలు మేడలనుండి విల్లునెత్త బోవుచున్న రాముని వీక్షించుట

వ. ఆ సమయంబున, 1603

చం. జనకుడు బంధువుల్, మునులు, సభ్యులు, పౌరులు, రాజులుర్విలో
ననిమిష జాలముల్ దివిని, యాసుర కోటులు రావణాధిపుం
డనుప నదృశ్యులై నభము నందున నెక్కొని చూచి రబ్బురం
బున ధనువెత్త బూనెడు ప్రపూతచరిత్రుని రామచంద్రునిన్. 1604

కం. శ్రీకంఠుని కార్ముకమును,
రాకా చంద్రాననుండు రాఘవు డచ్చో
వీకను నెత్తంబూనగ,
లోకేశులు వేచి రపుడు లోలుప హృదులై. 1605

ఉ. భ్రాంతిని రాచకామినులు రాముడు కార్ముక మెత్తు దృశ్యమున్
వంతులుపోయి చూచి రట భాసుర కాంచనరత్న రమ్యహ
ర్మ్యాంతర కుట్టిమంబుల గలట్టి గవాక్షములందు గుంపులై
వింతగ గెంతుచున్, బొటన వ్రేళ్ళను నిల్చుని నిక్కి సాగుచున్. 1606

వ. సుకుమారాంగుండును, సువిశాలఫాలుండును, సరసిజాక్షుండును, సరస మందహాసుండును, సురుచిరోష్ఠుండును, సుందర సుదంతపంక్తి శోభితుండును,

సునీల కాకపక్ష విలసితుండును, సున్నిత శ్మశ్రు చుబుక భాసురుండును, సన్నుత దివ్యాభరణ రోచిష్ణుండును, సువర్ణాంబరాలంకృతుండునగు రామచంద్రుని 1607

తే.గీ. మాలిక:

అంతిపురవాస యోషిత లంత లోన,
చూచి తిలకించి పులకించి చోద్యమంది,
ముదముతో వారు దివ్యానుభూతినొంది,
సంతసంబున తనువులు సంచలింప,
ఊర్ధ్వ వదనలై కైచాపి యోలగించి,
తమరు చేసిన పూర్వపుణ్యముల వలన,
ధనువు నెక్కుపెట్టుత రాము డనుచు మ్రొక్కి
నుతులుచేసిరి దుర్గాంబ కతులరీతి.

సరస నున్న వేరొక గవాక్షమున నుండి
సఖులతోడను కూర్చుండి సతి సుమేధ
క్రింద సభలోన కాంచెను మందస కడ
కేగు చున్నట్టి రఘురాము నిన కులేశు. 1608

సీ. నీలమేఘద్యుతి నిభ శరీరుండును,
కమలదళాక్షుండు, కంబుగళుడు,
శుభ్రాంశు కెనయైన సుందర నిటలుండు,
సుకుమార దివ్యాంగ శోభితుండు,
దివ్య కుండల రత్న దేదీప్యమానుండు,
ఘనభుజ విపుల వక్షస్థలుండు,
ఇభరాజ సదృశమౌ హేరాళ గమనుండు,
మందహాసాధర మండితుండు,



తే.గీ. పాలబుగ్గల పదియారు వత్సరముల
నవనవోన్మేషిత కువలయ వదనుండు,
బాలరాముని వీక్షించి భ్రాంతి నొంది
మగువ జనక రాజ్ఞి సుమేధ మరచె తనువు, 1609

వ. ఆమె యతని రాచరీవిని, సర్వావయవ సౌందర్యంబు, నాజానుబాహుత్వంబు, నభిరామత్వంబు, ననూనానందదాయక మృదుహాసంబును, కరుణా విలసితాననంబును, సౌజన్యజన్య జనాకర్షణంబును చూచి చెలులతో నిట్లనియె. 1610

శా. బాలాసుందరి యాన నీ ఘనుడు మా వైదేహి భర్తైనచో
శ్రీలక్ష్మీ సతికిన్ మురారివలె భాసించున్ జుమీ, కా నిసీ
బాలుండీతడు విల్లు దొడ్డది మహాభారంబు సంధింపగా
జాలండేమొ యటంచు నాకు మదిలో సందేహ మేపారెడున్. 1611

వ. దానికి చెలు లిట్లనిరి, అమ్మా! మహారాణీ ! 1612

మ. వినగా మంత్రము చిన్నదయ్యు మహిమన్ వీర్యంబునై ధాత నై
నను వశ్యుండుగ చేయు రీతి, సుమబాణాస్త్రుండు జీవంబులన్
తన యాజ్ఞన్ మసలంగజేయు నటులన్ తర్కింప నీతండు బా
లుని వోలెన్ కనుపించినన్ శివుని విల్లున్ పూన్చు నిశ్శంకగన్! 1613

వ. ఇంక నా రాజసౌధంబులో నించుక దూరంబున, 1614

ఉ. బంగరుపూల తీగెలు, శుభప్రదచూత పలాశ మాలికల్,
రంగగు పట్టు యల్లికల రంగుల బొమ్మలు, రూప్య చిత్రముల్
హంగుగ వ్రేలు భిత్తిని గలట్టి మరొక్క గవాక్షమందునన్,
సంగడికత్తెలున్ కొలువ జానకి నిల్చుని క్రింద చూడగన్, 1615

ఉ. రాముని గాంచె సీత యభిరామ మనోజ్ఞ తరంగరంగియై
దీమస సంచలింప, మును దేవళమందున చూచినట్టి యా
ప్రేమసుధామయున్ మరల వీక్షణసేయుచు, తృప్తిచెందమిన్
వేమఱు కండ్లుమూసి కనువిందులు పొందుగ పొంది యారటన్. 1616

వ. కీడు శంకించు మనమ్ముతో నా లోకనాయిక నిట్లు వేడుకొనియె, 1617

తే.గీ. దేవి! దుర్గమ్మ! మున్ను నీ దేవళమున
కోరితిని నిన్ను నేనొక కుర్రవాని
నాకు జతగూర్చ మనుచును నమ్మకముగ,
దయను నీవు గూడను తథాస్తంటిగాదె. 1618

తే.గీ. ప్రీతి నతడు నన్ పెండ్లాడ వీర్య శుల్క
మైన శివధను వెక్కిడ పూనె నేడు,
ఇట్టి దుస్సాధ కార్య మీదేర్చు నట్టి
బలము నిమ్మమ్మ యాతని బాహువులకు. 1619

వ. ఆ సమయమున, రాముడు సభామధ్యంబున గల వేదికను సమీపించి, 1620

తే.గీ. ధనువు గల పేటి చుట్టు ప్రదక్షిణించి,
వింటి కధిదేవతైన విశ్వేశు తెలచి,
చిత్తమందున తండ్రి యాశీస్సు లంది,
మౌని కౌశికు నీక్షించె నానకొరకు. 1621

వ. అంత విశ్వామిత్రుడు, 1622

తే.గీ. అమల రఘువంశ వార్ధి పూర్ణాంశ సోమ!
ప్రథిత చాప ప్రవీణ! మార్తాండ భీమ!



ఆలసంబేలనో సకలాస్త్ర ధామ!
పుణ్య చారిత్ర ! ధనువును పూన్చు మనగ. 1623

## 14.10. లక్ష్మణుడు పృథ్వీ, సూర్యులను హెచ్చరించుట

వ. రాముడంత మంజూష నున్న పుష్పాగరు మండితంబైన విల్లునకు నమస్కరించెను. అపుడు లక్ష్మణు డుత్తేజితుడై ప్రకృతినిట్లు హెచ్చరించెను. "ఓ భూగోళాధిదేవతా! 1624

ఉ. [2]ఎప్పటి రీతిలో తిరుగు మిట్టులె నీ సుత పాణిపట్టగా
నెప్పరి రామభద్రుడు సునీత పథంబున వీర్యశుల్కమౌ
అప్పరమేశు కార్ముకము హస్తబలాధ్యత నెక్కుపెట్టగా
నుప్పరమెత్తు శోభన మహోదయ మియ్యది – క్రాలకుండుమీ! 1625

కం. తరుణీ! నీ ధ్రువములు రఘు
వరు చాపార్భటికి కదలి భ్రమయక యుండన్
సరియగు కక్ష్యను వదలక
తిరుగుమ నీచుట్టు నీవు తీరుగ మింటన్. 1626

వ. ఓ సూర్యభగవానుడా! 1627

చం. దినమణి! వంశపూరుష! ధృతిన్ రఘురాముడు నీదు వంశజుం
డెనయిక లేని రీతిని మహేశుని చాపము భూమిపుత్రికై
పణముగ నెక్కుపెట్టగను ప్రబ్బెడు శబ్ద తరంగ ధాటికిన్
పనివిని పంచభూతములు పాపట బోవక పట్టు మిత్తరిన్. 1628

శా. ఓ సప్తాశ్వశతాంగ వాహనుడ! ధీరోత్కంఠుడై రాఘవుం
డా సర్వేశ్వరు చాపమెక్కిడగ నీ యాకర్షశక్తిన్ ధరి

త్రీ శుభ్రాంశువులన్ – తురంగముల వారింపంగ కళ్ళెంబులన్
చే సంధించుచు పట్టినిల్పు నటులన్ – సేపోర్చగా సేయుమా."1629

## 14.11. సీతారాములు పరస్పరము వీక్షించుకొనుట

వ. ఆ సమయంబున, 1630

తే.గీ. అంతిపురకాంత లుపవిష్టులైన కుట్టి
మంబున నలజడై యుత్తమాంగమెత్తి
ఇనకులేశుండు గమనించె జనకజను, జ
నకజయును చూచె రాముని వికచ హృదిని. 1631

తే.గీ. ఇరువురి సకృదీక్షణమున నిన్మడించి
మానసముల మెఱసి దర్శనానుభూతి
తళుకుమనె లోచనంబులు – తనువు, లెదలు
జానకీ రాముల కొకట జలదరించె. 1632

వ. అపుడు దశరథాత్మజుండు తనలోనిట్లు వితర్కించు కొనెను. 1633

ఉ. "మొన్నటినాడు నాకు తన ముగ్ధ మనోహరరూప సంపదన్
కన్నుల కట్టినట్టుగను కన్పడజేసి వనమ్మునందునన్
ప్రన్నన నాదు మానసము వావిరి దోచిన రాచకన్నె, ఈ
యన్నులమిన్నయైన రుచిరాంగన సీతయె, నిశ్చయంబుగన్. 1634

ఉ. మోహన రూప బాల నునుమోమున రాజిలు లేతనవ్వు, చే
తోహర దివ్య తేజముల తోడ హృదంతర మన్మథార్తి నా
దేహము పొంద లక్ష్మణుడు తిన్నన పల్కెను యూహజేసి వై
దేహియె యామెయంచును, మదీయ మనమ్మున నట్లె తోచెడున్. 1635



వ. ఓహో! విధియెంత విచిత్రమైనది. ఎక్కడో కోసలయందున్న నన్ను, విశ్వామిత్ర మునీంద్రుని మూలమున సిద్ధాశ్రమాది ఋషివాసంబుల రాక్షస ఖండనాది కార్యంబు లీడేర్పజేసి, అనూహ్యముగా మిథిలకు గొనివచ్చి నన్నీమెతో చేర్చు చున్నదికదా. కాక యిది కౌశిక ఋషీంద్రుని మంత్రాంగమా!

ఏది యేమైనను, ఆహా! నా మాతృమూర్తియైన కౌసల్య, బహుసహస్రవర్ష తపోబలసంపన్న యహల్య, పతివ్రతామతల్లిక యరుంధతుల ముఖముల కన్నను పవిత్రమై, అంతర్గతముగ శృంగారభావ ముద్దీపితమై వ్యాపించిన సౌరుగల ఈ యౌవనాంగి ముఖముననుండి నా దృష్టిమరల్ప బుద్ధి కల్గుటలేదు. 1636

తే.గీ. భావజుని జాయ సదృశయౌ నీ వనిత మొ
గము కనంగ యేదొ యిదమిత్థ మనలేని
మధుర పీడన నా హృది మథనజేసె
చెప్పలేనట్టి రీతిని చిత్రముగను. 1637

తే.గీ. ఈ యవనిజాత రూప మాత్మీయమనుచు,
నీ యమ బ్రదుకు నా భాగధేయమనుచు,
కారణాంతరముల చేత వేరయెనని
నాకు మదితోచుచున్నది నమ్మకముగ. 1638

తే.గీ. తమిని తరుణిని నేనింక దరికి జేర్చి,
నలువుగా హృదయములు లీనంబుచేసి,
ఆమె తోడను నే నేకమైనగాని,
తీరబోవదు తలప నా ఆరటమ్ము." 1639

వ. అని యా విధంబున, ముక్తికాంతాపరిష్వంగోత్కంఠుండు జీవాత్మ పరమాత్మైక్యత కొరకు పొందువ్యథ వలె రామచంద్రుండు సీతాకాంతా

సాంగత్యార్థ మార్తిచెంది, ఇది సమకూడుటకు మానసిక చంక్రమణముల నదుపుచేసి, దీక్షగొని, మనసును లక్ష్యంబు దెస లగ్నం బొనరించి, కార్యసాధన కొరకై శివ ధనుస్సును సంధించుటయందు తన సమస్త శక్తిని వినియోగించుటయే తత్క్షణ కర్తవ్యమని నిర్ణయించి, మరొక్కమారు పవిత్రంబును, శృంగార భావ గర్భితంబునగు సీతా ముఖచంద్ర దర్శనంబు చేసి, యుత్తేజితుండై, సర్వేశ్వర ప్రార్థనా పురస్సరంబుగ తన దక్షిణహస్తముతో ధనువును పట్టుకొని మంజూష నుండి సడలించెను. 1640

## 14.12. శ్రీరాముడు శివధనుస్సును భగ్నమొనర్చుట

తే.గీ. అపుడు శుభసూచకంబుగ నవనిజాత
యొడలు ఝల్లు మనె, నదిరె నెడమ కన్ను,
వలపుతోడను రాముండు పాణి పట్టి
నట్టు లెడద కల్గె నొక దివ్యానుభూతి. 1641

తే.గీ. బాలరాముండు ధనువును పట్టు కొనగ,
నశుభ సంకేతము లనగ నవనిలోని
అసుర సతుల కదిరె దక్షిణాక్షు లపుడు
గొంతుకల్ పట్టె వారెల్ల గొల్లు రనగ. 1642

వ. తదుపరి, 1643

తే.గీ. వెనుక విశ్వేశు విల్లెక్కుపెట్ట బూని
యసుర సార్వభౌముడు కార్ముకాటని గొని
యల్లెత్రాడును నద్దాని కమరురీతి
కట్ట సమకట్టి విఫలుడై నట్టుగాక, 1644

తే.గీ. రాఘవుడు ధనుర్వేద పారంగతుండు
గాన పెట్టెలోననె యుండ కార్ముకమ్ము,



వింటి కొననున్న నారిని వేరు కొనకు
జారుముడివేసి కట్టెను చతురుడగుచు. 1645

ఉ. అంతట రాఘవుండు జను లబ్బురమందగ వామహస్త మ
ల్లంతకు సాచి లస్తకము నాదట పట్టి శరాసనమ్ము బల్
వింతగ నెత్తి నేల నిలబెట్టి గుణమ్మును పట్టి కోటికిన్
సంతన చేసె – వాని బలసంపద కచ్చెరువంద చూపరుల్. 1646

తే.గీ. ఇనకులుండంత సీత నీక్షించు వాంఛ
తలను పైకెత్త నిడుదగు ధన్వ మడ్డ
మైన, ప్రియురాలు దర్శనం బౌటకొరకు
వింటి నడ్డముగా త్రిప్పె నొంటిచేత. 1647

చం. అనుపమ భారమైన ధను వాగతి త్రిప్పుచు నిల్పె పుఱ్ఱ చే
తను తన ప్రేయసీ వదనదర్శన వాంఛను – చూడ నిట్టిదౌ
అనఘము పావనంబునగు అర్మిలి యుండగబోదు, నిట్టిదౌ
ఘనభుజ శౌర్య విక్రమము కాంచగ లేము ధరాతలంబునన్. 1648

తే.గీ. రాముడొక్కడె యనుపమ ప్రేమమూర్తి,
దశరథసుతుండె నిరుపమ ధన్వి యరయ,
నజుని మన్మడె యతిలోక భుజబలుండు,
జానకీ రాము లెనలేని జంట భువిని. 1649

వ. రాముని గుణశరాసనానుసంధాన విద్యాప్రావీణ్య ప్రదర్శనమగు నా సన్నివేశంబు తనమనంబున భావోత్తేజంబు కలిగింప, 1650

కం. భూమిజ తను పులకితయై
మోమున నాశ్చర్య తోష మోహంబులతో

కాముని భామిని ప్రతిమన
రాముని వీక్షించె శిల్ప రమ్యత తోడన్. 1651

తే.గీ. ఆ క్షణమునందు లేచిన యవనిజాత
హృదయ భావ పరంపర లిట్టివనుచు,
నెట్టి యాత్మవేత్తైన నూహింప నగునె!
ఎట్టి కవిచంద్రుడైన వర్ణింప గలడె! 1652

వ. అంత, 1653

శా. ఆకర్ణాంతముదాక శింజినిని – ఖడ్గాచార్యు డేరీతిగా
బాకున్ సర్రునలాగు నావిధిని – ప్రాబల్యంబునన్ లాగి యా
కాకుత్థ్సాన్వయభూషణుండు వదలంగా – టంకృతిన్ కార్ముకం
[3]బాకంపించుచు రెండు ముక్కలయె భూమ్యాకాశముల్ భేదిలన్. 1654

తే.గీ. దాశరథి హస్తము శివుని ధనువుపైన,
మనసు సీతపైన, నెపుడు ధనువు నెత్తె,
నెపుడు నారి కోటికి కట్టె, నెపుడు లాగె
నన్న వెరుగదు శబ్దంబు విన్న దనుక. 1655

సీ. రాముడు ధనువెత్త రాణతో కౌశికు
రోమముల్ పులకించి రూఢి నిలిచె,
దాశరథియు వంచ ధన్వంబు రాజుల
శిరములు వంగెను సిగ్గు తోడ,
సాకేతుడు గుణము సర్రున లాగంగ
లలి సీత మనసంత లాగబడియె,



భాస్కర కులజుండు భగ్న పరుప విల్లు,
జనకుని శంకలు తునుక లయ్యె,

తే.గీ. విల్లు రాముండు విఱువంగ వింటితోడ
త్రెళ్ళి ముక్కలై శింజిని తెగుట వలన,
దానవ స్త్రీలకు గళసూత్రముల యందు
మూడు ముడులలో నొక్కటి పుటుకు మనియె. 1656

వ. అనంతరము రాముడు విజయానందము మొగమ్మున నుట్టిపడ, విఱిగిన రెండు చాపఖండంబుల నెత్తి నేలపై పడవేసెను. అప్పుడా రెండు ముక్కలు, 1657

తే.గీ. తనరి భూమాత దరిజేరి, తల్లి! నీ కు
మార్తె సీత పెండ్లాడు రామ విభు నిశ్చ
యముగ బెంగ విడువు మమ్మ! యనుచు తెలిపి
నట్లు ఘల్లురనుచు పడె నవని పైన. 1658

## 14.13. ధనువు విఱిగి నపుడు మహాశబ్దంబులు జనించుట

వ. శివధనుస్సు విఱిగినపు డందుండి ఉద్ఘమౌ నిర్ఘోషం బుద్భవించెను. 1659

తే.గీ. ఆ ధ్వనికి సంభ్రమము నంది, యార్తితోడ
సభను గలవార లెల్లరు సడలి మూర్ఛ
గొనిరి కొంత కాల మపుడు – కుశిక కులుడు,
జనకుడును, సీత, రామ లక్ష్మణులు తక్క. 1660

[4] శా. ఆ శబ్దంబు మహాద్భుతంబుగ వడిన్ వ్యాపించె నల్దిక్కులా
కాశ క్షోణితలంబులన్ ధ్వని తరంగంబుల్ ప్రసారంబుగా
గా సంద్రంబులు, వారివాహతతులున్ కల్లోల సంక్షోభమై
గాసిల్లన్ పెనుగాలితో, భువి పడెన్ ఘాటించి వర్షోపలల్. 1661

వ. భూమిలో చలనంబు లుద్భవించి పైపొరలు కంపించె. అగ్ని పర్వతము లుత్తేజితములై ధూమపుంజ సంయుత వహ్ని ఖండంబుల వెదజల్లె. సముద్రముల క్రిందగల భూభాగములు కదలుటంజేసి జలధులలో జలకంపనం బులు బయలుదేరి, వ్యాపించి ఆయా జలధుల తీరప్రాంతముల ననూహ్య రీతిని ముంచి వేసెను. సముద్రములనుండి భూభాగముల జేరి వాయుపీడన జనిత మహావాత వర్తులంబులు సంచరించె.

ఆ విధంబుగ విలయంబో యనునట్లు మహోత్కటమై యుద్భవించి యుద్ధృతమై శబ్దతరంగము లష్టదిక్పాలురకు, నధోలోకంబులకు రామచంద్రు డాచరించిన యసమాన కార్యమగు శివ ధనుర్భంగ వార్త తెలియ పరచుట కోయన, నమితవేగంబున భూమ్యోపరితలంబునను, భూగర్భంబునను ప్రసారితమయ్యెను. ఇంకను, నా సమయంబున మేఘంబులం దుత్పన్నం బైన విద్యుల్లతా పుంజంబులనుండి వెలువడిన విద్యుదయస్కాంత తరంగంబులు భూమిని పరావర్తమై, ఆకాశ, చంద్ర, సూర్యమండలంబులకు వ్యాపించి, ఈ వార్తను నభచ్చరులకు, దేవతానీకములకు, నమృతాంశునకు, శ్రీరాముని వంశ మూలపురుషుడైన కర్మసాక్షికి తెలియ జేసి, వారెల్లరను సంతోషపరచెను. అటుల పర్వి ధన, ప్రాణంబుల కే మాత్రము నష్ట కష్టములు కలిగింపక, కొలది కాలమున కా తరంగంబులు నిశ్చలమైనంత, భూగోళంబును పరిసర గోళంబులును పూర్వమట్లు యథాస్థితుల నొందెను. 1662

## 14.14. శివుని చాపమును భగ్నమొసరించిన రామచంద్రుని నిర్జరాదు లుత్సహించుట

తే.గీ. రామచంద్రుండు విల్లెత్తు రమ్యమైన
దృశ్యమును చూచుచున్నట్టి దివిజ తతులు
గూడ నబ్బురంబంది రా గొప్ప ధ్వనికి,
నసుర సంతతుల యెడద లవిసిపోయె. 1663



తే.గీ. స్వర్గమందున నిర్జర వనితలపుడు,
పూల వానల కురిపించి రోలగించి,
అప్సర స్త్రీలు నాట్యంబు లాడు చుండ
దుందుభులు మ్రోసె నుద్ధర్ష సందడించి. 1664

ఉ. శంకరదేవు విల్లు భుజశక్తిని మత్త కరీంద్రతుల్యుడై
కొంకక నిక్షు ఖండమటు కూల్చి విఖండన జేయ రాముడున్
శంకలు తీరి సంతసము స్వాంతము నింప విదేహ భూపుడున్
పొంకమునొంది రాఘవుని పొంతున కౌగిలి చేర్చె ప్రీతితో. 1665

చం. అనుకొనినట్లు భూమిపయి నాసుర తత్త్వ వినాశమున్, సనా
తనమగు ధర్మ సంస్కృతిని ధారుణి నిల్పెడు శక్తి రామభ
ద్రుని కడ నున్న వంచును నిరూపణయై శివ చాపఖండనన్,
తనిసెను కౌశికుండు శమితన్ తన పాత్రకు తృప్తిచెందుచున్. 1666

తే.గీ. సంతసంబున సభలోని సంయమీంద్రు
లంత వేద మంత్రంబుల సంత లెంచి
చేరి శ్రీరాఘవేంద్రు నాశీర్వదించి
రపుడు కల్యాణమస్తని యాదరమున. 1667

తే.గీ. పౌర కామినీ బృందంబు లారజమున
గళములెత్తి మంగళదాయకంబులైన
సంప్రదాయ కీర్తనలను స్వరయుతముగ
పాడి యారతిచ్చిరి రామభద్రునకును. 1668

తే.గీ. వంది మాగధ జయజయ ధ్వానములును
పటహ భేరీ మృదంగాది వాద్య ఘోష

లేక కాలాన మిశ్రమై యినుమడించి
మిన్ను మన్నుల మ్రోగెను మెండుగాను. 1669

తే.గీ. సదమునందున పాల్గొన్న సభ్యులపుడు
రామచంద్రుని బాహు విక్రాంతి తలచి
పొంగి యుప్పొంగి తమ సీత పూర్వ పుణ్య
మూలమున కాదె దొరికె నీ పురుషు డనిరి. 1670

వ. రామచంద్రుని రూప, గుణ, బల పరాక్రమముల నెన్నుచు, నీ సీతా రాములను జతచేసిన విధాతకు కృతజ్ఞతలు పలికిరి. ఇంకను, వారు రాము డేరీతి శివుని విల్లు నెత్తెనో, అరిపోసెనో, ఎక్కుపెట్టెనో, భగ్నము చేసెనో వివరముగ చర్చించు కొనుచు, సభామధ్యంబునకు పరువెత్తివచ్చి అనుకరించ ప్రయత్నించుచు, రామచంద్రుని చుట్టు గుమిగూడి జయ జయధ్వానములు చేసిరి.

అంతలో, 1671

## 14.15. సభలో కొందరు చలమరులైన రాజులు కలకలము కలిగించుట

తే.గీ. సొలపులోనున్న రాజులు తెలివి నొంది,
ముందు మూర్ఛలో పడియున్న మూలమునను,
చాప భగ్నంబు నేరక శంక పడుచు
విఱువనే లేదు రాముండు వింటిననిరి. 1672

వ. మంజూష చుట్టును జనులు గుమిగూడియుంట, విఱిగిన వింటి ముక్కలను కనజాలక, వారు 1673



తే.గీ. కార్ముకము భగ్నమైన సాక్ష్యంబులేదు,
జనకు డాడించినట్టి యసత్య నాట
కమ్మిది యని బొబ్బలిడుచు కలకలంబు
మిక్కుటముగ లేపంగ సౌమిత్రి యపుడు. 1674

ఉ. కౌశికు నాజ్ఞనొంది జనకాండము మధ్యకు నేగుదెంచి యా
వేశముతోడ రాజుల వివేక విహీనత నెత్తి చూప, వి
శ్వేశుని చాపఖండముల చేతుల చేకొని యెత్తిచూపె, నా
యీసున కొట్టులాడెడు నృపేంద్రుల దుస్థితి యిన్మడింపగన్. 1675

తే.గీ. కొందరు నరపతులపుడు కుపిత మాన
సమ్మున చెలగి శ్రీరామచంద్రమూర్తి,
జనక రాజేంద్రులను తాకి సంగరమున
గెలిచి సీతను గొనిపోవ తలపడంగ, 1676

వ. చూచి, మరికొందరు రాజు లిట్లనిరి. 1677

ఉ. బాహు సమగ్ర విక్రముడు భాస్కర వంశ్యుడు రామమూర్తి చే
తోహర మూర్తియై ధనువు దోర్బలశక్తిని ద్రుంచ నాధ్వనిన్
మోహము చెంది క్రుంగుపడి మూర్ఛను మున్గిన మీరలా యిసీ!
ఆ హిమకూటసన్నిభ బలాఢ్యుని పోరగ కాలుదువ్వుటల్! 1678

కం. కావున చాలు ప్రలాపము
లా వీరుని కెదురు నిలుచు టావహమందున్
చావును కొని తెచ్చు కొనుటె
భావంబున వాని మ్రొక్కి బ్రదుకుటె మేలౌ, 1679

తే.గీ. వావిచెడి రాజు లప్పుడు వారి లోన
వారె కలహించుచు వెడలి నార లూరు
విడిచి వారి వాసములకు – ముడిచి నట్టి
తోక లితరులు కనకుండ మూక వృత్తి. 1680

## 14.16. జనకుడు విశ్వామిత్రునకు కృతజ్ఞతలు తెలుపుట

చం. అదియటులుండ, భారమగు నంబరకేశుని వింటి ముక్కలన్
పదటిమిలేక తేలికగ బాహుబలంబున నెత్తినట్టి యా
సదమల శౌర్యవిక్రముడు స్వర్ణ సమాన తనుండు లక్ష్మణున్
ముదమున గాంచి యా జనకభూపతి యబ్బుర మంది యాత్మలో. 1681

మ. పనుచన్ ఊర్మిళ తోడ లక్ష్మణున కుద్వాహంబు గావించు మా
యనుచున్ కౌశికు డా దినమ్ము తనపై నాత్మీయతన్ – వల్లె యం
చనబో కుండియు నేడు లక్ష్మణుని ప్రజ్ఞాశక్తు లీక్షించి మో
మున మందస్మిత ముగ్గడింప హృది యామోదంబుతో నొప్పగన్. 1682

వ. తన యొరసి నూర్మిళను రామానుజుడగు లక్ష్మణస్వామికిచ్చి వివాహము సేయ నిశ్చయించెను. అనంతరము జనకుడు తన కృతజ్ఞతలు తెలిపి సీతారాముల కల్యాణ కార్యక్రమమును చర్చింప, విశ్వామిత్రుని కడకేగి హార్దికముగ వందనమాచరించి యిట్లనియె. 1683

శా. "మీ యాశీస్సుల కారణమ్మునను స్వామీ! రామచంద్రుండు నే
డీ యత్యంత మహత్త్వసంయుతమునౌ యీశాను చాపంబు ము
న్నా యజ్ఞేశుడు భూమి నెత్తినటు నిర్యత్నంబుగా నెత్తె! నో
హో! యుష్మాదృశు డేయెడన్ కలుగు నీ యుర్వీస్థలిన్ చూడగన్! 1684



కం. పరమేష్ఠి నుండి యరుదగు
వరములు గొనినట్టి దానవ శ్రేష్ఠుం డా
సురవైరి యెత్త లేనిది
వెరవరి రాముడు విఱచెను భీముని ధనువున్. 1685

ఉ. అట్టిడు విక్రమంబు జగమందున నేయెడ కానరాదు, నే
బిట్టు కలంగి – చూచితిని – వీకను రాము డనన్యసాధ్యమున్
కట్టడజేసి చూపె శివ కార్ముకఖండన – దిట్టలెల్లరున్
నిట్టలుద్రోయగా, జనులు నెట్టన పట్టము గట్టవానికిన్. 1686

కం. మును మీరెంతగ ధైర్యం
బును నాకిచ్చినను గాని మునినాథా! నా
మనసు రఘువరుడు విల్లె
త్తునా యనుచు సంశయించె దోలాయంబై. 1687

కం. నేనెంతగ పొరపడితినొ
గానీ యెత్తుటయగాదు ఖండించెగదా!
ఈనాడా రఘువీరుడు
దానిని – వత్సంబు చొప్పదంటిని వోలెన్. 1688

మ. నీ మూలంబున మాకు రాఘవులకున్ నెయ్యంబు వియ్యంబునై
సామీప్యంబయె, జానకీ సుదతినిన్ సాకేతు డుద్వాహమౌ,
మా మా సంతతి కీర్తి గౌరములున్ మన్నింపు పొందున్ భువిన్
స్వామీ! యంతయు మీ కృపన్ జరిగె – కైచాపుల్ గొనుండో మునీ! 1689

ఉ. ఇంకొక మాట – లక్ష్మణు డిభేంద్ర సమున్నత బాహు వీర్యు డే
వంకను తీసిపోడితడు పాటవమందున రామమూర్తితో

నంకిలికావు నా పలుకు లాతని కూర్మిళ పాణినిత్తు నే
కొంకక నింకమీద – మును కోరిన రీతిని సంయమీంద్రులున్"1690

వ. అని వచించి, జనకుడు మరల కౌశికు నిట్లు వేడుకొనెను. 1691

కం. "రాముండు వీర్యశుల్కము
కామన నెరవేర్చెగాన కాగల పనులన్
మేమెట్లు చేయ వలయునొ
స్వామీ! మా కాజ్ఞసేయ ప్రార్థన చేతున్." 1692

చం. అన విని కౌశికుం డనె జనాధిపుతోడ "వివాహ మీయెడన్
ధనువును పూన్చు శక్తిపయి తద్దయు నిర్ణయమయ్యెగాన నీ
యినకులు డీశు కార్ముకము నెక్కిడి భగ్నము చేసినంతనే
జనకజ తోడ నుద్వహము సాంతము పూర్తయి నట్టులే సుమీ! 1693

తే.గీ. ఐనను మన ముచ్చట కొరకై తగువిధి
సంప్రదాయ యుక్తంబుగ జరుపు మడిగి
మీ గురువుల కల్యాణము వేగిరముగ –
నెల్లవారల సంతోష మినుమడింప. 1694

కం. శిక్షిత దౌత్యచతురుల స
పక్షుల నంపుచు దశరథ పార్థివు కడకీ
వీ క్షణమే యెరిగింపుము
దక్షుడు రాముని ప్రతాప దాక్షిణ్యంబుల్. 1695

కం. ఒప్పుగ వివాహ విషయము
నెప్పరముగ దశరథ నృపునికి వినయముతో



చెప్పి, వసిష్ఠ మునీంద్రుని
చప్పున నొప్పించి యతని సమ్మతి గొనుమీ." 1696

వ. అని హితవు పలికి, మరియు నిట్లనియె, 1697

సీ. "జనకరాజ! వినుము సావధానుండవై
సంప్రదాయ నియమ సంచరితుడు,
బాహు బలచతురుం డాహవ నిపుణుండు,
సన్నుత గుణుడు కుశధ్వజుండు,
నీ కనిష్ఠభ్రాత – నీవు వాని యెడను
ప్రేమతో నుంటివి పెద్దవగుట,
కావున నాతని కన్యలు మాండవీ
శ్రుతకీర్తులను నీవు ప్రోదిగొనుచు

తే.గీ. రామభద్రుని తమ్ములు రమ్యగుణులు
భరత శత్రుఘ్నులకునిచ్చి వరుస పెండ్లి
సేయుటొప్పు నీ దుహితలు సీత, యూర్మి
ళల మనువు సమయాన నుల్లాసముగను. 1698

కం. ఒప్పిన నీ వీ వెరవుకు
రప్పింపగ వార్తనంపి రయమున ననుజున్
తెప్పింపు కుటుంబముతో
నిప్పురమును తత్క్షణంబు నెట్టన చేరన్. 1699

వ. ఈ సంప్రదింపులన్నియు పెండ్లికుమారుల తండ్రి దశరథు డిటకు వచ్చిన పిదప, వానితో వసిష్ఠ మహర్షి సన్నిధిని నీవు మీ పురోహితుడు శతానందునిచే నడిపించి వారి అంగీకారము గొను"మనెను. జనకు డుత్సాహముతో మునీంద్రుని ఆలోచనలకు సమ్మతి తెలిపి, ఆ సంయమీంద్రునకు తనపైగల

యాదరా భిమానములకు మరొకమారు కృతజ్ఞతలు వచించి తన తమ్ముడు కుశధ్వజునకు శీఘ్రవర్తమానమంపి, ఆతనిని కుటుంబ యుతంబుగ విదేహకు రప్పించెను. 1700

---

**వివరణలు:**

1. ఆకాశమందు ఆశనులు, అనగా పిడుగులు, మేఘములను మార్కొని, పరస్పరఘట్టన మూలమున, దీప్తితో గూడిన చంచలలు అనగా విద్యుల్లతలను జనింపచేసెను. (నిజమునకు మేఘములలో విద్యుత్పాతములమూలమున మెఱుపులు, వాటితో పాటు ఉఱుముల శబ్దములు జనించును. ఇక్కడ ఈ సంఘటన రాక్షసమాయా సంజనితముగాన, ఇట్లు అసహజముగా, లేక వ్యతిరేకముగా చెప్పబడెను.)

2. శ్రీరాముడు శివధనువు నెక్కుపెట్టు సమయమున లక్ష్మణస్వామి పృథ్విని సూర్యుని హెచ్చిరించుట, నేడు మనకు సంక్రమించిన శాస్త్రవిజ్ఞానమునకు అనువుగా వ్రాసితిని. పూర్వపు రామాయణములలో (చూ॥ మొల్ల రామాయణము) భూమిని, వాసుకి మోయుచున్నాడని, అటులే ఈ రెంటిని కూర్మము మోయుచున్నదని, వాటిని వరాహము, వాటన్నిటిని ఏనుగులు మోయుచున్నవని, అప్పటి నమ్మకములను బట్టి వ్రాసిరి.

3. ఆకంపించు= అధిక కంపమునకు (intensive vibration) గురియైనదనే అర్థం. ఇక్కడ నారి కంపమునకు ఉత్తేజితమై కార్ముకము అనునాదించిందనే (resonate) అర్థంలో వాడితిని. నారి లాగినందువల్ల విల్లు వంగింది. కాగా, నారి టంకృతి కుద్భవించిన వస్తుతరంగముల (body waves) పౌనఃపున్య విలువ కార్ముక సహజకంపన పౌనః పున్య వ్యాప్తిలో (natural frequency range) వుండుట వలన, విల్లు అనునాదమునకు(resonance) గురియై విరిగిందని నా యూహ.

ఇలా కాక కేవలం నారి లాగినంత మాత్రమున విల్లు విరగుటకు అది తుప్పుపట్టిన లోహఖండం కాదు. మహాదేవుని మహిమాన్వితమైన శరాసనము.

శ్రీరాముని చేతినుండి సంధింపబడిన బాణమునకు తిరుగులేదు కనుక, ఒకవేళ ఈ ధనువు నుండి బాణమే విడువబడియుంటే బ్రహ్మాండమే పగులుతుందని భీతితో ఆ ధనువు తనంత తనే విశ్వశాంతికోసమై ఆత్మాహుతిగా విరిగిందంటాడు, ఒక పూర్వ (అవాల్మీక) రామాయణ కవి. ఈ యూహకు భౌతిక శాస్త్ర కారణంగా నా పైయూహ హేతువును కల్పిస్తుంది.



4. ధనువు విఱిగి నపుడు జనించిన మహాశబ్దములు, వాటినుండి ఉత్పన్నమైన వస్తు తరంగముల (body waves) తత్త్వ, క్రమణములు భూభౌతిక శాస్త్రవిజ్ఞానానుసారముగనే వ్రాసితిని. అయితే, ఈ వర్ణన ప్రక్రియలలో కొన్నింట కొంత కొంత అతిశయోక్తులు కలవు. సాహిత్య గ్రంథము గనుక, ఇట్టి ఉత్ప్రేక్షలు సహజమే అనదగును.

*సూచనలు : సముద్రముల క్రింది భూమి (సముద్రభూతలము) లోని పొరలు కంపింప నుద్భవించిన తరంగములు 'చ్యునామీల'కు కారకములు; వాయుపీడనజనిత మహావాత వర్తులంబులు సైక్లోన్లు, టార్నెడోల వంటి ప్రక్రియలకు కారకములు; విద్యుదయస్కాంత తరంగములు (electromagnetic waves) ఆకాశములోని విద్యుత్ప్రవాహ జనితములు.

***

# 15. సీతారాముల కల్యాణ ఖండము

## 15.1. కల్యాణ కార్యక్రమమును నిర్వహించుటకు శతానందుడు నియమింపబడుట

సీ. పిమ్మట జనకుడు ప్రియమార మంత్రులు,
వేత్తలు, బందుగుల్ వెంట నుండ,
తన కులగురువు శతానందు కడకేగి
సాష్టాంగముగ మ్రొక్కి సన్నుతించి
వధువు పక్షమున వివాహ కార్యక్రమ
ములను వరుని గురువులను కూడి
సంప్రదాయమువెంట జరిపించుడని కోర,
ముదము తోడను మునివతంసు
తే.గీ. డనియె జనక రాజన్యుతో, "వినుము ధరణి
పాల! జానకీ రాముల పరిణయమ్ము
విశ్వమున 'నభూతో నభవిష్యతి' గను
నిలుచు రీతిని జరిపింతు నిరతితోడ. 1701

వ. మహారాజా! మగపెండ్లివారి పురోహితుడు, వేదమూర్తియు నైన వసిష్ఠ మహర్షి అండను, మహా మహిమాన్వితుడు, ఘటనా ఘటన దక్షుండునగు బ్రహ్మర్షి విశ్వామిత్రుని దర్శనంబునను మెలగుచు, నేను ప్రత్యేక శ్రద్ధవహించి ఈ కల్యాణ మనుపమ శోభాయమానముగ జరిపింతును. మరియు, ప్రభూ! 1702

సీ. యజనంబు కొరకు నీ వవనిని దున్నంగ
నయముగా వెలువడ్డ నాటినుండి,
శీతలో దొరుకంగ సీతను యపురూప
నామంబు స్థిరమైన నాటినుండి,



అక్షరాభ్యాసాన నక్షరంబుల నేను
నలువుగా దిద్దించు నాటినుండి,
ఒనర శరప్రయోగోపసంహారముల్
సాటోపమున నేర్పు నాటినుండి,
తే.గీ. సీత యనుమాట విన్నంత స్నిగ్ధమైన
భ్రాతృభావంబు నాలోన పరిఢవిల్లు –
ఇంతి సీతకు పెండ్లి చేయించుటన్న,
దీని మించిన భాగ్య మెద్దేని గలదె. 1703

మ. వరుడా భాస్కరవంశవార్ధి శశి, విశ్వామిత్ర మౌనీంద్ర హృ
త్సరసీజాత విభాకరుండు, రజనీ సంచార వంశాంత కా
శరతుల్యుండు, సనాతనార్షమత రక్షా దక్ష బద్ధుండు, శం
కర కోదండ విఖండమండను డనంగాకార సంక్రాంతుడున్. 1704

వ. అంతియకాక, రాఘవేంద్రుండు కష్టతాపంబుల కొట్టుమిట్టాడి అభాగ్యుల పై కృపా వృష్టి కురిపించు దయాఘనాఘనుండు. 1705

కం. శాపగ్రస్త మదంబకు
పాపము తీరంగజేసి పాదస్పర్శన్
శాపవిముక్తి నొసంగుచు
కాపాడెను గాదె భూరి కారుణ్యమునన్. 1706

కం. ఇట్టిడు జంటకు ముదపడి
కట్టడ చేయింతు నేను కల్యాణంబున్,
నెట్టన లోకములు వొగడ,
దట్టించుచు నేటి సంప్రదాయము వెంటన్." 1707

తే.గీ. అని శతానంద మౌనీంద్రు డలరి పలికి
జానకీ రామచంద్రుల జంటకపుడు
పరిణయంబున ముచ్చట్లు వలయు రీతి
సంప్రదాయానుసారంబు జరుప దలచి, 1708

తే.గీ. అంతిపురమేగి నాటి కార్యక్రమంబు
రాణి వాసాన తెలుపంగ రమణ లపుడు,
తెరలి రాణి సుమేధాసతి యనుమతిని
తనరి సీతను పన్నీట తానమార్చి, 1709

తే.గీ. అనుపమంబైన చీనిచీనాంబరముల
కట్టగానిచ్చి, నవరత్న ఖచిత కనక
భూషణచయము సర్వాంగములకు శోభ
గూర్చు రీతిని సీతకు తీర్చి దిద్ది. 1710

వ. మరియు, సీతా సుందరి నీలాభ్రవర్ణ ద్యుతి సంయుతనాగ సర్పనిభ కైశ్యంబును వ్రేలాడు వేణిగా నల్లి, యందు బహువర్ణ సురభిళ సుమచయంబుల ముడిచిరి. ఇంకను, ఆ సిరికాంతాసమ సువర్ణ ధవళ శోభిత దేహంబునకు హరిచందనము రాచి, వికసితాంభోరుహ సదృశంబులైన కనులకు నల్లని కాటుకను దిద్ది, పూర్ణచంద్ర సమంబగు మొగంబునకు కుంకుమంబు చంద్రకళా రూపంబైన కల్యాణ తిలకంబుగా నమర్చి, పెదవుల కెర్రని లత్తుక నొత్తి, కాళ్ళకు పారాణి పూసి, అరచేతులకు కోకనద వర్ణంపు గోరంట చిత్రించి, సహజ సుగంధ పరిమళ పుష్ప నిష్పన్నద్రవంబుల దేహంబున జల్లి, పుష్పాయుధుని సుదతి కెనయైన రాశీభూత సౌందర్యావతంస నలంకరించి, లోకాధి నాయకుండైన రామచంద్రుడు వేచియున్న సభకు తరల జేసిరి. 1711



## 15.2. సీతారాము లొకరి కొకరు పుష్పమాలల నలంకరించుకొనుట

సీ. ఇరు పార్శ్వములయందు నెఱవాదులై మీఱు
చెలికత్తె లెలరారి చేరి కదల,
తనతోడ తులతూగు తనప్రక్క నడతెంచు
తరుణిపై వామహస్తంబు మోపి,
జయసూచిగానొప్పు సరిగను సొగసుగా
దక్షిణ కరమందు తనర గొనుచు,
వలవంత తనువంత పులకింత కలిగింప,
నడుగులో నడుగుగా నడచు కొనుచు,
తే.గీ. బెదురు చూపులతో నెద బెండుకొనగ,
తనకొరకువేచు దశరథాత్మజుని దెసకు,
కలికి జానకి మెలమెల్ల కదలివచ్చె,
నించుబోడికి పదములు సంచలింప. 1712

తే.గీ. కచభరంబున తల వెనుకకును వంగ,
నంగనకు సిగ్గు శిరమును క్రుంగజేయ,
క్రుంగు వడుచున్న ధైర్యంబు కోలుకొనగ
నవని మాతకు మ్రొక్కెనా యనగ తోచె. 1713

తే.గీ. కలికి నునుసిగ్గు తనను వెన్కకును లాగ,
దశరథాత్మజు నికట సందర్శ నేచ్ఛ
తన మదిని మిక్కుటమయి ముందునకు త్రోయ
నతివ అడుగిడు నడుగిడ దదటు పడుచు. 1714

తే.గీ. దాని గమనించి చెలికత్తె తరుణి నపుడు
పదిలముగ నెట్ట ముందుకు కదలుమనుచు,

తలరి నడుచుచు జానకి దరికి చేరె
మందగమన స్వయంవర మండపమ్ము. 1715

వ. అంత, 1716

సీ. తులకించు రతికాంత లలితంపు మృదుహాస
మండిత వదనంబు మధువు కురియ,
మిలమిల మిరుమిట్ల మెలగించు నయనాల
చిలికింత మదినంత కెలసి కులుక,
ఘనమైన చనుదోయి కనకంపు కరువల
లలికాంతి పులకలు కలుగ జేయ,
కుచయుగ్మ జఘనాల కూటమి స్థానమై
కలదు లేదను కౌను కదలియాడ,
తే.గీ. మల్లె మాలతీ మందార మలయజ సుమ
వీచికా దివ్య మాధురుల్ వెంట వీవ,
కదలి వచ్చెడు జానకిన్ కాంచి విభుడు,
అలరు విలుతుని ములుకుల సలుపు నొందె. 1717

వ. అంత శ్రీరాముని దరికి చేరిన సీతాకాంత, యొకింత వదనంబు పైకెత్తి, 1718

ఉ. ముందట గాంచె సీత నవమోహన మూర్తిని రామమూర్తినిన్,
మందిత నీలవారిద సమంచితదేహుని, పీన వక్షునిన్,
సుందర బాహుయుగ్మ వర శోభితు, నిర్మల కంబుకంఠు, నా
నందిత దివ్యభావ వదనాంబుజ మండిత మందహాసునిన్. 1719

వ. అది ప్రథమ నికట సందర్శనం బగుట నా దివ్య మోహన రూపమునకు



నిశ్చేష్టయై, తన సర్వస్వము రామునకు సమర్పించిన భావంబు మనం బావహింప, ఒడలు మరచి మనసులో నిట్లు కీర్తించెను. 1720

తే.గీ. మంగళము కోసల కుమార, మహిత రూప!
జలద సమదేహ దివ్యమంగళము నీకు,
ముగ్ధమోహన సౌందర్య పుణ్య పురుష
బాహు విక్రమ శోభిత! భాసురాంగ! 1721

తే.గీ. మంగళము రామ! గుణధామ! మాన్య జనక
భాగ్య పరిపాక కారణ! ప్రథిత వీర!
మంగళము నాదు ప్రణయ పుంభావ మూర్తి!
మంగళము భర్గ కార్ముక భంగ నీకు! 1722

వ. సీత యారీతి నొడలెరుంగక లోకాభిరాముడగు రాముని దివ్య మంగళ సుందర విగ్రహమును గని, వాని రూపరేఖా విలాసంబును, బాహువిక్రమమును మనమ్మున కొనియాడుచు ఆ ప్రణయమూర్తితో మమైకమై చేష్టలు దక్కి చిత్తరువునందలి బొమ్మవలె నిలిచిపోవుట చూచి, కొన్నిక్షణములకు చెలికత్తె సీతతో రామచంద్రుని కంఠమున జయమాలను వేయుమని రహస్యముగ పలికెను. అటుల బోధింపబడి, సీత తలవంచియే రాముని మాలాలంకృతుని చేసెను. అపుడు గగనంబున వియచ్చరు, లచ్చరలతోగూడి నాట్య మొనరించిరి. జనకుని సభలోని ఉద్యోగులు, పౌరులు, అంతఃపురవాసులు, రాజబంధువులు, జయజయ ధ్వానములతో వారి వారి హర్షమును ప్రకటించిరి. కొందరు యువకు లీ పుష్పమాలికల ధారణలోని ఆంతర్యమును గ్రహింపరైరి. 1723

తే.గీ. మాలిక.
అంతలోన శతానందు డచటి వారు
వినగ వివరించె నీ క్రీడ వీక నిట్లు –

వధువు సుమమాల తన చేత పట్టి తెచ్చి
వరుని గళమందు నునుచుట ప్రత్న సంప్ర
దాయము స్వయంవరములందు, తద్ద రాచ
కొలములను, వీర్యశుల్కము కోరినట్టి
యన్వయములందు; వరుడంత నాతని కర
మందు మాల వధువు గళమందు నునుచు. 1724

వ. ఇదియే యా యువతిని వరుడు వివాహమాడ నొప్పుకొనినట్లు సంకేతమని అచట నున్న కొందరి సందేహములను నివృత్తి చేసెను.

ఆ హళాహళి సమయమున కొందరు భావుకులైన రాజ విదూషకుల కచట నొక విచిత్రమైన సంఘటన జరిగినట్లు కనవచ్చెను. 1725

తే.గీ. సీత వెంటను [1]మందాక్ష, ఖ్యాతి యనెడు
అమిత సౌందర్యవతులైన యౌవనాంగు
లర్థి రాముని పెండ్లాడు మనుచు చేరి
పుష్పమాలల వేయంగ పూని నట్లు. 1726

చం. అయినను కాని జానకినె యాలిగనెంచి వరించినట్టి యా
దయితుడు రామచంద్రుడు ప్రదాతయు నయ్యును కన్నెలిద్దరున్
పయిబడ వచ్చినన్ వినక, పల్కక, చూడక లెక్కసేయ కా
పయిదలి సీత కంఠమున ప్రాయిని మాలను గూర్చె ప్రీతితో. 1727

వ. ఆ రీతిగ, రాముడు తను సీతను భార్యగ నంగీకరించితి నను సంకేతమును చూపరులకు పంపెను. 1728

తే.గీ. తిరుగు లేదు తలప రఘువరుని బాణ
మున కతడు పలికెడు పలుకునకు గాని,



యందుకే రామచంద్రు డీ యవనియందు
తనరు మూర్తీభవించిన ధర్మ మగుచు. 1729

తే.గీ. అపుడు 'మందాక్ష' రాఘవు డాదరింప
లేదనెడు చింత మనమును ఖేదపరుప,
శివధనువు నెత్త జాలక చేవ దక్కి
పారిపోయిన రాజుల పజ్జ చనియె. 1730

వ. అట్లు, ధనువు నెత్తజాలక వెనుదిరిగి పారుచున్న రాచవీరులు తమ జీవిత శేషమును లజ్జతో గడిపిరి, ఇక, 1731

తే.గీ. 'ఖ్యాతి' యనునది మూడు లోకముల కేగి,
తనను గొనుమని వేడుకొనినను గాని
వినక వలదు పొమ్మని రాము డనెనటంచు
నచటి వారలు వినునట్టు లరచి చెప్పె, 1732

వ. అదివిని, రామచంద్రుని కీర్తికాంతా విముఖతకు, నిస్స్వార్థ గుణసంపదకు మూడులోకంబులు హర్షించెనని జనకరాజేంద్రుని విదూషకులు చమత్కారభరిత సంఘటనను కల్పించి చెప్ప, అచటున్నవారెల్లరు కరతాళ ధ్వనులొనరించిరి. దేవతలు నభోవీధినుండి పుష్పవర్షములు కురిపించిరి. 1733

## 15.3. జనకుని దూతలు దశరథుని మిథిలకుగొని వచ్చుట

వ. అంత, జనకమహారాజు విశ్వామిత్ర మునీంద్రుని సూచనమేఱకు, సీతారాముల కల్యాణమునకు దశరథరాజన్యు నాహ్వానింప సాకేతపురమునకు పంపిన ముఖ్యసచివులు నాంతరంగికులును ప్రత్యేకముగా బంగరు ఫలకములపై

ఖచించిన వివాహాహ్వాన పత్రికలతోడను, కాబోవు సంబంధీకులకు బహువిధ మౌక్తిక మణి రత్న రచిత కాంచన భూషణాలంకృతులు, వివిధ సుందర వర్ణ కౌశేయాది వస్త్రచయములు మొదలగు కాన్కలతోడను అయోధ్యకేగి, నిండుపేరోలగమ్మున దశరథ భూపాలునకు వందనపురఃస్సరమ్ముగ విదేహాధీశుడగు జనకరాజన్యుడంపిన కాన్కలు సమర్పించి, అయోధ్యావాసుల క్షేమసమాచారముల నారసి, రామ, లక్ష్మణులు మహర్షి విశ్వామిత్రుని రక్షణలో సుఖముగానున్న వైనమెరింగించిరి. మరియు, దాశరథుల కదన కౌశలమును, తాటకదానవిని ఖండించి మలద కరూశ దేశంబులను, పరిసరారణ్య ప్రాంతంబుల నేవిధిని పరిరక్షించిరో, మారీచ, సుబాహువులాది కర్కశ రక్కసుల యుక్కు తునియలుచేసి కౌశికుని యాగ మేరీతిని సంరక్షించిరో, కరుణా సింధువైన రామచంద్రుండు శిలానిక్షిప్తమైన యహల్యాసతి నెట్లు శాపవిముక్త చేసెనో మొదలగు విషయములను తెలియజేసి, యింకను నిట్లనిరి. మహారాజా! మీ హితుడైన మా రాజేంద్రుడు తమకిట్లు విన్నవించుడని మమ్ముల నాజ్ఞాపించెను.

ఓ ఇక్ష్వాకు వంశ భాస్వంత కీర్తి సాంద్రా! దశరథరాజేంద్రా! వీరాగ్రేసరులగు నీ పుత్రులు, రామలక్ష్మణులు ప్రస్తుతము మా మిథిలా నగరమున అతిథులై సుఖముగా నున్నారు. నేను నా కుమార్తె సీతాకన్యను వీర్యశుల్కముగా నేర్పరిచిన ధనుర్యాగ స్వయంవరమున మీ జ్యేష్ఠకుమారుడు పాల్గొని, 1734

చం. అసదృశ బాహు విక్రము డహస్కర తుల్యుడు రాము డోజ నా
యసమయ మేదురంబును, మహామహిమాన్విత భాసురంబునౌ
యసమ కలంబ సంహరు శరాసన భంగమొనర్చె గాన మే
మొసగగ నిశ్చయించితి మయోనిజ సీతను రామమూర్తికిన్. 1735

వ. కావున, మీరీ సంబంధంబున కనుమతించ ప్రార్థించుచున్నాను. నేను కొన్నినాళ్ళకు ముందు, రతినిభసౌందర్య, లక్ష్మీకాంతాసమ భాగ్యదాయిని యగు



భూపుత్రి, నా గతజన్మల పుణ్యమూలమున మాకు దుహితగా వర్ధిల్లుచున్న సీతను మా యింట గల శివధనుస్సు నెక్కుపెట్టిన వానితో కల్యాణ మొనరింతు నని ప్రతిజ్ఞచేసితి నను విషయము మీ కవగతమై యుండి యుండును. అనాటినుండి, అనేకులీ విల్లు నెక్కుపెట్ట వచ్చియు, దానిని కదుపుటకైనను సమర్థులుగాక భంగపడిరి. మీ కుమారుడు రామచంద్రుడు తన యనుపమ బల ప్రాభవముచే నీ శివ కార్ముకము నెక్కిడుటయే గాక, దానిని భగ్న మొనరించి, సీతాకన్యను గెలుచుకొనెను. వాని బాహుపరాక్రమము, ధనుష్పాటవము స్వయముగా వీక్షించిన నేను శ్రీరామునకే సీతాకన్య నివ్వ దలచితిని. రామచంద్రునివంటి విక్రాంతుడు, సుగుణరాశి, స్ఫురద్రూపి మా సీతకు మగడౌచున్నందులకు నేనునూ, నా సపక్షులునూ మహానందమందు చున్నాము. అంతియ గాక, జగద్విఖ్యాతమగు రఘువంశంబున నుదయించిన నినుబోటి వీరాగ్రేసరుడు, సత్యసంధుడు, ఆర్షధర్మ పరిరక్షకునితో వియ్యమందుట మా యదృష్టముగా భావించు చున్నాము. 1736

చం. దినమణివంశ భూషణ! మదేభ తురంగ శతాంగ కోటితో
ననిమొన నాయకత్వమహిమాన్విత దర్శనమొప్ప పాకశా
సనికి సమీకమందు జయసాధనచేసిన వీరశేఖరా!
తనరుచునుంటి నే దశరథా! తమతోడను వియ్యమందగన్. 1737

కం. నా ప్రతిపాదన మొప్పుము
సుప్రాశస్త్య ప్రభావ శోభిత చరితా!
మీ ప్రథమ సుతుడు రాముడు
మీ ప్రీతి వరించుగాక మెలతుక సీతన్. 1738

తే.గీ. అటులె మీరొప్పిరేని నా యౌరసి యగు
నూర్మిళా కుమారిని విక్రమోన్నతుండు

మీ యనుపమ సుతుండు సౌమిత్రి కిచ్చి
పెండ్లి జరిపింతు రాముని పెండ్లి సరస. 1739

కం. ఈ పెండ్లిండ్లకు తమరును
మీ పుత్రులు సతులు బంధు మిత్రోద్యోగుల్
మీ పరివార సహితముగ
మా పురికిని తరలి రండు మానవ నాథా! 1740

వ. అని మా మహారాజు ప్రార్థించుచున్నాడని తెలిపిరి. 1741

సీ. ఆ మాటలు దశరథావనీ నాథుండు
విని విదేహ నరేంద్రులు నిమి చక్ర
వర్తి సంతతిలోని వారలగుట విక్ర
మంబున, సుగుణశీలంబులందు,
నార్ష ధర్మ రిరక్ష యందు కులీనత
కల ప్రభువులను విఖ్యాతి నెరిగి,
వారితో సంబంధ బాంధవ్యములు కల్గు
టానందదాయకమ్మనుచు మురిసె;
తే.గీ. నంతియేగాక శ్రీరాము డతుల విక్ర
మమ్మున స్వయంవరమునందు మనసిజాంత
కుని ధనుసు భంగపరచి యవని దుహితను
పొందెనను వార్త చెవులకు విందుచేయ, 1742

వ. అనిర్వచనీయ పుత్రోత్సాహమున కండ్లు చెమరింప, కొన్ని క్షణంబులు మౌనంబు పూని తిరిగి ప్రసాదగుణుండై, మంత్రి, పురోహితులను విలోకించి ఇట్లనియె, 1743



తే.గీ. సుగుణవరులార! అనుపమ సూరులార!
ధామనిధివంశ గౌరవోత్థానులార!
జనక భూపాలుని ప్రతిపాదనము పైన
తెలియజేయుడు నాకు మీ తలపులిపుడు. 1744

చం. అన విని ముక్తకంఠమున నచ్చటి మంత్రి పురోహితవ్రజం
బును, ముని సంయమీంద్రులును మోదముతోడను పల్కి రిట్టు లో
జనవర! రామచంద్రునకు జానకియే సరియౌ సతీలలా
మ, నమసు డీ రఘూత్తముడె మానుగ నా జనకాత్మజాతకున్. 1745

వ. తన అంతరంగికుల ఉత్సాహ సంయుత సమ్మతికి సంతసించి, దశరథుడంత సుమంత్రుని అంతఃపురమునకు పంపి, రామ లక్ష్మణుల క్షేమ సమాచారంబును, వారి విక్రమయుత కార్యంబులను, విదేహ జనపాలుని సందేశంబును భార్యల కెరుకపరిపించి, ఈ పెండ్లిండ్లకు తన రాణుల అంగీకారము గొనెను. 1746

తే.గీ. అపుడు దశరథ నరపాలు డా విదేహ
సచివులకు తమ సమ్మతి సంతసమున
తెలుప, వారలు నృపతికి తెలచి, పెండ్లి
పత్రికల నిచ్చి రానందభరితులగుచు. 1747

వ. మరియు, నా విదేహదేశాగంతకులు వివాహంబులకు కొలది దినములు మాత్రమే వ్యవధి యున్నందున మగపెండ్లివారిని జాగు సేయక మిథిలకు తమతో బాటు ప్రయాణింప వేడిన, దానికి రాజియ్యకొని, మరునా డుదయమున నొక శుభముహూర్తంబున భార్యాపుత్రాది బంధువర్గంబుల తోడను, ధృష్టి, జయంతాది సచివ చయంబులతోడను, వసిష్ఠ, వామదేవాది పురోహిత మునిజన సంఘంబుల తోడను, అనేక విలువగు భూషణాదులు, తగినంత ధనమును

గొని, చతురంగ బలంబుల వెంటనిడుకొని బయలుదేరి మరినాల్గు దినములకు మిథిలా పట్టణపు పొలిమేరలకు చేరెను. 1748

## 15.4. మిథిలకు వేంచేసిన దశరథుని, పరివారమును జనకుడు స్వాగతించుట

తే.గీ. పెండ్లి బృందంబు మిథిలకు వెడలి వచ్చి
రనుచు తెలిసి శతానంద మునిని వెంట
గొనుచు స్వాగతించంగను జనకు డేగి
దశరథునకు మ్రొక్కులిడుచు తద్ద ననియె. 1749

ఉ. స్వాగతమయ్య కోసల నృపాల! మదీయ విదేహభూమి మీ
యాగమనంబెరింగి జనులందరు మిమ్ముల స్వాగతింపగా
వీగుచు బాణసంచులను ప్రేల్చుచు, నానక, దుందుభి ధ్వనుల్
మ్రోగగ చేసినారు, వినుమో రఘువంశపయోధి చంద్రమా! 1750

కం. నాతో గూడుచు పౌరులు
సీతా కల్యాణమునకు చేమోడ్చి మిమున్
ప్రీతిగొని స్వాగతించుట
చేతోమోదంబుచేసె చెలువుగ నాకున్. 1751

మ. అతిలోకోత్తర బాహు విక్రములు, బ్రహ్మాస్త్రాది నానావిధో
ద్ధత బాణాయుధ పూర్ణ తూణ ధరులౌ ధానుష్కులున్, మన్మథ
ప్రతులౌ పుత్రుల కాంచినట్టి నిను నే వర్ణింప వీలౌనె, ఓ
ప్రతిభా సంయుత భాస్కరాన్వయ విభూ! ప్రజ్ఞాన పాథోనిధీ! 1752

వ. అట్టి అనుపమ వీరకుమారులను కన్న పార్థివేంద్రా! నీకు స్వాగతము. దేవతలతో చనుదెంచిన బృహస్పతివలె మునిముఖ్యులగూడి వసిష్ఠ బ్రహ్మర్షి



నా పుత్రికల వివాహముల కేతెంచుట నాకొక గొప్ప శుభసూచకముగా గోచరించి నన్నాందపరచుచున్నదని పలికి, రాజేంద్రునకు, రాజ బంధువులకు, మౌని పురోహిత వర్గంబులకు తగిన రీతిని నర్ఘ్య పాద్యాదు లొసంగి, వారికి శతానందుని, తన మంత్రివర్యులను, రాజోద్యోగులను పరిచయము చేసి, దశరథుని తన రథంబున నెక్కించుకొని తానే సారథ్యము సేయుచు, పరివారములు వెంటరా, తన రాజప్రాసాదచయంబులో నొక ప్రత్యేక సౌధరాజసముదాయంబున పెండ్లివారిని విడియ జేయించి, వారికి భోజన శయనాది సదుపాయములను తిరిగి పరీక్షించుటకై కతిపయ పరివార సహితుడై దశరథుని వద్ద శలవు తీసుకొని, వెడలి పోయెను. 1753

తే.గీ. ఆ తఱిని రామలక్ష్మణు లటకు వచ్చి
తండ్రి కాళ్ళకు మ్రొక్కి రుత్కంఠతోడ –
కనులు చెమరింప నుప్పొంగి కౌగలించె,
దశరథుండంత తనయుల తనివితీర. 1754

వ. అంతలోన, భరత శత్రుఘ్నులు తండ్రికడకేతెంచి, అచటనున్న రామ లక్ష్మణులను గాంచి యానందభరితులై, 1755

తే.గీ. పరుగు పరుగున నరుదెంచి మురిప మెసగ,
రామ లక్ష్మణులనుజేరి ప్రేమ మీఱ,
కౌగలించుకొనుచు వారి కదన కౌశ
లమ్ము, వారి పయన విషయమ్ము లరసి, 1756

వ. ఉత్సాహభరితులై రామ లక్ష్మణుల విక్రాంతికి వారి నెంతగనో పొగిడిరి. రామ లక్ష్మణులుకూడను సోదరులను చూచిన సంతసమున కొంతకాల మా నందోత్సాహముల విహరించి, తండ్రియానతిగొని, నలుగురు సోదరులు విడిది

గృహ ప్రాంగణమున కేగి, అయోధ్యనుండియు, సామంత మిత్రరాజ్య ములనుండియు వివాహోత్సవమునకై విచ్చేసిన అతిథులను స్వాగతించి, ఫలహారాదుల నిప్పింపచేసి తమ మిత్రబృందంబుతో నిష్టాగోష్ఠినుండిరి. 1757

## 15.5. దశరథుడు విశ్వామిత్రునకు కృతజ్ఞతలు తెలుపుట

ఉ. అంతట కౌశికుం డచట నారసి కోసలనాథు చూడ న
త్యంత ప్రియానురాగమున నా యెడ వచ్చిన భూపు డెంతయో
సంతస మానసుండగుచు సన్నుతి చేసి నమస్కరించె – వి
శ్రాంత మనస్కతన్ మునియు రాజుకు దీవనలిచ్చి యిట్లనెన్. 1758

తే.గీ. నీవు నాతోడ పంపిన నీ కొమరుల
కే విధమగు హానికలుగ నీయకుండ
నా క్రతువు పూర్తి చేసి సనాతనార్హ
విధిని, తిరిగి తెచ్చితినయ్య వీరి గొనుము. 1759

కం. అనగను దశరథు డెంతయు
మునివరు పలుకులకు మోదమున కరయుగళిన్
కొనలిడి మ్రొక్కుచు మనమున
తనియుచు కీర్తించి మునిని తద్దయు ననియెన్. 1760

వ. మహాత్మా! నా పుత్రులను తిరిగి నా కప్పగించుటయే కాదు. నీతో నున్న కొలది దినములలో నా కుమారులలో నెంత చక్కని మార్పును గొని వచ్చిరో తలచిన మాత్రమున నా యెద పులకించుచున్నది. 1761

ఉ. ఏ విధి తీర్చుకొందుము మునీశ్వర నీదు ఋణమ్ము – నీ కృపన్
వావిరి జల్లి నా సుతులపై, మహిమాన్విత భీషణాస్త్రముల్
తావక యోగలబ్ధము లుదారత నిచ్చి సవంబు వారిచే
కావగ చేసి బాలురకు ఖ్యాతిని కూర్చితి వయ్య సంయమీ! 1762



ఉ. అంతియగాక శంభుని శరాసన భగ్నమొనర్ప హేతువై,
ఇంతి విదేహకన్య ధరణీసుత సీతకు రామమూర్తితో
పొంతువ గూర్చినావిది యపూర్వము – ఆ నిమి గోత్రమున్ వివ
స్వంతుని సంతతిన్ కలుప వారధి కట్టితి వయ్య, కౌశికా! 1763

వ. దీనికి మా యిరువంశములు సర్వదా కృతజ్ఞులమై యుందుము. సీతారాముల యుజ్జ్వల భావి చరిత్రలో తమ యీ పాత్ర శాశ్వతమై నిలచి, నీ జీవితపు టపూర్వ ఘట్టములలో నిది మరొక యుదాత్త శిఖరమగునని నేను నమ్ముచున్నాని మనవి చేసి, దశరథ మహారాజు విశ్వామిత్ర మునీంద్రునిపై నధిక భక్తి గౌరవములతో, కౌశికమునీంద్రునకు కృతజ్ఞతలు తెలుపుటకై తన రాణుల నటకు రప్పించెను.

ఆ విధముగ నేతెంచిన కౌసల్య, సుమిత్ర, కైకేయి రాజపత్నులు కౌశికమునికి ప్రణామంబులాచరించి మునీంద్రునకు విధేయులై అతిథిపూజ గావించి, రామలక్ష్మణులకు కౌశికుండొనర్చిన మేలునకు కృతజ్ఞతలు పలికిరి. అందులకు సంతసించిన మునీంద్రుడు మీ నలుగురు కుమారులకు శీఘ్రమే కల్యాణములు కలుగుగాక, యని దీవించి, వారు వినునట్లుగ దశరథ మహారాజుతో రాముని సౌజన్యమును, సుగుణసంపత్తిని, పరోపకార పరాయణ త్వమును, ఆర్షధర్మముపైగల భక్తిభావమును, వాని పరాక్రమమును, తాను వానికిచ్చిన వివిధ దివ్యాస్త్రముల ప్రయోగోపసంహారముల నొక త్రుటిలో నెట్లు తెలిసికొని, తాటక, సుబాహు, మారీచాది ముష్కర రక్కసుల నుక్కడగించి తన యజనమునెట్లు కాపాడెనో, మొదలగు సమస్త విషయములను తనతో రామలక్ష్మణులు బయలుదేరిన నాటనుండి ఆనాటి వరకు జరిగినవన్నియు

పూసగ్రచ్చినట్లు వివరించి దశరథునితోపాటు వాని రాణులకుగూడ మహానంద మొనరించెను. అందులకు సంతుష్టులైన ముప్వురు దేవేరులు కౌశికునకు కృతజ్ఞతలు తెలిపిరి.

ఆ సమయంబునకు శతానందమునీంద్రుడేతెంచి జనకాదులు దశరథునితో పెండ్లి ఏర్పాట్లు చర్చించ వేచియున్నారని తెలుప, దశరథుడు భార్యలను వారి అంతరంగిక వసతి గృహంబునకు పంపివేసెను. అపుడు జనకుడు, వాని సామంత, మిత్ర, మంత్రి, పురోహిత వర్గంబుతో పాటు దశరథుని కడకు వేంచేసెను.

ఆ సమయమందే, 1764

## 15.6. భరత, శత్రుఘ్నులకు మాండవీ శ్రుతకీర్తులతో వివాహములు నిశ్చయమగుట

తే.గీ. జనకుని యనుజుడైన కుశధ్వజుండు
వచ్చె పెండ్లివారిని చూచు నిచ్ఛతోడ;
ముని శతానందు డా రాజముఖ్యు నపుడు
పరిచయము చేసె నచ్చటి ప్రముఖలకును. 1765

తే.గీ. "వీరలే కుశధ్వజులను పేర బరగు
విక్రమాన్వితులు, ప్రముఖ వీరవరులు
జనక రాజన్యు ననుజులు వినుత గుణులు
ప్రథిత సాంకాశ్య నగర నృపాలు రరయ", 1766

తే.గీ. అనుచును వసిష్ఠ కౌశికు లాననములు
భక్తి గాంచుచు పల్కె నుభయులు మెచ్చ –



"ఈ కుశధ్వజునకు కూతు లిర్వు రనఘ
గుణులు మాండవీ, శ్రుతకీర్తు లనెడి వారు. 1767

తే.గీ. పెద్ద లొప్పిన యెడల నే ప్రీతి నొక్క
విషయమును ప్రతిపాదింతు, విన్న పిదప
నిచటి ఋషివరుల్ ప్రభువులు సచివచయము
లెలమి చర్చ చేయుచు నిర్ణయింప వచ్చు. 1768

చం. తను గుణ సంపదన్ తనరి ధన్య కుశధ్వజు కూతులై సనా
తన కులజాతలై వఱలు తామరసేక్షణలన్ క్రమంబుగా
నినకుల వంశ్యులౌ భరతు డీతని తమ్ముడు పెండ్లియాడినన్
జనకుని భ్రాతగూడ రఘు సంతతి వారికి బంధువౌగదా". 1769

వ. దానికి వసిష్ఠుండు సంతోషంబున నిట్లనియె, "బాగు, బాగు. భరత, శత్రుఘ్నులు మాండవీ, శ్రుతకీర్తులను వివాహమాడుట యను ప్రతిపాదన మిక్కిలి ప్రశంసనీయము. 1770

ఆ.వె. చిన్నవాడునైన శ్రేయస్కరంబైన
మాటచెప్పె గౌతమముని కొడుకు,
దీనివలన కీర్తి తేజంబు వృద్ధియౌ
రెండు వంశములకు మెండుగాను. 1771

మధురాక్కర :
ఇంతియేగాక దీనిలో నెంచిచూడంగ నొక్క
వింతయౌ ధర్మసూక్ష్మంబు వెలయు – సుమిత్ర మొదటి
సంతు కన్న భరతుడు వీసంబు పెద్దౌట – పెండ్లి
చింతజేయ భరతునికి చేయంగవలెను ముందు. 1772

ద్విపద.

పిన్నవానికి ముందు పెద్దకు వెన్క
కద్దుగాదైనను హద్దును మీరి
కోసలేంద్రుడు పెండ్లి చేసెనెట్లనెడు
నిందను భరియింప నేరము గాన 1773

వ. ఇట్టి యపవాదు మనపై బడకుండ గూడ శతానందుని ప్రతిపాదనము యుక్తమై యున్నది. 1774

కం. కనుక వినుమోయి దశరథ
జననాథా! ఇది మనలకు సమ్మత"మన, నా
కును ప్రియమేయగు నిది; ఈ
జనక, కుశధ్వజ నృపులకు సమ్మతమైనన్. 1775

వ. అని దశరథ మహారాజు తెలుప, కుశధ్వజ, జనకు లీ పెండ్లిళ్ళు తమకునూ అంగీకారమే యనిరి. అపు డచట నున్నవారందరును హర్షము వెలిబుచ్చిరి. అటుల మాండవీ కన్యతో భరతునకును శుత్రకీర్తీ కుమారితో శత్రుఘ్నునకు వివాహంబులు నిశ్చయమయ్యె. అంత, జనక జననాథుడు, కోసల దేశనాథునితో నిట్లనియె. 1776

తే.గీ. దీక్షతోడను నేచేయు దివ్య యజన
మెల్లి ముగిసిన తరువాత నినకులేశ!
చూచి రెన్నాళ్ళ తదుపరి శుభముహూర్త
మెంచి పెండ్లిండ్లు ప్రీతి చేయించు టొప్పు. 1777



తే.గీ. అనిన వాక్చతురుడు దశస్యందనుండు
పలికె నీరీతి జనక నృపాలుతోడ,
"దానమిచ్చెడు దాతయే దాని నెప్పు
డెవరి కిచ్చుటో యది నిర్ణయించు గాదె. 1778

తే.గీ. దాన మందున పైనుండు దాత చేయి
అందుకొను వాని హస్తంబు క్రిందనుండు,
అపుడె దానంబు పట్ట వీలౌ గ్రహీత –
కన్నె దానమైన నిదియె కర్జ్య మధిప." 1779

వ. అని చమత్కరింప నచటి వారలు సంతసించి, సరససంభాషణామగ్నులైరి. అంత కొంత సమయంబు పిదప, జనకుని ఆజ్ఞతో శతానందుండిట్లనియె. "దశరథేశ్వరా, మహాత్ములు, త్రికాలవేదులునైన వసిష్ఠ, విశ్వామిత్ర బ్రహ్మర్షులతో సంప్రదించి కల్యాణ ముహూర్తమును నిశ్చయించితిమి. వినుడు, ఈ నాడు మఘ. ఎల్లుండి ఉత్తరా నక్షత్రయుక్త వైశాఖశుద్ధ దశమి నాడభిజిత్ లగ్నమందు మంచి ముహూర్తము కలదు కాన, తమరు దీనికి సమ్మతి నిచ్చిన వివాహ కార్యక్రమములు మొదలుపెట్టుకుందుము. అంతియగాక నలువురు వధూ వరులకు ఈ ముహూర్తముననే వివాహములు జరిపించుట శుభప్రదమని మా ప్రతిపాదన. అన, దానికి దశరథుడు వసిష్ఠుని మొగమీక్షించి బాగు బాగు అటులే చేయుదమనెను. తదుపరి జనకుడును తక్కుంగల ఆడపెండ్లి వారలును, దశరథాదుల వద్ద శలవు తీసుకొని తమ తమ నివాసంబుల కేగిరి. 1780

## 15.7. శ్రీరామచంద్రుడు కౌసల్య వద్దకేగుట

అనంతరము కొంతసమయము పిదప శ్రీరామచంద్రుడు తల్లిని చూచు నుత్కంఠ, మహారాణుల మందిరము చొచ్చి, యచట కౌసల్యతోపాటు, సుమిత్రా, కైకేయిలను గాంచి మందస్మిత వదనుండై. 1781

ఉ. తల్లుల కెల్ల మ్రొక్కి, తన తల్లి పదంబుల నుత్తమాంగమున్
మెల్లన నానజేసి ప్రణమిల్లగ, కోసలరాజపుత్రి సం
ఫుల్ల ముఖారవిందయయి పుత్రుని నెత్తుచు చేరదీసి, వ
ర్ధిల్లు మటంచు మెండుగను దీవన లిచ్చి వచించె నీవిధిన్. 1782

శా. "ఎన్నాళ్ళైనది నిన్ను జూచి తనయా! ఎట్లుంటి వయ్యా సుతా!
ఇన్నాళ్ళెప్పుడు చూడకుండనిను నేనెన్నండు లేనోయి, రా
కన్నా! యంచు కుమారు కౌగిలిని వక్షంబందునన్ జేర్చుచున్
కన్నీళ్ళన్ దృఢ దృష్టిదోషములు ప్రక్షాళించి యుద్విగ్నయై, 1783

వ. తిరిగి అతనితో నిట్లనియె. 1784

కం. తాటకయను రక్కసి నొక
వ్రేటున దునిమితివటంచు వింటిని తండ్రీ!
ఆ టంకు నెదిర్చిన నీ
పాటవమున కచ్చెరువును భయమును కలిగెన్. 1785

కం. తాటికి నీడౌ నిడివియు,
రోటికి సాటౌ నడుము, కరువకును దీటౌ
ఘాటము, నేనుగు బలము ని
శాటికి గలవంచు వింటి సాకేతములో. 1786

తే.గీ. ఎటుల చంపితివయ్య యా కుటిల జోటి
నిన్ను చూచి నంతనె మ్రింగ నెట్టుదొట్టి
మీద పడలేదొ! ఏ రీతి మెలపి దాని
బాణ మేయంగ వీలయ్యె భయములేక. 1787



శా. ఆపై కౌశికు నాశ్రమంబున మహాహంకారులౌ దైత్యులన్
పాపాచారుల క్రూరవర్తనుల నే వాలారు బాణాగ్నితో
నీ పృథ్విన్ పడజేసి జన్నమును ప్రాయిన్ త్రాతవై బ్రోచితో!
సాఫల్యంబు ఘటించి సంతసిలి విశ్వామిత్రు డుప్పొంగగా! 1788

ఉ. మేమిట వచ్చినంతనె ప్రమేదిత చిత్తముతోడ కౌశికుం
డేమఱకుండ నీవెటుల ఇష్టిని కాచితొ, బాణధాటికిన్
భూమిని యెట్లు వ్రాలిరొ విమోహితచిత్తులు రాక్షసాధముల్
వేమఱు పూసగ్రుచ్చినటు విస్తృతి తెల్పెను నాన్నగారితో. 1789

కం. కన్నా! చూడన్ వలె నా
మన్ననలకు నీ జనకుని మమతయు రాగం
బన్నును, గర్వము, నందం
బన్నియు నొకమారె వారి యాననమందున్." 1790

వ. అనుచు, మరియొకమారు మార కుమార సన్నిభ సుకుమారుని కుమారుని కౌగలించుకొని ఆనంద బాష్పములు నయనములనుండి జల జల రాల, తిరిగి ఇట్లనియె. 1791

మధ్యాక్కర:
"రాయిగాపడియున్న దాని, రమణి యహల్యను నీవు
మాయగా నున్నదో తండ్రి, మానిత స్త్రీ చేసినావు
జైయంచు నీకీర్తి జనులు సంతోషమున పాడినారు,
న్యాయమైన పథమునీది, నయముగా నెరవేర్చినావు. 1792

మ. జనకాధీశుని యాగమందు ఘనమౌ చాపంబు మున్నీశు డి
చ్చిన దానిన్ ధృఢబాహుశక్తి గొనుచున్ శీఘ్రంబు మోపెట్టి చు

ల్కన భగ్నంబొనరించి నావట వినంగా చోద్యమయ్యెన్ సుతా!
ఇనవంశంబున నీదు పూర్వికులు సంతృప్తిన్ నినున్ మెచ్చరే! 1793

వ. నాయనా! నీవు శివుని విల్లు విరచి గెలుచుకున్న పెండ్లికుమార్తె నీకు బాగా నచ్చినదా! పెండ్లనిన శాశ్వతమైన పంట, నాకు, పిన్నులకు ఆ కుమారిని, అటులే మీ తమ్ముల వధువులను చూడవలెనను ఉత్కంఠగా నున్న"దనెను. పిమ్మట, కైకేయీ, సుమిత్రలుగూడా రాముని చేరదీసి ముద్దాడిరి. శ్రీరామవిభుడు తల్లుల మాటలకు చిరునవ్వులే సమాధానముగా విరియజేసి, అచటి వారిని సమ్మోహన పరచి తండ్రికడకు బయలుదేరి వెళ్ళెను.

అట దశరథుడు తన మందిరమున నెవరును లేని సమయమున మెల్లన లక్ష్మణుని పిలిపించి, రాముడెటుల తాటకా సంహారాదులు చేసెనో అడిగి తెలుసుకొని, కుమారుని విక్రమమునకు తన్మయుండై కన్నుల నానంద బాష్పంబులను జలజల రాల్చెను. అంత రామచంద్రుడటకు రాగా వారందరును కొంతకాల మారాత్రి ఇష్టాగోష్ఠిగా గడిపి తదుపరి విశ్రమించిరి. 1794

## 15.8. కల్యాణ సన్నాహములు

తే.గీ. జనకుడు మగుడి యారాత్రి సదనమునకు
వచ్చి మంత్రి పురోహిత వర్గములను
కలసి జరుగబోవు వివాహకార్యములను
ప్రచురముగ చర్చ చేసె నవ్వారితోడ. 1795

తే.గీ. వివిధ కార్యంబు లీడేర్చ విదుల నెంచి
వేరు వేరుగ నియమించె వారి నపుడు,
వలయు సన్నాహముల శ్రద్ధ కలిగి చేయ
తద్ద మంత్రివర్యులకు నుత్తరువులిచ్చె. 1796



తే.గీ. ఇంకను మిథిలా పురము నలంకరింప
శిల్పకల్పన, బహువర్ణ చిత్రలేఖ
నాది విద్యల నిష్ణాతులైన కర్మ
కారుల నియమించి పలికె వారి తోడ. 1797

ఆ.వె. రాజసౌధచయము రమ్యంబుగా తీర్చి
దిద్దుడయ్య మున్ను దీని నెవ్వ
రెరుగనట్టిరీతి మురడించు నట్లుగా
ప్రజలు మరువ కుండ భావి నైన. 1798

తే.గీ. రాజ సభయందు నిర్మించు డోజతోడ
వాస్తు వనుసరించి మునులు వాసి జూసి
నిర్ణయించిన చోట పనితనమొప్ప
మంది మెచ్చంగ కల్యాణ మండపమ్ము. 1799

వ. అని యానతిచ్చిన నా కార్మిక వర్గంబులు, నధికారులును తత్క్షణ మా యా పనులు నిర్వర్తించుటకై యేగిరి. ఆ మరు నాడుదయంబున, శతానందు నాదేశము మేరకు, 1800

## 15.9. జనక, కుశధ్వజులు వివాహకార్యారంభ కర్మలను చేయుట

చం. జనకుడు సోదరుండు తమ జాయలగూడి మునీంద్రు ప్రాపునన్
గణపతి పూజచేసి, తగు గౌరవ మొప్ప నుమామహేశులన్
మనమున సంస్మరించుచును మంత్రవిధంబున మీదుకట్టి రా
మనసిజవైరి పుత్రునకు మానుగ విఘ్న నివారణార్థమై. 1801

కం. పిమ్మట జనక కుశధ్వజు
లిమ్ముగ తమ వంశ వృద్ధి కేపుగ కల్యా
ణమ్ముల విధ్యుక్తాచా
రమ్మౌ కర్మల జరిపిరి క్రమపద్ధతిలో. 1802

తే.గీ. ఐదు మట్టిపాలికలను పాదుకొల్పి
స్వచ్ఛమైనట్టి నవధాన్య చయము విత్తి
యోషధీ సూక్త మంత్రంబు లుచ్చరించి
యాచరించిరి వారంకురార్పణమ్ము. 1803

వ. తదుపరి రాణివాసంబున. 1804

సీ. జనక కుశధ్వజ జనపాల సతులెల్ల,
రంతిపుర స్త్రీల నాత్మ సఖుల
పౌరాంగనల గూడి వధువుల నల్వుర
హేమ పీఠములపై నింపు మీఱ
కూర్చుండజేయుచు కురులకు వాసనా
గరు తైలముల రాచి, కాయములకు
పన్నీట కలిపిన పసుపుపొడి నలది,
అభ్యంగన స్నాన మాడజేసి
తే.గీ. చందనాది సౌరభముల చర్చచేసి
కమ్రమౌ పట్టు బట్టలు కట్టబెట్టి,
హారతులనిచ్చి పాడుచు నారజమున,
పెండ్లి కూతుళ్ళచేసిరి ప్రీతి తోడ. 1805



## 15.10. సీతారాముల కల్యాణఘట్టము

వ. అక్కడ విడిదిలో, వసిష్ఠుని దర్శనంబున దశరథ మహారాజు వివాహాది శుభకార్యములందు జరుపెడి యభ్యుదయ కర్మయను నాందీ విధులను జరిపించెను. 1806

కం. తరువాత సంతసమున ద
శరథుడు తనయులకు ప్రీతి స్నాతక కర్మల్
జరిపించి, యా సమయమున
హిరణ్య, భూ దానములను హెచ్చుగ చేసెన్. 1807

కం. మరియును వరులకు శుభములు
వరియింపగ దశరథుండు బ్రాహ్మణులకు బం
గరు తొడవులతో గోవుల
వరాంగకముల నొక లక్ష వారక యిచ్చెన్. 1808

తే.గీ. అంత సుముహూర్త మాసన్నమౌట, పంపె
జనక నృపుడు శతానంద సంయమీంద్రు
దశరథుని పుత్ర, భార్యా యుతముగ వేడ
వెడలి రమ్మని కల్యాణ వేదికడకు. 1809

## 15.11. దశరథుడు కుటుంబముతో కల్యాణమండపమునకు తరలివచ్చుట

వ. ఆ విధముగ శతానందుని ఆహ్వానముచే హెచ్చరింపబడిన దశరథుని యాజ్ఞను, శ్రీరాముడు, సోదరులు శుభప్రద ముహూర్త సమయంబున రక్షా బంధనాది కార్యక్రమములు ముగించుకొని వచ్చిరి. అప్పుడు, 1810

తే.గీ. తనయులను చూచి యుప్పొంగి దశరథుండు,
కనులు చెమరింప ముదముతో కౌగలించి,
స్వయముగా తానె వారల సకల భూష
ణ ప్రసాధితులను చేసి నందమొందె. 1811

సీ. బంగారు చెఱగుల సింగార మొలకించు
పట్టుపంచెల నెంచి కట్టజేసి,
అపురూప మౌక్తిక యష్టికా గుత్సార్ధ
కంఠభూషల నుంచి గళములందు
కాంచన నవరత్న కమనీయ మకుటముల్
తనరంగ నిల్పి మూర్ధంబులందు
అరుదైన విద్రుమ మరకతాంగదములు
వలదుగా తొడిగించి బాహువులకు
తే.గీ. ఖచిత రమణీయ హాటక కంకణములు
ప్రీతి ధరియింప జేసి ముంజేతులకును,
బహువిధ భ్రాజిత మణి ప్రవాళ విరచి
తాంగుళీయంబుల నమర్చె నంగుళులకు. 1812

సీ. అటుల సర్వాభరణాలంకృతులజేసి
తనయుల వెంటను దశరథుండు
అతివలతోగూడి యరదంబుపైనెక్కి,
ముని పురోహిత తతుల్ ముందు నడువ
సామంతరాజులు సచివు లుద్యోగులు
బంధుమిత్రాదులు పార్శ్వములను,
వాద్య బృందంబులు, పరివార సంఘము
లప్రమత్తత తోడ ననుసరింప,



తే.గీ. రమ్యమౌ మిథిలాపుర రథ్యలందు
బారులుగ దీరి జను లిరుప్రక్కలందు
జయజయ ధ్వానములు సేయ చదలు మ్రోగ,
కదిలె మురిపెమున జనక సదనమునకు, 1813

తే.గీ. విమల గుణులగు నాదర్శ వీరవరులు
నలువురు సుతుల నడుమను వెలిగె నపుడు
దశరథుండు నాల్గు పురుషార్థముల గూడి
అతిశయించు నాదర్శ గృహస్థు నటుల. 1814

వ. ఆ సమయంబున ప్రత్యేకముగా సీతారామకల్యాణ శుభ సందర్భమునకై అలంకరించిన రాజవీధులు, అచట నేర్పాటు చేసిన వేదుకలు మగపెండ్లివారి బృందముల నాకర్షింప, వారొకరితో నొకరిట్లు చెప్పుకొను చుండిరి. ఓహో! ఈ రథ్య లెంతందముగా శోభిల్లుచున్నవో చూడుడు. అనేక రంగుల పతాకములు, మామిడితోరణములు, పుష్పహారములు బహుసుందరముగ నేర్పాటుచేయబడినవి. రథ్యల కిరుప్రక్కల గల వృక్ష నికుంజములలో వివిధ ధాతుసంయుతములగు మణి శిలల నమర్చిరి. వీటిలో కొన్ని [2] స్ఫురద్దీప్తితో సహజ ప్రకాశితములై, వివిధ వర్ణ కాంతులను సర్వదా వెదజల్లునవి. మరి కొన్ని వెలుతురు వాటిపై పడిన ననేకమగు రంగులతో ప్రజ్జ్వలించు[3] ప్రతిదీపనములు. ఇక కంబంబులకు వ్రేలాడుచున్న బహువర్ణ చిత్రలేఖనముల చూడుడు. వీనిలో మన రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, దశరథమహారాజుల చిత్రములు, రాముడు విల్లు నెత్తి విరుచుచున్న దృశ్యము, సీతాకుమారి మన రామచంద్రుని గళమున జయమాలిక నలంకరించు సన్నివేశము చిత్రకారులచే నెంతయో నైపుణ్యముతో బహురమ్యముగ రచింపబడినవి. అపురూపముగ వినిర్మించిన ముత్యాల పందిళ్ళలో నేర్పాటు చేయబడిన వినూత్న సురభిళ వస్తు ప్రదర్శనల నుండి వెలువడు సువాసనల నాస్వాదించుడు. నృత్యములను

తిలకించుడు, చతుర్విధవాద్య సమ్మిళిత సంగీతములను వినుడు. వేదవిదు లాలాపించుచున్న స్వస్తి వాచకములను, మంగళాశాసనములను, కల్యాణ ప్రదమగు వేదమంత్రముల నాలకించి ధన్యులుకం దనుకొనుచు నమందానంద కందళిత హృదయులైరి. తమ కుమారుల వివాహ సందర్భంబున నలంకరింప బడిన ఆ మిథిలా నగరవీధుల పసందులను చూచి దశరథ మహారాజును భార్యలును లోలోననె అతిశయ సంయుతానంద మనస్కులైరి.

అప్పుడు సీతాపాణిగ్రహణమునకై వేంచేయుచున్న సర్వాంగ సుందరుండును, బాహుబల సంపన్నుండును, విశిష్ట గుణగరిష్ఠుండును, పురుష శ్రేష్ఠుండును, నాదర్శార్హ ధర్మవర్తనుండునగు తమ రాజజామాతను వీక్షింప మిథిలాపట్టణపౌరులే కాక విదేహరాజ్యమందుగల జానపదు లెల్లరు తండోప తండంబులుగ తరలి వచ్చినందున రథ్యలన్నియు జనులతో క్రిక్కిరిసి యుండెను. 1815

తే.గీ. రాఘవేంద్రుని చూడంగ రమణతోడ
వడిగ పర్వెత్తి జనతతుల్ వచ్చిరపుడు
నిర్ధనుడు దవ్వు నున్నట్టి నిధి నెఱింగి
పనుల నన్ని వీడి తమిని పర్విసట్లు. 1816

తే.గీ. పాలు పిదికెడు పనిలోని పాలెగాళ్ళు
పెయ్యలను కట్టమఱచిరి పెనలతోడ;
గడ్డికోయ నేగిన యాడు బిడ్డలెల్ల
పారల, కొడవళ్ల విడిచి వచ్చి రపుడు 1817

తే.గీ. ఎరువు నింపిన చేలలో నేరువాక
లంత మధ్యలోన నిలిపి హాలికులును



యాజమాన్యంబు పిలుపు లక్ష్యంబులేక
వరుడు రాముని చూడంగ తరిలిరంత. 1818

పాదప వృత్తం :
రాముని చూడగ రంజన తోడన్,
భామలు, భర్తలు, బాలకు లార్తిన్
ప్రేముడి వచ్చిన పెద్దలు చిన్నల్,
గ్రామములంత నరణ్యము లయ్యెన్. 1819

పణవము:
గ్రామాలందున గల ఖామందుల్
భామాపుత్రులు పరివారంబుల్
రామున్ జూడగ రమణన్ పర్వన్,
[4] రామందాడయె రహదారంతన్. 1820

వ. ఈ విధంబుగ నుత్సవమున పాల్గొనుచున్న జానపదసందోహము లిట్లు తలపోసిరి. 1821

ఉ. ఎంత యదృష్టవంతులొ మరెంతటి పుణ్యము చేసియుండిరో
యింతటి విక్రమాన్విత మృగేశ్వర సన్నిభ దేహధారులన్
కంతులబోలు రూపసుల కాంచిరి పుణ్యమూర్తు లీ
యింతులు తాను పంక్తిరథు డీదృశ వల్లభు గాంచ శక్యమే. 1822

ఉ. చూడుడు రామచందురుని, సుందరులందున సుందరుం డితం
డాడెడు తమ్మిబొడ్డుగల అచ్యుతునట్లు వినీల దేహుడున్,
ప్రోడడు, విక్రమోన్నతుడు, ప్రోంఛనచేసె మునీంద్రు యజ్ఞమం
దోడగకూల్చి రక్కసుల, నొప్పుగ ద్రుంచె త్రినేత్రు చాపమున్. 1823

కం. ఇంతటి వీరుడు సీతా
కాంతకు మగడౌట నిజముగ ధరిత్రిన్ శ్రీ
కాంతుడు హరికాంతా సీ
మంతిని కూడుటయెగాక మరియొకటగునే. 1824

మ. మన సీతాసతి యేమి తక్కువ తలంపన్ రాఘవస్వామికిన్
ఘనమౌ పృథ్వి నయోనిజ స్థితిని సాక్షాత్కారమొందెన్ గదా
తనరంగన్ సిరికన్య కీడయిన కాంతారత్నమై యొప్పుచున్
మును విశ్వేశుని చాపమెత్తెగద సమ్మోదంబునన్ క్రీడలో. 1825

వ. కావున నింతటి దివ్యమైన సంబంధ మీ భూమిపై వెనుక లేదు, ముందు రాబోదు. సీతారాముల నీ కల్యాణసమయమ్మున చూచు అదృష్టము కల్గిన మనకింక జన్మరాహిత్యమై శాశ్వత వైకుంఠ వాస భాగ్యము తప్పక నొనగూడునని యనుకొను చుండిరి. 1826

ఉ. ఆవిధి రామమూర్తియును, నాతని తమ్ములు, తల్లితండ్రులున్
ఠీవిని రాజవీథులను తేవ రథమ్మున నుత్సవంబుగా
వావిరి నేగి పౌరులకు పండుగగూర్చుచు చేరిరంతలో
నావజ భూరివాద్యముల యారవ మొప్పగ రాజ హర్మ్యమున్. 1827

తే.గీ. నలువుతో నపుడెదురు సన్నాహముగను
వచ్చి వారల పూజించి స్వాగతించి
పెండ్లి మందిరము కడకు ప్రీతి మెఱయ
వీక జనకుండు గొనిపోయి విడియజేసె. 1828



## 15.12. మంగళస్నానములు.

మధ్యాక్కర :
అంతలో కౌసల్య మిగుల నానందమొప్పంగ మీఱి,
కంతునే అభిభూతి సేయు కల్యాణరాముని చేరి,
పొంత బంగారు పీటందు పొందుగా కూర్చుండ జేసి,
మంతరంబులు సాగుచుండ మంగళ స్నానమాడించె. 1829

కర్ణాట చౌపదులు :
జన్నకాపరి మేన చందనము పూసి,
పొన్నారి జిగి పుట్టములు కట్టజేసి,
వన్నియల పాదాల పారాణి రాచి,
మిన్నగా మెడయందు మిన్నలను వేసి,
కన్నయ్య నపుడు కంకణిన్ జేయించి,
చెన్నైన మౌలీని శిరముపై నుంచి,
పన్నుగా ఫాలాన బాసికము కట్టి,
తిన్నగా కల్యాణ తిలకంబు పెట్టె. 1830

తే.గీ. అటుల తనహస్తములతోడ నాత్మ సుతుని
మంగళస్నాన కార్యక్రమంబునందు
పట్టమహిషి కౌసల్య పాల్పంచుకొనుచు,
తనిసి సంతోష వారాశి మునిగి తేలె. 1831

వ. కౌసల్య తన కుమారుని, శ్రీరామచంద్రుని పాణిగ్రహణమునకు తగురీతి సిద్ధంబు గావించినట్లే, కైకేయీ సతి భరతుని, సుమిత్రాదేవి లక్ష్మణ,

శత్రుఘ్నులను మంగళ స్నానంబు లాచరింపజేసి స్వహస్తములతో కుమారులకు పట్టుబట్టల కట్టించి అలంకరించిరి.

అంత, శ్రీమహాలక్ష్మి యంశ నుద్భవించిన సీతాదేవి వివాహ కార్య క్రమములలో పాలుపంచుకొన దలంచి, జగన్మాతయగు పార్వతి, విద్యల తల్లి యగు సరస్వతి, దేవేంద్రుని జాయయగు నింద్రాణి, పలువురు దేవ కాంతలతో కలసి విదేహాధీశుని అంతఃపురమున మిథిలానగర పేరటాండ్ర రూపంబులు ధరించి యాడపెళ్లివారిలో కలసి, మహారాణి సుమేధాదేవిని గూడి జానకికి మంగళ స్నానములు చేయించిరి. 1832

చతుష్పదులు :

మంగళస్నాన మండపంబునను
బంగారు పీట రంగార వాల్చి,
హంగుగా సీత నందుపై నిల్పి
అంగనలు పట్టి రారతులు ప్రీతి. 1833

ద్విపద :

పెలుచన నంతలో పేరటాండ్రగుచు,
కలికికి పుట్టింటి చెలిమరు లగుచు,
పలుకు సకి, ఉమయు, పౌలోమి కలయ,
నలువుగా ముసిముసి నగవులు వెలయ,
నెలత సీతాకాంత కెలనుకు జేరి,
చెలువుతో చతురపు పలుకుల నేరి
చెలికంత గిలిగింత కలిగించు నంత,
పులకరింత నును సిగ్గుల వలవంత,
కొలలేక కొనసాగు క్రొంజాయ బెళుకు
తళుకుల తలరు కన్నుల కులుకొలుకు



కలికి చెక్కిళ్లకు కస్తూరి నదిమి,
చిలుకుల కొలికికి చిబుకము చిదిమి,
పొలుపుగా పసుపు నొడల పూసి రంత,
చెలువకు నునుసిగ్గు కలుగ మరింత;

తెలచుచు నంతలో దేవ భామినులు,
సలలిత సౌందర్య విలసిత తనులు,
కిలకిల నవ్వుచు బిలబిల జేరి,
చెలువము లొలుకగ నలువులు మీఱి,
తెలి నువ్వు తైలంబు తలయందు పులిమి,
నలుగు పిండి నొడల వలదుగ నలమి,
తలలంటి మంగళ స్నానంబు లార్చి[5],
వలపుల ధూపాల వాలంబు లార్చి[6],
కలువపూ కండ్లకు కాటుకల్ దిద్ది,
నెలత పెదవులకు కలమము నద్ది, 1834

సీ. పసుపు పచ్చని రంగు పట్టు చీరనుకట్టి
రహిని పాదముల పారాణి పెట్టి,
వ్రేలంగ మౌక్తిక ప్రాలంబ దాల్పించి
అలతి నడుమున కొడ్యాణముంచి,
తీపార తలదువ్వి పాపట బొట్టుంచి,
ముక్కున వ్రేలాడ ముత్యముంచి,
దీటుగా కల్యాణ తిలకంబు సరితీర్చి,
వేణిగా జడ నల్లి విరులు గూర్చి, 1835

తే.గీ. పద్మ కెనయైన సీత సర్వాంగ సంప
దలకు మణిమయ భూషలు తనర తొడుగ –
తల్లి కనుబాటు భయమున తల్లడ పడి
అద్దమున చూసె నా సీత అందమపుడు. 1836

తే.గీ. సీత తొడిగిన తొడవులు చెన్ను మీరి,
స్వచ్ఛ నవరత్న మౌక్తిక సహజ మైన
భూరికాంతులు వెదజల్లు భూషలైన,
సీత తేజంబు ముందవి చిన్నబోయె. 1837

తే.గీ. కాదు – నిజమట్లు తోచునే కాని మిథ్య,
సీత తనుచాయ మెఱపుతో స్ఫీతమయ్యె
పడతి తనువున తొడిగిన తొడవులందు
పూర్వమున్నట్టి కాంతులు ముమ్మరముగ. 1838

వ. పిమ్మట ఊర్మిళా, మాండవీ, శ్రుతకీర్తులు వారి తల్లుల ఆధిపత్యమున మంగళస్నానములు గావించి, కాలానుగుణముగ, వారి అభిరుచుల ననుసరించి తగు నలంకారములు ధరించిరి.

అపుడు, నలువురు వధువులను వారి తలిదండ్రులు రాజపూజా మందిరంబునకు గొనిపోయి, బియ్యము పోసిన గంపలలో కూర్చుండబెట్టి, తత్కాల విధ్యుక్త మంత్రంబులు శతానందు డుచ్చరింప సకలదేవతా మూర్తులకు నారాధ్యదేవతైన గౌరీదేవిని ప్రార్థింపజేసిరి. ఆ సమయమున సీతాకుమారి, సర్వమంగళ ప్రదాయిని, లోకమాతయగు మంగళగౌరికి ప్రణమిల్లి షోడశోపచారంబులతో పూజించి ఈ విధి మనమ్మున నుతించెను. 1839



## 15.13. సీతాకన్య గౌరీపూజ చేయుట

శా. శ్రీ విశ్వేశ్వరు భామినిన్, గిరిసుతన్, శ్రీరాజరాజేశ్వరిన్,
శ్రీవిఘ్నేశ్వర కార్తికేయ జననిన్, శ్రీకూట సంవాసినిన్,
శ్రీవిద్యా పరదేవతన్, త్రినయనన్, శ్రీచక్రసంచారిణిన్,
సావిత్రిన్ నుతియింతు నే సతతమున్ సంపూర్ణ భక్త్యాత్మతన్. 1840

ఉ. కోరి భజించెదన్ కుసుమ కోమల దివ్య శరీరి, పాప సం
హారి, దురంత సంపదపహారి, విరాగమనోవిహారి, సం
సార నిశాంధ భీకర విచార గభీర సముద్ర తారి, ప్రా
సారిత దుష్టభావ పరిసర్పిత శక్తి విదారి, శాంకరిన్. 1841

ఉ. అమ్మల కెల్ల యమ్మ, సగుణాత్మకయై చను నిర్గుణాంబ, భా
రమ్మగు జీవయాత్రకు వరమ్మయి బ్రోచెడి యమ్మ, ప్రీతి ను
ల్లమ్ముల నిల్పి కొల్చిన విలక్షణ దివ్య పథంబు లిచ్చు దు
ర్గమ్మ, నిరంతరంబుగ వికాసము గూర్చుత నా మనంబునన్. 1842

వ. తల్లీ! జగన్మాతా! మంగళగౌరీ! 1843

ధ్రువకోకిల :
మనమునందున నిన్ను తల్చిన మంగళాంగిరొ! శాంభవీ!
ఘనముగా మది కోర్కె తీర్తువు కామభగ్నుని భామినీ!
దినము రేయియు నామమంత్రము దీటుగా పఠియించినన్,
ననువుగా నపవర్గ మిచ్చెద వాదిశక్తి మహేశ్వరీ! 1844

ఉ. నమ్ముచు నిన్ను కొల్చెడి యనాథల నెప్పుడు రక్ష సేయు దు
ర్గమ్మవు, మున్ను నా వినతి కాదనకుండ ఫలింప తీర్చి నా

కిమ్ముగ నిచ్చి నావు పరమేశ్వరి! కోరిన యందగాని, లో
కమ్మున నొక్కడై శివుని కార్ముక భగ్న మొనర్చు వీరునిన్. 1845

ఉ. నమ్మిక నిన్ను మ్రొక్కుదును నా మనమందు నుమామహేశ్వరీ!
అమ్మహనీయరూపుడు, మహాశుగ ధారుడు నేడు నా కరం
బిమ్ముగ పట్టు రామ హృదయేశ్వరు గూడి సతమ్ము ధర్మ మా
ర్గమ్మును తప్పకుండగను గమ్యము చేరగ చేయు మమ్మరో! 1846

ఉ. పావన మన్నిటన్ మనుజ భావము చూడ జగంబులందునన్,
నా విధి వర్తినై యిటుల నాతిగ పొల్చితి భూమియందునన్,
నా విభు తోడ నున్నపుడు నా మనమందు వసించి యమ్మరో!
భావి సనాతనార్షమత పాలన ధ్యేయముగాగ సేయుమా! 1847

## 15.14. శ్రీరామచంద్రుని వసిష్ఠాదులు పెండ్లి మండపముపైన కూర్చుండ జేయుట

వ. ఆ విధమ్ముగ సీతాకన్య గౌరీపూజ చేయుచుండ, అట రత్నస్తంభములతో వ్యాప్తములు, చాందినీలతో నొప్పు తోరణములచే నలంకరింపబడి, ముత్యాల పుష్పమాలికలతో శోభించు కల్యాణ మందిరంబున, 1848

మంజరీ ద్విపద :

పౌరు లుద్యోగులు పరదేశ జనులు
వీరులు సైనికుల్ వేత్తలు మునులు,
బ్రహ్మచారులతోడ, బాలురతోడ
హితులతోడను, పురోహితులతో గూడ,
వేరుగా కూర్చున్న వెలదుల తోడ,
ముత్తైదువలతోడ, ముగ్ధలతోడ,



పురుగైన పోవగా పొసగంగ బోక,
మండితంబైయుండె మండపము జోక. 1849

తే.గీ. జానకీ రాములకు పెండ్లి జరుగు టెరిగి,
వేధ, మఘవుండు వైదిక వేషులగుచు
ప్రీతి నుల్లంబు లలరంగ వీక తనర,
వచ్చి కూర్చుండి రా సభాప్రాంగణమున. 1850

వ. ఆ కల్యాణ మండపంబునకు నాల్గు ప్రక్కల మిరుమిట్లు కొలుపు నవరత్న ఖచిత విచిత్రవర్ణ చిత్రంబులు, విద్రుమ ద్రుమంబులు, మౌక్తిక తోరణంబులు, రజిత, కాంచన లతా గుల్మంబులును నిలిపిరి. అపుడు 1851

సీ. ఒకప్రక్క వీనుల నుత్తేజపరుపంగ
వేదవేత్తల భూరి వేదఘోష
లొకప్రక్క పరికింప నుత్సాహ మొనరించు
నర్తకీమణిగణ నాట్య శోభ
లొకప్రక్క మనసున కుల్లాసమును గూర్చు
సన్నాయి మేళంపు సరస రవము
లొకప్రక్క కన్నుల కోజను సమకూర్చు
అందాలు వెదజల్లు అతిథి చయము
తే.గీ. లిటుల శోభాయమానమై ఇంపు గొలుపు
పెండ్లి వేదిపై రతనాల పీఠమందు
రామచంద్రుని గొనివచ్చి రమణతోడ,
మునియు తూర్పు మొగముగ కూర్చొనగజేసి, 1852

వ. వసిష్ఠ మహాముని గణపతిపూజను, పుణ్యాహవాచనమును చేయించెను. పిమ్మట హోమవేదికను సుగంధపుష్పాదులతో నలంకరించి, బంగారు

పాలికలను, యవధాన్యపు మొలకల కడవలను, నవధాన్యాంకురంబులున్న మూకుళ్ళను, స్రుక్స్రువంబులు, పేలాలు, హరిద్రాక్షతలు మొదలగు పూజా ద్రవ్యములను సిద్ధపరచెను. తదనంతరంబు, పెండ్లి పురోహితుడౌ శతానంద మౌని. 1853

తే.గీ. రామునికి నిరుప్రక్కల రమ్యమైన
హేమ సింహాసనంబుల నేర్పరించి,
కౌశిక వసిష్ఠులను భక్తి కడుకొనంగ
తెలచి యుపవిష్టులను జేసి తిన్న కొలిచి, 1854

తే.గీ. మరియు, కుశలను వేదిపై పరగ పఱచి,
ఆగమ విధాయక ప్రణీతాగ్ని నందు
ప్రజ్వలింప చేసె నతడు ప్రజ్ఞతోడ,
వేదమంత్రముల నడుమ విధి విధాన. 1855

## 15.15. సూర్య, నిమి వంశజుల ప్రవరలు ప్రశంసింపబడుట

వ. అపుడు వసిష్ఠుడు రాముని ముంజేతికి కంకణమును కట్టెను. తదుపరి దశరథుని కోరికపై, ఆ మునిశ్రేష్ఠ డుచ్చైస్వరంబున సూర్యవంశ ప్రవర నుటంకించెను. పిదప జనకుడే స్వయముగ తమ మూల పురుషుడైన నిమి చక్రవర్తినుండి తన వరకును గల రాజ సంతతి నేకరువు పెట్టి అందలి శౌర్యధనుల గురించి వివరించెను. అంత వసిష్ఠ విశ్వామిత్రు లిట్లనిరి. ఓ కోసల విదేహాధిపతులారా! 1856

శా. మీ వంశంబులు సాటిలేనివి కదా! మీ పూర్వులన్ మిమ్ములన్
మీ వాల్లభ్యములన్, పరాక్రమములన్ మీ బాహు సంపన్నతల్
ప్రావన్ వర్ణన సేయ వీలగునె యా స్వారాట్టుకైనన్, భువిన్
మీ వంశంబుల వారి తూగగల భూమీశుండు కన్పట్టునే. 1857



కం. ఇరు వంశంబుల మధ్యను
పరగెడు నతులిత పరిణయ బంధన దీప్తుల్
దరిలేని శక్తి తోడను
స్థిరమై గ్రీష్మ తపన ద్యుతి వలె రహించున్. 1858

తే.గీ. రూప లావణ్య వైభవ రూఢులందు,
శిష్ట రక్షణ దుర్జన శిక్షణందు,
ధర్మ రక్షణ కర్తవ్య దక్షతందు,
వరుడు వధువు నిరువురొకే తెఱగు వారు. 1859

వ. కావున, మునుల మెల్లర మీ సీతారామ సంగమంబును స్వాగతించు చున్నామని నంత, సదస్సు లోని జనులెల్లరు జయ జయ ధ్వానములు చేసిరి. 1860

## 15.16. జనకుడు శ్రీరామునకు నూతన యజ్ఞోపవీతములు, మధుపర్కము లొసంగుట

వ. తదుపరి శతానందుని సూచన మేరకు, 1861

తే.గీ. జనక భూపతి బంగారు జందెములను
రామచంద్రుని కిచ్చెను రమణతోడ,
ముదమున వసిష్ఠ డా సూత్రముల ధరింప
చేసె తగురీతి రాముని చేత నపుడు. 1862

వ. ఆ సమయమున విశ్వేశుండైన రాముడటుల వసిష్ఠ ముని యాజ్ఞవెంట, యజ్ఞోపవీతంబులను సూత్రంబులచే కట్టబడుట కియ్యకొనుట వింతగ చూచి బ్రహ్మదేవుడు తనలో తాను నవ్వు కొనుచు నిట్లు తలంచెను. 1863

మ. [7] జగతీచక్రము సృష్టిజేసి మనగన్ సత్యప్రతిష్ఠాపనన్
తగు సూత్రంబుల కట్టి భౌతిక విధిన్ స్థైర్యంబుతోనిల్ప పా
రగుడౌ శౌరియె యీ విధిన్ కనక సూత్రంబందు బందౌట కాం
చగ విశ్వంభరు చేష్ట లెంతగ మహాశ్చర్యంబులో స్పష్టమౌ. 1864

తే.గీ. జనకు డపుడు రాముని పాద సరసిజముల
ప్రీతి ప్రక్షాళనము చేసి వినతుడగుచు,
పెరుగు, నేయి, నీరు, పటిక బెల్లము, మధు
వులను కలిపిన మధుపర్కముల నొసంగి, 1865

తే.గీ. ఎలమి నాతండు తదుపరి నలువు మిగుల
కమ్రమౌ స్వర్ణ వస్త్ర యుగ్మముల చాపు
చింప కుండ ప్రదానంబుచేసె రామ
చంద్రమూర్తికి రఘుకుల స్వామి కపుడు. 1866

## 15.17. తెరసెల్లా కట్టుట

ద్విపద :
కుల గురువంతలో కుఱ్ఱల చేత
తెలితెల్ల సెల్లాను తెరగ పట్టించె
నలువుగా రాఘవునకు ముందునుండ,
చెలి సీత వరుని కనులబడ కుండ–

తలప నాతెర యొప్ప కలిలమౌ ఛాయ
వలెను, ప్రకృతి పురుషుల విడదీయ
చలమున మన జ్ఞాన చక్షువుల్ మూయ
చెలసి యజ్ఞానము వెలగొన్న మాయ. 1867



## 15.18. కన్యాదాన మహోత్సవము

వ. అపుడు సర్వాలంకారభూషితయైన సీతాకుమారిని విధివిధానంబుగ బుట్టనుంచి మహారాణి సోదరులెత్తుకొనివచ్చి, కల్యాణపీఠమునందున అగ్ని సమక్షమున రాముని కెదురుగను జనక, సుమేధలకు ప్రక్కన కూర్చుండబెట్టిరి. అంత, 1868

సీ. ఏ పాదముల భక్తి నిల జనుల్ తలచిన
సంసార దుఃఖముల్ సమసి పోవు,
ఏ పాదయుగ్మంబు నేపార భజియింప
పాపియైనను గాని పావనుడగు,
ఏ పాద రేణువు లెలమి యహల్యకు
మునినాథు శాప విముక్తి నిచ్చె,
ఏ పాదముల నమ్మి ఇంద్రాది దేవతల్
దివిని పాలింతురొ స్థిరముగాను,
తే.గీ. ఏ పద జలజంబు నిరతి నెడద నిల్పి
సచ్చిదానంద మగ్నుడై స్రష్ట మనునొ –
జన్మ జన్మాంతర సుకృతు లిన్మడించి,
చెలసి జనకుడా పదముల చేత పట్టి, 1869

తే.గీ. వెండి పళ్ళెరమందున ప్రీతినుంచి
జాయ నీరము విడువ రాజసము విడిచి
తృప్తి కడిగెను పులకింప దేహమెల్ల,
తలపయిన జల్లుకొనియె నా జలము నంత. 1870

సీ. ఏ పాద పన్నీర మిసుమంత యైనను
తలపైన చిలుకుచు ధాత తనియు,

ఏ పాద సలిలంబు లీశాను ప్రీతికై
శిరమున నాట్యంబు సేయుచుండు,
ఏ పాద వాహిని ఇలపైన ప్రసరించి
గంగయై కిల్బిష భంగయయ్యె,
ఏపాద జలముల నిల కింపుగొని తెచ్చి
గరుడుండు [8]విష్ణు పుష్కరిణి చేసె,
తే.గీ. ఏ పదారవింద పృషత్తు లించుకైన
లభ్యమైన కలుగు మోక్షలాఘవంబు,
అట్టి జలము జనక నృపు డతుల భాగ్య
వశమున శిరముపై దాల్చె పరమ ప్రీతి. 1871

వ. ఆ విధంబున రామ పాదారవింద ప్రక్షాళిత సలిల శిరో మండనుండై, జనక మహారాజు కౌసల్యానంద వర్ధకుడైన రామునితో,పులకిత గాత్రుడై, కాలోచిత దివ్యతత్త్వమావహించి, ఆనంద సంభ్రమ మనోవ్యాపారుడై యిట్లనియె. 1872

వినుము రామచంద్రా!

సీ. అనుపమ సౌందర్య, అతులిత లావణ్య
అపరంజి సమవర్ణి అతివ సీత
సత్వ స్వభావంబు సామరస్యంబును
సామగ్ర్యమైనట్టి సాధ్వి సీత,
మా వంశ వర్ధన మహనీయ రాజర్షి
ధీరోద్ధతులకు ప్రతీక సీత,
వసుధ నాకొసగిన వరలక్ష్మి సీత, ఏ
యోని జనింపని యోష సీత,
తే.గీ. సకల పురుషార్థ సిద్ధికి, సత్య భావ
వృద్ధికి, హరిలోక ప్రాప్తి కిద్ధ చరిత



విష్ణు రూపుండవగు నీకు వినతితోడ
నిచ్చు చుంటిని భార్యగా పుచ్చుకొనుము. 1873

సీ. నా యింట నిన్నాళ్ళు నా కూతురై యున్న
పడతి నీకిక ధర్మపత్ని యౌను,
కష్ట సుఖములందు కలిమి లేములయందు,
ధర్మార్థ కామాది కర్మలందు,
నీకు తోడైయుండి నీవెంట నంటుచు
నిరతంబు మెలగును నీడ వలెను,
సర్వ సౌభాగ్య సచ్చరిత నీ సతిని నీ
వతులమౌ ప్రేమతో నాదరించి
తే.గీ. సిరికి నీడైన యిల్లాలి వర లతాంగి
ప్రీతి పాణిగ్రహణ మాచరించుమయ్య
రామ రఘువంశ పాథోధి రమ్య సోమ!
రాక్షస స్తోమ మారణ రంగ భీమ! 1874

వ. అని, 1875

కం. కీలించి నేల శిరమున్
లాలస తీరంగ మ్రొక్కి లలి హరి యురమున్,
లీలగ కోరిన వరమున్
చాలిక యొసగెడు సిరి నిభ జానకి కరమున్, 1876

కం. జనకుడు తనకరమున గొని
తనరగ శ్రీరామమూర్తి దక్షిణ కరమం
దున నమరిచి మంత్ర జలం
బును కన్యాదాన విధిని ముదముగ వదలెన్. 1877

## 15.19. కల్యాణ సుముహూర్తము

తే.గీ. అంత సుముహూర్తమాసన్నమైన, గురుడు
మంగళాష్టక సౌభాగ్య మంత్రములను
మించు నుచ్చైస్వరమున పఠించుచుండ
చెన్నుగా వాద్యఘోషలు మిన్నుముట్టె. 1878

వ. ఆ సమయంబున వాగర్థంబులవలె విడదీయ నలవిగాని సీతారామ వధూవరులు పరస్పర వీక్షణాసక్తి, వారి మధ్యగల తెర కాలానుగతిని, దానిని పట్టిన లేత బ్రహ్మచారుల యలసత్వ కారణమ్మున కొంత సడలి, యచ్చటచ్చట నేర్పడిన సందులనుండి యొకరి నొకరు చూచుకొన విజృంభిత మనసిజ ప్రేరేపితులై తలల మీదకు నటునిటు కదుపుచుండిరి. అపుడు ఉత్తరా నక్షత్రమందు అభిజిత్తు ప్రవేశింప, ముహూర్త సమయ మైనదని వసిష్ఠుడు హెచ్చరించి, ' అరుంధ్రువం' యను వేదమంత్రమును పఠింప మొదలిడెను. అంత గురువుల యాజ్ఞను, 1879

తే.గీ. రామచంద్రుండు, సీతయు ప్రేమ మీర,
చెలసి వికసిత వదనులై జీలకర్ర
బెల్లముల మిశ్రమంబును పెట్టి రప్పు
డొకరొకరి మస్తకంబుల నోజ తోడ. 1880

వ. ఆ ముహూర్తమందే మాండవీ భరతులు, ఊర్మిళా లక్ష్మణులు, శ్రుతకీర్తీ శత్రుఘ్నులు గూడను 1881

చతుష్పది :
విలసిత ముఖముల ప్రేమంబు విరియ,
పొలుపుగా మదుల మోదంబు కురియ,
చెలసి బెల్లంబు జిలకఱ లొకింత
తలనద్దిరంత తలరి పులకింత. 1882



మధ్యాక్కర :
అల ముహూర్తఘడియ వచ్చి నంతనె లీలగా నెలసె
నింపైన మెఱపులు నింగి నింద్రధనుస్సులు వెలసె;
అలరులు వికసించి బిట్టు జలజల నేలపై వ్రాలె,
నిలయెల్ల నమిత సంతోష జలనిధి నుప్పొంగి తేలె, 1883

ద్విపద :
అలవున గురుడంత తొలి నిల్పి నట్టి
జిలుగుల యవనిక తొలగగ నెట్టె-
కెలవున సద్గురు కృప వెలయంగ
మలగి జగన్మాయ తలగె ననంగ,
వర వధువులు ప్రీతిపడి చూచు కొనిరి
పురుష, ప్రకృతులట్లు మురిపాన తనరి-

చెలువ సీతాదేవి చిరు సిగ్గులొలుక,
జలదరింప తనువు, వలపులు తొలుక,
తలయెత్తి రఘునాథు తనివితో గాంచె,
మొలక నగవుల సిరుల వెలయించె.
కలయంగ చూచె రాఘవుడు మైథిలిని,
తలిరుటాకును బోలు తరుణి కోమలిని
చెలయంగ కోరికల్ చేతంబు లందు
నెలయంగ వలవంత హృదయంబు లందు. 1884

## 15.20. సీతారాముల కల్యాణమును వీక్షించిన వారల స్పందన

వ. ఆ సమయమున, 1885

మ. తనివారన్ సభవార లెల్లరును సీతారామ కల్యాణమున్
తనరారంగను గాంచి జన్మములు ధన్యంబయ్యె నేడంచు, భూ

మిని శ్రీ రాఘవు డున్నకాలముననే మేముండు భాగ్యంబు క
ల్గెనటంచున్ ముదమందుచున్ కరములన్ కీలించి భక్త్యాత్ములై. 1886

కం. రాముని బోలిన వరుడును,
భామామణి సీతవంటి వధు కులతిలకం
బా మిథిలాపతి, దశరథ
భూమీశుల బోలు బంధువులు భువి గలరే! 1887

శంకర ప్రియ :
భూమి పుట్టిన దాదిగా
రామ సీతలబోలు యే
ప్రేమమూర్తుల గానగా
లేము వీరికి సాటిగా. 1888

వ. అని సీతారామ దంపతుల దర్శన ఫలంబగు దివ్యాంతరంగ సమున్నతా
నంద తరంగ రంగ డోలికా మనోవ్యాపారులైరి. అది యటులుండ, 1889

తే.గీ. సదములో మర్త్యులనుగూడి త్రిదిశవాసు
లోజతోడ కల్యాణ మహోత్సవంబు
ననిమిషులగుట రెప్పల నార్పకుండ
కాంచి రతులిత సంతోష కలితు లగుచు. 1890

ఉ. అందున పాకశాసను డొకప్పుడు గౌతమ శాప మూలమై
పొంది సహస్రచక్షువులు పోడిమి కోల్పడె గాని, నేడవే
డెందము పొంగ చేసినవి లేవను రామ వివాహ హేల లా
నందము చింద వేయి నయనమ్ముల నార్పక చూడగల్గుటన్. 1891



## 15.21. కల్యాణోత్సవమును తిలకించి ప్రకృతి పరవశించుట

తరువోజ.
కనులార శ్రీరామ కల్యాణ శోభ, కలగొన తిలకించి ఘనమైన ఆభ,
విని సొంపుగా నున్న వేదాల ఘనలు, వివిధమౌ వాద్యాల విలసిత
ధ్వనులు,
కనకభూషణులైన ఘన వధూవరుల, కందర్ప సామ్రాజ్య కమనీయ
చరుల,
తనరార పులకించి తలరెను జగతి, తనివిని తలచుచు తనదని సుకృతి,
1892

ద్విపద.
ఇలయెల్ల సంతోష మెలయంగ పాడె,
నెలమితో నుప్పొంగి యింపుగా నాడె,
తళతళ నంబరస్థలి హవణిల్లె,
కలనినద లహరు లిల తవణిల్లె,
వెలరుల శంపాలతలు విలసిల్లి
నలుదెసల్ ముదముగా వెలుగుల నల్లె,
జలదములు చిరుజల్లుల వెదజల్లె,
జలధుల భంగంబు లలవున త్రుళ్లె,
లలితమై దివి దుందుభులు బిట్టు మొరసె,
మలయజ సురభిళానిలములు పొరసె,
నెలరుపున ప్రకృతి పులకించి విరిసె,
పొలుపుగ సకల జీవులు వెస ముఱిసె,
నలరుజొంపములు పువ్వుల వాన కురిసె,
నెలసి తుమ్మెదలు కుట్మలముల నరసె,

తులలేని రీతిని ద్రుమము లకాల
ఫలముల పండించె వలదుగ వ్రేల,
చలల ధాటికి మించి శశియు స్పందించి,
ఇలపైన నమృత వృష్టులు ప్రసరించె,
ఎలసిన సంతృప్తి తలిరుచె జగతి,
కలగొనె శాంతంబు కలిగెను ప్రగతి. 1893

## 15.22. మంగళసూత్రధారణ

వ. ఆ విధంబున దశరథరాకుమారునితో జనకరాట్పుత్రి కల్యాణ ముహూర్త సమయంబున ముల్లోకంబు లానందమొందె. తదనంతరము నలువురు రాజపుత్రులు వసిష్ఠుడు తత్కాల మంత్రంబుల పఠింప, భార్యల చిటికిన వ్రేళ్ళను పట్టుకొని అగ్నికి ప్రదక్షణ మాచరించి తిరిగి వేదికపైన తమ తమ స్థానంబుల నుపవిష్టులైరి. 1894

కం. ఒలసిన వివాహ వేడుక
లెలసిన యుత్సాహకేళి నింపుగ జనముల్
సొలపున మునిగిన తఱిలో
పులకించిన తను మనములు ఫుల్లంబైనన్. 1895

కం. నలకూబరాది గంధ
ర్వులు చెలగిన భక్తి మదిని రూఢముగాగన్
లలిని చతుర్విధ వాద్యం
బులు వాయించి రట పెండ్లి ముంగిళ్ళందున్. 1896

కం. ఘన తంత్రీ సుషిరంబుల
ధ్వను లాంక్యారావ సంయుత చతుర్విధమై



పెనగొని సమన్వితంబుగ
జనముల సంతోషపూర్ణ జలధిని ముంచెన్. 1897

ద్విపద.
కలగొన్న భూరి మంగళకర వాద్య
ముల వెలువడెడు స్వర లయల మధ్య,
తలప నుచ్చారణ దక్షులౌ మునులు,
నలఘు చతుర్వేద విలసిత తనులు,
చెలయుచు చేయు నాశీస్సుల యండ,
నలువ తథాస్తంచు పలుకుచు నుండ,
వెలయు దివ్య ముఖ శోభితుడు రాఘవుడు –
వలకేలుతో పట్టి పార్వతి యపుడు
సలలితముగ సీత జడను పైకెత్త
చెలువుగ చదువుల చెలి కురులొత్త,
పొలతికి గళమున పుస్తెలు కట్టె,
నెలత పాదముల మట్టెల జత పెట్టె –
సభయందు జయజయ స్వానంబు లొలసె,
నభమందు దుందుభి నాదంబు లెలసె,
స్వభువుండు ప్రభవించె ప్రణవనాదంబు
శుభమంచు దీవించె శూలి శంఖంబు. 1898

కం. మంగళసూత్రము కట్టె న
నంగ సదృశుడైన రాఘవాధిపు డపుడా
బంగరు సీతకు, త్రైలో
క్యాంగనలకు మంగళకరమై వెలయంగన్. 1899

కం. అక్షయ్యంబగు భుజబల
దక్షత విదళించి శివుని ధనువున్ ప్రతిభన్,
రక్షిత యజ్ఞుడు రాముం
డా క్షితికన్యన్ వివాహమాడెన్ ప్రీతిన్. 1900

కం. లక్ష్మీనివాసుడయ్యెను
లక్ష్మీ నిభ పెండ్లియాడి లక్షణమొప్పం
గా క్ష్మాపతి రఘునాథుడు
లక్ష్మీధవుడైన విష్ణు లక్షణ మబ్బన్. 1901

## 15.23. తలంబ్రాలు పోసుకొనుట

వ. ఆ విధంబున మంగళదేవతయగు సీతాదేవి కంఠమున రామచంద్రమూర్తి మంగళసూత్రమును కట్టి, 1902

ద్విపద :
ఎలమిని ముత్తైదువలు తెచ్చియున్న
సలలిత రతనాల సంచుల నున్న
తళతళ ధవళమౌ తండులములను,
కళుకుల ముత్తెముల్ పలురకములను,
సలివడి రాముండు జనకజ పైన,
తలకొని మైథిలి తనపతి పైన,
పలుమార్లు దోసెళ్ళ కొలదిగా తీసి,
చెలసి యొకరొకరి తలలపై పోసి
రెలరుపు లెలయంగ లలి తలంబ్రాలు,
వలపులు కురిసిన తలపుల జాలు – 1903



మంజరీ ద్విపద :
శ్రీరాము నానాడు సీతమ్మ తల్లి
యానందముగ పెండ్లి యాడేటి వేళ,
తలబ్రాలు పోయంగ తనరి దోసిటను
తెలుపారు ముత్యాలు తీపార గొనగ,
నెఱుపు తామర లట్టి యఱచేతులందు,
ముదముతో జనులెల్ల ముగ్ధులై చూడ,
ముత్యంబు లెఱ్ఱనై మురిపాలు జిమ్మె,
కెంపులై దానిమ్మ గింజలో యనగ–

సిగ్గుతో తలవంచి సీతమ్మ తలరి,
తలబ్రాలు రామయ్య తలపైన బోయ,
నిజవర్ణ భరితమై నెగడి ముత్యాలు
తెల్లగా కనుబట్టె మల్లెలో యనగ–

నీల మేఘమువోలె నెనయు రాఘవుని
మేనిపై ముత్యాలు మెండుగా దొర్లి
ఇంద్ర నీలాలట్టు లింపుగా మెఱసె
నిండార పండిన నేరేండ్ల వలెను–

ఇన్ని రంగులు చూచి ఇంతి యుప్పొంగ,
చెన్నుగా నవ్వాడు శ్రీరాము డపుడు –

ఆ రీతి రంజిల్లు నపురూప యుగళి,
దీవించు గావుత దీటుగా జనుల
ననుచు మహానందమంది వినతిని
యభినుతించుచు రాఘవాధిపు సతిని,

పలుమార్లు సభలోని పౌరవర్గంబు
కురిపించినారలు విరుల వర్షంబు. 1904

వ. అంతట పేరటాండ్రు నూతన వధూవరుల నంతఃపురంబునకు గొని పోయి, వివాహ సందర్భమున సంప్రదాయయుక్తమగు వేడుకలందు పాల్గొనచేసిరి. అందొకటి నూతన వివాహితులు పువ్వుల బంతులాడుట. ఒకరికొకరెదురుగా నించుక యెడమున కూర్చున్న వధూవరు లొండొరులు విసిరిన పువ్వుల బంతి దేహమున వివిధాంగములకు తగిలి వధూవరుల కించుక ననంగావేశము గొల్పుటయు, నిది చూపరుల కానందము కల్గించుటయు దీని ప్రధాన లక్ష్యములు. 1905

ఉ. ఇంతులు చూచుచుండ కన నింపగు మెత్తని మెత్తలందు చా
మంతి సుగంధి సంపెగలు మల్లెల తోడను కట్టినట్టి పూ
బంతుల రాముడున్ సతియు వంతులు పోవుచు నాడి రాయెడన్
కంతుడు కాలుద్రవ్వి చెలగన్ వలవంతల దూగ దంపతుల్. 1906

వ. రెండవదానిలో చిన్నమూతిగల బంగరు బుడిగలో రంగునీళ్ళను నింపి అందొక ఉంగరమును పడవేయుదురు. మధ్యవర్తి యనుజ్ఞ నివ్వగనే నూతన వధూవరులు తమ దక్షణహస్తముల నా బిందెలోనికి దింపి ఉంగరము కొరకు గాలించెదరు. తుదకు వధువో, వరుడో దానిని పట్టి పైకి తెచ్చును. దీనిలో భార్యా భర్తల చేతులు పరస్పరము తగులుట, ఒకరి చేతినొకరు నొక్కుట మొదలగు చిరు మన్మథావేశములను కలిగించు క్రియలే లక్ష్యములు. చూపరులకు వధువుగెల్చునా, వరుడు గెల్చునా అనుదానిపై నాసక్తి. 1907

మధుమతి (మాలిక) :
మనము సందడియై,
తనువు ఝల్లనగన్,



జనకపుత్రికయున్
ఇనకులేశ్వరుడున్
ననలబాణుని వే
ధనము మూలమునన్
వణికి రాత్రముతో,
గునిసి రాదటతో. 1908

వ. పై యాట గూడ సీతా రమణులాడి యొక్కింత మన్మథ స్పర్శ ననుభవించియే యుందురన్నది గ్రాహ్యము. ఇటువంటి వేడుకల మరి కొన్నింట పాల్గొన్న పిదప వారిని వసిష్ఠుండు పిల్వనంపి, వివాహోత్సవముల ముగింపు సమయంబున జరుపు వైదిక కర్మలను, హోమకార్యములను వారిచే నాచరింప జేసి, వేదవిద్యా నిష్ణాతులగు పండితులచే రాచ వధూవరులను పద క్రమ జటా ఘనలచేతను, సామములచేతను, నాశీర్వదింప చేసెను. ఆ పిమ్మట దశరథ మహారాజు పండితులను తగినరీతి గో, ధన, హిరణ్య, వస్త్ర దానంబులతో సత్కరించెను. 1909

## 15.24. నిశాగమనము

ఉ. అంత దివాంతమై నిశ సమాగతమైన పురోహితుండు సౌ
ధాంతర మందునుండి ముదమారగ రాముని తల్లిదండ్రులన్
కాంతల వారిబందుగుల కౌశిక ముఖ్య మునీంద్ర సంఘమున్
సంతన చేసె నిస్సరణ సక్త విశాల వివీత భూమిలో. 1910

తే.గీ. అంతలో సూర్యభగవాను డస్తమించ
భువిని వెలుగులు క్రమముగా మురిగిపోయి
కారుచీకట్లు నలుదెసల్ క్రమ్ముచుండె
గగనమందున తారకల్ కళుకు లీనె. 1911

తే.గీ. అంబరంబును నాలింగనంబు చేసె
ననగ నున్న ప్రభారాశి యణగి లలిని
అభ్ర మిప్పుడు పేలవం బగుచు తోచె
హద్దులే లేని నీలాల యవనికట్లు. 1912

తే.గీ. అప్పు డెటునుండి వచ్చెనో కాని
మిలమిల మెఱయు చిరుదీప్తు లలవరించి
తారకా లాస్య విన్యాస తోరణముల
కేళికా విలసనముల క్రీడ మెలగె. 1913

కం. రక్కసులు తపోబల మద
మెక్కగ తగ నా విరించి సృష్టించిన యా
రిక్కలనె కూల్చి వేయగ
నక్కసుతో దూగి వీక నంబర చరులై, 1914

ఉ. ఉక్కున నుక్కు ముద్గరము లుద్ధతి చేతుల పట్టి తారలన్
తక్కక కొట్ట ముక్కలయి ధారణి యందున వ్రాలెనో యనన్,
ఉక్కఱి నేలమీద పడె నుల్కలు వ్యోమమునుండి జాలుగా–
ఉక్కివులైన యోగులు వియోజితులై భువి వ్రాలినట్లుగన్. 1915

కం. అలదురి యసురుల చర్యకు
జలముచ లుఱుమగ నెగసిన చపలల దీప్తుల్
తెలుపేమొ మబ్బు కొనలను
తలపును కలుగంగ జేయ తలరిరి జనముల్. 1916



మంజరీ ద్విపద :
అలుపెరుగని యొక యద్భుత శక్తి,
జగతీ వలయమును చతురత త్రిప్ప
దిర్దిర కక్ష్య పై తీరుగా తిరుగ,
రతనాలు పొదిగిన రమ్యమౌ సరిగ,
వెలి పారదపు బుడ్లు వ్రేలాడు మురుగు,
నీలాల చీరకు నీటగు చెరగు,
ముత్యాలు కుట్టిన పొలుపైన గొడుగు
వలెను కన్పట్టి జనులకు విభ్రాంతి
కలిగించి యానంద మొలికించె నపుడు,
సలలితమయ్యె నా సామ్రాజ్య నభము. 1917

వ. అట్టి శోభాయమానమైన నిశా సమయంబున శతానందుండు సదానందుని మాడ్కి నిరత మందహాస మండిత వదనుండై, రామాదులతో నిట్లనియె. 1918

## 15.25. అరుంధతీ వీక్షణము

తే.గీ. "వరులును, వధువుల్ చూడుడు, స్థిరముగ నొక
స్థలమున నెలకొనిన ధ్రువతారను నభ
మం దుదీచిని – సప్తర్షి మండలాన
చూడు దేడు తారకలను చోద్యముగను. 1919

వ. ఆ సప్తర్షి మండలముననే, ఇదుగో నేను నా తర్జనితో చూపుచున్న మినుకు మినుకుమను అరుంధతీ సతిని గాంచుడు. వివాహ సమయమున నా పూజ్యురాలి దర్శనముచే వధువులకు పాతివ్రత్య సౌభాగ్య భాగ్యములు, వరులకు వసిష్ఠ బ్రహ్మర్షి వలె వైవాహిక ధర్మాచరణ యోగ్యతలు సిద్ధించు"

ననెను. అంత నా వధూవరులా అరుంధతీ నక్షత్రముకొర కాకసమును కలయచూచుచుండ, నవ్వుచు వసిష్ఠుండు, "సీతారాములారా! మీరు అరుంధతిని చూచుట కాకాశమున వెదకు నగత్యము లేదు. ఇదుగో నేను తలచినంతనే యామె వచ్చునని చమత్కరించెను."

అంత పండు ముత్తైదువైన యరుంధతీ సాధ్వి ప్రత్యక్షమై, వసిష్ఠ, కౌశికాది మునివరులకు నమస్కరించి, శతానందుని దీవించి, రాముని కౌగలించి నుదురు ముద్దాడి ఇట్లనెను. "ఈ పది, పదునేను దినములలోనే బ్రహ్మర్షి కౌశికుని సాంగత్య మూలమున నెంతగా నెదిగితివయ్యా. తాటక దానవి ఖండన, మారీచాది రక్కసుల నుక్కడగించుట, అహల్యాసతి శాపవిమోచనము, సీతాకాంతా పాణిగ్రహణము– ఎంతటి దుస్సాధ కార్యముల నీడేర్చి కారణ జన్ముడవనిపించుకొంటివో గదా! భువి నార్ష ధర్మ ప్రతిపాలనంబున నివి నీ తొలి విజయములు మాత్రమే. నీవింకను సాధించ వలసిన కార్యములు పెక్కులు కలవు. నీకు శుభమగు గాక, యని సీతాదేవి దెస తిరిగి, తల్లీ సాధించితివే! అనెను. అపుడు భరత, లక్ష్మణ, శత్రుఘ్నులను వారి వధువులను ఆశీర్వదించి, జనకునితో, రాజన్యా! శివధనుర్యాగము చేయుమని నీతో నన్నందుకు నన్నెన్ని పర్యాయములు నిందించితివయ్యా. అయినను వెనుదీయక నా కార్యము జరిపించి కృతకృత్యుడ వైతివి. నాకదే పదివేలు. జగతికి మేలు. శుభం భూయాత్," అనుచు మెల మెల్లగ సాగి చీకటిలో నదృశ్యమయ్యెను.

ఆ విధంబుగ, వేద విధ్యుక్త కర్మలతో, సంప్రదాయోత్సవంబులతో నయిదు దినములు వివాహ కార్యక్రమము నడిచిన పిదప జనక మహారాజు రామునకు సోదరులకు విలువగల చీని చీనాంబరములు, మత్తమాతంగములు, జవనాశ్వంబులు, ననేక కాంచన నవరత్న భూషణాద్యలంకారంబులు, దాసదాసీజనంబులు, చందనాది పరిమళ ద్రవ్యంబులును బహూకరించెను. అంత నా మహారాజు, మంగళవాద్యఘోషా పూర్వకముగ వధూవరులను, దశరథాదులను రథారూఢులనుచేసి యూరేగింపుగా విడిది గృహమును ప్రవేశింప జేసెను. 1920



**వివరణలు:**

1. మందాక్ష= సిగ్గు; ఖ్యాతి= కీర్తి, ఇక్కడ మందాక్ష, ఖ్యాతి యను పాత్రలు వరుసగా సిగ్గుకు, కీర్తికి మూర్తీకరణములు.

2. phosphorescent; 3. fluorescent.

4. ఆ కాలమున పురుష సింహుడు, ధర్మ స్వరూపుడు నయిన శ్రీరామప్రభువును కండ్లార చూచు కోరికతో, జనులు తండోపతండములుగా వచ్చెడివారట. ప్రస్తుత సందర్భమైన మిథిలలోనే గాక, అయోధ్యలోను, ఆయన ఎక్కడికి వెళ్ళినను ఇట్లే జరిగెడిదట. ఇవి చాలాపర్యాయములు దండయాత్రలను పోలియుండెడివి కాబోలు, 'రామునిదాడి' అను మాట మన తెలుగుసాహిత్యము లోనికి ప్రవేశించినది. ఇది 'రామందాడి'గా, 'అసంఖ్యము' అను భావముతో నిఘంటువులలో కనిపించు చున్నది. రామందాడి అనునది, లంకపై రాములవారి దాడినుండి వచ్చిన మాట యని కొందరందురు.

5. ఆర్చు= చేయించు; 6 ఆర్చు= తడి యార బెట్టు.

7. తా. విశ్వమును సృజించి, దాని మనుగడకై నిత్య సత్యములగు కొన్ని భౌతిక సూత్రములను ప్రతిష్ఠించి, వాటికి కట్టుబడి విశ్వము ప్రవర్తించునట్లు చేయు సామర్థ్యము గల విశ్వంభరుడే, ఈ విధముగా బంగారుతీగలకు బందీయౌట చూడ ఆయన లీలలు ఎంత ఆశ్చర్యములో (అని బ్రహ్మ నవ్వుకొనెను).

అర్థ వివరణము : సత్యప్రతిష్ఠాపనన్ తగు సూత్రముల కట్టి భౌతిక విధిన్= నిత్యసత్యములగు కొన్ని భౌతిక సూత్రముల పరిధిలో విశ్వము ప్రవర్తిల్లు నట్లు నెలకొల్పుట;

ie., Establishment of universal truths through binding physical laws; (I hold the view that God created the Universe so that it exists by itself following strict Universal physical laws made by Him, a few of which only the scientists were able to unravel so far, through verifiable proofs. Our ancient Rishis perhaps have done better through their intuition, though these deductions are mostly emperical; స్థైర్యంబుతోనిల్ప= స్థిరత్వముతో నిలబెట్ట; పారగుడు= కుశలుడు.

8. ఇదియే కలియుగమున తిరుమలలోని పుష్కరిణి.

# 16. సీతారాముల గృహప్రవేశ ఖండము

## 16.1.సీతారాములు మిథిలనుండి అయోధ్యకు బయలుదేరుట

కం. మరునా డుదయము ధరణీ
వరుడు దశరథుడు సుతులను భార్యా స్నుషలన్
పరిజనుల గొని యయోధ్యా
పురమునకు ప్రయాణ మయ్యె మోదముతోడన్. 1921

వ. అప్పుడచట కనుజ భార్యా సమేతుడై జనకరాజన్యు డాంతరంగికమంత్రి పురోహిత పరివారముతో తమ కుమార్తెల నత్తవారల కప్పగించి, సాగనంప నేతెంచెను. అంత తల్లి దండ్రులను చూచి, 1922

ఉ. కన్నులవెంట నీరు జలగా ప్రవహింపగ పెండ్లికూతు లా
పన్నులవోలె నేడ్వ నృపపత్నులు పొంతనచేసి వారలన్
చిన్నగ నక్కునందునను చేర్చి విమోహము దీర్చి యత్తలన్
పొన్నరి బాలికామణుల పొందిక సాకగ వేడిరాయెడన్. 1923

కం. అలమట నణపగ నేరక
అలివేణుల సీతను చెలియండ్ల నలత కౌ
గిలి కూర్చి గద్గదిత గళ
పులకితగాత్రుండు జనక భూపాలుండున్, 1924

తే.గీ. అప్పగింతల కార్యంబు చెప్పలేని
బాధ మదిని ముప్పిరిగొన – వాహికుండు
భూరి భారంబు దింపంగ దారి గనక
నెట్టులో మోయు రీతిని – నెట్టుకొచ్చి, 1925



వ. దశరథునితో, మహారాజా! ఈ సీతా కాంత నాకత్యంతాత్మీయ. ఆమెను వీడి నే నెన్నడుండలేదు. ఇప్పు డీమె మీ సొత్తు. తండ్రి దగ్గరలేదన్న లోటు లేకుండ నీవు దయాపూరిత చిత్తంబున నీమెను, నీమె చెల్లెండ్రను నీ కుమార్తెలు, గనే పరిగణించి కాపాడుమనుచు వేడుకొని నమస్కరించి వీడ్కొని, వెనుతిరిగి చూడకుండ బాష్పజలపూరిత నయనంబులతో తన నివాసమున కేగెను. అంత, 1926

ఉ. పొందును కూర్చి రామునకు భూసుత సీతకు, వాంఛతీరగన్
తొందరతోడ కౌశికుడు దూగి తపం బొనరింప నేగగా
చిందులువాఱ చేతము వసిష్ఠుని వీడ్కొని, రామచంద్రునిన్
చిందిన ప్రేమ కౌగిలిని చేర్చుచు దీవనలిచ్చి యాదటన్, 1927

తే.గీ. పంక్తిరథునితోడ కుశిక వంశు డనియె
నేను వచ్చిన కార్యంబు నిర్వహించి
నాడ గాన నింక హిమవన్నగములందు
తపముచేయంగ నేగుదు త్వరితముగను. 1928

కం. నాకిట సిద్ధి లభించెను,
నే కైలాస గిరి దరిని నివసింతు నికన్
నా కక్కొ కౌశికి యట
వీకన్ ప్రవహించు చుండు వేచుచు నాకై. 1929

## 16.2. పరశురాముని ఆగమనము

వ. అని పలికి విశ్వామిత్రుడు నిష్క్రమించెను. అంత, పదాతులు కాలి నడక, నాశ్వికసైన్యవ్రాతంబు లశ్వారూఢులై, సేనానాయక, సచివవర్గంబులు గజారూఢులై ముందుకదుల, దశరథుడు, భార్యా పుత్ర బంధు, సన్నిహిత,

ముని జనంబులు రథంబు లధిరోహించి అయోధ్యకు బయలుదేరిరి. వార లనతి దూరమేగి నంతనే దశరథు డెదురౌచున్న దుశ్శకునములను పసిగట్టి, భయవిహ్వలుడై వసిష్ఠుని సంప్రదింప, నా ముని సత్తముండిట్లనియె. 1930

తే.గీ. మానవాధీశ! నీ వన్న మాట నిజము,
కానివి యపశకునములె గాని దుశ్శ
కునము లేమిగావు కనుక కొంచెమేని
భయము నందక నుండుము నయము తోడ. 1931

మ. అనుచుండన్ నభమందు చీకటి పొగల్ వ్యాపించి భాస్వంతు గ
ప్పెను, విశ్వంభర నంధకారమయమై పెన్ వాయువుల్ వీచె, నా
శనపాతంబుల బోలె భూరి రవముల్ సన్నద్ధమై భీతి కొ
ల్పెను మర్త్యాళికి, జంతు సంతతులు పర్వెన్, వ్రాలె పక్ష్యాదులున్. 1932

ఉ. అంతట దివ్య తేజమున నానన దీప్తులు ప్రజ్వరిల్ల, రా
జాంతక మైన గొడ్డలి భుజాన వహించుచు, హస్తమందు న
త్యంత మహోన్నతంబగు శరాసన మాశుగ సంయుతంబుగా
పంతుగ దాల్చి వచ్చె నట భార్గవరాముడు త్ర్యంబకుండునాన్. 1933

సీ. ఎవ్వాడు హైహయు నిమ్మడి నేనూరు
కరముల ఖండించె పరశువునను,
ఏ మహావిక్రాంతు డిరువది యొకమార్లు
క్షత్రియ వీరుల సంహరించె,
ఏ హరి యవతారు డిలకు భారము తగ్గ
దుష్టుల ఖండించె దోర్బలమున,
ఏ వితరణశీలు డింపారగా వసు
ధను కశ్యపమునికి ధారపోసె,



తే.గీ. నే మహాత్ముడు శిష్యుడై యీశ్వరునికు
నేర్చె విలువిద్య నత్యంత నియతితోడ,
నా మహాముని యిదె వచ్చెననుచు జనులు
ప్రాణముల నుగ్గ బెట్టిరి త్రాణ సమసి. 1934

ఆ.వె. మండు వేసవందు మధ్యాహ్న మార్తాండు
వలె జ్వలించు కనులు వహ్ని జిమ్మ,
చేతనున్న ధనువు చిత్రంబుగా మీటి
జామదగ్ని వచ్చె శరము వోలె. 1935

కం. "రాముడనుచు నా పేరును
మోమోటమిలేక దాల్చి మోసముతోడన్
భీముని పురాతన ధనువు
నామోదములేక విరిచె ననుచును వింటిన్. 1936

ఆ.వె. ఆతడెక్క డుండె" నని వారి వీరిని
తడవు ప్రశ్న చేసి కడకు చేరి
దశరథ జనపాలు తర్జించి యడిగిన
భీతి నతడు నాల్క పిడుచగట్ట. 1937

వ. రాజకుల నాశకుండగు పరశురాముడు తన రాముని సంహరించునని భయమంది, యాతని కర్ఘ్యపాద్యాదు లిచ్చుట గూడ మరచి, కాళ్ళవద్ద సాగిలి పడి సాష్టాంగ దండప్రణామంబు చేయుచు, కొంతకాలమునకు కొలదిగా తేరుకొని, ఇట్లు నుతించెను. 1938

ఉ. "వందనమయ్య నీకు భృగువంశ విహాయస చండభాస్కరా!
స్కందునితోడ గూడి ఘన కార్ముక విద్యను త్ర్యంబకానన

స్పందితమైనదాని తగు సాధన తోడను వీక నేర్చి యా
స్కందునె గెల్చినావు శివకామిని దీవనలిచ్చి మెచ్చగన్. 1939

సీ. జమదగ్ని మునినాథు సరితూగు తపసివి
నినుబోలు ఘనుడైన మునియు గలడె,
విశ్వేశు వద్దనె విలువిద్య నేర్చితి
ధారుణి నినుబోటి ధన్వి గలడె,
జనకుని సేవలో జగమున జనులకు
స్ఫూర్తియౌ నినుబోటి సుతుడు గలడె,
దోషియౌ హైహయు దోర్బలంబున కూల్చు
నినుబోటి బలశౌర్యధనుడు గలడె
తే.గీ. అట్టి నినుచూచు సౌభాగ్య మమరె నేడు
నియుత శుభములు మాకింక నిశ్చయముగ
కలిగి తీరును నీయాన కలత లేక,
దీని మిథ్య చేయకు మయ్య దీన వరద! 1940

ఉ. పాపడు ముగ్ధమోహనుడు వాని నవోధనుగూడి యింటికిన్
ప్రాపుగ నన్ను తోడుకొని వావిరి నేగుచు నున్నవాడు; యీ
పాపనిపైన యుద్ధపరిపాక విహీనుని పైన నేల నీ
కోపము దీని మాని చిరుకూనను కావగదయ్య భార్గవా. 1941

శా. నీ కోపంబున కగ్నియో, వరుణుడో, నీరేజ బంధుండొ, యా
నాకాధీశుడొ గాక ఈ బుడుత ఈ నా కుర్ర వధ్యుండు గా
దో కారుణ్య పయోధి, దీనజనబంధూ! లోకరక్షాకరా!
ప్రాకాశ్యంబె తలంపగా పిచుకపై బ్రహ్మాస్త్రమున్ పూన్చుటల్."1942



కం. ఆ మాటలు సరుకు గొనక
భూమిసురుం డచటినుండి ముసముస నేగెన్
రాముని కనుగొన, నాలో
రాము డెదురు వచ్చి మునికి రాణన్ మ్రొక్కెన్. 1943

కం. అంత వసిష్ఠుడు దశరథు
చెంతకరిగి పల్కెనిట్లు "చింత వలదు భా
స్వంతాన్వయ రాజన్యా!
అంతయు శుభమే జరుగును వ్యథ నొందకుమా. 1944

చం. మరచితివేమొ నేను మును మానుగ తెల్పిన రీతి నీసుతుం
డరయగ దైవయోగభవు డౌటను దివ్యుడు గాని వేరుగా
దరమర యేలనయ్య వినుమయ్య భయంబును వీడుమయ్య యో
నరవర! నేడు భార్గవుడు నందకుడయ్యెడు వేచి చూడుమా!" 1945

వ. అనవిని దశరథుం డిటులనె, "గురువర! 1946

తే.గీ. నేను భయపడకుండంగ నీవు రాఘ
వుండు దివ్యుడంటివిగా నతండు రూఢి
నన్ను ప్రేమ నారాధించు కన్న కొడుకు
గాని దైవాంశ భూతుండు గాడు స్వామి. 1947

తే.గీ. ఏ యతీంద్రియశక్తి లేదీ చిఱుతకు,
నిటుల తమరు వీనిని పొగడుట వలవదు
పెలుచ దీన నరిష్టముల్ వలగొనునను
కలత నామది నుద్ధతి కలచె స్వామి." 1948

## 16.3. రఘురామ, భృగురాముల సంవాదము

వ. వీరిటుల సంభాషించుచుండ, నట, 1949

తే.గీ. పరశురాముడు పాదాభివందనమ్ము
భక్తి గావించు రాముని వంక జూచి,
మున్ను హరిచెప్పినట్టి రాముడితడె యను
సంశయ ముదయించి మనము సంచలింప. 1950

ఉ. అంత మరొక్కమారు సొగసైన రఘూద్వహు మోముగాంచి వి
భ్రాంతిని పొంగి మానసము రంజిల, నెంత మనోజ్ఞమూర్తి, వీ
డెంతటి పిన్నవాడు, మును నెక్కటి దైత్యుల సాటిలేని వి
క్రాంతిని నేలగూల్చి మన కౌశికు జన్నము కాచె నేర్పుతో. 1951

వ. అంతియ కాక ఈ వీరుడు శివుని కార్ముకము నవలీలగ భగ్నంబు చేసెను గదా! 1952

సుగంధి వృత్తం :
త్ర్యంబకోగ్రహస్తమండితంబు, కేతకీ సుగం
ధం బమోఘ పుష్టివర్ధనంబు, దార్ఢ్య మున్నతం
బంబరాంబర ప్రఫుల్ల హాసికా స్వయంప్రకా
శంబు విల్లు – వీడు బాహుశక్తి తోడ కూల్చుడే! 1953

శంకర ప్రియ:
ఉంకువైన శరాసనం
బంకెగొంచును శూరుడై



బింకమైన కరంబులన్
లంకెవేసి దళింపడే! 1954

ఆ.వె. ఏల నింత దనుక నీరీతి చింతింప –
హరి హరులకు గాక యరయ వారి
యంశల నుదయించి నట్టి వారికిగాక,
శివుని విల్లు విఱువ చేత నౌనె. 1955

ఉ. వీనిని చూడ నా యెడద ప్రేమమయంబయె, వీని కేవిధిన్
హానిని గూర్చగా తగదటంచనిపించె మనమ్మునందునన్
దానికి తోడుగా మును గదాగ్రజుడౌ హరి యాజ్ఞవెంట నే
వీనికి విష్ణుతేజమును వెంటనె యప్పన చేయగా వలెన్. 1956

తే.గీ. పరశురాముని యవతార పరిసమాప్తి
సమయ మాసన్న మయ్యె సంశయము లేదు,
సాయ మారంభ మైనంత చాయ తగ్గి,
ముసలి సూర్యుండు పడమట ముఱుగు నట్లు, 1957

తే.గీ. క్రొత్తగా రఘురామచంద్రు నవతార
మిప్పు డారంభమయ్యె నీ పృథ్వి యందు,
నుదయ సంధ్యను తూర్పున నుద్యమించి
మింట నుదయించు నా లోకమిత్రునట్లు. 1958

వ. అయినను నీతండు హర్యంశసంభవుండుగా నిశ్చయము చేసుకొనిన పిదపనే, నా విష్ణుతేజము నీతనికి చేర్చు విషయమును నిర్ణయించెదను. 1959

మ. కనులన్ కోపము కొంత చూపుచునె, ఈ కాకుత్థ్సు డోజన్ సనా
తనధర్మ ప్రతిపాలనంబు జరుపన్ దార్ఢ్యంబుతో నుండెనో,
కనుగొందున్ కరుణామయుం డగునొ, వాక్చాతుర్య ధౌరేయుడో-
కినుకన్ తెచ్చెడు రీతినే పలుకుచున్ కీడ్పాటు కల్గించుచున్. 1960

తే.గీ. అని తలచి రాఘవుని దెస నలుక తోడ
భృకుటి చిట్లించి కన్నులు రీఢ దోప,
పెడసరమున నతని జూచి పెలుచ పిలిచె
నప్పు "డో క్షత్రియాధమా!" యనుచు మౌని, 1961

తే.గీ. అనగవిని రాముడనియె, "నీ హస్తములను
పరశువు, శరాసనంబుల నరయ తెలియు
నీవు బ్రాహ్మణుండవొ లేక నియతి తప్పి
నట్టి క్షత్రియాధముడవొ యతి వరేణ్య!" 1962

తే.గీ. [1]భార్గవుం డనె, "నో రఘుపాంశనుండ!
పడతి నిర్జించిన పరమపాపివీవు";
రాఘవుండు పలికె భృగురాము తోడ,
"తల్లి గాదయ్య నాకామె తాపసేంద్ర" ! 1963

వ. దానికి పరశురాముడు కుపితుండై ఇట్లనియె, దాశరథీ! 1964

తే.గీ. "నీవు తెలివితేటలుగల నెరవరి వని,
యతి చమత్కార వాగ్విభవాన్వితుండ
వనుచు తలచు చున్నట్లు నా మనము లోన
తోచుచున్నది నీకింక పీచమణతు. 1965



మ. ఇలపై నేడసమాన దానవుడు, దేవేంద్రారియౌ రావణున్
జలధిన్ ముంచిన [2] హైహయున్ ప్రతిభతో సాధించి నే గండ్రగొ
డ్డలితోడన్ హతమార్చినాడ, జగతిన్ డాకొన్న దుర్మార్గ రా
జుల శీర్షంబుల వేలువేలుగను చక్షుఃప్రీతి ఖండించితిన్. 1966

తే.గీ. అట్టి భార్గవ రాము నీ వలవు లేని
వానిగ దలచి నాముందు వావి లేక
కుప్పిగంతులు వేయంగ కోలుమసగి
తరగకుందునె నీ మెడ పరశు తోడ. 1967

వ. కాచుకొనుము. నాతో యుద్ధముచేసి కాపాడుకొను ప్రయత్నింతువో, లేక వ్యాఘ్రము దగ్గరైన జింక భంగి నే నీపై కుఱుక నిశ్చేష్టుడవై యూరకుందువో నిర్ణయించుకొనుము." దానికి శ్రీరామచంద్రు డణకువతో నమస్కరించి, బదులు చెప్ప నారంభించెను. 1968

చం. అదిగని లక్ష్మణుం డలుక నన్నతొ నిట్లనె, "రామచంద్ర! ఈ
వదరెడు బ్రాహ్మణుండు నిను వారక దూషణచేయుచున్న నీ
మదిగొనబోక నేల నసమంజస గౌరవమిచ్చి వందనం
బదరుచు చేయుచుంటివి మహాత్మ! ఇదేల నెరుంగజెప్పవే. 1969

తే.గీ. అనుమతిచ్చిన నేనొక్క క్షణములోన
నిశిత శరమును సంధించి నీల్గ చేసి
పెద్దల కడకు పంపు దీ పిలుకుగాని,
పృథ్వి యందున క్షత్రియుల్ ప్రీతి చెంద." 1970

తే.గీ. అనగ రాముండు సోదరు ననునయించి
యనియె, "తాపసవరులెంత యాగ్రహించి

నను గృహస్థులౌ మనమంత యణగి యుండ
తగు – నిది మన సనాతన ధర్మ మరయ. 1971

వ. దీని నెన్నడును నీవతిక్రమించకు" మనెను. ఈ యన్నదమ్ముల మధ్య రహస్యముగ జరిగిన సంభాషణ, [3]దూరశ్రవణ విద్యాపారంగతుండును, త్రికాల వేదియు, మహిమాన్వితుండు నగు పరశురామునకు విదితము కాగా, నాతండు తనలో నిట్లు తలబోసెను. ఓహో! 1972

తే.గీ. రాముడెంతటి ధర్మవర్తనుడొ చూడ,
వీని యాధిపత్యంబున పృథ్విపైన
ప్రథితమౌ మన ధార్మికార్హ వ్యవస్థ
నవనవోత్సేక మౌనని నమ్మవచ్చు. 1973

వ. అంతలో నినవంశ తిలకుండు భృగువంశ శిఖామణితో నిట్లు పలికెను 1974

తే.గీ. "తరణి వంశజు లేనాడు పరశురామ!
సురభులనుగాని, తలప భూసురుల గాని
హింస చేయగనెంచరు హితవెగాని,
కనుక నీతోడ చేయను కదన మెపుడు. 1975

ఉ. ఐనను స్వామి! మీరు నను నంతముచేయగ నేల, మీకు నే
హానిని చేయకోర నెపు" డన్నను భార్గవ రాముడిట్లనెన్,
"మాను మసత్య భాషణలు – మా గురువైన గిరీశు కార్ముకం
బానుగ సొంతలాభమునకై మును భగ్నము చేసి దుష్టతన్. 1976

వ. ఏ నేరము చేయలేదందువా! ఇంతకన్న పెద్ద నేరమేది గలదు," అనెను. దానికి రాఘవుడు, "నేను శివధనువు నెక్కుబెట్ట బూనుటకు మొదటి కారణము



నా గురువగు కౌశికుని యాజ్ఞ. గురుని యాజ్ఞను ప్రశ్నింపక నిర్వర్తించుట సకల మానవ ధర్మము గదా. ఆపైన, వినుము. 1977

ఉ. ఏనొక క్షత్రియుండను, మహీసుత సీతను పెండ్లియాడగా
పూని, పణమ్ముగా జనక భూపతి యుంచిన శంభు కార్ముక
మ్మూని గుణమ్ము పట్టి బిగువొందగ కోటికి లాగి కట్ట సం
ధానము చేయుచుండగ తనంతనె ధన్వము భగ్నమై పడెన్. 1978

వ. కనుక నీవాపాదించిన యభియోగము కారణ రహితము. మునీంద్రా, మహామహిమాన్వితులైన మీ రెరుగని విషయములుగాని, న్యాయములుగాని కలవే. 1979

ఆ.వె. నీవు సర్వమెరుగు నేర్పుకాడవు కాదె,
యభవు ముదల లేక యస్త్రమరయ
భగ్న మగునటయ్య భార్గవా! మడియునే
శివుని యాన లేక చీమయైన!" 1980

## 16.4. పరశురాముడు తన వైష్ణవతేజమును రఘురామునకు అందజేయుట

వ. ఆ మాటలకు మనమున సంతసించి, "అటులైన నావద్ద నిదుగో శ్రీహరి తేజ నిబద్ధిత కార్ముకము గలదు. దీని నెక్కుపెట్టి భగ్నముచేయ ప్రయత్నింపుము. విష్ణుదేవుడు నీయెడ ప్రసన్నుడౌనో కాదో చూచెదనుగాక. 1981

ఆ.వె. విష్ణుతేజమున్న విల్లిది దీనిని
విఱుచు మ" నుచు పల్కి భృగుకులుండు,
హస్తమందు నుంచె నధిక దర్పమ్మున,
రాఘవుండు దాని రక్తి గొనగ, 1982

తే.గీ. విల్లుతోబాటు నందున్న విష్ణుతేజ
మమర రామచంద్రుని చేరె నద్భుతముగ,
దాన దీపించె రాముని యాననమ్ము
కోటిసూర్యు లొకపరిని కూడినట్లు. 1983

తే.గీ. దివ్యమైనట్టి ఆ కాంతి తేరిచూడ,
ప్రజల చక్షువుల్ మూతలు పడె, హృదయము
లందు నూత్న తేజంబు లలమె, తనువులు
పులకితములయ్యె దివ్యానుభూతి కలిగె. 1984

తే.గీ. కొలది క్షణములలో నినకులుని దివ్య
కాంతి వాని తనువునందు కలిసిపోయి
చూపరుల కింక తనపూర్వ రూపముననె
కానబడె వారి యనుభూతి కలగ మిగుల. 1985

ఉ. అంతట రాముడున్ హరిశరాసన మందున నారిగట్టి యా
వంతయు సంశయింపక మహాశుగమున్ తగ పూన్చి బిట్టు క
ర్ణాంతము దాకలాగి భృగురామునితో నని "నా పృషత్క మ
త్యంత మమోఘమౌటను మహాముని! లక్ష్యము చూప వేడెదన్. 1986

వ. భార్గవ రామా! నా బాణమునకు నీకు చెందిన దాని నేదేని సమర్పించవలసియుండు" ననెను. ఆలోన, 1987

తే.గీ. పరశురాముని వదనమ్ము పతితమయ్యె
సవురు నశియించి యాతండు స్థవిరుడయ్యె;
తేజ మడగిన భృగుకుల తిలకుడపుడు
రామచంద్రుని దరిజేరె ప్రణతుడగుచు. 1988



ఉ. ఈతడె విష్ణురూపుడని యేపుగ నిశ్చితమౌట భార్గవుం
డాతత సంతసమ్ము మదినంతయు నిండ తనంత తానుగా
నాతడె విష్ణువంచు కనినందుకు పొంగుచు రామచంద్రునిన్
భూతలమందు శీర్షమును మోడ్చుచు మ్రొక్కి నుతించి యిట్లనెన్. 1989

కం. "నీవే హరివని యెరుగుదు
భావంబున నిన్ను నమ్మి బ్రదుకుటచేతన్,
నీవెరిగిన నా గాథయు
సావిగ నిపుడు మనమందు జ్ఞాపక మయ్యెన్. 1990

ఆ.వె. చక్రతీర్థమందు జపము సేయగ నేను
చాలయేండ్ల కీవు సంతసించి
విష్ణుతేజమిచ్చి వివిధాస్త్రములనిచ్చి,
విష్ణుధనువునిచ్చి ప్రీతిమీర. 1991

వ. ఇట్లంటివి, 1992

తే.గీ. 'ధరణిపై మనుజులు ప్రత్న ధర్మ విధుల
శ్రద్ధ లేకను మానిన బుద్ధి వలన
నైతికంబుగ దిగజారి నష్టపడగ,
దుష్టశక్తులు జృంభించె దురుసుగాను. 1993

మ. వసుధాధీశులు చాలమంది దురిత వ్యాపారులై దుష్టులై
వసిగొంచున్ బుజుమార్గ సంశ్రితుల సంవర్జించి హింసించి దు
ర్వ్యసనాసక్తిని పెంచుచుండి రిలపై వారిన్ సమూలంబుగా
ససనంబిమ్ము పరశ్వధంబునకు నీ శక్తిన్ విదారించుచున్. 1994

కం. చలమున సాధుజనులను, ము
నుల నుఱుమాడెడు నృపులను నూల్కొని నీ దో
ర్బల సంపద భూభారము
పెలుచన తగ్గింపు మయ్య భృగుకుల ముఖ్యా! 1995

ఉ. ఆ విధి దుష్ట భూపతుల నందర నంతముచేసి భూమిపై
హావడి మాన్పి, హస్తగతమావటచేసి, ప్రశాంతిగూర్చి, నీ
వీ వసుధన్ మహాత్ముడు మహీసురు నొక్కని నేరి వానికిన్
తావక నిచ్ఛ తీరగను దానము చేసి తపంబు కేగుమా. 1996

కం. త్రేతాయుగ మందున నే
భూతలమున రాము డనగ పుట్టుదు, నా నా
డాతతముగ చెలరేగెడు
ఘాతకులగు రక్కసులను కలన వధింతున్. 1997

కం. ఇష్టులు కూల్చెడి యసురుల
దుష్టుల దుర్నీతి మార్గ దోహదకరులన్
భ్రష్టుల నశింప చేయుచు
శిష్ట ప్రతిపాలనంబు చేయుదు భువిపై. 1998

కం. ఆ రాఘవు నీవొకపరి
పోరున కలిసె డవకాశము కలుగు – నా నా
డా రాముని కీ విల్లును
తీరుగ నిమ్మా మదీయ తేజము తోడన్. 1999

తే.గీ. మానవులకు నీ వొనరించు మంచి తలచి,
నీకు నియుత వత్సరములు నిరతిశయ యు



తమగు నాయు విచ్చితి దాన తనరి నీవు
తప మొనర్పు నాతోడ తాదాత్మ్య మొంద.' 2000

వ. వివస్వంతాన్వయ వీరాగ్రేసరా! విష్ణ్వంశ సంభూతా! విశ్వంభరా! ఆ విధంబుగ నీ వాదేశించితివి. నేను నీ యాజ్ఞ ప్రకార మాచరించితిని. 2001

తే.గీ. అందుచే నాకు భువిపైన నన్ని కార్య
ములును నేటితో తీరె, ప్రమోదమయ్యె,
నింక నీ ప్రాంతమును వీడి యేగువాడ
తపము చేయ మహేంద్రభూధరము దరికి. 2002

తే.గీ. స్వామి! నీకీయ నావద్ద నేమి లేదు,
కాయ మొకటి మాత్రమే కలదుదేవ!
కాని, యదియు చిరంజీవిగాగ మున్ను
ముదల నిచ్చితిగాదె ప్రపూతచరిత! 2003

ఆ.వె. ప్రాణహానిగాక బాహుచరణముల
నీయవచ్చుగాని యినకులేశ!
బాహుహీనమైన దేహము నిన్నెట్లు
పూజచేయగలుగు నోజతోడ. 2004

తే.గీ. కాళ్ళులేకున్న నడువంగ వీలుగాక,
పూలు ఫలములు కోయంగ పూజకొరకు
నెక్కనేరను చెట్ల, నే నేరజాల
నేల పడినవైననుగాని నెరవు లేక. 2005

వ. కాని యొక మార్గ మున్నది, వినుము, 2006

కం. తెలిసియొ తెలియకొ నే నీ
యిలపై పుణ్యముల చేసియేయుందు కదా!
తలకక నీ యిషువునకవి
బలితర్పణమాచరింతు పంకజనాభా!" 2007

వ. అనిన విని యటులేయని, శ్రీరామచంద్రుడు 2008

ఆ.వె. విష్ణు తేజమున్న వింటి కమర్చిన
యాశుగమ్ము తోడ నవనిసురుని
పుణ్య పాపములను మురుగజేసి తిరిగి
వానితోడ కరుణ పలికె నిట్లు. 2009

ఆ.వె. "విష్ణుదేవు గూర్చి వీకతో తపమును
నిష్ఠ నాచరించి నిరతితోడ
పొందుమయ్య తిరిగి పుణ్య సంపదలను,
మనుము పృథ్విపైన మడియకుండ." 2010

ఆ.వె. అనుచు శాశ్వతాయు వతనికిచ్చి పనిచి,
ప్రీతి వరుణ దేవు పిలిచి దరికి
విష్ణుమూర్తి ధనువు విశిఖంబు తోడను
న్యాసమిచ్చె వాని కచ్చుకొనగ. 2011

వ. అట పరశురాముడును, తను వెనుక కశ్యపునకు ధారబోసిన భూ భాగమున నుండదలచక భారతదేశ వాయవ్య ప్రాంతమున కేగి, అక్కడగల



సముద్రమును వెనుకకుపోయి తానుండుటకు స్థలము కల్పింప వేడి, యట్లేర్పడిన నేలపై స్థిరనివాసముండి తపమాచరించుకొను చుండెను. 2012

## 16.5. సీతారాములు దశరథునితో అయోధ్య చేరుట

చం. తదుపరి రాఘవుండు తన తండ్రి రథంబును చేరి దానిపై
నదవున స్రుక్కి క్రిందపడినట్టి నృపాలుని మేలుకొల్ప, నీ
రదములనుండి బైటపడు బ్రధ్నుని వోలెను తేజయుక్తుడై
ముదపడి చూచి పుత్రుని విమోహిత చిత్తముతోడ నాతడున్. 2013

వ. కౌగలించి దేహంబు నిమిరి, స్వాస్థ్యముగనున్నాడని యెరింగి సంతసించి, మంత్రులనుండి రామునిచే పరశురాముడెట్లు భంగపడెనో తెలుసుకొని, కుమారుని శౌర్య ధైర్యాది వీరోచిత లక్షణములకు, నుదాత్తప్రవర్తనకు పొంగి పులకించెను. ఆ పిదప వారందరును సైన్యముతోగూడి పయనించి, కతిపయ దినములలో నయోధ్యాపట్టణ పరిసరంబులను జేరిరి. 2014

కర్ణాటక చౌపదులు;

ఊరి పొలిమేరలో నుద్యుక్తులైన
పౌరవర్గములంత పరికించి చూచి
సౌరైన కోదండ్ర సరస నొప్పారు
శ్రీరామ యువరాజ బృందంబు నపుడు,

రాగిల్లి వారలన్ రక్తితో కలసి
పాగాలు చుట్టించి, పాగడల్ కప్పి,
బాగుగా పూజించి, ఫలములున్ పూలు,
నాగవల్లీయుక్త పూగంబు లిచ్చి, 2015

సీ. వేదమంత్రంబులు విప్రు లుచ్చైస్వర
మున పఠియించి యింపు నొనగూర్చ,
నానక దుందుభు లాలిజ్య ఝుర్ఝరల్
ప్రీతియౌ విధమున బిట్టు మ్రోయ,
నొప్పుగా భూషించి యూరి యోషామణుల్
తౌర్యక్రమంబున తనరి యాడ,
వృద్ధులు, బాలురు వీరు వారనకను
పౌరు లెల్లరు ప్రీతి చేరి సరస,
తే.గీ. రామచంద్రుని యనుజుల రాణివాస
ములకు స్వాగతంబిచ్చి సంపూజనముగ
నూరిలోనికి గొనిపోయి రుత్సవముగ
దశరథుండును సంతోష దర్ప మొంద. 2016

కం. సాకేతపుర నివాసులు
ప్రాకామ్యముతోడ తనరి పట్టణమంతన్
పాకారి నగర మట్టుల
నైకాద్భుతరీతి తీర్చి రమరులు మెచ్చన్. 2017

తే.గీ. రథ్యలకు నిరుప్రక్కల రంగు రంగు
ల సుమహార చయముల వ్రేలంగ దీసి,
మామిడాకుల తోడ తోమాలు చుట్టి
కమ్రముగను కట్టి రరటి కంబములను. 2018

తే.గీ. రాజబృందము సాగంగ రథములందు,
బారులుగ తీరి పౌరులు బాటలందు



నలరు జల్లులు కురిపించి రధిక భక్తి
రాచ జాయా పతులపైన రాగమెలసి. 2019

తే.గీ. రచ్చలందున నేర్పుతో రమణు లపుడు
నృత్య మాడుచు, పాడుచు నెమ్మితోడ,
చేరి నివ్వాళు లిచ్చిరి చెలువుమీఱ.
నూతన వధూవరులకు వినూత్నరీతి. 2020

తే.గీ. వంది మాగధు లంతలో ప్రణతు లగుచు
పొగడి రా వధూవర రాజయుగళములను;
ఒక్కరే వెళ్ళి ఇద్దరై యోజ వచ్చి
రని చమత్కరించిరి రాజ హాస్యగాంద్రు. 2021

తే.గీ. రాముడు ననుజులంత భార్యలను గూడి
రాజ సౌధంబు చేరంగ ప్రమనులగుచు
వీక ఘోషించిరి గృహప్రవేశ కాల
నిగమ మంత్రముల ద్విజులు నిరతి తోడ. 2022

తే.గీ. మాలిక:
రక్తి కౌసల్య మొదలగు రాణు లపుడు
క్రొత్త కోదండ్ర నల్వుర కోర్కితీర,
దైవ గృహముకు గొనిపోయి తనివి తోడ
నాయు రారోగ్య భోగభాగ్యములు కలుగ
మ్రొక్కజేసిరి దుర్గకు మోద మెసగ;
పిదప వారిని తోడ్కొని పెండ్లి విందు

లారగింపించి తమ తమ హర్మ్యములను
భర్తలకు చేర్చి సంతోష భరితులైరి. 2023

## 16.6. భరత, శత్రుఘ్నులు భార్యలతోగూడి కేకయాధీశుని యొద్దకేగుట

వ. ఆ రీతి వివాహానంతర వేడుకలతోడను, గృహప్రవేశ సంబంధిత వైదిక కార్యముల తోడను కొన్ని దినములు గడిచిన పిమ్మట, నొకనాడు దశరథమహారాజు తన రెండవ కుమారుడగు భరతుని పిలిపించి ఇట్లనియె, "భరతా! నీపై ప్రేమానురాగము లతిశయిల్లి నీ మాతామహుడగు కేకయాధీశుడు నిన్ను తోడ్కొని తెమ్మని తన కుమారుడగు యుధాజిత్తు నిటకు పుత్తెంచెను2024

తే.గీ. అపుడు మనమెల్ల మీ వివాహముల కొరకు
మిథిల నుంటిమి గాన నీ మేనమామ
యటకు వచ్చి నీ కల్యాణ మలరి చూచి,
తిరిగి మనతోడ వచ్చెను తిన్న నిటకు. 2025

తే.గీ. ఆత డింకను నీ కొర కత్తరమున
వేచి యుండె నయోధ్యలో ప్రీతి తోడ –
నాత్మబంధువు, వృద్ధుండునైన కేక
యాధిపుని కోర్కి మన్నింప న్యాయమగుట. 2026

వ. నీవు నీ మామతో గిరివ్రజంబున కేగి మీ మాతామహుని కడ కొన్నాళ్ళుండు మని"న, భరతుండు తండ్రితో, చిత్తము. అటులే చేయుదునని చెప్పి. 2027



కం. తమ్ముడు శత్రుఘ్నుని దరి
కిమ్ముగ చని వానితోడ నీ విషయమ్మున్
గమ్మున తెలుపగ నాతడు
సమ్మోదము తోడ ననియె సహజన్ముని తో. 2028

కం. "అన్నా! నేనున్ వచ్చెద
నెన్నడు మీతాతగారి నిందనుకను చూ
డన్నోచను నీ వొప్పితి
వన్నన్ నే నాన్నగారి యనుమతిగొందున్." 2029

కం. భరతుం డటులేయనుచును
త్వరితముగా తండ్రికడకు తమ్ముని తోడన్
పరుగిడె – దశరథు డాలో
సరసుండై యేగె కైక సదనంబునకున్. 2030

ఆ.వె. భటుల నుండి యెరిగి భరతు డీ విషయమ్ము
తమ్ముని గొని యేగి తల్లి కడకు
అచట తండ్రిని గని యనియె శత్రుఘ్నుని
తోడుగొనుచు నేగు వాడ ననుచు. 2031

తే.గీ. దానికి దశరథుండు మోదమున నొప్పె–
నది వినిన కైక వివరము లరసి, సుతుని
పయన మెరిగి ప్రేమ పతిని కవిసి,
పలికె పలుకు పలుకునందు కులుకు లొలుక. 2032

ఉ. "సంతసమయ్యె నాథ! తమ సమ్మతి నాకును, నాన్నగారికిన్
శాంతి ఘటింపచేయు, భుజశాలి సహోదరుడున్ మనమ్ములో

శ్రాంతము తీరి తృప్తుడగు చాల ముదంపడి, కాని వీరితో
కాంతలగూడ పంపతగు కావున యోచన చేయుడీ ప్రభూ. 2033

వ. క్రొత్తగా వివాహమైన దంపతులకు వియోగము కలిగించుట తగదుకదా నాథా!" అనిన, దశరథుండు భార్య సముచితాలోచనకు మనమ్మున మెచ్చుకొని కుమారులతో మీ రిరువురు మీ మీ భార్యలను గొని యుధాజిత్తు వెంట వెళ్ళుడని యాజ్ఞాపించెను. 2034

తే.గీ. భరతు డపుడు తల్లి నడిగి సరిపడంగ
తనకు శత్రుఘ్నునకు కూడ తగెడు రీతి,
నాల్గు దినములు వ్యవధిగా నడుమ నుండ,
మూర్త మొక్కటి పెట్టించె పొలుపుమీఱ. 2035

చం. అది యటులుండ దేశమున నాసురవర్తను లెల్లలందునన్
పదపడి గోవులన్ జనుల పంటల దోపిడి చేయుచుండగా,
నదుపొనరింప నా దశరథాధిపు డేడ్తెర విక్రమించి పెం
పొదవగ నేగి ముష్కరుల పొంకమడంచగ నిశ్చయించుచున్. 2036

కం. తగినంత సేన గొనుచును
పగతుర నిర్జింప నెంచి పంక్తిరథుండున్
మగటిమి తత్క్షణమట కే
గగ నిర్ణయమును గొనుచు ప్రకటనము చేసెన్. 2037

తే.గీ. అటుల నిశ్చయించి దశరథాధిపుండు
ప్రియత సతులను సుతులను వేగ పిలిచి,
తాను తక్షణం బానాడె పూని యేగ
పని బడెననుచు వారితో పరగ పలికి, 2038



తే.గీ. భరత శత్రుఘ్నులను తన దరికి చేర్చి
కౌగలించి కనుల నీరు గార్చి, మీరు
వీక తాతగారి కడకు వెళ్ళి, వార
లెన్ని నాళ్ళుండమన నుండుడన్ని నాళ్ళు. 2039

వ. అని వారికి స్వేచ్ఛనిచ్చి, సరిహద్దునొద్ద జరుగుచున్న హింసాకాండకు మనసు చలించి, ప్రయాణోన్మనుడై మాటలు తడబడ, మరల నిట్లనియె. 2020

తే.గీ. "మీరు వెళ్ళు నాటికి పనిమీద నుందు;
వలను పడబోదు వీడ్కోలు పలుక మీకు,
కనుక మిమ్ముల నేనింక కలవబోను,
ముద్దు పుత్రులార! మరినే పోవుదు నిక," 2040

వ. అనుచు, దశరథుండు సేనానాయకులతో కలసి ముష్కరులపై దండయాత్రకు వెడలి పోయెను. దశరథుని మాటలలోని యపశకున వాచకముల నచటివారు గమనించక పోయినను, నాకాశవిహారులగు నపశకున దేవత లా దోషశబ్దంబులు విని, తథాస్తనిరి.

మరి రెండు దినములకు భరత శత్రుఘ్నులు భార్యలతో కూడి కేకయ రాజ్యంబున కరిగిన పిదప, దశరథుడు సరిహద్దున నల్లరుల నణచి యయోధ్యకు విజయుండై తిరిగి వచ్చెను. కోసల ప్రజలు తమరాజు చేసిన సాహసమునకు సంతసించి విజయోత్సవములను జరిపిరి. 2041

## 16.7. సీతారాముల సేవలకు దశరథుడు తనియుట

ఉ. రాముడు జానకీ సతియు రమ్య మనస్కత తండ్రిగారికిన్
ప్రేమను సేవచేయుచును, పెన్నిధులై తగు రీతి నిత్యమున్

గోముగ నేమి కావలెనొ కోరకమున్నె సకాలమందునన్
తామె శమంబునన్ విధి విధానముతో సమకూర్చు చుండగన్. 2042

కం. సీతా రాముల తోడుగ
నాతత సేవలను లక్ష్మణ స్వామియు నా
పూతచరిత యూర్మిళయున్
ప్రీతిని చేసిరి పితరులు పెలుచన మెచ్చన్. 2043

తే.గీ. తండ్రితో పాటు ముప్పురు తల్లుల యెడ
చూపి సమతుల్యమౌ భక్తి నౌపచారి
కముల చేయును రామమూర్తి - ముదమంది
యతని ప్రేమింతు రట్లె వా రతులముగను. 2044

తే.గీ. ఐన వానికి కైకపై నధిక ప్రేమ
అందు మూలాన దినములో నధిక భాగ
మతడు చిన్నతనమునుండి యామె సదన
మందు గడుపును ప్రీతి లక్ష్మణుని గూడి. 2045

తే.గీ. ఆమెకును గూడ నట్టులే రాముడన్న
పిచ్చి ప్రేమ భరతునిపై ప్రీతికన్న
మించియుండును వేమార్లు మెండుగాను -
ముద్దు మురిపాలతో వాని ముంచు నామె. 2046

## 16.8. సీతారాములు అన్యోన్యానురాగములతో సుఖజీవనము సాగించుట

తే.గీ. రామ లక్ష్మణు లిరువురు రక్తితోడ
వారి దైనందిన విధుల భాగముగను



ద్విజుల వేదోక్త కర్మముల్ బీఱు వోక
క్రమము తప్పక చేయుదు రమిత భక్తి. 2047

తే.గీ. అంత క్షత్రియోచిత విధు లాచరించి
జనుల మంచి చెడ్డల గూర్చి వినతులంది,
తగిన రీతిని తీర్తురు తగవులున్న,
జనులెగాక తండ్రియు నెంతొ సంతసింప. 2048

ఉ. అందున రామచంద్రుడు మహాద్భుత దక్షత రాచకార్యముల్
పందిరివెట్టి దిద్దుచు నుపాయముతోడను ధర్మబద్ధుడై
యందరు మెచ్చ దీటుగ నిరాశ్రయ దీనజనాళి కష్టముల్
పొందుగ తీర్చుచుండు తన పొల్పగు తీర్పులతోడ సర్వదా. 2049

వ. ఆ మూలంబున శ్రీరామచంద్రుండు రాచకార్య వ్యవహార నిర్వహణ దురంధరుండనియు, నిరతార్ష సంప్రదాయానుచరుం డనియు, సతత వేదధర్మావలంబనుం డనియు, కరుణా సముద్రుండనియు, దీన జనపక్షపాతి యనియు నయోధ్యావాసులచేగాక తక్కుంగల పరిసర రాజ్యవాసుల చేతను, జంబూద్వీపమునగల మునుల చేతను కొనియాడబడుచుండెను. ఇక తన యాంతరంగిక విషయంబున, 2050

చం. తరణికులాగ్రగణ్యుడు, నుదాత్తుడు రాముడు జానకీసతిన్
నిరతము చూచుటో, యెదను నెయ్యముతో స్మరియించుటో, వెసన్
మురిపెపు మాటలన్ తనిపి మోహములో విహరించుటో వినా,
మరియొక భావమే చొరదు మానుగ నే క్షణమందు వానికిన్. 2051

చం. వరగుణ జానకీ సతికి వావిరి నాథుడు రామచంద్రుడే
స్థిరముగ కానుపించు మది, తిన్నన స్వప్నములందు గాని, యే

నెరవులయందు గాని, మరి నెట్టన యూహలయందుగాని, తా
నెరవరియౌచు చిక్కకయ నెయ్యముతో కనుమూసి నప్పుడున్. 2052

కం. రాము డనుకూల సతియగు
భామను గూడి నిజధర్మవర్తన పరుడై,
కామితముల తనిసెను సు
త్రామ సదృశ భోగ సౌఖ్య ధామము లందున్. 2053

వ. ఆ ప్రకారంబుగ శ్రీరాముని మనమున నిరంతరము సీతయే యుండెను. సీతగూడ నట్లే, తన సర్వస్వము రామునిగా తలంచి మెలంగు చుండెను. ఈ యన్యోన్య ప్రేమానుబంధములు రాను రాను ప్రవృద్ధినొంది ప్రవేష్టించి, వారివురు వాగర్థంబుల వోలె విడదీయ నశక్యమై యేకీకృతులైరి. అట్లు రాజర్షియైన దశరథ మహారాజపుత్రుడు శ్రీరామచంద్రు డుత్తమ రాజపుత్రి, మనోహర రూప లావణ్య, సుగుణగణగణ్యయునైన సీతాకాంతతో కలసి సకల భోగ భాగ్యములతో, వివిధైశ్వర్య తారుణ్య సంపదలతో శోభిల్లుచుండెను.

పంక్తిరథుండు గూడను తన తనయులు, వారి తరుణులు తనకు, దారలకు చేయు సేవలకు మహానంద భరితుడగుచు, తన జన్మ నిరత సంతోషదాయక మయ్యెనని తృప్తిచెందుచు, తన దేశవాసులచే కీర్తింపబడి, మర్త్య స్వర్గంబుల నమేయ గౌరవ ప్రతిష్ఠా సంపన్నత నొంది, 2054

ఉ. పుత్రులు, భార్యలున్, స్నుషల పొంతను పొందికతో సుఖించుచున్,
ధాత్రిజన స్వరాట్టువలె ధార్మిక మార్గము తప్పకుండగన్
శాత్రవలోకమున్ నిజ భుజ ప్రభవంబున నొంచి, మిత్రుడై
క్షాత్రవతేజ మొప్పగ ప్రశాంతత నేలుచునుండె కోసలన్. 2055

శ్రీమదాంధ్ర శివానంద రామాయణమునందు బాలకాండ సర్వము సంపూర్ణము



## మంగళాశాసనము

మానిని.

పావననాముని, పాశవిమోచను, పాపనిరోధుని, పాలకునిన్,
పావకనేత్రుని, పర్వతవాసుని, పన్నగ భూషణు, ప్రాక్తనునిన్,
భావజభంజను, భైరవవేషుని, భక్త వశంకరు, భద్రపతిన్,
భావుకరూపుని, భ్రాజితదేహుని, భండనభీముని, భస్మధరున్. 2056

వ. నా శివనాంద రామాయణ కావ్య కృతిభర్తయైన శివమహాదేవు నిట్లు నుతించుచు మనమ్మున సహస్ర కోటి ప్రణామంబుల నర్పించుచు, 2057

[4]పాదాద్యక్షరక్రమ కావ్యనామ విలసిత సీసపద్యం.

సీ. శితికంఠునకు నిచ్చి శ్రీపతిపై దివ్య
వాక్య సంపుటి ప్రీతి వ్రాయ దలచి –
నందమై వీనుల విందునై నవ కుము
ద విగలిత మకరందమయి వెలయు
రాజీవ వదనుండు రఘువంశ సోముండు
మాన్యగుణుండు రామప్రభువరు
యద్వృత్తముల మనసార వర్ణించు క
ణకతోడ నా పూర్వ సుకృతి మూల
తే.గీ. మునను బాలకాండ రచించితిని నతిని – ధ
రను రసికవరుల కెదలాహ్లాదమొనర –
నార్షధర్మంబుపైగల యధిక భక్తి
ని తెలుగున భీమశంకర కృతముగాను. 2058

మంగళమహాశ్రీ.

వందనము నీకు శివ! పార్వతికి గంగ కభివందనములయ్య పరమేశా!
ఛందమున నర్థమున శబ్దమున వర్ణనల శైలి నితివృత్తమున నీశా,
సుందరము నాకవన సూన సముదాయ మతి శుక్త కృతి దీని గొను మీశా!
చందురుడు జింకయును సర్పములు భూషగను స్వాగతము పల్క జగదీశా!
2059

[5]ద్విముఖి (ప్రకృతిచ్ఛందము):

హర హర శంకర పరమేశా! అడుగులు మ్రొక్కెద విశ్వేశా!
మురహర పాలక భువనేశా! పొలుపుగ కొల్చెద గౌరీశా!
కరుణను నాకృతిగొను మీశా! ఘనముగ సాకుము భీమేశా!
పురహర నమ్మితి నిఖిలేశా, ముదమున దీవెన లిమ్మీశా! 2060

తోటకం.

వినయంబున కొల్చెద విశ్వపతిన్
అనయంబును నాపయి నాదృతితో
జన సంఘములందున శాశ్వతమై
పొనరంగను చేయగ పుస్తకమున్. 2061

## గద్యము

ఇది పరమేశ్వర ప్రసాదిత పాండిత్య ప్రకాశ, సహజ కవిత్వ తత్త్వవిభవ, హరితసగోత్ర సంభవ, వేము వంశ సుందరారామ మండిత అమ్మన్న శాస్త్రి ప్రపౌత్ర, వేద వేదాంగ పండిత, రామయాహ్వయపౌత్ర, హూణభాషా వ్యాసంగ వ్యాసక్త వ్యాసమూర్తి మహోదయ, ఆంధ్ర పౌరాణిక విజ్ఞానవిషయ నిష్ణాత లక్ష్మీకాంతామతల్లికా దంపతి గర్భశుక్తిముక్తా ఫలుండును, ఆంధ్రాంగ్ల వచన, పద్యగ్రంథకర్త కౌశికసగోత్ర యనమండ్ర నారాయణమూర్తి పండిత



దౌహిత్రుండును, దక్షారామ భీమేశ్వర వరప్రసాద సంభవ, బహువిద్యాకోవిద, భూభౌతికశాస్త్ర విశారద, [6]ఉస్మానియా విశ్వవిద్యాలయ భూభౌతికశాఖ స్థాపక, అధ్యక్ష, ఆచార్యవరుండును. తత్ విద్యాలయ [7]శాస్త్ర వివిధ విభాగ పరిషత్ గురుండును, [8]భారత జాతీయ విజ్ఞానశాస్త్ర అకాడమీ సభ్యుండును,[9]అన్వేషణా భూభౌతికశాస్త్ర స్వచ్ఛంద సమాఖ్యా స్థాపకుండును, వి.యల్.యస్.సాహిత్య, వైజ్ఞానిక పీఠస్థాపకాధ్యక్షుండును. [10]ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ అధ్యక్ష, కార్యనిర్వహణాధికార ప్రకాశితుండును, బహుదేశ గమన విద్యాసాముపార్జిత, విజ్ఞానశాస్త్ర సాంకేతిక పరిశోధన, ఆచార్యాది వృత్తివర్త నుండును, కతిపయ సంవత్సరపూర్వ వృత్తి, వ్యాపారాది లౌకికకార్య విసర్జిత, సంతత హరచరణారవింద మగ్నుండును, 'రసస్రువు', 'శివానందమందహాస', 'దక్షారామ భీమేశ్వర శతక', 'ద్రాక్షారామ భీమేశ్వరోదాహరణా'ది పద్యగ్రంథ రచనా ధురంధరుండును, విజ్ఞానశాస్త్ర జాతీయ, అంతర్జాతీయ, ఆంధ్ర కవిత్వ ప్రతిభాది వివిధ పురస్కార గ్రహీతుండును హైదరాబాదు నగరవాస్తవ్యుండు నగు శ్రీవేము లక్ష్మీనారాయణ సుబ్రహ్మణ్య భీమశంకర ప్రణీతంబైన శ్రీమదాంధ్ర శివానంద రామాయణమునందు బాలకాండ చంపూ గ్రంథము సర్వమును సంపూర్ణము.

మంగళం మహత్

ఓం శాంతిః

**వివరణలు:**

1 భావం: పరశురాముడు, రాఘవా! నీవు ఆడుదానిని (అంటే తాటకను) చంపిన ఘోర పాపివి, అన్నాడు. దానికి, రఘురాముడు, భార్గవ మౌనీ! ఆమె నాకు తల్లి కాదే, అన్నాడు (అనగా, పరశురామా! నీ తల్లైన రేణుకనే నీవు చంపలేదా, అనే చమత్కార సమాధానము).

2 హైహయ వంశమునకు చెందిన కృతవీర్యుని కుమారుడగు అర్జునుడు త్రిమూర్తుల అంశ నుద్భవించిన దత్తాత్రేయు నారాధించి సహస్రబాహువులను పొందిన మహా సాహసవంతుడు.

ఒక నాడా కార్తవీర్యార్జునుడు భార్యలతో రేవానదిలో జలక్రీడ లాడుచుండ, నాతని జయింప తలచి రావణుడు రహస్యముగ నఖండ రాక్షససైన్యముతో వచ్చి నదిగట్టున విడిసెను. అది క్రీగంట గమనించిన అర్జునుడు తన వేయిచేతులతో నదీప్రవాహము నాప, ఆ నదిలోనినీరు పొంగి గట్టున నున్న రావణుని సైన్యముతోపాటు ముంచివేసెను. మరియు, వాని శిఖలను పట్టుకొని, తలలను మోకాళ్ళకు తాకించ, రావణుడు బాధతో నార్చుచు కార్తవీర్యుని శరణు జొచ్చి అతని కరుణతో విడిపింపబడి పారిపోయెను.

అట్టి కార్తవీర్యుని భార్గవరాముడు, ఆశ్రమమున ప్రశాంతచిత్తుడై తపము చేసుకొనుచున్న తన తండ్రి జమదగ్ని శిరమును ఖండించెనను కోపమున, ఒక్కడే ఎదిరించి, గండ్రగొడ్డలితో సహస్రబాహువులను ఖండించి చంపివేసెను.

3. ఆశ్రమమున తపముచేసుకొనుచున్న తనతండ్రి జమదగ్ని తలను కార్తవీర్యార్జునుడు, నఱకు నపుడు పరశురాముడు దూరముగానున్న యడవిలో సమిధల నేరుచుండెను. ఆశ్రమమున నున్న వాని తల్లి రేణుకాదేవి భర్త బీభత్సవముగా హత్యచేయబడుట చూచి, విచారగ్రస్తయై భీతిని, తన నలువురు సుతులలో విక్రముడు, సమర్థుడునైన పరశురాముని రామా, రామా యని ఎలుగెత్తి పిలిచినది. సామాన్యముగా పరశురాముని స్థానమున, ననగా నంత దూరమున అడవిలో నున్న వారికి రేణుక కేకలు వినబడవు. కాని పరశురాముడు తల్లి పిలుపులు విని ఏదో ఆపదజరిగెనని, పరుగు పరుగున తమ యాశ్రమమునకు వచ్చెనని పురాణములు చెప్పుచున్నవి. ఎంతో దూరముననుండి పిలిచిన పిలుపు పరశురాముడు వినగలిగె ననగ, నా మహాత్ముడు దూరశ్రవణవిద్యాయోగ పారంగతుడై యుండవలెనన్న యూహతో, ఈ వాక్యము నటుల వ్రాసితిని.

4. పాదాద్యక్షరక్రమ కావ్యనామ విలసిత సీసపద్యం: దీనిలోని సీసపాదముల యందలి ప్రథమాక్షరములనేరి కలిపి చదివినచో, 'శివానంద రామాయణము' అను కావ్యనామ మేర్పడును. ఇంకను, మిగిలిన పద్యముతో (అంటే ఎత్తుగీతితో) కలిపి చదివిన, 'శివానంద రామాయణమునను బాలకాండ రచించితిని నతిని – ధరను రసికవరుల కెదలాహ్లాద మొనర – ఆర్ష ధర్మంబుపై గల యమిత భక్తి తెలుగున భీమశంకర కృతముగాను.' అనే సంపూర్ణ వాక్యం వస్తుంది. (నతిని అంటే, వంగి, నమస్కరించి అని అర్థము.)

5. ఈ పద్యము పాదమునకు 21 అక్షరములతో విరాజిల్లు ప్రకృతిచ్ఛందమునకు చెందును. గణములు: న,జ,స,త,స, భ, మ; 12వ అక్షరం యతి. దీని నడక, సామూహిక భజనలలో రెండు వర్గములు చెరియొక సగము పాదము పాడుకొనుటకు అనువుగా నున్నది.



ఈ ఛందములో నీ పద్య నామమేదియో నేను చూచిన ఛందో గ్రంథములందు కానరాలేదు. పరిశీలించిన దీని నడక 'సుముఖి' అను పేరుగల పద్యగణములు (న,జ,జ,న) ద్విగుణీకృతముచేసిన, ఇంచుమించుగ సరిపోవుచున్నవి. అందువలన దీనిని 'ద్విముఖి' అని నామకరణము చేసితిని. 'ద్విముఖి' అనగా ఈనుతున్న సమయమున ఆవు, అని అర్థము. అపుడా గోవుకు ముందు దాని ముఖము, వెనుక దూడముఖము ఒకే సమయమున చూడనగును కనుక 'ద్విముఖి' అందురు. మన ఆర్ష సంప్రదాయమున 'ద్విముఖి' దర్శనము చాల ప్రశస్తము, పుణ్యప్రదము నయి ఒప్పారుచున్నది.

6. Professor & Head, Centre of Exploration Geophysics, Osmania University,

7. Dean, Faculty of Science;Osmania University.

8. Fellow, Indian National Science Academy (FNA)

9. Founder, Association of Exploration Geophysicists

10. Chairman & M.D, A.P. State Mineral Development Corporation, Government of A.P.

***

## గ్రంథకర్త జీవిత సంగ్రహం

తల్లిదండ్రులు : శ్రీమతి వేము లక్ష్మీకాంతమ్మ, శ్రీ వేము వ్యాసమూర్తి.
జననం : 16వ నవంబరు, 1931.
విద్య : ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుండి భూభౌతికశాస్త్రంలో M.Sc., D.Sc.
పై చదువులు : జర్మనీ లోను, ఇంగ్లాండులో Noble Laureatte బ్లాకెట్ గారివద్దను.
ఉద్యోగాలు : ఆంధ్ర, ఉస్మానియా విశ్వవిద్యాలయాలలో భూభౌతిక శాస్త్రాచార్యులు (1956–91), Dean, Faculty of Science, OU, and CMD, AP ఖనిజాభివృద్ధి సంస్థ, హాలెండులో సంచార భూభౌతిక శాస్త్రాచార్యులు, Emeritus Scientist, Govt., of India, 1991-96.
వైజ్ఞానిక వ్యాసంగాలకు
విదేశ పర్యటనలు: జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాడు, హాలండ్, స్పైన్, హంగెరీ, రష్యా, ఆస్ట్రేలియా, అమెరికా.
స్థాపించిన విజ్ఞానసంస్థలు: Centre of Exploration Geophysics, OU, Association of Exploration Geophysicists, VLS Literary & Scientific Foundation.
రచనలు : అయిదు శాస్త్ర గ్రంథాలు, నూరుకు పైగా పరిశోధనా పత్రాలు.
శాస్త్ర పరిశోధన దర్శకత్వం : ఇరువై ముగ్గురు Ph.D. విద్యార్థులు.

**ప్రచురించిన సాహిత్య గ్రంథాలు:**

1. రసస్రువు – ఛందోవైవిధ్య పద్యకావ్యం (1998,2006).
2. శివానంద మందహాసం – సర్వ ల కార అంత్యప్రాసాలంకార సీసబంధ ద్విపద (2004).
3. దక్షారామ భీమేశ్వర శతకం – మకుటయుక్త మత్తేభ, శార్దూల విక్రీడిత స్తవం (2006, 2011).
4. శ్రీరామ! నీ నామ మేమి రుచిర! – అపరాధ పరిశోధక సాంఘిక కావ్యం (2006, 2011)



5. శ్రీద్రాక్షార భీమేశ్వరోదాహరణ కావ్యం (2009).
6. భీమ శతకం (2010, 2011).
7. ఆత్మీయ కవితా కదంబం (2010, 2013).

**ముఖ్య పురస్కారాలు, బహుమతులు:**

1. హాలండ్ నుండి వాన్ వీల్డన్ అవార్డ్ (1958).
2. భారతీయ భూభౌతిక సమాఖ్య (IGU) దశవార్షిక పురస్కారం (1976)
3. భారత జాతీయ విజ్ఞానశాస్త్ర సంస్థ ఎన్నిక, FNA ప్రదానం (1978).
4. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం (1987).
5. రామరాజభూషణ పరిషద్, భీమవరం రసస్రువు గ్రంథానికి ఉత్తమకావ్య పురస్కారం (1999).
6. జాతీయ సాహిత్య పరిషద్, సిద్దిపేట రసస్రువు కావ్యానికి ఉత్తమ సాహిత్య పురస్కారం (2003).
7. Indian National Science Congress: భారత ప్రధాని గారిచే సహస్రాబ్ది పురస్కారం (2007)
8. మైసూర్ దత్తపీఠాధిపతులు శ్రీగణపతి సచ్చిదానందస్వామి వారిచే ఆస్థాన్ విద్వాన్ బిరుదు, స్వర్ణకంకణ ప్రదానం (2007).
9. వేదవిజ్ఞాన పరిశోధనా సంస్థ (I-SERVE) వారి సత్కారం. (2007).
10. సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్టువారి శ్రీశివానంద ప్రజ్ఞాన పురస్కారం (2007).
11. శ్రీ డా. నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పురస్కారం (2008).
12. శ్రీ డి.ఎ.ఎల్.యన్.మూర్తి (దుగ్గిరాల వారి) సాహిత్య పురస్కారం (2009).
13. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'విశేష' కవిత్వ పురస్కారం (2009).
14. 'ప్రసన్న భారతి' విశాఖపట్నం, ఆంధ్ర సాహితీ మహా సదస్సువారి పండిత సత్కారం (2010).
15. 'రసమయి' హైదరాబాదువారి "ద్వితీయ బృహన్ వాఙ్మయ దాశరథి పురస్కారం" (2011).
16. 'హ్యూస్టన్ (అమెరికా) తెలుగు సాహితీ సమితి' వారి పురస్కారం (2014).

## అనుబంధము

## కొన్నిక్లిష్టమైన పదములకు అర్థములు

వివరణలు:

i) ఇక్కడ ఇచ్చిన అర్థములు సూచనలు మాత్రమే. సరియైన అర్థములకు నిఘంటువు సంప్రదించ వలసి యుండును.

ii) పదముల అర్థములు గ్రంథములో వాటి ప్రయోగ సందర్భమును బట్టి స్వీకరించతగును.

iii) ఈ గ్రంథం అవలోకనం చేస్తే, సంస్కృత శబ్దములతో పాటు అధికంగా తెలుగు మాటలున్నవన్న విషయం విశదమౌతుంది. క్రిందటి 5,6 దశకములలో వాడుక తగ్గి, మరుగున పడిపోవుచున్న అనేక తెలుగు పదములు, ఈ గ్రంథములో వాడబడినవి. వీటిలో చాలపదములకు గూడ నిచట అర్థము లీయబడినవి.

### అ–ఔ

అంకనము =గుర్తు.
అంకిలివెట్టు =నిరోధించు
అంకెకు =చెంతకు
అంకెగొను =ఆక్రమించు, క్రమ్ము.
అంగరాగము =విలేపన ద్రవ్యములు.
అంబరాంబరుడు =శివుడు.
అక్కటిక =కనికరము.
అచ్చుదల =అంగీకారము.
అచ్చుపరచు =నియమించు.
అజస్రము =ఎల్లపుడు.
అజ్జ =పాదము.
అజ్జరె =బళిర
అటని =వింటికొప్పు.
అతిసర్గము =దత్తము.
అతీవ =అధికమైన.
అదటు =ఉద్రేకము
అదరు =భయము.
అదపద =కలత, దుఃఖం.
అధీతి =చక్కగా చదివినవాడు.
అధ్యూఢుడు =శివుడు(సమృద్ధుడు)
అనపత్యము =బిడ్డలులేకపోవుట.
అనాస్థ =ఆసక్తి లేకుండుట.
అనుమతి =పున్నమి ముందు రోజు చంద్రుడు.
అనూనము =తక్కువ కానిది, పూర్ణము.



అన్ను =పారవశ్యము.
అపాంపతి =సముద్రుడు.
అప్రమితము =అపరిమితము.
అప్రాకృతము =అసమాన్యము.
అభిభూతి =అవమానము.
అభిప్లవము =వెల్లి విరియుట.
అయోనిజ =జననేంద్రియము నుండి పుట్టనిది.
అరయు =వెదకు.
అరవాయి =వెనుదీయుట, సందేహము.
అరితి =అనురక్తి లేమి.
అరివోయి =(విల్లు) ఎక్కుబెట్టు.
అరుసము =హర్షము.
అర్మిలి =ప్రేమము.
అల్లె(ల్లియ) =వింటినారి
అఱమర =గుట్టు.
అలతి =అల్పము.
అలవు =బలము, సామర్థ్యము.
అవఘాతము =దెబ్బ, చంపు;
అవచాటముగా =అకస్మాత్తుగా.
అవధి =సరిహద్దు.
అవధిబోవు =కష్టపడు, నశించు.
అవితథము =నిజము.
అవు(ఔ)దలదాల్చు=శిరసావహించు.
అసము =చనవు.
అహమహమిక =నేనే, నేనే సమర్థుడనని వీరుల యహంకార ప్రదర్శనము.
ఆకర్షశక్తి =gravitational attraction
ఆకీర్ణము =నిండినది.
ఆక్రోశము =బిగ్గరగానార్చుట.
అదట =పిమ్మట, అపేక్ష.
ఆదృతి =ఆదరము.
ఆనమితుడు=నమ్రుడు.
ఆనిక =ప్రాపు, ఆధారము.
ఆనీతము =తేబడినది.
ఆను =తాకు
ఆనుగ =అదుము.
ఆపోకుండ =తృప్తిలేక.
ఆభ =శోభ, కాంతి.
ఆమతిలు =ఆహ్వానించు, పిలుచు.
ఆమయము=తెవులు.
ఆముకొను =అలముకొను
ఆరజము =కిలకిలారవము.
ఆరడ =ఉత్సాహము
ఆరవము =శబ్దం.
ఆరురుక్ష =పైకెక్కుటయందు ఇచ్ఛ.
ఆరూఢి =ఔన్నత్యము
ఆర్తి =మనోవ్యథ
ఆలము =ఉపేక్ష.
ఆలరి =దుష్టుడు.
ఆలాయము=పాత్ర.
ఆలూవము =త్రుంపబడుట.
ఆవక =కాపాడునది.
ఆవజము =ఒక వాద్యము.

ఆవటము =వీలు.
ఆసురము =దానవ సంబంధితము.
ఆవహము =యుద్ధము
ఆశ =దిక్కు,వాంఛ
ఆశనము =పిడుగు.
ఆశరము(డు)=అగ్ని,
ఆస్మిత్వము =అహంకారము.

**ఇ**

ఇంగితము =చలన చేష్టాదులు.
ఇంచు =అభిలషించు, అలరు
ఇన్మడు =రెట్టింపు.
ఇష్టి =ఇష్టము, యాగము
ఇష్వాసము =బాణము.

**ఉ**

ఉంకువ =పూనిక, సుంకము, శుల్కము.
ఉక్కటి =బలహీనము.
ఉక్కివుడు =మోసగాడు.
ఉక్కు =బలము, ఇనుము.
ఉగ్గడించు =ప్రకటించు,తెలుపు
ఉజ్జగొను = విసర్జించు,త్యజించు, ఊహించు.
ఉజ్జన =విడుపు.
ఉజ్జృంభితము=చేష్ట.
ఉజ్జ్వలము =ప్రకాశించునది విరిసినది.
ఉడుకువ =విరామము, విశ్రాంతి.
ఉత్కంఠ =ఇష్టవస్తుప్రాప్తికి తహతహ
ఉత్కము =కుతూహలము.
ఉత్కటము =అధికమైనది, బలముగలది
ఉత్తమాంగము=తల
ఉత్తలపాటు =సంభ్రమము;
ఉదగ్రము =దీర్ఘమైనది.
ఉదర్కము =రాగకాలము, భావి.
ఉదీరిత =ఉద్రిక్తత.
ఉద్ధతి =గర్వము.
ఉద్వ(ద్వా)హము=పెండ్లి.
ఉద్దియ =ప్రయత్నము.
ఉద్దాంతము=మిక్కిలి అణచబడిన.
ఉన్మనము =ఉత్కంఠ.
ఉన్మేషము =వికసించుట, మెలకువ
ఉపల =ఱాయి.
ఉప్పరమెత్తు =పైకెత్తు.
ఉరవు =అర్హమగు.
ఉఱవడు =యుక్తము.
ఉఱవు =విశాలము.
ఉఱిది =వేగము.
ఉఱువడి =విజృంభణము.
ఉల్లలిత =అల్లల్లాడు, ఊగు
ఉల్లోలము =మహాతరంగము.
ఉషాప్రాణేశ్వరుడు =సూర్యుడు.
ఊకువ =పూనిక, యత్నము.
ఊను =పూను.

**ఋ**

ఋక్షము(డు)=ఎలుగుగొడ్డు.

**ఎ**

ఎక్కటి =సాటిలేని.



ఎనవు =కలుపు, అతుకు.
ఎనయు =పోలు, కలియు
ఎఱగుచు =మీదకు దూకు.
ఎఱిగించు =ప్రకటించు.
ఎలయు =వ్యాపించు, చేరు, ఉండు, ఎదరుపడు
ఏపారు =విజృంభించు.
ఏపుగ =అధిక్యము.
ఏమఱు =ఉపేక్షించు.
ఏవ =రోషము.
ఏరు =నాగలి.

**ఒ**

ఒదవు =కలుగు,పుట్టు
ఒఱుపు =యుక్తము, ఒప్పు.
ఒల్లన =తిన్నగా,అధికముగా
ఓజ =ఉత్సాహము,శోభ.
ఓలగించు =సేవించు.
ఓము =కాపాడుట, కాచు.
ఓవు=(ఒవ్వు) =అనుకూలము, సరిపడు;చెడు, పాడగు
ఔరస పుత్రిక=ధర్మపత్నియందు పుట్టిన కుమార్తె.

**క–జ**

కంకణి =కంకణములు కలవాడు.
కంచుకము=కవచము, అవిక.
కంజము =పద్మము;
కంతము =సుఖయుక్తము.
కంతు =నిర్ణీత సమయము.
కందుకము =బంతి.
కందువు =పెనము.
కపోణి =మోచెయ్యి;
కటి =పిరుదు.
కట్టడ =కట్టుబాటు,నియమము.
కనుబాటు =దృష్టిదోషము.
కణక =యత్నము.
కమ్రము =మనోహరము.
కరకము =కమండులువు.
కరాళము =భయంకరము.
కరువ =కొండ.
కరోటి =పుఱ్ఱె.
కలంబము =బాణము.
కలకంఠ =ఇంపైన కంఠధ్వని
కలగొను =వ్యాపించు, క్రమ్ము.
కలిలము =చొరరాని, గంభీరము.
కల్పసూత్రములు=వైదిక సూత్రములు
కవ =యుగళము
కవ్వుకొను =ఆక్రమించు.
కసిమసగు =చెలరేగు,విజృంభించు.
క్రమ్ము =కప్పు,వ్యాపించు.
కాకలీ =అవ్యక్తధ్వని
కాతరము =పిఱికితనము, వివశత్వము.
కామన =కోరిక.
కాలేయ =రాక్షస భేదం.
కావరివాడు =మదించినవాడు
కిదుకు =మూలుగు.
కీల్కొను =బంధించు.

కుందనము =బంగారము
కుందము =మొల్లపూవు;
కుందు =చింతించు
కుడిపి =కురూపి.
కుదులు =నిద్రలోలేచు
కుశిక =ఫాలభాగము.
కుసృతి =చెడు నడవడి.
కూటమి =పూడిక,చేరిక.
కూర్చిన =పొందించిన.
కూర్మి =స్నేహము.
కూలము =ఒడ్డు.
కెలను =ప్రక్క
కెలయు =చెలరేగు, కేరు
కెలవు =ప్రేమ, అనురాగము.
కేతకీ =జాజి, మొల్ల
కేరు =కెలయు
కేలొసగంగక=నమస్కరించక.
కైచాపు =నమస్కరించు
కొందలపడు=కలతచెందు
కొదవడు =మిగిలిన
కొనలిడుట =అతిశయించుట.
కోకనదము =ఎఱ్ఱతామర
కోటి =వింటికొప్పు
కోరకము =మొగ్గ,తామరతూడు, ఒక గంధద్రవ్యము
కోలుమసగు=విజృంభించు.
క్రాలు =చలించు.
క్రుంచు =వంచు.
క్షారితము =స్రవింపబడినది.
క్షుధార్తుడు =ఆకలిచేవ్యథ నొందిన వాడు

**ఖ**

ఖేటము =గర్వమైన జీవి, అధమము

**గ**

గదాగ్రజుడు =విష్ణువు
గమకించు =యత్నించు.
గవాక్షము =కిటికి
గాసిల్లు =దుఃఖించు,బాధిల్లు.
గునియు =కులుకు, నటించు, ఊగు
గుణము =వింటి నారి.
గోము =గారాబము.
గ్రావము =ఱాయి.
గ్రాహము =మొసలి.
ఘాటము =పెడతల.
ఘాటించు =విజృంభించు.
ఘాస బంధము=గడ్డికట్ట.
ఘృతము =నేయి, సుధము.
ఘోటకము =అశ్వము.

**చ-ఇ**

చదలు =ఆకాశము
చయ్యన =శీఘ్రముగా.
చాంపేయము=సంపంగి.
చెఱగు =అంచు
చాలమి =అశక్తత.
చాలిక =సామర్థ్యము.
చాలు =నాగటిరేఖ
చికుర పాశము=కేశ బంధము.
చీకటి గుండము=inferanl abyss.
చుమ్మ =బాధ.



చెన్ను =అందము.
చెఱగు =అంచు
చెలయు =విజృంభించు, ఉత్సహించు
చెలిమరి =చెలికత్తె
చెలువము =అందము
చేగ =చేవ, బలము.
చేదివ్వి =చేతి దీపము, కాగడా.
ఛాత్రులు =శిష్యులు.

**జ**

జంభారి =దేవేంద్రుడు
జక్కణి =నాట్యవిశేషము.
జగలుడు =మాయావి.
జటిలము =చిక్కులు కలిగినది.
జడ్డ =బాధ.
జన్నకాపరి =యజనరక్షకుడు.
జలముచులు=మేఘములు.
జవనము =వేగము.
జానువు =మోకాలు
జాయ =భార్య.
జిజ్ఞాస =శ్రేష్ఠమై ధృఢమైన ఇచ్ఛ.
జోక =అందము, రీతి
జోటి =స్త్రీ
జొకు =బురద.

**ట-ణ**

టంకు =మాయలాడి.
ఠేవ =శోభ, ఒప్పిదము.

**త-న**

తందర =అలసట;
తడకట్టక =అడ్డుపెట్టక.
తడవాడక =నిరోధించు, అడ్డుపెట్టక.
తనిరిపు =కాంతి.
తనుకు =తాకు,కలుగు, ప్రకాశించు
తమకము =మోహము, ఉత్సాహము
తమి =ఆపేక్ష
తమ్మి పువ్వులు=కలువపువ్వులు.
తరణి =సూర్యుడు.
తర్జించు =బెదిరించు.
తలివము =శయ్య.
తామరసము=పద్మము.
తారాడు =అట్టిట్టు తిరుగు
తారు =ఇటునటు తిరుగు.
తారుణ్య =యౌవన సంబంధిత
తావరము =స్థిరము.
తార్క్షుడు =కశ్యపుడు.
తిన్నన =మనోజ్ఞము.
తిమురు =త్వర.
తిలకించు =చూచు, మెచ్చుకొను
తివిరు =లాగు
తీపారు =మిక్కిలి మనోజ్ఞముగా
తులకించు =ప్రకాశించు
తులుచన =వేగముగా,శీఘ్రముగా
తూణము =అమ్ములపొది.
తృష్యత =దప్పి (చే).
తేకువ =జంకు,సంశయము.
తోరము =చక్కన

తోషము =సంతోషము
త్రప =సిగ్గు.
త్రాసము =భయము.
త్ర్యంబకుడు =శివుడు.

**ద**

దందడిపడు =కలతనొందు.
దట్టించు =పూను, యత్నించు.
దళించు =విఱచు.
దాత్రము =కొడవలి.
దార్శము =దృక్ సంబంధితము
దిటవు =దిట్ట.
దిట్ట =ధీరుడు.
దిష్టము =ఉపదేశించ బడిన, ఇవ్వబడిన.
దీకు =ప్రేరణ.
దీమన =ధైర్యము.
దీవస =ఆలోచనము, అభిప్రాయము
దృష్టము =విలోకితము, సాక్షాత్కారము
దొరయు =చేరు,పోలు,
దోహలము =దోహదము, ఉత్సాహము,ఇచ్ఛ
ద్యుమణి =సూర్యుడు.
ద్రష్ట =మనసుతో చూచువాడు, (ఋషి)
ధన్వము =ధనస్సు.
ధామనిధి =సూర్యుడు, కాంతిపుంజము.
ధామము =నివాసము.
ధారణి =వరుస, ఏకాగ్రత,భూమి
ధావన =శుద్ధిచేయుట.
ధురీణుడు =మోయగలవాడు.
ధ్వాంతారాతి =సూర్యుడు.

**న**

నక్తంచరుడు =రాక్షసుడు.
నచ్చిక =కొఱత.
ననలు =పువ్వులు.
నమసుడు =అనుకూలుడు.
నమ్మిగ =విశ్వాసము, నమ్మకము.
నలువు =చక్కనిది
నవోఢ =క్రొత్తగా పెండ్లైనది.
నశ్వరము =నశించునది.
నాచు =అపహరించు.
నాలిముచ్చు =కుత్సితము.
నికాయ్యము = గృహము.
నికృష్టము =అధమము.
నిక్షిప్తము =పాతబడినది.
నిగరము =కాంతి, అధికము.
నిచ్చలు =ఎల్లపుడు.
నిట్టలుద్రోయు=ఉప్పొంగు
నిట్టవొడుచు =ఉప్పొంగు.
నిధువనము =రతిక్రీడ.
నిభము =ప్రకాశము, సమానము.
నియతి =నియమము
నియామము =నియమింపబడినది.
నియుతము =పెద్ద సంఖ్య



నిరతి =అత్యాసక్తి.
నిర్గూఢుడు =ఆవరింపబడినవాడు.
నిర్మోకము =విమోచనము, కవచము.
నిశాటిని =రాక్షసి.
నిశితము =వాడి చేయబడినది.
నిశ్వాసము =ఊపిరి విడుచుట
నిష్ణాతుడు =నేర్పరి
నిస్వానము =నిస్వనము=ధ్వని, ధ్వని లేకుండుట
నిస్సరణ =గృహమునకు ముందుగల ప్రదేశము.
నిహాకము =నీటి ఉడుము.
నీటు =విలాసము, మురిపెము.
నీవరుడు =నివాసి,పరివ్రాజకుడు.
నెగడు =ఖ్యాతిగాంచు,వర్ధిల్లు.
నెట్టన =అవశ్యము, మిక్కిలి.
నెట్టుదొట్టు =ఉప్పొంగు.
నెప్పరము =వేగము
నెమ్మది =నిండు మనస్సు.
నెమ్మి =ప్రేమ, ప్రీతి.
నెఱజాణ=నెఱవాది=నేర్పరి, సమర్థురాలు
నెరవు =మార్గము.
నెఱవాది =నేర్పరి.
నేటు =ధృఢము.
నేతృవ్రాతం =నాయకచయము
నేమము =నియమము
నైవేశికము =పెండ్లి కానుక.
నొవ్వు =బాధ.
న్యక్కు =క్రిందకు పడు.
న్యగ్రోధపరిమండల =సౌందర్యా వయములు గల స్త్రీ.
న్యాసము =ఉంచుమని అప్పగించుట.
నూనము =ఊనము=తక్కువ.

**ప-మ**

పంతు =ఒప్పు.
పందిరివెట్టు =వశపరచుకొను.
పజ్జ =వెంబడి
పటవు =చతురత.
పణము =పందెము, నియమము, ఒప్పందము
పణితము =స్తుతి.
పదట =ఆత్రము, త్వర.
పదటిమి =భయాదులవలన కలిగెడు ఆత్రము.
పదరు =కోపము.
పనివిని =వశపర్తులై.
పనుచు =అజ్ఞాపించు,పంపు
పన్ను =మనోజ్ఞము.
పమ్ము =అధికము, అతిశయము.
పయిదిలి =స్త్రీమూర్తి.
పరశ్వధము =పరశువు, గండ్రగొడ్డలి.
పరిక్రమించు =సంచరించు

పరిణత =పరిపాకమొందినది.
పరిపంథి =శత్రువు,
పాగడ =పైపంచె.
పలాశము =ఆకుపచ్చని
పాగడ =ఉత్తరీయము
పాగలు =పావుకోళ్ళు
పాగా =తలపాగా.
పాతము =పతనము
పాదాంగుష్ఠము=బొటనవ్రేలి గోరు.
పాపటబొట్టు =పాపటమీది ఆభరణము.
పాపటబోవు =దారితప్పి ప్రక్కకుపోవు
పారగుడు =కుశలుడు
పారము =సరిహద్దు, ఒడ్డు.
పాలసుడు =మూఢుడు.
పిలుకుమాల్చు=చంపు.
పిశితము =మాంసము.
పీయూషము =అమృతము.
పుంశ్చలి =అంకుటాలు
పుచ్చు =పోవజేయ
పుచ్చటిక =సిగ్గు
పుయిలోట(ము)=లజ్జ, భయాదులచే సంకోచము.
పురందరుడు =దేవేంద్రుడు.
పురసూదనుడు=ఇంద్రుడు.
పులిన =ఇసుక దిబ్బ
పులు =గడ్డి.
పుష్పవంత =సూర్య, చంద్రులు.
పూగ =పోక.
పృషత్కము =బాణము.
పృషత్తు =నీటిబొట్టు
పెల్లిదము =పెల్లు, అతిశయము
పేశలము =కోమలము
పొంకము =గర్వము.
పొంతన =లాలన.
పొంతనములు=గ్రహముల అనుకూల్యము.
పొంతువ =స్నేహమున.
పొందున =అనురాగమున.
పొగులు =కుములు,విచారించు.
పొదలు =కలుగు, వర్ధిల్లు.
పొదవు =సంభవించు
పొన్నారి =సుందరమైన.
పొరయు =పొందు.
పొలపరి =కార్యదక్షుడు.
పొలివడు =నశించు.
పొలుచు =కనబడు, పుట్టు, అవతరించు.
పోకార్చు =చంపు(కొను)
పోడిమి =అందము,ఆదరము.
పోతరీడు =మదించినవాడు.
పోసరము =గర్వము.
ప్రఖ్య =కీర్తి, ప్రకాశన.
ప్రగమము =ప్రగతి.
ప్రచురము =విపులము, విరివి.
ప్రణిధానము =ఏకాగ్రత,అర్పణము.
ప్రణేయము =ఆధీనము
ప్రతతము =విస్తృతము.



ప్రతిభాతము =భాసిల్లునది.
ప్రతిభాస =అధికకాంతితో కూడిన.
ప్రతిహతి =మాఱుదెబ్బ.
ప్రతున్నము =మిక్కిలి వ్యథతోకూడిన.
ప్రత్నము =పురాతనము.
ప్రత్యుత్క్రమము=ఉద్యమము.
ప్రత్యూషుడు =సూర్యుడు.
ప్రథితి =ఖ్యాతి.
ప్రద్యోతనుడు =సూర్యుడు.
ప్రపీతము =మిక్కిలి బలిసినది.
ప్రబ్బు =వ్యాపించు
ప్రభిన్నము =భిన్నము.
ప్రమ =యదార్థ జ్ఞానము.
ప్రమేదితము =స్నిగ్ధము, ప్రేమ సూచికము.
ప్రమ్ము =పరివేష్టించు, చుట్టువారు
ప్రవేష్టము =చెయ్యి
ప్రసవిత =తండ్రి,
ప్రసాధనములు =భూషణములు, అలంకారములు.
సేకము =స్రవించుట.
ప్రస్తరము =ఱాయి.
ప్రస్ఫురిల్లు =ప్రకాశించు
ప్రహ్వము =వంగిన.
ప్రహ్వీయము =ఆహ్వానము.
ప్రాకాశ్యంబె =ఖ్యాతియే.
ప్రాగ్రసరుడు =అగ్రగామి.
ప్రాగ్వంశము =యజవశాల నొక గది
ప్రాగ్వంశుడు =విష్ణువు.
ప్రాచీపతి =ఇంద్రుడు.
ప్రాచేతసుడు =వాల్మీకి.
ప్రాయి =అతిశయము, శౌర్యము
ప్రాయికము =తరుచుగా.
ప్రావ =పద్ధతి, ఒప్పిదము, సమానము.
ప్రావృట్టు =వర్షర్తువు.
ప్రావృతము =ఆవరింపబడినది
ప్రోక =పోగు,రాశి,గుంపు.
ప్రోంఛనచేయు =తుడిచివేయు.
ప్రోడది =స్త్రీ
ప్రోది =పోషణము.
ప్రోషము =సంతాపము.

**బ**

బలయు =కడగు, పూను.
బలారి =దేవేంద్రుడు.
బాలేయము =చిన్నపిల్లల తత్త్వము.
బిట్టు =మిక్కిలి, అతిశయముతో, శీఘ్రముగా
బిడౌజుడు =ఇంద్రుడు.
బీరము =పరాక్రమము, ధైర్యము
బుభుక్ష =ఆకలి.
బెందుకొను =బలహీనమగు
బేలరి =వివేక హీనుడు.

బ్రధ్నుడు =సూర్యుడు
భంగము =తరంగము, అవమానము, చీలిక
భంగి =మత్తు ద్రవము, రీతి
భస్త్రి =కమ్మరి కొలిమి తిత్తి
భావనుడు =విష్ణువు
భాసమానము =ప్రకాశవంతము.
భిత్తి =గోడ.
భీముడు =ఈశ్వరుడు.
భ్రంశము =పతనము.

**మ**

మంకిలము =కార్చిచ్చు.
మంకుతనము =మూర్ఖత్వము.
మండాడు =కోరు.
మంతనము =ఏకాంత ప్రదేశము, రహస్యము.
మందటించక =ఊరకుండక.
మందస =పెట్టె.
మందుడు =మూఢుడు, అసమర్థుడు.
మగ్నము =మునిగినది
మయిమఱచు =పరవశించు
మసగొను =ఆసక్తిగొను
మహోక్షా
రోహణుడు =గొప్పయెద్దు నెక్కినవాడు.
మానిసిదిండి =రాక్షసుడు.
మాతంగము,
మారీచము =ఏనుగు
మార్గణము =బాణము.
మాహేయి=మొదవు=ఆవు
మిను(మిన్ను) =ఆకాశము.
మిన్న =ప్రశస్తము, భూషణము.
ముక్తాఫలము =ముత్యము
ముదల =ఆజ్ఞ.
ముద్గరము =సమ్మెట
మునుమిడి =వరుసగా.
మురడించు =అతిశయించు.
ముసముస =కోపమునచిఱచిఱ
మూర్కొను =ఆఘ్రాణించు
మోమోటి =సంకోచము.
మౌర్వి =వింటి నారి.
మౌలి =కిరీటము.
మ్రందించు =చంపు.
మ్రుచ్చిలు =దొంగిలించు.

**య,ర,ల,వ**

యక్షము =పిశాచము.
యజ్ఞేశుడు =విష్ణువు.
యద్వృత్తము =సాహసకార్యము.
యవనిక =తెర
యామవతీ చరుడు=రాక్షసుడు.
యాతుధానుడు =రాక్షసుడు.
యాయజూకుడు=పలుమార్లు యజ్ఞములు చేయ నిచ్చగించువాడు.
యుష్మాదృశుడు =నీ వంటివాడు.
యోషిత =స్త్రీ
రసన =నాలుక.



రాత్రించరులు =రాక్షసులు.
రావడి =ఆపద, ఉపద్రవము
రాసభము =గాడిద.
రిరక్ష =రక్షించు నిచ్ఛ.
రీఢ =అగౌరవము, అమర్యాద.
రుధిరము =రక్తము.
రూక్ష =కఠినమైన.
రెట్ట =భుజము.
రోచనము =మనోహరమైనది
రోవిష్ణువు =ప్రకాశించునది.
రౌహిషము =గొఱ్ఱె.
లలింతిక =పొడువైన కంఠ హారము
లలామము =నుదిటిపై అలంకారము, శ్రేష్ఠము
లలితుడు =కామాతురుడు.
లస్తకము =ధనుర్మధ్యము.
లాలాటికుడు =యజమాని యాజ్ఞకై చూచుచుండు సేవకుడు.
లావణి =దండ యాత్ర.
లులాయము =ఎనుబోతు.
వజ్రి =ఇంద్రుడు.
వదిగొను =నెలకొను.
వనట =దుఃఖము
వన్నియ =కాంతిగల.
వపువు =శరీరము.
వర్జనము =చంపుట.
వర్షోపలలు =వడగళ్ళు.
వలపు =సువాసన, ప్రేమము.
వలవంత =మన్మథవ్యథ
వలి =చలి.
వసివీగి =ఉత్సహించి
వ్యగ్రుడు =వేగిర పడువాడు, విష్ణువు.
వ్యవధ =మరుగు
వాగీశుడు =బ్రహ్మ.
వామలూరము =పుట్ట.
వారక =అవశ్యము, తప్పక.
వాలారు =వాడియైన.
వాలు =కత్తివలె(దీర్ఘమై) వాడిగానున్న.
వావిరి =క్రమము
వావిలేక =(పెద్ద చిన్న లేకుండ).
వాసుర =భూమి.
వాహికుడు =బరువు మోయువాడు.
వ్యాజము =మోసము.
వ్యావర్తించు =చుట్టుతిరుగు.
విక్రమము =పరాక్రమము.
విక్రాంతుడు =వీరుడు
విగలిత =కారిన
విటంక విటంకిత నిభంబైన = కొండకొన గుర్తువలెనున్న

విడంబనము =పోలు, పరిహాసము.
వితరణ =ఈవి.
వితర్కము =ఊహ.
విదారించు =చీల్చు.
విధి =బ్రహ్మ.
విధిజ్ఞుడు =శాస్త్రవిదు లెరిగినవాడు.
విధురము =హాని,ఎడబాటు.
విధువనము =కంపము
విన్నన =కాంతిహీనము.
విపశ్చితులు =పండితులు.
విపుల =భూమి
విభావన =నిజము గ్రహించుట
వియోజితులు =విడదీయబడిన వారు
విరహితము =విడిచి పెట్టబడినది
విలంబము =ఆలస్యము, వ్రేలాడుట
వివసత్వము =పరాధీనుడు
వివస్వంతుడు =సూర్యుడు.
వివీతము =ఆవరణగల.
విశ్వసృట్ =బ్రహ్మ.
ఏక =ఉత్సాహము.
వీగు =ఉత్సహించు.
వీతిహోత్రుడు =అగ్నిహోత్రుడు.
వృక్క =గుండె.
వృథామతి =మూఢుడు.
వృషుడు =మన్మథుడు
వెరవు =ఉపాయము
వేదుఱు =పిచ్చి,అసహ్యము
వెగడొందు =తల్లడపడు.
వెమ్ము =తప్తమగు.
వెలగొను =వశము చేసుకొను.
వేధనము =కుట్టుట.
వేలిమి =హోమగుండము.
వైధుర్య =కంపించు.
వైనము =పయనము (అనగా,వంశము,అని).
వ్యతికీర్ణ =కలుపబడినది.
వ్యాపేక్ష =నిరీక్షణము
వ్యుష్టము =స్వచ్ఛము
వ్రీడ =సిగ్గు.
వ్యుత్థానము =అధికోత్సాహము.
వ్యుష్టి =ఫలితము, పర్యవసానము.
వ్రీలు బద్దలగు

## శ,స

శంపాలత =మెఱపుతీగ.
శమహీనము =శాంతిహీనము
శమిత =శాంతి.
శమీగర్భుడు =అగ్నిహోత్రుడు.
శరాసనము =విల్లు.
శశ్వత్ =శాశ్వతము.
శామీనము =బూడిద.
శాలీనుడు =దిట్టతనము లేనివాడు.
శింజిని =అల్లె త్రాడు.



శిరీష =దిరిసెన (చెట్టు)
శీత =నాగటిచాలు.
శుక్తము =పవిత్రము.
శుభ్రము =తెల్లనిది, ప్రకాశించునది
శుష్కము =ఎండుట.
శోణితము =రక్తము
శ్యేనము =ఉగ్రత్వము, తీవ్రత.
శ్రావిక =వినిపింపబడిన.
శ్రోణి =పిఱుదు
సంక్రాంతము =ప్రతిబింబము.
సంచలించు =కంపించు.
సంజవనము =నాలుగిళ్ళ మధ్యఖాళీ.
సంతన =అమర్చుట, కూర్చుట.
సంతు =సంతానము.
సందానము =నఱకుట.
సంపాకుడు =విషయ లంపటుడు.
సంపాదము =పూర్తిచేయుట.
సంప్రతి =వెంటనే.
సంయమి =యతి.
సంహతి =దగ్గరగా చేయబడినది.
సంహననము =శరీరము.
సజ్జము చేయు =నారిని విల్లునకు కట్టుట.
సత్రము =యజ్ఞవిశేషము.
సత్యోపయాచనుడు =కోరిక తీర్చువాడు.
సదృక్షము =సమానమున.
సదృశ, సదృష్ట=సమానము
సమంచిత =సుందరమైనది.
సమజ్య =సభ
సమయము =ప్రతిజ్ఞ, కాలము
సమయు =నశించు
సమాక్రాంతము=స్వాధీన పరచుకొనినది.
సమిద్ధము =ఉద్రేకించిన.
సమీకృతి =ఏకముచేయ బడినది.
సమీచీనము =తగినది, ఔచిత్యము.
సమేధితము =బాగుగా పెంచబడినది.
సమ్మోదికుడు =మిత్రుడు.
సరభస =ఉగ్రమైన.
సరవి =వరుసగా.
సరిగ =హారము
సవనము =యజ్ఞము.
ససనము =బలిదానము, తర్పణము.
సాకు =రక్షించు.
సాటోపమున =గర్వించురీతిని
సామజము =ఏనుగు
సామనము =సౌమ్యము.
సావి =మనోజ్ఞము.
సింగిణి =విల్లు
సింహసంహనన=సర్వాంగసుందరము
సినీవాలి =అమావాస్య.
సీరము =నాగలి

సునీథము =సుశీలము.
సుదతి =స్త్రీ
సుబ్బన
చూఱలుగొన్న =ప్రకటితమౌ రీతిని.
సుమాళము =సంతోషము.
సురతాణి =రాణి
సురభి =ఆవు
సురలావు =కామధేనువు (దేవతల ఆవు.)
సుల్బశాస్త్రము =వేదకాలపు రేఖాగణిత శాస్త్రము.
సూకము =కమలము,బాణము
సూనము =ఉత్పన్నము.
సెలయు =విజృభించు
సెల్లా =అంచుకమ్మలులేని తెల్లబట్ట.
సేనము =ఉలి, దేహము
సేపోర్చగా =కొంతకాలము ఓర్చునటుల.
సేసలు =అక్షతలు
సొగవు =పారవశ్యము.
సొరగు =లీనమగు
సౌమ్యుడు =బుధగ్రహము.
సౌరు =సొగసు.
స్థండిలము =యజ్ఞస్థలమున యాజకుడు నివసించు చోటు.
స్థగితము =ఆచ్ఛాపించ బడినది.
స్థవిరుడు =ముసలివాడు.
స్థవీయ =స్థూలతరము.
స్థాత =దారిచూపువాడు.
స్థాయిభావము =రససిద్ధి భావము.
స్నుష =కోడలు
స్పందితము =వెడలినది, కంపము
స్ఫీతము =విస్తారము.
స్ఫురితము =ప్రకాశించునది
స్ఫూర్జధువు =ఉఱుము,పిడుగు ధ్వని.
స్ప్రష్టి =సంపర్కము.
స్ఫేష్ఠ =అధికము.
స్మరుడు =మన్మథుడు.
స్యందము =కారుట
స్రష్ట =బ్రహ్మ
స్రోతస్విని =నది.
స్వనితము =ధ్వని చేయునది, ఉఱుము
స్వాహావల్లభుడు =అగ్ని.
స్వైర =స్వేచ్ఛతో కూడినది

## హ

హఠము =పట్టుదల.
హరిహయుడు =దేవేంద్రుడు.
హవనము =యజ్ఞము.
హాటకము =బంగారము.
హావడి =ఉపద్రవము.
హాసిక =నవ్వు;
హూతి =పిలుపు, కేక;
హేరంబుడు =గణపతి.
హౌసు =సొగసు;